స్వేచ్ఛ! సమానత్వం!! సౌభ్రాతృత్వం!!!

"సర్వధర్మ సమభావ:"

సహృదయ మిత్రమండలి

పాతికేళ్ళ విశిష్ట ప్రస్థానం



ప్రచురణ

సహృదయ మిత్రమండలి

పిఠాపురం

మిత్రమండలి విశిష్టమైన ప్రచురణలు

సహృదీయం



సహృదయ మిత్రమండలి పదిహేనేళ్ల ప్రస్థాన ప్రత్యేక సంచిక. 2017 లో ప్రచురించిన ఈ సావనీర్ అనేక ఆసక్తికరమైన అంశాలతో ఎంతో హృద్యంగా రూపొందింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో వివిధ గ్రంథాలయాల్లో, ముఖ్యంగా, పిఠాపురం చరిత్రకు సంబంధించి విలువైన ప్రయత్నంగా నిలిచింది. మిత్ర మండలి సగర్వంగా ప్రకటించిన ఐకానిక్ మార్క్ వర్క్ ఇది. తర్వాత కాలంలో పిఠాపురం చరిత్రకు రిఫరెన్స్‌గా, ఈనాటికి కూడా ఎంతోమంది ఉపయోగించుకుంటున్న గ్రంథం ఇది.

మద్యమా? మానవ మనుగడా ??

మద్యపాన వ్యతిరేక ప్రచార సమితితో కలిసి అక్టోబర్ 2, 2022లో సంయుక్తంగా ప్రచురించిన తెలుగులోనే మొట్టమొదటి మద్యవ్యతిరేక కరపత్రాల సంకలనం ఇది. మిత్రమండలి చిరకాల అధ్యక్షులు, సమాజ హితైషి కీ.శే.టి. వి.ఎల్.నరసింహారావు గారి స్మృతిలో ప్రచురించిన పుస్తకం ఇది. ఈనాటికి తెలుగు రాష్ట్రాల్లోని వ్యసన వ్యతిరేక ఉద్యమ మిత్రులకు, కార్యకర్తలకు బలమైన కరదీపిక. సామాజిక ఆలోచనాపరుడు కరుణాకర్ అభిమానంగా వేసి పంపిన ముఖచిత్రం అదనపు ఆకర్షణ.

మరుగునపడ్డ మహాయోధులు



జనవరి 2024 లో మిత్రమండలి 23 ఏళ్ల ప్రత్యేక ప్రస్థాన ప్రచురణగా వొచ్చింది. సాంస్కృతిక ప్రయోక్త హబీబ్ తన్వీర్ స్మృతిలో ప్రచురించిన ఈ గ్రంథం, అలిశెట్టి ప్రభాకర్, కలేకూరి ప్రసాద్, కంభంపాటి సత్యనారాయణ, తాపీ ధర్మారావు, కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు, సి. వి. సుబ్బారావు వంటి తెలుగు బుద్ధిజీవుల జీవనరేఖల్ని మాత్రమే కాక, తోరూ దత్, గోరఖ్ పాండే, బదంత్ ఆనంద్ కౌసల్యాయన్ వంటి అంతరాష్ట్ర మేధావులని, నికోలస్ రోరిక్ లాంటి అసామాన్య అంతర్జాతీయ ప్రజ్ఞాశీలిని మొదటిసారి తెలుగులో పరిచయం చేసింది.

సూర్యకిరణాలు



సామాజిక ఆలోచనాశీలి, మిత్రమండలి వ్యవస్థాపకుడు ఎన్. సూర్యనారాయణ గారు ప్రతీ ఏడాది కొత్త సంవత్సరం వేడుకను పురస్కరించుకొని మిత్రుల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసి రాసే కవితల్ని ఒక్క దగ్గరికి చేర్చిన ప్రయోగశీల కవితా సంపుటి. తెలుగు సాహిత్యంలో అలా నూతన సంవత్సర కవితలతో ప్రచురించిన మొట్టమొదటి సంపుటి. మే, 2024లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సందర్భంగా పాతిక పైబడ్డ చిరు కవితలు, వాటికి డా. పి. ఎస్. ప్రకాశరావు గారు కూర్చిన అందమైన వ్యాఖ్యానాలు దీనిని విలక్షణ కవితా సంపుటిగా రూపొందించాయి. సతీష్, పావనిలకు అంకితం ఇవ్వబడ్డ మిత్రమండలి ప్రచురణ ఇది.

స్వేచ్ఛ ! సమానత్వం !! సౌభ్రాతృత్వం !!!

"సర్వధర్మ సమభావ:"

సహృదయ మిత్రమండలి

పాతికేళ్ళ విశిష్ట ప్రస్థానం



ప్రచురణ

సహృదయ మిత్రమండలి

పిఠాపురం

స్వేచ్ఛ ! సమానత్వం !! సౌభ్రాతృత్వం!!!

"సర్వధర్మ సమభావ:"

సహృదయ మిత్రమండలి

పాతికేళ్ళ విశిష్ట ప్రస్థానం

2001-2026

సావనీర్

ప్రచురణ :

సహృదయ మిత్రమండలి

సంపాదకులు :

గౌరవ్

సతీష్ & పావని

మన్మధరావు

ముద్రణ :

జనవరి, 2026

డి.టి.పి. :

ఆదిత్య గ్రాఫిక్స్, పిఠాపురం.

ప్రతులకు :

పి. గంగాపావని, సెల్: 9652552556

విజ్ఞప్తి :

'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ' అని నానుడి. అందుకోసం భిన్న భావాలకు ఈ సావనీర్‌లో చోటు కల్పించడం జరిగింది. అభిప్రాయాలన్నీ ఆయా రచయితలవే. సంపాదకులకు, మిత్రమండలికి వాటితో ఏకీభావం ఉండనవసరం లేదు.

వివరాలకు :

సహృదయ మిత్రమండలి, రిజిష్టర్ నెం. 703/2011

14-1-11, వంగలవారి వీధి, పిఠాపురం, కాకినాడ జిల్లా - 533450,

సెల్ : 7801020258

ఇందులో...

- V గురజాడ, కందుకూరి, వేమన, పోతులూరి, మధునాపంతుల, రజనీ, చెలికాని, బాబీ, సాధు వంటి తెలుగు వెలుగుల బాటను మళ్ళీ మరోసారిలా గుర్తు చేసుకుంటూ,
- V డా. బి. ఆర్. అంబేద్కర్, సర్దార్ భగత్ సింగ్, మహాత్మా జ్యోతిబా సావిత్రిబాయి పూలే, పెరియార్, శరత్ చంద్ర, మహాశ్వేతాదేవి, దామోదర కొశాంబిల కృషిని స్మరిస్తూ,
- V మానవతావాద మహా సిద్ధాంతానికి ఎల్లలు లేవని నిరూపించిన మహావ్యక్తులు చార్లీ చాప్లిన్, మెల్లీ సోయంగల్, మాస్టర్ తిచ్ నాథ్ హన్ ల విశ్వజనీనతను కీర్తిస్తూ,
- V దాశరథి కృష్ణమాచార్య, ఆరుద్ర, అలిశెట్టి ప్రభాకర్, శివసాగర్, మద్దూరి నగేష్ బాబు , బైరాగి వంటి అచ్చ తెలుగు మహాకవుల సుమారు పది అరుదైన అలనాటి కవితలు,
- V ఏడవ తరగతి విద్యార్థిని సమానత కోసం రాసిన చిరు వ్యాసం మొదలుకుని, ఎనభై ఏళ్ళ అనుభవజ్ఞులు రాసిన ఆత్మీయ సందేశాలు, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థల అభినందనల వరకూ,
- V సహృదయ మిత్ర మండలి రజతోత్సవ ప్రత్యేక సావనీర్ కోసమే రాయించిన 10 విశిష్ట పరిశోధనాత్మక / స్మారక రచనలతో కలగలిపి 40 వరకు చిన్న పెద్ద వ్యాసాలు,
- V మొట్టమొదటిసారిగా చరిత్రలో విరాజిల్లిన పిఠాపురం ప్రాశస్త్యాన్ని తెలియజేసేలా సేకరించి ఒక్క దగ్గరికి చేర్చిన పిఠాపురం గురించిన ఐదారు విలువైన వ్యాసాలు,
- V మహనీయులతో పాటుగా , మిత్రమండలి కార్యక్రమాల చిత్రమాలిక, కరపత్రాలు, వార్తా పత్రికల కట్టింగ్స్, సభ్యులు, రచయితల సుమారు 300 చిత్రాలు, ఫొటోలు,
- V విద్య, విజ్ఞానం, ఆరోగ్యం, పిల్లల పెంపకం, చరిత్ర, కళలు, సంగీతం, సంస్కృతి, సాహిత్యం, స్వాతంత్రోద్యమం, రంగస్థలం, సామాజికత, సంఘసంస్కరణ ఇంకా మరెన్నో ఆసక్తికర విషయాలు,
- V ఇన్నేళ్లుగా మిత్రమండలిని వెన్నంటి ఉన్న మిత్రులు, శ్రేయోభిలాషులు, సభ్యుల 50 పై చిలుకు ప్రముఖుల అభిప్రాయాలు, ఇతర అమూల్యమైన స్పందనలు,
- V సందర్భవశాత్తు రచనల నడుమ అక్కడక్కడా కనిపించి చదువరులను , భాషాభిమానులనూ అలరించే పాతిక పైబడిన పద్యాలూ, హక్కుల సూర్యుడు బాలగోపాల్ వాక్యాలు,
- V ఇవి కాక అక్కడక్కడా సజ్జన సూక్తులు, జీవన నైపుణ్యాలు , శతజయంతి, శతవర్థంతి నివాళులు, ప్రతి పుటకీ కనిపించే హితోక్తులు, విరిసే అక్షర కాంతుల వంటి వెలుగులు,
- V బుద్ధుడు – వివేకానందుడు, వేమన – గురజాడ, మహాత్మా గాంధీ – మహాప్రవక్త నారాయణగురు ల అరుదైన పోలిక రచనలు, అలనాటి అనువాద సంభాషణలూ,
- V మహత్తరమైన సామాజికోద్యమాలు, ఆత్మ గౌరవోద్యమాల నుండి భక్తి, ఆధ్యాత్మికతలు, విప్లవ యువజనోద్యమాలు, మానవ హక్కుల పోరాటాల ప్రస్తావనలు,
- V వెరసి, "సర్వధర్మ సమభావః" నినాదంతో, 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే లౌకికవాద పునాదిగా సాగిన ఈ సహృదయ మిత్రమండలి పాతికేళ్ల విశిష్ట ప్రస్థాన సంచిక.

పలు ప్రజాపక్ష రచనల సూచిక !

వివిధ విశేషాల విజ్ఞాన వీచిక !

అనేకానేక అభ్యుదయ భావాల దీపిక !!!

సహృదయ మిత్రమండలి ఆవిర్భావం

"ది.12-1-2001 న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సహృదయులైన కొంతమంది మిత్రులము సమావేశమై మన శక్త్యానుసారము సమాజానికి సేవ చేయాలనే సత్సంకల్పంతో సహృదయ మిత్రమండలి ప్రారంభించడం జరిగింది. చీకటిని తిడుతూ కూర్చోవడం కన్నా చిరుదివ్వెలను వెలిగించాలనే ఆశయంతో సొంతలాభము కొంత మానుకుని, పొరుగు వారికి తోడ్పడాలి అనే లక్ష్యంతో మిత్రమండలి పని చేస్తుంది. సహృదయులైన వ్యక్తులందరూ ఈ సంస్థలో సభ్యులే. ఈ సంస్థ ఏ ఒక్కరి బ్రెయిన్ చైల్డ్ కాదు. ఈ సంస్థ నీది, నాది, మనందరిది. కుల, మత, వర్గ, స్త్రీ, పురుష, భేదభావము లేకుండా ఈ సమాజంలో అందరికీ చెందుతుంది. సభ్యులు చేయవలసిందల్లా సహృదయం కలిగియుండడం. తన అమూల్యమైన కాలంలో అతికొద్ది భాగాన్ని ఇతర సహృదయులతో కలిసి సమాజసేవకు వినియోగించడానికి ముందుకు రావడం..."



सत्यमेव जयते

CERTIFICATE OF A.P. REGISTRATION OF SOCIETIES ACT. 35 OF 2001

Society No. 703 of 2011.

I hereby certify that [illegible]

has this day been registered under the Societies Registration Act. 35 of 2001.

Given under my hand at Kakinada this 18th day of November Two thousand Eleven [illegible] 1933 S.E.

THE SEAL OF THE REGISTRAR OF SOCIETIES EAST GODAVARI KAKINADA

REGISTRAR OF SOCIETIES
KAKINADA REGISTRATION DISTRICT
EAST GODAVARI DISTRICT
18/11/11

విషయసూచిక

1. పాతికేళ్ల సమీక్ష నాట - ఓ మనవి మాట 7-8
2. సహృదయులైన పిఠాపురం పుర ప్రజలకు విజ్ఞప్తి 9
3. సహృదయ మిత్రమండలి ఏం చేస్తుంది 10-11
4. ప్రధాన సంపాదకుడి మాట 13-14
5. అధ్యక్షుడి సందేశం 15
6. ప్రధాన కార్యదర్శి పలుకులు 16-17
7. కొద్దిమంది పిఠాపురపు శ్రీ పారిజాతాలు (ప్రముఖుల ఫోటోలు) 18-26
8. సహృదయ మిత్రమండలి, ఒక బంధం ఒక విశ్వాసం, పాతికేళ్ళ అద్భుత ప్రయాణం 27-30
9. ఆదర్శ ఉపాధ్యాయురాలు శ్రీమతి కోరుమిల్లి (ఊటుకూరు) లక్ష్మీదేవికి అశ్రునివాళి 31-33
10. రజనీ తలపులలో పిఠాపురం మెరుపులు 34-39
11. ఒకనాటి ఆంధ్ర రాజధాని పిఠాపురం 40-41
12. సహృదయ మిత్రమండలి సంస్కృతి గమనం 42
13. స్నేహ సౌరభం 43
14. గురజాడ బాటలో గిరీసం స్ఫూర్తి (వ్యంగ్య రచన) 44-45
15. ఎవరు గొప్ప ? 46-47
16. శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః 48-50
17. మీరు మంచి తల్లిదండ్రులు కావాలంటే 51-54
18. ఖాదీ చేనేత పరిశ్రమ 55-56
19. వేమన - గురజాడ 57-58
20. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం 59
21. కళా ప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 60-65
22. పిఠాపురంలో నా మొదటి మజిలీ 66-73
23. స్వామి వివేకానందుడు -మహోన్నత బుద్ధుడు 74-83
24. డాక్టర్ చెలికాని రామారావు గారి జీవిత చరిత్ర 84-92
25. రంగస్థల మేధావి 93-97
26. పీడిత జనుల గళము కలము మహా శ్వేతాదేవి 98-104
27. కాకినాడ నా తల్లి, నా చెల్లి 105-106
28. నిత్య అధ్యయన శీలి సాధు సుబ్రహ్మణ్య శర్మ 107-108
29. శరత్ కాలీనత 109-113
30. మన పిల్లల్ని మనమే కాపాడుకోవాలి 114-116
31. మహాత్మ జ్యోతిబా- సావిత్రి పూలే 117-125
32. ఇరువురి మహాత్ముల సంభాషణ 126-131
33. గాంధీ ఎందుకు మహాత్ముడు ? 132-133
34. దామోదర ధర్మానంద కోసంబి 134-136
35. ఆత్మగౌరవ ప్రవక్త పెరియార్ 137-140
36. స్త్రీలు, మానవ హక్కులు 141-143
37. ఎలా జీవించాలి ? 144-150
38. తెలుగు జాతి సారస్వత మహాయాత్ర కందుకూరి వీరేశలింగం స్వీయ చరిత్ర 151-154
39. పొలమారిన జ్ఞాపకాలు, పిఠాపురం నూర్జహాన్ సెంట్ 155-163
40. ప్రజా పాట ఆధునిక మహా తత్వ గీతం 164-167
41. ది గ్రేట్ డిక్టేటర్ చిత్రం ద్వారా, చార్లీ చాప్లిన్ సందేశం 168-170
42. జాతి మరిచిపోయిన మహా త్యాగశీలి మెల్లి 171-177

అంకితం

ఎందరో మహామహులకి నెలవైనది ఈ నేల
ఎన్నో మహత్కార్యాలకి నిలయం మన ఊరు
ఇందలి చరిత్రది స్థిర నివాసం
విశేష సాహితీ పరిమళం
సజీవ సంవాదాల సంద్రం,
విశిష్ట సంప్రదాయాల కేంద్రం
కళలు ఇక్కడ విరాజిల్లాయి
సంస్కృతులు వికసించాయి
సంగీత సాహిత్య సంగమాల వెలుగుబాట
మానవీయ మమేకతలకిది జీవగడ్డ
అద్వితీయ అజరామర శిఖరం
అదే మనందరి పీఠికాపురం
జన్మనిచ్చిన తల్లి వంటి ఊరు
‘ పిఠాపురం ‘ దాని పేరు.
అలాంటి మహోన్నత స్థలికిలా
అక్షర సహృదయ చిరు కృతి,
మనఃపూర్వక నమస్సులతో సమర్పితం.

స్వేచ్ఛ! సమానత్వం !! సౌభ్రాతృత్వం!!!

సహృదయ మిత్రమండలి పాతికేళ్ల ప్రస్థానం.

పాతికేళ్ల సమీక్ష నాట, ఓ మనవి మాట...!

ఎప్పుడూ కాలప్రవాహంలో ఎన్నో సంస్థలు పుడతాయి, కొంతకాలం ఉంటాయి. తర్వాత క్రమంగా కనుమరుగైపోతాయి. మరికొన్ని సంస్థలు పడుతూ లేస్తూనే అయినా పయనం ఆపవు. గమనం వీడవు. ఏదో రూపంలో నిత్యం మంచి విషయాల్ని సమాజంలో చర్చకు పెడతాయి. మూసుకున్న అనేక మంది మది తలపుల తలుపులు తడతాయి.

అలా, బాల్యంలో, విద్యార్థి దశలో, యవ్వనంలో యాదృచ్ఛికంగా మనసును తాకిన ఓ మంచి ఆలోచన, మనిషికి జీవితకాల వివేచనను ప్రసాదిస్తుంది. మంచిచెడుల విచక్షణను వివరిస్తుంది. సాటి మనిషిని గౌరవించడం, తోటివారిని ప్రేమించడం నేర్పిస్తుంది. హద్దుల్లేని స్నేహాన్ని పెంపొందించడమే తన లక్ష్యంగా పనిచేస్తుంది.

అలాంటి పనిచేసే అరుదైన సంస్థల్ని కాపాడు కోవడం ఏ మానవీయ సమాజానికైనా ఓ తప్పనిసరి అవసరం. ఒక స్వప్నం సమష్టి తత్వాన్ని పొంది అక్షరాలా 25 సంవత్సరాల పాటు క్రియాశీలంగా ఉండగలగటం ఎంత గొప్ప విషయం. జీవితపు ఆదర్శం అంతకంతకూ విస్తరించి స్వచ్ఛంద సామాజిక మార్గమనే మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవడం ఎంతటి విశిష్ట అంశం.

సహృదయ మిత్రమండలి ఎంతటి సుదీర్ఘ ప్రయాణం చేసింది. ఇంకెంతటి గాఢమైన గాయాల్ని, ఒడిదుడుకుల్ని తట్టుకుని నిలిచింది. మిత్రమండలి ముందు తర్వాత కూడా మరెన్నో సంస్థలు పుట్టుకొచ్చాయి. వాటన్నింటినీ మండలి మిత్రపూరిత వైఖరితోనే చూసింది. స్వచ్ఛంద సేవకు, సామాజిక స్పృహకు సహృద్భావమే సదా బలం.

అందుకే, ఎవరి పనులు, వృత్తి ప్రవృత్తులు వారు చూసుకుంటూ మిగిలిన కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకోడానికి ఉద్దేశించినదే మిత్ర మండలి పద్ధతి. " సొంత లాభం కొంత మానుకు పొరుగు వానికి తోడుపడవోయి..." అన్న మహాకవి గురజాడ అడుగుజాడల్లో నడుస్తోంది మిత్రమండలి.

ప్రతీ ఏడాది విద్యార్ధులకు వేసవి శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం మొదలుకుని స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక ఆలోచనపరుల జయంతి, వర్ధంతుల నిర్వహణ,వైజ్ఞానిక వనభోజనాలు, కుటుంబ సమ్మేళనాలు వంటివే కాకుండా ఇంకా ఎన్నో వినూత్న కార్యక్రమాలు మండలి చేపడుతోంది.

ఉపాధ్యాయులు, విద్యావంతులు, ఉన్నతమైన ఆలోచనాపరులు, వివేకవంతులు, ఏ మాత్రం కీర్తికాంక్ష లేకుండా సమాజానికి ఉన్నంతలో ఏదో మంచి చేద్దామని తపించే సహృదయులు కూడా సభ్యులుగా నిరంతరం మిత్రమండలి చేస్తున్న కార్యక్రమాలకు అండగా ఉంటున్నారు. అయినా చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది.

పొగడ్తలకి పొంగిపోకుండా, విమర్శలకి కుంగిపోకుండా అయినంతలో శక్తియుక్తులు కూడదీసుకుని ముందుకు సాగిపోవడమే ఇన్నేళ్లలో మిత్రమండలి పాటిస్తున్న పని విధానం. పాత కొత్తల మేలు కలయికే మెరుగైన సమాజ నిర్మాణానికి సోపానమని మండలి నమ్మకం.

గత పాతిక సంవత్సరాలుగా భవిష్యత్ తరాల పై అదే ఎడతెగని విశ్వాసంతో మౌనంగా సౌమ్యంగా మిత్రమండలి పనిచేస్తోంది. అలా, ఇప్పుడిక పాతికేళ్ల పండగ సందర్భంగా తన ప్రస్థానాన్ని మరోసారి తానే పునః పరీక్షించు కుంటూ, వీలైనప్పుడు వెనుదిరిగి చూసుకుంటూ సహేతుక సమీక్షకు సిద్ధపడింది మిత్రమండలి.

రండి, సమున్నతమైన విలువల వెలుగులో ఎప్పటికప్పుడు తనని తాను తరచి చూసుకునే ఇలాంటి లౌకిక, ప్రజాతంత్ర, స్వచ్ఛంద పౌరసంఘంలో మనం కూడా మమేకం అవ్వుదాం , కదలండి. మరింత సారవంతమైన సంతోషకర ప్రపంచాన్ని సామూహికంగా రూపొందించడానికి మనవంతు మద్దతుగా కలిసి నడుద్దాం, పదండి.

సహృదయులందరికీ మా స్వాగతం !

ఆశావహులందరికీ ఇదే మా ఆహ్వానం !!

ప్రజాహిత బాంధవ్యులందరికీ మా ప్రణామం !!!

సహృదయులైన పిఠాపురం పురప్రజలకు విజ్ఞప్తి.

గత పాతిక సంవత్సరాలుగా పిఠాపురం లోను, చుట్టు పక్కల ప్రాంతాల్లో, వివిధ సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సహృదయ మిత్రమండలి సవినయంగా ప్రకటిస్తున్న ప్రస్థానం ఇది.

సావనీర్ బాధ్యతను స్వీకరించడం మొదలు అడిగిందే తడవుగా లేకపోయినా స్పందించి మాకు సహకరించిన వారూ ఉన్నారు,అలాగే, రోజులకొద్దీ తిప్పుకుని, గంటలకొద్దీ సమయం వృధా చేసి పొమ్మన్న వారూ ఉన్నారు.

అనారోగ్యంతో ఉండి కూడా ఓ మంచి పని కోసం ఆదరంగా ముందుకొచ్చిన సహృదయవాసులు, అందరికీ మా వందనాలు.

ఇది కేవలం మిత్రమండలి కోసం కాదు.మా గొప్ప కోసమో, మీ మెప్పు కోసమో అసలే కాదు. **ఇది పిఠాపురంలో సగటు పౌరుల కోసం. రేపటి తరాల వెల్లువ కోసం. నేటి మన పిల్లల కోసం.మసక బారుతున్న వాళ్ళ భవితవ్యం ఉద్దీపన కోసం.**

మమ్మల్ని, మేం చేస్తున్న పనిని అవహేళనచేసి అవమానించినంతలో మాకొచ్చే నష్టం లేదు. ఎందుకంటే, మంచి కోసం, మంది కోసం ముందుకొచ్చే ప్రతిఒక్కరికి చరిత్రలో దక్కిన బహుమతులు ఇవే కదా !

అయినప్పటికీ మేం వేటికీ వెరవలేదు, మా సంకల్పాలు సడలలేదు, ప్రజాపక్షంగా ఇన్నేళ్లలో ముందడుగేసిన మేము ఇప్పుడు కూడా వెనుతిరగలేదు. ఎందుకంటే, **మాకు మీ అండదండలు ఉన్నాయనే ధీమా.**

పిఠాపురం మమ్మల్ని ఎప్పటికీ ఒంటరివాళ్ళని చేయదనే ఒక నమ్మకం. అడపాదడపా చేసే ప్రతి కార్యక్రమాన్ని, ఇలా మీ ముందు పెట్టి , సమాజం కోసం శ్రమించిన కొందరు ఆలోచనపరుల్ని పరిచయం చేయడానికి పూనుకున్నాం.

ఇందులోని వ్యాసకర్తలు, రచయితలు అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు.అలాగే, ఆర్థికంగా, హార్థికంగా ముందుకొచ్చిన వారికి, పుస్తకం కంపోజ్ డిజైన్ చేసిన సాంకేతిక నిపుణులకి కూడా కృతజ్ఞతలు, నెనరులు.

మనిషికి మనిషికి మధ్య పెరుగుతున్న ఖాళీని సత్సంబంధాలతో పూరించడమే సహృదయ మిత్రమండలి లక్ష్యం. వ్యక్తికి వ్యవస్థకి నడుమ సాగుతున్న సంఘర్షణలో మిత్రమండలి ఎల్లప్పుడూ సామాన్యుడి పక్షం.

అందుకోసమే ఈ సంకలనం. సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, స్వచ్ఛంద సేవా భావనల సమ్మేళనం. పలువిలక్షణ విషయాల విశేషణం. పూర్తిగా చదివి పురోగతి కోసం వెలిబుచ్చే సద్విమర్శలకు సదా స్వాగతం.

కార్యవర్గం

సహృదయ మిత్రమండలి

పిఠాపురం

సహృదయ మిత్రమండలి ఏం చేస్తుంది ???

- ఆవిర్భావం తర్వాత వెనువెంటనే కళాశాల విద్యార్థులకు సామాన్య జ్ఞానం గురించిన పోటీ నిర్వహించింది. అంటే విద్య ప్రాముఖ్యతను చాటింది.
- గుజరాత్ భూకంప బాధితులకు అన్ని రకాలుగా అండగా నిలిచి ఆహారం, దుస్తులు కొంత నగదు పంపించింది. అంటే, సామాజిక స్పృహను అందించింది.
- ఎయిడ్స్ గురించిన అవగాహనను విస్తృత పరచి, ప్రజానీకంలో ఎయిడ్స్ రహిత సమాజం కోసంచర్చకు తెరదీసింది. అంటే, ఆరోగ్య రంగాన్ని పట్టించుకొమ్మంది.
- సగటు మనిషి పక్షాన నిలిచి తన ప్రస్థానాన్ని స్పష్టంగా ప్రతిపాదిస్తూ, విద్య, విజ్ఞానం, ఆరోగ్యం యొక్క ప్రాధాన్యతల్ని పాతికేళ్ల కిందట విద్యార్థుల్లో చర్చకు పెట్టీ, వాళ్ళ తోనే ప్రజల్లో చైతన్యం పెంపొందించే బృహత్తర కార్యక్రమాన్ని ఎంచుకుంది సహృదయ మిత్ర మండలి.

ఎక్కడో గుజరాత్‌లోని భూకంప బాధితులకు అండగా నిలుస్తూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా పాటలు, గేయాలు పాడుతూ ఊరేగింపు ద్వారా రెండు బ్యాంకు డ్రాఫ్ట్ లను పంపడం డి.డి నంబర్:407020,407523 సహృదయ మిత్ర మండలి విశ్వజనీన దృక్పథానికి తిరుగులేని నిదర్శనం.

తద్వారా ప్రాంతాలకు అతీతంగా ఎక్కడ ఏ ఆపద వచ్చినా పౌరులుగా మానవీయ స్పందన ముఖ్యం అనే సందేశం ఇవ్వడంతో పాటు, ప్రజల్ని ఉద్యుక్తుల్ని చేయడానికి “కళా రూపాలు” ప్రతిభావంతంగా వినియోగించు కోవడం వల్ల విద్యార్థులకు మానసిక పరిణితి, జనాలకు సమస్య తీవ్రత తెలపడం జరిగింది.

అంతేకాదు, విద్యార్థులతో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల్ని, పి.ఎం.పి., ఆర్.ఎం.పి. వంటి ఆరోగ్య కార్యకర్తల్ని కార్యాచరణలో భాగం చేసుకోవడం ద్వారా సమాజంలోని సకలస్రవంతుల సమష్టి కృషితోనే ఏ విధమైన క్రియాశీల కార్యక్రమాలైనా సాధ్యమనే విశిష్ట సందేశాన్ని అందించింది.

అందులో భాగంగా ఈ పాతికేళ్లలో

- మహనీయుల జయంతి వర్ధంతుల్ని నిర్వహిస్తూ విద్యార్థులకు గొప్పవారి జీవితాల్ని పరిచయం చేస్తోంది.
- ముఖ్యంగా స్వామి వివేకానంద, గురజాడ అప్పారావు, భగత్సింగ్ వంటి వారి ఆదర్శాల్ని పిల్లల్లో చర్చకు పెడుతోంది.

- విద్యావంతులతోనూ, ఆలోచనాపరులతోను విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల ప్రసంగాలు ఏర్పాటు చేస్తోంది.
- రాజ్యాంగ బద్ధమైన హక్కులు, విధులు, విలువల వెలుగులో పని చేస్తోంది.
- పర్యావరణ పరిరక్షణ అవగాహన పెంచడానికి తన వంతు పాటు పడుతోంది.
- స్వచ్ఛ భారత్ దిశగా పరిమితుల్లోనే అయినా సభ్యులతో చెత్తను శుభ్రం చేస్తోంది.
- ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించడానికి చేతిగుడ్డ సంచుల్ని అందిస్తోంది.
- ఆర్మీ సెలెక్షన్స్ సమయంలో వొచ్చిన దూరప్రాంత అభ్యర్థులకు ఆహారం అందిస్తోంది.
- వేసవి సెలవులలో విద్యార్థులకు పలు సబ్జెక్ట్‌ల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తోంది.
- సాహిత్యం, సామాజిక బాధ్యత, సాంస్కృతిక వికాసం పిల్లలకు బోధిస్తోంది.
- సామాజిక హితం కోసం అనేక అంశాలతో కరపత్రాలు, పుస్తకాలు ప్రచురిస్తోంది.
- పుస్తక పఠనం పిల్లల్లో, సభ్యుల్లో పెంపొందించడానికి ప్రయత్నం చేస్తోంది.
- విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కొరకు ప్రత్యేకంగా క్లాసులు చెప్పిస్తోంది.
- శారీరక మానసిక ఆరోగ్యం కోసం పండుగలు పర్వదినాల్లో పిల్లలకు ఆటల పోటీలు ఏర్పాటుచేస్తోంది.
- ప్రతీ నెలా ఒక్కొక్కసభ్యుల ఇంట్లో సమావేశం నిర్వహణ ద్వారా కుటుంబ సభ్యులని కూడా భాగం చేసుకుంటోంది.
- ప్రతీ ఏడాది సామాజిక వన భోజనాలు ఆహ్లాదకరంగా నిర్వహిస్తోంది.
- వ్యసన వ్యతిరేక ఉద్యమంలో భాగమై ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది.
- మద్యం మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం అనేక సృజనాత్మక ప్రదర్శనలు నిర్వహిస్తోంది.
- మహిళా సాధికారత కోసం తనవంతుగా పలు కార్యక్రమాలు చేపడుతోంది.
- ఐ క్యాంప్స్, హెల్త్ క్యాంప్స్ నిర్వహిస్తూ ఎందరో బీదవారికి చేయూతనిస్తోంది.
- కోవిడ్ సమయంలో పేదలకు నిత్యావసర వస్తువులు సరుకులు పంపిణీ చేసింది.
- సైన్సు, సామాజికోద్యమానికి తనవంతు సహకారం అందిస్తోంది.
- సీనియర్ సిటిజన్స్ విలువైన అనుభవాల్ని,ఆలోచనల్ని భవిష్యత్ తరాల ఉన్నతికోసం ఉపయోగిస్తోంది.
- ఆయా ప్రముఖ దినోత్సవాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందిస్తోంది.
- ఇతరేతర సోదరసంఘాలతో మమేకమై అన్నిరకాల సేవా కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తోంది.

మనిషి ఒక పరంపర

మౌనంగానే అయినా విరిసే ఊహల తుంపర
కనే కలల పరుగుల్లో కావొచ్చు
వినే వింత కథల్లో చేర్చొచ్చు
పదంగానో, వాక్యంగానో మార్చొచ్చు.
బతుకుబాటలోని అనుభవాల తోటలో తడిసిన
ప్రతి అక్షరానికి తనదైన అనుభూతిని ఇవ్వొచ్చు
మనదైన ప్రేమని పొందొచ్చు.
ఒక ప్రభాత వేళ మనసుని తాకే ప్రకృతి గీతంలా
స్వభావరీత్యా పల్లవి పాడే కోయిల రాగంలా
ప్రేమికులు చేసుకునే తీపి గాయంలా
ఏకాంతం కోసమే సృష్టించిన అద్భుత వనంలా
మళ్ళీ మళ్ళీ లభించని వరంలా,
మనిషి ఒక మహా పరంపర
జీవన సౌందర్యాన్ని సాధన చేసే మబ్బుల తెర
సుఖాంతాల ఊసులు దుఃఖాంతాల ఉసురులు
నిర్మలమైన పచ్చని పైర గాలుల సవ్వడులు
ఎప్పుడో తిన్న తినుబండారంలా
పొద్దున్నే వొచ్చిన నీరెండలా
అప్పుడే పుట్టిన బుజ్జాయిలా
వెచ్చటి శీతాకాలపు మంటలా
చిరు చినుకులతో పలకరించే తొలకరి జల్లులా
మండు వేసవిలో నిండు కుండలా,
రాలిపడి సాగిపోయే పండుటాకులా
మనిషి ఓ మహత్తరమైన పరంపర.

"కష్టం చేసిన వారు ఎప్పుడు అదృష్టాన్ని ఓడిస్తారు."

ప్రధాన సంపాదకుడి మాట

- గౌరవ్

'అజరామరవ ప్రజ్ఞో విద్యా మార్థంచ సాధయేత్ ' అని ఆర్యోక్తి. జీవితాంతం మనిషి పొందే ఆత్మానుభవమంతా విద్యే. అందుకోసం సమిష్టి సాధన సాగాలి."అత్తా హీ అత్తానో నాథో" అని బౌద్ధ సూక్తి. ఎవరికి వారే స్వయం కృషితో ఉన్నతిని సాధించాలి. విభేదాలు ఎన్ని ఉన్నా సరే. శ్రీశ్రీ అన్నట్లు " అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే." అన్న స్పృహ అందరికీ కలగాలి. అదే అంతా అనుసరించాల్సిన సహృదయ మిత్రమండలి సందేశం.

విలియం బ్లేక్ అనే కవి అంటాడు, To see a World in a grain of sand అని. ఇసుక రేణువులో ప్రపంచాన్ని చూడటం. శివసాగర్ అంటాడో కవితలో, " ఈ ఒక్క క్షణాన్ని సాగదీసి కాగడాగ వెలిగిస్తాను" అని. అలా నాకు తెలిసిన చిన్న లోకాన్ని మళ్ళీ ఓసారి కొత్తగా పరికించి చూడటం. మిత్రమండలిచ్చిన అవకాశాన్ని మిత్రులతో కలిసి సమిష్టిగా శిరసావహించడం. ఎన్ని ఒత్తిళ్లున్నా కర్తవ్యంగా భావించి, ఈ కృతిలో ఒకింత కీలక పాత్ర పోషించడం.

నా చిన్నతనం , చదువు, స్నేహాలు, బంధాలు, బాంధవ్యాలు ఎన్నెన్ని ఈ పిఠాపురంతో ముడిపడి ఉన్నాయో. ఊర్లో ప్రతీదారి నా బాల్యానికి ప్రతిబింబమే. ప్రతీ వీధి నా కుతూహలానికి, కోలాహలానికి కూడలిస్థానమే. అలాంటి అల్లరి పనులు, పిల్ల చేష్టలే ఇప్పుడు మిగిలిన అమూల్య అనుభవాల సంపద. అవే జీవితమనే ప్రయాణాన్ని ప్రకాశవంతం చేస్తాయి.హద్దుల్లేని ఆనందాన్ని అందించే అవధుల్లేని మనసు గీతాలౌతాయి.

తాతగారు ఫార్మాసిస్ట్. ఆర్.ఎం.పి. షుగర్ ఫ్యాక్టరీలో పని. కష్టజీవులకు తెల్సిన వైద్యం చేస్తుండే వారు. వొచ్చే బీదలు వారి రోజువారి బాధలు చెప్పుకునే వారు. మందులు , సూదులు ఆ హాస్పిటల్ వంటి వాతావరణం అదో వెగటు. నాన్న లా చేశారు. రాజకీయాలు, ఎప్పుడూ ఏవో సెటిల్మెంట్లు. తగాదాలు, అరుపులు, గొడవలు. పోలీస్ స్టేషన్లు, కోర్టులు. మొదట్లో ప్రభావం పడ్డా ఎలాగోలా బయట పడ్డాను. ఇప్పుడా పేచీలకు చాలా దూరం. అందుకే ఆస్పత్రి, రాజకీయాలు, కోర్టులంటే పడదు.

పౌరోహిత్యం నుండి పాత్రికేయం వరకూ ఎన్నిపాత్రలు పోషించినా పొట్ట పోసుకోడానికి ఏవీ అక్కరకు రాలేదు. అక్షరాల్ని ప్రేమించడం తెలిసినవాళ్ళకి మనుషుల్ని ద్వేషించడం ఎన్నటికీరాదు. కాన వాళ్ళెప్పుడు బతక నేర్వరు.అందుకే సహృదయ మిత్రమండలి పాతికేళ్ల ప్రస్థానం గురించిన ఈ సావనీర్ బాధ్యతను స్వీకరించడం. బాధైనా, భారమైనా సరే, ఓ మంచి పనికోసం తెలిసిన కొద్దిపాటి విషయాన్ని ఇలా ఒక్క దగ్గరికి ఒద్దికగా చేర్చడం.

అవకాశం ఉన్నంతలో ఏదో రూపంలో చేయడానికి ప్రయత్నం చేశాను. అద్భుత మనను గానీ అన్యాయం మాత్రం చేయలేదని చెప్పగలను. అయినప్పటికీ,మరింత శ్రద్ధ,సమయమూ,సావకాశము ఉంటే ఇంకా బాగా చేద్దునేమో...? తొందరలో దొర్లిన తప్పులు ఉండవచ్చు. అలాగే, భిన్నాభిప్రాయాలు రావొచ్చు. పలు సంగతుల పై ఇందులోని భావాలతో అందరికి ఏకీభావం ఉండక పోవచ్చు. వాటన్నింటి మీద స్పష్టత ఇవ్వటం నా కనీస బాధ్యత.

కాబట్టి, విమర్శలకు ఆహ్వానం. ఇందులోని పొరపాట్లు,లోపాల బాధ్యత పూర్తిగా నాదే. వాటికి క్షంతవ్యుణ్ణి .రచయితలు, వ్యాసకర్తలకు ధన్యవాదాలు. సహకరించిన అందరికి శుభాకాంక్షలు. మిత్రమండలికి హార్దిక అభినందనలు. మానవ సంబంధాలలోని ఆర్ద్రత మాయమై ఆర్థిక జీవులుగా మాత్రమే మిగులుతున్న తీరుపై బాధపడే ప్రతీ ఒక్కరికీ ఈ అక్షరాల్ని గుండెలకి హత్తుకునే హక్కుంది. ఈ వేదనను అనుభూతిచెందే అవకాశం ఉంది.

సహానుభూతి అంటే అదే. సాటి మనుషుల కష్టాల్ని సానుభూతి చెందటం. తోటి వారి కన్నీటిని వోదార్పుతో తుడవటం. మనకున్న దాంట్లోనే మంచికి ఇంతనీ తీయడం. కనీసం ఒక్కరికైన తోచిన మేలు చేయటం. అంతకుమించిన సహృదయం ఏముంటుంది. అదే, ఏ కాలంలోనైనా మానవాళి నిలుపుకోవాల్సిన లక్షణం. అందుకోసమే ఈ ప్రస్థానం. అదే, గడిచిన పాతికేళ్ళుగా స్వచ్ఛంద సంస్థగా మనం చేస్తున్న ఆచరణాత్మక ప్రచారం.

వ్యక్తులు విశిష్ట వ్యక్తిత్వాలుగా వికసించాలి !

మనుషులు మరింత మానవీయం కావాలి !!

సమాజమంతా సహృదయ సారం నింపాలి !!!

సర్వేజనా సుఖినో భవంతుః !!!!

- శుభం భూయాత్ -

అధ్యక్షుని సందేశం

"పరుల కోసం పాటు పడని
నరుని బ్రతుకు దేనికని ?
మూగ నేలకు నీరందివ్వని
వాగు పరుగు దేనికని ?? "

ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు. తెలుగుజాతి వైతాళికుడు, సంఘ సంస్కర్త శ్రీ గురజాడ అప్పారావు గారి "సొంత లాభం కొంత మానుకు పొరుగువారికి తోడుపడవోయి" అనే నినాదంతో, మరొక మహనీయుడు, శ్రీ స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా 2001 జనవరి 12న సామాజిక స్పృహ కలిగిన నలుగురు ప్రముఖులచే పురుడు పోసుకున్నది **"సహృదయ మిత్ర మండలి".** నాటి నుండి ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల గురించి ఇప్పటి వారికి తెలిసేలా వారిని స్మరిస్తూ గత 25 సంవత్సరాలుగా ముందుకు సాగుతోంది. అలాంటి మహోన్నతమైన ఈ సంఘంలో గత కొంతకాలంగా సభ్యుడిని కావడం, ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉండడం నా అదృష్టంగా నేను భావిస్తున్నాను.

అందరి మంచిని కోరే కొందరు అందర్నీ కలుపుకొని ముందుకు పోవడం ఎప్పుడైనా ఆదర్శ నీయమే. అలా సమాజం కోసం కొంత శక్తీ సమయమూ వెచ్చించి పరిమితుల్లోనే అయినప్పటికీ, పరోపకారం అంటే ముందుకు వచ్చే మంచి మనుషులతో ఒక మెరుగైన పౌరసమాజం నిర్మాణంలో నా వంతు భాగం కావడంకంటే కావలసినది ఏముంది. **సహృదయ మిత్రమండలి వల్ల నాకు ఆ సార్థకత లభించింది.**

మిత్ర మండలి ద్వారా వ్యక్తిగతంగా నాకు ఎందరో విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, సాహితీవేత్తలు పరిచయం అయ్యారు. వారి ద్వారా నేను ఎంతో నేర్చుకొని వాటిని ఆచరించే ప్రయత్నం చేస్తున్నాను. అందరి సహాయ సహకారాలతో ఈ బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్న మిత్ర మండలి ఇలాంటి మైలురాళ్ళు అనేకం చేరుకుని కొనసాగాలనేదే నా ఆకాంక్ష.

అందరికీ అభినందనలు.

తోట శ్రీనివాసు

అధ్యక్షుడు, సహృదయ మిత్ర మండలి

"అలవాట్లు మార్చితే ఫలితాలు మారుతాయి."

ప్రధాన కార్యదర్శి పలుకులు

"సేవ మన ధర్మం - సహృదయమే మన బలం'

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 2001 జనవరి 12న శ్రీ డా॥ ఎన్. సూర్యనారాయణ గారు, డా॥ పి. సూర్యప్రకాశ్ గారు, శ్రీ టి.వి.ఎల్. నరసింహారావు గారు, శ్రీ వి. కేశవరావు గారు మరియు మరికొంత మంది మిత్రులు కలిసి సహృదయ మిత్రమండలి స్థాపించడం జరిగింది.

గురజాడ అప్పారావు, వివేకానందల భావజాలాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ సంఘం ముందుకు వెళుతుంది. ఈ ప్రయాణం తక్కువ మందితో ప్రారంభమై నేడు 100 మందికి పైగా సేవా భావంతో నడిచే సభ్యులను కలిగిన సంఘంగా విస్తరించింది. ప్రతి సంవత్సరం వివిధ రంగాలలో సామాజిక సేవలు, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు మరియు సమాజంపై ప్రభావం చూపే చైతన్య శిబిరాలు నిర్వహిస్తూ సహృదయ మిత్రమండలి తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది.

సమాజంలో మానవీయతను ప్రోత్సహిస్తూ, సేవను జీవన విధానంగా స్వీకరించిన ఒక బృందమే సహృదయ మిత్రమండలి. **మిత్రమండలి కేవలం ఒక సేవా సంఘం మాత్రమే కాదు. ఇది ఒక ఆలోచన, ఒక దృక్పథం, ఒక మార్గదర్శకం.** గత 25 సంవత్సరములలో అనేక సేవా కార్యక్రమాలు – ఉదాహరణకు వేసవి శిక్షణ తరగతులు, ఆరోగ్య శిబిరాలు, జయంతి, వర్థంతి కార్యక్రమాలు, ప్రకృతి పరిరక్షణ వంటి ఎన్నో కార్యక్రమాలు చేసింది. ఈ 25 ఏళ్ళలో ఎన్నో సవాళ్ళు ఎదురైనా సేవ పట్ల నిబద్ధత మాత్రం ఎప్పటికీ మారలేదు. ఈ ప్రయాణంలో తోడుగా ఉన్న ప్రతి సభ్యుడు, ప్రతి దాత, ప్రతి అభిమానికి మన:పూర్వక కృతజ్ఞతలు.

శిక్షణ తరగతి విద్యార్థి నుంచి భాగస్వామిగా నా ప్రయాణం

నాకు ఈ సంఘంతో పరిచయం జరిగిన వేళ 2008 వ సం॥రంలో వేసవి శిక్షణా తరగతుల ద్వారా ఒక విద్యార్థిగా నాలో కొత్త ఆశలు, కొత్త ఆలోచనలు రేకెత్తిన సందర్భం. ఈ శిక్షణ తరగతుల ద్వారా నేర్చుకున్న నైతిక విలువలు, సమయపాలన, సామాజిక బాధ్యత, పెద్దల పట్ల గౌరవం, స్త్రీల పట్ల మర్యాద, నన్ను మానసికంగా తీర్చిదిద్దాయి. ఒకప్పుడు నేర్చుకునే వాడిగా ఉన్న నేను, ఇప్పుడు నేర్పించే స్థాయికి ఎదగడం గుర్తుచేసుకుంటే మనసంతా కృతజ్ఞతతో నిండిపోతుంది. **ఇది కేవలం వ్యక్తిగత ప్రయాణం కాదు. ఇది సహృదయ మిత్రమండలి యొక్క ఒక సాక్ష్యం.** ఈ అవకాశాన్ని కల్పించిన ప్రతి గురువుకు, ప్రతి మిత్రునికి, ఈ సంస్థకూ నా మన:పూర్వక కృతజ్ఞతలు.

నేను ఒక విద్యార్థిగా సహృదయ మిత్రమండలి తరగతుల్లో చేరాను. ఆ తరగతులు నాకు జ్ఞానాన్ని ఇచ్చాయి. కానీ అందులో అనుకోకుండా జరిగిన పరిచయం మాత్రం జీవితానికి ఒక అర్థాన్ని ఇచ్చింది. అదే తరగతులలో చేరిన పావనితో పరిచయం క్రమంగా ఆమె నా జీవిత భాగస్వామిగా మారడం ఒక అనుకోని గొప్పవరం. ఈ రోజు ఆమె నా జీవిత భాగస్వామినిగా నా ప్రతి అడుగులో తోడుగా, ప్రోత్సాహక మద్దతుగా నిలుస్తోంది. నేను చేస్తున్న సేవా కార్యక్రమాల వెనుక ఆమె అండ అపారమైనది.

"విప్లవం అంటే భయం లేకపోవడం కాదు... భయాన్ని జయించడం."

<u>సహృదయ మిత్రమండలి బలహీనతలు</u>

1. టీమ్‌లో ఉన్న కొందరిపైనే పని భారం పడుతుంది.
2. సమావేశాలకు, కార్యక్రమాలకు హాజరు తక్కువగా ఉంది. ఫోన్ చేయవలసిన పరిస్థితి ఉంది. స్వతంత్రంగా వచ్చే స్థితికి తీసుకురావాలి.
3. సింపుల్‌గా చెప్పాలంటే ఆలోచనపరులు, మేధావులు, సీరియస్‌గా పనిచేసే కార్యకర్తలు ఉన్నారు. కానీ వీరందరినీ కార్యరంగంలోకి ఇంకొకరు దించవలసిన పరిస్థితి నెలకొని ఉంది.
4. అందరూ సహృదయ మిత్రమండలి నాది అని అనుకునేవారే కానీ, ఎక్కడో ఎవరో ఒక్క బాధ్యుడు పిలవాలి కదా అనే తత్త్వం మనలో ఉంది.
5. ప్రతి వ్యక్తికీ పరిమితులు ఉంటాయి. వాటితోనే ఎంతో చేయగలం. అలా పనిచేయడానికి స్వత: సిద్ధంగా మిత్రమండలి సభ్యులు ముందుకు రావాలి.

<u>భవిష్యత్ కర్తవ్యాలు :</u>

1. యూత్‌ని లీడ్ రోల్‌లోకి తీసుకురావడం.
2. కలిసి వచ్చే కార్యకర్తలను గుర్తించడం. గుర్తించిన కార్యకర్తలను పనిలో ఉంచడం. నిర్ధిష్ట సభ్యత్వాన్ని పెంచుకోవాలి.
3. విద్యాసంస్థలతో ఉన్న సంబంధాలను ఉపయోగించుకుని కార్యకర్తలను తయారుచేసుకోవాలి.
4. మహిళా సభ్యత్వం పెంచుకోవడం.

<u>చివరిగా సూచన :</u>

మిత్రులారా, మనమందరం సహృదయ మిత్రమండలిలో పనిచేస్తున్నాం. అంటే సమాజంలో మార్పు తీసుకురావాలనే మంచి ఉద్దేశ్యంతో పనిచేస్తున్నాం. ఇక్కడ మనలో ఎక్కువ తక్కువ అనే అభిప్రాయ బేధాలు అవసరం లేదు. **మనకు వీలైనపుడు, ఖాళీగా ఉన్నప్పుడు పనిచేద్దాం అనుకుంటే ఎప్పుడూ వీలుకాదు. సమాజం కోసం మనకున్న సమయంలోనే కొంత సమయం ప్రయత్న పూర్వకంగా కేటాయించాలి. దాని కోసం మన పనిని సర్దుకోవాలి. కొంత త్యాగం చేయవలసి ఉంటుంది. ఏ కష్టము పడకుండా సమాజంలో మార్పు తీసుకురావడం కుదరదు. సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆలోచనకు ఆచరణ కూడా తోడు కావాలి. అప్పుడు మాత్రమే మార్పు సాధ్యమవుతుంది.** కావున, మిత్రులారా ఐకమత్యం మనలో మరింత పెరగాలి. వ్యక్తిగత అహాలు, స్వార్ధాలు మరింతగా తగ్గాలి. ప్రతి పనిలో అందరం భాగస్వామ్యులం కావాలి. అప్పుడే పని తేలికవుతుంది, లక్ష్యం సులువవుతుంది.

సహృదయ మిత్రమండలి అభ్యున్నతికై పాటుపడుతున్న సహృదయ మిత్రమండలి సభ్యులకు, మిత్రులకు, పెద్దలకు ధన్యవాదములు, నా శుభాకాంక్షలు.

ఇట్లు
చిన్నారి సతీష్, గంగాపావని దంపతులు
ప్రధాన కార్యదర్శి, సహృదయ మిత్రమండలి.

"ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు... భయాన్ని జయించడం."

కొద్దిమంది పిఠాపురపు శ్రీ పారిజాతాలు

శ్రీ రావు వేంకట నీలాద్రి రాయణి
(1775-1828)
ప్రజలను కన్నబిడ్డల్లా ఆదరించిన గొప్ప ప్రభువు. దైవ భక్తి పరులు, గొప్ప కవి పండిత పోషకులు



శ్రీ రావు వేంకట మహీపతి గంగాధర రామారావు (1842-1890)
పిఠాపురం మహారాజు. కవి పండిత పోషకుడు, స్వయంగా కవి, లలిత కళాభిమాని, వేదవాఙ్మయ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మహనీయుడు. స్త్రీ విద్యను, అనాధబాలుర విద్యను ఎంతగానో ప్రోత్సహించిన విద్యాభిమాని.

శ్రీ రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు (1885-1964)
పిఠాపుర మహారాజు, మహాదాత, భాషా విద్యా సంఘ సేవా సంస్థల స్థాపకుడు. కవి, పండిత, కళాకారులను ఆదరించి, అభినవ భోజుడని కీర్తించబడిన మహనీయుడు. సూర్యరాయాంధ్ర నిఘంటువును రూపొందించి, తెలుగుకు వెలుగునిచ్చిన ధన్యుడు.

మహారాణి చిన్నమాంబా దేవి
(1895-1933) 1906 లో మహారాజా వారిని వివాహమాడిన చిన్నమాంబాదేవి, ఆధునిక యుగపు మహారాణి. తెలుగులోనే కాక ఆంగ్లంలో కూడా అద్భుతమైన ఉపన్యాస పటిమ ఆమె సొంతం. స్త్రీ విద్యా వ్యాప్తికి ఎంతగానో కృషి చేసిన విద్యాభిమాని. ప్రజల కష్టాలను, బాధలను తీర్చడానికి అహర్నిశలు శ్రమించిన స్త్రీ మూర్తి.

"ఒక వ్యక్తిని చంపడం ద్వారా మీరు ఆలోచనలను చంపలేరు."



శ్రీ బాలాంత్రపు వేంకటరావు
(1881-1972)

పిఠాపురానికి గౌరవం తెచ్చిన వెంకట పార్వతీశ కవులుగా ప్రసిద్ధి చెందిన జంటకవులలో ప్రథములు, కవితలు, కథానికలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, కావ్యాలు, ఖండకావ్యాలు, ఇలా ఎన్నో సాహితీ ప్రక్రియలలో వీరిది అందవేసిన చేయి. శివపురాణం, బ్రహ్మపురాణాలతో పాటుగా 1937 నాటికే 170 గ్రంథాలు ప్రచురించిన కవిరాజ హంస.



శ్రీ ఓలేటి పార్వతీశం (1889-1955)

పిఠాపురానికి గౌరవం తెచ్చిన వేంకట పార్వతీశ కవులలో ద్వితీయులు. సంస్కృతంలోనూ, తెలుగులోనూ గొప్ప పండితులు. 1911లో ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలను నెలకొల్పి, ఎన్నో గ్రంథాలను ప్రచురించారు. బెంగాలీ నేర్చుకొని ఎన్నో బెంగాలి గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. వీరి సాహితీ కృషికి మెచ్చి "కవిరాజ హంస" బిరుదుతో సత్కరించింది, ఆంధ్ర సారస్వత పరిషత్.

శ్రీ వేంకట రామకృష్ణ కవులు

అవధానులలో అసమానులు, తిరుపతి వేంకట కవులకు సమవుజ్జీలు, తెలుగుజాతి చిరస్మరణీయులు. ఒకరు వేంకట రామకృష్ణ శాస్త్రి, మరొకరకు రామకృష్ణ శాస్త్రి

శ్రీ పురాణపండ మల్లయ్యశాస్త్రి

తెలుగు, సంస్కృతాలలో గొప్ప పండితులు, సాహిత్య, తర్క వ్యాకరణ శాస్త్రాలలో కూడా దిట్ట, వీరి ధారణాశక్తి అమోఘం, ఎన్నో గ్రంథాలు వారికి కంఠతా వచ్చును. సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణానికి ఎంతో కృషి చేసారు. పిఠాపురం సంస్థానంలో తెలుగు గ్రంథ పరిశోధకులుగా ఎంతో భాషా సేవ చేసి చరితార్థులయ్యారు.



శ్రీ వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి

పాండిత్యంలో శిఖర సమానులు, ఆంధ్ర గీర్వాణ భాషలలో అపార ప్రతిభాసంపన్నులు, శ్రీమద్రామాయణతత్త్వ కథనంతో, రామాయణతత్త్వాన్ని లోకానికి అందించిన ధన్య పురుషులు



శ్రీ జయంతి రామయ్య

అధ్యాపకుడిగా జీవితం ప్రారంభించి, రాష్ట్ర న్యాయమూర్తి స్థాయికి ఎదిగిన ప్రతిభావంతుడు. ఎన్నో ప్రాచీన శాసనాలను వెలుగులోకి తెచ్చి, తెలుగు చరితకు మహోపకారం చేసిన ఘనుడు. ఆంధ్ర సారస్వత పరిషత్ స్థాపించి 5 వేల తాళపత్ర గ్రంథాలను సేకరించి పెట్టిన భాషా సంరక్షకుడు. గొప్ప కవి. రచయిత, సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మాణంతో, పిఠాపురం కీర్తిని, తెలుగు భాషను అజరామరం చేసిన ప్రతిభావంతుడు.

శ్రీ పానుగంటి లక్ష్మీ నరసింహా రావు

(1865-1940)

పిఠాపుర ఆస్థాన నాటకకర్త, గొప్ప రచయిత. 20వ శతాబ్దం ఉత్తరార్థంలో ఉదయించిన సాహిత్య ఉష:కాంతుల్లో బ్రద్దలయిన అగ్ని పర్వతం శ్రీ పానుగంటి. సాక్షి వ్యాసాలతో సమాజపు అవినీతిని కడిగి పారేసిన కలం వీరుడు. తన నాటకాలతో జనం మనసును దోచుకున్న రచనా శిల్పి. జీవితమంతా నమ్మిన సిద్ధాంతాలకే అంకితమైన మహామనీషి.

శ్రీ తుమరాడ సంగమేశ్వర శాస్త్రి

(1873-1932)

పిఠాపురం కీర్తిని చిరస్థాయిగా నిలిపిన సంగీత బ్రహ్మ. పిఠాపుర ఆస్థాన సంగీత విద్వాంసులు. వీణావాద్యంలో నిష్ణాతులు. సాక్షాత్తూ విశ్వకవి రవీంద్రుడినే తన వీణానాదంతో సమ్మోహన పరచిన మహాకళాకారులు.

"అన్యాయం కనిపించిన చోట నిశ్శబ్దంగా ఉండడం కూడా ఒక తప్పే."



శ్రీ వేదుల సూర్యనారాయణ శాస్త్రి
(1973-1932)
పిఠాపురం సంస్థాన పండితులు, వ్యాకరణ గురువులు, వందలాది మంది విద్యార్థులను వ్యాకరణ పండితులుగా తీర్చిదిద్దిన మహా విద్వాంసులు

శ్రీ నడకుదుటి వీర రాజు,
(1871-1937)
పిఠాపురం ఆస్థానంలో విమర్శకులుగా గొప్ప ప్రతిభచూపి, "విమర్శాదర్శ" బిరుదు పొందిన ప్రతిభావంతులు. విభ్రమ తరంగిణి పేరుతో రామకథను ఎంతో గొప్పగా చెప్పిన కవి పండితులు.

బ్రహ్మర్షి శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు
ప్రముఖ విద్యావేత్త
సామాజిక సంస్కర్త,
బ్రహ్మ సమాజ ప్రచారకులు



శ్రీ వంగూరి సుబ్బారావు (1886-1923)
చిత్రాడలోని శ్రీ చెలికాని లచ్చారావు గారి ఆహ్వానంపై, పిఠాపురం వచ్చి 1914 నుండి 1920 వరకు ఎంతో సాహితీ సేవ చేసిన ప్రముఖులు. ఆంధ్రపరిశోధక మహామండలి పక్షాన వీరు ఎన్నో గ్రంథాలను పరిశోధించారు. శ్రీ రామ విలాస ముద్రాక్షరశాలలో తెలుగు గ్రంథాలెన్నింటినో ప్రచురించి, చిరస్మరణీయులయ్యారు.

శ్రీ కొత్తపల్లి సూర్యారావు

పిఠాపురం సంస్థానంలోని చెందుర్తి వీరి జన్మస్థలం. 39 గ్రంధాలను రచించారు. 1911 నుండి ఆంధ్ర సాహిత్య పరిషత్‌లో పనిచేసి, అమూల్యమైన తాళపత్ర గ్రంధాలను సేకరించి భద్రపరిచారు.

శ్రీ ఉమర్ అలీషా

పిఠాపురంలోని విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠాధిపతి, గొప్ప తత్త్వవేత్త, 4 ఏళ్ళ వయస్సులోనే తెలుగులో ధారాళంగా కవిత్వం చెప్పిన సహజ కవి. తెలుగులో 50 గ్రంధాలు రచించడమే కాక, ఉర్దూ, పార్శీ భాషల్లో కూడా స్వతంత్ర రచనలు చేసిన ప్రతిభాశాలి. ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెంచడానికి, లోకానికి ధర్మ మార్గాన్ని దర్శింపచేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగ పురుషుడు.

శ్రీ ఆదిపూడి సోమనాధ రావు

(1867-1941)

పిఠాపురం సంస్థానంలో ఎన్నో సంవత్సరాలు ఉద్యోగం చేసిన వీరు, ఎన్నో భాషలలో గొప్ప పండితులు. గొప్ప కవి రచయిత. రవీంద్రుడి బెంగాలీ రచనలను, తమిళంలోని కంబ రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన తొలి రచయిత వీరు.



శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి

బారిష్టర్ పార్వతీశం నవలతో తెలుగు సాహితీ మిత్రులకు చిరపరిచితులు, కన్నవి, విన్నవి అన్న పేరుతో ఎన్నో గొప్ప కధలను, మొక్కుబడి పేరుతో ఎన్నో నాటికలను సంకలనం చేశారు. ఎన్నో వందల ప్రసంగాలతో లోకానికి ఎంతో జ్ఞానాన్ని అందించారు. ప్రఖ్యాత ఆంగ్ల నాటకకర్త జార్జి బెర్నార్డ్‌షా ప్రశంసలని అందుకున్న తెలుగువాడు.

"స్వార్థం లేని ప్రేమే నిజమైన సేవ".

శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

(1897-1980) పిఠాపుర సాహితీ చరిత్ర కిరీటంలో కలికితురాయి. తెలుగు కవిత్వానికి నవ్య పథాన్ని చూపిన భావకవి చక్రవర్తి. కావ్యాలు, యక్ష గానాలు, నాటికలు, గేయ నాటికలు ఇలా ఆయన సాహిత్య కృషి అనంతం. సినీ గీత రచయితగా, తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ఆయన చిరంజీవి.



శ్రీ బాదం అప్పారావు గుప్తా భాగవతార్

(1916-1991) సంగీత ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ఆరంభించి, హరికథా భాగవతార్ అద్వితీయమైన కీర్తిని సముపార్జించారు. దాదాపుగా 30 రామాయణాలను అధ్యయనం చేసి, రామ చరితను గొప్ప హరికథగా రూపొందించి దేశమంతా ధర్మ ప్రచారం చేశారు. వీరి కృషికి మెచ్చిన ప్రజానీకం వీరిని శ్రీమద్రామాయణ హరికథా రత్నాకర అన్న బిరుదుతో గౌరవించింది.



శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

గొప్ప గేయరచయిత, ఆకాశవాణి డైరెక్టర్‌గా వందలాది జనరంజక కార్యక్రమాల రూపకర్త. శ్రీ బాలంత్రపు వేంకట రావు గారి కుమారుడు, తన తండ్రి కీర్తిని చిరస్మరణీయం చేసిన ఉత్తమ పుత్రుడు



శ్రీ నేదునూరి కృష్ణమూర్తి (1927-2014)

పిఠాపురం కీర్తిని దేశ దేశాలలో వినిపించిన మహా కళాకారులు. తిరుమల తిరుపతి ఆస్థాన విద్వాంసులు, సంగీత కళానిధి, సంగీత చూడామణి వంటి ఎన్నో.. ఎన్నెన్నో... అత్యున్నతపురస్కారాల్ని అందుకున్న సంగీత సమ్రాట్.

శ్రీ దోమాడ చిట్టి అబ్బాయి (1933-2002)
కర్ణాటక శాస్త్రీయ సంగీతం నందు అగ్రశ్రేణి కళాకారులు. నాదస్వర వాయిద్యమునందు విఖ్యాతులు. సునాద ప్రవీణ, కళాప్రపూర్ణ, సింహాచల క్షేత్ర ఆస్థాన విద్వాంసులు.

శ్రీ ఆవంత్స సోమసుందర్
తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ ఆవంత్స సోమసుందర్, సంస్కృతాంధ్రాలలోనే కాక ఆంగ్లంలో కూడా గొప్ప పండితులు, గొప్ప రచయిత, గొప్ప వ్యాసకర్త, ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు కవులకు తరతరాల వారధి ఆయన

శ్రీ హరనాధ్
తెలుగు వారి అందాల కధానాయకుడు. సినీ రంగంలో ఎన్నో గొప్ప పాత్రలు అద్వితీయంగా పోషించిన మహానటుడు

శ్రీ పితాపురం నాగేశ్వరరావు
పితాపురాన్ని తన యింటి పేరుగా నిలుపుకున్న సుప్రసిద్ధ గాయకుడు, ఎన్నో మధురమైన గీతాలను, మరీ ముఖ్యంగా హాస్యరస ప్రధానమైన గీతాలను ఆలపించిన గాన గంధర్వుడు

లక్ష్యం ఉన్న విద్యార్థి ఎప్పుడు దారితప్పడు.

శ్రీ రేగిళ్ళ సుబ్బారావు

కర్నాటక, హిందూస్థానీ సంగీతాలలో అందెవేసిన చేయి, ముఖ్యంగా ఈల పాటతో ప్రసిద్ధులు. భారతదేశమంతా ఎన్నో ప్రదర్శనలిచ్చి శ్రోతలను పరవశింపచేశారు. విశ్వనాధ వారు వీరి ప్రక్రియను 'అంగుళీయ మురళి' అని శ్లాఘించారు.



శ్రీ మలిరెడ్డి బాబి

తెలుగు నాటక రంగానికి బహుముఖమైన సేవ చేసిన మహనీయుడు. మరీ ముఖ్యంగా గొప్ప నాటక దర్శకుడు. ఎందరో కళాకారులకు గురుతుల్యుడు

శ్రీ చెలికాని భావనరావు

ప్రముఖ సోషలిస్టు నాయకులు
శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ పునరుద్ధారకులు.



శ్రీ కురుమెళ్ళ వేంకటరావు

పిఠాపురం మహారాజుతో దూరతీరాల యాత్రలు చేసిన అదృష్టవంతుడు. తన కలం బలాన్ని, తన ఆలోచనామృతాన్ని తన ప్రభువుకే అంకితమిచ్చిన మాన్య పురుషుడు.



మాడభూషి భావనాచార్యులు

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, చరిత్రకారులు, రచయిత, మార్క్సిస్టు పరిశోధకులు, ప్రాచీన భారతీయ సంస్కృతి, పౌరాణిక గాథలు మానవేతిహాసాల పై పట్టున్న సామాజిక వివేచనాశీలి.



శ్రీ చంటి మాష్టారు

ప్రముఖ క్రీడా శిక్షకులు ఎంతోమంది యువతకు క్రీడాస్ఫూర్తిని కలిగించిన క్రియాశీలి.



ఓంకార స్వామీజీ

శాంతి ఆశ్రమం వ్యవస్థాపకులు. సర్వ మానవ సంక్షేమం కొరకు కులమతాలు లేని సమాజం కోసం ఆధ్యాత్మికవాదిగా తనదైన మార్గంలో దేశదేశాల్లో కృషి చేసిన మానవతావాది.

ఉప్పులూరి సుబ్బారావు

ప్రముఖ కార్మిక నాయకులు, నిరంతర ఉద్యమశీలి, అట్టడుగు వర్గాల ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమించిన కమ్యూనిస్టు మేధావి.

సమయం విలువ తెలుసుకున్న విద్యార్థి విజేత అవుతాడు.

సహృదయ మిత్రమండలి- ఒక బంధం... ఒక విశ్వాసం.... పాతికేళ్ల అద్భుత ప్రయాణం

చీకటిని తిడుతూ కూర్చోవడం కన్నా చిరుదివ్వెను వెలిగించడం మిన్న. మద్యపానం, ధూమపానం, డ్రగ్స్, వ్యభిచారం, జూదం వంటి సామాజిక రుగ్మతలతో అత్యధిక శాతం యువత పెడదారిన పడుతున్న పరిస్థితులను చూచి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని సహృదయులైన కొంతమంది స్నేహితుల సహాయంతో సామాజిక సేవకు కంకణం కట్టుకోవడమే సహృదయ మిత్రమండలి ఆవిర్భావానికి నాంది అని చెప్పవచ్చు.

2001వ సంవత్సరంలో గుజరాత్‌లో సంభవించిన భూకంపం కొన్ని వందల మంది ప్రాణాలు కోల్పోవడానికీ నిరాశ్రయులు అవడానికి కారణమైంది. వారికి మా వంతు సహాయం చేయాలనే భావనతో కొంతమంది మిత్రులం సూర్యనారాయణ, నేను(ఊటుకూరు కేశవరావు), సరిదే పద్మావతి, అనుపోజు వెంకటేశ్వరరావు, శ్రీ పెండ్యాల సూరిబాబు, శ్రీ చెక్కా సుబ్రహ్మణ్యం, శ్రీ కొండేపూడి శంకరరావు వంటి పెద్దలతో కలిసి స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీ కొండలరావు మరియు కొందరు హాస్టల్ విద్యార్థులతో కలసి వీధులలో తిరుగుతూ జోలె పట్టి గుజరాత్ భూకంప బాధితుల సహాయ నిధిని సేకరించి స్థానిక ఎమ్మార్వో గారి ద్వారా డిడి తీసి పంపించటం సహృదయ మిత్రమండలి ఆవిర్భావానికి నాంది.

ఆనాటి నుండి మంచి ఆలోచనలతో సామాజిక సేవ చేయాలనుకునే వారందరికీ మా సహృదయ మిత్రమండలి స్వాగతం పలుకుతూనే ఉంది.

విజయవంతంగా మొట్టమొదటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన తరువాత సామాజిక చైతన్యానికి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఒక ప్రత్యేక వేదిక అవసరమని మేము గుర్తించాము. “సొంత లాభం కొంత మానుక పొరుగు వారికి తోడ్పడవోయ్”, “పూని ఏదైనాను ఒక మేలు కూర్చి జనులకు చూపవోయ్” అన్న మహాకవి సంఘసంస్కర్త శ్రీ గురజాడ అప్పారావు గారి స్ఫూర్తితో “పరుల కోసం జీవించే వారి జీవితమే జీవితమనే” స్వామి వివేకానంద స్ఫూర్తితో “ఇనుప కండరాలు ఉక్కు నరాలు కలిగిన యువతే రేపటి భావి భారత నిర్మాతలని” ప్రవచించిన స్వామి వివేకానంద జయంతి జనవరి 12వ తారీకున 2001వ సంవత్సరంలో సహృదయ మిత్రమండలి స్థాపించడం జరిగినది.

ఈ సంస్థ స్పష్టంగా ప్రారంభంలోనే తన విధి విధానాలను ప్రకటించింది. సహృదయులైన మిత్రులందరూ ఈ సంస్థలో సభ్యులే. ఈ సంస్థ ఏ ఒక్కరి బ్రైన్ చైల్డ్ కాదు. ఈ సంస్థ నీది నాది మన అందరిదీ. కుల మత వర్గ స్త్రీ పురుష భేద భావం లేకుండా ఈ సమాజంలో అందరికీ చెందుతుంది. సభ్యుడు చేయవలసినదల్లా సహృదయం

కలిగి ఉండడం. తన అమూల్యమైన కాలంలో అతికొద్ది భాగాన్ని ఇతర సహృదయులతో కలిసి సమాజ సేవకు వినియోగించడానికి ముందుకు రావడం. ఎంతో ఉదాత్త ఆశయంతో స్థాపించబడిన మా సంస్థ నాటి నుండి నేటి వరకు 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్ని ఒడిదురుకులు ఎదురైనా ఎదుర్కొంటూ "పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం" పైపైకి అనే శ్రీశ్రీ భావజాల స్ఫూర్తితో మున్ముందుకు సాగుతోంది. ఈ ప్రస్థానం చిరకాలం ముందుకు సాగి స్వర్ణోత్సవాలను, వజ్రోత్సవాలను మరియు శతాబ్ది ఉత్సవాలను కూడా పూర్తి చేసుకోవాలని మా మిత్రమండలి సభ్యులందరి ఆకాంక్ష.

దేశంలోని సమస్యలన్నిటిని పరిష్కరిస్తామనే పూచీకత్తులు పుచ్చుకోకుండా, అవకాశం ఉన్నంత మేర మంచి చేయడానికి మా సంఘం ప్రయత్నించింది. ఆ క్రమంలో జరిగిన కొన్ని లోటుపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతున్నాం. శ్రీ ఎన్. సూర్యనారాయణ వ్యవస్థాపక అధ్యక్షులుగా మరియు శ్రీ ఊటుకూరు కేశవరావు ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల వారు వ్యవస్థాపక కార్యదర్శిగా 2001 జనవరి 12న ప్రారంభించబడిన సహృదయ మిత్రమండలికి రొటేషన్ పద్ధతిలో చాలామంది మిత్రులు ఆయా సమయాలలో సారథ్యం వహించారు. సంస్థ కార్యక్రమాలను భుజాలకు ఎత్తుకొని మోసారు. వారందరికీ సహృదయ శుభాకాంక్షలు, సహృదయ మిత్రమండలి స్థాపించిన కొత్తలో అతి తక్కువ మంది సభ్యులతో, సభ్యుల వ్యక్తిగత విరాళాలతోనే అవకాశం ఉన్నంతలో సేవా కార్యక్రమాలను ముందుకు నడిపించాము. బయట వారి నుండి విరాళాలు సేకరిస్తే లేనిపోని అవినీతి మైల అంటుతుందనే భయంతో ప్రారంభ సంవత్సరాలలో మేమెవరమూ బయట విరాళాల జోలికి పోలేదు. మా సొంత పాకెట్ మనీనే మిత్రమండలి కార్యక్రమాలకు స్వచ్ఛందంగా ఖర్చుపెట్టి కార్యక్రమాలను నడిపించాము.

ఒక సంఘం పేరు చెప్పగానే అందులోని సభ్యులు ఎలాంటి వారు అనే ప్రశ్న వెంటనే వస్తుంది. భావ సారూప్యం కలిగిన వ్యక్తులు ఈ సంస్థలో సభ్యులుగా ఉంటారు. మహాకవి గురజాడ చెప్పినట్లు "మతం వేరైతే నేమోయ్ మనసులు ఒకటై మనుషులు ఉండాలని మంచి చెడ్డలు మనుషులందున ఎంచి చూడగ రెండే కులములు" అని భావించేవారు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. సంస్థ కార్యక్రమాలలో భాగంగా మరుగున పడిన స్వాతంత్ర్య సమరయోధుల, సంఘసంస్కర్తల జయంతి, వర్ధంతులను సెలిబ్రేట్ చేసి వారి యొక్క జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వము, చిత్రలేఖనము వంటి పోటీలను నిర్వహించి, మహానుభావుల జీవితాలను వారు చేసిన త్యాగాలను తెలియజేసి, యువతను చైతన్యవంతులను చేయడంలో కొంతవరకు సహృదయ మిత్రమండలి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిందని ధైర్యంగా చెప్పవచ్చు.

సహృదయ మిత్రమండలి కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభ దశాబ్దంలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా మెదడు వాపు వ్యాధి వంటి సీజనల్ వ్యాధుల నుండి చిన్నారులను రక్షించాలనే సదాశయంతో జిల్లా వైద్య

ఆరోగ్యశాఖ వారి నుండి సేకరించిన బెలడోనా మాత్రలను మెదడు వాపు వ్యాధికి ఎక్కువగా గురయ్యే పిల్లల సంరక్షణ కోసం ఇంటింటికి తిరిగి, మైక్‌లో మాత్రలు వేసుకునే విధానాన్ని వివరిస్తూ పంచడం మాకెంతో సంతృప్తినిచ్చే కార్యక్రమము. ప్రతి ఏటా క్రమం తప్పకుండా మహాశివరాత్రి తీర్థంలో వివిధ సామాజిక రుగ్మతలపై యువతను చైతన్యవంతులను చేసే నిమిత్తం సహృదయ మిత్రమండలి స్టాల్‌ను స్థానిక పోలీసువారు మరియు పెద్దలతో ప్రారంభించి శివరాత్రి మూడు రోజులు యువత మద్యం బారిన పడొద్దని, ఈ వ్యసనం యువతను తప్పుదారి పట్టిస్తుందని, ఎయిడ్స్ వంటి వ్యాధులు ప్రబలి కుటుంబాలు సర్వనాశనం అవుతాయని కరపత్రాల ద్వారా, గొంతెత్తి గేయరూపంలో ఎయిడ్స్ వ్యాధి, ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని యువతను చైతన్యవంతులను చేయడం మాకు అత్యంత సంతృప్తినిచ్చే సేవా కార్యక్రమాల్లో ఒకటి.

ఆనాటి నుండి ఈనాటి వరకు శివరాత్రి తీర్థంలో స్టాల్‌ను పెట్టి కరపత్రాల ద్వారా సామాజిక రుగ్మతలపై పోరాటం చేస్తూనే ఉన్నాము. స్వామి వివేకానంద జయంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వాతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ వంటి దేశభక్తుల జయంతి సందర్భంగా యువతను చైతన్యవంతులను చేయడం సామాజిక సేవ వైపు వారిని ప్రోత్సహించటం మా సంఘ కార్యకలాపాలలో ఒక భాగం.

ఇకపై కూడా ప్రజలకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలను ముందుకు తీసుకుని వస్తాము. మా సంఘం "చట్టపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడువలెనోయ్" అన్న గురజాడ జయంతిని విద్యార్థుల మధ్య జరుపుతోంది. కాలానుగుణంగా సతీష్, పావని వంటి యువత వచ్చి చేరడంతో సహజంగానే మా సంఘ కార్యకలాపాలలో కొంత మార్పు కనబడినది. ఆ సమయంలో కొంతకాలం శ్రీ టి ఎల్ నరసింహారావు అధ్యక్షులుగా మా సంఘ కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. నేను ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రదేశాలకు ట్రాన్స్ఫర్ పై వెళ్లడం వలన ప్రారంభ సంవత్సరాలలో చేసినంత ఉధృతంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం సాధ్యం కాలేదు. అయినప్పటికీ సహృదయ మిత్రమండలి స్ఫూర్తి నా నరనరాల్లో ఉంది.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అనే రాయప్రోలు వారి స్ఫూర్తితో సగర్వంగా నేను పని చేసిన ఆయా ప్రదేశాలలో మా సహృదయ మిత్రమండలి గొప్పతనాన్ని, చేసిన సేవలను వారికి తెలియజేయడం నాకు గొప్ప అనుభూతినిచ్చింది. ఏదేమైనప్పటికీ ఎక్కడున్నా శివరాత్రి కార్యక్రమానికి హాజరవడం తప్పనిసరి. ఇదొక ప్రత్యేక అనుభవం.

సహృదయ మిత్రమండలి 25ఏళ్ళ ప్రస్థానంలో ఎందరో మిత్రులు చేయి చేయి కలిపి సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. కొందరు మిత్రులు వ్యక్తిగత, కుటుంబ కారణాలతో దూరంగా ఉన్నప్పటికీ వారు ఎప్పటికీ మా సహృదయ మిత్రులే. మద్యపాన వ్యతిరేక ఉద్యమం మొదలుకొని మహాశివరాత్రి వ్యసన వ్యతిరేక స్టాల్ ప్రచార ఉద్యమం వరకు, స్వామి వివేకానంద జయంతి నుండి బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వరకు, అల్లూరి

సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ త్యాగాన్ని స్మరించేంతవరకు, భగత్ సింగ్ బలిదానాన్ని కొనియాడుతూ, గాంధీ పోరాటపటిమను స్వీకరించడం దాకా, గురజాడ అడుగుజాడలను వెంబడిస్తూనే కందుకూరి దారిలో కదిలేంతవరకు, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుంటూనే మదర్ థెరీసా సేవను అభిమానించటం ఇవన్నీ సహృదయ మిత్రమండలి కార్యక్రమాలలో భాగాలే.

చాలా గ్రామాల నుండి మా కార్యక్రమాలను చూసిన మిత్రులు, మిత్రమండలి ప్రభావంతో తమ వ్యసనాలను వదిలేశామని వారి పిల్లలు కూడా ఎంతో బాగుపడ్డారని తెలియజేయడం మాకు ఒక అనిర్వచనీయమైన అనుభూతి. ఈ మధ్యకాలంలో సహృదయ మిత్రమండలి చేపట్టిన సమ్మర్ శిక్షణా తరగతులను మరియు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులను దిగ్విజయంగా నిర్వహించడంలో శ్రీనివాస్ మాస్టార్ పాత్ర చాలా గొప్పది. నవ చైతన్య శ్రీనివాస్, భాష్యం స్కూల్ కరస్పాండెంట్ వేణు, కార్యదర్శి సతీష్, అతడి సహధర్మచారిణి పావనిల రాకతో ఒకరకంగా మా సహృదయ మిత్రమండలి కొత్తకళను సంతరించుకుంది. అనుభవం కలిగిన పెద్దల సూచనలను తీసుకుని క్రొత్తతరం తమదైన శైలిలో మిత్ర మండలి కార్యక్రమాలను ఇకముందు కూడా అత్యంత ప్రభావంతంగా నడిపిస్తారనే ధీమా నాలాంటి పెద్దలందరిలో ఉంది. గత పాతిక సంవత్సరాలుగా బాడీ మైండ్ అండ్ సోల్‌ను సహృదయ మిత్రమండలి కార్యక్రమాలకు వెచ్చించిన మా సహృదయ మిత్రులందరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు.

పేరు ముఖ్యం కాదు, వారు చేసిన పనులు మాత్రమే, అలా ఎవరి పేరు అయినా విస్మరిస్తే అన్యధా భావించవద్దని వినమ్రంగా తెలియజేస్తూ గత 25 సంవత్సరాలుగా ఎట్టి పరిస్థితులలో కూడా సంస్థకు దూరం అవ్వకుండా కర్త కర్మ క్రియ అన్ని తానై సంస్థ ఒడిదుడుకులను ఎదుర్కొనే సమయంలో కూడా అన్ని తానై నిలిచిన ప్రియ మిత్రులు వ్యవస్థాపక అధ్యక్షులు సూర్యనారాయణ గారికి సహృదయ శుభాకాంక్షలు, సహృదయ మిత్రమండలిలో సభ్యులుగా చేరి దీక్షతో పట్టుదలతో అధ్యక్షులుగా సంస్థ కార్యకలాపాలను దిగ్విజయంగా ముందుకు నడిపించిన రిటైర్డ్ డి.ఎస్.డబ్ల్యు.ఓ. శ్రీ అప్పారావు గారికి శుభాభినందనలు. అదేవిధంగా సంస్థ ప్రస్తుత అధ్యక్షుడు, నా ఏకలవ్య శిష్యుడు నవచైతన్య శ్రీనివాస్ మరియు నా ప్రియ శిష్యుడు భాష్యం వేణులకు శుభాభినందనలు. సంస్థ కార్యక్రమాలు నూతన ఒరవడితో కలకాలం ఇలాగే ముందుకు సాగాలని ఆశిస్తూ

మీ

ఊటుకూరు కేశవరావు,

ప్రిన్సిపాల్, ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్.

జూనియర్ కళాశాల, పిఠాపురం

"మనకు కావలసినది మూడు అవి ప్రేమించే హృదయం, భావించే మనసు.. పనిచేసే చెయ్యి"

ఆదర్శ ఉపాధ్యాయురాలు

శ్రీమతి కోరుమిల్లి (ఊటుకూరు) లక్ష్మీదేవికి అశ్రునివాళి.

శ్రీమతి కోరుమిల్లి లక్ష్మీదేవి 20 జూన్ 1966 సంవత్సరంలో శ్రీ కోరుమిల్లి సన్యాసిరాజు కృష్ణవేణి దంపతులకు ఐదవ సంతానంగా జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లుగా చిన్ననాటి నుండే చదువుల యెడ అత్యంత శ్రద్ధ కనబరుస్తూ సహచర విద్యార్థుల అభిమానాన్ని పొందుతూ ఎల్లప్పుడు తరగతిలో ప్రథములుగా శ్రీమతి లక్ష్మీదేవి కేజీ నుండి పీజీ వరకు నిలుస్తూ డిస్టింక్షన్ లోనే పాస్ అయ్యేవారు. ఆమెతో పోటీపడి చదివిన ఎంతో మంది విద్యార్థులు లక్ష్మీదేవితో పోటీపడటం అంత తేలికకాదని సవినయంగా ఒప్పుకునేవారు. సామర్లకోట లోని విటిగర్ గర్ల్స్ హైస్కూల్లో ఆమె తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రారంభించి 10వ తరగతి వరకు అదే పాఠశాలలో చదివి పట్టణంలోనే అత్యధిక మార్కులు సాధించి తన పాఠశాలకు గురువులకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టారు. సాధారణంగా క్రిస్టియన్ మిషనరీ స్కూళ్లలో ఉండే క్రమశిక్షణ, దైవభక్తి, భూతదయ, పెద్దలయెడల వినయవిధేయతలు అడుగడుగునా ఆమెలో ప్రతిబింబిస్తుండేవి. శ్రీమతి లక్ష్మీదేవి 1981వ సంవత్సరంలో సామర్లకోట టౌన్ టాపర్ గా ఎస్ ఎస్ సి పూర్తి చేసి ఇంటర్మీడియట్ బైపిసిలో సామర్లకోట జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్ లో కూడా ఆమె కాలేజీ టాపర్. అదేవిధంగా బీఎస్సీ డిగ్రీ పెద్దాపురం మహారాణి కళాశాలలో క్లాస్ టాపర్ గా నిలిచి పూర్తి చేసుకున్నారు. అనంతరము రాజమహేంద్రవరం అద్దేపల్లి మహాలక్ష్మి బీఈడీ కాలేజీ నుంచి ఉపాధ్యాయ పట్టా పొందారు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ కమిషన్ ద్వారా రాష్ట్రస్థాయిలో అత్యున్నత ర్యాంక్ తో వీ.డి.ఓ.గా శ్రీమతి లక్ష్మీదేవి ప్రత్తిపాడు మండల ఆఫీసులో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. సహజంగా సంప్రదాయ సిద్ధమైన కుటుంబంలో జన్మించటం వలన వీడివో పదవిలో ఉండే ఒత్తిడిని తట్టుకోలేక అదేవిధంగా తను సెలెక్ట్ అయిన ఎండిఓ పదవిని కూడా త్యజించి, తనకు అత్యంత ప్రీతి పాత్రమైన ఉపాధ్యాయ జీవితంలోకి డిఎస్సి ద్వారా సెలెక్ట్ అయి 1989 సెప్టెంబర్ లో కిర్లంపూడి మండలంలోని కొత్తపేట ఆఫ్ రాజుపాలెం మండల పరిషత్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయినిగా తన ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆమెలో చాలా ఎక్కువ. పేద విద్యార్థినీ, విద్యార్థుల ఎడల ఆమె ఎంతో ప్రేమను చూపించేవారు. కుల,మత వర్గ లింగ విచక్షణ లేకుండా అవసరమైన పిల్లలందరికీ వస్తు రూపేణా ధన రూపేణా సహాయం అందించేవారు. తన ఉదాత్త భావాలకు సరిపోయే ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అని భావించి ఆ సంఘ నీతి, నియమాలకు కట్టుబడి యుటిఎఫ్ లైఫ్ టైం మెంబర్ గా ఆమె తన చివరి శ్వాస విడిచేంతవరకు యుటిఎఫ్ లక్ష్మీదేవిగా పేరు గడించారు. సమయపాలన విషయంలో, ఖచ్చితత్వం విషయంలో ఆమె రాజీ పడేవారు కాదు. సమాజంలో ప్రబలుతున్న సాంఘిక దురాచారాలపై, వ్యక్తిగత ద్వేషాలపై ఆమె గొంతెత్తి ఖండిస్తూ తన వాణిని వినిపించేవారు. ఒకరకంగా శ్రీమతి లక్ష్మీదేవి సంఘసంస్కర్త,ఆదర్శ ఉపాధ్యాయురాలు

"పరిస్థితులు అనేవి మనిషి ఆధీనంలో లేనివి, కానీ మనిషి ప్రవర్తన మాత్రం అతని స్వశక్తిపైనే ఆధారపడి ఉంటుంది.కాబట్టి ఎవరి ప్రవర్తనకు వారే బాధ్యులు."

అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఉపాధ్యాయురాలిగా పిల్లల శారీరక,ఆర్థిక,మానసిక కుటుంబపరమైన సమస్యలను అర్థం చేసుకొని వారికి సొంత తల్లి మాదిరిగా అండగా నిలిచి చిన్ననాటి నుండి విద్యార్థులు మంచి పౌరులుగా తీర్చిదిద్దబడేలా ఆవిడ కృషి చేశారు. లక్ష్మీదేవి గారి వద్ద చదువుకున్న వేలాదిమంది విద్యార్థులు ఆమె ఇచ్చిన స్ఫూర్తితో అనేక రంగాలలో రాణిస్తున్నారు. శ్రీమతి లక్ష్మీదేవి ఆంగ్ల, ఆంధ్ర భాషలలో కూడా రచనలు చేసేవారు. తన రచనల ద్వారా ఎంతోమంది విద్యార్థులు ప్రభావితమై రచనా వ్యాసంగంలోనికి అడుగు పెట్టారు. గృహహింస, వరకట్నదురాచారము, తాగుడు, వ్యభిచారము వంటి దుర్వ్యసనాలపై ఆమె నిర్మొహమాటంగా తన గళాన్ని విప్పేవారు. శ్రీమతి లక్ష్మీదేవి తన 34 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ జీవితంలో ఎక్కువ కాలాన్ని పిఠాపురం, కాకినాడ మరియు కిర్లంపూడి పాఠశాలలోనే గడిపారు. 2000 సంవత్సరంలో టీవీ9 ఛానల్ వారి నవీన ప్రోగ్రాంలో భాగంగా గృహహింసపై వారు రాష్ట్ర స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ పోటీలలో పాల్గొని లక్ష్మీదేవి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు. టీవీ9 యాజమాన్యం శ్రీమతి లక్ష్మీదేవిని తమ ఛానల్ కి ఆహ్వానించి, సన్మానించి మెడల్,శాలువ మరియు నగదు బహుమతితో సత్కరించారు. సహజంగా విశాల భావాలు కలిగిన శ్రీమతి లక్ష్మీదేవికి ఈ అనుభవం ఎంతో సంతృప్తినిచ్చింది. శ్రీమతి లక్ష్మీదేవి భర్త శ్రీ ఊటుకూరు కేశవరావు సర్వీస్ కమిషన్ ద్వారా సెలెక్ట్ అయి పిఠాపురం ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యారు. వీరి వివాహం 1992 ఆగస్టు 16న అన్నవరం కొండపై జరిగింది. శ్రీమతి లక్ష్మీదేవి గారి నిజాయితీ, నిబద్ధత, సమయపాలన, సంఘసంస్కరణ అభిలాషను ఆవిడ భర్త శ్రీ కేశవరావు ప్రోత్సహించేవారు. ఈ ప్రోత్సాహంతో ఆమె ఆదర్శ ఉపాధ్యాయినిగా ఏ రకమైన శారీరక మానసిక ఒత్తిడి లేకుండా మనస్ఫూర్తిగా విధులను నిర్వహించేవారు. దురదృష్టవశాత్తు శ్రీమతి కోరుమిల్లి లక్ష్మీదేవి జులై 5, 2023న క్యాన్సర్ తో తాము స్థిరపడిన పిఠాపురం పట్టణంలోనే తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలిసిన వందలాది మంది ఆమె విద్యార్థులు బోరున విలపించటం అతిశయోక్తి కాదు. ఆమె విద్యార్థులకు ఎంత ఇష్టమైన ఉపాధ్యాయినో దీనిని బట్టి మనకు తెలుస్తుంది. సహజంగా సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ, చాందస భావాలను విడనాడి ఏ రకమైన కుల,మత, వర్గ విచక్షణ లేకుండా పిల్లలందరినీ సమదృష్టితో ఆమె చూసేవారు. ఇంకా ఆరు సంవత్సరాలు ఉద్యోగ జీవితం మిగిలి ఉండగానే ఆమె పరమపదించటం అత్యంత బాధాకరం.

ఏదో ఒక రోజు ప్రతి మనిషి ఈ బాహ్య ప్రపంచాన్ని విడిచిపెట్టవలసిందే. మానవ జన్మ యొక్క సార్థకతను అర్థం చేసుకున్న అతి కొద్దిమంది స్వార్థపూరిత భావాలను విడనాడి అమరజీవులవుతారు. ఆ రకంగా శ్రీమతి లక్ష్మీదేవి అమరజీవి. భౌతికంగా ఆమె మన మధ్య లేనప్పటికీ ఆమె విడిచి వెళ్లిన నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, దైవభక్తి,దేశభక్తి, వృత్తిపరమైన అంకితభావము అందరికీ ఆచరణాంశాలే. తల్లిదండ్రులు సంస్కారవంతులైతే సహజంగా ఆ సంస్కారం వారి పిల్లలకు కూడా అబ్బుతుంది. ముత్యాల వంటి కవల అమ్మాయిలు శ్రీమతి ఊటుకూరు మోహన మాధురి, కుమారి ఊటుకూరు శ్యామసింధూరి తల్లిదండ్రులకు తగిన పిల్లలుగా సంస్కారంతో కూడిన ఉన్నత విద్యావంతులు. శ్రీమతి మోహన మాధురి విజయవాడలోని సి.బి.ఐ. స్పెషల్ కోర్టులో జూనియర్ అకౌంటెంట్ గా పని చేస్తున్నారు. ఆమె భర్త శ్రీ చివుకుల సాయిచరణ్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ గా పని

చేస్తున్నారు. వారి పుత్రసంతానం అభినవకశ్యప్(సుబ్బు) కు రెండు సంవత్సరాలు. కుమారి శ్యామసింధూరి రంగరాయ మెడికల్ కళాశాల నుంచి ప్రథమ శ్రేణిలో పాసై ఎంబిబిఎస్ పట్టాను పొందారు. సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజయం సాధించి అఖిలభారత సర్వీసులో ఐఏఎస్ గా సేవలు అందించాలని ఆమె చిరకాల వాంఛ. అందులో భాగంగానే ఢిల్లీ రాజస్థాన్ సరిహద్దులో గల ఆర్వార్ పట్టణంలో ఐఏఎస్ అకాడమీలో ఆమె శిక్షణ పొందుతున్నారు. శ్రీమతి లక్ష్మీదేవి పిల్లల యెడల అత్యంత శ్రద్ధను కనబరిచి భర్త కేశవరావు సమాజసేవంటూ తిరుగుతునప్పటికీ ఒంటిచేత్తో ఇటు కుటుంబాన్ని నడుపుతూ అటు టీచరుగా మంచి పేరు తెచ్చుకుంటూ పిల్లలను ఎంతో ప్రయోజకుల్ని చేశారు. డాక్టర్ సింధూరి చిరకాల వాంఛ నెరవేరడానికి కావలసిన సహకారాన్ని తండ్రి అందిస్తున్నారు. శ్రీమతి లక్ష్మీదేవి దివ్య ఆశీస్సులతో ఆవిడ కుటుంబము చిరకాలం సుఖశాంతులతో విరాజిల్లుతుందని ఆశిద్దాం....

-మిత్రబృందం

ఊటుకూరి శ్యామ సింధూరి,
మోహన మాధురి

నా పేరు పెనుగొండ కొండలరావు. నేను పిఠాపురం ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహంలో వసతి గృహ సంక్షేమ అధికారిగా పని చేయు సమయంలో సుధాకర్ మాస్టారు, సూర్యనారాయణ, కేశవరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిత్రమండలిలో పాల్గొనడం జరిగింది. గుజరాత్‌లో జరిగిన భూకంప బాధితులకు సహాయ సహకారములు అందించడానికి వసతి గృహ విద్యార్థులు మరియు మిత్రమండలి సభ్యులు కలిసి విరాళాలు అప్పటి జిల్లా కలెక్టర్ గారికి అందజేయడం జరిగింది. ఏర్పడి 25 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా సహృదయంతో చేసే కార్యక్రమాలు ఇంకా బాగా అభివృద్ధి చెంది శతజయంతి ఉత్సవాలు జరుపుకునే స్థాయికి చేరాలని సభ్యులను అందర్నీ కోరుచున్నాను. నా వంతు నేను నా శక్తికి తగ్గ అన్ని విధములుగా సహృదయ మిత్రమండలికి సహాయ సహకారములు అందిస్తానని తెలియజేస్తున్నాను. గత 25 సంవత్సరములుగా సామాజిక సేవలతో అత్యంత చేరువైన సందర్భంలో అందులకు గుర్తుగా విడుదల అగుచున్న సావనీర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు.

- కె. కొండలరావు, రిటైర్డ్ హాస్టల్ వార్డెన్

ప్రతి సంవత్సరం తనదైన శైలిలో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎందరో విద్యార్థులను, కవులను, గాయకులను ప్రోత్సహిస్తున్న సహృదయ మిత్రమండలి వారికి నా హృదయపూర్వక అభినందనలు. వేసవి శిక్షణ శిబిరముల కార్యక్రమాల్లో విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను పెంపొందించే లైఫ్ స్కిల్స్ మెచ్చదగినవి. 25 ఏళ్ళ ప్రస్థానం సందర్భంగా మిత్రమండలి యాజమాన్యం అందరికీ నా హృదయపూర్వక శుభాభినందనలు.

- చల్లా ఉమా రాజ మంగతాయారు

మనిషి పతనానికైనా, పాపానికైనా కారణం భయమే.

రజనీ తలపులలో పిఠాపురం మెరుపులు



కళలకు కాణాచి అయిన పిఠాపురంలో సంగీత సాహిత్యాలలో ఎంతో పేరెన్నికగన్న ఎందరెందరో మహానుభావులు వుండేవారు. అందులో ప్రముఖ వాగ్గేయకారుడు, లలిత సంగీత చక్రవర్తి, కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీ కాంతరావు గారు ఒకరు. వీరు పిఠాపురం వెంకట పార్వతీశ కవులలో ఒకరైన బాలాంత్రపు వెంకట్రావుగారి రెండవ కుమారుడు. 'రజనీ'గా చాలా ప్రఖ్యాతులు, ఆల్ ఇండియా రేడియోలో స్టేషన్ డైరెక్టరుగా పనిచేసి ఆకాశవాణికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు చేకూర్చారు. వీరు మంచి కవి, గాన గంధర్వులు కూడా, అద్భుతమైన రేడియో నాటికలు, యక్షగానములు, లలిత గేయాలు వ్రాసి, ఆయనే పాడేవారు. దేవలపల్లి, శ్రీశ్రీ, బుచ్చిబాబు, కందుకూరి, గోపిచంద్, రాయప్రోలు, విశ్వనాథ వగైరా ఉద్దండులతో రచనలు గావించి ఆకాశవాణిలో ప్రసారం గావించేవారు. బాలమురళీ, సాలూరి రాజేశ్వరరావు, గోపాలరత్నం, ఓలేటి, చివరికి ఘంటసాలతో కూడా రేడియోలో పాడించిన ఘనత వీరిది. వీరు చేసిన "కొండ నుండి కడలిదాకా" సంగీత రూపకానికి జపాన్ వారి నుండి అంతర్జాతీయ బహుమతి లభించింది. వీరు రిటైర్‌మెంట్ తరువాత తిరుమల తిరుపతి దేవస్థానములో పనిచేసి అన్నమయ కీర్తనలపై పరిశోధన గావించి, వాటికి స్వరరచనలు గావించారు. అలానే క్షేత్రయ్య పదాలపై కూడా కృషి చేసారు.

వీరి జీవితంలోని కొన్ని ప్రముఖ ఘట్టాలతో 'రజనీ ఆత్మకథా విభావరి' అనే పుస్తకం ప్రచురించారు. మన పిఠాపురంలో ఆనాటి సాహితీ ప్రముఖుల ఇళ్ల వివరాలు, పిఠాపురం రాజా సూర్యారావు బహుదూర్, వారి కుమారుడు యువరాజా గంగాధర రామారావు గారితో మద్రాసులోని వారి అనుభవాలు చాలా ఆసక్తికరంగా వ్రాసారు. వాటిని యధాతథంగా మీముందు వుంచి, ఆ రోజులలోకి మీ మనసును తోడుకుని పోయి ఆనందపరచడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. **– సంపాదకులు**

<u>అలనాటి పిఠాపురం కొందరు కవిపండితులు</u>

పిఠాపురం రైల్వే స్టేషన్ నుంచి ఊళ్లోకి, కోటగుమ్మానికి తీసుకెళ్లే రాజబాటకి ఎడమవైపున అప్పటి రాజావారి ఆస్థానకవీశ్వరులు జంట కవులైన ఓలేటి వెంకటరామశాస్త్రి గారిదీ, వేదుల రామకృష్ణ కవిగారిదీ మేడలున్నాయి. ఆ మేడలకి ఎదురుగా దక్షిణంగా సామర్లకోట రైలు దారికి సమాంతరంగా అర్థమైలు నడిస్తే ఒక మసీదూ, దాని పక్క ఉమర్ ఆలీషా కవిగారి మేడా వస్తాయి. 'ఉమ్రాలీషాగారు, కుక్కుటేశ్వర మాధవస్వాముల రథాలుండే మందబయలికి ఎదుట కావ్యకర్త. ధారళంగా ధారాశుద్ధితో సంస్కృతాంధ్రాలలో కవిత చెప్పగలిగే కవీశ్వరుడు. ఉర్దూ, అరబీ, పారశీ, ఆంగ్లభాషలు క్షుణ్ణంగా చదివినవారు. 1934 నుంచి 45 వరకు ఢిల్లీ లోని కేంద్రశాసనసభలో సభ్యుడు.

"మా తాతయు మా తండ్రియు ఖ్యాతిని అఖైలలీ మహాగురువర వి
ద్యాతత్త్వము నేర్పిరి తద్రీతుల వివరింతు యోగరీతులు తెలియన్"

అనే పద్యంలో చెప్పినట్లు, ఉమ్రాలీషాగారింట మూడు నాలుగు తరాలుగా అఖైలలీ మహాగురువుల పరంపరలో సూఫీ వేదాంతమును బోధించే గురుపీఠాధిపతులు. వీరి శిష్యవర్గంలో ముస్లిములే కాక అమలాపురం ప్రాంతాలకు చెందిన శ్రోత్రియ కుటుంబాలకు చెందిన బ్రాహ్మలు కూడా ఉండేవారు. ఉమరఖయ్యాం (పారశీకకవి) రుబాయిలకు కవిగారి తెలుగు అనువాదం, చంద్రగుప్త, అనసూయాదేవి, కళ అనే మూడు నాటకాలు (సూఫీ) తత్త్వ సందేశము కీర్తనలు, స్వర్గమాత అనే శీర్షికను కందార్థదరువులు, ఉమరాలీషా గారి తెలుగు రచనలు. వీరింటికెదురుగా ఉన్న రథాల మందబయలులో కుక్కుటేశ్వరస్వామి, మాధవ స్వాముల రథోత్సవం రాత్రులలో తెల్లవార్లూ పెండ్యాల సత్యభామగారి (భామాకలాప) భాగవతమేళ ప్రదర్శన జరుగుతూండేది. ఏటేటా! ఆ ప్రభావమే ఆయనచేత తత్త్వసందేశాన్ని కీర్తనలుగాను, స్వర్గమాత కందార్థదరువులనూ రచింపచేసిందని అనుకుంటాను. సూఫీతత్త్వాన్ని గురించిన ఆయన పద్యం ఒకటి.

కనదుల్ పాదరసంబు తాత్త్వికుడు బంగారంబు గావించిన
ట్లనుమానాస్పదమై వినాశకరమై యల్లాడు జీవుండు బ్ర
హ్మముగా మార్చెడు త్రోవ జూపితి నిధి ధ్యాసంబు సంధించి మీ
కనులన్ విప్పుడు శూన్యమందు హరి సంకాశంబు సంధిల్లెడున్!

కవి గారి ఇంటికెదురుగా పోయే బస్సు దారీ, దానిని దాటి ఇంకాస్త పైకి పోతే సామర్లకోట పోయే రైలుదారి దాటి అవతల చిత్రాడ వైపు వెళ్లే దారిలో పక్క పొలాల్లో ఉమ్రాలీషా గారి ముద్రాక్షరశాల ఉండేది. అప్పుడు ఊరికి అవతల ఈ ప్రెస్సూ, ఊరి లోపల కోటవారి వీధిని వి.ఎమ్.ఆర్ ప్రెస్సూ (నడకుదుటి వీరరాజుగారి విద్వజ్జన మనోరంజని), రెండూ పని చేస్తుండేవి. కంపోజిటర్లూ, మొదలైన కార్యకర్తలు కొందరు కొన్నేళ్ళు ఒక ప్రెస్సులోను, కొన్నేళ్ళు మరొక దానిలోను పనిచేయడం ఉండేది. హనుమంతరావు అనే మా పెత్తల్లి కొడుకుతో నా చిన్నతనంలో కొన్నిసార్లు ఆ ప్రెస్సుకీ, కొన్నిసార్లు ఈ ప్రెస్సుకీ వెళ్లాను. వీరరాజుగారి ప్రెస్సులో కంపోజిటర్గా పనిచేసి క్రమంగా సాహిత్యపరిశోధనాకావ్య పరిశీలనలో వారి వద్దా, గురువుగారనబడే ఆస్థానకవిగారైన ఓలేటి వేంకటరామశాస్త్రిగారి వద్దా ఆశీస్సులందిన దాసరి లక్ష్మణస్వామి గారు, వర్ణన రత్నాకరము అనే నాలుగు సంపుటాలలో తెలుగు మహాకావ్య ప్రబంధాల నుంచి వివిధాంశాలపై కావ్య ఖండికలను సంకలనం చేసి ప్రకటించారు ఆ రోజులలోనే.

రైలు స్టేషన్కి ఎదురుగా తూర్పు పడమరలుగా పోయే రోడ్డు మీదున్న పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి ఇంటికి పక్క సందు స్టువర్ట్పేటకి తీసుకువెడుతుంది. ఆ పేటలో వేదకాలం నాటి భారతీయ వ్యవసాయచరిత్రను, (ప్రసిద్ధమైన) మహాభారత విమర్శనము, ఉత్తర భారత కథా పరీక్షిచ్చరిత్రా అనే గ్రంథాలను రచించిన ఉద్దండ పండితుడు మా గురువుగారు హైస్కూలు పండితులు పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారిల్లుండేది. ఈయన అనేక ఉత్తర దక్షిణ - భారత విద్వాంసుల, పాశ్చాత్య విద్వాంసుల పరిశోధనలను పరిశీలించి మహాభారత కథాకాలమునూ, రచనా కాలమునూ ప్రతి ప్రధానపాత్ర స్వభావాది విశేషాలను ఆధునిక దృక్పథంతో తర్కించి,

భారత కాలము నాటి సాంఘికాదిపరిస్థితులపై తన అభిప్రాయాలను నిష్కర్షగా ప్రకటించి ఆనాటి సాంప్రదాయిక విద్వాంసులైన కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారి వంటి వారితో వివాదాలకూ, కోర్టు కేసులకూ దిగి ఢీకొన్నవారు. ఇక కోటవారి వీధిన చీమలకొండ అద్వైత పరబ్రహ్మశాస్త్రి గారనే మా మరో గురువు గారు సంస్కృతాంధ్ర పండితులుండేవారు. ఆయన సంగీతప్రియుడు. వివిధ రాగాలలో పద్యాలను పాడనేర్చినవారు, మా తరగతిలో ఆయన నా చేత ఆ పని చేయించి ఆనందించేవారు.

కొత్తపేటలో మా ఇంటికి ఎడమపక్క నందు రాజావారి కుమార్తెలకూ, ఘోషా స్కూలులో ఉన్న మహిళలకూ తెలుగు సంస్కృతాలు నేర్పే ఉపాధ్యాయిని జూలూరి తులశమ్మగారు కాపురముండేవారని వ్రాశానే, ఆవిడ కాపురం ఉండే ఇల్లు కొటికలపూడి సీతమ్మగారిది. ఆవిడ ఒక కవయిత్రి. రాణీ గారు దసరాలకు కోటలో ఏర్పాటు చేసే మహిళా సమావేశాలలో వీరిద్దరూ, జ్ఞానమాంబగారనే మరో విదూషీమణి ఉపన్యాసాలిస్తుండేవారు.

మా మేనమామ దుగ్గిరాల పళ్ళంరాజు గారు, పానుగంటి వారి కుమారులు చిరంజీవిరావు, విజయరాఘవరావు, రమణరావుగార్లూ, కృష్ణశాస్త్రిగారి మేనల్లుళ్లు వింజమూరి శివరామరావు, వెలమకన్ని సుబ్బరాయశాస్త్రిగార్లు, మా పెత్తండ్రిగారి కుమారుడు బాలాంత్రపు సత్యనారాయణరావు, చాగంటి శేషయ్యగారి కుమారుడు భీమశంకరం వీరంతా సారస్వతమిత్రమండలిగా ఆనాడు సాహిత్య సేవ చేసే యువతరపు కవులు!

మా యింటికి ఎదురుగా దక్షిణోత్తరంగా సాగిపోయే రాచబాటను ది గ్రాండ్ నార్తరన్ ట్రంక్ రోడ్ అనేవారు. మా యింటికి కుడివైపున (ఉత్తరం) ఉండే దివానుగార్ల బంగళాలలో మొదటిదానిలో రఘుపతి వేంకటరత్నంనాయుడు గారుండేవారు. ఆయన వీరేశలింగం గారితో పాటు, సంఘసంస్కరణలోను, హరిజనోద్ధరణ కోసమూ పాటుపడిన ఆధునికాంధ్రనిర్మాతల్లో ఒకరు. బ్రహ్మసమాజానికీ, మహారాజా వారి కుమారులకూ, కుమార్తెలకూ గురువుగాను, కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాలు గాను, ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంలో కులపతిగానూ చేసి, కృతకృత్యులై, నిరంతర దైవధ్యాన నిరతులై దీనజనోద్ధరణకు దీక్షా దక్షులై బ్రహ్మర్షి అనిపించుకున్న మహనీయుడు ! హేమచంద్ర సర్కారు వంటి రాష్ట్రేతర అతిథులు మహారాజావారి ఆహ్వానంపైని పిఠాపురం వచ్చినపుడు, నాయుడుగారితో బస చేసి, మా యింటి ముందు నుంచి పోయే గుర్రపు సార్టులో కనబడేవారు !

1947-48 ప్రాంతం. మద్రాసు అడయార్లో 'గులాబి' పిఠాపురం మహారాజా బంగళాలో – ఆంధ్రమహిళా సభ బాలికా బృందం నృత్యనాటికలను ప్రదర్శిస్తున్నారు. ఆ నాటకాలలో అప్పటికి రేడియోలో నిలదొక్కుకున్న రజని సంగీత నాటకాలలో మేనకా విశ్వామిత్ర, సుభద్రార్జునీయం, మధురానగరీ గాథ నాట్యాచార్య కుల్కర్ణి శ్రీనివాస్, ఆచార్య సామ్రాజ్యం రమణారావుల దర్శకత్వంలో ప్రదర్శించారు. నాటకాల మధ్య విరామ సమయంలో చండీదాసు, శతపత్ర సుందరి, దివ్యజ్యోతి మొదలైన తన నాటకాల నుంచి గేయాలను రజని గానం చేశాడు. పక్క వాద్యాలున్నాయి. ఆ గానం అయ్యాక, మహారాజా వేదికపైకి వచ్చారు. నాట్యాచార్యుల పరిచయాలు, నర్తకీమణుల

పరిచయాలూ అయాక గాయక నేపథ్యానికి నన్ను 'మిస్టర్ రజనీకాంతరావు ఆఫ్ ఆల్ ఇండియా రేడియో' అని పరిచయం చేశారు. ఆ వెంటనే నాకూ మహారాజాకూ జరిగిన సంభాషణ నేనెన్నటికీ మరువలేను.

మహారాజా : డూయు కం ఫ్రం బెంగాల్ (మీరు బెంగాల్ నుండి వచ్చారా?)

నేను : లేదండీ, తెలుగు వాన్నేనండీ.

మహారాజా : ఏ జిల్లా ఏవూరు మీది?

నేను : తూర్పు గోదావరి, పిఠాపురమేనండి.

మహారాజా : మా పిఠాపురమే! పిఠాపురంలో ఎవరబ్బాయి మీరు?

నేను : బాలాంత్రపు వేంకటరావుగారి అబ్బాయినండీ. వేంకట పార్వతీశ్వరకవులలో వారు.

మహారాజా : మీరు పాడిన పాటలెవరు వ్రాశారు? కవనం చాలా బాగుంది. ఎక్కడ చదివారు?

నేను : నేనే వ్రాశానండీ, కాకినాడ కాలేజీలో చదివానండి, ఇంటర్, ఆంధ్ర యూనివర్శిటీలో ఎం.ఎ చదివానండీ

మహారాజా : తమ్మన్నశాస్త్రిగారి కుమారుడి దగ్గర మీరు చదివారా?

నేను : కృష్ణశాస్త్రిగారండీ. వారు మా గురువులేనండి.

మహారాజా : మీ కవిత్వం బాగా అర్థం అవుతుంది మీరు వారిలా భావకవిత్వం వ్రాయరా.. మీ నాన్నగారు పార్వతీశంగారూ వాళ్లు నిర్దుష్టంగా వ్రాస్తారు. బాగా అర్థం అవుద్ది.

నేను : చిత్తం. నాది గేయ కవిత్వం అండి.

ఆచార్య కులకర్ణి: మీరు దర్శించిన నృత్యనాటకాలు, తాను పాడిన పాటలూ ఆయన రచించినవేనండి.

మహారాజా : (ఐయామ్ సో మచ్ ప్లీజ్డ్ విత్ యువర్ పొయట్రీ అండ్ మ్యూజిక్). మీరు సంగీతం ఎక్కడ నేర్చుకున్నారు? మీ కవిత్వం సంగీతమూ నాకెంతో సంతోషం కలిగించాయి.

నేను : సంగమేశ్వర శాస్త్రిగారి శిష్యులు మండ కృష్ణమూర్తిగారు మా గురువులండీ.

మహారాజా : చాలా సంతోషం! కరపవారి కాలవపక్కని కాదూ మీ ఇల్లు. పిఠాపురంలో మా సెక్రటరీ నాగరాజుగారు వేంకట్రావుగారి అల్లుడు ఆయన ఢిల్లీ అల్ ఇండియా రేడియోలో వున్నారు కదా!

నేను : చిత్తం. ఇప్పుడాయన ఆంధ్రప్రభలో వున్నారండీ.

మహారాజా : వేరీ హేపీ! వెరీ హేపీ! మే గాడ్ బ్లస్ యూ.

నరసరావుపేటలో కొన వేంకటరాయశర్మగారి కార్యదర్శిత్వములో ఆంధ్ర సారస్వత పరిషత్తు కవిరాజహంస బిరుదముతో గౌరవించినదీ వోలేటి పార్వతీశముగారొక్కరినే కాదనీ, శ్రీ వేంకట పార్వతీశ్వర

ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం, ఇది విజయాన్ని కాంక్షించే వారి ప్రాథమిక లక్షణాలు.

కవులిద్దరినీ అని సిద్ధాంత వ్యాస రచయిత్రి (కమలా అనార్కలీ) గమనించవలసి వుంటుంది. మరిన్నీ

"తరుణ శృంగార మాధవుడవునీవు!
వరనందనోద్యాన వనలక్ష్మి నేను" – వేంకట పార్వతీశ్వరుల ఏకాంత సేవ.
"తరుణ శృంగార మధురమాధవుడనీవు
కలికిపాటల కోయిల కొలము మాది" – కృష్ణశాస్త్రి కృష్ణపక్షం

వెంకట పార్వతీశ్వర కవుల మార్గదర్శిత్వాన్ని మెచ్చుకుంటూ, ఈ మహాకవులు నా గవాక్షాలను కొన్నింటిని తెరిచారని కృష్ణశాస్త్రిగారన్న మాటలకు పై పద్యాలు ఉదాహరణలు కావూ! పై ద్విపద నాయకుడైన పరమాత్మను గురించి నాయిక అన్నమాటలు. కింది తేటగీతి పాదాలు – మహారాజాను గురించి శాస్త్రిగారి మాటలు!

1947 – 48 ప్రాంతంలో మద్రాసు అడయార్లో 'గులాబీ' బంగళా కచ్చేరీ హాలులో అనుకోకుండా ఆనాటి పిఠాపురం మహారాజాతో నాకు తటస్థించిన రెండు నిముషాల 'భేటీని' గురించి స్మరించి – ఆ సంవత్సరపు ఉగాది పండుగనాడు ఆ మహారాజా కుమారుడూ అప్పటి యువరాజా – ఐన ఆర్.వి.యమ్. రామారావు గారి మద్రాసు నివాసం 'వసంతవిహార్' కచ్చేరీ హాలులో యువరాజాయే స్వయంగా ఏర్పాటు చేసిన నా సంగీత సాహిత్య 'కచ్చేరీ' గురించి వ్రాయకుండా ఉండలేకపోతున్నాను. ఇది 'మహారాజా' తో భేటీకి కొన్ని మాసాల ముందే జరిగింది.

మద్రాసు రేడియో కేంద్రం ఎగ్మూర్ మార్షల్స్ రోడ్లో ఉంటున్న రోజులవి. కార్యక్రమ నిర్వాహకుడుగాను, కవిగా, గాయకుడిగా, నాటక రచయితగా, రేడియోలో తరచూ వినబడుతూ నేను నిలదొక్కుకున్న కాలం, లివరీ డ్రెస్సులో ఒక కారు డ్రైవర్ మా కార్యక్రమ నిర్వాహకుల గదిలోకి వచ్చి, నాకు సెల్యూట్ చేశాడు. పిఠాపురం ముఖం చూడగానే గుర్తుపట్టి 'చెంచు నారాయణ' కాదూ అని అడిగి, మా గదిలో కుర్చీ చూపించి, మర్యాద చెయ్యబోయాను. "కాదుబాబు యువరాజావారి సెలవయింది, మీకు వీలుగా వుంటే, ఇప్పుడు నాతో ఒకసారి వసంతవిహార్‌కి దయచెయ్యమన్నారు". అతను యువరాజుగారి డ్రైవర్, పిఠాపురం హైస్కూల్లో వెనుక చదువుకున్నవాడు.

నేను వెళ్లాను.... రాబోతున్న ఉగాదినాడు వసంతవిహార్‌లో తన బంధుమిత్ర బృందానికి ఆనందం కలిగించడానికి ఆయన నన్ను ఆల్ ఇండియా రేడియో సహకార వాదకులతో సహారమ్మని ఆహ్వానించారు.

వీణా, వయోలిన్ విద్వాంసులు శర్మ సోదరులు, సారంగీ విద్వాంసుడు అలీరజా, తబలా విద్వాంసుడు సిద్దేశ్కుమార్ వీరి సహాయంతో నేను ఆచాఖాన్, చురీదారీ పైజామా వేసుకుని, వసంతవిహార్ కి వెళ్లాను. యువరాజా, రాజాకుమార్లు సతీసమేతంగా ఆహ్వానించారు. ఉయ్యూరు, గొల్లపల్లి, మీర్జాపురం జమీందారులూ, యువరాజా వారి తరానికి చెందిన బంధువులూ మిత్రులూ, స్త్రీ పురుషులంతా నూటికి మించి వుంటారు శ్రోతలు.

ప్రేక్షకులందరికీ స్వాగతం చెప్పారు యువరాజా, 'మా సంస్థానంలో ఉగాది దసరా వంటి పండుగలకు కవులను పండితులను ఆహ్వానించి, వారి విద్వత్సాహితిని కళా ప్రదర్శన చేయించి సన్మానించడం ప్రాచీనాచారం. ఆ ఆచారాన్ని పురస్కరించుకుని, మా తరానికి గురు స్థానీయులై నాకు వ్యక్తిగతంగా బృందావనం అనే కావ్యాన్ని వివాహశుభవేళ అంకితం ఇచ్చిన ఆధునిక కవికులగురువులు, నా కోరికపై ఇప్పుడు రామాయణ రచనలో నిమగ్నులై వున్న వేంకటపార్వతీశ్వర కవులలో బాలాంత్రపు వెంకటరావుగారి కుమారుడు రజనీకాంతరావు రేడియో ద్వారా 'రజనీ'గా మనకందరకు ఆత్మీయుడవుతున్న 'రజనీ' ఈ ఉగాదినాడు మన వివిధ ఆధునిక కవుల గేయాలను, తన గేయాలను వినిపించబోతున్నాడ'ని సభ ప్రారంభం చేశారు.

నేను నా గేయాలను, కృష్ణశాస్త్రి, నండూరి, అడివి బాపిరాజుగార్ల గేయాలను, వేంకట పార్వతీశ్వరుల ఏకాంతసేవ నుంచీ, రవీంద్రనాథ ఠాకూరు వంగ గేయాలను, సభాసదుల కోరికపైని కె.ఎల్.సైగల్ హిందీ చిత్రగీతాలను గానం చేశాను. తాంబూలంతో చేర్చి నూటపదహార్లు నాకూ మిగిలిన విద్వాంసులకు కూడా ఉచిత రీతినీ, యువరాజా బహూకరించి సత్కరించారు.

తండ్రి మహారాజా ఎంత గ్రాంధికవాదో యువరాజా అంతటి వ్యావహారికవాదీ, రచయితానూ! 15 సంపుటాల సూర్యరాయాంధ్ర నిఘంటువు పలువురు పండితప్రకాండుల సంశోధన ద్వారా వెలువడిన గ్రంథం తెలుగు భాష ఉన్నంత కాలమూ మహారాజా పేరుకు చిరస్థాయిని కలుగజేస్తుంది.

'వలపులు, అలపులు, తలపులూ', అనే యువరాజా రచించిన గేయ సంపుటి గురించి వ్రాస్తూ కమలానార్కలీ తన సిద్ధాంత గ్రంథంతో ప్రతి "అల్ప విషయాన్ని గేయముగా వ్రాసి, కాదేదీ కవితకనర్హం అను అభ్యుదయ కవితాధోరణి నవలంబించిరి." అన్నారు.

యువరాజా ఆంగ్లంలో తన రచనలను గురించి చెప్పిన మాటలలో "నా పుస్తకాలు చాలా మట్టుకు మనస్తత్వ విశ్లేషకాలు, ఆత్మాశ్రయాలూ, వస్త్వాశ్రయాలూ కూడాను. గంభీరమైన మానవ హృదయానుభూతులలో మంచివీ, చెడ్డవీ, అసలు పాటించనక్కరలేనివీ కూడా వుంటాయి. అవి వాస్తవిక జీవితంలో నుంచి పుట్టి ఉండొచ్చు. కాల్పనికములూ కూడాను. నేను ముఖ్యంగా నా కోసమే రాస్తాను. నా దిగుళ్లనూ, పొంగులనూ రచనల ద్వారా వ్యక్తం చెయ్యకుండా వుండలేను. పాఠకులు వాళ్లకిష్టమైతే వాటిని చదవొచ్చు. నా అనుభూతుల్లో పాల్గొనవొచ్చు. లేకపోతే వాళ్లయిష్టం" అన్నారు.

(రజనీ ఆత్మకథా విభావరి గ్రంథం నుండి)

మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది పదండి ముందుకు పదండి సాగుతూ పోదాం పోదాం పై పైకి అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ప్రపంచాన్ని ఈర్ష్య ద్వేషాల నుండి సామాజిక రుగ్మతల నుండి నేను నా కుటుంబం అనే వ్యక్తిగత సంకుచిత భావాల నుంచి విడిపించి మరో ప్రపంచంలోనికి ప్రయాణింప చేయడానికి నిరాపేక్షకంగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్న సహృదయ మిత్రమండలికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు **- ఎన్. వెంకటేశ్వరరావు**

(అనారోగ్యంతో మరణించే ముందు ఆయన పంపిన అమూల్యమైన చివరి సందేశం)

నీ వెనుక ఏముంది.. ముందేముంది.. అనేది నీకనవసరం నీలో ఏముంది అనేది ముఖ్యం.

ఒకనాటి ఆంధ్ర రాజధాని పిఠాపురం

క్రీస్తుపూర్వం 4వ శతాబ్దంనుండి పిఠాపురం గొప్ప పట్టణంగా విరాజిల్లింది. క్రీపూ 2వ శతాబ్దంలో వేయించిన ఖారవేలుని హాథిగుంఫా శాసనంలో కనిపించే పిథుండా పిఠాపురమే అనటానికి ఆధారాలు ఉన్నాయి.

పిఠాపురం సమీపంలో ఉన్న బౌద్ధ ఆరామం కొడవలి వద్ద క్రీ.శ. 2 వ శతాబ్దంనాటి శాతవాహనరాజు వేయించిన శాసనం లభించింది.

క్రీశ 4 వ శతాబ్దంలో సముద్రగుప్తుడు వేయించుకొన్న ప్రసస్తి శాసనంలో పిఠాపురాన్ని జయించానని గర్వంగా చెప్పుకొన్నాడు

వేంగి రాజ్య స్థాపన నిజానికి 7వ శతాబ్దంలో పిఠాపురంలో కుబ్జవిష్ణువర్ధనుడిచే జరిగింది.

హుయాన్‌త్సాంగ్ క్రీశ 631 లో పిఠాపురం సందర్శించి ఉండొచ్చునని ఆధారాలు ఉన్నాయి.

కాలక్రమేణా తూర్పుచాళుక్యులు, కొప్పుల నాయకులు, గజపతులు,పూసపాటి రాజులు గోల్కొండ నవాబులు, బ్రిటిష్ వారు ఈ పట్టణాన్ని పాలించారు.

దోనేపూడి శాసనంలో (క్రీశ1337) పిఠాపురపట్టణ వర్ణనలు ఈ విధంగా ఉన్నాయి

పిఠాపురీ జయతి తత్ర సమస్తదేవ
శక్తి ప్రయత్నపరికల్పిత తోరణశ్రీః
యస్యాస్సునిర్మలనభోముకురాంతరాలే
ధత్తే సురేంద్రనగరీప్రతిబింబలీలమ్

(తాత్పర్యం: సమస్తదేవతలు కొలువున్న పిఠాపురం యొక్క అందాలు ఎంతటి దివ్యమైనవి అంటే ఆకాశం అనే అద్దంలో పిఠాపురం అందాలే ఆ ఇంద్రుని అమరావతి అందాలుగా ప్రతిబింబిస్తున్నాయి)

యత్ సౌధాగ్రనిషణ్ణవారవనితావక్త్రేందుమధ్యస్థితః
స్వైరం నైషవిభావ్యతే హిమరుచిస్తేభ్యోవిభిన్నాకృతిః
ఏవం చేతపి శకితేనరచితో ధాత్రాకళంకస్ఫుటమ్
నోచే దీదృశి నిర్మలే కథ మిదమ్ మాలిన్య ముజ్జృంభతే.

(తాత్పర్యం: పిఠాపురం భవనాల మిద్దెలపై వెన్నెలలో కూర్చున్న నాట్యకత్తెల గుండ్రని వెలుగులీనే ముఖాలలో కలిసిపోయి చంద్రుడు కనిపించటం లేదట. అందుకని బ్రహ్మదేవుడు చంద్రునిపై నల్లమచ్చలు పెట్టటంతో ఆ అప్సరసల ముఖబింబాల మధ్య చంద్రబింబాన్ని గుర్తించటం వీలయిందట)

ఒకనాటి పిఠాపురం భౌతిక వర్ణనను ఒక పద్యంలో శ్రీనాథుడు ఇలా చిత్తరువుగా నిలిపాడు

సీ. ఏటేట విలినీట నిరుగారునుం బండు
బ్రాసంగు వరిచేల బసిడిచాయ
బరిపాకమున వేరుపనసపండుల తావి
ఇందిందిరములకు విందుసేయు

వేబోక ఒలుపారు వింధ్యాద్రిపవనంబు
పోకపువ్వుల తావి బుక్కిలించు
వేశ్యవాటికలందు విహరించు వలరాజు
ననయంబు జెఱకువిల్లును ధరించు

తే.గీ. నారదంబులవలపు పొన్నల బెనగి
విచికిలామోదములతోడ వియ్యమందు
బాటలీపుష్ప కేతకీపరిమళములు
పొదల విలసిల్లు బీఠికాపురమునందు.

(తాత్పర్యం: 'ఎటు చూసినా బంగారు వన్నెల వరిచేలు, తుమ్మెదలకు విందు చేసే బాగా ముగ్గిన పనస పండ్ల సువాసనతోను, వింధ్య పర్వతపు పోక పువ్వుల పరిమళాలను పుక్కిలించే చల్లనైన గాలులతోను, మన్మధుడు తన చెరుకు వింటిని ఎక్కుపెట్టే వేశ్య వాడలతోను, పొన్నపూలు, పాటలీ పుష్పాలు, పరిమళాలు వెదజల్లే పొదలు కలిగిన పిఠాపురం' లాంటి వాక్యాలలో శ్రీనాధుడు (1380–1470) ఆనాటి పిఠాపురం picturesque సౌందర్యాన్ని కళ్లముందు నిలుపుతాడు)

–బొల్లోజు బాబా

ప్రముఖ కవి, రచయిత, చరిత్ర పరిశోధకులు

25 సంవత్సరములు దిగ్విజయముగా ప్రజాసేవకు అంకితమైన సహృదయ మిత్రమండలి సభ్యులందరికీ శుభాకాంక్షలు. మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.

-సరిదె పద్మావతి రామస్వామి

సమాజానికి చీడ పురుగులాగా దాపురించిన వ్యసనములు మద్యపానం, ధూమపానం మత్తుపదార్థాలు నిర్మూలించుటకు మిత్ర మండలి ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం నిర్వహిస్తోంది. 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సహృదయ మిత్ర మండలి మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నాను. **- మునగాల భరతుడు**

సేవయే పరమావధిగా 25 సంవత్సరాలు నుండి వివిధ కార్యక్రమాలు చేస్తున్న సహృదయ మిత్రమండలికి గత 15 సంవత్సరాలుగా నా వంతుగా మహాశివరాత్రి నిర్వహిస్తున్న శిబిరం నందు 3 రోజులు కూడా ఉండటం జరుగుతుంది. భవిష్యత్తులో మిత్రమండలి నిర్వహించబోయే కార్యక్రమాలకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను. **- పిల్లి శ్రీను**

ఏ పరిస్థితులలో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరిగిపోతాయి.

సహృదయ మిత్రమండలి సంస్కృతీ గమనం

-డా॥ కె. వెంకటరెడ్డి

ఒకజాతి యొక్క ఔన్నత్యం దాని సాంస్కృతిక వికాసంపై ఆధారపడి ఉంటుంది. బహుముఖీనంగా బుద్ధి వికాసం శాఖోపశాఖల సంస్కృతీ వికాసం జరిగిననే కాని ఒక జాతి నాగరికతమైందని అనలేము. భారతజాతి పూర్వకాలం నుండీ అన్ని రంగాల్లోనూ చెప్పుకోదగినంత అభివృద్ధిని సాధించింది. సాటి నాగరిక జాతులలో తనకంటూ ఒకస్థానం సాధించుకున్నది కూడాను. అయితే కాలమెప్పుడూ ఒకేలా ఉండదు కదా! ఎత్తు పల్లాలు, తణుగు బెణుగులూ ఉంటూనే ఉంటాయి. మన స్వాతంత్ర్య సముపార్జనం తరువాత భారత జాతి తన తరిగిపోయిన వైభవాన్ని పునర్నిర్మించుకుంటోంది.

అలాగే ఆంధ్రజాతి కూడా తన సర్వతోముఖ సాంస్కృతిక వికాసనాన్ని కళావైభవాన్ని పునర్నిర్వచించుకొంటోంది. ఆంధ్రదేశంలో ఎక్కడికక్కడ తమ తమ ప్రాంతాల అభివృద్ధికీ, వివిధ కళా విష్కరణలకూ, ఆయా ప్రాంతాల ప్రజలు గణనీయంగానే పరిశ్రమిస్తున్నారు.

మన పిఠాపురం పూర్వం నుంచీ నాగరిక జీవన విధానానికీ, వివిధ కళా సాంస్కృతిక విన్యాసాలకూ కాణాచిగా ఉంటూ మొత్తం ఆంధ్ర నాగరికతకు తన వంతు వాటా అందిస్తూ వస్తోంది. అందులో ఈ మధ్య కాలంలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు సహృదయ మిత్రమండలి. సహృదయ మిత్రమండలి వారు నిజంగా సహృదయులు. ఎన్నో మంచి పనులను నిరంతరాయంగా బహుశ్రమలకు ఓర్చి నిర్వర్తిస్తున్నారు.

సాహిత్య కార్యక్రమాలు, అనేక జనోపయోగ కార్యాలూ నిర్వహించడం కష్టతరమైన ఈ రోజుల్లో కొనసాగించడం సామాన్యమైన విషయం కాదు. అనేక సాంస్కృతిక సంస్థలూ, సేవా సంస్థలూ, కాస్త నిర్లిప్తంగా ఉన్నట్లు కనిపిస్తున్న ఈ రోజుల్లో పిఠాపురం చారిత్రక, సాంస్కృతిక, విద్యా వైజ్ఞానిక, సేవారంగాలలో, పీఠికాపుర గత వైభవకాండని తగ్గిపోనీయకుండా, దాన్నినిత్యమూ ప్రభావితం చేస్తూ, ప్రకాశవంతం చేస్తూ, దేదీప్య మానం చేయాలని ప్రయత్నిస్తున్నారు మిత్రమండలి వారు.

పిఠాపురానికి ఘనమైన చరిత్ర ఉన్నది. బౌద్ధ, జైన నాగరికతలు ఒకప్పుడు ఇక్కడ పరిఢవిల్లాయి. మహావీరుల కరవాలాలు కణకణమన్నాయి. మహా కవుల కవితా విన్యాసాలు సహృదయ హృదయానంద కారకాలైనాయి. పండితులు తమ పాండిత్య ప్రకర్షల్ని ప్రదర్శించారు. నృత్య వైభవాలకూ సంగీత ప్రవాహానికి కొలదులు లేవు. వీటన్నింటికి వెన్నుదన్నుగా మహారాజులు నిలబడ్డారు.

కర్షకులూ, వివిధ జాతి వృత్తుల వారూ తమ తమ కార్యక్షేత్రాల్లో ఘనవిజయాలు సాధించారు.

ఇట్టి ఘనతర వైభవానికి పిఠాపురం ప్రతీక, వారసురాలున్నూ. ఈ సహృదయ మిత్రమండలి తన ఉద్దేశిత కార్యక్రమాలే కాకుండా, బహుముఖంగా విస్తరించి, పిఠాపురం సాంస్కృతిక కళావైభవ, విద్యా విజ్ఞాన క్షేత్రాల్లో అకుంఠితమైన సేవను ప్రసరింపజేసి, ధన్యతను పొందుగాక!

పిఠాపురానికీ, ఆ ప్రాంతానికీ చెందిన ప్రజల ఆదరాభిమానాలతో ఉజ్జ్వలమై ప్రకాశించుగాక! దానికి తగిన ఆయురారోగ్యాల్నీ, ఉత్సాహాన్ని, కార్యదక్షతనూ ఆ సభ్యులు పెంపొందించుకొందురు గాక!

ఈ సహృదయ మిత్రమండలి పురోగమనం అవిచ్ఛిన్నంగా సాగుగాక.

సతతము కార్యాచరణం
బతువితముగ చేయుచుంట, పండితులకు స
త్కృతులొనరించుట, పటు స
న్మతిగనుట, సహృదయ మిత్రమండలికగుతన్

మార్చి 8న డబ్బది అయిదు వసంతాల శుభాకాంక్షలు అందుకున్నాడు - మార్చి 26న అనంత లోకాలకు ఆకస్మికంగా ప్రయాణించిన చిరకాల మిత్రులు డా॥ గజరావు సీతారామస్వామి గారికి నివాళులతో...

స్నేహ సౌరభం

కాలమెంత
    తల్లిగా లాలన చేసింది
    తండ్రిగా తల్లడిల్లింది
మనలను డబ్బది అయిదు వసంతాల పిల్లలుగా తీర్చడానికి...
అరువది మూడు ఆమనిలుగా
    ఈ స్నేహ సౌరభం పరిమళించడానికి... !
మిత్రత్వం
    ఎన్ని రంగుల ఇంద్ర ధనస్సయింది
    ఎన్ని చెంగుల దుడుకు తువ్వాయయ్యింది
మన తీపి చిలిపి తందనాల తాండవానికి... !
స్నేహమెంత
    తిరునాళ్ళ తీర్థమయ్యింది
    ఉత్సవాల ఊరేగింపయ్యింది
ఇన్నివత్సరాల ఎదల ఏకత్వ సఖ్యతకు... !
చెలిమెంత
    సంతోషాల వసంత మయ్యింది
    సంబరాల మంగళ గానమయ్యింది
ఇన్ని ప్రొద్దుల ఋతురాగాల అనురాగాల వీవనకు
    దేవాది దేవ నుత ! దేవ గణాధినాథ!
మా ఏ పూల పూజా ఫలమో...
ఈనాటి ఈ స్నేహ సౌభాగ్య శుభవరం... !
    ఇంకేమీ కోరం – ఇంకేమి మొక్కం
ఈ బంధమిటులే
జన్మజన్మలకూ కొనసాగాలని తప్ప ....!

సీతబాబు డబ్బది అయిదు వసంతాలు
పూర్తి చేసుకున్న శుభసందర్భంగా
జన్మదిన శుభాకాంక్షలతో...
శుభాభినందనలతో...
ఆత్మీయ చందనాలతో...

– మన్మథరావు

తనను తాను చిన్నబుచ్చుకోవడం, అన్ని బలహీనతలకంటే పెద్ద బలహీనత.

గురజాడ బాటలో గిరీశం స్ఫూర్తి
(వ్యంగ్య రచన)
గిరీశోపదేశం

గిరీశం : ఏవోయ్ మైడియర్ వెంకట్ అలా వున్నావు. ఏమైందేంటి ? ఎలక్షన్లో డిపాజిట్ రానట్టు?

వెంకట్ : ఇన్నాళ్ళు మీ వెనకాల తిరిగినందుకు నాకు ఏమి నేర్పారు ?

గిరీశం : సాటిలేని మేటి నాయకుడుని చేస్తానోయ్ !

వెంకట్ : మీ వెనకాల జై కొట్టడం, మీటింగ్‌కు వెళ్ళడం, జై పలకడం తప్ప ఏమి నేర్పారు. మాట్లాడితే సాధిస్తాం, సాధిస్తాం అనడం, ఏమి సాధించాము? మనల్ని మనమే సాధించుకుంటున్నాం.

గిరీశం : అలా అనకోయ్, నేనే సంఘం, సంఘమే నేను.

వెంకట్ : అంటే? ఏమిటి దీనికి అర్థం. మీ మాటలు విని విని నాకు బోరు కొట్టింది. మీతో ఎంత తిరిగినా లాభం లేదండి. లాభం లేదంతే!

గిరీశం : నీవు గొప్ప నాయకుడివి అయిపోతావోయ్! నేటి వ్యవస్థ నా స్ఫూర్తితో నడుస్తుందోయ్. నేటి పాలకులు, నేటి నాయకులు నా బాటలోనే నడుస్తున్నారు. నా ఉపదేశం వినుకో,

ప్రతి మానవ సంబంధాన్ని ఆర్థిక సంబంధంగా మార్చుకో. నీకు పరిచయం అయిన ప్రతి వాడిని డబ్బుగా మార్చుకో. కొంత లౌక్యం నేర్చుకో. నేను పుట్టింది సమాజాన్ని ఉద్ధరించడానికే అని చెప్పాలి. లేకపోతే పుట్టేవాడిని కాదు. ఉద్ధరించడానికి అని చెప్పే మాట దద్దరిల్లి పోయేలా చెప్పాలి. అలాగే మధ్య మధ్యలో కత్తికి తేనె పూసినట్టుగా, మంత్రాలు వల్లి వేసినట్టుగా "సొంతలాభం కొంత మానుకో, సొంత లాభం కొంత మానుకో" అని పదే పదే చెప్పాలి. పద పద మంటూ పలుకులు పలకాలోయ్ ! మైకు పట్టుకుని పదండి ముందుకు, పదండి ముందుకు అని పెద్ద ఫోజు పెట్టాలోయ్! సంఘానికి, సమాజానికి మనమంటే నమ్మకం కల్పించాలోయ్! ఖర్చు పెట్టాలోయ్. కాని మన డబ్బు కాకూడదోయ్, దీన్నే సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అంటారు.

వెంకట్ : మీరు ఎప్పుడూ ఇంతే ! మాటలు మిన్న చేతలు సున్నా.

గిరీశం : ఎంత మాట అన్నావు. చూస్తూ వుండు ఇదే నేటి సమాజం

వెంకట్ : అంటే

గిరీశం : అంటేనా! వివరంగా చెబుతా విను. అక్షరాలు ఎవరు, ఏ కంపెనీలో తయారు చేశారు. అక్షరం కంటె చిన్నదయిన ఇసుక రేణువును ఎవరు తయారు చేశారు. గాలి, నీరు, నిప్పు, ప్రకృతి ఎవరు తయారు చేశారు. ఎవరికి చెందిన దానిని ఎవరు అనుభవిస్తున్నారు. ఏవోయ్ వెంకట్, నోటుకి

విలువ గాని, మాటకి, మనిషికి విలువ లేదోయ్! ఎలా అంటావా నా గొప్ప ప్రజాస్వామ్య దేశంలో ఓటుని కొనుక్కుంటున్నారు. ఓటుని అమ్ముకుంటున్నారు. చట్టాలు ఉంటాయి, కోర్టులు ఉంటాయి, ఎలక్షన్ కమీషనర్‌లు ఉంటారు. కానీ ఓటు కొనుక్కుని నాయకుడిగా చెలామణి అవుతున్నాం. నిబద్ధత, నీతి,నిజాయితీ, మానవత్వం, ఆత్మీయత, అనుబంధం అనేవి ఒట్టి ట్రాష్. నీవు గద్దెనెక్కితే శత్రువు కూడా మిత్రుడే. అదే గద్దెదిగితే మిత్రుడు కూడా శత్రువే! ఇదే నా గీతోపదేశం. ఎప్పటికైనా ఇదే అక్షర సత్యం. **- ఎన్. సూర్యనారాయణ**



2001 లో గుజరాత్ లో వొచ్చిన భూకంపం అక్కడి ప్రజా జీవితాన్ని కకావికలం చేసింది. ఎంతో మంది బతుకులు వీధిన పడ్డాయి. అలాంటి క్లిష్ట సమయంలో సహృదయ మిత్రమండలి స్పందించి స్థానిక ప్రజల నుంచి కొంత నగదు, బియ్యం, దుస్తులు సేకరించి నాటి కలెక్టర్ సతీష్‌చంద్ర గారి ద్వారా రెడ్ క్రాస్ సొసైటీ కి అందించి, బాధితులకు పంపింది. అలాగే, అనేకమార్లు రక్త దానం చేసిన వారికి మిత్రమండలి సన్మానాలు చేసింది. 25 యేళ్లు నిండనున్న మిత్రమండలి మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలనేది నా కోరిక. **- ఎం. సుబ్రహ్మణ్యేశ్వరరావు,** రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు

మనం నిత్యం వాడి పారేసే కొన్ని వస్తువులు చాలా కాలం వరకూ భూమిలో కలవవు. వాటి వల్ల అపరిశుభ్రం, కాలుష్యం ఇంకా అనేక రకాల అనర్థాలు. అలాంటి వస్తువులతో పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాజెక్టులు చేయించవచ్చు. ఇంటి దగ్గర ఖాళీ సమయంలో కూడా తల్లితండ్రులు



పిల్లలకి ఆ వస్తువుల్ని వాడి సృజనాత్మక నైపుణ్యం పెరిగేలా అనేక విషయాలను నేర్పవొచ్చు. మనం వాడి పారేసే ప్లాస్టిక్ సీసాలు, గాజు సీసాలను మొక్కలు పెంచుకోడానికి, డెకరేషన్ కోసం ఉపయోగించవచ్చు. ఇలాంటి విషయాల కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న అరవింద్ గారి arvindguptatoys అనే వెబ్సైట్ కూడా చూడొచ్చు. పిల్లల కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం సహృదయ మిత్రమండలి చేస్తున్న కార్యక్రమాలకు శుభాభినందనలు.

- జె. తాతారావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు

చిత్తశుద్ధి, ఓర్పు, పట్టుదల, ఈ మూడు కార్యసిద్ధికి ఆవశ్యకాలు, కానీ ప్రేమ ఈ మూడింటికన్నా అత్యావశ్యకం.

ఎవరు గొప్పా....?

సుగంధ పరిమళాన్ని అందించే పుష్పం గొప్పదా! అటువంటి పుష్పాన్ని పూయించిన పూల మొక్క గొప్పదా...? పూలమొక్క పెరిగి పుష్పించడానికి తోడ్పడిన సూర్యరశ్మి, గాలి, నీరు ఎరువు, భూమి గొప్పవా...!

వైవిధ్యభరితమైన ఈ సృష్టి ఎంత గొప్పది, సుందరమైన సృష్టిని సృజించిన సృష్టికర్త సృజన మరెంత గొప్పదో కదా! నేనే గొప్ప, నా మతం, కులం గొప్ప లాంటి మాటలనడం వల్ల ఎన్నటికి గొప్పవారు కాలేరు. ఈనాటి మానవుడు ఇతరుల భావాలను కించపరుస్తూ, తన గొప్పతనాన్ని చాటుకోవడానికి అహర్నిశలు, అప్రతిహతంగా కృషిచేస్తాడు. తనదే పై చేయి కావడం కోసం ఏ పాపకార్యాన్నైనా చేయడానికి వెనుకాడడు.

కొందరు మేం గొప్పవారమని బీరాలు పలుకుతారు. వృక్ష, జంతు భూచరాలు, జలచరాలు, గాలి, నీరు, అగ్ని, మట్టి, ప్రకృతి అన్నీ కేవలం మానవుని సుఖసంతోషాలకై కైంకర్యం అవుతున్నాయి. వీటన్నింటిని హరించి భుజించి నేనే గొప్ప అనే మిథ్యలో మానవుడు ఉన్నాడు.

నీటికి నీవేమిచ్చావని నీ దాహం తీరుస్తుంది. చెట్లకు ఏమిచ్చావని మధుర ఫలాల్నిస్తున్నాయి. ఐదు వేళ్ళు ఒక్కటైతే గాని ఆహారాన్ని నోటికి అందించలేము. నోరు, దంతాలు, నాలుక సహకరిస్తే గాని నోటికి ఆహారాన్ని అందించలేము. గొంతు నుంచి క్రిందికి జారే లాలాజలం, జఠరాగ్ని ప్రమేయం లేకుండా ఆహారం జీర్ణం కాదు. జీర్ణమైన ఆహారం రక్తంగా మారే ప్రక్రియ ఎంత గొప్పది. శరీర భాగాలకు రక్తాన్ని సరఫరా చేసే హృదయం గొప్పతనం మాటే మరిచి తరాల మధ్య అంతరాలు లేకుండా నిర్విరామ కృషి సల్పుతుంది. ఎవరు గొప్ప? శరీరంలో ఎక్కడైనా ఒక భాగానికి గాయమైతే మొత్తం శరీరంలో ఉండే వ్యాధి నిరోధక శక్తి ఒక్కటై ఆ భాగం వెంటనే కోలుకోవడానికి సహకరిస్తుంది..! ఆ ప్రక్రియ ఎంత గొప్పది.

కంటికి కనిపించని ఉపకారం చేసే సూక్ష్మజీవులు కోటానుకోట్లు మన దేహంలో ఉంటూ ఈ దేహాన్ని అనుక్షణం కాపాడే వాటి సంగతేంటి? వాటి గొప్పతనం గూర్చి ఎన్నడైనా చెప్పాయా...? గొప్పవారెప్పుడూ అందర్నీ గొప్పవారిగా చేయాలని చూస్తారు.

మహాత్ములు, మహాపురుషులు, ధర్మస్థాపకులు, వారి చర్యలు ఆలోచనల ద్వారా సుగంధ పరిమళాలను వెదజల్లుతారు. కాని ఎవరినీ కించపరచరు, తక్కువ చేయరు. ప్రముఖ శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' "వెనుకతరాల వారు పరిశోధనల ద్వారా అందించిన పరిశోధనా ఫలితాలు నా ప్రయోగాలకి ఎంతో ఉపకరించాయి". అని చెప్పడం ఆయన గొప్పతనం.

చెట్టు యొక్క వేర్లు గుప్తంగానే ఉంటాయి. కాని ఆ వేర్లే చెట్టు మనుగడకు మూలాధారం. మానవుల సుఖమయ జీవితానికి ఎందరో గుప్త సేవలు చేస్తున్నారు. వారి సేవ ఎంత గొప్పది. మానవ జాతి

మనుగడకు క్రిమి కీటకాదులు, పశుపక్ష్యాదులు, వృక్ష, జంతు జాతులు ఒకటేమిటి? ఈ సువిశాల విశ్వంలో పంచతత్వాలు కర్పూరమై కరిగిపోతున్నాయి.

ఇప్పుడు చెప్పండి ఎవరు గొప్ప! ఈ మానవ దేహాన్ని నడిపించే పవిత్ర ఆత్మ ఎంత గొప్పది. స్థూలంగా కనిపించే కర్మేంద్రియాల కంటే బుద్ధి, బుద్ధి కంటే ఆత్మ గొప్పది. ఆత్మ మూలగుణాలైన శాంతి, శక్తి, ప్రేమ, పవిత్రత, ఆనందం, జ్ఞానం, సంతోషాల వల్ల ఆత్మ దివ్యగుణాలతో శోభిల్లుతుంది. - **కష్మేఫలి!**

- **కొమ్మనాపల్లి అప్పారావు,** రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్

ఏం కావాలి ???

ఈ ఉక్కలో ఒక గాలి తెరకావాలి
ఈ ఎడారిలో గుక్కెడు నీళ్లుకావాలి
ఈ చలిలో కణికెడు నిప్పుకావాలి
ఈ పాతాళంలో బెత్తెడు ఆకాశంకావాలి
ఈ దేశంలో చారెడు నేలకావాలి
ఇస్తావా ???

తొలిగిపోనక్కర్లేని బతుకు కావాలి
మునగ దీసుకోనవసరంలేని
నిర్భయ సంచారం కావాలి
బతుకు గిన్నెలోంచి మనువు తన్నుకపోయిన
ఆ మెతుకుకావాలి

రెప్పల్లా కాపలాకాసే తక్కువతనం పరదాలు తొలిగిపోవాలి
అన్నింటినీ మించి నా సింహాసనం నాకు కావాలి
ఇస్తావా ????

ఈ మబ్బులు తొలిగిపోవాలి
ఈ గోడలు కూలిపోవాలి
ఈ మౌనం పగిలిపోవాలి
ఈ జిగట ఎండిపోవాలి
మనిషీ - నాకు నిజమైన పౌరసత్వం కావాలి
ఇస్తావా ???

ఒక స్పర్శకావాలి గుండెలు చేతులైన దేహచాలనం
కావాలి.
ఊరుకీ వాడకీ మధ్య నెత్తుటిగూడు అల్లుకోవాలి
మనమధ్య ఈ వెలితి నిండి పోవాలి
మరి ముఖ్యంగా ఈ దేవుళ్ల శవాలుకావాలి
ఇస్తావా ???

బ్రహ్మజెముళ్లు అలుముకున్న నీలో ఒక మనిషి కావాలి
నీ ప్రేమనదీ ప్రవాహాల వెంబడి
అనురాగలోయలు కావాలి
నీతో ఎగుడు దిగుడులేని ఒక ముద్దు కావాలి
నీతో మదస్పర్శలేని ఒక కౌగిలింత కావాలి
నీతో ఒక పరిపూర్ణమైన కలయిక కావాలి
ఇస్తావా ???

ఏం కావాలి నువ్వు కావాలి
నీగుండెలో నాకు చోటు కావాలి.
నీ ఇంట్లో నేను చెయ్యి కడగాలి
నా గుడిసెకొచ్చి నువ్వు పిల్లనడగాలి
మనం చుట్టాలం కావాలి మిత్రుడా!
ఈ దేశం మనది కావాలి.
చెయ్యీ చెయ్యీ కలిపి మనం నడుస్తుంటే
ఈ మిట్టపల్లాల నేల చదునుకావాలి
వొస్తావా ???

- **మద్దూరి నగేష్ బాబు**

ఓర్పుతో శీలాన్ని నిర్మించుకోవడం, సత్యానుభూతికై తీవ్రంగా తపించడం, ఇవి మాత్రమే మానవాళి భవిష్యత్తును సుసంపన్నం చేయగలవు.

“శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః”

సకల మానవులేకాక పిల్లలు, జంతువులు మరియు పాములు గాన మాధుర్యాన్ని అనుభవిస్తాయి అని దీని అర్థం. శృతి శుద్ధంగా, లయబద్ధంగా పాడుతూ వాయిద్యాలు వాయిస్తూ సాహిత్య భావాన్ని చక్కగా మనసును రంజింప జేసి ఒక దివ్యానుభూతిని కలిగింపజేసేది సంగీతం.

భారతీయ సంగీతం సశాస్త్రీయమైనది మరియు క్రమ పద్ధతిలో నేర్పబడునది. ప్రపంచంలో ఉన్న సంగీత విధానాలన్నింటిలోను మన సంగీతానికి ధీటైన సంగీతం ఎక్కడా లేదనడం అతిశయోక్తి కాదు. జర్మనీ దేశానికి చెందిన ఓట్టోకోలర్ అనే ఒక కార్టూనిస్ట్, సంగీత ప్రియుడు ప్రపంచంలో ఉన్న సంగీతాలన్నింటిని విన్న తరువాత ఏ సంగీతం కూడా అతని మనసును కదిలించలేక పోయింది. చివరిగా మన దేశానికి వచ్చి భారతీయ సంగీతాన్ని విని ఇలా అన్నారు. If you close your eyes and open your ears Indian music will open your heart.

(‘కళ్లు మూసుకుని, చెవులు తెరచి వింటే భారతీయ సంగీతం మన హృదయాన్ని తెరుస్తుంది’)

ఈ విధంగా అనేక మంది విదేశీయులు మన సంగీతం యొక్క గొప్పతనాన్ని వివరించారు.

కర్ణాటక సంగీతానికి సరైన భాష తెలుగేనని ఏ భాష సంగీత విద్వాంసులయిన తెలుగు భాషను వ్యాకరణంతో నేర్చుకొని తెలుగులో కీర్తనలు వ్రాసి సంగీతం కూర్చి శ్రోతలకందించారు. ఇది తెలుగువారు గర్వించదగ్గ విషయం. కాని తెలుగువారిలో శాస్త్రీయసంగీతంపై అవగాహన తక్కువగా ఉండటం విచారించవలసిన విషయం.

స్వరాలు, రాగాలు అత్యంత ప్రతిభావంతులైన విద్వాంసులచే కూర్చబడినవి. ఒక్కొక్క రాగం ఒక్కొక్క రోగాన్ని కూడా నయం చేస్తుందనే విషయం మనకు తెలుసున్నదే. ఈ విషయంలో డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు ఎంతో పరిశోధన చేసారు.

కళలకు కాణాచియైన పిఠాపురం సంగీతం విషయానికొస్తే వీణ విద్వాంసులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారు. వీరు తను వాయించే వీణను అమ్మ అని సంబోధించేవారు. వీరు రాజా వారి ఆస్థాన విద్వాంసులు. రవీంద్రనాథ్‌ఠాగూర్ గారు రాజావారి ఆహ్వానం మేరకు పిఠాపురం వచ్చినప్పుడు వారు సంగీత ప్రియులు కాబట్టి శాస్త్రి గారి వీణ కచేరీ ఏర్పాటు చేసారు. శాస్త్రి గారు వీణను నిలబెట్టి వాయించేవారు. ఆ కచేరీ విని ఠాగూర్ గారు మైమరచి పోయి రాజా వారి అనుమతితో శాంతినికేతన్ కు తీసుకు వెళ్ళి కొంతమందికి తర్ఫీదు ఇప్పించారు.

రాణి చిన్నమాంబ దేవి గారు, వారి కుమార్తెలు వీణ వాయించేవారు. రాజావారు తంజావూరు నుండి వీణలు తయారు చేసేవారిని రప్పించి పిఠాపురంలో తర్ఫీదు ఇప్పించారు. వీణలు, తంబురలు తయారు చేయడంలో పిఠాపురం ప్రసిద్ధి చెందింది. వీటికి సంగీత ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉండేది.

సంగీత ప్రపంచానికి పిఠాపురం నుండి అనేక మంది విద్వాంసులు ఉద్భవించారు. వారిలో ముఖ్యులు బాలాంత్రపు రజనీకాంతరావు గారు, వీణ చిట్టిబాబు గారు, నేదునూరి కృష్ణమూర్తి గారు, ఎమ్. ఎల్. నరసింహం గారు, పిఠాపురం నాగేశ్వరరావు గారు, పి. బి. శ్రీనివాస్ గారు మొదలైన వారు. ఇటీవల కాలంలో వేణువుపై నేను, రెండు తెలుగు రాష్ట్రాలలో మాండొలిన్‌పై కచేరి చేయగలిగిన ఏకైక కళాకారులు మన పిఠాపురానికి చెందిన గట్టి సత్య సాగర్ గారు, మృదంగంపై గట్టి కృష్ణకాంత్ గారు, గాత్రంలో మండా కృష్ణ మోహన్ గారు, ఆకొండి శ్రీనివాస రాజారావు గారు, ఆకొండి వెంకట్రావు గారు, వింజమూరి గాయత్రి గారు, పరకాల సుబ్బరాయ శర్మ గారు మొదలైన వారు. **వీరి వద్ద అనేక మంది పిఠాపురం విద్యార్థులు సంగీతం నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు.**

రాజావారి కాలంలో దసరా ఉత్సవాలలో గొప్ప విద్వాంసుల సంగీత కచేరీలు జరిపేవారు. తరువాత రాయవరపు సంజీవరావు గారి ఆధ్వర్యంలో కచేరీలు జరిగాయి. వీరు శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో త్యాగరాజ స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ఆ తరువాత ఊళ్ళో పెద్దల సహకారంతో శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య అనే సభను తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారి పేరు మీద ప్రారంభించి ఆకొండి మధుసూదన్ గారు, నేను సంగీత ప్రియుల ఆర్థిక సహకారంతో కచేరీలు పిఠాపురంలో జరిపించాము. 32 సంవత్సరాలుగా ఈ గాన సభలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొంతమంది పెద్దల సహకారంతో నా ఆధ్వర్యంలో దిగ్విజయంగా సంగీత, నృత్య కార్యక్రమాలు నడుపబడుతున్నాయి.

రాజా వారికి నాట్యమంటే మహా ఇష్టం. పెండ్యాల సత్యభామ గారు ఆస్థాన నర్తకిగా ఉండేవారు. ఆమె చాలా గొప్ప నాట్యాచారిణి. ప్రఖ్యాత నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ గారు పిఠాపురం వచ్చి సత్యభామ గారి వద్ద 'నవ జనార్ధనం' అనే నృత్య రూపకాన్ని నేర్చుకొని, అనేక మంది కళాకారులకు నేర్పి దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చేటట్లుగా చేసారు. వీరిలో కళాకృష్ణ గారు ఒకరు. వీరిరువురి శిష్యులలో ఎంతో మంది మన కుంతీమాధవ స్వామి ఆలయంలో నాట్య ప్రదర్శన చేసారు.

పెండ్యాల సత్యభామ గారి సొంత ఊరు చేబ్రోలులో ప్రతి సంవత్సరం ఒక నాట్య ప్రదర్శన చేయించడానికి నటరాజ రామకృష్ణ గారు డా. గజరావు సీతారామస్వామి గారిని కోరగా ఆ ప్రదర్శనను వారు వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏడు శ్రీరామనవమి కార్యక్రమాలలో నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం పిల్లా సత్యనారాయణ గారు, కొత్త ప్రవీణ గారు, లోకేష్ గారు కూచిపూడి నృత్యం విద్యార్థులకు నేర్పిస్తూ, వారిచే ప్రదర్శనలు ఇప్పిస్తూ పిఠాపురం మరియు చుట్టు ప్రక్కల గ్రామాలలో నాట్యకళకు జీవం పోస్తున్నారు.

మన పిఠాపురంలో సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నడపడానికి, అద్భుతమైన మన కళా సంపదను కాపాడటానికి యువత ఉత్సాహంతో ముందుకు రావాలని మరియు పోషించడానికి దాతలు ఆర్థిక సాయం అందించి పూర్వ వైభవాన్ని కొంతవరకైనా తీసుకువచ్చే దిశగా పయనించడానికి తోడ్పడవలసిందిగా కోరుతున్నాను.

మన సంపాదనలోను, మన సమయంలోను ఎంతో కొంత భాగం మన కళలను కాపాడటానికి, సమాజాన్ని ఉద్ధరించడానికి ఉపయోగిస్తే మన దేశం కోసం, దేశ సంపద కోసం మన బాధ్యతను నిర్వర్తించినవారమౌతాము మరియు మనకు తెలియకుండానే ఎంతో సంతృప్తిని పొందుతాం.

- గట్టి శ్రీకృష్ణ దేవరాయలు

వేణువు కళాకారుడు

ప్రారంభం నుండి సహృదయ మిత్రమండలి వ్యవస్థలో తన శక్తి మేరకు సేవాదృక్పథంతో పాటుపడుతుంది. ముఖ్యంగా వేసవి శిక్షణ తరగతులు, పలు చైతన్య కార్యక్రమాలతో పాటు మహాత్ముల జయంతి/ వర్ధంతికి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తుంది. మిత్రమండలి వంటి సంస్థలు సమాజ ప్రగతికి మరింత అవసరం.

- పి. ప్రకాశరావు

సేవయే పరమావధిగా 25 సంవత్సరాలు నుండి వివిధ కార్యక్రమాలు చేస్తున్న సహృదయ మిత్రమండలికి గత నాలుగు సంవత్సరాలుగా మా వంతు తోడ్పాటు అందించడం జరుగుతోంది. కీర్తిశేషులు మొల్లి అప్పారావు ఛారిటబుల్ ట్రస్ట్ పేరుతో వారి కుమారుడైన నేను పట్టణంలో మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు మొదలైన కార్యక్రమాలు నా శక్తి మేరకు నిర్వహిస్తున్నాను. **- మొల్లి నాగమల్లి రాజు**

సహృదయులైన మనుషులందరిని ఒకటిగా చేర్చి సృష్టించబడిన వేదికే సహృదయ మిత్రమండలి. పిఠాపురం మరియు పరిసర గ్రామాల్లో 25 సంవత్సరాలుగా ఎన్నో మంచి పనులు చేస్తూ, సొంత లాభం రాజ్యమేలుతున్న ప్రస్తుత సమాజంలో నిస్వార్థ సమాజసేవే లక్ష్యంగా సాగుతున్న మిత్రమండలి భవిష్యత్తులో మరింత నిరంతరంగా ఎదగాలని ఆశిస్తూ.

– కె. వీరబాబు (వీరభద్రరావు)

ఎందరో పేదలకు ఉచితంగా వైద్యం చేస్తూ వారికి ఆరోగ్యాన్ని అందిస్తూ ఆర్థికంగా చితికి పోకుండా ఆదుకుంటుంది మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవాసంస్థ. కేవలం శారీరక రుగ్మతలకే కాకుండా మానసిక బాధలను సులభంగా నయం చేయబడుతుంది ఈ హోమియో వైద్య విధానంలో. అలాగే సహృదయ మిత్రమండలి వారు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా తరగతులు, ఆరోగ్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు మొ॥వి సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఈ సంస్థలో పాల్గొనడం నాకు చాలా గర్వకారణంగా ఉంది. **- పి. జగదీష్**

ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోండి, దాన్నే మీ జీవిత లక్ష్యం చేసుకోండి. దాన్నే ధ్యానించండి, కలగనండి, శ్వాసించండి. ఇదే విజయానికి మార్గం.

మీరు మంచి తల్లిదండ్రులు కావాలంటే....

"నీ భవిష్యత్తును ఏ దేవుడు రాసి వుంచలేదు. నీకు నీవే యజమానివి. నీ భవిష్యత్తును నీవే నిర్ణయించుకో. నీవు ఆచరించు కర్మలకు నీవే కర్తవు, నీవు ఆచరించు శుభాశుభ కర్మలే నీ ఉన్నతిని గానీ, అధోగతిని గానీ నిర్దేశిస్తాయి".

– ధమ్మపదం

తల్లిని మించిన దైవం లేదు – తండ్రిని మించిన గురువు లేదు. తల్లిదండ్రులు –పిల్లల మధ్య సంబంధాల గురించి వివరించే ప్రయత్నమే ఈ వ్యాస లక్ష్యం. గతంలో ఉమ్మడి కుటంబాలు ఉండేవి. ఆ కుటుంబాలలో తాతల నుంచి మనుమళ్ళ దాకా ఎంతోమంది ఉండేవారు. పిల్లలకు అమ్మమ్మలు, అత్తమ్మలు, అక్కలు, ఇలా ఇతర కుటుంబ సంబంధీకులు ఎన్నో మంచి విషయాలను నేర్పేవారు. ఈ విధంగా కుటుంబమే పిల్లలకు మంచి సామాజికీకరణ సాధనంలా పనిచేసేది. వారిని మంచి వ్యక్తిత్వం ఉన్న వారిగా తీర్చిదిద్దేది. నేడు ఉమ్మడి కుటంబాలు కనుమరుగై చిన్న కుటుంబాలు ఏర్పడటంతో కుటుంబ సంబంధాలలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. జీవన వేగం పెరిగింది. పిల్లలకు అన్ని వసతులు సమకూరుతున్నాయి. కాని ఒక విషయం లోపించినట్లు కనిపిస్తుంది. అదే క్రమశిక్షణ. తల్లిదండ్రులిరువురు ఉద్యోగాలు చేస్తూ ఉన్న కుటుంబాలలో పిల్లలను క్రమశిక్షణలో ఉంచడంలో ఎక్కువగా విఫలమవుతున్నారు. పిల్లల మనస్తత్వం వివిధ దశలలో అభివృద్ధి చెందుతూ ఉంటుంది. 18 ఏళ్ళు వచ్చేసరికి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటారు. ఆయా దశలలో వారి మనస్తత్వాలు మారుతూ ఉంటాయి. తల్లిదండ్రలను పిల్లలు అప్పుడప్పుడు ధిక్కరిస్తూ ఉంటారు, వారిలో వస్తున్న ఈ మార్పులను తల్లిదండ్రలు గమనించి తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతూ ఉంటారు.

తమపిల్లలు తాము ఆశిస్తున్నట్టుగా ప్రవర్తించడం లేదని, తమ పిల్లలు మంచి పిల్లలు కావాలని, తాము అనుకున్నట్లుగా వ్యవహరించాలని, వారు సంఘంలో గౌరవం, మర్యాద కలిగినట్లుగా, హుందాగా నడుచుకోవాలనీ కోరుకుంటారు.

తల్లిదండ్రులు తమపిల్లలు వారు ఆశించినట్లుగా తయారు కావాలంటే, ముందుగా వారిలో మార్పు రావాలి. పిల్లలను అర్థం చేసుకుని అందుకు తగినట్లుగా ప్రవర్తించాలి. అప్పుడే వారు చెప్పినట్లుగా వింటారు. మంచి పిల్లలు కావాలంటే ముందు మంచి పేరెంట్ కావాలి. మంచి పేరెంట్ కాలేని వారు తమ పిల్లలు మంచి పిల్లలు కావాలని కోరుకునే హక్కు లేదని మానసిక శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు.

పిల్లలు కల్లా కపటం తెలియని వారు. వారి మనసు స్వచ్ఛమైన తెల్లకాగితం లాంటిది.. వాటి మీద ఏ రంగు వేస్తే ఆ ఆకర్షణ కలుగుతుంది.

ఏ అక్షరం రాస్తే ఆ పలుకే పలుకుతుంది. ఏ గీతగీస్తే ఆ ప్రభావం క్షణాల్లో ఆకట్టుకుంటుంది. మనం ఎలా మలిస్తే అలా సులువుగా, మారే మైనం ముద్దలాంటివారు చిన్నారులు, గాంధీజీలైనా, గాడ్సేలైనా, బిల్‌గేట్స్ అయినా, ఒసామా బిన్ లాడెన్లయినా వారి వ్యక్తిత్వ బీజాలు బాల్యం నుంచే పడతాయని మనస్తత్వ విశ్లేషకుల

అభిప్రాయం. అందుకే పిల్లలకు చిన్నతనం నుంచి సత్ప్రవర్తన, మేధోవికాసం, సానుకూల దృక్పథం వంటి విషయాలు నేర్పే తొలి గురువులు తల్లిదండ్రులే.

ఏమి నేర్పాలి - తల్లి దండ్రులు ఏమి చేయాలి?

- v మాటలు మృధువుగాను, ఎదుటివారు మెచ్చుకొనేలా ఉండాలని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి
- v పిల్లలకు ఏది నేర్పే ముందైనా, తల్లిదండ్రులు దానిని ఆచరించి చూపించాలి..
- v పిల్లలు ఒక మంచి పని చేసినపుడు, ఇతరులకు సాయపడినప్పుడు అభినందించాలి.
- v మంచి చెడుల మధ్య వ్యత్యాసాన్ని తల్లిదండ్రులే పిల్లలకు వివరించి చెప్పాలి.
- v అల్లరి చేసే పిల్లలను అనునయించి, కొంచెంసేపు మౌనంగా ఉంచి, అనంతరం వేరే విషయం మీదకు వారి దృష్టిని మళ్ళించాలి.
- v ఓ చిన్న అభినందన చిన్నారుల ఉన్నత గమ్యాలకు బాట వేస్తుంది.
- v పిల్లల మూడ్స్ కనిపెట్టేందుకు అనురాగంతో, ఆత్మీయంగా ప్రేమగా అడగండి. తమ బాధలు తప్పక చెబుతారు.
- v స్నేహంలోని మాధుర్యాన్ని తల్లిదండ్రులే పిల్లలకు రుచి చూపించాలి.
- v పిల్లలు చెప్పే ఏ విషయాన్నైనా చిరునవ్వుతో శ్రద్ధగా విని వారి సమస్యకు చక్కని పరిష్కారాన్ని చూపించాలి.
- v చూసింది అనుకరించే వయస్సు పిల్లల ముందు తల్లిదండ్రుల ప్రవర్తన సరైన రీతిలో సక్రమంగా ఉండాలి.
- v పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచాలి.
- v ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం లాంటివి మీ పిల్లల వ్యక్తిత్వాన్నే దెబ్బ తీస్తాయని అర్థమయ్యేలా చెప్పాలి.
- v మంకుపట్టు పట్టిన పిల్లలను ముందుగా మాట్లాడించరాదు.
- v పిల్లలు చేసే పని ఏదైనా పాడైతే పోనీలే, మరోసారి ప్రయత్నిద్దాం, ఈసారి చక్కగా చేద్దాం అని చెప్పాలి.
- v పిల్లలు పనులు చేశాకా విసిగిపోయి కూడా చిరాకు పడుతుంటారు. ఆ సమయంలో ఇదేంటిలా చేశావు అనకుండా, వారికి సాయం చెయ్యాలి.
- v ఏదైనా వస్తువు కోసం పట్టు పడితే వెంటనే ఇవ్వకపోవడం ఉత్తమం. మంకు పట్టుతో పని జరగదని వారికి అర్థం అవుతుంది.
- v పిల్లవాడు తనపట్టు వదిలి మీ దారిలోకి వస్తుంటే, వారిని దగ్గరకు తీసుకుని చెప్పినట్టు వింటున్నావంటూ అభినందించాలి.
- v అల్లరి చేశాడని శిక్షించడం, దూరంగా ఉంచడం మంచిది కాదు.
- v చెడయినా మంచయినా సరే పిల్లలు తల్లిదండ్రులతో పంచుకొనే వాతావరణం కల్పించాలి. పిల్లల పెంపకంలో ఇది చాలా ముఖ్యమైన అంశం.
- v గొడవలు, కొట్లాటలు జరిగినప్పుడు పిల్లలు ఏమి చెబుతున్నారో ప్రశాంతంగా వినాలి. ఆవేశంగా ప్రతిస్పందించకూడదు. అది స్కూలులో జరిగితే టీచర్ల దృష్టికి, ఇంటి దగ్గర జరిగితే అమ్మనాన్నలకు చెప్పమనాలి.

- v టీజ్ చేసే పిల్లలతో నేరుగా మాటలాడకుండా మరోసారి ఇలాంటి పొరపాటు చేస్తే మీ పెద్ద వాళ్ళతో మాట్లాడతాను అని చెప్పి నియంత్రించాలి.
- v పిల్లల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించేటప్పుడు వారిమధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడానికి తల్లిదండ్రులు ఎక్కువ చొరవ చూపాలి.
- v అమ్మాయిలు, అబ్బాయిలు స్నేహం పెంచుకునేటప్పుడు తమ స్నేహం ఏ దోవలో వెళ్తున్నదో నిర్ణయించుకోగలగాలి.
- v ఆడ, మగపిల్లలు స్నేహం చేయడమే తప్పు అనే వాదనతో ఏకీభవించకున్నా వివేకంతో దానికి పరిధులు ఏర్పరచుకోవడం మంచిది.
- v స్నేహంలో డిమాండ్లు అధికారదర్పం వంటివి ఉండకూడదు.
- v స్నేహితులని చెప్పకునేవారు ఏమాత్రం అతిగా ప్రవర్తించినా, ముందుగా పసిగట్టే మానసిక పరిణతి, వారిని నియంత్రించగల విశ్వాసం పిల్లలకు అలవాటు చేయాలి.
- v పిల్లలతో ఎలాంటి అరమరికలు లేకుండా స్వచ్ఛంగా ప్రవర్తించాలి.
- v తల్లిదండ్రులు గానీ, పిల్లలుగానీ ఇద్దరిలో ఎవరు గూఢంగా వ్యవహరించినా అది ప్రమాదాలకు, ఇబ్బందులకు దారితీస్తుంది.
- v ఎవరితోనూ స్నేహం చేయకు, ఎవరినీ నమ్మకు అని చెప్పవద్దు, కానీ స్నేహాల ఎంపికలోహద్దుల్లో తమ పిల్లలు జాగ్రత్తపడేలా చూడడం తల్లిదండ్రుల బాధ్యత.

తమకు తల్లిదండ్రులు సరియైన మానసిక భద్రత ఇవ్వలేక పోయినప్పుడు, పిల్లల ఆశలు – ఆశయాలకూ, తల్లిదండ్రుల ఆశయాలకూ మధ్య పట్టలేనంత అగాధాలున్నప్పుడూ, తమ భావాలను వ్యక్తపరిచే అవకాశం, స్వేచ్ఛ పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వలేక పోయినప్పుడూ – పిల్లలలో విపరీత ధోరణి వ్యక్తమవుతుంది, దానిని సరిచేసుకోవాలి. లేకపోతే తమను తల్లిదండ్రులే అర్థం చేసుకోరు, బయట స్నేహితులే నయం అనే అభిప్రాయం పిల్లల్లో కలుగుతుంది.

- v అధికారికంగా కాకుండా ప్రేమగా ఏ విషయమైనా పిల్లలకు నచ్చ జెప్పాలి
- v పిల్లలకు ముందు తల్లిదండ్రులే రోల్ మోడల్స్ కావాలి.
- v డబ్బు ఖర్చు చేయడంలో ప్రాధాన్యతలు గుర్తించేలా పిల్లలకు తర్ఫీదునివ్వాలి.
- v చిన్నకోరికలే కదా అనుకుంటూ పిల్లలు అడిగిందల్లా కొనిచ్చి ఆర్థిక భారం పెంచుకోకండి.
- v లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం, దాన్ని సాధించే వరకు ప్రయత్నాలు విడవకుండా చేసే పట్టుదల, ఆత్మవిశ్వాసం మీ పిల్లల్లో కలిగించండి.
- v ప్రతిరోజూ తల్లిదండ్రులు విలువైన సమయాన్ని కేటాయించాలి.

- ఇంటా బయటా జరిగిన విషయాలు పంచుకుంటే భరోసా దొరుకుతుందనే నమ్మకం పిల్లల్లో కలిగించాలి.
- భార్యా భర్తలు అన్యోన్యంగా ఉన్నప్పుడే పిల్లలపై పూర్తి శ్రద్ధ చూపుతారు.
- అమ్మా నాన్నల్లో ఒకరిపై భయం ఉన్నా, మరొకరి వద్ద స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం ఉండాలి.
- పిల్లల లక్ష్యాన్ని తెలుసుకొని ప్రోత్సహించినపుడు ఎలా నడవాలనేది నేర్చుకుంటారు.
- పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించి భుజం తడితే కన్న వారి మాటలు గౌరవిస్తారు, వారికి నమ్మకం పెరుగుతుంది.
- ఆలూమగలు పిల్లల ఎదుట కలహించుకోకూడదు.
- తల్లిదండ్రులు ఎంత పని ఒత్తిడిలో ఉన్నా, ఇబ్బందులు చవిచూస్తున్నా బిడ్డల కదలికలు - భావోద్వేగాలు- అలవాట్లను నిరంతరం పర్యవేక్షించాలి.
- ఏ పని ప్రారంభించే ముందైనా పిల్లల్లో అనుమానాలు, భయాలు తలెత్తకుండా చూడాలి.

చివరిగా ఒక్క మాట

ప్రతి కుటంబంలో పిల్లల పెంపకం బాధ్యత నూటికి నూరు శాతం తల్లిదండ్రులది. పిల్లలను బాల్యం నుండే సత్ప్రవర్తన, సానుకూల దృక్పథం, మేధోవికాసం, మృధువైన భాష, ఎదుటవారి పట్ల ప్రేమ, దయ, నమ్రత కలిగి ఉండడం, నిజాయితీ, సేవా పరాయణత, క్రమ శిక్షణ, సమయ పాలన పాటించడం, ఎపుడైనా, ఎవరితోనైనా హుందాగా ప్రవర్తించడం, వాస్తవికతను మృదువుగా ఎవరు నొచ్చుకోకుండా చెప్పడం, అవాస్తవాల జోలికి పోకుండా ఉండటం, ఎవరినీ నిందించడం, తప్పుగా మాట్లాడడం, అవహేళన చేయకుండా ఉండటం, పరిస్థితులకు అనుకూలంగా స్పందించడం వంటి లక్షణాలు కలిగి ఉండి పిల్లలకు ఆదర్శవంతంగా ఉన్న తల్లిదండ్రులు మంచి పేరెంట్‌గా మనగలుగుతారు. వారు మాత్రమే చక్కని సుశిక్షిత భావి భారతపౌరులను సమాజానికి అందించగలుగుతారు. ఈ విశాల భారత దేశంలో ప్రతి తల్లీ - తండ్రి మంచి పేరెంట్‌గా వర్ధిల్లాలనీ, వారి పిల్లలు ఉత్తమ భావి భారత పౌరులుగా వెలుగొందాలనీ ఆశిస్తూ..

- గంగబాబు నేమిశెట్టి

డైరెక్టర్, విద్యావికాస్ కోచింగ్ సెంటర్

"పరిశీలించకుండా ఏ విషయాన్ని గుడ్డిగా విశ్వసించవద్దు. మతగ్రంథంలో రాసి వుందని గానీ, పెద్ద గురువు చెప్పాడని గానీ, తాత ముత్తాతల నుండి పాటిస్తున్నారని గాని, సాంప్రదాయికంగా వస్తుందని గానీ, ఆ వ్యక్తి చాలా కళాత్మకంగా చెప్పారని గానీ, ఎక్కువ మంది పాటిస్తున్నారని గానీ లేక నీ అంతట నీవు ఊహించుకుని గానీ, దేనినీ గుడ్డిగా విశ్వసించవద్దు. దానిని నీ అనుభవం అనే గీటురాయిపై పరీక్షించి, అది సర్వులకూ హితాన్ని - సుఖాన్నీ కలిగిస్తుందో లేదో పరిశీలించు, తగు యోగ్యమైనదని తేలితే స్వీకరించు, లేకుంటే అవతల పెట్టు".

- కాలామసుత్తం.

ఖాదీ చేనేత పరిశ్రమ - ఒక అవగాహన

"ఖద్దరు వస్త్రం" మన భారత దేశంలోనే కాక ప్రపంచంలోనే విశిష్ఠ స్థానము సంపాదించుకున్నది. దీనిని 'ఖాదీ' లేక చేతితోనేసిన వస్త్రం అని కూడా సంభోదిస్తూ ఉంటారు.

స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్మాగాంధీ కూడా 1920లో 'విదేశీ వస్త్రదహనం' అనే నినాదంతో ఈ స్వదేశీ దుస్తులు/వస్త్రాలు తయారీకి విశేష ప్రాచుర్యం కల్పించి ప్రతీ యింటినందు విధిగా 'చరఖా' (నూలువడుకు రాట్నం) ఉపయోగించి ప్రజలు ఎవరికివారు వారికి అవసరమైన వస్త్రాలను తయారు చేసుకోవలెనని యిచ్చిన పిలుపు మేరకు ప్రతీ ఇంట ఊరు వాడ ప్రజలు నూలు తయారు చేయుట ప్రారంభించారు.

1947 స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కొంతకాలం వరకు భారత జాతీయ పతాకం మధ్యలో 'నూలు వడికే రాట్నం' చిహ్నంగా ఉన్నదంటే 'చేనేత వ్యవస్థ' కు ఆ రోజుల్లో ప్రభుత్వం ఎంత ప్రాముఖ్యతను యిచ్చిందో మనకు అర్థమౌతుంది. ఈ నేపధ్యంలో భారత ప్రభుత్వం ఖాదీ పరిశ్రమను గ్రామీణ ప్రాంత వాసులకు ప్రోత్సాహాన్నిచ్చి చిన్న మధ్య తరహా పరిశ్రమగాను గుర్తించి KVIC (Khadi Village Industries Commission) ఏర్పాటు చేస్తూ పార్లమెంటు చట్టం ద్వారా చట్టబద్ధతను కూడా కల్పించింది.

ఈ విధంగా భారతదేశం మొత్తం మీద చిన్న తరహా ఖాదీ ఉత్పత్తి సంస్థలు సుమారు 5,600 అధికారికంగా నమోదు అయినట్లు వాటికి గ్రామాలలో అనుబంధ సంస్థలుగా సుమారు 30,138 కోఆపరేటివ్ సొసైటీలుగా ఏర్పడి దగ్గర దగ్గరగా 95 లక్షలు మంది ఈ చేనేత రంగంపై ఆధారపడి ఉన్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. బ్యాంకుల ద్వారా ఋణ సౌకర్యం కల్పించి చేతి మగ్గాలపై నేస్తున్న నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటూ సహకరిస్తుంది.

చేతితో నూలువడికి, నేతన్నలు స్వయంగా మగ్గంపై నేస్తున్న వస్త్రాలకు మంచి గిరాకి ఉంటుంది. చేతితో నేసిన వస్త్రాలు శ్రేష్ఠమైనవిగా వినియోగదారులు భావించి అధికధరలు ఉన్నప్పటికి కొనుగోలు చేస్తూ ఉంటారు. అదే విధంగా 'ఖాదీబండార్' 'ఆప్కో', 'కో-ఆప్టెక్స్' మొ॥ పేర్లతో షాపులు ద్వారా మార్కెటింగ్ అమ్మకాలు సాగిస్తూ కొంతమంది ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తుంది. చేనేత పరిశ్రమ అంటే కేవలం చేతితో నేసిన వస్త్రాల తయారీ! ఈ విధంగా మన ఆంధ్రప్రదేశ్‌లో పొందూరు, మంగళగిరి, ఉప్పాడ, తాటిపర్తి, గుంటూరు, మొ॥ ప్రాంతాలలో ఎక్కువ కుటుంబాలు సదరు చేనేత, పట్టు వస్త్రాలను తయారుచేసి దేశమంతటా సరఫరా చేస్తున్నారు. మరియు ఇతర దేశములకు ఎగుమతులు జరుగుచున్నవి.

భారతదేశం మొత్తం మీద ఈ చేనేత పరిశ్రమ స్వాతంత్ర్యం రాకముందు నుంచి బెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక మొ॥ ప్రాంతాల్లో ఎక్కువగా కనబడేది. కాలక్రమేణా పారిశ్రామీకరణ (Industrilization) ప్రభావం విస్తరించి చేనేత మగ్గములుస్థానే మిల్లుమగ్గాలు రావడం వలన ఉత్పత్తి వ్యయం అధికం కావడం వల్ల చేనేత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను 'సబ్సిడి' రూపేణా

చేనేత కుటుంబాలకు తక్కువ వడ్డీకి ఋణసౌకర్యం కల్పిస్తూ ఎన్నో చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి.

వినియోదారులు కూడా చేతితో నేసిన వస్త్రాలు మన్నికైనవని, శ్రేష్టమైనవని, చల్లదనాన్ని కల్పిస్తున్నాయని, శరీరం నుంచి విడుదల అవుచున్న చెమటను, తేమను పీల్చు గుణం ఉన్నదని, ఠీవికి, దర్పానికి, హుందాతనంగా ఉండటానికి చేనేత వస్త్రాలు ఉపయోగపడటం వలన వీటికి అధిక ప్రాధాన్యతను యిస్తూ వాడుచున్నారు, ఆదరిస్తున్నారు, అభిమానిస్తున్నారు. చేనేత పరిశ్రమ మరింత వర్ధిల్లాలని కోరుకుందాం. **-గండేపల్లి వెంకట సత్యనారాయణ**

"సహృదయ మిత్రమండలి"సంస్థ చేసిన సేవలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఈ సంస్థ సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. **- బొమ్మిడి మాధవ్**

"సహృదయ మిత్రమండలి -స్వచ్ఛంద సంస్థ సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సంస్థ ప్రతి కార్యక్రమం కూడా ప్రజల జీవితంలో మార్పు తీసుకువచ్చేలా రూపొందిస్తుంది. సేవంటే కేవలం మాటల్లోనే కాదు, చేతల్లో చూపించగలమని ఈ సంస్థ నిరూపిస్తుంది. ఈ సంస్థకు నా హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. **-శ్రీ బోనం పరమేష్**

సహృదయ మిత్రమండలి స్వచ్ఛంద సంస్థ సమాజానికి చేస్తున్న సేవలు నిజంగా అభినందనీయమైనవి. ఉదాహరణకు విద్య ,ఆరోగ్యం, పర్యావరణం, విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు, కార్యక్రమాలు దిశగా ఈ సంస్థ చేస్తున్న కృషి నిజంగా ప్రశంసనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

- శ్రీమతి పి. గంగా పావని

జీవితంలో ఏవీ నీ వెనుక రావు సంతోషంతో గడిపిన క్షణాలు తప్ప. మనం సంపాదించింది ఏదీ మనది కాదు, ఒక్క మంచితనం, పుణ్యం, ఎదుటివారి హృదయంలో ప్రేమ తప్ప . మనల్ని నిలబెట్టేది, నడిపించేది మనం పెంచుకునే మంచి ఆలోచన మాత్రమే. అన్నదానం ఆకలి తీరుస్తే, అక్షర జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది. అలాంటి మహోన్నత కార్యక్రమానికి కంకణం కట్టుకుని 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న సహృదయ మిత్రమండలికి ఇవే శుభాభినందనలు. రజతోత్సవ శుభాకాంక్షలు. **- దువ్వాడ సాల్మన్ రాజు,** రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్



పవిత్రంగా ఉండటం ఇతరులకు మంచి చేయటం మతం యొక్క సారాంశం ఇదే.

వేమన - గురజాడ





తెలుగు సాహిత్యంలో వేమన నెలకొల్పిన మానవతా హేతువాదాలు, సామాజిక వాస్తవ దృక్పధాలు ఆధునిక కవిత్వానికి పూర్వరంగాన్ని, పునాదిని నెలకొల్పాయి. ఆధునిక సాహిత్యానికి ఆద్యులైన గురజాడ అప్పారావు గారు వేమన నుండి సరళమైన ఛందస్సును, ప్రజా వ్యవహారిక నిత్య భాషను, జీవితానికి దగ్గరైన ఉపమానాలు, ఉదాహరణలు, వ్యవహారంలో ఉన్న జాతీయాలు, లోకోక్తులు సందర్భోచితంగా ఉపయోగించుకోవాలనే విషయాలు గ్రహించారని మనం గమనించవచ్చు.

వేమన అప్పటికి వినియోగంలో ఉన్న ఛందస్సులోని అతి చిన్నదై, తేలికైన ఆటవెలదిని తనది చేసుకున్నాడు. గురజాడ కూడా జానపద జీవితంలోని 'ముత్యాల సరాలు' అనబడే ఛందస్సును తన స్వంతం చేసుకున్నాడు. రెండింటిలోనూ గ్రాంధికతా ముద్ర ఉన్నా, వ్యవహార భాషయే ఉపయోగించబడింది.

'ఉర్విజనులకెల్ల నొక్క కంచము బెట్టి,
పొత్తు గడిపి కులము పొలియజేసి
తలను చేయి పెట్టి తగనమ్మ జెప్పరా!" అన్న వేమన్న పద్యములోని భావము

ఎల్ల లోకము లొక్కయిల్లై
వర్ణ భేదము లెల్ల కల్లై అన్న గురజాడ భావము ఒక్కటే.

రాతి బొమ్మకేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును
కూడుగుడ్డ తాను గోరునా దేవుడు అని విగ్రహారాధనను ఖండిస్తే

మనిషి చేసిన రాయి రప్పకు,
మహిమ కలదని సాగి మ్రొక్కుచు,
మనుషులంటే రాయి రప్పల కన్నహీనం అని పై భావాన్నే ధృవపరుస్తాడు.

తనదునాత్మ యందు దైవంబు గలుగంగ
తీర్ధయాత్రకిల తిరుగు నరుడు
గంధపు తునకలు గడ్డి మోసిన యట్లు" అని వేమన అంటే

కన్ను దెరిచిన కానబడదో
మనిషి మాతృని యందు లేడో
యెరిగి కోరిన కరగి ఈడోముక్తి" అని గురజాడ అంటారు.

భగవంతుడు ప్రతి జీవిలోనూ ఉన్నాడు. అంతకు మించి ఇతర దైవం లేదు.

వేమన్న కవితలో భావాలు, భాష తూకం వేసినట్లు ఆదేశరూపంలో ఉంటాయి. జాషువా భావాలకంటే భాష తేలికగా నిదానంగా సాగుతుంది.

గుహలలోన జొచ్చి గురువులను వెదకంగ,
క్రూర మృగ మొకండు తారసిలిన,
ముక్తి మార్గమదియె ముందుగ జూపురా" అన్నది వేమన హాస్యోక్తి

దేవుడెక్కడొ దాగెనంటూ
కొండ కోనల వెదకులాడెద వేల బేలా అంటాడు గురజాడ

మాలవానినేల మహిమీద నిందింప
నొడల రక్తమాంస మొకటి గాదె
మాల మాలగాడు మహిమీద నేప్రొద్దు
మాట తిరుగువాడె మాలవాడు
వాని మాలయన్న వాడిపో పెనుమాల అంటూ వేమల అస్పృశ్యతా నివారణకు నాంది పలికాడు.

మలిన జీవుల మాలలనడం తప్పనీ
మలిన చిత్తులె 'మాలలని' వక్కాణించాడు
మంచియన్నది మాల అయితే
మాల నేనగుదు అంటూ అస్పృశ్యుల యెడ ఆదరాభిమానాలు ప్రకటించారు.

వేమన్న 'జాడలు' గురజాడలో మెండు, అందుకే వేమన్నను విస్మరించిన వాడు గురజాడను స్మరించలేడు. గురజాడ ఆణిముత్యాలకు మాతృక వేమన్న 'ఆదిముత్యాలు' అనడం అతిశయోక్తి కాదు.

ఒక్కమాటలో గురజాడ 'దేశమును ప్రేమించుమంటే'
వేమన్న ప్రపంచమునే ప్రేమించమన్నాడు.
గురజాడది జాతీయ దృక్పథము అయితే వేమన్నది అంతర్జాతీయ విశ్వమానవ దృక్పథము.
వేమన్నది నల్లదొరల హయాం, గురజాడది తెల్లదొరల హయాం.

'దేశమును ప్రేమించుమన్నా' గురజాడ పలుకు జాతీయ వాదంలా అనిపించినా అది ఏ ఒక్క దేశానికో పరిమితమైనది కాదు. విశ్వజనీనమైన భావమున్న గేయమది. ప్రపంచంలో ఏ దేశ వాసియైన వారి భాషలోనికి అనువదించుకుని అన్వయించుకోగల గేయమది.

అందుకే గురజాడ, వేమనల మనసొకటే, మాటే వేరు.

-తటవర్తి సుబ్బారావు

రిటైర్డ్ ఉపాధ్యాయులు

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి - కాలజ్ఞానం

సృష్టిలో ఎందరెందరో మహానుభావులు, ఎవరి ప్రత్యేకత వారిదే. అందరి ఆలోచనా, ధ్యేయం మానవోద్ధరణ, సమాజ శ్రేయస్సు, పద్ధతులు వేరు - మార్గాలు వేరు కావచ్చు. నదులన్నీ సాగరాన కలిసేటట్టుగా, ఈ మహానుభావుల ఆలోచనల అంతిమ ధ్యేయం మనిషిని, మంచి మనిషిగా మహితాత్మునిగా తీర్చడమే. అలా పేరెన్నికగన్న మహానుభావులలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఒకరు. వీరి జన్మస్థలం కడప జిల్లా, పోతులూరు. తల్లిదండ్రులు పోతులూరి పరిపూర్ణామాచార్యులు, ప్రకృతాంబ. జనన కాలం 1608, జీవసమాధిలోకి ప్రవేశం 1693.

బనగానపల్లిలోని గరిమరెడ్డి అచ్చెమ్మ గారి వద్ద గోవుల కాపరిగా చేరి రవ్వలకొండ వద్ద గుహలో ధ్యాన నిమగ్నుడై తాటియాకుల మీద కాలజ్ఞానపదాలు లిఖించారు. పదునాలుగు వేల పదాలు కలిగిన కాలజ్ఞానమును అచ్చెమ్మ గారి యింట పాతరవేసి దాచినట్లుగా జీవిత చరిత్రలో చెప్పబడింది. వారు, వారి శిష్యులు తదనంతర కాలంలో ఊరూరు తిరిగినపుడు ఆ కాలజ్ఞానాన్ని గానం చేస్తూ జనావళి నాలుకలపై నర్తింపజేసారు. కాలజ్ఞానానికి సజీవితను కూర్చారు. వీరిని భగవత్ స్వరూపునిగా యెంచి వారి అవతారాల పరంపరలో వీరబ్రహ్మేంద్రస్వామిని ఒక అవతారంగా చెప్పి తరువాత మరికొన్ని అవతారాలుగా కొనసాగినట్లుగా చెబుతారు.

మూఢనమ్మకాలను, అర్ధరహిత కట్టుబాట్లను ధైర్యంగా ఖండించిన మహాజ్ఞాని, విప్లవ వైతాళికుడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి. మనుష్యులను జ్ఞానవంతులుగా తీర్చి సమాజాన్ని మునుముందుకు నడిపించడం ఒక ఎత్తైతే, వారి దూరదృష్టి భవిష్యత్‌ను దర్శించగల జ్ఞాననేత్రం ఆయనకు దైవానుగ్రహాన ప్రసాదింపబడటం ఒక గొప్పవరం. ఇది అద్భుతం. అనన్య సామాన్యం. వారి ఈ కాలజ్ఞాన శక్తి ఆయనను మహాత్మునిగా, మహితాత్మునిగా చేసి దేవతామూర్తుల వరుసలో పీఠం వేసింది. వందల సంవత్సరాల క్రితం వీరు చెప్పిన నమ్మశక్యం గాని విషయాలు నిజమై, కనుల ముందు జరుగుతున్న నిత్యసత్యాలై సమాజాన్ని అబ్బుర పరిచాయి, పరుస్తున్నాయి. అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తున్నాయి.

పురాణ ప్రఖ్యాతి గాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం ఎదురుగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం 1969 సంవత్సరంలో నిర్మించబడింది. ఇది కాలక్రమేణ బాగా శిధిలావస్థకు చేరగా 2024 సం॥లో ప్రభుత్వం వారి ఆర్థిక సహాయం మరియు భక్తుల విరాళాలతో అదే స్థలంలో నూతన దేవాలయం నిర్మించి 2025 జూన్ 5వ తేదీన నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగినది. ప్రస్తుతం నిత్య నీరాజనాలు అందుకుంటూ నిత్యం ధూప దీప నైవేద్యాలతో భక్తులను శ్రీవారు అలరిస్తున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఏడు రోజుల పాటు బ్రహ్మాండంగా ఉత్సవాలు జరుపుతూ ఆఖరి రోజున స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరపడంతో కార్యక్రమాలు పూర్తి అవుతాయి.



-వరదా వీరభద్రరావు, రిటైర్డ్ యం.ఇ.ఓ.

భీరుడు ఒక్కసారే మరణిస్తాడు, పిరికివాడు క్షణక్షణం మరణిస్తాడు.

కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి- పిఠాపురం

తెలుగు సాహిత్య చరిత్రలో సంస్థానాలకు సముచిత స్థానముంది. సంస్థానాధీశుల అభిరుచులను అనుసరించి కవులు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు గౌరవించబడి అటు సంస్థానాలకు, ఇటు ఆయా రంగాలకు ఎంతో పేరు తెచ్చిపెట్టారు. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రివంటివారు "నానారాజ సందర్శనం" చేసి సత్కారాలు పొందితే వెంకట రామకృష్ణ కవుల వంటివారు ఒకే సంస్థానంలో ఉంటూ రచనలు చేసి సత్కారాలు పొందారు, సాహిత్యసేవా చేశారు.

సాహిత్యానికి పెద్దపీట వేసిన సంస్థానాలలో పీఠికాపుర సంస్థానానికీ, దాని రాజావారు శ్రీరావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరు గారికి సింహభాగం దక్కుతుంది. ఆయన విద్యాసంస్థలకు విద్యావంతులకు ఇచ్చిన గౌరవం సామాన్యమైనది కాదు.

ప్రస్తుత విషయానికి వస్తే మా పెదతండ్రి మహాకవి మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారికి, పీఠికాపుర సంస్థానానికి సన్నిహిత సంబంధం ఉంది. ఒకటి తన మేనత్త భర్త, జంటకవులలో ఒకరు, శ్రీ వేంకటరామశాస్త్రిగారు పీఠికాపుర ఆస్థానకవి కావడం, రెండు సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయంలో ఉద్యోగం చేయడం. ఈ రెండు అంశాలూ అనంతర కాలంలో మధునాపంతుల వారిని ఎంతో ప్రభావితం చేసినట్లు చెప్పవచ్చు.

మధునాపంతుల వారికి కవితాగురువు వేంకట రామశాస్త్రిగారు. తొలినాళ్ళలో సత్యనారాయణ శాస్త్రిగారు వ్రాసిన పద్యలేఖకు సమాధానంగా "కవివౌదు నీవు నీమామయ్యపగిది" అంటూ ఆశీర్వాదాలు పలికారు. ఆ ఆశీర్వాదాలు పుష్పించి, ఫలించి తెలుగునాట మధునాపంతుల వారికి సాహిత్యలోకంలో సముచిత స్థానాన్ని సంపాదించి పెట్టాయి. మహాకవి మధునాపంతులుగా పేరుతెచ్చి పెట్టాయి.

సిద్ధార్థి నామసంవత్సర ఫాల్గుణ బహుళ పూర్ణిమ అంటే మార్చి 5,1920 ఉదయం 6 గం.ల 20ని.లకు కవిచంద్రుల శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు తన మాతామహుల ఇంట జన్మించారు. తదుపరి ఆయన కళాప్రపూర్ణులయిన సంగతి అందరికీ తెలిసిందే. సత్యనారాయణ శాస్త్రిగారి స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామం. తండ్రి సత్యనారాయణమూర్తి, తల్లి లక్ష్మమ్మ.

పల్లిపాలెం సాహితీసమరంలో సాక్షిగా నిలచిన గ్రామం. తిరుపతి వెంకటకవులు, వెంకట రామకృష్ణ కవులు ఈ గ్రామంతో అత్యంత సన్నిహిత సంబంధం కలిగినవారు. వెంకటశాస్త్రిగారి కావ్యగురువు సూరయ్య శాస్త్రిగారు. వీరు సత్యనారాయణశాస్త్రిగారికి పితామహులు. వేంకటరామశాస్త్రిగారి స్వగ్రామం పల్లిపాలెం. సత్యనారాయణ శాస్త్రిగారు మేనత్త భర్త వేంకట రామశాస్త్రి గారు. చుట్టుప్రక్కల కోలంక, ఇంజరం, కుయ్యేరు, పిల్లంక గ్రామాలలో సాహిత్య వాతావరణం సమృద్ధిగా గల రోజులు.

తిరుపతికవుల ప్రసిద్ధమైన పద్యం "ఇంజరం ఒక సాక్షి, యానాము తాసాక్షి – పల్లిపాలెంబు తానెల్ల

సాక్షి... మధునపంతుల సూరయ్య బుధురు సాక్షి" ఈ పద్యం సాహిత్య సమరంలో ప్రముఖస్థానం ఆక్రమించింది.

తన ఐదవ యేట అక్షరాభ్యాసం చేసిన శాస్త్రి గారు పదవ సంవత్సరంలో ఎలిమెంటరీ చదువు పూర్తి చేసుకొన్నారు. సహజంగా కవులతోటీ పండితులతోటీ సన్నిహిత సంబంధాలు గల సత్యనారాయణమూర్తి గారు తన కుమారుణ్ణి ఇంజరం సంస్కృత పాఠశాలలో జేర్పించారు.

అందరి తండ్రుల్లా కొడుకును ఇంగ్లీషు చదివించాలని అనుకోక "కొడుకు సత్కవియగుటకు కోర్కెపడిన తండ్రి' సత్యనారాయణమూర్తి గారు. అనంతర కాలంలో తండ్రి కోర్కె ఆంధ్రపురాణం, ఆంధ్ర రచయితలు, అనేక ఖండకావ్యాల ద్వారా తీర్చి ..."నాయనా... నీకు ఋణపడినాడ నేను" అని వినయంగా చాటుకొన్నారు సత్యనారాయణ శాస్త్రి గారు.

శతావధాని ఓలేటి వేంకట రామశాస్త్రిగారు పీఠికాపుర సంస్థాన కవి. మధునాపంతులవారికి మేనత్త భర్త. సాధారణంగా మేనమామలు స్ఫూర్తిదాతలు అవుతారు. కానీ శాస్త్రిగారి విషయంలో మేనత్త భర్త స్ఫూర్తి దాతలయ్యారు.

ఆయన పల్లిపాలెం రావడం, పిఠాపురం విశేషాలు ఆయన రచిస్తున్న 'ఆంధ్రకథాసరిత్సాగరం' లోని ఘట్టాలు చదివి వినిపించడం, వాటిని శ్రీ శాస్త్రిగారు ఆసక్తిగా వినడం చేసేవారట.

మామయ్యగారి ఆశీర్వచన ప్రభావం వల్ల తాను కవిగా మారానని శాస్త్రిగారు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. మద్రాసు అడయారులోగల రాజావారి బంగ్లాలో ఉన్న ఓలేటి వేంకటరామశాస్త్రిగారు సత్యనారాయణశాస్త్రి గారి నుండి ఒక లేఖ అందుకొన్నారు. ఆ లేఖ పద్యాలలో వ్రాయబడింది. అది ఒక సీసపద్యం. చరణాలు పూర్తి కావడం కోసం "షేక్స్ పియర్", "తులసీదాస్" లతో పోల్చి పూర్తిచేసారు. దానికి సమాధానంగా 1933 సెప్టెంబరు 11న ఒక లేఖ వచ్చింది.

"అసమానంబగు పాండితీ విభవమీవార్జించి మాకెల్ల పం
తనముం గూర్చుచు సత్కవీశ్వరత నేన్నత్యంబునుం
గీర్తియున్ వసుధం బెంపువహింప వర్ధిలగదే వత్సా!
చిరంజీవివై పసివానిన్ నినుఁగూర్చి పెక్కు పలుకన్ భావ్యంబె మాబోంట్లకున్ అని

1934లో కోలంకలో తన తండ్రిగారికి జరిగిన 'భిషగ్రత్న' సన్మాన సభలో తొలిసారి వేదికనెక్కి తాను రచించిన పద్యాలు చదివారు. 1938లో 'ఆంధ్రీకుటీరాన్ని' స్థాపించి తొలి ప్రచురణగా 'తోరణము' ఖండ కావ్యం వెలువడింది. దానికి విశ్వనాథ పీఠిక వ్రాసారు.

పీఠికాపుర సంస్థానంలో ఎందరో కవులు, పండితులు ఉన్నా రాజా వారిచే "గురువుగారు"గా సంబో ధింపబడి, రాజా వారితో అత్యంత సన్నిహిత సంబంధం కలిగి ఉండేది వెంకటరామశాస్త్రిగారు మాత్రమే. ఆ సాన్నిహిత్యంతోనే రాజావారితో నీలగిరి, డార్జిలింగ్, మైసూరు ప్రాంతాలు సందర్శించి అక్కడి విశేషాలు మధునాపంతులవారితో చెప్పేవారట.

''ఆంధ్రీకుటీరం' ద్వారా 'ఆంధ్రి' పత్రిక ద్వారా సాహిత్యలోకంలో తనకొక స్థానాన్ని సంపాదించుకొన్నారు. ఆంధ్రి పత్రిక సంపాదకుడిగా ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. పత్రికలో ప్రచురింపబడిన ప్రతి రచన క్రింద అప్పటి కప్పుడే సంపాదకుడి అభిప్రాయం ప్రచురించే వారు. ఇది కత్తిమీద సాములాంటి పని. ప్రశంసలు అంగీకరించగలరు కానీ విమర్శను సహింపలేరు కదా! ఇది ఒక వాంఛనీయ సంప్రదాయం. ఈ సంప్రదాయం పాటించడంలో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి వంటి వారిని కూడా ఉపేక్ష చేయలేదు. వారు కూడా దానిని సహృదయతతో స్వీకరింపక తప్పలేదు. అంతటి ఉన్నత ప్రమాణాలతో వెలువడిన పత్రిక ఆంధ్రి. మూడు సంవత్సరాల తర్వాత ప్రపంచ యుద్ధం, కాగితాల కరువు, ఉచితంగా ముద్రించి ఇచ్చే ముద్రణాలయం మూత పడడం ఇలాంటి అనేక కారణాల వద్ద 'ఆంధ్రి' మూత పడింది. ఆనాటి సత్యనారాయణశాస్త్రి గారి మనోవేదనకు ఈ క్రింది పద్యం ఉదాహరణ.

"అది మూడేడుల ముచ్చటై నడచిపో, నల్లల్లనన్ సాహితీ
హృదయస్పందము గుర్తులందుకొని 'ఆంధ్రీ' పత్రికారత్నమ
భ్యుదయచ్ఛాయులకెక్కు కాలమున నయ్యోపాపినై యాపిణి
న్నదరిద్రుండను, నిద్రలో గలవరింతలే నేటి నాయూహముల్"

1940 కాకినాడ పి.ఆర్. కాలేజీలో 'ఆంధ్రాభ్యుదయోత్సవాలు' జరిగాయి. సభకి అధ్యక్షులు చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారు. ఆ సభల కవిగా మధునాపంతులు పాల్గొని 'ఆంధ్రాభ్యర్చన' అనే శీర్షికతో పద్యాలు చదివారు.

1941లో సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయంలో పండితులుగా ఉద్యోగంలో చేరారు. జీతం నెలకు 20 రూపాయలు. ఐదు నెలలు తరువాత మరో ఐదు రూపాయిలు జీతం పెంచారు. తరువాతి కాలంలో ఆ సంస్థ 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' పుస్తక భాండాగారమునకు అనుబంధ సంస్థగా మారింది.

1943లో పిఠాపురం రాజావారు కాకినాడ వచ్చినప్పుడు శాస్త్రి గారిని వారి బంగళాకు పిలిపించుకుని గౌరవ పూర్వకంగా సాహిత్య విషయాలు చర్చించారు. "ఆంధ్రి" పత్రికవల్ల ఆస్థానకవి వేంకటరామశాస్త్రి గారి మేనల్లుడుగానూ, రాజావారు గౌరవంగా మాట్లాడడమే కాకుండా సర్వజ్ఞ సింగభూపాలుడు రచించిన 'రత్న పాంచాలిక' సంస్కృత నాటకాన్ని తెలుగులో అనువదించమని, పదిరోజులలో పూర్తిచేసి ఇవ్వాలని అడిగారు. ఆ ప్రకారమే రత్న పాంచాలిక ఆంధ్రీకరణం పూర్తిచేశారు. మద్రాసులో ఉన్న రాజావారు శాస్త్రిగారి అనువాదాన్ని ఆయన చేతనే సంపూర్ణంగా చదివించుకొని విని సంతోషించారు. శ్రీ శాస్త్రిగారు రెండు నెలలు పిఠాపురంలో ఉండి దాని ముద్రణ పూర్తి చేశారు. దానికి శ్రీ రాజా వారే తొలిపలుకులు వ్రాశారు. ఒకవైపు సంస్కృతములోను మఱియొకవైపు అనువాదము ముద్రించారు.

శ్రీరాజావారు మద్రాసులో ఉన్నప్పుడు ఈ అనువాద నాటకమును గిడుగు సీతాపతిగారికిచ్చి సినీ తారలతో దీనిని ప్రదర్శింపచేయాలని చెప్పగా, వారు అలాగే! అని వారికి చెప్పి, మరువాడు అనువాదము

ప్రదర్శనానుకూలముగా లేదు. కొన్ని తప్పులు ఉన్నాయి అనిచెప్పి దానిని తాను ప్రదర్శనా యోగ్యముగా వ్రాయ గలనని చెప్పగా రాజావారు అందుకు అంగీకరించారు.

ఈ సంగతులు విన్న కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రి గారు అచ్చుతప్పులను శాస్త్రిగారు (మధునాపంతుల గారు) వ్రాసిన తప్పులుగా పేర్కొనడమే కాక పరుషంగా మాట్లాడగా 18.6.43లో నిఘంటు కార్యాలయం ఉద్యోగానికి రాజీనామాచేసి, వారి సోదరులు మారయ్య శాస్త్రి గారిచేత రాజీనామాపత్రం పంపి పల్లిపాలెం చేరారు. రాజీనామాను చూసి సుబ్బయ్యగారు పశ్చాత్తాపం చెంది ఉపసంహరించుకోమని కోరినా దానికి మధునా పంతులువారు అంగీకరించలేదు. ఈ సంఘటన ఒకటి చాలు శ్రీ శాస్త్రిగారి ఆత్మాభిమానం తెలుసుకోవడానికి,

నిఘంటు కార్యాలయానికి రాజీనామా చేసి "సూర్యసప్తతి" అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులోని కొన్ని పద్యాలు రాజావారికి విజ్ఞప్తి చేస్తున్న విధంగా ఉంటాయి. ఈ పద్యాలు చూసి రాజావారు శ్రీ శాస్త్రిగారిని తిరిగి ఉద్యోగంలోనికి ఆహ్వానించదలచుకొన్నా దాన్ని ఎవరో అడ్డుకొన్నారు.

ఈ సంఘటన సత్యనారాయణశాస్త్రి గారికి మానసికమైన వేదన కలిగించింది. గాయపడ్డ కవి మనసు ఎలా ఉంటుందో అనంతరకాలంలో వారు రచించిన ఆంధ్రపురాణంలో సంపూర్ణంగా ఆవిష్కరించబడింది. రాజుకు – కవికి గల అనుబంధం, రాజు చేత తిరస్కరింప బడిన కవి ఏవిధంగా స్పందిస్తాడో... అన్న అంశాలు ఎంతో ఉదాత్తంగా రచింపగలిగారు శ్రీ శాస్త్రిగారు.

చాళుక్య పర్వంలో

సీ. తనమీద నిందు పెత్తనముంచి వచియించు
నధిపుడేవేవొ రహస్యములను
మరియాదమై నంతిపురముగాథలు కూడ
జెవిలోన సూదు భూధవుడు చేరి
నమ్మిన మంత్రికైనను జెప్పని చళుక్య
పతి–పిల్చి లక్ష సంగతులు నొడద్పు
దనకు బొత్తిగ దూరముననున్న 'రాజకీ
యము' వెందులకొ చెప్పుననని నేత

గీ॥ మతి బృహస్పతి నన్ని పండితుడు వినియు
మఱవలెనని యనియెల్ల మఱచిపోవు
నెప్పుడెవ్వని ముంగల నే ప్రసక్తి
నోరు జారవి పరమ గంభీరుడతడు.

ఈ పద్యం అక్షరాలా వేంకటరామశాస్త్రిగారికీ, పీఠికాపుర రాజావారికీ గల సాన్నిహిత్యాన్ని చాటే పద్యం. 'గురువు గారు'గా వేంకటరామశాస్త్రిగారు, రాజావారితో ఎలా మెలగేవారో మధునాపంతులవారు తన చిన్నతనంలోనే

గ్రహించారు. పరిణతి చెందిన సత్యనారాయణశాస్త్రి గారు. పై పద్యం ద్వారా రాజుకు కవికి గల అనుబంధాన్ని చాటారు. ఇది నన్నయకు, చాళుక్య చక్రవర్తి రాజరాజ నరేంద్రునికి మధ్యగల అనుబంధం చూపుతూ రచించిన పద్యమైనా వారి భావనలో తన మేనత్తభర్త వేంకట రామశాస్త్రి గారికి, పిఠాపురం రాజావారికి గల ఆత్మీయతను చాటే పద్యమై ఉండవచ్చు.

ఆంధ్రపురాణం శాతవాహన పర్వంలో రాజు చేత తిరస్కరింపబడిన గుణాఢ్య కవిరాజును "చిరాయు శ్రీలుగా" దీవించడం, రాజాజ్ఞని "పూలనముగా నెంచి ఔదల దాల్చడం" కవీంద్రుని కళకు నేవెలితిలేదు" అనడం. సత్యనారాయణశాస్త్రి గారు ఆత్మాభిమానము గల కవి హృదయాన్ని ఆవిష్కరించారు.

శ్రీ శాస్త్రి గారు తన 'రత్నపాంచాలిక' కార్యహోమం చేయలేదు కానీ ఈ పద్యం 'రత్నపాంచాలిక' ప్రతులు (12) ప్రాచుర్యం పొందకుండా అగిపోయిన సందర్భాన్ని చేస్తోంది కదా!.

దాచితి, నేండ్లుగా బహువిధంబులనోచితి, రక్తమాంసముక
వేచితి తమ్మనై రుచుల పెల్లగునీయుపహార భుక్తినీ
వాచని తిండికంచు గౌనివచ్చితి బావక! వాడినాలుకకు
చాచుము, తృప్తవీక్షణములం దానియింపుము పేదపండితున్.

1943లో రాజావారి ఆదేశంతో పూర్తయిన 'రత్న పాంచాలిక' మలిముద్రణము 1982లో నోచుకొంది. అజ్ఞాతమైన ఆ అనువాదం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠ్యగ్రంథమై ఆదరణపొందింది. "విప్రలాచ...పృధ్వీ" కదా!

"ఆంధ్రత్వమాంధ్రభాషాచ నాల్పస్యతపసఃఫలం" దీనిని త్రికరణశుద్ధిగా నమ్మిన వారు శ్రీమధునాపంతులు గారు.. ఆంధ్ర, ఆంధ్రరచయితలు, ఆంధ్రపురాణం. ఈ మూడు ముప్పేటలుగా వారి జీవితాన్ని మనకు చూపు తాయి. నిలువెత్తు తెలుగుతనానికి ఉదాహరణలుగా ఈ మూడింటినీ వాటి రూపమిచ్చి మధునాపంతులు వారినీ చెప్పుకోవచ్చు.

ఆంధ్రికి అభిరక్షక ప్రభువులు శ్రీరాజావారు. సందర్భానుసారం కొన్ని రచనలు కూడా చేయడం జరిగింది. 1939 నవంబరు సంచికలో "బ్రహ్మర్షి స్మరణము" అనే వ్యాసంలో శ్రీ రఘుపతి వేంకటరత్నము నాయుడు గారిని గూర్చి వ్రాసి వారి ఉదాత్త ఆశయాలు కొంచెమైనా అవలంబించుకోవాలని దానికి పరమేశ్వరుడు అనుగ్రహించాలనీ తన అభిప్రాయాలు చాటారు. దానికి సంపాదకుడుగా మధునాపంతులవారు.

"పరమ పావనమైన యీ బ్రహ్మర్షి స్మరణమును" బ్రకటింపనోచికొనిన యీనెల 'ఆంధ్రి' ఎంతయు ధన్యమైనది.. 'ఆంధ్రి' యభ్యున్నతికిది యొక యసాధారణ ఘట్టము గాదా? ఇట్టి పవిత్రతకు వ్యాసమునను గ్రహించిన విద్వత్ప్రభువులు విశేషజ్ఞులు నైన శ్రీశ్రీశ్రీ పీఠికాపురాధీశ్వరులను "ఆంధ్రి" ఏమని ప్రశంసింపగలదు? అంటూ ప్రశంసించారు.

ఛందస్సుందరమైన పద్యం పలకడంలో పెద్దనాన్న గారిది పెద్దపీట. వచనం కూడా సరళ సుందరంగా నడపగల దిట్ట. పత్రికా సంపాదకుడుగా మెలకువ నెరిగిన వ్యక్తి. ప్రాచీన – నవీన పోకడలకు వారధి. వచన

కవిత్వాన్ని కూడా ఆస్వాదించగల పెద్ద మనసు. నా బోటి కవులు కూడా సాహసించి వారికి కవిత్వం వినిపిస్తే ఆదరించి ఆశీర్వదించిన పెద్దమనిషి. సరస సంభాషణలు చేయడం ఎరిగిన సరసుడు. సాహిత్యంతో చమత్కారాన్ని పండించిన హాలికుడు.



- రచన : **మధునాపంతుల సత్యనారాయణమూర్తి**

(ఈ వ్యాసం పి.ఆర్. కళాశాల వారు పిఠాపురం రాజావారి 120వ జన్మదినం సందర్భంగా ప్రచురించిన సావనీర్ నుండి స్వీకరించడమైనది)

నైతిక విలువలు పెంపొందించడంలో సహృదయ మిత్రమండలి పాత్ర : నైతికవిలువలు వ్యక్తిని మంచి పౌరుడిగాసమాజానికిఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దుతాయి. అవి మనలో నమ్మకము, శాంతి ,స్నేహం, మరియు సంతోషాన్ని పెంపొందిస్తాయి. సమాజంలో పరస్పర గౌరవము మరియు సఖ్యతను నిలబెట్టడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయి. మన ఆలోచనలు, మాటలు, నీతి నిజాయితీ,న్యాయం, దయ, గౌరవం, వంటి గుణాలు కలిగి ఉండడం నైతిక విలువలు. ఇవి మన జీవితాన్ని సార్ధకం చేసే మానవ ధర్మానికి పునాది. స్వచ్ఛందసంస్థలు ప్రజల మనసుల్లో సేవలోని మానవతా విలువలనే భావనను నాటుతాయి. ప్రభుత్వానికి తోడ్పాటు ఇస్తూ విద్య ఆరోగ్యం పర్యావరణం మహిళాసాధికారత వంటి రంగాలలో సామాజిక నైతికతను ఆచరణలోకి తెస్తాయి. సమాజానికి ఆదర్శంగానిలుస్తూ, నైతిక విలువలతో కూడిన ప్రజాస్వామ్య సమాజ నిర్మాణానికి పునాది వేస్తాయి. అటువంటి కోవకు చెందిన సహృదయమిత్రమండలి పిఠాపురంలో జరిగే శివరాత్రి జాగరాలలో ఆరోగ్యపరిరక్షణకు అవగాహన కల్పించడానికి ఎయిడ్స్ పై ప్రచారంతోమొదలుపెట్టి మద్యపానం వలన కలుగు విపరీత నష్టాలు పర్యావరణ పరిరక్షణకై అవగాహన కల్పించడం, సమాజంలో బడుగు బలహీన వర్గాలపై జరిగే దాడులను ఖండిస్తూ, అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ మేము సైతం అంటూ గత 25 సంవత్సరాల నుండి ముందుకు సాగుతుంది. అదేవిధంగా సమాజ ప్రగతికి విద్య మూలమని నమ్మిన సహృదయమిత్రమండలి చిన్నారుల్లో చైతన్యం నింపటానికి వారిలో నైతిక విలువలు పెంపొందించడానికి ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తూ నూతన ఉత్సాహాన్ని నింపుతుంది. అదేవిధంగా పర్యావరణపరిరక్షణపై అవగాహన కల్పించుటకు విహారయాత్రను చేపట్టి వారిలో అవగాహన పెంచుతూ ఉన్నత విలువలుకలిగిన పౌరులుగా ఎదిగేలా నిరంతరం కృషి చేస్తూ సమాజ వికాసానికి తోడ్పాటు అందిస్తుంది. తల్లిదండ్రులను ప్రేమించని వాడు సమాజాన్ని ప్రేమించలేడు, సమాజాన్ని ప్రేమించని వాడు దేశాన్ని ప్రేమించ లేడు అన్న భావనతో దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ , అన్న గురజాడ వారి స్ఫూర్తిని తీసుకొని,విద్యార్థులలో దేశభక్తిని నింపటానికి అల్లూరి సీతారామరాజు. గురజాడ ,భగత్ సింగ్,శ్రీస్వామి వివేకానంద వంటి మహనీయుల స్ఫూర్తిని పెంపొందించడానికి వారి జయంతిని నిరంతరం కొనసాగిస్తూ ఆదర్శప్రాయంగా నిలిచింది. విద్యావంతులు కూడా కుల మత వర్గాలుగా విడిపోతూ కొనసాగుతున్న నేటి సమాజంలో మేమంతా ఒక్కటే అంటూ వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరిలో ఐక్యతకు అవగాహన కల్పిస్తున్న, సహృదయ మిత్రమండలి మరెన్నో సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపడతారని, కుల రహిత సమాజానికి కృషి చేయాలనికోరుకుంటూ.... రజితోత్సవ శుభాకాంక్షలతో....

- **కె.వి.ఎస్.ఎస్. ప్రసాద్,** రిటైర్డ్ ఉపాధ్యాయులు

సుఖం, దుఃఖమనే కిరీటాన్ని ధరించి మానవుని వద్దకు వస్తుంది. సుఖానికి స్వాగతం చెప్పేవాడు, దుఃఖానికి కూడా స్వాగతం చెప్పి తీరవలసిందే.

పిఠాపురంలో నా మొదటి మజిలీ

- ఆచార్య వేమూరి వేంకటేశ్వరరావు

కంప్యూటర్‌సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా

నేను పుట్టడం విశాఖపట్నం జిల్లా, వీరవల్లి తాలూకా, చోడవరంలో మా పెద్ద మామయ్యా గారి ఇంట్లో పుట్టేను కానీ, నేను పుట్టినప్పటికి నాన్న గారు పిఠాపురంలో ఉద్యోగం చేస్తూ ఉండేవారు. నాకు రెండేళ్ళప్పుడు బదిలీ మీద తుని వచ్చేసేరు. కనుక నా జీవన యానంలో మొదటి మజిలీ పిఠాపురంలో రెండేళ్ళు. అందుకని ఈ ఊరు గురించి నేను చెప్పేవన్నీ చాలమట్టుకు వినికిడి కబుర్లే!

పిఠాపురాన్ని పూర్వం పీఠికాపురం అనేవారు. ఈ ఊరుకి అధిపతి పీఠాంబ. ఈ పీఠాంబ విగ్రహం ఒకటి ఒక చేతిలో బంగారు పాత్ర, వేరొక చేత బాగుగా పండిన ఉసిరి కాయ, మూడవ చేత త్రిశూలం, నాల్గవ చేత లోహ దండం ధరించి నేటి పిఠాపురానికి సమీపంలో, నాలుగు వీధులు కలిసే కూడలిలో ఉండేదిట. ఈ విషయాన్ని శ్రీనాధుడు భీమేశ్వర పురాణంలో ఈ కింది విధంగా చెబుతాడు.

> **"హాటక పాన పాత్రయును నారగ బండిన మాతులుంగమున్**
> **ఖేటము లోహదండము నొగిం ధరియించి పురోపకంఠశృం**
> **గాటక భూమి భాగమున గాపురముండెది పీఠికాంబకుం**
> **గైటభదైత్యవైరిప్రియ కాంతకు మ్రొక్కె నతండు భక్తితోన్"**

ఇటువంటి విగ్రహమే ఒకటి ఈనాడు కొత్తపేటలో కుమారస్వామి ఆలయంలో ఉందిట.

పిఠాపురానికి ఉత్తర దిక్కున ఏలేరు అనే ఏరు ఒకటి ఉంది. ఈ ఏలేరుని "జగతి నెక్కడివేలేటి సాటి నదులు" అంటాడు శ్రీనాధుడు. అలా అనేసి ఊరుకోకుండా,

> **"ఏలేటి విరినీట నిరుగారునుంబండు**
> **ప్రాసంగు వరిచేలు పసిడిచాయ"**

అని చెబుతూ పిఠాపురం ప్రాంతం సస్యశ్యామలంగా ఉండేదని అప్పటి ఫల వృక్షాలనీ, పిండివంటలనీ శ్రీనాధుడు వర్ణించేడు. ఒక్క వేరు పనస చెట్లు, పోక తోటలు ఇప్పుడు కనిపించడం లేదేమో కానీ, మిగిలినవన్నీ ఇప్పటికీ ఉన్నాయి. పిఠాపురం వరకు వచ్చిన శ్రీనాధుడు కళింగ దేశం వరకూ పర్యటించినట్లు ఆధారాలున్నాయి. సింహాచలం వరాహ నృసింహస్వామి ఆలయాన్ని దర్శించిన ఆధారాలూ ఉన్నాయి. కాని, పక్కనే ఉన్న అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్ళిన దాఖలాలు నాకు కనిపించ లేదు. ఆ రోజులలో అన్నవరం కొండ అంత ప్రాచుర్యంలో లేదేమో. అప్పటి వరకు ఎందుకు? ఇప్పట్లో ఉన్న ప్రాచుర్యం నా చిన్నతనంలోనే లేదు. భక్తులు పాపం పెరిగినట్లు పెరిగి పోతున్నారు ఇక్కడ అన్నవరం లోనూ, అక్కడ తిరుపతి లోనూ. ఏలేరు సంగతి మాట్లాడుతూ దారి తప్పేం. ఈ ఏలేరు ఉప్పాడ దగ్గర సముద్రంలో కలుస్తుంది. అన్నవరం దగ్గర ఉన్న పంపా నది కూడ సాగర సంగమం చెందే ముందు ఈ ఏలేటి నీటితో పొన్నాడ దగ్గర కలుస్తుందని చిలుకూరి పాపయ్య శాస్త్రి "శ్రీనాధ కృతి సమీక్ష" అనే పుస్తకంలో రాసేరు.

ఒడ్డె రాజులతో వైరం పూనిన విజయనగరం గజపతులు ఈ నదుల సాగర సంగమ స్థానాన్ని పూరీ జగన్నాథంతో సమానమైన దివ్య క్షేత్రంగా రూపొందిద్దామని జగన్నాథ స్వామి, బలభద్ర స్వామి, సుభద్రా దేవి విగ్రహాలని ప్రతిష్ట చేసేరుట. ఈ జగన్నాథ స్వామి చేతులు ఇటీవల మొండి అగుటచే ఈ స్వామిని "మొండి జగ్గప్ప" అని ప్రాంతీయులు పిలుస్తారుట.

పిఠాపురం దగ్గర ఉన్న ఉప్పాడ మా ఇంట్లో పిల్లల ఆటపాటలలో ఎలా స్థిరపడి పోయిందో చెబుతాను.

మా ఇంట్లో చంటి పిల్లల చేత "గుమ్మాడమ్మా గుమ్మాడు" అనే ఆట ఆడించేవారు. పెద్దవాళ్ళు మంచం మీద వెల్లకిల్లా పడుక్కుని, ముడిచిన కాళ్ళ మీద చంటి పిల్లడిని పడుకోబెట్టి, ఆ కాళ్ళని ముందుకీ వెనక్కీ నెమ్మదిగా ఆడిస్తూ ఈ కింది పాట పాడేవారు.

"గుమ్మాడమ్మా గుమ్మాడు
పళ్ళు పండింది గుమ్మాడు
కాయల్లు కాసింది గుమ్మాడు...
సపోటా చెట్టుకి నీళ్ళు పోసేవా?"
ఈ సందర్భంలో పిల్లడు (పిల్ల) "పోసేను" అంటాడు, లేదా "ఔను" అన్నట్లు తల ఆడిస్తాడు.
"అయితే, సపోటా పళ్ళన్నీ నావి, పిక్కలన్నీ నీవి!
అరటి చెట్టుకి నీళ్ళు పోసేవా?"
మళ్ళా ఈ సందర్భంలో పిల్లడు (పిల్ల) "పోసేను" అన్నట్లు తల ఆడిస్తాడు.
"అయితే, అరటి పళ్ళన్నీ నావి, తొక్కలన్నీ నీవి!
కొబ్బరి చెట్టుకి నీళ్ళు పోసేవా?"
మళ్ళా పిల్లడు "పోసేను" అన్నట్లు తల ఆడిస్తాడు.
"కొబ్బరి కాయలు నావి, డిప్పలు నీవి!"
ఈ విధంగా ఓపిక ఉన్నంత సేపు పిల్లడిని ముందుకీ వెనక్కీ ఆడించి, ఆఖరున
"ఉప్పాడెళ్ళిందేనుగు, ఉప్పునీళ్ళు తాగిందేనుగు
మాఊరొచ్చిందేనుగు, మంచినీళ్ళుతాగిందేనుగు" అని పాడి,
"ఉప్పాడెళ్ళేవా?"
"..."
"ఉప్పునీళ్ళు తాగేవా?"
"..."
"మావూరొచ్చేవా?"
"..."

"మంచినీళ్ళు తాగేవా?"

అన్న ప్రశ్నలు వేసేవాళ్ళం. ఈ ప్రశ్నలకి పిల్లాడు సమాధానంగా తలాడించడమో, "వెళ్ళేను, వెళ్ళలేదు" అని చెప్పడమో జరుగుతుంది.

అప్పుడు మోకాళ్ళు రెండూ పైకెత్తి, పిల్లాడిని తలకిందులు చేసి, "ఏతాం కిర్రు" అనే వారు. పిల్లలకి ఈ "ఏతాం కిర్రు" భాగం బాగా నచ్చేది. మా అమ్మాయి సీత చంటితనంలో ఆట మొదట్లోనే "ఏతాం కిర్రు" కావాలని అల్లరి పెట్టేసేది!

దరిమిలా ఈ పాట అర్ధమయే వయస్సు నాకు వచ్చిన తర్వాత "ఈ ఉప్పాడేమిటి? ఉప్పునీళ్ళేమిటి?" అనే చిన్న ధర్మ సందేహం వచ్చింది. అప్పుడు పెద్దక్క చెప్పింది. పిఠాపురంలో ఉన్నప్పుడు, సముద్రానికి దగ్గరగా ఉన్న ఊరు ఉప్పాడ అనిన్నీ, సముద్ర స్నానానికి అక్కడికి వెళ్ళేవారనిన్నీ చెప్పింది. మరైతే తుని వచ్చిన తర్వాత "ఉప్పాడెళ్ళేవా? ఉప్పునీళ్ళు తాగేవా?" అంటే ఏమి బాగుంటుంది? "ఆ భాగాన్ని పెంటకోట వెళ్ళేవా? ఉప్పు నీళ్ళు తాగేవా?" అని ఎంత మార్చుదామన్నా ప్రాస కుదరక మార్చ లేక పోయాం" అని అన్నయ్యలు, అక్కలు చెప్పేవారు.

పిల్లలు మరీ మాటలు రాని పసివారైతే, పిల్లని బారజాపిన కాళ్ళమీద కూర్చోబెట్టి, తల వెనక చెయ్యి వేసి, వెనక్కీ ముందుకీ ఆడిస్తూ, ఈ దిగువ పాట పాడే వారు.

"గుమ్మాడమ్మా గుమ్మాడు
పళ్ళు పండింది గుమ్మాడు
కాయల్లు కాసింది గుమ్మాడు
అడ్డా దిడ్డా తోడు
తోడు పాయసం తోడు
తోడితే నీ చెయ్యి వేడి
వేడి వేడి పాయసం జుర్రు
జుర్రితే నీనోరు చుర్రు
ఏతాం కిర్రు"

ఈ పాటలలో "గుమ్మాడు" అన్న మాటకి అర్థం ఏమిటో ఇప్పటికీ నాకు తెలియదు. నిఘంటువులో "గుమ్మడు" అనే మాట ఉంది కానీ దాని అర్థం ఈ సందర్భంలో ఇమడలేదు.

పిఠాపురంలో మా అద్దె ఇంటికి దగ్గరలో కుంతీమాధవ స్వామి ఆలయం, మరి కొంచెం దూరంలో కుక్కుటేశ్వరుడి కోవెల ఉన్నాయి. వృత్తాసురుడిని చంపిన తర్వాత బ్రహ్మహత్యా పాతకం నుండి తప్పించుకునేందుకు ఇంద్రుడు ఐదు వైష్ణవాలయాలు స్థాపించేడట. కాశీలో బిందుమాధవ స్వామి, ప్రయాగలో వేణుమాధవ స్వామి, పిఠాపురంలో కుంతిమాధవ స్వామి, తిరుచునాపల్లిలో సుందరమాధవ స్వామి, రామేశ్వరంలో సేతుమాధవ స్వామి. శైవులూ, వైష్ణవులూ పోటాపోటీలుగా ఒకరు కుక్కుటేశ్వరుడునీ, మరొకరు కుంతిమాధవ స్వామినీ సమర్థిస్తూ స్థల పురాణాలు

అల్లేరేమోనని నాకు అనిపిస్తుంది. మేము వీరశైవులం కాదు, స్మార్తులం మాత్రమే. కనుక ఇంటికి దగ్గరగా ఉన్న మాధవుడి గుడికి వెళ్ళడానికి ఎవ్వరికీ అభ్యంతరం ఉండేది కాదు. దేవుడి మీద అభిమానం మాట దేవుడెరుగు కానీ మాధవుడి గుడిలో ప్రసాదం పేరిట పెట్టే పులిహోర, దద్యోజనం, చక్కెర పొంగలి మీద చిన్నన్నయ్యకీ, చిట్టెన్నయ్యకీ ఎక్కువ మక్కువ ఉండేది. ఏదో అంగుటికి అందనంత చేతులలో రాల్చడం కాదు, గుడిలో ఇచ్చిన ప్రసాదంతో వీళ్ల పొట్టలు నిండి పోయేవిట. మేము తుని వచ్చిన తర్వాత చాల ఏళ్ళ పాటు ఆ ప్రసాదం ఎంత బాగుండేదో చెప్పుకుంటు లొట్టలు వేసేవారు అన్నయ్యలిద్దరూ.

మా ఇంటికి కుక్కుటేశ్వరుడి గుడి మరికొంచెం దూరం అని చెప్పేను కదా. భారతదేశం లోని అష్టాదశ మహా శక్తి పీఠములలో ఒకటైన హుంకారిణీ శక్తిపీఠం ఈ కుక్కుటేశ్వరుడి దేవళంలో ఉండేదిట. ఈ పీఠం కాని, ఆ శక్తి విగ్రహం కాని ఈనాడు కానరావు. ఈ పీఠం మూలంగానే పిఠాపురానికి పీఠికాపురం అనే పేరు వచ్చిందని అంటారు. ఈ హుంకారిణీ శక్తి విగ్రహం రైలు స్టేషన్‌కి ఎదురుగా ఉన్న మట్టి దిబ్బలో భూస్థాపితమై ఉన్నదని లోక ఐతిహ్యం ఉంది. పురావస్తు పరిశోధక శాఖ వారు తవ్వకాలు జరిపించి చూస్తే బాగుంటుందేమో!

ఈ కుక్కుటేశ్వరుడి ఆలయ ప్రాంగణం లోనే కాలభైరవుడి విగ్రహం "వ్రీడావిహీనజఘనమై" చూసేవారికి సిగ్గును కలిగించేదిగా ఉందిట. నేను చూడ లేదు. వ్రీడావిహీనజఘనంగా వీధులలో తిరిగే కుర్ర కుంకలు కొల్లలుగా ఉన్న మన దేశంలో సిగ్గు పడవలసిన అవసరం ఏముంది? కుక్కుటేశ్వరుడి గుడికి ఎదురుగా ఒక తటాకం ఉంది. దానిని "పాదగయ" అంటారు. ఈ పాదగయకి ఆ పేరు ఎలా వచ్చిందో వివరిస్తూ రెండు కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. గంగా తీరమున ఉన్న గయ "గయా శీర్షం" అనీ, పిఠాపురంలో ఉన్నది "పాదగయ" అనీ ఒక సిద్ధాంతం. అందుకనే పాదగయలో స్నానం చేస్తే గంగలో చేసినంత ఫలితం అని ఒక నమ్మకం ఉంది. "గయ" అంటే జ్ఞాపకం వస్తోంది. మన అదృష్టం కొద్దీ పాదగయలో పిండాలు వదలమని ఎవ్వరూ చెప్పలేదు కనుక సరిపోయింది కానీ, లేకపోతే ఇది కూడా కాకినాడలో పిండాల చెరువులా తయారయి, కొసకి దీనికి కూడ పిండాల చెరువుకి పట్టిన గతే పట్టి ఉండేది.

గయుడు అనే రాక్షసుడి పాదాలు అక్కడ ఉన్నాయి కనుక ఇది పాదగయ అయిందని మరొక వదంతి. గయుడి పాదాల ప్రస్తావన వచ్చింది కనుక అతగాడి బుర్ర సంగతి కూడ చెబుతాను. ఈ కథ ఏ పురాణంలో ఉందో తెలియదు. ఈ గయుడికీ గయోపాఖ్యానానికీ మధ్య ఏదైనా సంబంధం ఉందో లేదో కూడ తెలియదు. ఈ గయుడిని ఎవ్వరు చంపేరో అస్సలు తెలియదు. ఏది ఏమైతేనేమి, చచ్చిన శవం యొక్క బుర్ర సింహాచలం దగ్గర, పాదాలు పిఠాపురం దగ్గర పడ్డాయిట. అందుకని సింహాచలం నుండి పిఠాపురం వరకు ఉన్న ప్రదేశం పాపభూమి అనేవారు నాన్నగారు. పాపభూమి కాబట్టే ఈ మధ్య ప్రదేశంలో పుణ్య క్షేత్రాలు లేవుట. "అన్నవరం ఉందే" అని కొందరు అనవచ్చు. ఈ కథాకాలం నాటికి అన్నవరం లేదేమో ఉండుంటే శ్రీనాథుడు ఎక్కడో ఒక చోట ప్రస్తావించి ఉండేవాడే!

దరిమిలా మేము తునిలో స్థిరపడ్డ తర్వాత కూడా “ఇది పాపభూమేరా! కాకపోతే ఏమిటి, ఈ ఊళ్ళో జరిగే మోసాలకీ, అరాచకాలకీ అంతు లేకుండా పోతోంది,” అనేవారు నాన్నగారు. (తునిలో ఇప్పుడు మా వాళ్ళు ఎవరూ లేకపోయినా, అక్కడ జరిగిన అరాచకాలూ, మోసాలూ కాగితం మీద పెట్టడానికి నాకు దమ్ములు చాలడం లేదు. అసలు తుని తాలూకాలో జరిగే ఖూనీలు ఆ చుట్టుపట్ల ఏ జిల్లాలోనూ జరిగుండవని తను వైజాగులో లా ప్రాక్టీసు చేస్తూన్న రోజులలో రామం బావ ఒక సారి నాతో అన్నాడు.)

మామ్మ వీలయినప్పుడల్లా ఉదయం పాదగయలో స్నానం చేసి, కుక్కుటేశ్వరుడి దర్శనం చేసుకు వచ్చేదిట. ఒక సారి మా చిన్నన్నయ్యని కూడా వెంట తీసుకెళ్ళిందిట. అప్పటికి చిన్నన్నయ్యకి పది, పన్నెండు ఏళ్ళకి మించి ఉండవు. అన్నయ్యని పాదగయ మెట్ల మీద కూర్చోబెట్టి, తను స్నానం చెయ్యడానికి నీళ్ళల్లోకి దిగిందిట. ఒక్క క్షణం కనుమరుగయ్యే సరికల్లా చిన్నన్నయ్య కుదురుగా కూర్చోకుండా నీళ్ళల్లోకి దిగబోయి పాదగయలో పడి పోయాడుట. ఈ సంగతి నీళ్ళల్లో ఉన్న మామ్మకి తెలియదు గాని గట్టు మీద ఉన్న మరొక మామ్మ గారు చూసి వాడిని పట్టుకోబోయారుట. పావంచాలమీద కాలు జారి ఆవిడ కూడ నీళ్ళల్లో పడ్డారుట. ఇద్దరూ ఇలా నీటి పాలు అయేసరికి మిగిలినవాళ్ళంతా మొర్రో మొర్రో అని గోల పెట్టడం మొదలు పెట్టేరుట. అక్కడ గట్టుమీద ఉన్నవాళ్ళెవరికీ ఈత రాదు!

అదే సమయంలో అక్కడ మండ కృష్ణమూర్తి గారి తమ్ముడు మండ ప్రకాశం గారు అప్పుడే పాదగయలో స్నానం పూర్తి చేసుకుని దేవాలయంలోకి వెళ్ళబోతూ వెనకనుండి వచ్చిన కేకలు విని వెనక్కి పరుగెత్తుకు వచ్చి, ఒక్క ఉదుటున పాదగయలో దూకేరుట. దూకీ దూకగానే పిల్లాడి చెయ్యి తగిలిందిట. పిల్లాడిని బయటకి లాగి మునిగిపోతూన్న మామ్మ గారిని వెతకి ఆవిడనీ గట్టు మీద పడేసేరుట. తర్వాత వీళ్ళూ వాళ్ళూ అనుకుంటూ ఉంటే తెలిసింది. పంతులు గారు దేవాలయం లోపలికి వెళ్ళిన తర్వాత హరి మీద గిరి పడ్డా, గిరి మీద హరి పడ్డా, దేవతార్చన పూర్తి అయేదాక మరి బయటకు రారుట. అది ఆయన నియమం. అదృష్టం కలసి రాబట్టి ఆయన అప్పటికి ఇంకా దేవాలయం లోపలికి వెళ్ళలేదు కనుక ప్రమాదం మా చిన్నక్క మాటల్లో చెప్పాలంటే చుక్కలో తప్పిపోయింది!

అదే సమయంలో నాన్నగారు వీధి అరుగు మీద కూర్చుని చిన్నన్నయ్య జాతకం చూస్తున్నారుట. చూసి, అమ్మని పిలచి, “ఓవిడా! చూడు, మన విశ్వేశం జాతకంలో జలగండం ఉంది. వాడిని నీళ్ళ దగ్గరకు వెళ్ళనీయకు సుమీ” అని చెప్పేరుట. మా నాన్నగారి జాతకాల మీద అమ్మకి పెద్ద గురి లేదు. అందుకని అమ్మ సమాధానంగా ఏమందో మనం తెలుసుకోడానికి ప్రయత్నించడం విజ్ఞత అనిపించుకోదు.

కొద్ది సేపటిలో మామ్మ పిల్లాడిని చంకలో పెట్టుకుని ఇంటికి రానే వచ్చింది. “నాయనా నీ పిల్లాడిని నిష్కారణంగా చంపేసినంత పని చేసేనురా” అని మొర్రోమందిట.

వరాహమిహురుడు రాజుకి జాతకం చెప్పి వరాహమిహురుడు అనే బిరుదుని ఎలా పొందేడో అలాగే అప్పటి నుండి నాన్నగారి జ్యోతిష ప్రకర్ష మీద క్రమేపీ అమ్మకి కూడ కొంచెం నమ్మకం కుదరడం మొదలైంది.

నాన్నగారి జ్యోతిష ప్రకర్షని గురించి చిన్నన్నయ్య మరొక ఉదంతం చెప్పేడు. పిఠాపురం రాజా వారు ఒక నాడు వారి ఆస్థాన జ్యోతిష్కుడిని పిలిచి, కాలక్షేపానికి, రెండు ప్రశ్నలు వేసి సమాధానం చెప్పమని అడిగేరుట. ఒక ప్రశ్న భూతకాలానికి సంబంధించినది, రెండవది భవిష్యత్తులో జరగబోయేది. రాజుగారి భార్య వారి కుమార్తెని ఎక్కడ ప్రసవించిందో ఆ సూతికా గృహాన్ని వర్ణించమన్నది మొదటి ప్రశ్న. యుక్తవయస్సులోనికి ప్రవేశిస్తూన్న ఆ అమ్మాయి ఎవరిని వివాహమాడుతుందో అన్నది రెండవ ప్రశ్న. మొదటి ప్రశ్నకి సమాధానం రాజు గారి ఆంతరంగిక వర్గానికి తప్ప తదితరులకి తెలియదు. ఈ ప్రశ్నకి ఎవరైతే సరైన సమాధానం చెబుతారో వారే రెండవ ప్రశ్నకి కూడ సరైన సమాధానం చెప్పగలరని రాజుగారి నమ్మిక.

ఆస్థాన జ్యోతిష్కుడికి ఈ రెండు ప్రశ్నలు కొరకబడని కొయ్యలయాయి. అప్పుడు ఆయన నాన్న గారిని సంప్రదించడానికి వచ్చేడుట. ప్రశ్న అడిగిన సమయాన్ని బట్టీ, రాజు గారు ఇచ్చిన మిగిలిన దత్తాంశాలని బట్టీ నాన్నగారులెక్కలు కట్టి, "శిధిలమౌతూన్న ఆవరణలో, అంధకార బంధురమైన నిశీధిలో, ఏకాంతంగా రాణీవారు ప్రసవించేరు" అని నాన్నగారు చెప్పేరుట. రాజుగారి కుమార్తె తల్లిదండ్రుల కోరికకి వ్యతిరిక్తంగా, మరొక కులం వాడిని వివాహమాడుతుందని రెండవ ప్రశ్నకి జోస్యం చెప్పేరుట.

ఆస్థాన జ్యోతిష్కుడు నాన్న గారు చెప్పిన విషయాన్నే తన మాటగా రాజు గారికి చెప్పేడుట. అప్పుడు రాజు గారి ఆశ్చర్యానికి అవధులు లేవుట. రాణీ వారు ఒక నాడు సాయంకాలం, సంధ్యా సమయంలో, తోటలో తిరగడానికి వెళ్ళేరుట. చీకటి పడ్డ తర్వాత, అకస్మాత్తుగా ఆమెకి నొప్పులు ప్రారంభం అయేయిట. అదే సమయంలో కాకతాళీయంగా విద్యుచ్ఛక్తి పోవడంతో తోటంతా చీకటి కమ్ముకుందిట. ఆ హడావుడిలో వైద్యుడి కొరకు కబురు పెట్టడానికి కాని, రాణి వారిని లోగిలి లోనికి తీసుకు వెళ్ళడానికి కాని సానుకూలపడక, తోడ ఉన్న పరిచారిక రాణి గారిని దగ్గరలో ఉన్న ఒక పాడు పడ్డ గుర్రాలసాలలో గడ్డిపరుపు వేసి, అక్కడ పడుకోబెట్టి వైద్య సహాయం కోసం పరుగెత్తిందిట. అప్పుడు రాణి వారు, ఆ చీకట్లో, ఆ శిధిలమైన గుర్రాల శాలలో, ఏకాంతంగా ఉన్న సమయంలో కుమార్తెని ప్రసవించేరుట. ఆ తర్వాత జరిగిన విషయాలని విపులంగా చెప్పడానికి చిన్నన్నయ్య ఇష్టపడలేదు.

నాన్నగారు పిఠాపురంలో కనీసం ఎనిమిదేళ్ళు ఉద్యోగం చేసి ఉంటారు. ఆ రోజులలో వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి గారు (బాలవ్యాస, తర్క వ్యాకరణ సిద్ధాంతి బిరుదాంకితులు), లేళ్ళపల్లి సత్యనారాయణ గారు, ఓలేటి పార్వతీశం గారు (వేంకట పార్వతీశ్వర కవులలో ఒకరు), నడకుదుటి వీర్రాజు గారు, ఉమర్ ఆలీషా గారు (తెలుగు పండితులు), మొదలైన వారు నాన్న గారి దగ్గర స్నేహితులలో కొందరు. పానుగంటి లక్ష్మీ నరసింహం (సాక్షి) గారు కూడ నాన్న గారి పరిచయస్తులే కాని వారిద్దరి మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో తెలియదన్నాడు చిన్నన్నయ్య. కాని పక్కింట్లో ఉన్న నేదునూరి కృష్ణ మూర్తి (సంగీత విద్వాంసులు) గారికి అప్పట్లో ఏ పది పన్నెండు ఏళ్ళో ఉండేవని, తరచు మా ఇంటికి వచ్చి అమ్మని చనువుగా "అక్కయ్యా" అని పిలిచే వాడనీ చిన్నన్నయ్య చెప్పేడు.

వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు గొప్ప పండితుడు. “కవి కాదు, పండితుడు” అంటూ చిట్టన్నయ్య ఒకసారి ఈ రెండు మాటల మధ్యనున్న తేడాని ప్రబోధించేడు. ఈ శాస్త్రి గారు “మహాభారత తత్వ కథనం” అనే ఎనిమిది సంపుటాల ఉద్గ్రంథం తెలుగులో రచించేరు. సొంత డబ్బులతో అచ్చు వేయించి ఆ సంపుటాల ప్రతిని ప్రత్యేకం తుని తీసుకు వచ్చి నాన్నగారికి బహూకరించేరు. అప్పటికి నేను చిన్నవాడినే అయినా శాస్త్రి గారి రాకే పెద్ద విశేషం కాబట్టి నాకు బాగా జ్ఞాపకం ఉంది. పుస్తకంలో కాగితాలు తిరగేసి చూసేను. అదంతా తెలుగు లిపే కాని సంస్కృత సమాసాల మయం. నాకు ఒక్క ముక్క కూడ అర్థం కాలేదు.

కాని చిట్టన్నయ్యకి అర్థం అయింది. అదే మా కొంప ముంచింది. కొన్నాళ్ళు పోయిన తర్వాత “భూమి తిరుగుట లేదా?” అన్న పేరుతో చిట్టన్నయ్య భారతిలో ఒక వ్యాసం ప్రచురించేడు. ఆ వ్యాసంలో శాస్త్రి గారిని, ఆయన రాసిన “మహాభారత తత్వ కథనం” పుస్తకాన్ని, అందులో ఆయన సమర్ధించిన “భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడు” అనే సనాతన దృక్పథాన్ని దుయ్యబట్టి ఒదిలిపెట్టేడు. ఎనిమిది సంపుటాల గ్రంథంలో ఎక్కడో ఒక చోట కనిపించిన ఒక వాక్యాన్ని పట్టుకుని వాడు అలా రాయడం నాన్నగారికి నచ్చలేదు. శాస్త్రి గారి పాండిత్యం ఎక్కడ, స్కూలు ఫైనల్ పేసయిన కుర్రకుంక ఎక్కడ?

నాన్నగారు పిఠాపురంలో ఉద్యోగం చేస్తూన్న రోజులలో ఏదో ఒక లాటరీకి రూపాయి పెట్టి టికెట్టు కొన్నారుట. అప్పుడు ఆయన స్నేహితుడు ఎవరో అడిగేరుట “ లాటరీ వస్తే నాకేమిటిస్తావు?” అని. “వచ్చిన దాంట్లో సగం ఇస్తానులే” అన్నారుట. ఏ ముహూర్తాన ఆ మాట అన్నారో ఆయనకి లక్ష రూపాయలు లాటరీ రానే వచ్చిందిట. మాట వరసకి అన్న మాటని నిజంగా నిలబెట్టుకునేవారు ఉంటారా? ఉంటారో ఉండరో తెలియదు కాని, నాన్నగారు లక్షలో సగం ఇచ్చెయ్యడానికి సిద్ధపడిపోయారుట. కాని ఈ ఇద్దరిలోనూ ఎవరి జాతకం వక్రించిందో కాని, ఆ నెలే ఆ లాటరీ కంపెనీ దివాలా తీసేసిందిట. లక్ష రూపాయిలు మా దగ్గర లేవు, రెండు వందలు మాత్రమే ఉన్నాయని నాన్నగారికి 200 రూపాయిలు పంపించేరుట ఆ కంపెనీ వాళ్ళు. అందులో ఒక వంద నాన్నగారు స్నేహితుడికి ఇచ్చేసేరుట! అమ్మ అనేది, “మన అదృష్టం కొద్దీ మనకి ఆ లాటరీలో లక్ష రాలేదు కనుక సరిపోయింది కానీ, వచ్చుంటే మీకెవరికీ చదువులు వచ్చి ఉండేవి కావు.”

మళ్ళా అలాంటి లాటరీ వస్తుందేమోనని నాన్నగారు తునిలో ఎన్నాళ్ళో వారానికి ఒక రూపాయి చొప్పున ఆర్. ఎమ్. డి. సి. క్రాస్‌వర్డ్ పజిల్ నింపి పంపేవారు. నాకు బాగా జ్ఞాపకం. ఈ పజిల్‌లో ప్రశ్న, ఒకే ఒక అక్షరం మినహా సమాధానం ఇచ్చేసేవారు. మినహాయించిన గడి స్థానంలో రెండే రెండు అక్షరాలు నప్పుతాయి . ఆ రెండింటిలో ఏ అక్షరం నింపినా అది సరి అయిన సమాధానం లాగే స్ఫురిస్తుంది. పజిల్ నిర్వాహకులు ఆ రెండు అక్షరాలూ కూడ ఇచ్చేసేవారు! మనం చెయ్య వలసిందల్లా ఆ రెండింటిలో ఒక అక్షరాన్ని ఎన్నుకోవాలి. ఇలాంటివి ఇరవై నిలువు ఆధారాలు, ఇరవై అడ్డు ఆధారాలు ఉండేవి. నింపడానికి సరదాగానే ఉండేది. ఇంటిల్లిపాదిమీ సహాయం చేసేవాళ్ళం. కాని, దాని తస్సాదియ్యా, ఆ లాటరీలో ఎప్పుడు నెగ్గ లేదు. కాలేజీలో సంభావ్య సిద్ధాంతం చదువుకున్న తర్వాత తెలిసింది. ఇరవై అడ్డు ఆధారాలు, ఇరవై నిలువు ఆధారాలు ఉన్న ఆర్. ఎమ్.డి.సి. క్రాస్‌వర్డ్

పజిల్ గెలవడానికి సంభావ్యత ఒకటింట "2 ని 40 సార్లు వేసి గుణించగా వచ్చిన సంఖ్య" అంత! ఇంతకంటె కేలిఫోర్నియా లాటరీలో గెలవడానికి సావకాశాలు ఎక్కువేమో ?

పిఠాపురం గురించి ఇన్ని కబుర్లూ చెప్పి పిఠాపురం రాజా గారి గురించి మరికొంచెం చెప్పకపోతే బాగుండదు. ఈ ఊరుని వెలమ రాజులు పాలించే వారు. వీరు సాహిత్యాన్ని బాగా పోషించేరు. వింజమూరి సోమేశ (రాఘవపాండవీయం), వక్కలంక వీరభద్ర కవి (వాసవదత్తా పరిణయం), కూచిమంచి జగ్గకవి, కూచిమంచి గంగన్న, దేవులపల్లి బాపన్న, పిండిప్రోలు లక్ష్మన్న, అల్లంరాజు సుబ్రహ్మణ్య కవి, దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి, దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి, రెండవ దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి, ప్రభృతులు పిఠాపురం ఆస్థానంలోని వారే! కాకినాడ లోని పిఠాపురం రాజావారి కళాశాల పూర్వపు రోజుల్లో పేరున్న కళాశాలే, దరిమిలా ఆ పేరు లోని జిగి తగ్గింది అనుకోండి.

నాన్నగారు పిఠాపురంలో ఉద్యోగం చేసే రోజులలోనే "ట్రంకు మర్డర్ కేసు" దర్యాప్తూ, విచారణా జరిగేయి. ఆర్. కె. కరంజియా నడిపిన "బ్లిట్జ్" వారపత్రిక ఆ రోజులలో ఉండి ఉంటే నానావతీ, అహూజాల కేసుకి వచ్చినంత సంచలనం దీనికీ వచ్చి ఉండేది. ఈ కేసులో పిఠాపురం రాజా వారి తాలూకు వారు ఎవరో ఇరుక్కున్నారు. అందుకని ఆ రోజులలో ఇది బాగా పేరు పడ్డ కేసు. రాజా వారికి కోపం వస్తే ఎక్కడ ఏమి ముప్పు వస్తుందో అని బయటకి మాట్లాడడానికి భయం! ఆస్తుల తగాదాలోనో, త్రికోణ ప్రేమాయణంలోనో ఎవ్వరో ఎవరినో (బట్టలు కుట్టే దర్జీని అని తర్వాత తెలిసింది) ఖూనీ చేసేసి, ముక్కలు ముక్కలుగా కోసేసి, ట్రంకు పెట్టెలో పెట్టేసి ఆ పెట్టెని కురదారోడ్డు పేసెంజరు లోనో హౌరా మెయిల్ లోనో ఎక్కించేసేరు. (ఆ రోజులలో పిఠాపురంలో మెయిలు బండి ఆగేది.) దరిమిలా రైలు బరంపురం చేరుకునేసరికి ఆ పెట్టె కంపు కొట్టడం, పోలీసులు దానిని అక్కడ దించడం జరిగింది. శవం బరంపురంలో పట్టుబడింది కనుక కేసు అక్కడ నమోదయింది. ఆ కేసుకి సంబంధించిన ఆస్తుల పంపకాల రాతకోతల కాగితాలు నాన్నగారు పిఠాపురం సబ్ రిజిస్ట్రారు కచేరీ నుండి బరంపురం కోర్టుకి పట్టుకు వెళ్ళి అక్కడ సాక్ష్యం చెప్పవలసి వచ్చింది. ఈయనకి ప్రభుత్వం వారు పోలీసు ఎస్కార్టు ఇచ్చి మరీ పంపేరు. ఈ కథనం నాన్నగారు చెబుతూ ఉంటే చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళంతా వచ్చి వాకట్లో కూర్చుని వినేవారు. సమయం, సందర్భం చూసుకుని ఈ కథ వివరంగా చెబుతాను. **(అంతర్జాలం సౌజన్యంతో...)**

"సొంత లాభం -కొంత మానుకుని పొరుగువారికి తోడుపడవోయ్
వట్టి మాటలు కట్టిపెట్టి -గట్టి మేల్ తలపెట్టవోయ్"

గురజాడ అప్పారావు గారి మాటలు అనుసరించి అనేక వడిదుడుకులు ఎదుర్కొంటూ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని ముందుకు సాగుతున్న"సహృదయ మిత్రమండలి' నిశ్చల సహృదయంతో ముందుకు సాగుతూ మరింత మందికి తోడ్పడాలని ఆకాంక్షిస్తూ.

- శ్రీమతి **ఎం .శారదా దేవి**

రజతోత్సవ సంచిక ప్రత్యేక వ్యాసం

స్వామి వివేకానందుడు మహోన్నత బుద్ధుడు

(జనవరి 13, 1963న మద్రాసులో జరిగిన వివేకానంద శతాబ్ది ఉత్సవాల్లో డా॥భదంత ఆనంద కౌసల్యాయన్ ఇచ్చిన ప్రసంగం)

బౌద్ధమత ప్రతినిధిగా, ఈ మతపరమైన సమావేశంలో పాల్గొనడానికి నన్ను ఆహ్వానించినందుకు స్వామి వివేకానంద శతాబ్ది ఉత్సవ కమిటీకి రుణపడి ఉన్నాను అని చెప్పటానికే ఈ రోజు ఇక్కడికి వచ్చాను. బౌద్ధమత ప్రాతినిధ్యానికి మినహాయింపు ఉండకూడదని కమిటీ ఆసక్తి చూపడమే దీనికి ప్రధాన కారణం అని నేను భావిస్తున్నాను. అలా కాకపోతే వింతే మరి. నా అభిప్రాయం ప్రకారం, ఇంకొన్ని కారణాలు కూడా ఉండవచ్చు.

మొదటగా, ఈ సమావేశం బుద్ధుని జన్మస్థలమైన భారతదేశంలో జరుగుతోంది. కొందరు భారతదేశం కాదు, నేపాల్ అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రస్తుత భారతదేశం, అలాగే నేటి నేపాల్ ఉమ్మడి వారసత్వంగా ఉన్న భూమి అని చెప్పుకుందాం. ఆయన జ్ఞానోదయం పొందినది భారతదేశంలోని బుద్ధ గయ వద్దనే. భారతదేశంలోని సారనాథ్ (వారణాసి)లో, బుద్ధుడు తన మొదటి ఉపన్యాసాన్ని బోధించాడు. ఆయన ఉత్తరప్రదేశ్‌లోని (భారతదేశంలో) దియోరియా జిల్లాలోని కుషినగర్‌లో మహాపరినిర్వాణం (మరణం) చెందాడు. దాదాపు 25 శతాబ్దాల క్రితం బుద్ధుడు లేదా సిద్ధార్థ గౌతముడు జన్మించి, తన మొదటి ఉపన్యాసం బోధించి, పరినిర్వాణం చెందిన మూడు ప్రదేశాలూ భారతదేశంలోనే ఉన్నాయి. భారతదేశంలో జరిగే ఏ మతాంతర సమావేశమైనా బౌద్ధాన్ని విస్మరించజాలదు.

మరొక కారణం, బహుశా బౌద్ధం అనేది చారిత్రకంగా బుద్ధుని కాలంనాటి సమకాలీన ఆలోచనలను మాత్రమే కాకుండా, బౌద్ధానంతర భారతదేశాన్ని కూడా బాగా ప్రభావితం చేసిన మతం అని నేను అనుకుంటున్నాను. బౌద్ధానంతర హిందూమతం బౌద్ధపూర్వ హిందూమతంతో పోలిస్తే ఎంత భిన్నంగా ఉందో! స్వామి వివేకానంద ఒకసారి ఇలా అన్నాడు: "బౌద్ధమతం అనేది హిందూమతం నుండి పుట్టి తిరుగుబాటు చేసిన బిడ్డ". బహుశా "నేటి హిందూమతం అన్నది బౌద్ధమత చట్టబద్ధమైన బిడ్డ" అని చెప్పడం కూడా అంతే సరైనది కావచ్చు!

ఈ 20వ శతాబ్దంలో బౌద్ధం గతకాల అవశేషంగా కాక, భారతదేశంలో మళ్ళీ ఒక సజీవ మతవిశ్వాసంగా ఉద్భవించిందని నా అభిప్రాయం, ఇది కమిటీ నిర్ణయాన్ని కనీసం పాక్షికంగానైనా ప్రభావితం చేసి ఉండాల్సిన మరో కారణం కావచ్చు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతదేశ మత జీవితంలోనే కాకుండా, ప్రపంచ సమకాలీన మతచరిత్రలో కూడా ఒక అద్భుతాన్ని చేసి చూపారు. ఆయన ద్వారా ప్రేరణ పొంది, ఆయన మార్గదర్శకత్వంలో లక్షలాదిమంది బౌద్ధమతంలోకి మారారు. గత జనాభా లెక్కల ప్రకారం తక్కువగా చూపించవచ్చేమో కాని, భారతదేశంలో బౌద్ధుల సంఖ్య అపారంగా పెరిగిందనడంలో సందేహమే లేదు.

మనిషి పతనానికైనా పాపానికైనా కారణం భయమే.

చివరిది, ముఖ్యమైన కారణం ఏమిటంటే, స్వామి వివేకానంద 100వ జయంతిని జరుపుకోవడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాం, ఆయన మహోన్నత బుద్ధుని వ్యక్తిత్వాన్ని అమితంగా ఆరాధించే వారని అందరికీ తెలుసు. 1900 మార్చిలో, శాన్ ఫ్రాన్సిస్కోలో తన ప్రసంగాలలో ఒకచోట ఇలా చెప్పాడు : "బుద్ధుని జీవితానికి ఒక ప్రత్యేక ఆకర్షణ ఉంది. ఆయన వ్యక్తిత్వం అంటే నాకు అపార గౌరవం. అంతగా గౌరవించదగ్గ వ్యక్తి మరొకరు లేరు. ఆ ధైర్యం, ఆ నిర్భయత, ఆ అపారమైన ప్రేమ! ఆయన మానవాళి మేలుకోసం జన్మించాడు. జీవితం మొత్తంలో ఎప్పుడూ తన గురించి ఆలోచించుకోలేదు. బుద్ధుని గొప్పతనాన్ని అర్థం చేసుకోలేక మనం అజ్ఞానులుగా, స్వార్థపరులుగా, సంకుచిత మనస్కులుగా ఎలా మారిపోయామో!"

"ఆయన జీవితంలోనే కాదు, మరణంలో కూడా గొప్పవాడే. మరణిస్తున్నప్పుడు కూడా ఆయన తనకు తానుగా ఎలాంటి ప్రత్యేకతను కోరుకోలేదు. అందుకే నేను ఆయనను ఆరాధిస్తాను." అని స్వామి వివేకానంద అన్నారు.

భిక్షువుగా నాకు, ఇక్కడ హాజరైన మనందరికీ, మహోన్నత బుద్ధుడిని గౌరవించడం, గుర్తు చేసుకోవడం సహజమే. ప్రాచీనకాలంలో, మధ్యయుగాల్లో కాదు, మనతరం కాకపోయినా, మన ముందుతరంలోనే – ఒక సాధువు, తత్వవేత్త, సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు, బోధకుడు, గురువు, నిర్వాహకుడు, దేశభక్తుడు, ప్రపంచ మిషనరీ – ఇవన్నీ కలిస్తే ఆ పేరు స్వామి వివేకానంద అని గుర్తుచేసుకోవడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాం.

ఈ చిరస్మరణీయ సందర్భంలో నేను కూడా స్వామి వివేకానందకు రుణపడి ఉన్నానని అంగీకరిస్తున్నాను. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు 'భారతదేశం' అనే పేరుతో ఉన్న వారి వ్యాసాలు, ప్రసంగాల సంకలనాన్ని చదివాను. ఆ పుస్తకం నా మనసుపై చెరగని ముద్ర వేసింది. ఇప్పటికీ నేను దాన్ని అనుభూతి చెందుతున్నాను.

ఒక విషయం చాలా ఆశ్చర్యమేస్తుంది. స్వామి వివేకానంద ఇలా చెప్పారని రికార్డులలో ఉంది: "నా జీవితమంతా నేను బుద్ధుడిని చాలా ఇష్టపడ్డాను, కానీ అతని సిద్ధాంతాన్ని కాదు." ఇది నిజంగా కొంచెం తరచి చూడాల్సిన అసాధారణ ప్రకటన. బుద్ధుడిని కాకుండా, ఏ గొప్పవ్యక్తినైనా తీసుకొని అతని వ్యక్తిత్వాన్ని, అతని సిద్ధాంతం నుండి వేరు చేయవచ్చా? ఆ వ్యక్తిని చాలా ఇష్టపడుతున్నానని, అతని సిద్ధాంతాన్ని కాదని ప్రకటించుకోవచ్చా? బుద్ధుడు ఏమి బోధించాడో, అది ఆచరించలేదా? లేక ఏది ఆచరించాడో అది బోధించలేదా? ప్రశ్నను మరొక విధంగా కూడా అడగవచ్చు. బుద్ధుడు ఏం బోధించాడో, అదే ఆచరించాడా? బుద్ధుని సారాంశాలలో ఒకటి మాత్రం అందరూ ఆమోదిస్తారు. ఆయన **'యథా భాషి తథా కారి'**. ఆయన ఏం చెప్పాడో, అలానే జీవించాడు. ఆయన స్వయంగా ఇలా చెప్పుకున్నాడు: **"యో ధమ్మం పస్సతి, సో మామ్ పస్సతి"**. నా సిద్ధాంతాన్ని చూడగలిగినవారే నన్ను చూడగలరు, ఇంకా చెప్పాలంటే, నా సిద్ధాంతాన్ని చూసేవారే నన్ను నిజంగా అనుసరిస్తారు." స్వామి వివేకానంద ఏ ప్రత్యేక సందర్భంలో పై వ్యాఖ్య చేసి ఉంటారో అర్థం చేసుకోవడం కష్టంగా, ఇబ్బందిగా ఉంటుంది.

అది ఎలా ఉన్నా, బుద్ధుని సిద్ధాంతం ఏమిటి? ఆయన బోధనలు ఏమిటి అని తెలుసుకోవడానికి ప్రయత్నించడం మనలో చాలామందికి నిజంగా ఆసక్తికరం కదా! స్వామి వివేకానందకు అంతే !

శక్తి అనేది డబ్బులో లేదు, మంచితనంలో పవిత్రతలో ఉంది.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ప్రయత్నించడం తేలికైన విషయం కాదని అంగీకరిస్తున్నాను. ప్రసిద్ధ తాత్విక పండితులతో సహా బౌద్ధమతం గురించి చాలా అపోహలు ఉన్నాయి. వాటిలో ఒకటి, 'బుద్ధుడు దేవుడు, ఆత్మల ఉనికిని అంగీకరించలేదు, తిరస్కరించలేదు' అని. అన్ని ఆస్తిక మతాలకు ఆధారం అయిన ఈ రెండు కీలకమైన అంశాలపై ఆయన మౌనంగా ఉన్నాడని వారు అంటున్నారు. నా మనవి ఏమిటంటే: బుద్ధుడు అవసరంలేని కొన్ని అంశాలపై మాట్లాడలేదు. అవి కేవలం పది మాత్రమే.

1. ఈ విశ్వం శాశ్వతమా?
2. ఈ విశ్వం అశాశ్వతమా?
3. ఈ విశ్వానికి అంతం ఉందా?
4. ఈ విశ్వం అనంతమా?
5. ఆత్మ, శరీరం ఒక్కటేనా?
6. ఆత్మ, శరీరం రెండు వేర్వేరా?
7. తథాగతులు (బుద్ధులు) మరణానంతరం జీవిస్తారా?
8. తథాగతులు మరణించిన తర్వాత జీవించరా?
9. తథాగతులు మరణానంతరం జీవిస్తూ, జీవించకుండా కూడా ఉంటారా?
10. తథాగతులు అసలు జీవించకుండా, మరణానంతరం కూడా జీవించకుండా ఉంటారా?

పై ప్రశ్నలకు బుద్ధుడు సమాధానం ఇవ్వలేదు. ఆ అంశాలపై ఏ నిర్ధారిత వ్యాఖ్యానం ఎందుకు చేయలేదని మాళుంక్య పుత్రుడు అడిగినప్పుడు, ఆయన ఇలా సమాధానమిచ్చారు:

"పైన పేర్కొన్న అంశాలపై నేను మాట్లాడదలచుకోలేదు, ఎందుకంటే వాటిపై చర్చ ప్రయోజనం లేనిది, నిష్ఫలమైనది, సంసారం బంధనం నుండి దూరమవడానికి దోహదపడదు, జ్ఞానోదయం పొందడానికి ఎవరికీ సహాయపడదు, నిర్వాణాన్ని పొందడానికి అది ఎవరికీ సహాయపడదు. ఈ ప్రత్యేక కారణం చేతనే నేను పై అంశాలపై మాట్లాడలేదు."

గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఆత్మ, పరమాత్మ భావనలు, పదాలు ఈ అవ్యక్తాలలో లేవు. అందువల్ల, బుద్ధుడిని ఆత్మ, దేవుని గురించి ప్రశ్నించినప్పుడు ఆయన పూర్తిగా మౌనంగా ఉన్నాడని సూచించడం తప్పు మాత్రమే కాదు, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా అలా చేస్తే అది ప్రమాదకరం కూడా.

బౌద్ధంలోని ఈ అంశంపై స్వామి వివేకానందకు మాత్రం మంచి అవగాహన ఉందని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను, ఎందుకంటే "బుద్ధుని ప్రకారం దేవుడు, ఆత్మ అనేవి రెండు పెద్ద మూఢనమ్మకాలు" అని స్వామి వివేకానంద పేర్కొన్నారు.

సబ్బే శంఖార అనిచ్చ	–	అంతా అశాశ్వతం
సబ్బే శంఖారా దుఃఖం	–	అంతా అసంతృప్తం, అస్థిరం, దుఃఖమయం
సబ్బే ధమ్మ అనత్త	–	మార్పుచెందనిది ఏదీ లేదు, చివరికి నిర్వాణ కూడా

ఈర్ష్యను, స్వార్థాన్ని విడిచిపెట్టి, స్థైర్యంగా ఉండు, అప్పుడు నీవు ప్రపంచాన్నే కదిలించివేయగలవు.

ఈ మూడు సూత్రాలు, నా అభిప్రాయం ప్రకారం, బౌద్ధ అధిభౌతికతత్వాన్ని తెలుపుతాయి.

'ఉన్నదంతా తాత్కాలికమే, శాశ్వతమైనదేదీ ఉనికిలో లేదు' అనేది బౌద్ధమతం తీసుకున్న మొట్టమొదటి, అతి ముఖ్యమైన వైఖరి. సూటిగా చెప్పాలంటే మార్పులేకుండా మారడమే ప్రకృతి సూత్రం. *(దీన్నే కొందరు 'ఈ ప్రపంచంలో ప్రతిదీ మారుతుంది' అన్న వాక్యం తప్ప 'అంతా మారుతుంది' అని మార్క్స్ చెప్పారు అని కోట్ చేస్తారు. -అనువాదకుడు)* బౌద్ధమతం ఈ వాక్యాన్ని పూర్తిగా ధ్రువీకరిస్తుంది. వాస్తవానికి, ఈ ప్రకటన శతాబ్దాల క్రితం బుద్ధుడు ప్రకటించిన దానికి ప్రతిధ్వని మాత్రమే.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ మార్పును తప్పుగా అర్థం చేసుకోకూడదు. ఈ మార్పు ఏ మార్పులేని దాని బాహ్య మార్పు కాదు. ఇది ఒక స్థితి పూర్తిగా నశించి, మరొక స్థితి పూర్తిగా కొత్తగా ఉద్భవించడం. "ఉనికి నుండి బయటకు వెళ్ళేది ఒకటి, ఉనికిలోకి వచ్చేది మరొకటి" అని బుద్ధుడు బోధించాడు.

ఈ మార్పు, ఈ అస్థిరత అనే నియమం, అదేదో చెడు అయినట్లు తప్పుగా అర్థం చేసుకోవడం నిజంగా ఆశ్చర్యకరం. ఈ అస్థిరత అనే సూత్రంలో ఈ ప్రపంచం మారుతుంది అనే ఆశ, విముక్తి సందేశాన్ని చదవడానికి ఇది సరైన సమయం ! మనల్ని మనం మెరుగుపరచుకోవచ్చు. మనం ఇతరులను మెరుగుపరచవచ్చు. మన జీవితాల్ని మనం మార్చుకోవచ్చు. మనకు ఇంకేం కావాలి?

ఈ విశ్వం అస్థిరమైనది అని అంగీకరించి కూడా, ఎవరైనా వారి ఆలోచనల్లో, అనుభూతుల్లో, వైఖరుల్లో, ప్రవర్తనలో బాధపడుతూ ఉంటే వాళ్లని ఎవ్వరూ ఆదుకోలేరు.

ఈ విశ్వంలో మార్పులేనిదంటూ లేదు. మార్పే చెందనిది 'ఆత్మ' అని ఎవరైనా భావిస్తే మాత్రం వారు సమస్యల్లో చిక్కుకున్నట్లే.

కాబట్టి ప్రపంచం దుఃఖమయం. అజ్ఞానులకు మాత్రమే దుఃఖం, జ్ఞానులకు కాదు. నిజమే బుద్ధుడు అన్ని ఉపాదాన ఖంధాలు దుఃఖపడుతున్నాయని ప్రకటించాడు. దానర్థం శాశ్వతం అని భావించే అన్ని ప్రజాసమూహాలు దుఃఖపడుతున్నాయని మాత్రమే. అన్ని ప్రజాసమూహాలు దుఃఖపడుతున్నాయని కాదు.

దుఃఖాలను అంతం చేసే మార్గాన్ని సాధారణంగా అష్టాంగ మార్గం అని పిలుస్తారు. చరిత్రలో ఇప్పటివరకు బోధించిన స్వీయ-సంస్కృతి (స్వీయ క్రమశిక్షణల్లో) అన్నింటికన్నా ఉత్తమమైనదది.

జ్ఞానోదయం పొందిన బుద్ధుడు **'సమ్యక్ దృష్టి'** ని బోధించాడు. అంటే విషయాలను ఎలాంటి తప్పుడు అభిప్రాయాలతో, తప్పుదారి పట్టకుండా ఉన్నది ఉన్నట్టుగా చూడటం.

ఆయన **'సమ్యక్ వాక్కు'**ను బోధించాడు. తప్పుడు, కఠినమైన, పనికిమాలిన భాషను కాకుండా సత్యాన్ని, సందర్భానికి తగినట్లుగా చక్కటి, దయగల భాషను ఉపయోగించమన్నాడు.

ఆయన **'సమ్యక్ కర్మ'**ను బోధించాడు. సరైన పనులే చేయాలి. చెడు కార్యకలాపాలను నివారించాలంటే, అవి చెడ్డవని మనం తెలుసుకుంటే సరిపోదు, వాస్తవానికి మనం వాటికి దూరంగా ఉండాలి.

ఆయన **'సమ్యక్ జీవనం'**ను బోధించాడు. ఉన్నతమైన ఆదర్శవంతమైన జీవితం జీవించాలన్నాడు. బానిసలు,

భవిష్యత్తులో ఏమి జరుగుతుందోనని ఎప్పుడూ లెక్కకట్టేవాడు దేన్నీ సాధించలేడు.

మత్తు పదార్థాలు, మందుగుండు సామగ్రి, ఇతర సారూప్య వస్తువులతో వ్యాపారం చేయడం బౌద్ధంలో నిషేధించబడింది.

ఆయన **'సమ్యక్ వ్యాయామం'**ను బోధించాడు. వ్యక్తిలోని అన్ని దుర్గుణాలను చెరిపేసి, వ్యక్తిత్వంలోని గొప్ప గుణాలను కాపాడుకోవడం.

చిన్న చిన్న పనులు చేయడంలో కూడా ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదని, నిరంతరం బుద్ధిపూర్వకంగా ఉండాలని ఆయన **'సమ్యక్ స్మృతి'**ని బోధించాడు.

'సమ్యక్ సమాధి'ని బోధించాడు. మనస్సు ఒకే అంశంపై దృష్టిని పెంపొందించుకోవడం, అది అభివృద్ధి చెందినప్పుడు తీక్షణమైన తెలివిగా మారుతుంది, అంతకుమించినది ఏదీ ఉండదు.

ఈ విశిష్ట సత్యంలో మొదటి దశ, అంటే దుఃఖం గురించి మనం మాట్లాడేటప్పుడు, కొంతమంది దానిని అతిగా నొక్కి చెప్పే తప్పు చేస్తారు. "అంతా దుఃఖమయం" అని వారు అంటారు. "అది అర్ధసత్యం మాత్రమే". అవును, నిజమే, ఎందుకంటే సత్యంలోని మిగిలిన సగం "దాని నుండి బయటపడటానికి ఒక మార్గం ఉంది."

కొందరు కువిమర్శకులు ఇంకా ముందుకు వెళ్లి, "బౌద్ధ ధమ్మం"ను కేవలం నిరాశావాదంగా ముద్రవేస్తారు. బహుశా వారికి నిరాశావాదం అంటే ఏమిటో తెలియకపోవచ్చు! నిరాశావాదం "ఈ ప్రపంచంలో దుఃఖం ఉంది, దాని నుండి బయటపడటానికి మార్గం లేదు" అని చెబుతుంది. కానీ బుద్ధుడు "ఈ ప్రపంచంలో దుఃఖం ఉన్నప్పటికీ, దాని నుండి బయటపడటానికి ఒక మార్గం ఉంది" అని అంటాడు.

ఒకసారి సాధుస్నేహితుడు నాకు, "నువ్వు శూన్యంవైపు పరిగెడుతున్నావు" అని రాశాడు. "అన్ని దుఃఖాలను అంతం చేయడాన్ని కూడా శూన్యం అనే ధైర్యముందా?" అని స్నేహపూర్వకంగా సమాధానమిచ్చాను.

అత్యుత్తమమైన అష్టాంగ మార్గానికి, ఇతరమతాలు ప్రబోధించే నైతికతకు కూడా పోలికలున్నాయని కొందరు అనవచ్చు. నిస్సందేహంగా, ప్రతి మతం నైతికతను ప్రబోధిస్తుంది, కానీ 'బుద్ధుని ధమ్మం' ఇతర మతాల నుండి స్వీకరించింది కాదు. ఇతర మతాలలో, సాధారణంగా చెప్పాలంటే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగా "నైతికత అనేది ఒక బండి పెట్టె లాంటిది, దీనిని ఇష్టానుసారంగా జతచేయవచ్చు, వేరు చేయవచ్చు. బుద్ధుని విషయంలో నైతికత అన్నది బౌద్ధ ధర్మానికి ఆధారం."

బౌద్ధంలో అశాశ్వత సిద్ధాంతం చాలా ముఖ్యమైనది. 'అనాత్మవాదం' కూడా అంతే ముఖ్యమైనది. బుద్ధుడు ఆత్మ అనే మూఢనమ్మకాన్ని నిర్ద్వందంగా ఖండించాడు.

"తెలివితక్కువ పరిశీలనతో" అజ్ఞాని ఆరు దృక్కోణాలలో ఒకటి లేదా మరొకదాన్ని స్వీకరిస్తాడు - వాటిలో ఒకటి: ఆలోచించగల, అనుభూతి చెందగల, ఇప్పుడు ఇక్కడ, అక్కడ, మంచిచెడుల కర్మల ఫలాలను అనుభవిస్తుంది 'నేనే'. ఈ 'నేను' శాశ్వతమైనది, స్థిరమైనది, శాశ్వతమైనది, మార్పుకు లోబడి ఉండదు. అందువలన శాశ్వతంగా అలాగే ఉంటుంది. అదే 'ఆత్మ' అనుకొంటాడు.

నిజంగా ఆత్మ అనేది ఉంటే, ఆత్మకు చెందినది కూడా ఉండేది. అయితే, వాస్తవంగా ఆత్మ లేదా ఆత్మకు చెందినది ఏదీ కనుగొనబడదు కాబట్టి, ఇది నిజంగా పూర్తిగా మూర్ఖపు సిద్ధాంతం. "ఇది ప్రపంచం, ఇది నేను, మరణం తరువాత నేను స్థిరంగా, శాశ్వతంగా ఉంటాను." ఇవి కేవలం అభిప్రాయాలు, అభిప్రాయాల గుట్ట, అభిప్రాయాల తోలుబొమ్మలాట, అభిప్రాయాల చుట్ట, భావజాలపు ఉచ్చు". ఈ అభిప్రాయాల సంకెళ్లలో చిక్కుకున్న అజ్ఞాని పునర్జన్మ నుండి, నాశనం నుండి, మరణం నుండి, విచారం, బాధ, దుఃఖం, నిరాశల నుండి విముక్తి పొందలేడు, అతను దుఃఖవిముక్తుడు కాలేడు."

బుద్ధుడు దేవుడిని, ఆత్మను తిరస్కరించలేదని కొందరు ఇప్పటికీ బుకాయించవచ్చు. 'దేవుడు' అనే పదం ద్వారా వ్యక్తీకరించబడిన అన్ని విభిన్న భావనలను బుద్ధుడు ఒక్కొక్క అంశంగా చర్చించి తిరస్కరించాడు. తాత్వికంగా చెప్పాలంటే 'దేవుని ఉనికిని నిరూపించలేం' అన్నాడు. నైతికంగా చెప్పాలంటే 'దేవుని భావన లాభదాయకం కాదు, పైగా ఖచ్చితంగా హానికరమైంది' అన్నాడు.

బుద్ధ భగవానుడు తన సిద్ధాంతంలో ఆత్మ అనే మూఢభావనను ఏ కోశానా చేర్చలేదు. 'ఏ వ్యక్తి నైతిక అభివృద్ధి దృక్కోణం నుండి చూసినా ఆత్మపై నమ్మకం మరింత హానికరమ'ని ఆయన భావించాడు.

ఆధునికులు మనస్సు, పదార్థం గురించి ఆలోచిస్తున్నారు. వారి దృష్టిలో మనస్సు, పదార్థం అనే భావనలు ఒకదానికొకటి దూరంగా నిలబడే రెండు అస్తిత్వాలుగా ఉన్నాయి. ఈ వైఖరి ఖచ్చితంగా మారుతుంది. బౌద్ధ బోధనల్లో : "మనస్సు పదార్థం నుండి స్వతంత్రంగా ఉండదు. అలాగే పదార్థం కూడా మనస్సు నుండి స్వతంత్రంగా ఉండదు." రెండూ తాత్కాలికమైనవి. రెండూ ఆటుపోట్లకు గురవుతూనే ఉంటాయి, అవి సమాంతరంగా తమ గమనాన్ని నడుపుతున్నట్లు మాత్రమే కనిపిస్తాయి.

'మనస్సు, పదార్థం రెండూ తాత్కాలికమైనవి, రెండూ శాశ్వతం కాకపోతే, లేదా శాశ్వత స్వభావం కలిగిన ఆత్మ వంటి మరేదీ లేకపోతే, అశాశ్వత అనుభవాన్ని ఎలా వివరించగలం?' అని కొందరు వాదిస్తారు. సమాధానం ఏమిటంటే, పూర్తి అశాశ్వతం ఆధారంగా మాత్రమే అశాశ్వత అనుభవాన్ని వివరించవచ్చు. శాశ్వతమైనది, మార్పులేని ఆత్మ అని భావించబడేది ఏదైనా ఉంటే అది ఏ అనుభవాన్నీ పొందదు. ఏదైనా వాస్తవాలను గమనించే లేదా ఏదైనా సంఘటనలను చూసే సామర్థ్యం, అనుభవం పొందే అవకాశం వ్యక్తి అశాశ్వతతను, అస్థిరతను నిరూపిస్తుంది.

సరిగ్గా ఒకే వేగంతో నడుస్తున్న రెండు సమాంతర రైళ్లు ఒకదానినొకటి చూసుకుంటే, అవి కదులుతున్న అనుభూతి పొందలేవు, ఎందుకంటే వాటి కదలికలు మాత్రమే కాదు, రెండు రైళ్ల కదలికను గమనించడం కూడా సాపేక్షమే. బౌద్ధ మనస్తత్వశాస్త్రం, భౌతికశాస్త్రం ఇక్కడ బాగా సరిపోతాయి. బౌద్ధం ప్రకారం, నామ (మనస్సు), రూపం (పదార్థం) రెండూ తాత్కాలికమైనవే అయినప్పటికీ, రెండూ సమాంతరంగా నడుస్తున్నట్లు అనిపించినప్పటికీ, నామం, రూపం లేదా మనస్సు, పదార్థం వేగంలో తేడా ఉంది. అందువల్ల మారుతున్న ప్రకృతి అశాశ్వతను, అస్థిరతను గమనించే అవకాశం ఉంది.

బుద్ధుని ఆలోచనల సమాహారంగా పిలవబడే బౌద్ధం కేవలం తాత్విక సిద్ధాంతాల సమితి కాదు. ఇది ఒక

మార్గం, వాస్తవానికి సరైన మార్గం, ఇది అన్ని దుఃఖాల పూర్తి నివారణకు దారితీయగలదు. ఈ ఆరు అడుగుల శరీరంలోనే అన్ని దుఃఖాల నివారణం, నిర్వాణం సాధించబడుతుందనేది ఎంత గొప్ప ఆశ!

"ఓ భిక్షువులారా, నేను రెండు విషయాలు బోధిస్తాను, దుఃఖం, దుఃఖ నివారణ", అని బుద్ధుడు గట్టిగా చెప్పాడు.

దుఃఖాలు మూడు రకాలుగా ఉంటాయి – భూత, వర్తమాన, భవిష్యత్తు. మనం ఇప్పటికే అనుభవించిన దుఃఖాలను అంతం చేయగలమా? ఇది గతించిన వాస్తవం. కనుక వాటిని మనం ఏం చేయలేం.

భవిష్యత్తులో మనం అనుభవించబోయే దుఃఖాలను అంతం చేయగలమా? తప్పకుండా మనం చేయగలం. ఇప్పటికే ఉన్న దానిని అంతం చేయడానికి కాదు. బుద్ధుని మార్గం కొన్ని అనారోగ్యకరమైన అనుభవాలు ఉనికిలోకి రాకుండా అడ్డుకుంటుంది, లేకపోతే అవి ఉనికిలోకి రావచ్చు. **దుఃఖం హైయం అనాగతం**. భవిష్యత్తులో వచ్చే దుఃఖం, భవిష్యత్తులో వచ్చే బాధలు, భవిష్యత్తులో వచ్చే విచారాలు, భవిష్యత్తులో వచ్చే దురదృష్టాలు తలెత్తకుండా ఆపగలుగుతుంది. తద్వారా అవన్నీ తొలగించబడతాయి.

భారతీయ తర్కం ప్రకారం అందరూ అంగీకరించే మూడు ప్రధాన ప్రమాణాలు:

1. ప్రత్యక్ష ప్రమాణం

2. అనుమాన ప్రమాణం (అనుమితి)

3. శాస్త్ర ప్రమాణం (గొప్పవారు చెప్పిన మాటలు, లేదా,

'గొప్ప పుస్తకాల్లో', పవిత్ర గ్రంథాల్లో రాసిన వాక్యాలు)

మనం మన కళ్ళతో నిప్పును చూసి 'నిప్పు' అంటాం. ఇది ప్రత్యక్ష ప్రమాణం.

మనం మన కళ్ళతో నిప్పును చూడలేదు, మనకు పొగ మాత్రమే కనిపిస్తుంది. మనం పొగను చూసి, నిప్పు ఉందని ఊహిస్తాము. ఇది అనుమితి.

మనం ఏ ఆత్మ లేదా దేవుడి ఉనికిని చూడలేము, అనుభూతి చెందము లేదా గుర్తించము, అయినప్పటికీ అవి ఉన్నాయని ప్రకటిస్తాము. ఎందుకు? ఎందుకంటే మన బాల్యం నుండే, మనకు పవిత్ర గ్రంథాలలో ఇలా చెప్పబడిందని నేర్పిస్తారు. దీన్నే శాస్త్ర ప్రమాణం అంటారు.

బౌద్ధ తర్కం కేవలం మొదటి రెండు ప్రమాణాలను మాత్రమే అంగీకరిస్తుంది.

1. ప్రత్యక్ష ప్రమాణం

2. అనుమాన ప్రమాణం (అనుమితి)

ఆలోచించలేని ప్రజలకు, వారు ఏ మతానికి చెందినవారైనా కావచ్చు. 'నేం చెప్పిందే జ్ఞానం' అనే కాలం చెల్లిన తిరుగులేని అధికారం వ్యక్తికిగాని, గ్రంథానికి గాని ఇచ్చే ఆలోచన ఎటువంటి ప్రగతికీ తోడ్పడదు.

ఆధునిక క్రైస్తవ శాస్త్రీయ ప్రపంచం కూడా వారి పవిత్రగ్రంథం దోషరహితమైందన్న ఆదిమ విశ్వాసాలను చాలాకాలంగా విస్మరించడం వల్లనే పురోగతి జరిగిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

బుద్ధుని వినయంగా అనుసరించేవారు ఎంత అదృష్టవంతులు! వారు ఏ గ్రంథంలోనూ మొదటి నుంచీ దోషరహితం అనే తప్పుడు భావనను వారసత్వంగా పొందలేదు.

బుద్ధుని గొప్పతనాన్ని గురించి మాట్లాడుతూ, స్వామి వివేకానంద మరోసారి తనదైన శైలిలో, "బుద్ధుని అద్భుత మేధస్సును గమనించండి! భావోద్వేగం లేదు. ఎప్పుడూ మూఢత్వంగా ఆలోచించలేదు. ఎవరో చెప్పారని నమ్మవద్దు, ఎందుకంటే మిత్రుల కోరికపై అది మీ పూర్వీకుల నుండి మీకు అందజేయబడింది, కానీ మీరే ఆలోచించండి, మీ కోసం మీరే సత్యాన్ని శోధించండి. దానిని మీరే గుర్తించండి. అది ఇతరులకు ప్రయోజనకరమని భావిస్తే, దానిని ప్రజలకు ఇవ్వండి. సున్నిత మనస్కులు, బలహీన మనస్కులు, మరుగుజ్జు మనస్కులు సత్యాన్ని కనుగొనలేరు. ఆ వ్యక్తి స్వేచ్ఛాపరుడు కావాలి, ఆకాశం వలె స్వేచ్ఛగా ఉండేవారు కావాలి. స్పష్టమైన మనస్సు ఉండాలి. అప్పుడే దానిలో నిజం ప్రకాశిస్తుంది" అన్నారు.

ధర్మకీర్తి రాసిన సంస్కృత శ్లోకం గుర్తుకు వస్తుంది. ఈ శ్లోకానికి నేను ప్రసిద్ధ భారతీయ పండితుడు రాహుల్ సాంకృత్యాయన్ జ్ఞాపకాలకు రుణపడి ఉన్నాను. అమర్యాదగా అనిపించే ప్రమాదం ఉన్నప్పటికీ, నేను ఇప్పటివరకు చెప్పినది సాంప్రదాయ బౌద్ధ ఆలోచనకు అనుగుణంగా ఉందని, అంతేతప్ప కొందరు భావించినట్లు ఆధునిక అజ్ఞేయవాదం, హేతువాదం లేదా లౌకికవాద స్ఫూర్తి కాదని అనుకొంటారని నేను ఈ శ్లోకాన్ని ఉటంకిస్తున్నాను.

వేదప్రమాణ్య కస్యచిద్ కర్తృవాదః

స్నానేధర్మేచ్ఛా జాతివాదావలేపః

సంతాపరంభః పాపహానాయ చేతి

ధ్వస్తప్రజ్ఞానం పంచలింగాని జాడ్యే

ఈ శ్లోకాన్ని అర్థమయ్యేలా అనువదిస్తే:

"వేదప్రమాణాన్ని నమ్మడం, సృష్టికర్తను నమ్మడం, పవిత్రనదుల్లో స్నానం చేయడం వల్ల పాపాలు పోతాయని నమ్మడం, కుల వ్యవస్థను సమర్థించడం, ఆచారంపేరుతో శరీరాన్ని ఎండగట్టుకోవడం – ఈ ఐదు మూఢమనస్సుల సంకేతాలు."

దేవుడు తను ఏం చేస్తాడో ఎవరికో ప్రత్యక్షమై చెబుతాడని రాసి ఉండటమేమిటి? హిందువుల మేలుకోసం దేవుడు ప్రాచీన సంస్కృతంలో వేద మంత్రాలను వెల్లడించాడని, క్రైస్తవుల మేలుకోసం దేవుడు బైబిల్ బోధనలను హీబ్రూలో వెల్లడించాడని, ముస్లింల మేలుకోసం, దేవుడు అరబిక్ భాషలో ఖురాన్‌ను వెల్లడించాడని భావిస్తారు.

మూడు వేర్వేరు సమయాల్లో, మూడు వేర్వేరు వ్యక్తులకు, మూడు వేర్వేరు భాషలలో మూడు వేర్వేరు

ప్రకటనలు: అయినప్పటికీ అవన్నీ ఒకే దేవుని నుండి వచ్చాయని నమ్ముతారు! ఒకవేళ, అదే నిజమైతే, విషయాలు ఎందుకు ఒకేలా లేవు? ఎందుకు చాలా భిన్నంగా ఉన్నాయి?

నేడు కొందరు, 'మతం గురించి ఎందుకు అంత ఆరాటం? మతం వ్యక్తిగత విషయం కదా! ప్రజా జీవితంలో దాని పాత్ర ఉండకూడదు' అంటున్నారు. ఇతర మతాల విషయంలో ఇది నిజం కావచ్చు, కాకపోవచ్చు. అది ముమ్మాటికీ నిజం. కానీ అది బుద్ధుని బోధనలకు అస్సలు వర్తించదు. బౌద్ధధమ్మం అనేది ప్రాథమికంగా, అత్యంత చక్కటి సామాజిక ప్రతిపాదన.

బౌద్ధధమ్మంలో సరైన వ్యక్తిత్వం లేకుంటే అది శూన్యంతో సమానం. బౌద్ధ ధమ్మం అంటేనే జీవితంలోని అన్ని కోణాలలో మనిషికీ, మనిషికీ మధ్య సరైన సంబంధం ఏర్పరచడం.

భారతీయ సమాజంలో, హిందువులు సామాజికంగా చాతుర్వర్ణ వ్యవస్థ ఆధారంగా వ్యవస్థీకృతమై ఉన్నారు. సమాజాన్ని బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులుగా వర్గీకరించడం దాని ఉద్దేశ్యం. ఎవరైనా ఇలా అడగవచ్చు: 'ప్రతి దేశానికి, ప్రతి సమాజానికి శ్రమ విభజన ఉంటుంది, హిందూ సమాజానికి కూడా దాని స్వంత శ్రమ విభజన ఉంటే తప్పేముంది?' అని. ఈ చాతుర్వర్ణ విభజన ఏ శ్రమ విభజననూ సూచించదు, ఇది అన్యాయంగా చేసిన శ్రామికుల విభజన. దాని మొదటి సూత్రం అసమానత. దాని రెండవ సూత్రం నిచ్చెనమెట్ల అసమానత. దాని మూడవ సూత్రం విద్యలో, ఇతర విషయాలలో సమాన అవకాశాలను తిరస్కరించడం. దాని నాల్గవ సూత్రం వృత్తిలో సమాన హక్కులను తిరస్కరించడం.

దీనికి బుద్ధుని సమాధానం: **ఒక మనిషి విలువ ఎప్పుడూ అతని పుట్టుకపై ఆధారపడి ఉండదు:**

న జచ్చా వసలో హోతి, న జచ్చా హోతి బ్రాహ్మణో

కమ్మనా వసలో హోతి, కమ్మనా హోతి బ్రాహ్మణో

ఒక మనిషి పుట్టుక అతన్ని అస్పృశ్యుడిగానో లేదా బ్రాహ్మణుడిగానో చేయదు. అతని చర్యలే అతనికి తక్కువ లేదా ఎక్కువ హోదాను ఇస్తాయి.

నా విశ్లేషణ ప్రకారం, భారతదేశంలో ప్రస్తుత బౌద్ధమత పునరుజ్జీవనం, హిందూ సమాజంలోని అసహ్యకరమైన చాతుర్వర్ణ విభజనకు వ్యతిరేకంగా మొదలైన బలమైన తిరుగుబాటు.

ఆధునిక విద్య, ఆధునిక సమాచార సాధనాలు, వివిధ రకాల ఆధునిక వృత్తులు అన్నీ వర్ణవ్యవస్థను అనేక విధాలుగా దెబ్బతీస్తున్నాయి. బుద్ధుని బోధనలు అందుకు తోడయ్యాయి. బహుశా భారతదేశ భవిష్యత్తులో చాతుర్వర్ణ వ్యవస్థకు భవిష్యత్తే లేకపోవచ్చు.

అదృష్టవశాత్తూ, ఇప్పుడు బౌద్ధేతర నాయకులలో కూడా సహేతుకమైన అభిప్రాయాలను కలిగి ఉన్నవారు, ఆధునిక ఉదారవాద దృక్పథాన్ని కలిగినవారు ఉన్నారు. మన ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వారిలో అగ్రగామి. చివరిగా ఆయన శ్రీలంకలో ఉన్నప్పుడు, ఓ ప్రసంగంలో, 'బ్రిటిష్ పాలనలో జైలు శిక్ష

అనుభవిస్తున్నప్పుడు, బుద్ధుని చిత్రపటాన్ని ఎల్లప్పుడూ తన గదిలో ఉంచుకున్నారని, అది తనకు ఓదార్పును, శాంతిని ఇచ్చిందని, తన మనస్సు గందరగోళంలో ఉన్నప్పుడు తనకు సాంత్వన నిచ్చిందని' అన్నారు.

బుద్ధుని చిత్రం మనందరికీ అదే ఓదార్పును, అదే శాంతిని ప్రసాదిస్తుందని ఆశిస్తున్నాను.

ఈ రోజుల్లో ప్రజలు ఉన్నత జీవన ప్రమాణాల గురించి మాట్లాడుతున్నారు, అంటే మరిన్ని ఎక్కువ సౌకర్యాలు, మరిన్ని సినిమాహాళ్లు, మరిన్ని రేడియోలు, మరిన్ని కార్లు, మరిన్ని టెలివిజన్లు, మరింత తొందరపాటు ప్రయాణాలు. **కానీ ఒక వ్యక్తిని సంతోషపెట్టేది బహిర్గతంగా కనిపించే జీవన ప్రమాణాలు కావు, ఉన్నతమైన సంస్కృతే అంతర్గత ఆనందాన్ని నిర్ధారించే ప్రమాణం.**

బుద్ధుని ధమ్మం మనిషి తన స్వీయ-సంస్కృతికి (స్వీయ క్రమశిక్షణ) సంబంధించిన అత్యంత గొప్పమార్గం. ఇది మనిషిని వీలైనంత సంతోషంగా, ఉన్నతంగా మార్చగలదు.

"ప్రపంచంలోని గురువులందరిలో, మనకు స్వావలంబనను ఎక్కువగా నేర్పినది బుద్ధుడు, మన తప్పుడు విలువల బంధనాల నుండి మాత్రమే కాదు, దేవుడు లేదా దేవుళ్ళు అని పిలువబడే అదృశ్య జీవి లేదా జీవులపై ఆధారపడటం నుండి మనకు స్వాతంత్ర్యం ఇప్పించాడు. ఆయన ప్రతి ఒక్కరినీ నిర్వాణం అనే స్వేచ్ఛాస్థితికి ఆహ్వానించాడు. అందరూ ఏదో ఒక రోజు దానిని సాధించాలి, ఆ సాధనే మానవుని పూర్తి పరిపూర్ణత." అని స్వామి వివేకానంద స్వయంగా అన్నారు.

మనం అందరం నిర్వాణాన్ని పొందాలని ఆకాంక్షిద్దాం !

- అనువాదం: **డి. హనుమంతరావు,**

జాతీయ సహాయ కార్యదర్శి, మానవ వికాస వేదిక, హైదరాబాద్

సహృదయ మిత్రమండలి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలతో...

శ్రీ N. ఏసుదాస్	శ్రీ V. ప్రభు
శ్రీ L. రవీంద్రబాబు	శ్రీ D. శ్రీనివాస్
శ్రీ T. జగన్నాథ రావు	శ్రీ V. దేవి ప్రసాద్
శ్రీ N. గోవిందు.	శ్రీ K. నాగేశ్వరరావు

సహృదయ మిత్రమండలి అనే ఈ సేవా సంస్థ మహావృక్షమై శాఖలుగా విస్తరించాలని మన: పూర్వకంగా అభిలాషిస్తున్నాను. D. సంజయ్

ఫీనిక్స్

రెండు నేత్రాలు
ఒకే దృశ్యం.
రెండు పెదాలు
ఒకే నిశబ్దం.
రెండు హస్తాలు
ఒకే శిల్పం.
రెండు జీవితాలు
ఒకే ఒక్క విప్లవ స్వప్నం.
నేను చితాభస్మం
ఆమె ఫీనిక్స్

ఆగస్టు 12, 1987
- శివసాగర్
(ప్రియురాలి కోసం)

ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే ఏదైనా సాధించగలం.

125వ జయంతి సందర్భపు ప్రత్యేక వ్యాసం

డా. చెలికాని రామారావు సంక్షిప్త జీవిత చరిత్ర



(15, జూలై 1901-25 సెప్టెంబర్, 1985)

అధములు, మధ్యములు, ఉత్తములు అని మనుషుల్లో మూడు రకాలుంటారట. ఆటంకాలకు భయపడి ఏ కార్యాన్నీ తలపెట్టని వాళ్ళు అధములు. ఒక పనికి పూనుకుని అడ్డంకులొచ్చాయని మధ్యలోనే ఆ పనినుంచి తప్పుకునే వాళ్ళు మధ్యములు. ఎన్ని ఆటంకాలెదురైనా ఉక్కుసంకల్పంతో సాగిపోయే వాళ్ళు ఉత్తములు. ఇది భర్తృహరి శ్లోకానికి ఏనుగు లక్ష్మణ కవి 'ఆరంభింపరు నీచమానవులు.. అనేపద్యంలో చెప్పిన భావం. అలాంటి ఉత్తములలో చేర్చదగిన మహోన్నత వ్యక్తి డా. చెలికాని వెంకటరామారావు గారు.

రామారావుగారు 1901, జూలై 15వ తేదీన కాకినాడ దగ్గరున్న తిమ్మాపురంలో వారి మాతామహులు రావు తిరుపతిరావుగారు, వెంకాయమ్మ గార్ల ఇంటివద్ద నారాయణస్వామి, సూరమ్మ దంపతులకు పుట్టారు, పిఠాపురం పక్కనున్న కొండెవరంలో పెరిగారు. 1918లో పిఠాపురంలోని RRBHR హైస్కూల్లో(రాజా రావు భావయమ్మారావు ఉన్నత పాఠశాలలో) SSLC చదివి ఫస్టుక్లాస్ లో పాసయ్యారు.'ఈ కుర్రాడు భవిష్యత్తులో గొప్ప ఉద్యోగంలో స్థిరపడి మంచి పలుకుబడీ హోదా సంపాదించుకుంటాడు' అని కుటుంబ సభ్యులు భావించారు. తెలివైన విద్యార్థులను ప్రోత్సహించే పిఠాపురం రాజారామారావు గారు కాకినాడలో F.A (నేటి ఇంటర్ కి సమానం) చదువుకు ఆర్థికంగా తోడ్పడ్డారు. కానీ కాకినాడలో చదువు ప్రారంభించాక జాతీయ భావాలు, జాతీయ కార్యక్రమాలతో పరిచయం కలిగింది. ఆంధ్రలో గాంధీగారి ప్రభావం ఎక్కువైంది. ఉద్యోగం వచ్చే చదువుకంటే ఉద్యమమే ముఖ్యమనే భావం రామారావుగారిలో బలపడిపోయింది. ఫలితంగా పరీక్ష ఫెయిలయ్యారు. తిరిగి పరీక్ష రాయమని తండ్రి, అన్నగారు చేసిన బోధలు ఆయన మనో సంకల్పాన్ని కదల్చలేకపోయాయి.

నూనూగు మీసాల నవయవ్వనం, నిండా 20 ఏళ్ళ వయసులేదు, విలువిద్యలో అర్జునుడికి పక్షికన్ను తప్ప ఏదీ కన్పించనట్టు రామారావు గారికి స్వతంత్ర సంగ్రామం తప్ప ఇంకేదీ కన్పించలేదు. ఉద్యమంలో తానూ ఒక సమిధను కావాలనుకున్నారు. 1921జనవరి26 తెల్లవారుఝామున ఉన్న ఇంటినీ, కన్నవాళ్ళనూ, ఉన్నవూరినీ, పై చదువులకి పిఠాపురం రాజా ఇచ్చే సాయాన్నీ వదిలి, కట్టుబట్టలతో కాలినడకనవెళ్ళిపోయి స్వతంత్ర సంగ్రామంలో ప్రవేశించారు.

ఇంటి నుంచి వెళ్లేముందు తను అమితంగా ఇష్టపడే అన్నగారికి రాసిన ఉత్తరంలో తన చదువుకి తోడ్పాటునందించిన పిఠాపురం రాజాకి కృతజ్ఞతలు తెలిపారు. ఆ లేఖలోని కొన్ని ముఖ్యాంశాలు. "సహాయ నిరాకరణ ఉద్యమంలో మనస్ఫూర్తిగా సర్వ శక్తులను ఉపయోగించి పనిచేసేదను " ... " నేను ఎవరిదైనా

పోరాటంలోనైనా మృత్యువులోనైనా మీ శక్తినే విశ్వసించండి.

ఉపన్యాసం వినిగానీ ఏదో వ్యాసం చదివిగానీ ఆలోచించకుండా ఇందులో ప్రవేశించినవాడను కాను " ... " ఇలాంటి ఉద్యమంలో పని చేయకపోవడం నాకు మనోక్లేశమును, దుఖమును కలిగించుచున్నది "... " గోడమీది పిల్లివలె ఉండుటకు నేనొప్పుకోను. "... విద్యార్థులు పాడైపోతున్నారని మీరనుకోవచ్చు. దేశం కోసం గొప్ప ఆదర్శంతో పనిచేస్తే పాడైపోయినట్టు, B.A, M.A లు చదివి బహు స్వార్ధంతో బ్రతికితే బాగైనట్టా ? అని ప్రశ్నించారు. ఈ ప్రయత్నం మానుకుని నేను పరీక్షకు కడితే దేశ ద్రోహిని, పాపిని అవుతాననే భావం కలుగుతోంది' అన్నారు ... "నష్టములు లేకుండా గొప్పకార్యములు సాధించలేము " ... "నా కేవిధమైన ధన సహాయమూ అక్కర్లేదు"..." నేను పిఠాపురం నుండి రైలు మీద వెళ్ళుటకంటే నా శక్తిమీద ఆధారపడి నడిచిపోవుట మంచిదగుటచే తెల్లవారుజామున బయలుదేరుచున్నాను. " అని ఆ లేఖలో పేర్కొన్నారు.(ఈ ఉత్తరం రామారావుగారి దస్తూరీతోనే "డా. చెలికాని రామారావుగారి జీవితం" పుస్తకంలో ఉంది.)

తను వెళ్ళేది పూలబాట కాదని తెలిసే వెళ్లారు. కడుపు మాడ్చుకోవలసి వచ్చినా కర్తవ్యాన్ని వదల్లేదు. బుల్లెట్లు దిగే సందర్భం వచ్చినా కాళ్ళ బేరానికి దిగలేదు. ఉరకలెత్తే వయసులో ఉప్పెనలా పెల్లుబికిన భావజాలం కొంతవయసొచ్చాక చప్పున చల్లారిపోవడం కొంతమందిలో మనం చూస్తుంటాం. కానీ ఆయనకు వయసు పెరిగే కొద్దీ ఉద్యమావేశం లావాలా ఉప్పొంగిందే కానీ చల్లారలేదు. గాంధీ గారి ప్రభావంతో పిఠాపురం తాలూకాలో హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. మద్యపాన వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా ఉప్పాడలో సారాదుకాణం ఎదుట జరిగిన పికెటింగ్‌కి నాయకత్వం వహించారు. 1922 లో అల్లూరి సీతారామరాజు గురించీ, అతని విప్లవ పంథా గురించీ, తెలుసుకోడానికి చేసిన ప్రయత్నాలు నర్సీపట్నం దాటి వెళ్ళలేదు.అదే సంవత్సరం అరెస్టయి జైలుకెళ్ళి మొదటిసారిగా నూతన సిద్ధాంతాల గురించి తెలుసుకున్నారు. అఖిలభారత మహాసభ కాకినాడలో జరిగినపుడు బులుసు సాంబమూర్తిగారు కొన్ని బాధ్యతలు తీసుకుంటే, రామారావుగారు వేలాదిమందికి వసతులు, భోజనాలు , స్నానాలు ,రవాణా వంటి సదుపాయాల బాధ్యత నిర్వర్తించారు. అల్లూరి సీతారామరాజు ఈ సభకు రహస్యంగా వచ్చినట్టు వినికిడి. 1922 నాటి జైలు జీవితం ఓ రకమైన ప్రభావం చూపితే, ఈ కాకినాడ సభ ఆయనలో మరో స్ఫూర్తిని కలిగించింది.

దేశానికి డొమినియన్ ప్రతిపత్తా? పూర్ణ స్వరాజ్యమా?సామ్రాజ్య వ్యతిరేక విధానం అవలంబించాలా? అనే బేధాభిప్రాయాలు తలెత్తాయి. తిరుగులేని నాయకుడిగా ఉన్న గాంధీతో పాటు మరో నాయకుడు సుభాష్ చంద్రబోస్ తయారయ్యాడు. కాంగ్రెస్‌లో బయలుదేరిన స్వార్ధపరత్వం, కులతత్వం వంటివి బ్రిటిష్ వారికి ఉపయోగ పడ్డాయి. ఒక సంవత్సరంలో స్వరాజ్యం వస్తుందని నమ్మి సర్వస్వాన్ని త్యజించి వచ్చిన రామారావుగారిలో ఇవి ఆత్మవిమర్శకు దారితీశాయి. కానీ తిరిగి కొండెవరం వెళ్లి కడుపులో చల్ల కదలకుండా బ్రతికేయడం ఆయనకు ఇష్టం లేదు. సమాజానికి ఉపయోగకరమైన మనిషిగా మారి ఎంతో కొంత ప్రజాసేవ చేయాలనుకున్నారు. మధ్యలో వదిలేసిన ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. వైద్యవృత్తి చేపట్టి ప్రజాసేవ చేయాలనుకున్నారు.డబ్బు సమస్య

వచ్చింది. మనసుంది కాబట్టి మార్గం కనిపించింది. వైద్యవిద్య ఖర్చులకోసం హైదరాబాద్‌లో ఇంగ్లిష్ ట్యూషన్స్ చెప్పారు. సరోజినీనాయుడు భర్త గోవిందరాజులు నాయుడుగారే రామారావుగారికి వైద్యకళాశాలలో గురువు. ఆ నాయుడుగారి ఇల్లు (గోల్డెన్ త్రెషోల్డ్)ఆరోజుల్లో సంస్కరణవాదులకు, జాతీయవాదులకు నిలయంగా ఉండేది. రామారావుగారు తన ఖాళీ సమయాన్నంతా అక్కడే గడిపారు.ఆయన హైదరాబాద్‌లో ఉన్న సమయంలోనే ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, భాషోద్ధరణ, సాంస్కృతిక విద్యా సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్తు తెలంగాణా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటివారు అప్పుడు రెడ్డి హాస్టల్లో ఉంటూ కాలేజీల్లో చదువుకునేవారు. రామారావుగారి జాతీయోద్యమ భావాలు, సంఘసంస్కరణ భావాలతో ఈ భావితెలంగాణా ఉద్యమనాయకులు ఎంతో స్ఫూర్తి పొందారు. చివరకు రామారావుగారి ప్రోత్సాహంతో వీరు ఇరువురూ 1930–32 కాకినాడ ఉప్పుసత్యాగ్రహ శిబిరానికి వచ్చి 'మాకొద్దీ తెల్లదొరతనం..' వంటి పాటలు పాడి జాతీయోద్యమంలో అడుగుపెట్టారు. వైద్య పట్టా పరీక్షలు పదిహేను రోజుల్లో ప్రారంభమవుతాయనగా బులుసు సాంబమూర్తిగారి కోరిక మేరకు తూర్పుగోదావరి జిల్లాలో జరిగే ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనడానికి కాలేజీ వదిలిపెట్టారు.

రామారావు గారి ప్రేరణతో తెలంగాణా నుంచి వందమంది యువకులు ఆయన్ను అనుసరించారు. గాంధీజీ పుట్టిన రోజున సభలలో ప్రసంగించకూడదని ప్రభుత్వం విధించిన 144 సెక్షన్ ని ధిక్కరించినందుకు ఆయన్ని అరెస్ట్ చేశారు. రాజమండ్రి జైలులో పరిచయమైన బెంగాల్ సోషలిస్టు నాయకులద్వారా సోషలిజం పట్ల ఆకర్షితులయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్య గారితో పరిచయం ఇక్కడే జరిగింది. (ఈ పరిచయమే సుందరయ్య గారు కాకినాడలో ఉన్న రామారావు గారింట్లో కొన్నాళ్ళు ఉండటానికి పనికొచ్చింది). జైల్లోనే రష్యా విప్లవం గురించీ, మార్క్సిజం గురించీ తెలుసుకున్నారు. రాజమండ్రి జైలునుంచి విడుదలయ్యాక ప్రభుత్వం మళ్ళీ అరెస్ట్ చేసి బళ్ళారి జైలుకు పంపింది. లాకప్‌లు, లాఠీలు, తూటాలు ఉక్కులాంటి ఆయన దృఢ సంకల్పాన్ని అణువంత కూడా కదల్చలేకపోయాయి. ఖద్దరు వస్త్రాలు రోడ్డుమీద కనిపించడమే ప్రమాదకరంగా మారిన రోజుల్లో ఆయన పోలీసువారి ఇళ్ళకెళ్ళి ఖద్దరు అమ్మడం విశేషం.

రామచంద్రపురంలో జోస్యుల రామచంద్రరావుగారు ఏర్పాటు చేసిన మహిళా సమావేశంలో పాల్గొన్నప్పుడు జరిగిన పోలీసుల లాఠీ చార్జీలో రామారావుగారు స్పృహ కోల్పోయారు. అలాంటి సంఘటనలు ఆయన పట్టుదలను అణువంత కూడా సడలించలేకపోయాయి. సత్యాగ్రహోద్యమం కాలంలో రణదుందుభి, తిరుగుబాటు వంటి పత్రికలను రహస్యంగా పంచారు. కాకినాడలో కాంగ్రెస్ ఆఫీసుకు ఇల్లు ఎవరు అద్దెకిచ్చినా జైలు పాలవుతారని ప్రభుత్వం దండోరా వేయించినా రామారావుగారు పెద్దాడ కామేశ్వరమ్మగారితో కలిసి పిండాల చెరువు గట్టుమీద పట్టమర్తి మార్తాండ రామమూర్తి గారి ఇల్లుని ఆఫీసుకు ఇచ్చేలా చేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం తరువాత ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా అరెస్ట్ చేసి బళ్ళారి జైలులో పెడితే అక్కడ రామారావుగారికి టీ.బి.సోకింది.వైద్యం చేయించుకుని హైదరాబాద్‌లో వైద్య పరీక్ష రాసి పట్టాతో తిరిగొచ్చారు. తరువాత గాంధీ

గారి హరిజనోద్యమంలో పాల్గొన్నందుకు మళ్ళీ అరెస్ట్ చేస్తే కోరాపుట్, కడలూరు జైళ్ళలో 18 నెలల జైలు శిక్ష అనుభవించారు. హరిజన సేవా కార్యక్రమాలకు డబ్బు అవసరమయ్యేది. దానికోసం 1937 లో బర్మా వెళ్లి రంగూన్ లో వైద్యవృత్తి చేస్తూ జిల్లాలోని హరిజన సేవాకేంద్రాలకు ప్రతినెలా డబ్బు పంపించేవారు.

1952 లో తొలిపార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. రామారావుగారు కమ్యూనిస్టు పార్టీ తరుపున కాకినాడ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండి ప్రచారానికి వెళ్లకుండానే ప్రజాపార్టీ నాయకుడైన బులుసు సాంబమూర్తిగారినీ, కాంగ్రెస్ అభ్యర్థి మొసలికంటి తిరుమల రావుగారినీ ఓడించి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్లమెంటేరియన్‌గా నెహ్రూ వంటివారి మెప్పును పొందారు. ప్రజా సమస్యలను చర్చించడమే పార్లమెంట్ సభ్యునిగా తన బాధ్యత అనుకోకుండా ఇతర సభ్యుల యోగక్షేమాలు కూడా ఆలోచించేవారు. అల్లూరి సీతారామరాజు సహచరుడైన గాము(గాం) మల్లుదొర పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పటికీ ఏ రకమైన అలవెన్సులూ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తెలిసి ఆయన్ని నెహ్రూ దగ్గరకు స్వయంగా తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చేశారు.

ఆయన జీవితపు ఆఖరు రోజుల్లో స్వాతంత్ర సమరయోధులకు పెన్షన్లు వచ్చేవి. ఆ సందర్భంలోకూడా ఆయన ఉద్యమకారుల యోగక్షేమాల గురించి ఆలోచించేవారు. ఉద్యమంలో పాల్గొని సాంకేతిక కారణాలవల్ల పెన్షన్ రాని కుటుంబాలవారికి, పోరాటయోధుల సంతతికి తన పెన్షన్‌ని నెలకింతని ఇచ్చేవారు తప్ప తనకోసం ఖర్చు చేసుకునేవారు కాదు. తనను కలవలేని వారికి మనియార్డర్ చేసేవారు. ఆయననుంచి ఆవిధమైన ధన సహాయం పొందినవారిలో పోలిస్ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన చింతం సత్యనారాయణ దాసు భార్య ఒకరు. రామారావు గారు నెల నెలా వచ్చే తన పెన్షన్ డబ్బు ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలో ముందుగా పేర్లు రాసి పెట్టుకున్నారు. దాని ప్రకారమే ఆయన చనిపోయిన నెలలో(సెప్టెంబర్1985) కూడా ఆ డబ్బు వారికి అందజేయడం జరిగింది.

ఆయన ఆదర్శప్రాయమైన దాంపత్య జీవితం గురించి కూడా చెప్పుకోవాలి. క్షయ వ్యాధిపై డిప్లొమా చేయడానికి 1934 లో మైసూర్ వెళ్ళారు. అక్కడ అనుకోకుండా వైద్య విద్యార్థిగా ఉన్న కమలమ్మ గారిని కలిశారు. ఆమె తండ్రి రామస్వామి నాయుడు బ్రహ్మసామాజికులూ, పైగా వీరేశలింగం గారి అనుచరులు కూడా కావడం వల్ల తన కుమార్తెలను వీరేశలింగం గారి సంరక్షణలో పెంచి పెద్దజేశారు. చెలికాని రామారావుగారికి జాతీయోద్యమంలో చేరకముందే బ్రహ్మసమాజంపై అభిమానం ఉంది. ఆ విధంగా వృత్తీ ప్రవృత్తీ కలవడం వల్ల వివాహబంధానికి ఎక్కువ సమయం పట్టలేదు. 1940లో ఆయన సహచరి రామచంద్రపురం హాస్పిటల్ కి మెడికల్ ఆఫీసర్ గా రావడంతో రామారావుగారి కార్యక్రమాలకు అదే కేంద్రస్థానమైంది.

1948 నుండి 1951 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులను అతిదారుణంగా హింసకు గురిచేసింది. రామారావుగారు ప్రత్యక్షంగా కార్యక్రమాల్లో లేకపోయినా ఆయన రామచంద్రపురంలో వైద్యం చేస్తూ ఉంటే ప్రజా ఉద్యమాన్ని ఆపడం కష్టమని ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి కడలూరు జైలులో పెట్టింది. స్వేచ్ఛగా ఎగిరే

చిలుకను పంజరంలో పెడితే ఎగరడం మానకుండా ఆ పంజరం ఎత్తుకు ఎగురుతూనే ఉంటుంది. అలాగే జైల్లో కాల్పులు జరిగి అనుమర్లపూడి సీతారామారావుగారనే రైతునాయకుడు చనిపోవడం, కొందరు గాయాల పాలవడం జరిగినా, అందరూ వద్దన్నా వినకుండా తుపాకీగుండ్ల మధ్య వెళ్లి రామారావుగారు తోటి ఖైదీలకు వైద్య సేవలందించారు.

రామారావు గారు బ్రహ్మ సమాజం ప్రభావంతో స్త్రీ విద్య అంతంత మాత్రంగా ఉన్న ఆరోజుల్లో ఆయన సోదరి కుమార్తెను కుటుంబంలో మొదటి మహిళా డాక్టర్ ని చేశారు. అంతే కాదు తన సోదరుడిచేతా సోదరిచేతా స్త్రీ విద్యను అంగీకరింపజేసి ఆ ఇద్దరికీ అంతర్వర్ణ , అంతర్రాష్ట్ర, వివాహాలు జరిపించడానికి ఒప్పించారు. రామారావు గారు మాటల మనిషి కాదు చేతలమనిషి అని ఎన్నో సందర్భాల్లో రుజువుచేశారు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్రం ఉండాలని నమ్మిన రామారావు గారు పార్లమెంటులో వాదించడమే కాదు కమలమ్మగారిఆర్థిక స్వాతంత్రాన్ని ఎప్పుడూ గుర్తిస్తూ ఉండేవారు. ఇద్దరూ వైద్యులే అయినా రామారావుగారి పేషెంట్లు బీదప్రజలు,స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలే కాబట్టి ఆయనకు సేవ ఎక్కువా సేవింగ్స్ తక్కువా అయింది. ఒకవేళ పదో పరకో వచ్చినా దాన్ని కూడా తిరిగి పేదల మందులకో ఆహారానికో ఖర్చుపెట్టేసేవారు. అందుకే ఎవరైనా చందాలు అడగడానికి వస్తే " నేనూ మీ బోటి వాడినే. కమలమ్మగారిని అడుగుదాం!" అని కమలమ్మ గారి ఎదురుగానే అనేవారు. ఆయనది వేళాకోళం అనుకునేవారు కొంతమంది. కానీ తను నమ్మినదాన్నే ఆయన చేప్పేవారు. ఆమె డబ్బు ఆమె దానం ఇవ్వాలి తప్ప తాను ఇవ్వకూడదనేవారు. తాను వద్దన్నా అన్నగారు తన ఆస్తిపై వచ్చే ఆదాయాన్ని ఇస్తుంటే దేశసేవలో భాగంగా దాన్ని అమ్మేశారు. తన సొంత ఖర్చులో ఎంత పొదుపరో ఇతరులకు పెట్టడంలో అంతదుబారా చేసేవారు. ఒక గృహస్థుగా వేలమందికి ఆతిథ్యమిచ్చారు. అనేకమంది విప్లవకారుల కుటుంబాలను తన ఇంట్లోఉంచుకుని వారి పురుళ్ళూ, వైద్యాలు చేశారు.

ఆయన మానవతా దృక్పథానికి కొన్ని ఉదాహరణలు. ఒకసారి ఒక బీదముస్లింకి చాలా వైద్యం చేసి జబ్బు తగ్గించారు. అతను వెళ్ళేటప్పుడు తనదగ్గర ప్రస్తుతం డబ్బులేదని, తరువాత తెచ్చి ఇస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. రామారావుగారు ఆ సంగతే మర్చిపోయారు. ఒకరోజు అతను తన కొడుకుని తీసుకొచ్చాడు. ఆ అబ్బాయిదగ్గర సంచి ఉంది. ఇప్పుడుకూడా తన దగ్గర డబ్బులేదని, ఒక స్నేహితుడు తన కొట్టులోని వెండిసామాను అరువు ఇచ్చాడని, వైద్యం బిల్లుకుబదులు ఆ సామాను తీసుకోమని ప్రాధేయపడుతూ ఆ సంచిలోని వెండిసామాను తీసి టేబుల్ మీద పెట్టాడు. రామారావు గారు చాలా వేదనచెందారు. వెండి సామాను సంచిలోపెట్టి, ఆయనకిచ్చివేసి అలా ఎప్పుడూ చేయవద్దని నచ్చజెప్పారు. దూర గ్రామాలనుంచి బంధువులు(ఆడవారు)వస్తే వాళ్లకు సినిమా చూసే అవకాశం ఉండదని తప్పక సినిమాకు పంపేవారు. ఇంటికెవరైనా అతిథులొచ్చినపుడు వారితో సమానంగా వారి కారు డ్రైవరు, లేదా రిక్షా డ్రైవరుకు మంచినీళ్ళు, ఫలహారం, టీ వగైరా లందించేవారు. పలుమార్లు అతిథులకంటే ముందు వారిని ఆదరించేవారు. రామారావు గారిల్లు ఓ చిన్నసైజుసత్రంలా ఉండేది. సెప్టిక్ టాంకులు తరచూ నిండిపోయేవి. సెప్టిక్ టాంకుతోడడానికి వచ్చే శానిటరీ వర్కర్లపట్ల ఆయన చూపిన శ్రద్ధ ఆయన

మానవత్వానికిమచ్చుతునక. ఇంటిఆవరణలోనే ఓ గొయ్యి తవ్వించి తోడించి అందులోపోయించేవారు. అన్నీ దగ్గరుండి చేయించేవారు. పని పూర్తయిన తర్వాత సబ్బుఇచ్చి దగ్గరుండి వాళ్ళను కాళ్ళు, చేతులు కడుక్కోమనేవారు. వాళ్ళు సబ్బుఅక్కరలేదని చెప్పినా వినేవారు కాదు. సబ్బుతో కడిగిన తర్వాత ఏంటీసెప్టిక్ లోషనిచ్చి కడగమనేవారు. వాళ్లు ఈయన్నో చాదస్తునిగా భావించి "అసలుపనికంటే ఈ పనెక్కువయిపోయింది" అని చెప్పుకుంటూ నవ్వుకొనేవారు.

రామారావుగారు తొలి పార్లమెంటులో లేవనెత్తిన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఈనాటికీ అలాగే ఉన్నాయి.అంతేకాదు అలా సమాజశ్రేయస్సు గురించి మాట్లాడే నాయకులు ఈనాడు మనకు పార్లమెంట్‌లో లేరంటే అతిశయోక్తి కాదు.

ఆయన లేవనెత్తిన సమస్యలుకొన్ని ప్రస్తావించుకుందాం.ఎందుకంటే పరిష్కారం అయ్యేవరకూ ఇవి మనకు చర్చనీయాంశాలే.

ప్రజాప్రతినిధులకు కనీస జీవనానికి జీత భత్యాలు అవసరమే! అయితే వారు ఏ ప్రజలకు ప్రతినిధులుగా ఉన్నారో వారి పేదరికం, నిరుద్యోగాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలంటారు. ఆర్థిక సమస్యకు మూలకారణం సంపద కొందరి చేతిలో ఉండిపోవడం, మిగిలినవారు దోపిడీకి గురవడం తప్ప జనాభా పెరుగుదల కాదన్నారు. మాంసకృత్తులు ఎక్కువగా తీసుకుంటే గర్భధారణ శక్తి తగ్గుతుందనీ, మనదేశంలో మాంసకృత్తుల వాడకం చాలా తక్కువనీ, ఈ పెట్టుబడిదారీ సమాజం ప్రజల్ని ఆకలితో మాడ్చి చంపుతూ మీ దీనత్వానికి కారణం అధిక జనాభా అని వంచిస్తోంది. ఇది ఏమాత్రం సహించలేని విషయం అని నిరసించారు.ఇక్కడో విషయం గమనించాలి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్లలో రామారావుగారు అగ్రగణ్యులు. ఆ రోజుల్లో వాటిని ఉచితంగా చేసిన వ్యక్తీ రామారావుగారే. మన మతంలో ఎంతో మంచి ఉంటే ఉండొచ్చు, కానీ భయానకమైన విషయాలు కూడా చాలా ఉన్నాయనీ మంచి ఆచారాలనుకుంటున్నవి కుళ్ళి హీన స్థితికి వచ్చాయనీ, వాటిపై ఎవరితో చర్చించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

'పోలీసు స్టేషన్ల నుండి ప్రజలను బయటకి తీసుకెళ్ళి, కాల్చి చంపి ఆ తరువాత, ఆత్మ రక్షణార్థం పోలీసుల ఎదురుకాల్పులు అంటూ కథలు ప్రచారం చేస్తున్నారు, ఇదంతా పచ్చి మోసం, దగా అని' ఆగ్రహం వెలిబుచ్చి ఒక సంఘటన ఉదాహరించారు. 1950 లో ఒకరోజు సాయంత్రం పిఠాపురం దగ్గరలోని ఓ గ్రామంలో చింతం సత్యనారాయణ దాసు, పెన్మత్స అనంతవర్మ అనే ఇద్దరు కమ్యూనిస్టులను బహిరంగంగా అరెస్టు చేసారనీ, ఆ మర్నాడు ఉదయానికి ఆ ఇద్దరూ మరో గ్రామంలో శవాలుగా కన్పించారనీ, ఇది అబద్ధమని రుజువైతే తాను రాజీనామా చేస్తానని చాలెంజ్ విసిరారు.

దురదృష్టవశాత్తు మనదేశం వెనుకబడి, మూఢ నమ్మకాలకు నిలయంగా వున్న దేశం. అవినీతిపరులు

ఈ మూఢ నమ్మకాలను సొమ్ము చేసుకుంటున్నారు. ఇంకా తాయెత్తులు, రక్షరేకులు, మాయా ఉంగరాలు, ప్రపంచంలోని ఏ వ్యాధినైనా నివారించగలిగే విడ్డూరమైన ఉంగరాలను నమ్మే స్థితిలో ప్రజలుండటం విచారించాల్సిన విషయం అన్నారు.మద్యపాన నిషేధం గురించి మాట్లాడుతూ మనం ఎన్నోవిషాలను అదుపుచేశాం. స్వల్పంగా ఉన్నా తీవ్రంగా ఉన్నా ఈ మత్తుపానీయాలను కూడా విషంగా పరిగణిస్తే సమాజ శ్రేయస్సు దృష్ట్యా వీటికి నిబంధనలు విధించి తీరాలని నొక్కి చెప్పారు.

పాలు ప్రత్యేకించి శిశువులూ, బాలలూ, రోగులూ తీసుకుంటారు.స్వచ్ఛమైన పాలు సరఫరా జరిగేలా రాష్ట్రప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి అన్నారు.నాగరిక ప్రభుత్వం అని చెప్పుకునే ఏ దేశంలో అయినా సరే అన్నింటికంటే ముఖ్యమైనది నాణ్యమైన ఉచిత వైద్యం. కానీ మన వైద్యచికిత్స అంతంత మాత్రమూ, తాతల కాలం నాటిది' అని యద్దేవా చేశారు.

కమ్యూనిస్టులపై దురహంకారంతో విమర్శలు చేస్తున్నారనీ మన దేశ రక్షణకు ప్రమాదకరంగా మారుతున్న ఎన్నో అంశాలకు 'కమ్యూనిస్టు వ్యతిరేకత ' అన్న ముసుగు వేస్తున్నారనీ ఈ కమ్యూనిస్టు వ్యతిరేకత సామ్రాజ్యవాదులకు చక్కటి సాకుగా పనిచేస్తుందనీ హెచ్చరించారు. వీధిబాలలు, బాలయాచకుల గురించి మాట్లాడుతూ కంటికి రెప్పల్లా కాపాడుకోవాల్సిన చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహించడం క్షమించరాని నేరమని అన్నారు. విదేశీ పెట్టుబడివల్ల అంటే విదేశీ పరిశ్రమల వల్ల ఇక్కడ విదేశీ దోపిడీ కొనసాగుతోందని గుర్తించాలన్నారు. యుద్ధ సమయంలో తీసేసిన కాకినాడ కోటిపల్లి రైలు మార్గ పునరుద్ధరణకు కావలసినంత స్థలం, గట్టు ఉన్నా దాన్ని ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. పన్నుల క్రమబద్ధీకరణ గురించి మాట్లాడుతూ ఇనుము, ఉక్కు, మోటార్ స్పిరిట్, పెట్రోలియం వంటివి పన్ను పరిధి నుంచి తప్పిస్తే అది కేవలం ధనవంతులకు, పెట్టుబడిదారులకే ఉపయోగ పడుతుందని తెలుసుకోవాలన్నారు. భూ సంస్కరణలు అమలు చెయ్యలేకపోతే మన ప్రణాళికలు, మన కార్యక్రమాలు, మన ప్రచారం అన్నీ శుద్ధ దండగని వాదించారు.

సినిమాల విషయాన్నీ ప్రస్తావిస్తూ 'విదేశీ చిత్రాలకు సంబంధించి మనం చాలా విషయాలను నేర్చుకోవచ్చు. కానీ వాటిలో చాలావరకు పూర్తిగా సెక్స్ సినిమాలు, పనికిమాలినవి. మన ప్రజలపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. విదేశీ చిత్రాలకు సంబంధించినంతవరకూ పరిమితులు విధించడానికీ, నియంత్రించడానికీ పార్లమెంటునుంచి అదనంగా అధికారం పొందాలనుకుంటే తాను మద్దతిస్తానన్నారు. టెక్స్ట్ పుస్తకాల ప్రస్తావన వచ్చినపుడు పాఠశాల చివరిదశ తరువాత రాష్ట్రప్రభుత్వం అవసరమనుకుంటే కేంద్రప్రభుత్వ గుత్తాధిపత్యంలోకి కూడా రావాలన్నారు.అనాథలకు సంబంధించిన బిల్లు ప్రస్తావనలో అనాథల సంరక్షణని ఉపేక్షించడం కంటే క్షమించరానిదేమీ లేదన్నారు. ప్రభుత్వ దుబారా గురించి చెబుతూ 'కొత్త ఢిల్లీ రైల్వేస్టేషన్‌కి ఆడంబరం కోసం సుమారు 25 లక్షల రూపాయలు, తపాలా బిళ్ళల ప్రదర్శనశాలకు పది లక్షల రూపాయలు ఖర్చుపెడుతున్నారు.

కానీ ఒక అనాధశరణాలయానికి అయిదో పదో లక్షలు ఖర్చు పెట్టాలంటే మీదగ్గర డబ్బు ఉండదు' అని ఘాటుగా విమర్శించారు. అలాగే శత్రువుల ఫిరంగుల కాల్పులను ఎదుర్కోవడం కంటే రైల్వే ప్లాట్ ఫామ్ మీది మూడో తరగతి మరుగుదొడ్లోకి అడుగుపెట్టడానికి ఎక్కువ ధైర్యం కావాలనీ, ఒక మంత్రి చేయవలసిన అత్యంత వివేకవంతమైన పని ప్రజా మరుగుదొడ్డిని ప్రారంభించడమనీ హితవు పలికారు. కార్మికుల సంక్షేమం గురించి చెబుతూ ఆరోగ్యంగా, శక్తివంతులుగా ఉన్నంతవరకూ మీరు వాళ్ళ శక్తిని ఉపయోగించుకుంటారు, వారు క్షయ వ్యాధితో బాధపడుతుంటే వారిని చెత్త కుప్పలోకి విసిరేస్తున్నారు. మీ రికార్డులు మాత్రం వారికి మంచి చికిత్స అందిస్తున్నట్టు తెలుపుతున్నాయి. వాళ్ళకు కావలసినది విశ్రాంతి, మంచి వైద్యం అని సూచించారు. విదేశీ ఔషధాలపై మనం చెల్లించే ధనం మనలాంటి పేద దేశం భరించలేదు కాబట్టి మన ప్రజలకు చౌకగా ఔషధాలను సరఫరా చేసే పరిశ్రమ మనం అభివృద్ధి చేసుకోవాలన్నారు. చైనాలో లాగా ఆయుర్వేదం వంటి ఇతర మెడికల్ ప్రాక్టీషనర్లను ఉపయోగించుకోమని సలహా ఇచ్చారు.

మన ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సహాయం ఎంత నిరాశాజనకంగా ఉందో మనందరికీ తెలుసు. దీనికే మనం సిగ్గుపడాలి. అందుకనే ప్రజలు ఇటువంటి వింత చికిత్సలు, విడ్డూరమైన మందులు కోసం పరుగులు తీయడం నాకు ఆశ్చర్యం కలిగించడం లేదు. మనదేశంలో ఎవరైనా నకిలీ వైద్యులు లేదా ఒక వ్యక్తి చెట్టు క్రింద కూర్చుని తన జీవనోపాధి ఏర్పరచుకోవచ్చు. మనది మూఢ నమ్మకాలకు నిలయంగా వున్న దేశం. నిబద్ధత , నిజాయితీ లేనివారు, ఈ మూఢ నమ్మకాలను సొమ్ము చేసుకుంటున్నారు. మన దురదృష్టకర దేశంలో ఎటువంటి చెత్తను అయినా మందు పేరుతో అమ్మేయవచ్చు. అలాగే కొంత చెత్తను ఖరీదైన, స్పష్టమైన మందుల రూపంలో మార్కెట్లో అమ్ముతున్నారు' అన్నారు.

ఒకటేమిటి, నదీ జలాలు, రాష్ట్రాల పునర్విభజన, స్త్రీల వారసత్వ హక్కులు, ఆహార కల్తీ , ముందస్తు నిర్బంధాలు , మందుల మాయాజాలం.. ఇలా పార్లమెంట్ లో ఆయన లేవనెత్తిన సమస్యల గురించి చెప్పాలంటే ఒక ఉద్గ్రంధం తయారవుతుంది.

బ్రహ్మసమాజ ఉద్యమం, హరిజనసేవ,స్త్రీజనోద్దరణ, స్వాతంత్ర్య పోరాటం, కమ్యూనిస్టు ఉద్యమం, జైలుజీవితం,పార్లమెంట్ సభ్యత్వం, వైద్యసేవ అన్నీ చెలికాని రామారావుగారి జీవిత చరిత్రలో భాగమే! అన్నింటికన్నా మానవీయత, నిజాయితీ, నిబద్ధత, వినమ్రత, స్పష్టత ఆయన విశిష్టలక్షణాలు. సంఘసంస్కరణ,విప్లవభావాల సమ్మేళనం అయిన రామారావుగారుభౌతికవాదిగా, కమ్యూనిస్టుగా పరిణామం చెందారు. ఆజన్మాంతం ఆదర్శజీవితాన్ని గడిపి భావితరాలవారికి ఆదర్శంగా నిలిచి తన 84వ యేట (25-09-1985) తుదిశ్వాస విడిచారు.

ఆయన్ను అభిమానించే స్థానిక పెద్దలంతా కలిసి ఆయన స్మారకార్థం ఒక భవనం నిర్మించారు. 25-9-1988న శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసారు. 25-9-1990న కమ్యూనిస్టు పార్టీ జాతీయకార్యవర్గ సభ్యులు శ్రీ నీలం రాజశేఖరరెడ్డి భవనాన్ని ప్రారంభించారు. 1986 నుండి

ప్రతి సంవత్సరం రామారావు గారి వర్ధంతి రోజు(సెప్టెంబర్25)న సామాజికావగాహనకు తోడ్పడేలా ప్రముఖులచే ఉపన్యాసాలిప్పిస్తున్నారు, వివిధ జాతీయ దినోత్సవాలకు, ఇతర సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆ భవనాన్నుపయోగిస్తున్నారు. 1986 నుండి క్రమం తప్పకుండా స్మారకోపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కార్యకలాపాలు జరుగుతున్నాయి.

ప్రతి సంవత్సరము రామారావుగారి అభిమానులు, కుటుంబసభ్యులు, పేద,ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వర్ధంతి రోజున కమిటీ ద్వారా అందజేస్తున్నారు. భవనం ప్రారంభమయిన దగ్గర నుండి వివిధ కార్మిక సంఘాలకు,'ప్రజాసంఘాలకు వారి సమావేశాలు జరుపుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంది. అన్ని సౌకర్యాలు లేకున్నా అనేక బీద కుటుంబాలవారీ భవనంలో పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. కీ.శే. శ్రీపుత్సలసత్యనారాయణగారు స్థాపించిన ఆర్.కె. ఐడియాలాజికల్ సొసైటీవారు నిర్వహించే సభలకు, కార్యకలాపాలకూ ఈ భవనము కేంద్రంగా ఉంది. రిపబ్లిక్‌డే , స్వాతంత్ర్యదినోత్సవం, నెహ్రూ జయంతి మొ.. అనేక జాతీయ పండగలను ఈ భవనంలో పలుమార్లు ఘనంగా రామారావుగారి స్మారక కమిటీ నిర్వహించింది.

శ్రీ బి.వి.వి. బాలకృష్ణ.ఎం.ఫిల్. పట్టాకోసం ఆంధ్రాయూనివర్శిటీకి సమర్పించిన (డా॥చెలికాని రామారావుగారి జీవితం) సిద్ధాంత వ్యాసాన్ని 'విశాలాంధ్ర' పబ్లిషింగ్ హవుస్ వారు ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ప్రచురిస్తున్న "ఆంధ్రుల సమగ్ర చరిత్ర,సంస్కృతి' మొదటి సంపుటి (తెలుగు) ప్రచురణకు రామారావుగారి కమిటీ ఆర్థికసహకారమందించింది.! డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రముఖులతో ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. అలా 1986 నుంచి 2004 సంవత్సరాల వరకూ ఇచ్చిన ఉపన్యాసాలను 'వీక్షణం' పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చింది. నాటి పార్లమెంట్ సభలో రామారావుగారు లేవనెత్తిన అంశాల ప్రాధాన్యాన్ని గుర్తించి వాటిని తెలుగులోకి అనువదింపజేసి 'తొలి పార్లమెంట్ లో డాక్టర్ రామారావు' పేరుతో ముద్రించింది.ప్రగతిశీల భావాలకు సంబంధించిన మొత్తం 21 పుస్తకాలను ప్రచురించి, పాఠకులకు ఉచితంగా అందించింది.

రామారావుగారి గురించి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు చండ్ర రాజేశ్వరరావు గారు చెప్పినట్టు "వారు తమ జీవితాన్నంతా దేశఔన్నత్యానికి, ప్రజాసేవకు, సంఘ సంస్కరణకు, సాంఘిక న్యాయానికి అంకితం చేశారు. వారు ఆదర్శమైన జాతీయవాది. మానవతా వాది కమ్యూనిస్టు. నేడు మన జాతీయోద్యమ విలువలు వెనుకపట్టు పట్టినవి. డబ్బు, అధికారం అనేవి రాజకీయజీవితాన్ని కలుషితం చేస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ఇటువంటి క్లిష్టపరిస్థితులలో డాక్టర్ చెలికాని రామారావు వంటి ఆదర్శ జీవితమే మనకు వెలుగుబాట"

- డా॥ పి.యస్.ప్రకాశరావు.

రచయిత, అనువాదకులు

తప్పును సరిదిద్దకుంటే అది మరింత పెద్ద ఆపదను తెచ్చిపెడుతుంది.

ఓ సాంస్కృతిక కళారసజ్ఞ శిఖరంతో జరిపిన దశాబ్దాల నాటి విలువయిన విశిష్ట ఇంటర్వ్యూ.

అరుదైన రంగస్థల మేధావి

యం. బాబు... అంటే మలిరెడ్డి బాబు... ఊహు బాబి.....

పిఠాపురం బాబి... అంటే రంగస్థల కళా ప్రియులకు చిరపరిచిత నామం.

ఆయనో శాస్త్రం... ఒక అస్త్రం... పదునైన పాశుపతాస్త్రం....

ఒక క్రియేటివ్ జీనియస్... ఒక క్రిటికల్ విజన్

రంగస్థల కళా రూపంకావచ్చు...చలన చిత్ర రూపం కావచ్చు

అణువణువు నిశిత పరిశీలనా విశ్లేషణ.

బాబి అంటే ఓ తపన ... పట్టి విడవని పట్టుదల ... మంచిధారణ, సుస్పష్ట వ్యక్తీకరణ, గంభీర స్వర భావ ప్రకటన ... విజ్ఞానవంతమైన విశ్లేషణా వివరణ, తర్కబద్ధ హేతుపరిశీలన ... నాటక సాహిత్యం ... అభినయ ప్రదర్శనారీతుల విశేష అధ్యయనం ... పదునైన కలం ... శక్తివంతమైన గళం ... మేధోమథనం ... వెరసి ... క్రూరమైన విమర్శకుడనే బిరుదు.

బాబి గారితో నా పరిచయానికి మేం మా గ్రామంలో నిర్వహించిన నాటక పరిషత్తు ముఖ్యకారణం. ఆ తరువాత ఆయనతో అత్యంత సాన్నిహిత్యం ... నాటక సాహిత్య చర్చ ... షేరింగ్ ఆఫ్ థాట్స్ వగైరా వగైరా... ఆ విధంగా ఆయనతో రెండు దశాబ్దాల పాటు కలిసి తిరగడానికి వ్యక్తిగత అనుభవాలు పంచుకోవడానికి బాల సన్నిహితులుగా ఉన్న కొద్దిమందిలో నేనొకడినేమో !?

చరిత్రలో రష్యా నియంతగా పేరు మోసిన స్టాలిన్ అంటే అందరికి హడల్. కాని భారతదేశం నుండి రష్యా రాయబారిగా వెళ్ళిన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఆయనతో అనేకసార్లు చర్చలు సాగించారు. 'స్టాలిన్ ఎంతో సున్నిత హృదయుడు... ఆయన నియంత అనేది అపవాదు మాత్రమే" అని ప్రకటించినట్టు... బాబి గార్ని బాగా పరిశీలించిన మీదట కనిపించే రూపం వెనుక ఆయన సున్నిత మనస్సు.... విశేష సాహిత్య అధ్యయనం వల్ల ఏర్పడిన ప్రజ్ఞా తేజస్సు... నాకు కొంత అర్థమయ్యారు. ఆయనతో నా చర్చలు కూడా కొంత కారణం కావచ్చు.... ఆయన తత్వాన్ని ... వ్యక్తిత్వాన్ని... విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడింది....

ఒకరోజు నేను వెళ్ళే సరికి చేతిలో పుస్తకంతో ఉన్నారు. (నిరంతరం చదువుతూనే ఉండేవారు దగ్గరెవరూ లేకుంటే) ఆ పుస్తకాన్ని నా చేతుల్లోకి తీసుకుని" మీరీ పుస్తకం చదవడం చాలాసార్లు చూసాను.. మీకిది బాగా ఇష్టమైన పుస్తకమా" అన్నాను.

"అవును, నాకు ఉపయోగపడిన ముఖ్య పుస్తకాల్లో ఇదొకటి" అన్నారు. నేను అంటే కొన్ని భావాల స్వభావాల సముదాయమే కదా"! అన్నారు.

ఆ పుస్తకాన్ని తిరగేస్తున్నాను.

"ఎనాలసిస్ ఆఫ్ మైండ్ – లెక్చర్స్ ఆన్ లాజికల్ ఎనాటమీ" ఆయన ఆరాధన... ఆర్ద్రమైన హృదయభావన

ఆవిష్కరించారు**మానవుడు ఎంత గొప్పవాడైతే అంత కఠిన పరీక్షలు ఎదుర్కోవలసి ఉంటుంది.**

"ఆలోచన తర్కమైంది. భావం అనుభూతి మూలకం. భావం అంటే ఉన్నది అని అర్థం... అభావం అంటే లేనిది అని అర్థం.. భావం... స్వభావం... ప్రభావం.. విభావం... అనుభావం... సంచారీ భావం...స్థాయి భావం ఇలా ఎన్నో....

భావాలు అనుభవాలుగా ... అనుభవాలు స్వభావాలుగా.. స్వభావాలు వ్యక్తిత్వాలుగా మారతాయి. మీ స్వభావాన్ని బట్టే మీరు.... నా స్వభావాన్ని బట్టే నేను... ఎవరైనా అంతే" అన్నారు.

"భావాల్ని మనిషి సృష్టిస్తే.. మనిషిని భావాలు సృష్టిస్తాయి. భావాలు మార్చుకోవడం సులభం... కాని స్వభావాలు మార్చుకోవడం అంత సులభం కాదు.

నాకర్థమైంది ఆయన స్ట్రాంగ్ విల్ పవర్ ఏమిటో..."ఈ పుస్తకం మీకే విధంగా ఉపయోగపడింది?" అన్నా..

"మానవశక్తుల్ని ఆలోచనాశక్తి... అనుభూతిశక్తి... ఇచ్ఛాశక్తి... ఈ త్రిగుణాలు కలిపితే భావాలు... ఉన్నత భావాలు చూపించగలిగితే ఉన్నతమైన విలువ"... అలా బేరీజు వేయడానికి దీని అధ్యయనం నాకు ఉపయోగపడింది" అన్నారు.

"నాటక కళ మిమ్మల్ని ఎప్పుడు ఎలా ఆకర్షించింది ? అన్నాను.

"కొన్ని దృశ్యకళలు, కొన్ని శ్రవ్య కళలు అంటాం కదా! నాటకం... దృశ్యం, శ్రవ్యంతో కూడిన కళ.... లలిత కళలన్నిటి సమాహార కళ. అదొక సమ్మోహనాస్త్రం. దీనిలో చైతన్యాన్ని నింపే సుగంధ పరిమళముంది. ఈ కళకున్నంత సార్వజనీనత మరో కళకు లేదు' అందుకే నన్ను అమితంగా ఆకర్షించేసింది."

"అది సరే, మీరెలా రంగస్థల ప్రవేశం చేసారు?"

"అదో పెద్ద నాటకం"... పెద్దనవ్వు...

"మా పిఠాపురం మంగయ్యమ్మరావుపేటలో రామాలయానికి కటకటాలు కట్టించాలని.. డబ్బు పోగెయ్యడానికి ఒకనాటకం వేసెద్దామని కొందరు యువకులు తీర్మానించుకున్నారు. సామర్లకోటలో సమయం వీర్రాజు గారు అనే డైరెక్టరు ఉన్నారు. నేను రిహార్సిల్ చూడ్డానికి వెళ్ళి, అనేకసార్లు వాళ్ళు చేసే ఫార్సు చూసి గట్టిగా నవ్వేవాడ్ని. నేను పిఠాపురం రాజాగారి అకౌంటెంట్ వెంకట్రాయుడిగారబ్బాయినని ఏమి అనలేక .... ప్రాంప్టింగ్ ఇచ్చే ఉద్యోగమిచ్చారు. అలా నాటకమంతా కంఠస్థా అయిపోయింది. నాటకం వెయ్యడానికి రెండు రోజుల ముందు సైంటిస్టు పాత్రదారికి జ్వరమొచ్చి నన్ను ఆపద్ధర్మంగా సైంటిస్టు పాత్రను వేయించారు. అది 1957 జూన్ 15వ తేదీన ఆత్రేయ రాసిన "విశ్వశాంతి" నాటకం.. నామొదటి రంగస్థల ప్రవేశం.. .నాటక రంగ గురువు మార్గదర్శి సమయం వీర్రాజు గారు. ఆయనిచ్చిన స్ఫూర్తే, నా కృషికి, పట్టుదలకు కారణం... తనకు తెలిసింది పదిమందికి చెప్పడానికి ఏ భేషజాలు లేని ఆయన నిజాయితీయే నాకు ఆదర్శం. ఈ రంగంలో ఏ అవలక్షణాలు దరిచేరనివ్వని నిష్కలంకమైన ఆ మహామనిషి వ్యక్తిత్వమే నాకీనాటికి శిరోధార్యం" అన్నారు.

ఆ నాటకం వేసిన తరవాత ఆయన్ని విపరీతంగా ఆకర్షించడం వల్ల నాటక సాహిత్యాన్ని ఆమూలాగ్రం తెలుసుకోవడం ప్రారంభమైంది. ప్రాక్ పశ్చిమ థియేట్రికల్ ఎక్స్‌పర్‌మెంట్స్ పరిచయం వచ్చింది. తరువాతే

ఆంధ్ర యూనివర్శిటీ స్టేజ్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు గారితో పరిచయం.. నాటకాలు ప్రదర్శించడం ప్రారంభమైంది.

"నాటకాలకు సంబంధించి మిమ్మ మొదట అధికంగా ప్రభావం చూపిన పుస్తకం?"

"నేను అమెరికా నుండి తెప్పించిన" 'ప్లే ప్రొడక్షన్" అన్నారు.

"తరువాత నాటక సాహిత్యానికి సంబంధించి ఎన్నో పుస్తకాలు సేకరించారు. అందులో మీకు ఇష్టమైనవి?

"చాలా ఉన్నాయి. ముఖ్యంగా రష్యా నాటక దర్శకుడు స్టానిస్లావిస్కీ "An Actor prepares" "My life in Art" ఆయన "If I were", మెథడ్ ఆక్టింగ్‌తో సరికొత్త నటనా సూత్రాలు ప్రపంచానికి పరిచయం చేసారు. భౌతికమైన దానికన్నా అంతరంగ భావాల్ని ప్రదర్శించడం ముఖ్యం. ఆయనొక గొప్ప విద్యావేత్త, కళాదర్శకుడు, నటనాశిల్పి" అన్నారు.

"దాని గొప్పదనం మాకర్థమయ్యేలా కొంచెం? "....

"భౌతిక పదార్థం లేక జడం అనేది విశ్వసృష్టికి మూలం. జడమంటే నిర్జీవపదార్థం కాదు. జడం మేల్కొంటే జీవం. నీరు ఘనీభవిస్తే మంచుగడ్డ... అది కరిగితే నీరు. నీరు దానంతటది కదులుతుంది. మంచుగడ్డ దానంతటది కదలదు. జడం... జీవం రెండు పదార్థాలు కావు. ఒకే దానికి రెండు దశలు" అది ఆయన వివరణ.

"మీకు షేక్స్‌పియర్‌కు కొన్ని సారూప్యాలున్నాయి సార్"! అన్నాను.

"ఎలా? ఎందులో?" అన్నారు..

"సాధారణ దశనుండి విపరీతంగా చదివి మహాపండితులుగా ఎదగడం, పెద్దనవ్వు...

"షేక్స్‌పియర్ అంటే నాకు చాలా ఇష్టమే. ఆయన గొప్ప నాటక కర్త... కవి... ప్రజల మనసుల్లో ఆయనకు దొరికినంత మహోన్నత స్థానం మరెవ్వరికి దక్కలేదు. మానవ జీవితమే ఆయన విశ్వవిద్యాలయం. మానవ జీవితాల అధ్యయనమే ఆయన విద్యాభ్యాసం. మానవ మనోభావాల మర్మజ్ఞతే ఆయన పరిశోధన... అందుకే ఆయన కథా వస్తువులు దేశకాలాలకు అతీతమైనవి. శాశ్వతం, విశ్వజనీనం" అన్నారు.

"మరి తెలుగు నాటక సాహిత్యంలో మీ కలా అనిపించిన రచనేదైనా ఉందా?"

"ఉంది.. కన్యాశుల్కం" అలాంటిదే... దాని గొప్పదనం అంతా ఇంతా కాదు. అది మానవతను శిలువ వేసిన అమానుష సాంప్రదాయాన్ని దుర్వ్యసనాల్ని, వీటి మరుగున అల్లుకుపోయిన నిట్టూర్పుల నిస్తేజ జీవితాల్ని, కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు. బాల్య వివాహ దురాచార క్రూర చట్రంలో నిస్సహాయంగా విలపించే ఆడపిల్లల ఆక్రందనలు, కన్నెపిల్లల రక్తమాంసాలను బహిరంగంగా వేలంపెట్టే కుహానా శోత్రియ కిరాతక తండ్రుల్ని, కాటికి కాళ్ళు జాపి పసిపిల్లల్ని వివాహమాడటానికి వెంపర్లాడిపోయే వృద్ధ సనాతన దౌర్భాగ్యుల్ని, హిపోక్రసీతో ప్రవర్తించే ఆషాడ భూతుల్ని, మానవీయ మానవతా గుణాలతో కాలం వెళ్ళబుచ్చే వేశ్యల్ని, ఆ నాటిక సమాజాన్ని మొత్తం ఫొటోగ్రాఫ్ తీసి చూపించేసాడు గురజాడ.. అందుకు అది అంత గొప్ప నాటకం".

"మీ దృష్టిలో నాటకమెలా ఉండాలి?"

"ప్లెకెనోవ్ అభిప్రాయం చాలా ఉన్నతమైంది". "Society is not made for the artist, but the artist for the society. Art must promote the development of human conscious and the improvement of the social order" అన్నాడు. దాన్నే నేను పాటిస్తాను" అన్నారు.

టన్ను శాస్త్రజ్ఞానం కన్నా... ఔన్స్ అనుభవం గొప్పది.

"దర్శక నటుల కంటే గుణనిర్ణేతకు నాటక సాహిత్యంలో అధ్యయనం ఎక్కువగా ఉండాలంటారు, ఎందుకని?

"ఎందుకంటే నటులు, దర్శకుడికి ఏమి తెలియకపోయినా నాటక ప్రదర్శన ఇవ్వవచ్చు. కాని గుణనిర్ణేతకు సంపూర్ణ అవగాహన కావాలి. ఇతివృత్తం, పాత్రచిత్రణ, పాత్రల కార్యకలాపాలు, ప్రేరేపించే హేతువులు, సంఘటనలు, సంఘర్షణలు, సంభాషణలు, అర్థవంతంగా, తర్కబద్ధంగా, ఔచిత్యంతో ఉండాలి – Aristotelian six elements - Plot, Character, diction, Thought, Music and Spectacle పాటించబడాలి. Articulation స్పష్టోచ్ఛారణ ప్రధాన అవసరాలు, Modulation స్వరదోళనం, Stress–ఊనిక, Pace గతివేగం, Pitch– ధ్వనిస్థాయి, Pause ముఖ్యమే.

"ప్రసాదమూర్తి అభ్యర్థన మేర మీరు కళా ప్రభలో "ఆదిత్య అంతర్ మథనం" పేర చాలా విలువైన వ్యాసాలు రాసారు. LKM లో 'మహానటుడు' నాటకంలో కె. వెంకటేశ్వరరావు గారి అన్నగా మీరు వేసిన పాత్రకు బహుమతి వచ్చింది. అలాగే మీకింకా నచ్చిన పాత్రలు?"

"ఫణినాటకంలో" "జాఫర్" పాత్రకి ఉత్తమ నటుడు తీసుకొన్నాను. 'రాజీవం' నాటికలో జగ్గడో పాత్ర, 'మనుషులొస్తున్నారు జాగ్రత్తలో' అగంతకుడు – ఇలా చాలానే ఉన్నాయి.

"దేశరాజు హనుమంతరావు గారు మీరు మంచి మిత్రులు. ఆయన కోరిక మేర యండమూరి వీరేంద్రనాథ్ రచనలు మీరుకొన్ని దర్శకత్వం వహించినట్టున్నారు?"

అవును, హిరోషిమా, రఘుపతి రాఘవ రాజారాం, కుక్క, రుద్రవీణ" దర్శకత్వం వహించాను.

"మీరిచ్చిన ప్రదర్శనలో మర్చిపోలేని దుర్ఘటనలేమైనా వున్నాయా?

'నవ్వు.. కళ్ళలో, మనసులో ఇంట్రాస్పెక్షన్.

"బెట్రోల్ బ్రెహట్ ప్రయోగపద్ధతి తాదాత్మ్య విచ్ఛితి (Alianation Effect) తో ఇచ్చిన ప్రదర్శన "రేపు లేదు", రాజమండ్రి LKN లో ఇచ్చిన "రాధామాధవీయం", నన్నపనేని వెంట్రావు మెమోరియల్ నాటక పోటీల్లో "నందోరాజాభవిష్యతి" నాటక ప్రదర్శనలు – ఘోరంగా ఫెయిల్ అవ్వడం నా నాటక రంగ అనుభవాల్లో మర్చిపోలేనివి" అన్నారు, చిన్ననవ్వు...

"మద్రాసు వెళ్ళి సిని నిర్మాణంలో స్క్రీన్‌ప్లే, దర్శకత్వ విభాగాల్లో ఎవరెవరితో పని చేసారు?"

"మిత్రుడు కనకాల దేవదాసు, నూతన ప్రసాద్ కోరిక మేర 'చలిచీమలు', 'నాగమల్లి' సినిమాలకు మొదట చేసాను, తరువాత వేజళ్ళ సత్యనారాయణ గారు చేసిన 'మరోమలుపు' ఈ పిల్లకు పెళ్ళవుతుందా? లాంటి సినిమాలకు వర్క్ చేసాను. రావు కూడా తీసుకెళ్ళాడు. అతనితో కొంత చేసాను..."

"యదార్థ వాది లోక విరోధి" అని పొగడ్త బ్రతుకుతెరువును, విమర్శ విరోధుల సంఖ్యను పెంచుతుంది. మీ ముక్కు సూటితనం, రాజీపడలేని మనస్తత్వం, సినీఫీల్డ్‌లో ఇమడలేకపోయారంటారు...? నిజమేనా ?

"బహుశా నిజమే!' బ్రతుకు తెరువుకు, ఆర్థిక అవసరాలకు కొదవలేక పోవడం కూడా నేను సినీఫీల్డ్‌లో స్థిరపడలేకపోవడానికి కారణాలు కావచ్చు.

"మీలోని క్రియేటర్ని మీలోని క్రిటిక్ ఎక్కువగా డామినేట్ చేసాడు. లేకుంటే మీ కలాన్ని, గళాన్ని విమర్శకు కాక సృజనకే ఎక్కువ విలువిచ్చి ఉంటే..' సహనంతో వ్యక్తిగత శైలి మార్చుకొనుంటే.. కొంత రాజీపడటం నేర్చుకొనుంటే.. రంగస్థలం పైనో, చిత్రసీమలోనో మరో అద్భుతంగా, స్పష్టంగా వెలుగొందేవారేమో...!"

పెద్దనవ్వు... మళ్ళీ... మళ్ళీ నవ్వు.. (సమాధానం మాత్రం ఇవ్వలేదు)

అలా జరగకపోవడానికి కారణం... ఆయన బాబి... పిఠాపురం బాబి. ఎవరి పొగడ్తను, తెగడ్తను లెక్క చేయకపోవడం – గుర్తింపును, స్వార్థాన్ని ఆశించకపోవడమే ఆయన ప్రత్యేకత.

అనేక మంది నాటక మిత్రుల్ని, ఆయన అభిమానుల్ని, శిష్యుల్ని అడిగితే

బాబిగారంటే రంగస్థల శిఖరం
బాబిగారంటే రసరంగ మథనం
బాబిగారంటే నట కళా విమర్శ శాస్త్రం
బాబిగారంటే ఏక్టింగ్ ఎన్‌సైక్లోపిడియా పఠనం
ఆయన విజన్, యాటిట్యూడ్, ధైర్యం, ఫైర్, గట్స్, ఛాలెంజ్... లకు
వందనం పాదాభివందనం.....

– కె. కృష్ణారావు
రంగస్థల కార్యకర్త, సామాజిక విశ్లేషకులు

సహృదయ మిత్రమండలి స్థాపించినప్పటి నుండి మిత్రులంతా ఒకే మాటగా నిర్ణయాలు తీసుకుంటూ, అనేక ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ, సహృదయం కలిగిన అనేక రంగాలకు చెందిన నిష్ణాతులను కలుపుకుంటూ, మిత్రమండలిని పటిష్టం చేశారు. మిత్రమండలి చేపట్టే అనేక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం నాకు కూడా కలిగింది.

ముఖ్యంగా మిత్రమండలి ప్రతీ సంవత్సరం వేసవి శెలవుల సందర్భముగా విద్యార్థులకు నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణా శిబిరంలో అనేక అంశాలు బోధించే ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొను విద్యార్థినీ, విద్యార్థులు నెలరోజుల పాటు వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుని, ఒక దృఢమైన సంకల్పంతోనూ, ఆనందోత్సాహముతోనూ మిగతా విద్యా సంవత్సరం గడుపుతున్నారు. నెలరోజుల పాటు శిక్షణా శిబిరం నిర్వహించే వేదికగా శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయానికి సహృదయమిత్ర మండలి సంస్థ పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెడుతున్నది.

సహృదయ మిత్రమండలి పాతికేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని, ఆయా కార్యక్రమాలకు సంబంధించిన అనేక అంశాలు ప్రస్తావిస్తూ, భావితరాలకు రికార్డు రూపంలో వెలువడుతున్న 'సావనీరు' అభినందనీయం.

సహృదయ మిత్రమండలి సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు.

–కొండేపూడి శంకరరావు
కార్యదర్శి, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం.

సత్యమని, మంచిదని నీవు అర్థం చేసుకున్నదానిని తక్షణమే ఆచరించు.

శతజయంతి సందర్భంగా ప్రత్యేక నివాళి వ్యాసం

పీడితజనుల గళమూ, కలమూ
మహాశ్వేతాదేవి (1926 - 2026)



తను వందేళ్లు జీవించాలనుకుంది మహాశ్వేతాదేవి. ఢాకాలో జన్మించిన ఆమె ఆదే ఢాకాలో అనారోగ్యంతో బాధపడుతున్న తన మిత్రుడు, సుప్రసిద్ధ బంగ్లాదేశ్ రచయిత అఖ్తరుజ్జమాన్ ఎలియాస్‌తో సంభాషిస్తూ ఈ మాటంది. వందేళ్లు ఊరకనే బతకాలని కాదు. సెంచరీ కొట్టామని గర్వపడడానికి కాదు. చేయాల్సిన పనీ, రాయాల్సిన రాతా చాలా వుంది కాబట్టి అలా అందామె. ఆమె తన జీవితంలోని అధిక భాగం ఆదివాసీల మధ్య వారి కోసమే గడిపింది. వారి జీవితాలనే కథలుగా, రచనలుగా మలచింది. బెంగాల్, ఝార్ఖండ్, బీహార్, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్, మధ్య ప్రదేశ్ తదితర ప్రాంతాల ఆదీవాసీలు ఆమెను 'పెద్దక్క' అని పిలుస్తారు. అన్యాయం జరుగుతోందని భావించినపుడు ఆమె తన జీవిత చరమాంకంలో కూడా సింగూర్, నందిగ్రాం పోరాటాల్లో పాల్గొంది. వాటికి మద్దతుగా 'దైనిక్ స్టేట్స్‌మ్యాన్' దినపత్రికలో వ్యాసాలు రాసింది. తొమ్మిది సంవత్సరాల క్రితం జూలై 28, 2016 మధ్యాహ్నం మల్టిపుల్ ఆర్గన్ ఫెయిల్యూర్ కారణంగా బెల్‌వ్యూ నర్సింగ్ హోమ్‌లో కన్నుమూసింది. 90 సంవత్సరాల సుదీర్ఘ జీవితంలో బెంగాలీ సాహిత్యానికి అంతులేని కృషి చేసిందామె. జ్ఞాపకశక్తి కోల్పోవడం వల్ల చివరి మూడు సంవత్సరాలు మినహా మిగతా జీవితమంతా క్రియాశీలంగానే గడిపింది.

అవిభాజ్య బెంగాలులో జననం

1926 జనవరి 14న మహాశ్వేతాదేవి నేటి బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జన్మించింది. రవీంద్రనాథ్, సత్యజిత్ రాయ్‌ల మాదిరిగానే సాహిత్య, సాంస్కృతిక వారసత్వం గల పరివారంలో జన్మించిందావిడ. ఆమె తండ్రి మనీష్ ఘటక్ కవి నజ్రూల్‌తో కలిసి 'కల్లోల్' అనే విప్లవ సాహిత్యోద్యమాన్ని నడిపిన రచయిత, కవి. ఆయన 'యుబనాశ్వ' అనే మారుపేరుతో రాసేవాడు. తల్లి ధరిత్రీదేవి కూడా కవయిత్రి. పినతండ్రి రిత్విక్ ఘటక్ గురించి వేరే పరిచయం అఖ్ఖర్లేదు. శంఖ చౌదరీ అనే మామయ్య గొప్ప శిల్పి. మరో మామయ్య సచిన్ చౌదరీ 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' వ్యవస్థాపక సంపాదకుడు. ఆమె ముత్తాత యాదవ్ చంద్ర చక్రవర్తి రామ్మోహన్‌రాయ్ జీవిత చరిత్రను గ్రంథస్థం చేసిన ప్రప్రథమ రచయిత. దేబేంద్రనాథ్ ఠాగూర్, కేశవ్ చంద్ర సేన్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్‌లతో ఆయనకు మంచి సంబంధాలుండేవి. ఆమె అమ్మమ్మ కిరణ్మయి దగ్గర సొంత లైబ్రరీ ఉండేది. ఆ పుస్తకాలూ, సాహిత్య సంవాదాలూ, అమ్మమ్మలోని ఉదారత్వం మహాశ్వేతపై చాలా ప్రభావాన్ని చూపాయి.

విద్యాభ్యాసం

మహాశ్వేతాదేవి విద్యా జీవితం కేవలం నాలుగు సంవత్సరాల వయస్సులో ఢాకాలోని ఈడెన్ మాంటిస్సోరి

విద్య మనిషి జీవితానికి వెలుగునిస్తుంది. అతని వికాసానికి నడవడికకు తోడ్పడి మనుషులను తేజోమయుల్ని చేస్తుంది.

పాఠశాలలో ప్రారంభమైంది. తండ్రి బదిలీ కారణంగా ఆమె పాఠశాల జీవితానికి అంతరాయం కలిగినా, ఇంట్లో చదువు మాత్రం ఆగలేదు. 1935లో, ఆమె తండ్రి మెదినీపూర్‌కు బదిలీ అయినప్పుడు, ఆమెను అక్కడి మిషన్ స్కూల్‌లో నాల్గవ తరగతిలో చేర్చారు. మరుసటి సంవత్సరం, 1936లో, ఆమెను శాంతినికేతన్‌లో చేర్చారు. పదేళ్ల వయసులో, మహాశ్వేత తన తల్లిదండ్రులను వదిలి శాంతినికేతన్‌కు వెళ్ళినప్పుడు చాలా ఏడ్చింది. కానీ మూడు సంవత్సరాల తరువాత, శాంతినికేతన్‌ను వదిలి కోల్‌కతాకు వచ్చినప్పుడు ఆమె మరింత ఏడ్చింది. ఐదవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు శాంతినికేతన్‌లో చదువుకున్న అనుభవం ఆమెను ప్రత్యేకంగా తీర్చిదిద్దింది. ఏడవ తరగతిలో ఆమె రవీంద్రనాథ్‌ను తన బెంగాలీ సబ్జెక్టుకు గురువుగా పొందింది. 1939లో కోల్‌కతా బేల్తొలా బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేరింది. ఆ సమయంలో, ఆమె తన కంటే కేవలం మూడు నెలలు పెద్దవాడైన తన పినతండ్రి రిత్విక్ ఘటక్ సమక్షంలో ఆంగ్ల సాహిత్యంపై దృష్టి పెట్టింది. అది ఆమె రచనా వృత్తికి సన్నాహక కాలంగా చెప్పొచ్చు. ఆమె మొదటి రచన 1940లో 'రంగ్‌మషాల్' పత్రికలో ప్రచురితమైంది. రవీంద్రనాథ్ ఠాగూర్ 'బాల్యం' గురించి రాసిన రచన అది.



కాలేజీ రోజుల్లో

1942లో మెట్రిక్యులేషన్ పాసైన తర్వాత మహాశ్వేతను ఆశుతోష్ కళాశాలలో చేర్పించారు. ఆమె కమ్యూనిస్ట్ పార్టీ సభ్యురాలు కాకపోయినా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనేది. పార్టీ సమావేశాలకు హాజరయ్యేది. పార్టీ ప్రచార పత్రికలైన 'పీపుల్స్ వార్', 'జనజుద్ధ' కాపీలను అమ్మేది. బహుశా ప్రజల పట్ల ఉన్న లోతైన ప్రేమ వల్ల కమ్యూనిజంపై ఆమెకు నమ్మకం ఏర్పడింది. విద్యార్థి జీవితంలో మహాశ్వేత చాలా ఉల్లాసంగా వుంటూ చెట్లు ఎక్కడం, సైక్లింగ్, ఈత కొట్టడంలో మగపిల్లలతో పోటీ పడేది. ఆత్మరక్షణ కోసం కర్రసాము, కత్తి పోరాటాలు కూడా నేర్చుకుంది. విమర్శలను పట్టించుకునేది కాదు. మరోవైపు కుటుంబ బాధ్యతలను కూడా నెరవేర్చేది. తన తల్లి పాత కుట్టు యంత్రాన్ని ఉపయోగించి బట్టలు, దోమతెరలు, దిండు కవర్లు తయారుచేసేది. ఆర్థికంగా స్వతంత్రంగా మారాలనే కోరికతో ఆమె 1942లో తన క్లాస్‌మేట్స్ సహాయంతో 'చిత్రరేఖ' అనే బట్టల ముద్రణ దుకాణాన్ని ప్రారంభించింది. 1944లో తన తండ్రి బదిలీ కారణంగా రంగ్‌పూర్‌కు వెళ్లింది. అక్కడ ప్రఖ్యాత గాయకులు వినయ్ రాయ్, రేబా రాయ్ చౌదరీలతో పరిచయం ఏర్పడింది. అక్కడ భారతీయ గణ నాట్య సంఘ్ నృత్యగానాల వర్క్‌షాపులో చేరింది. ఈ అనుభవం ఆమె తర్వాతి కాలంలో నాటకాలు రాయడానికి ఉపయోగపడింది. 1944 చివరిలో బి.ఏ. చదవడానికి మళ్ళీ శాంతినికేతన్‌కు వెళ్లింది. శాంతినికేతన్‌లో చదువుతున్నప్పుడు 'దేశ్' పత్రిక సంపాదకుడు సాగర్‌మోయ్ ఘోష్ ఆదేశం మేరకు ఆమె చిన్న కథలు రాయడం ప్రారంభించింది. ఆ సమయంలో, ఆమె రాసిన మూడు చిన్న కథలు 'దేశ్' పత్రికలో ప్రచురితమయ్యాయి. 1946లో ఇంగ్లీష్ ఆనర్స్‌తో బి.ఏ. పాసైన తర్వాత, కలకత్తా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. (ఇంగ్లీష్) తరగతిలో చేరింది. అయితే, 1946 మత అల్లర్ల ఫలితంగా కళాశాలలూ, విశ్వవిద్యాలయాలూ మూతబడ్డాయి. అప్పుడు ఆగిన ఎం.ఏ.ను దాదాపు పదిహేడు సంవత్సరాల తర్వాత 1963లో పూర్తిచేసిందామె.

వ్యక్తిగత జీవిత విషాదాలు

1947 ఫిబ్రవరి 10న ప్రఖ్యాత నాటకకర్త, రచయిత బిజన్ భట్టాచార్యను వివాహం చేసుకుంది. కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడిగా గడిపే ఆయనకు ఆదాయమన్నది లేదు. అంచేత కుటుంబ బాధ్యతను తన భుజాలపై వేసుకుని 1948లో పద్మపుకూర్ ఇన్‌స్టిట్యూట్‌లో టీచర్‌గా చేరింది మహాశ్వేత. జీవనోపాధి కోసం చాలా పార్ట్‌టైం ఉద్యోగాలు చేసింది. 1949లో కేంద్ర ప్రభుత్వ పోస్టల్ ఆడిట్‌లో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. కానీ ఆమె టేబుల్ డెస్కులో కమ్యూనిస్ట్ పుస్తకం దొరికిందన్న నెపంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. ఆ తర్వాత కుటుంబాన్ని పోషించడానికి బట్టలు, సబ్బులు అమ్ముకుంటూ, ట్యూషన్లు చెప్పుకుంటూ గడిపింది. 1948లో తన ఏకైక సంతానం నబారుణ్ భట్టాచార్య పుట్టాడు. కుటుంబ భారం మరింత పెరిగింది. 1957లో ఆమెకు రమేష్ మిత్రా బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగం లభించింది. 1963లో ఎం.ఏ. ఉత్తీర్ణత సాధించిన తర్వాత, 1964లో విజయ్‌గఢ్ జ్యోతిష్ రాయ్ కళాశాలలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా చేరింది మహాశ్వేత. రచనను వృత్తిగా స్వీకరించిన తర్వాత, 1984లో స్వచ్ఛందంగా అక్కడి నుండి పదవీ విరమణ చేసిందామె. జీవితంలో ఎదురైన ఒడిదుడుకులూ, చేపట్టిన వివిధ వృత్తులూ, భిన్నమైన వ్యక్తులతో సంబంధాలూ, పేదరికమూ ఆమెను ప్రజారచయిత్రిగా మార్చాయి. 'ఝాన్సీ రాణి' జీవిత చరిత్రపై రాసిన ఆమె మొదటి నవల 'దేశ్' పత్రికలో ఆగస్టు 6, 1955 నుండి డిసెంబర్ 31, 1955 వరకు సీరియల్‌గా వచ్చింది. 1958లో 'దేశ్' పత్రికలోనే 'యశవమాత్మి' అనే కథ ప్రచురితమైంది. 1951 –56 మధ్యకాలంలో ఆమె 'సచిత్ర భారత్' పత్రికలో సుమిత్రా దేవి అనే మారుపేరుతో అనేక కథలు రాసింది.

'Bijan has shaped my talent and given it permanent form. He has made me into what I am today.' – అంటూ ఎంతో గర్వంగా చెప్పుకున్న ఆమె 1962లో అతని నుంచి విడాకులు తీసుకుంది. 12–13 ఏళ్ల నవరుణ్‌ను విడిచిపెట్టాల్సి రావడం ఆమెను తీవ్రంగా బాధించింది. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వైద్యులు ఆమెను బ్రతికించారు. ఆ తర్వాత ఆమె తనకంటే చిన్నవాడైన అసిత్ గుప్తాను వివాహం చేసుకుంది. కానీ 1976లో ఆ వివాహం కూడా తెగిపోయింది. అప్పటి నుండీ ఆమెది ఒంటరి జీవితమే. నిస్సహాయులూ, అణచివేతకు గురైన వారి కోసం పనిచేస్తూ వారితో గడుపుతూ వారినే సొంతవారిగా చేసుకుని బ్రతికిందామె. 1979లో తండ్రి మరణం తర్వాత ఆయన నిర్వహించే 'బొర్తిక' పత్రిక బాధ్యతను చేపట్టింది. ఈ పత్రికను చిన్న రైతులూ, వ్యవసాయ కార్మికులూ, గిరిజనులూ, పారిశ్రామిక కార్మికులూ, సమాజంలోని అట్టడుగు వర్గాల కంఠస్వరంగా మలిచిందామె. ఈ పత్రిక మహాశ్వేతకు బెంగాలీ లఘు పత్రికల రంగంలో అద్వితీయ స్థానాన్ని కల్పించింది. 1982–84 మధ్యకాలంలో కళాశాల ఉద్యోగం నుండి రెండేళ్లు సెలవు తీసుకుని, 'జుగాంతర్' పత్రికకు ట్రావెలింగ్ జర్నలిస్ట్‌గా మారి ఆమె ఆదివాసీలూ, అణగారిన ప్రజల జీవితాల, పోరాటాల కథలను సేకరించింది. ఈ జర్నలిస్టు జీవితం ఆమె సాహిత్య జీవితాన్ని సుసంపన్నం చేస్తూ, విషయవస్తువును ఎంచుకోవడంలో దిశా నిర్దేశం చేసింది.

'ఝాన్సీ రాణి'తో నవలా రచన ప్రారంభం

'ఝాన్సీ రాణి' నవల ఆమెకు అపారమైన కీర్తిని ఆర్జించిపెట్టింది. అప్పట్నుంచీ చరిత్ర, జానపద సంస్కృతి ఆమె రచనల్లోని ప్రధాన అంశాలుగా మారాయి. 'ఝాన్సీ రాణి' నవల రచనకు సంబంధించిన కథ కూడా చాలా ఆసక్తికరమైనది. 1952లో, బిజన్ భట్టాచార్య ఒక హిందీ చిత్రానికి స్క్రీన్‌ప్లే రాయడానికి ముంబై వెళ్ళాడు. అతడితో



పాటు మహాశ్వేత కూడా వెళ్లింది. ముంబైలో మహాశ్వేత మామయ్య, 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' వ్యవస్థాపక సంపాదకుడు సచిన్ చౌదరి ఉండేవాడు. ఆయన దగ్గరున్న సిపాయిల తిరుగుబాటు చరిత్ర పుస్తకాలు చదివి, ఝాన్సీ రాణిపై నాలుగు వందల పేజీల నోట్సు రాసుకుంది మహాశ్వేత. కానీ ఎంతకీ సంతృప్తి కలగడంలేదు. చివరికి స్నేహితుల నుండి అప్పు తీసుకుని 1954లో బుందేల్ ఖండ్‌కు పోయి, కొన్ని నెలల పాటు, గ్వాలియర్ ప్రాంతపు గ్రామగ్రామాలు తిరిగి ఝాన్సీ రాణిపై ప్రాంతీయులు పాడుకునే జానపద పాటలనూ, జానపద కథలనూ సేకరించింది. ఝాన్సీ రాణి బంధువుల నుండి కూడా సమాచారం సేకరించి కలకత్తాకు తిరిగి వచ్చాక ఝాన్సీ రాణి కథను సరికొత్తగా రాసింది. అప్పటి నుండి రచనే తన వృత్తి అని తీర్మానించుకుంది. ఏ సమస్యపై, పోరాటంపై రాయాలన్నా విపరీతంగా సమాచారాన్ని సేకరించేది. ప్రజల కోణాన్ని తెలుసుకోడానికి జానపద పాటలనూ, కథలనూ సంగ్రహించి నిశితంగా అధ్యయనం చేసేది. ఆ తర్వాతనే రచన మొదలుపెట్టేది. అంతకు మించిన షార్ట్‌కట్లు ఆమె దగ్గర ఉండేవి కావు. అందుకే ఆమె రచనలకు బెంగాలీ సాహిత్యంలో అంతటి విశిష్ట స్థానం దక్కింది. '*సాహిత్య సృష్టి కేవలం ఒక అభిరుచి కాదు, రచయితగా ప్రజల పట్ల నాకుండాల్సిన బాధ్యతకు సంబంధించిన వ్యక్తీకరణ!*' అన్నది ఆమె నమ్మకం. 1957లో ప్రచురితమైన 'నౌటీ' నవల సిపాయిల తిరుగుబాటు నేపథ్యంలో ఖోధాబక్ష్, మోతీల ప్రేమ కథను చిత్రిస్తుంది. 1857 నేపథ్యంలోనే 'అమృత్ సంచయన్' (1962) నవలనూ, 'చంపా' (1959) అనే కథనూ రాసింది. 18వ శతాబ్దంలో మరాఠా సైన్యాలు బెంగాలు ప్రజలపై చేసే దండయాత్రలను 'బొర్గీల దండయాత్ర' అని అంటారు. ఈ విషయంపై రాసిన నవల 'ఆధార్ మానిక్' (1966). ఆమె చారిత్రక రచనల్లో రాజుల కోణం కంటే ప్రజల కోణమే ప్రధానంగా కనిపిస్తుంది.

ఎన్నెన్నో ఇతివృత్తాలతో నవలలు

'మొధురే మొధురే' (1958), 'ఎతొటుకూ ఆశా' (1959), 'తిమిర్ లొగొన్' (1959), 'తారార్ ఆధార్' (1960), 'లైలీ అష్మానేర్ తారా' (1962) వంటి నవలలలో మధ్యతరగతి సామాజిక వాస్తవాన్ని చిత్రించింది మహాశ్వేత. ఆ తరువాత వచ్చిన 'కవి బంద్యఘాటి గాయినేర్ జీబొన్ ఓ మృత్యు' (1967), 'హాజార్ చురాషీర్ మా' (తెలుగులో 'ఒక తల్లి') (1974), 'అరణ్యేర్ అధికార్' (1977) నవలలు రచయితగా ఆమె స్థానాన్ని ఉన్నత స్థాయికి చేర్చాయి. బంద్యఘాటి గాయిన్ అనే నిమ్నజాతి యువకుడు బ్రాహ్మణ యువతి ప్రేమలో పడినట్టు ఆ పర్యవసానాలను ఊహిస్తూ రాసిన కాల్పనిక నవల 'కవి బంద్యఘాటి గాయినేర్ జీబొన్ ఓ మృత్యు'. నక్సల్బరీ ఉద్యమ నేపథ్యంలో రాసిన 'హజర్ చురాష్షీర్ మా' మహాశ్వేత సాహిత్యంలో ఒక మైలురాయి. సరిగ్గా గోర్కీ తల్లిలాగే, లాకప్‌లో చనిపోయిన మృత యువకుడి తల్లి తన కొడుకు ఎంచుకున్న రాజకీయాల మహోన్నత ఆశయాలను మెల్లమెల్లగా అర్థం చేసుకుంటుంది ఈ కథలో. 'రాంగ్ నంబర్', 'శరీర్', 'ప్రాత్యహిక్' కథల్లో కూడా ఇదే ఇతివృత్తం కనిపిస్తుంది. 'రాంగ్ నంబర్'లో మృతుడి తండ్రి తన కొడుకు రాజకీయాదర్శాన్ని అర్థం చేసుకుంటాడు. 'అరణ్యేర్ అధికార్' నవల మహాశ్వేత సాహిత్య జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. సురేష్ సింగ్ 'Dust Storm and Hanging Mist' ఆధారంగా

విద్య బాల్యానికి మాత్రమే పరిమితం కాదు. జీవితాంతం ఇంకా నేర్చుకోవాల్సిన విషయాలెన్నో ఉన్నాయి.

రాసిన కథ ఇది. బిర్సా ముండాను హీరోగా చిత్రించిన ఈ నవలకు సాహిత్య అకాడమీ అవార్డు దొరికినప్పుడు ముండా గిరిజనులు నెల రోజుల పాటు ఆటపాటలతో ఉత్సవాలు జరుపుకున్నారు. మహాశ్వేతా దేవిని 'మరందాయి' (పెద్దక్క) అని అప్పట్నుంచీ పిలవడం మొదలు పెట్టారు ఆ గిరిజన తెగల వాళ్లు.

'ఉల్‌గులాన్' (గిరిజనుల యుద్ధనినాదం) నేపథ్యాన్ని మరింత విస్తరింప జేస్తూ మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో అంటరానివారు, గిరిజనుల జీవిత పోరాటాలను చిత్రిస్తుంది 'చోటీ ముండా ఎబొంగ్ తార్ తీర్' (1980). ఎవర్నైతే బ్రిటీషువారు 'కిమినల్ ట్రైబ్స్' (నేరస్థ తెగలు) అని ముద్రవేశారో వారి స్థితిగతులు స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఏ మాత్రం మారలేదన్న వాస్తవాన్ని రుజువు చేస్తాయి మహాశ్వేతాదేవి రచనలు. తిరుగుబాట్లు మహాశ్వేత రచనల్లో పునరావృతమౌతూనే వుంటాయి. బాబా తిల్కా మాఝీ (1780–85) నేతృత్వంలో సాగిన మొదటి సంతాలీ తిరుగుబాటు ఆధారంగా 'శాల్‌గిరార్ డాకే' (1982) నవలనూ, 1855–56లో సిద్ధు–కాను నాయకత్వంలోని సంతాలీ తిరుగుబాటు ఆధారంగా 'హుల్మాహా' (1982) నవలనూ రూపొందించారు మహాశ్వేత. బ్రిటీష్ వలసపాలనతో పాటు భూస్వామ్య దోపిడీని కూడా నిర్మూలించి స్వతంత్ర సంతాల్ రాజ్యాన్ని స్థాపించడానికై సంతాల్ ప్రజలు సాయుధ బ్రిటిష్ సైన్యంపై కేవలం విల్లూ, బాణాలూ, ఈటెలతో పోరాడిన విలక్షణ చరిత్రకు ఈ నవలలు అద్దం పడతాయి. బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడిన మరో పోరాట వీరుడి కథ 'తుతుమీర్' (1984).

స్వతంత్ర భారతదేశంలోని గిరిజన ప్రజల పోరాటాలను చిత్రించాయి మరికొన్ని రచనలు. కనీసవేతనాల గురించీ, ఆనకట్టల నిర్మాణం వలన విస్థాపితమౌతున్న జీవితాల గురించీ, జీవించే హక్కు గురించీ, కనీస ప్రాథమిక విద్యకై సాగిన పోరాటాల గురించీ – ఇలా ఎన్నో అంశాలపై 'బషాయి టుడు' (1978), 'మాస్టర్ సాబ్' (1979), 'అక్లాంతొ కౌరవ్' (1982), 'సూరజ్ గాగ్రాయ్' (1983), 'టెరోడాక్టిల్, పురాన్ సహాయ్ ఓ పిర్థా' (1989), 'ప్రాథొమ్ పాథ్' (1989), 'ఖుధా' (1992) వంటి నవలలు సృజించారు మహాశ్వేత. **మహాశ్వేతాదేవి కథలు** ద్రౌపది' (1977) కథలోని గిరిజన నక్సల్ స్త్రీ పాత్ర భారతీయ సాహిత్యంలో ఒక చెరగని ముద్ర వేసింది. ఇందులోని భాష, వ్యక్తీకరణ, కథనం పాఠకుడికి గగుర్పాటు కలిగిస్తాయి. 'నిరాయుధమైన టార్గెట్ ముందు సేనానాయక్ మొదటిసారి భయపడ్డాడు' అన్న ఆఖరు వాక్యాన్ని మరిచిపోలేము. జీవితం విసిరే సవాళ్ల ముందు మత, సామాజిక కట్టుబాట్లు ఓడిపోతాయన్న వాస్తవాన్ని చిత్రిస్తాయి 'జాతుధన్', 'సాంజ్‌సొకాలేర్ మా' కథలు. నగరాల్లోని ఇటుక బట్టీల్లో పనిచేసే ఆదివాసీ స్త్రీలు కట్టుబానిసలే కాదు లైంగిక బానిసలు కూడా అన్న విషయాన్ని చెబుతాయి 'శనిచరి', 'ఈటేర్ పొర్ ఈట్' కథలు. మూడొందలు రూపాయల అప్పు తీర్చలేకపోయిన కట్టుబానిస కుమార్తె జీవితాంతం లైంగిక బానిసగా గడుపుతుంది 'దౌలతి' అనే కథలో. 'భాతువా' కథలో అమాత్యజ కులానికి చెందిన యువకుడు తన తండ్రి తీసుకున్న ఎనిమిది వందల రూపాయల అప్పును తిరిగి చెల్లించడానికి ఏడు సంవత్సరాల వయస్సు నుండి నలభై రెండు సంవత్సరాల వయస్సు వరకు ఉచితంగా పనిచేస్తాడు. అయినా ఆ అప్పు తీరదు. 'స్తనదాయిని', 'షికార్', 'శిశు', 'సగోనా', 'లైఫర్', 'మచ్', 'బిచ్చా' వంటి కథలు సమాజంలోని అన్యాయాలకు వ్యతిరేకంగా అణగారిన ప్రజల నిరసనలను వర్ణిస్తాయి. గిరిజనులలో అత్యధికంగా నిర్లక్ష్యం చేయబడిన లోధ–సవర్ల గురించి మహాశ్వేతాదేవి అనేక కథలు రాశారు. వాటిలో 'కురోణీర్ బేటా', 'చోర్', 'అర్జున్', 'ఉద్ధవేర్ జీబొన్ ఓ మృత్యు', 'తార్పొర్' వంటి కథలు ముఖ్యమైనవి.

విస్తృతమైన రచనా వ్యాసంగం

మహాశ్వేతాదేవి వందకు పైగా నవలలు రాశారు. ఆమె కథల సంకలనాలు ఇప్పటికి ఇరవైకి పైగా వెలువడ్డాయి. నాటికలూ, చిన్న పిల్లల కోసం కథలూ, లెక్కలేనన్ని వ్యాసాలూ రాశారు. ఆమె మరణించిన పది సంవత్సరాల తర్వాత కూడా ఆమె రచనల సంకలనాలు వెలువడుతూనే ఉన్నాయి. ఆమె కథల ఆధారంగా ఎన్నో నాటకాలూ, సినిమాలూ రూపొందాయి. డింపల్ కపాడియా కథానాయకిగా కల్పనా లాజ్మి నిర్మించిన 'రుడాలీ' (1993) సినిమా చాలా పేరు పొందింది. ఈ పాత్రను కలకత్తా 'రంగకర్మి' థియేటర్ గ్రూపుకు చెందిన ఉషా గాంగులీ స్టేజిపై అద్భుతంగా ప్రదర్శించే వారు. గోవింద నిహలానీ 'హజార్ చౌరాసీ కీ మా' (1998)లో జయ బాధురి మృత యువకుడు తల్లి సుజాత పాత్రలో అద్భుతంగా నటించింది. 'ఖల్‌నాయక్' సినిమాలోని 'చోళీ కే పీఛే క్యా హే' అనే పాట ఆ రోజుల్లో చాలా పాపులర్ అయ్యింది. 'అసలు దేశంలో సమస్యలే లేవా? జాకెట్టు వెనుక ఏముంది అన్నదే దేశానికి ప్రధాన సమస్య అయిపోయిందా?' అంటూ వేళాకోలం చేసిన మహాశ్వేతాదేవి అదే పేరుతో ఒక కథను రాసింది. ఆ కథ ఆధారంగా 'గంగోర్' (2010) అనే ఇటాలియన్ సినిమా తయారైంది. 'సంఘర్ష్' (1968), 'ఉల్లాస్', (2012) 'గుడియా' (1997) వంటి చాలా సినిమాలూ, నాటకాలూ ఆమె రచనల ఆధారంగానే వచ్చాయి. మహాశ్వేతాదేవి జీవితం ఆధారంగా అరిందమ్ సీల్ అనే దర్శకుడు ఇటీవల బెంగాలీలో 'మహానంద' (2022) అనే సినిమాను నిర్మించాడు. గార్గీరాయ్ చౌదరీ ఆ పాత్రను పోషించింది. జోషీ జోషెఫ్ అనే దర్శకుడు మహాశ్వేతాదేవిపై 'జర్నీయింగ్ విత్ మహాశ్వేతాదేవి' (2009), 'క్లోజప్' (2010) అనే డాక్యుమెంటరీలు నిర్మించాడు. మహాశ్వేతాదేవి అవార్డుల కోసం ఎప్పుడూ రాయలేదు కానీ ఆమెకు లెక్కలేనన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులు అందాయి. సాహిత్య అకాడమీ అవార్డు, జ్ఞానపీఠ అవార్డు, పద్మశ్రీ, పద్మ విభూషణ్, రామొన్ మేగ్సేసే, సార్క్ లిటరరీ అవార్డు, ఫ్రెంచి దేశపు అత్యుత్తమ అవార్డు ఇలా లెక్కలేనన్ని అవార్డులు లభించాయి. ఇక తెలుగు వారు మహాశ్వేతాదేవిని మరో ప్రత్యేక కారణం చేత గుర్తు పెట్టుకోవాలి. చిలకలూరిపేట బస్సు దహనం కేసులోని నిందితులు చలపతి, విజయవర్ధనరావుల ఉరిశిక్షను రద్దుచేయమని భారత అధ్యక్షుడు శంకర్ దయాళ్ శర్మకు ఉత్తరం రాసింది మహాశ్వేతాదేవి గారే.

రచయిత్రితో నాకున్న చిరుపరిచయం:

1996 ఆఖర్లో మహాశ్వేతాదేవికి జ్ఞానపీఠం అవార్డు దొరికినప్పుడు ఆమెపై 'ప్రజాసాహితి' పత్రిక వారు ఒక ప్రత్యేక సంచిక వెలువరించాలనుకున్నారు. ఆ రోజుల్లోనే నాకు ఆ పత్రిక బాధ్యులైన నిర్మలానంద, దివికుమార్ గార్లతో కలకత్తాలో జరిగిన ఒక కాన్ఫరెన్సులో పరిచమైంది. మహాశ్వేతాదేవిపై బెంగాలీలో వచ్చిన మంచి వ్యాసాన్ని తెలుగులోకి అనువదించి 'ప్రజాసాహితి' కోసం పంపించమని నిర్మలానంద గారు నన్ను కోరారు. ఆ పని మీద నేను మొదటిసారి ఆ మహారచయిత్రిని కలిశాను. బాలీగంజ్ స్టేషను దగ్గర ఎవర్నడిగినా ఆమె ఇంటి అడ్రసు చెప్పేస్తారు. మెలికలు తిరిగిన ఇనుప మెట్లెక్కి పుస్తకాలతో నిండిన ఆ ఇంటిలోకి ప్రవేశించాను. ఆ ఇంటిలో ఆమెకు సహకరిస్తూ తోడుగా ఇద్దరు ఆదివాసీ అమ్మాయిలున్నారు. నేను కూర్చున్న కుర్చీ పక్కన ర్యాక్‌లో కొత్తగా అచ్చై వచ్చిన బెంగాలీ పత్రిక కాపీలు కనిపించాయి. 'బొర్తిక' పత్రిక తాజా సంచిక కాపీలవి. ఆదివాసీలూ, నగరంలోని బస్తీల్లో జీవించే నిమ్నవర్గాల వారి కోసం ఆవిడ ఆ పత్రికను నిర్వహిస్తుంటారని ఆ రోజే నాకు తెలిసింది. మనోరంజన్ బ్యాపారి అనే ఆయన ఒకప్పుడు రిక్షావాడు. నేడు ఆయన గొప్ప బెంగాలీ రచయిత. (ఎంఎల్ఏగా కూడా ఎదిగాడు.) ఓ రోజు

అతడి రిక్షాలో ప్రయాణించింది మహాశ్వేతాదేవి. అతడితో జరిగిన కొద్దిపాటి సంబాషణలో అతని ప్రతిభను గుర్తించి అతడ్ని రచయితగా మలచింది మహాశ్వేత. అతడు తన జీవితాన్ని 20 పేజీల కథగా రాయగా దాన్ని 'బొర్తిక'లో ప్రచురించి అతడ్ని ప్రోత్సహించింది. మహాశ్వేతా దీదీ(పెద్దక్క)తో నేను వచ్చిన పనేమిటో చెప్పాను. ఆమె మరో రోజు రమ్మంది. అమర్ మిత్ర ఆమె గురించి రాసిన, ఆమెకు నచ్చిన వ్యాసాన్ని నాకందించింది మరోసారి వెళ్లినపుడు. 'ప్రజాసాహితి' మార్చి 1997 మహాశ్వేతాదేవి ప్రత్యేక సంచికలో ఆ అనువాద వ్యాసం అచ్చైంది. మహాశ్వేతాదేవి పెద్ద కథల్లో ప్రత్యేకమైనది 'ద్రౌపది'. ఆ కథ గురించి ఇదివరకే చెప్పుకున్నాం. ఆ కథను నేను నేరుగా బెంగాలీ నుండి తెలుగులోకి అనువదించాను. ఆ అనువాదం 'ప్రజాసాహితి' జూన్ 1997 అల్లూరి సీతారామరాజు శత జయంతి సంచికలో వచ్చింది. ఆ అనువాదం పని మీద కూడా నేను మూడోసారి వారి ఇంటికి వెళ్లాను. ఆదివాసీ అమ్మాయిలు ఆమె తల దువ్వుతుండగా ఆమె ఆ రోజు నాతో తీరికగా సంభాషించింది. తను అల్లూరి సీతారామరాజుపై ఒక చిన్న కథ రాశాననీ, నవల రాయాలన్న ఆలోచన కూడా ఉందనీ ఆవిడ చెప్పారు. మహాశ్వేత మన అల్లూరిపై బెంగాలీలో 'సూర్యుని దేహంపై గాయం' అనే కథ రాశారని మనవారెవరికీ తెలీదు. ఆ కథను నాకిస్తే తెలుగులోకి అనువదిస్తానని ఆవిడతో చెప్పాను. తన వద్ద లేదనీ, కాంగ్రెస్ నాయకుడు ప్రియరంజన్ దాస్మున్సీ సంపాదకత్వంలో వచ్చిన 'దొక్షిణీ బార్తా' అనే పత్రికలో వచ్చిందనీ, ఆయన దగ్గర సంపాదించమనీ చెప్పారు. నేను ఆ రోజుల్లో ల్యాండ్‌లైన్లో చాలా సార్లు దాస్మున్సీ గారికి ఫోనుచేశాను. కానీ అనారోగ్యంతో ఉన్న ఆయన వెదికి ఇవ్వలేకపోయారు. మహాశ్వేతాదేవి కథలను 'దేశ్' పబ్లికేషన్ వారు 20 సంపుటాలుగా వెలువరించారు. కానీ అందులోనూ దొరకలేదు. ఆమె సమగ్ర రచనలు ఇప్పటికీ వెలువడలేదు. ఆ కథ దొరికితే తెలుగు వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఆ కథ కోసం నా అన్వేషణ ఇప్పటికీ కొనసాగుతోంది. సింగూర్, నందిగ్రామ్ ఉద్యమాల ఫలితంగా మహాశ్వేతా దేవి మమతా బెనర్జీకి దగ్గరయ్యారు. ఆవిడ అంతిమ వీడ్కోలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగింది. మృతదేహాన్ని సందర్శకుల కోసం రవీంద్ర సదన్ థియేటర్లో ఉంచినపుడు ఆమెను కడసారి చూట్టానికి వెళ్లాను. తన రచనలతో ఒక తరాన్ని ఉత్తేజపరిచిన రచయిత్రి, ఎత్తిన కలం దించకుండా కలం శ్రామికురాలిగా పీడితజనుల పక్షాన అక్షరాలను విత్తిన రచయిత్రి, జగమెరిగిన ఆఖరు బెంగాలీ రచయిత్రి గాఢనిద్రలో విశ్రాంతి తీసుకున్నట్టనిపించింది. 'సంగ్రామానికి అంతం లేదని ఆమె చెబుతారు. అంతంకాని సంగ్రామానికి ప్రతిరూపం ఆమె. ఆమె పోరాట స్ఫూర్తితో మేము ప్రేరణ పొందాము. ఎన్ని అడ్డంకులొచ్చినా వెనుకాడలేదు. మా కాళ్ల కింది మట్టిని గట్టిపరుచుకున్నాము.' అంటూ అమర్ మిత్రా తన సంస్మరణ వ్యాసంలో రాశారు. పీడిత ప్రజల రక్తమాంసాలతో జీవం పోసుకున్న సాహిత్యానికి మరణం లేదు. దోపిడి ఉన్నంతకాలం ఆ సాహిత్యం మనకు పోరాటస్ఫూర్తిని అందిస్తూనే వుంటుంది. "సాయుధ సంఘర్షణలో బషాయిటుడును నాలుగుసార్లు చంపివేశారు. అయినా, అతడు ప్రతిసారీ పూర్తి శక్తి యుక్తులతో మళ్ళీ ఇంకో సంఘర్షణలో ప్రత్యక్ష మయ్యేవాడు ... బషాయిటుడు చావనే లేదు. అతడు చనిపోతే, అడవిలో సైన్యం ఎవరి కోసం వెతుకుతున్నట్టు?" అని 'బషాయిటుడు' గురించి రాస్తుంది రచయిత్రి. మహాశ్వేతాదేవి రచనలకు కూడా చావులేదు. ఆ రచనల్లోనే ఆమె సదా జీవించి వుంటుంది.

- బాలాజీ (కోల్‌కతా)

ముందడుగు సంస్థ నిర్వాహకులు

ఐశ్వర్యానికి తమ్ముడు అహంకారం.

కాకినాడ నా తల్లీ-నా చెల్లీ !

– డా॥ ఆవంత్స సోమసుందర్

నాకు తెలుసు ఈ ఎనభైఏళ్ల వృక్షం కొమ్మలెంత విస్తారంగా పరచుకొందో. ఆకాశంనిండా పత్రాలు భూమి లోలోతులలో మూలాలు. చిన్న మొగ్గగానే చెంబులతో నీళ్లుపోస్తూ రఘువంశంలోని శ్లోకాలు కంఠతా పడుతూ, భూమిలో తనతోపాటు రహస్యంగా ఎన్నో నాదాలు దాచుకొన్నాయి. చిన్నప్పుడు పెరటిలో మొక్కలు నాటుతున్నప్పుడు వ్రేళ్లను ఆకాశం చూడగూడదనుకొనేవాళ్లం. అది మూఢవిశ్వాసంగా కొట్టిపారేయవలసింది కాదు. కారణమేమంటే చెట్టు తన వేరుపట్టును ఎవ్వరికీ చూపదు. తన ఊతల్నీ తన పట్టుల్నీ ఎవరికీ వివరించదు. ఈ చెట్టు అక్షరాలా కవి. అందుకే పాండిత్య ప్రకర్ష ఎన్నడూ జారిపోదు.

ఈ చెట్టు వేర్లు పిఠాపురం మట్టిలో ఎంతో లోతుల్లోకి పరచుకున్నాయని చెప్పానా, మరి కొమ్మలు మొట్టమొదటిగా ఆకాశంలోకి ఎంతో విశాలంగా విస్తరించాయి. కాకినాడలో గురుపాదులు కృష్ణశాస్త్రిగారు తజ్జని నిగిడ్చి చూసిన ఆకాశాన్ని వెతుక్కొంటూనూ మిత్రులు సంపత్తు, ఉల్లి తిరుపతి, పాలగుమ్మి పద్మరాజు ఇత్యాది కవులు అందించిన మైత్రీవాల్లభ్యం వల్ల కాబోలు నా కొమ్మలు అందినంతమేర ఆకాశలోకాలు ఈదుతూనే పోయాయి. ఎంత దూరం పరుచుకున్నా నా ఆశలకు కాకినాడే ప్రప్రథమ ఆకాశలోకం. నాటికీ నేటికీ నా మొగ్గలూ, చివుర్లూ, పువ్వులూ కాకినాడ గగనానికే సమర్పితం. కాకినాడకు అర్పించిన తరవాతనే ఏ నగర దేవతకైనా సమర్పణంచేస్తూ నా సఫల హృదయ సమారాధన మొనరిస్తా....

నా హృదయ గహనాటవులలో నన్ను నేనే వెతుక్కుంటూ నాకు తోడుగా నీడగా సాగివచ్చిన కరదీపాన్ని నేనే మరొకమారు వెతుక్కుని ఆరాధనలందిస్తాను.

కాకినాడ! నా తల్లీ, చెల్లీ, ప్రాణేశ్వరీ! ఎన్నెన్ని రక్త స్పర్శల స్వప్నాలు నీలో నుంచి కొల్లగొట్టానో ఎలా చెప్పగలను? ఎన్నెన్ని భోగట్టాల తబిసీళ్లు విప్పను?

నిద్రకు దూరంచేసిన సుందర శరద్రాత్రులెన్నెన్ని. నీ పులిన స్థలాలలో తమ్ముడు శశాంకతో కలసి వెన్నెల విహారాల కైపు కన్నులెన్నెన్ని? అంతటా కవిత్వాన్నే చూస్తూ కవిత పున్నాగలెగరేసుకుంటూ, పురానేక జనానాల సువాసనల నాఘ్రాణిస్తూ, రాణిస్తూ, రమణిస్తూ నన్ను నేనే మరచి సుందర కావ్యంగా మారిపోయిన అమృత గడియలెన్నెన్ని?

ఎలా చెప్పను? కాకినాడా! నాలో నిన్ను లీనం చేసుకొంటూ –కాకులు కూసేవరకు కవితా చందన చర్చల పారవశ్యంతో మితిమీరి పోయానో? గతి తప్పిపోయానో? మతిభ్రంశమయ్యానో? ఏ గ్రంథంలో నిక్షిప్తం చేశానని విప్పి చెప్పగలను?

నా గుండెల్లో నీవు రసోదయ ప్రాగ్భూమివై, భాగ్యరాశివై, నా పెంపుకు భాగధేయవై, ఆహా! ఒక్క రఘుపతి బ్రహ్మర్షి తపస్సులో కళ్యాణ ఫలశృతిగా, ఒక్క పైండా రామకృష్ణ మధుర స్వప్నం సముచ్ఛయాల నవీన

సమాజంగా, ఒక్క మహనీయుడు తారకం కార్యదీక్ష గౌరవాధర్యంతో ధైర్యంగా నాలో నిండిన వినూత్న సంకల్పాల ఉద్దీప్తం చేస్తూ... ఎంత ఉత్సాహం ఎంత ఓజస్సు కాకినాడ!

నాకేం లోటు! నీవా అనంత నిరంతరాయంగా సాగే గోదావరి సుధా నిష్యందినివే కావచ్చు! కాని నేనో, నేను లేనే లేను. నేను నేనే కాను కాకినాడా!

నా బ్రతుకు కథగా, కైతల సాక్షిగా మారుమూల అడవిలో దిక్కులేకుండా పొర్లాడే అలనాటి పేద సెలయేరుగా ఉంటే, వసివాడి నశించి ఉంటే ఎంత వ్యర్థమైపోయేది.

కొండల్లో కృపాసారంగా ముత్యాల జల్లుగా కురిసిన వానజల్లు నా కలల ఇసుక రేణువులను అంటించి, సదా పాదచారుల మడమల క్రింద నలిగే చిరు సవ్వడుల రొదగా రోదనాక్రోశాలు ఉద్యమించేవేమో తప్ప, భావాక్షర ప్రసూనాలై వికసించేవేనా!

కాకినాడా! నీ కన్నులలో అమేయ నీలిమలు. నీ వొక నిట్టూర్పువు. అతృప్త నిశ్వాసానివి. రాత్రి తెల్లవార్లూ గూటిలోని పిల్లలకోసం కాపలాకాసే కొంగతల్లి తాకతకల పహారా తాళధ్వనుల కాణాచివి, నా చెలికత్తె తల్లివి, ప్రాణేశ్వరివి.

నా కవితా తపోధ్యాన దీక్షాధ్వర జన్మస్థలివి. కృష్ణశాస్త్రిని నాకిచ్చిన మెత్తని తల్లివి. నా నునుమెత్తని గుండెలపైనో తీరాల ఆరీఆరని తడిఇసుకపై మహనీయుల పాదముద్రలు!

అజరామర సాక్షర నిర్నిద్ర మార్గ దీపికల బులును సాంభమూర్తిగారేనా! ఆ మహర్షి ఎవరు? రంగయ్యనాయుడు గారేనా? ఎంత త్యాగధనులబ్బా ! సరస్వతీ గానసభ స్వరూపులు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి గారేనా మరి వీరెవరు? మహనీయా! ఓ గాయక సార్వభౌమా! మునుగంటి వెంకటరాయ మహోదయా! ఎందరెందరు మహాకాంతిపుంజాలు, అందరికి నా హృదయ రసానంద సుమనస్సులు.

వీరు – తెల్లగా పలుచగా గాలిబొమ్మలా మీరా! దురిశేటి శేషగిరిరావు పంతులుగారా! వీధి వీధికీ పేట పేటకీ సౌందర్యం గుత్తులుగా వ్రేలాడగా ఎన్నెన్ని పావన చరిత్రలు. వారా కాళ్లకూరి నారాయణరావుగారు, ధీవిశాలురు. గళసీమలో చింతామణి పద్యాలు మెరపించుకొన్న మహాకవి. జాతిని భ్రష్టుపట్టిస్తున్న వర విక్రయాన్ని తుత్తునియలొనర్చిన కారణజన్ములు ! ఎందరెందరు అమృతధారులు.

కాకినాడా! కవితా కర్పూరమాలా! నా జీవన కళామతల్లీ! జనయిత్రి మామక మహాగాయత్రీ! రాసార్ద్ర పర్వణీ! నీవు నామ్రోల నిలిచేసరికి నేనో పద్యాన్నై ప్రవహిస్తాను. కవితాంబరాన్నై మెరుస్తాను, అందుకే నిన్ను ఇలా కీర్తిస్తాను.

మోహన వేణుగానరవ ముగ్ధ
మనోజ్ఞ కళా కలాపమేదో
హవళించు నామదిని
ఓహరి సాహరిగా నిశాంత వేళా
హృదయోత్సమ్మగును
లాలిత గాన తరంగ మాలికా దోహదమై
దిగంత చిరుతోజ్జ్వల శాఖిగ పల్లవించగా...

(డా॥ ఆవంత్స సోమసుందర్ స్వీయచరిత్ర 2వ భాగం 'పూలు–ముళ్ళు' నుండి సేకరణ.)

ఫలితాన్ని గురించి ఎంత శ్రద్ధ చూపిస్తారో, ఆ ఫలితాన్ని పొందడానికి ఉపయోగించే పద్ధతుల విషయంలో కూడా అంతే శ్రద్ధను పాటించండి.

నివాళి వ్యాసం

నిత్య అధ్యయనశీలి సాధు సుబ్రహ్మణ్యశర్మ

తెలుగు సాహిత్యంతో పరిచయం ఉన్న చాలా మందికి బంకోలా పుస్తకంతో పరిచయం ఉంటుంది. దాని రచయిత సాధు సుబ్రహ్మణ్యం శర్మ గారు 18-07-2025 న చనిపోయారు. చదవడం, చదివించడం ఒకానొక ప్రాథమిక విధిగా పెట్టుకుని, జీవితాంతం సాహిత్య కృషి చేసిన వ్యక్తి శర్మ గారు.

నా చిన్నప్పుడు మా ఊరు ముంగండ వచ్చినప్పుడు నేను అడిగిన అపరిపక్వ సైన్సు సందేహానికి ఓపికగా నవ్వుతూనే సమాధానం చెప్పడం నాకు గుర్తు. అప్పటికి ఆయన బంకోలా రచయిత అని తెలుసు కానీ, రచన గురించి అవగాహన లేదు. బంకోలా కాకుండా ఇంకా రచనలు చేసారు అనే విషయం అసలే తెలియదు.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు, ఉత్తీర్ణత వచ్చిన పిల్లలకి మా చిన్నప్పుడు నగదు రూపంలో బహుమానాలు ఇచ్చేవారు. చాలా మంది, ఆ మాటకొస్తే సాధు సుబ్రహ్మణ్య శర్మ గారు తప్పించి అందరూ ఇదే పని చేసేవారు. ఆయన మాత్రం పుస్తకాలు బహుమానంగా ఇచ్చేవారు. ఎవరు ఎంత నగదు బహుమానం ఇచ్చారో లెక్క పెట్టుకోవడం ఉండేది కానీ శర్మ గారు ఇచ్చిన పుస్తకాల విలువ ఎవరూ లెక్కపెట్టలేదు అనుకుంటా. డబ్బే పరమావధిగా బతికే సమాజానికి ఇది ఒక ప్రతిబింబం. పిల్లలకి అర్థం అవవు, ఇంత ఖరీదు చేసే పుస్తకాలు ఎందుకు అనుకునే పెద్దవాళ్లు, విలువైన పుస్తకాలు బహుమానంగా పొంది, అవి చదవకుండా, క్లాసు పుస్తకాలే జీవితంగా ఉండే పిల్లలు, వెరసి సైన్సుని, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి విస్తృతిగా చదవడం తప్పనిసరి అనే ఎరుక నా మటుకు నా చిన్నప్పుడు సాధు సుబ్రహ్మణ్య శర్మ గారి వల్లనే కలిగింది. ఎవరినో అనుకోవడం ఎందుకు నాకే ఆ కాలానికి పుస్తకాల విలువ తెలియలేదు. అందుకే కదా చిన్నప్పుడు ఆయన నాకు బహుకరించిన నండూరి రామ్మోహనరావు గారి "విశ్వదర్శనం" పుస్తకం దర్శనానికి నోచుకోకుండా చాలా కాలం అలాగే ఉండిపోయింది. అందరి చేతా చదివించాలి అనే ఆయన బలమైన ఆశయమే కాకినాడలో సొంత ఖర్చులతో గ్రంథాలయాన్ని నెలకొల్పేలా చేసింది. ఇది కేవలం గ్రంథాలయమే కాదు, పిల్లల ఆటల కేంద్రం కూడా. ఈ మధ్యనే పని కట్టుకుని ఆయనని కలవడానికి కాకినాడ వెళ్ళాను. అంతకు ముందే మెయిల్ చేసినా రిప్లై రాకపోతే, వయసు రీత్యా చెక్ చేయట్లేదు అనుకుని కాల్ చేశాను. రమ్మన్నారు. తొంభైకి పైగా వయసు, నడవలేని స్థితిలో కూడా నేను పుస్తకాల గురించి మాట్లాడితే ఉత్సాహంగా మాట్లాడారు. "జీవితం చాలా పెద్దది, ఒక సిద్ధాంతానికి పరిమితమవ్వద్దు. విస్తృతంగా తెలుసుకోవాలి" అని చెప్తూ, ఆయన సహాయకురాలితో, "లైబ్రరీకి తీసుకుని వెళ్ళు" అన్నారు. "సాధు మెమోరియల్ మినీ లైబ్రరీ మరియు పిల్లల ఆటల కేంద్రము" అని బోర్డు ఉంది. లోపలకి వెళ్తే రెండు గదుల నిండా పుస్తకాలు. "ఎవరైనా వస్తూ ఉంటారా?" అని లైబ్రేరియన్‌ని అడిగితే,

"తక్కువ అండి. పేపర్ చదవడానికి వస్తూ ఉంటారు" అన్నారు. ఇంత విలువైన గ్రంథాలయాన్ని అందరూ ఉపయోగించుకోకపోడం విషాదమే.

ఐదారు పుస్తకాలు తీసుకుని రిజిస్టర్‌లో నోట్ చేసాను. మళ్ళీ ఆయన ఇంటికి వెళ్ళి, తీసుకున్న పుస్తకాలు చూపించాను. కొంత సేపు వివిధ పుస్తకాల గురించి మాట్లాడారు. ఎక్కువ మాట్లాడలేక ఆక్సిజన్ పెట్టుకుంటున్నారు. ఇబ్బంది పెట్టకూడదు అని, "థాంక్స్ అండి వెళ్తున్నాను" అన్నాను. ఇంతలో సహాయకురాలిని పిలిచి, ఆయన రాసిన పుస్తకాలు ఇమ్మాన్నారు. ఆయనకి చాలా పేరు తెచ్చిన "బంకోల" నవల నా దగ్గర ఉండడంతో మిగితా పుస్తకాలు ఇచ్చారు. అందులో ఒకటి dialects of evolutions systems approach and new frontiers of philosophy. 600 పేజీల పుస్తకం అది. దానికి రెండవ భాగం కూడా రాయవలసింది అండి అంటే, అనుకున్నాను కానీ ఆరోగ్యం సహకరించక కుదరలేదు అన్నారు. ఉద్యోగ రీత్యా ట్రాన్స్‌ఫర్‌లలో ఏ ఊరు వెళ్తే ఆ ఊరులో ఉన్న సెకండ్ హ్యాండ్ బుక్ స్టోర్స్ కి తన పిల్లలని తీసుకుని వెళ్ళి పుస్తకాలు కొనేవాడిని అని గుర్తు చేసుకున్నారు.

ఆయన, తన భార్య హైమవతి గారు ఒకసారి పుస్తక దుకాణానికి వెళ్తే, అక్కడ ఒకాయన ఈయన సాధారణ వేషధారణ చూసి ఇంగ్లీషు చదువురాని వారని భ్రమపడ్డారుట. శర్మ గారు ఇంగ్లీషు పుస్తకాల వైపు చూస్తూ ఉంటే, "అవి ఇంగ్లీషు పుస్తకాలు" అంటూ వెటకారంగా అన్నారుట. దానికి శర్మ గారు "పోనీలేండి ఎవరి చేతైనా చదివించుకుంటాను" అన్నారుట.

ఆయనని కలిసి వచ్చాక కొన్ని రోజులకు నేను ఇదివరకు ఇచ్చిన మెయిల్ కి రిప్లై ఇచ్చారు. You have met me and saw my condition , you can come at any time. We can have a conversation. yous affectionately S S Sarma అని.

మనిషి ఆలోచనల అమరత్వానికి తార్కాణాలు పుస్తకాలు. జీవిత పర్యంతం నిరంతర అధ్యయనం, కొత్త విషయాల పట్ల ఆసక్తి, జిజ్ఞాస సుబ్రహ్మణ్య శర్మ గారిని నడిపించాయి. వ్యక్తులుగా అందరూ చనిపోతారు కానీ మనుషులుగా అందరికీ చావు ఉండదు. వారి జీవితాలు మనిషితనానికి ప్రతీకలు. సాధు సుబ్రహ్మణ్య శర్మ గారు అలాంటి సిసలైన మనిషి. ఆయనకి నివాళులు.

– పవన్, మానవ హక్కుల వేదిక

అంబేద్కర్, వివేకానంద మొదలగు మహానుభావుల ఆశయాల సాధనకే లక్ష్యంగా అనేకమంది మిత్రులతో ఏర్పడిన సహృదయ మిత్రమండలి ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా పనిచేస్తుంది. వ్యసనాన్ని, మూఢనమ్మకాల్ని ఖండిస్తూ శాస్త్రీయ స్పృహను పెంపొందించేందుకు పాటుపడుతుంది.

- పి. కామరాజ్, ఆంగ్ల ఉపాధ్యాయులు

(మహారచయిత శరత్‌చంద్ర చటర్జీ 150వ జయంతి ప్రత్యేక వ్యాసం)



శరత్ కాలీనత

ఎప్పుడో వందేళ్ళు, నూట పాతికేళ్ళ క్రితం రచించినవి. ఇప్పుడెందుకు చదవాలి ? ఎవరో సాహిత్య పరిశోధకులు, సాహిత్యాభిమానులు, పుస్తకాల పురుగులు వగైరాలు వారి అవసరం కొద్ది, లేదా వారి ఆనందం కొద్దీ చదువుకుంటారు. కాని సాధారణ పాఠకులకు శరత్ ఎందుకు అనే ప్రశ్న శరత్‌ను చదవని వారు అనుకోవచ్చు తప్పు లేదు. కాని శరత్, ప్రేమచంద్ వంటి రచయితలు భారతదేశంలోని విభిన్న జాతుల్లో కలసి బతికి ఒకరకంగా ఆ సంస్కృతిని గ్రంధస్తం చేసారు. ఇది నాటి సంస్కృతి కాబట్టి చరిత్ర కోసం సరదాగా చదువు కోవచ్చును. ఇంత గంభీరంగా లోతుగా ఎందుకు ? అంటే శరత్ బ్రతికిన కాలంలో చీకటి రాత్రుల్లో వెన్నెల దోవ చూపేది, ఇవ్వాళ సెల్‌పోన్ టార్చి వెలుతురులో వెన్నెలతో పనేంటి అనే వాళ్ళ గురించే ఈ వ్యాసం. అదీకాక ఈ రచయిత స్పృశించిన మానవ సంబంధాలు, పేదరికం, దాని తాలూకు దైన్యం, కులమత ఆర్థిక అంతరాలు, మానవ సంబంధాల్ని మలిచే తీరుల అభివ్యక్తీకరణలో తేడాలు ఉండొచ్చు... ఉత్తరం బదులు మెసేజ్‌లు ఉండొచ్చు. కాని వాటి మౌలిక స్వభావంలో మార్పు ఇంకా రాలేదు. కాబట్టి అవే భావోద్వేగాలు, అవే మానవ సంక్షుభిత హృదయ కల్లోలాలు సంభవిస్తూనే ఉన్నాయి. అవి అట్లా ఉన్నంత కాలం శరత్ వెన్నెల మన బాటలో కాంతి పరవాల్సిందే...

శరత్ పల్లెటూరిని ప్రేమించినవాడు. కనుకనే పల్లెల్లోని దరిద్రం, అజ్ఞానం, పెడసరం, మూర్ఖత్వం, ఒక అమాయకమయిన జిత్తులమారితనం వంటి వాటిల్లోంచి మానవస్వభావాన్ని దానికి కారణాన్ని కూడా మనముందుచుతాడు. సెల్‌ఫోన్లు గ్రామాలకు చేరినా 'బలగం' వంటి సినిమాల్ని జనం ఆదరించారంటే భౌతిక రూపం చెదిరిపోయినా అంతరాంతరాల్లోని పల్లెతనం అట్లా మిగిలే ఉందని అర్థం. ఆధునిక కాలానికి అన్వయించి 'పల్లి సమాజ్' నవల సినిమా తీస్తే ఈ బలగాలు బలాదూర్. కరువుతో వర్షాభావంలో అల్లాడే జనం గాథల్ని అభిమానాలు ఆదర్శాల కోణం నుండి కూడా రాజీ పడకుండా చూపగలిగాడు. అసూయలు, కార్పణ్యాలు, వాటి నుండి వెలువడే హింసాత్మకతను శరత్ మాదిరిగా సహజంగా చూపగలిగిన రచయితలు బహుకొద్ది. ఈనాటికీ బీహారులోనో, బెంగాలులోనో కాదు, మహారాష్ట్ర, ఆంధ్రాలలోని గ్రామాలను నిశితంగా పరిశీలించితే శరత్ నవలల్లోని వ్యక్తులు మన కళ్ళ ముందు కనబడతారు.

ఇక స్త్రీలు, స్త్రీపురుష సంబంధాల చిత్రీకరణలో లోతయిన, గాఢమయిన భావోద్వేగాల వైచిత్రి సమర్పణలో శరత్‌కు శరత్తే సాటి. శరత్ రచనలన్నింటిలోనూ సామాజిక కట్టుబాట్లు, వివక్షతల వల్ల ఏర్పడిన దుర్భర

పరిస్థితులలో ఎడతెగకుండా సంఘర్షించే స్త్రీలు ఉంటారు. వాళ్ళు కేవలం బాధితులు కాదు. నమూనాలంతకంటే కాదు. వాళ్ళు తమ అనుభవాలరీత్యా మార్పుకు లోనవుతారు. ఆ మార్పు ఒక సిద్ధాంతమో భావజాలమో చెప్పాలి, కాబట్టి మారే 'మూస' వల్ల రాదు. అది "ఇది ఇలాగే జరుగుతుంది" అనిపించు సహజ సాధారణ ఘటనల మామూలుతనం నుండే జరుగుతుంది. Nothing Extra Ordinary. ఈ సాధారణత్వం అనేదే శరత్‌కు సార్వజనీనతను, నిత్య యవ్వనాన్ని ప్రసాదించింది.

శ్రీకాంత్ నవలలోని రాజలక్ష్మి, అభయ, అన్నిదాదీదీ గాని, 'చరిత్రహీనులు' లోని సావిత్రి, కిరణ్మయిలు గాని చెప్పాలంటే ఒక్కొక్క స్త్రీ గురించి ఒక్కో గ్రంథం రాయొచ్చు. రాజలక్ష్మి, సావిత్రులు బాల వితంతువులుగా రకరకాల వంచనలకి గురయ్యి కూడా తమ మనోధైర్యంతో తెలివితో నిలబడతారు. సమాజం తమలో నాటిన భావాలకు లొంగుతూనే వాటిని ప్రతిఘటిస్తూ ఉంటారు. తమ స్వీయ సౌఖ్యం విషయానికొస్తే స్త్రీలు ముఖ్యంగా వితంతువులు సుఖంగా ఉండేందుకు అర్హులు కారనే భావం దేన్నయితే ఈ సమాజం మన నరనరాల్లో ఉగ్గుతో పోసి పెంచుతుందో… దానికి ఛాయామూలంగా లొంగిపోతుంటారు. లేని తమ 'వారి' క్షేమానికి విఘాతం కలిగిన అన్ని కట్టుబాట్లని తృణీకరించి పారేశ్తారు. హిందూ సమాజం వితంతువుల పట్ల తీవ్రమయిన హింస రూపం మార్చుకుని కొనసాగుతూనే వుంది. కిరణ్మయి, శేష ప్రశ్నలో కమలలు విదుషీమణులు. అయితే, మానవ స్పర్శ పొందని కిరణ్మయి తప్పు నిర్ణయాలతో పతనానికి చేరుకుంటే, కమల నిబ్బరంగా జయించుకుపోతుంది. నిర్దిష్టమయిన భావాలు, స్పష్టత, అవగాహనలోని గాఢత తనకేం కావాలో తెలుసు కాబట్టి కమల జయించింది.

కమల అడిగిన ప్రశ్నలు ఈనాటికీ సమాజానికి శేషప్రశ్నలు గానే ఉన్నాయి. స్త్రీ పురుష సంబంధాలు గాలీ వెలుతురు మల్లే సహజం అయిపోవాలంది ఆమె. అంటే ఏమిటి? వావి వరుసలు లేకుండా స్వేచ్ఛాభరిత లైంగిక విశృంఖలతను శరత్ ప్రతిపాదించాడా అంటే ఖచ్చితంగా లేదు. కులమత ఆర్థిక అంతరాలు సాంప్రదాయాల సంకెళ్ళ నుండి బయటపడి యువతీ యువకులు పరస్పర ప్రేమ ఆధారంగా కట్టుబడాలి అని భావం. కనుకనే నీ అంత నిస్సహాయుడిని వదిలేసేంత నిర్దయురాల్ని కాదని అజిత్‌కి కమల హామీ యిస్తుంది. అయితే ప్రేమ సంబంధాన్ని తప్పనిసరి చేస్తే అది సమాధి అవుతుందంటుంది. అంటే ప్రేమ బతకాలంటే ప్రేమకోల్పోయే స్వేచ్ఛ ఉండాలన్నమాట. ఈనాటికీ మనం దీన్ని అర్థం చేసుకోవడానికి తన్నుకులాడుతూనే ఉన్నాం.

దేవదాసు ఆర్థిక అంతరాలు సృష్టించిన విషాదం, విలాసిని మృత్యుంజయలో మరణం, కులం రేపిన విధ్వంసం, విరాజ్ బహు దారిద్ర్యపు కాటుకు బలైన దాంపత్యం, సతీష్ సావిత్రిలా ఎడబాటు సామాజిక కట్టుబాట్ల దురంతలు ఇట్లా చెప్పుకుంటూ పోతే నేరుగా సమాజము, మతము దాని నైతిక కాపలాదారులుగా చెప్పుకునే దురాశపరులైన పెద్ద మనుషుల ప్రక్కన, వారి అదుపులోని స్త్రీ పురుష సంబంధాలు ఒక కథనం. దీనిలోని చిక్కని అల్లికల్లా ఈ కట్టుబాట్లు జీర్ణించుకున్న స్త్రీ పురుషులు తమ ప్రేమను నాశనం చేసుకునే తీరు శరత్ అంత స్పష్టంగా ఎవ్వరూ చెప్పి ఉండరు.

చేయకుండానే చేశాననేవాడు అధముడు, కొద్దిగా చేసి కొండంత చేసానని చెప్పేవాడు గర్వపోతు, ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.

బ్రాహ్మణ పిల్ల ఒక కులానికి ప్రతినిధిగా భావించుకుని ప్రేమను వదులుకుంటుంది. ఆ కులం తనది కాదని తెలిసాక ఆమెకోసం అంతదాక తపించిన ప్రేమికుడు "ఆలోచన"లో పడతాడు. కులం కోసం తనను వదులుకున్నదనే ఆలోచన గలవాడు అదే కులం గురించి ఆమెను తిరస్కరిస్తాడు. బ్రాహ్మణ కులానికి ప్రతినిధి అయిన "మాంసం" ఎగుమతి వ్యాపారదారుడు తన యింట్లో విధవరాలని వాడుకుని నిందవేసి తరిమేస్తాడు. వేరే బాలికను పెళ్ళి చేసుకునే పనిలో ఉంటాడీ కులవృద్ధుడు. సమాజం నుండి బహిష్కరింపబడి "పెళ్ళి కాకుండా స్త్రీలకి జీవితంలో ఇంకేమయినా పని వుందేమో" వెతుకుతుంది ఈ బ్రాహ్మణ పిల్ల. వంచితులంతా ఒకేచోట చేరుతారు.

నల్లగా వుండటం వలన, అందవికారిగా ముద్రపడి పేదరికంతో పెళ్ళికి దూరం అయిన ఆమె, తన తల్లి పుణ్యలోకాలకు పోవడానికి ఏదో ఒక పెళ్లి చేసుకోవడానికి వివశురాలు అవుతుంది. అందము పసిమిఛాయ కంటే ప్రేమించగలిగిన హృదయం సౌమ్యత ఎంత ముఖ్యమో చెప్పిన శరత్ హృదయసౌందర్యానికి ఒక గయ్యాళి అనాకారి, తగవులమారి అయిన స్త్రీ ప్రతీకను ఆశ్చర్యపరుస్తాడు. తెల్లబరిచే పూతలు టన్నులు టన్నులు అమ్ముడవుతున్నంతకాలం ఈ కట్టుతెగిన పిల్ల కథ చదవాల్సిందే కదా!

క్రైస్తవ బాలిక భారతి పూర్వాచార పరాయణుడయిన అపూర్వకు సపర్యలు చేసి చావు నుండి బయటకు తెస్తుంది. కానీ అపూర్వ సందిగ్ధం తీరదు. శరత్ విప్లవకారులు, వారి తాత్వికత గురించి చేసిన చర్చను ప్రక్కన పెడితే ఒక మతం, ఒక ప్రేమను ఎట్లా కాలరాస్తుందో చూడవచ్చు. శరత్ నేరుగా మతాల్ని తిట్టడు. కాని నిత్య జీవితంలో అది చేసే అల్లకల్లోలాల్ని చూపుతాడు. ఆచారాలు, కట్టుబాట్లు, దురాచారాలు, మూర్ఖత్వం ఎట్లా మనిషిని మనిషి కాకుండా చేస్తాయో చూపుతాడు.

అభాగినికి ఒక్కటే కోరిక ముత్తయిదువుగా 'దహనం' చేయబడాలని, కాబట్టి భర్త అఘాయిత్యాలన్ని భరిస్తుంది. అయినా చివరికి దరిద్రం, కులం రెండూ ఆమె స్వర్గాన్ని అడ్డుకుంటాయి. ఆమె యింటి ముందు చెట్టు జమీందారుది, కాబట్టి దహనానికి కట్టెలు లేవు, కొడుకు కట్టుబానిస, తల్లి కోరికకోసం ఏది చేసయినా 'దహనం' చేద్దామంటే అది ఆధిపత్య కులాలను తిరస్కరించడమే, తక్కువ కులం వారికి స్వర్గానికి పోయే వీలులేదు. ఇప్పటికీ అంతే కదా... శ్మశానాలు వేరు వేరు... వారి శవాలు పెద్ద వీధుల్లోకి రాకూడదు. ఒక్కోసారి దహనాల్ని, ఖననాల్ని కూడా జరగనీయరు. అంతదాకా ఎందుకు అణగారిన కులాల వినాయకుడు ముఖ్య వీధిలో నిమజ్జనం, ఊరేగింపు జరిగితే దాడులు జరుగుతాయి. ఏం మారిందో ? వైదిక మతం జనసామాన్యాన్ని అణచడానికి కులాన్ని అస్త్రంగా ఎట్లా చేసుకుందో... అది బలవంతపు బహిరంగ నియంత్రణే కాదు, అంతర్గతంగా ఎట్లా ప్రభావితం చేసి బానిసల్ని చేస్తుందో శరత్ 'అభాగిని స్వర్గం' లో గొప్పగా చిత్రీకరించాడు.

మరొక అద్భుతమైన కథ మహేశుడు. కొండని అద్దంలో చూపినట్టు ఈనాటి దేశాన్ని ఈ కథలో రాశాడు శరత్. ఒక పల్లెలో వంటెద్దు బండి జీవనాధారంగా బతికే నిరుపేద ముస్లిం గఫూర్. అతని దోస్తు మహేశుడు. భూమి లేదు, కాబట్టి మహికి గడ్డి సమస్య. కరువుకాలం, ఆకలితో మహేశుడు ఇతర్ల భూమిలో

చొరబడుతుంటాడు. బ్రాహ్మణ జమీందారు మేత యివ్వడు గాని ఆవును పూజించాలని చెబుతాడు. ఊరి పచ్చికబయళ్ళు జమీందారు ఆక్రమించి ఉంటాడు. గఫూర్ యింటి పైకప్పు గడ్డి పీకి కూడా ఎద్దును మేపుతాడు. కూతురు ఎంతో కష్టపడి దూరం నుండి తెచ్చిన నీళ్ళకుండ దాహంతో పగలగొట్టిన మహేశుడ్ని చూసి గఫూర్ ఆవేశం ఆపుకోలేడు. అంతగా ప్రేమించిన ఆ గొడ్డును ఒక్క దెబ్బ వేస్తాడు అసలే ఆకలిదప్పులతో అలమటిస్తున్న ఆ ప్రాణి చచ్చిపోతుంది. ప్రాయశ్చిత్తంగా అతని యిల్లు పోతుంది. కొరడా దెబ్బలు తింటాడు. చివరికి కూతురితో సహా వద్దు అనుకున్న ఫ్యాక్టరీలో కూలి కోసం వూరు విడిచిపెడతాడు. పశువులు జీవనాధారం చేసుకున్న వారు వాటిని కుటుంబ సభ్యులుగా ప్రేమిస్తారు. పూజించే వారికి అది ఒక వస్తువు. కనికరం ఉండదు. సామాను తాకట్టు పెట్టి దయగల బ్రాహ్మణ జమీందారు బందెల దొడ్డి నుండి విడిపించుకు వచ్చి కసాయికి అమ్మాలనుకుని మళ్ళీ ఆ ప్రక్రియ తల్చుకుని ఎద్దు మీద ప్రేమతో వెనుకంజ వేసిన గఫూర్‌కీ, గోరక్షకుడయినా పిడికెడు గడ్డి యివ్వని జమీందారుకి గల వ్యత్యాసం నేడు గోశాలల్లో గోరక్షకుల్లో చక్కగా కనబడుతుంది. నాడు నేడు ఆవు ఒక అణిచివేత సాధనం, దోపిడీకి మార్గం. కాస్త అటు యిటుగా ఇపుడు ఉత్తర భారతంలో ముస్లిం పాలరైతులు ఇదే స్థితికి నెట్టబడ్డారు. సామాజిక బహిష్కారం, మతం పేరిట రాజకీయ మతంగా నేడు జరగటం దాని కొనసాగింపే...

ఇక పిల్లలు, వాళ్ళ కళ్ళల్లోంచి ప్రపంచాన్ని చూడ్డం కూడా ఒక హృద్యమయిన విషయం. పిల్లలకు అత్యల్పవిషయాలే కుతూహలంతో లీనం కాగలిగే అంశాలు, ప్రశ్నలు వాటికి, వారి నిర్వచనం వేరేరకంగా ఉంటాయి. సిద్ధేశ్వరికి (నివృతిలో)కుడి, ఎడమల ఎవరు పడుకోవాలి? ఇదొక పేద్ద దేశపు ఎల్లలు నిర్ణయించేంత సమస్య. మిగిలిన పిల్లలకి, అట్లాగే రెండు చేపల్లో ఏది ఎవరో రాముడు మాత్రమే (రాముని బుద్ధిమంతతనం) చెప్పగలడు. శ్మశానకాళి రక్షాకాళిల్లో ఎవరి నాలుక పెద్దది? అది గంభీర శాస్త్ర విషయం, దానిపై మల్లయుద్ధం జరగొచ్చు. తర్వాతి క్షణంలో దాన్ని ఆ పిల్లలు విస్మరించి మరో గంభీరమయిన ఆటలో మునిగిపోవచ్చు. వారి స్వచ్ఛత వారి స్వాభిమానం గొప్పగా వర్ణిస్తాడు శరత్. అయితే బాలకార్మికుడయిన గంగాధర్ ఇతరుల తప్పుల్ని ఎట్లా భరించవలసి వస్తుందో ఎన్ని యాతనలు బాల్యం అనుభవిస్తుందో అతి సున్నితంగా శరత్ చెప్పడం గొప్ప పనితనం. ఈ పిల్లలంతా మనచుట్టే ఉన్నారు. కాని వారి బాల్యం గురించి బాల్య చేష్టల మౌలిక స్వభావం గురించే మనకు పట్టదు. వారి బాల్యం లాగేసుకుని, సాంకేతిక గుమాస్తాలుగా మేధావిత్వాన్నిచ్చే పనిలో మనం వున్నాం. ఈ బాల్యం తాలూకు అమాయకత్వాన్ని ప్రేమల్ని ధ్వంసం చేయటం అంటే వారి భావోద్వేగ పరమయిన ఎదుగుదలని కురచబరుస్తున్నాం అన్నమాట. సాంకేతికత ప్రతి సమాజంలో ఉంటుంది. కాని దానికోసం స్వభావం వక్రీకరణం చెందించకూడదు. ఇదే నీతి శరత్ మనకు అన్యాపదేశంగా చెబుతాడు.

అట్లాగే కిశోరశ్రమకు సంబంధించిన అనేక అంశాలను శరత్ రాస్తాడు. ఈనాటి టీనేజీ అత్యంత సంక్లిష్టంగా తయారయినా మోహం, వ్యామోహం, లైంగికాకర్షణల ప్రకృతి లక్షణం కొనసాగక తప్పదు. ఈ ప్రేమల్లో వివిధ దశల్ని శరత్ అతి సుకుమారంగా అభివర్ణించగలడు. టీనేజీ పిల్లలు అర్థం కాక పిల్లలంటే

తల్లిదండ్రుల అదుపు ఆజ్ఞల్లో వుండాలనే శాసనాల్లో బతికే జనాన్ని ఈ కిశోర వయస్సు ఉద్వేగాలు శరత్‌ను చదివినా అర్థం అవుతాయా ?

ఇక చివరగా, శరత్ ఖచ్చితంగా స్త్రీ పక్షపాతి. అయితే వారిలోని గుణదోషాల్ని చూపడంలో అతను అస్సలు వెనుకంజ వేయలేదు. “సతి” కథ మరో గొప్ప విశ్లేషణ. భర్తకు పరమ విధేయురాలయిన పతివ్రతా భార్య, పతి జబ్బుపడితే లేచేవరకు ఉపవాసం చేసిన భార్య, ఎట్లా భర్తను ఊపిరాడకుండా చేసింది? ఊరంతా అతన్ని అదృష్టవంతుడంటారు. అతను మాత్రం తనకు చనిపోతే తప్ప స్వేచ్ఛ లభించదనుకుంటాడు. ఇదే విషయం శేష ప్రశ్నలో కమల ప్రస్తావించిన ప్రేమ సమాధి. ప్రేమ ఒక ఎంపిక లేదా తిరస్కారం లేదా మార్పు, స్వేచ్ఛను కలిగి లేకపోతే అది రెండో జీవిత భాగస్వామికి ఉరిగా మారిపోతుంది. ఈ అబ్సెషన్ లేదా పొసిసివ్‌నెస్ ప్రేమ నుండి ప్రాణం పిండేస్తాయి. ప్రత్యక్ష హింసకు కారణం అవుతాయి. నేటి యాసిడ్ దాడులు, కత్తిపోట్ల వేతనల వెనుక ఈ మానసికత కూడా ఒక కారణం.

మానవ స్వభావంలోని మలుపుల్ని, ప్రేమ సంబంధాల సంక్లిష్టతల్ని, భావోద్వేగాలను నియంత్రించే సామాజిక అంశాల్ని, గిజిగాడి గూడు అల్లినట్లుగా అల్లగలిగే నిపుణుడు శరత్, అతని కాలంలోని లోతుల్ని అతను ప్రతిఫలించాడు కాబట్టే నేటికీ అతను నిలబడగలిగాడు. కనుకనే మార్స్ అండ్ మూన్‌ల మూస ప్రేమలతో బోరెక్కిపోయిన వారయినా, సీరియల్, ఇన్‌స్టాల రీల్స్‌ల రొటీన్‌లతో పిచ్చెక్కిపోయినవారు ఐనా స్వాంతన కావాలనుకుంటే శరత్‌ను చదవాల్సిందే లేదా వినాల్సిందే (ఆడియో బుక్స్).

– దేవి

సాంస్కృతిక కార్యకర్త, హైద్రాబాద్

సహృదయ మిత్ర మండలి.... సుమారు 25 సంవత్సరములుగా పిఠాపురం పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలకు విద్య మరియు వైద్య రంగాలలోనే కాకుండా పబ్లిక్ అవేర్నెస్ కార్యక్రమాలు అనేక అనేక గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సహృదయ మిత్రమండలిలో నేను ఒక భాగం కావడం నా అదృష్టం గా భావిస్తున్నాను.... నేను విద్యార్థి దశ నుండే సహృదయ మిత్రమండలి వారు నిర్వహించే అనేక పోటీలలో పాల్గొని ఎంతోకొంత విజ్ఞానాన్ని నేర్చుకున్నాను... ఇప్పుడు పాఠశాల ఉపాధ్యాయుడిగా సహృదయ మిత్రమండలిలో భాగస్వామ్యం కావడం నాకెంతో స్ఫూర్తినిచ్చే విషయం... అన్ని తరాల వారు ప్రస్తుత కమిటీలో పనిచేయడం మనస్ఫూర్తిగా సమాజం కోసం విలువల కోసం ఆలోచించడం నాకు ఎంతో ఆనందం ఇస్తుంది.... సహృదయులకు, సహృదయ మిత్రమండలి కుటుంబ సభ్యులకు, పేరుపేరునా 25వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ

... మీ **పోలుపర్తి వేణు...** ప్రిన్సిపాల్, భాష్యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, పిఠాపురం.

జననం-మరణం, మంచి-చెడు, జ్ఞానం-అజ్ఞానం వీటి మిశ్రమాన్నే ఎరుక అంటారు.

మన పిల్లల్ని మనమే కాపాడుకోవాలి

అసలు చదువు అంటే ఏమిటి ?
చదువుకు జ్ఞానంకు తేడా ఉన్నదా ....?
రెండూ ఒకటేనా...?
చదువు వచ్చిన వారికి చదువురానివారికి గల వ్యత్యాసాన్ని
మనం ఎలా చూడాలి ?

ఇవన్నీ ఆధునిక సమాజం వేసుకోవాల్సిన మౌలిక ప్రశ్నలు. ఈ ప్రశ్నలు వేసుకోకుండా, సమాధానాన్ని దొరకపుచ్చుకోకుండా మనం మన కాలాన్ని నెట్టేస్తున్నాము. మనం మనకు తెలియకుండానే మన భావితరాలకు (పిల్లలకు) అన్యాయం చేస్తున్నామేమోనన్న బాధ కలుగుతున్నది. మరో ప్రక్క మనం మన పూర్వీకుల నుండి ఏమీ నేర్చుకోక బండగ బ్రతికేస్తున్నామేమోనన్న అనుమానం...? లేక దూసుకువస్తున్న సవాళ్ళను ఎదుర్కోలేక పలాయినవాదులుగా (ఎస్కేపిస్టులుగా) మారిపోతున్నామన్న భయం వేస్తున్నది.

ముందుగా చదువు విషయానికొస్తే, మన విద్యావ్యవస్థ అంతా బ్రిటీష్ వారి మెకాలె విద్యావ్యవస్థ విడిచిపెట్టి వెళ్ళిన బూట్లల్లోనే మనం మన కాళ్ళుపెట్టి నడిచేస్తున్నాం. వారి సామ్రాజ్యవాద దోపిడికి అడుగులకు మడుగులొత్తే గుమస్తా గులాంగిరి (మానసిక బానిసత్వం) చదువువద్దనే మన చదువు ఆగిపోయింది. అంటే కేరీర్ ఓరియెంటెడ్, వ్యక్తిగతమైన స్వీయప్రయోజనం అభివృద్ధి తప్ప, దేశ ప్రయోజనం, సామాజిక హితం, పర్యావరణ పరిరక్షణ మొదలగు దిశానిర్దేశ చదువులు కానరాకుండా పోయాయి.

మన భారతదేశం పేరుకు ప్రజాస్వామ్యం, గణతంత్ర రాజ్యం అయినప్పటికీ, మనిషి స్వేచ్ఛగా, సంపూర్ణంగా, హాయిగా ఎదిగేలా మన విద్యావ్యవస్థ తోడ్పడటం లేదు.

అసలు విద్య పట్ల వ్యక్తికైనా, వ్యవస్థకైనా ఉండవలసిన దృక్పధం (పరస్పెక్టివ్) ఏమిటి ?

విశ్వకవి రవీంద్రుడు, మహాత్మాగాంధీ, కామ్రేడ్ లెనిన్ లేదా గౌతమబుద్ధుడు ఎవరు ఏ రూపంలో చెప్పినా రెండు ముఖ్య విషయాలు గుర్తుపెట్టుకోవాలి.

1. మనిషి సత్యశోధనపై అడుగిడాలి. నిత్యం సత్యాన్ని శోధించాలి, సాధించాలి. అదే ఆచరణలో పెట్టాలి. మానవాళి ప్రగతికి ఇదే ఆధారం. మరో విధమైన అడ్డదారి ఏదీ లేదు.

2. మనిషి నిత్యం స్పృహలో (ఎరుకలో) ఉండాలి. స్థూల ఎరుక, ప్రాపంచిక దృష్టి (ఉదా॥గాజాలో జరుగుతున్న యుద్ధదాడి) సూక్ష్మ ఎరుక, రోజువారి చేసే పనులు, బాధలు, బంధాలు, పోరాటాలు మొదలైనవి సహేతుకంగా తెలుసుకునే జ్ఞానాన్ని చదువు ఇవ్వగలగాలి.

ప్రస్తుతం ఈ రెండూ లేక మన విద్యావ్యవస్థ అగాధంలోకి జారిపోతున్నట్లు ఉన్నది కదూ...

చదువుకూ - జ్ఞానంకు తేడా ఉన్నదా...? అని ప్రశ్నిస్తే... నూటికి తొంభై మంది లేదనే చెప్తున్నారు. ఉపాధ్యాయులతో సహా..

జ్ఞానం ఇంద్రియాలనుండి వస్తుందనే సత్యాన్ని మరచిపోయారు. (నాలెడ్జ్ కేమ్ ఫ్రమ్ సెన్సెస్). జ్ఞానం పుట్టినప్పటినుండి చనిపోయేంతవరకు వస్తూనే ఉంటుంది. కావల్సిందల్లా ఆ జ్ఞాన చక్షువులను (ఇంద్రియాలు- కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం) సమర్థవంతంగా పనిచేసేలా చూసుకోవాలి. జ్ఞానవృద్ధి, వికాసం అలానే జరుగుతుంది. చదువురాని వారికి కూడా ఈ వృద్ధీ, వికాసం లభిస్తుంది. అయితే చదువు ఇంద్రియాలను మరింతగా పదును పెట్టే ఆకురాయి కావాలి.

చదువు అంటే అక్షర జ్ఞానం. (లిటరరీ నాలెడ్జ్) ఒక విధంగా పరోక్ష జ్ఞానం. ఈ పరోక్ష జ్ఞానం ప్రత్యక్ష జ్ఞానంగా అంటే అనుభవ సహితంగా పరిణమించినపుడు మాత్రమే చదువు జ్ఞానంగా మారుతుంది. అంటే చదువు జ్ఞానవృద్ధికి వాహిక తప్ప చదువే జ్ఞానం కాదు. ఈ సూక్ష్మం తెలిసినపుడు చదువును సమర్థవంతంగా ఉపయోగించుకోగలం.

కానీ నేడు చదువు, కెరీర్ ఓరెంటెడ్‌ను (వ్యక్తిగత వృద్ధి- ఉద్యోగం -సంపాదన) పరిమితమై మార్కులు ర్యాంకులు హోరులో కొట్టుకుపోతున్నది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్య ఆయా వ్యవస్థలు అన్ని అదే బాటలో కొట్టుకుపోవడం గమనిస్తున్నాము.

కాగా చదువు వచ్చిన వారికి, చదువు రాని వారికి ప్రధాన వ్యత్యాసం 1.చదవడం, 2. రాయడం.

చదవడం వస్తే పఠన బాష అలవడుతుంది. శిష్ట వ్యాకరణం ఉంటుంది. అందులోనూ మన తెలుగు అజంతా భాష. చక్కగా మాట్లాడటం ఒక కళ. చదువు వలన ఇది సులభ సాధ్యమవుతుంది. అందంగా చదవడం, అర్థవతంగా చదవడం, ఆకర్షణీయంగా చదవడం, నాటకీయ శైలిలో పాత్రోచితంగా చదవడం... ఇవన్నీ దశలు. చదవడంతో పాటు అలా మాట్లాడటమూ వృద్ధి అవుతుంది. చదువుకునే భాష ద్వారా సాహితీ సొబగులు తెలుస్తాయి. మనస్సు విశాలత్వపు లోతుల్లోకి పోయి ఆలోచనా స్థాయిని పెంచుతుంది. లోకంలోని భిన్న స్థితి గతులను వాస్తవిక దృష్టితో అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. మూర్ఖత్వం, మూఢత్వం పెరగకుండా అడ్డుకట్ట వేస్తుంది.

రాయడం వలన మనస్సులో చెలరేగే భావాలకు స్థిరరూపం వస్తుంది. గందరగోళం నుండి స్పష్టత వైపుకు ప్రయాణం సాధ్యమవుతుంది. మనస్సులోని అనుభూతులను సరిగా చెప్పుకోలేక, సరిగా రాయలేకపోవడం వలన మానసిక అనారోగ్యానికి గురౌతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చదువు వచ్చినవారు రాస్తున్న కొద్దీ పరిణతి చెందుతారనేది యదార్థం, చదవడం, రాయడం రాకపోతే, డిగ్రీలు చెంతన ఉన్నా నిరక్షరాస్యులుగానే మిగిలిపోతారు.

ఇప్పుడు చాలామంది విద్యార్థులు టెన్త్, ఇంటర్, ఇంజనీరింగ్ పాస్ అయినా, పట్టుమని పది వాక్యాలు సొంతంగా తప్పులు లేకుండా రాయలేకపోతున్నారు. రోజువారీ వచ్చే చిన్న చిన్న లెక్కలను సైతం చేయలేకపోతున్నారు. ఆ విధంగా వారు పునాది విద్యను (ఎఫ్.ఎల్.ఎన్. - ఫౌండేషన్, లిటరసీ, న్యూమర్సీ) కోల్పోతున్నారు. కొవిడ్ అనంతరం మన విద్యా వ్యవస్థ ఇలా మరింత గందరగోళంలోకి దిగజారిపోయింది. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పద్ధతి వచ్చి ఉపాధ్యాయ బోధనా పద్ధతిని దెబ్బతీస్తున్నది. ముఖేముఖే సరస్వతి, ప్రత్యక్ష చర్చా పద్ధతి (డైలాగ్ డిస్కోర్స్) ఆత్మీయ బోధన మొదలైనవి అటకెక్కుతున్నాయి. చాలా మంది ఉపాధ్యాయులు

ఈ ఒరవడిలో యాంత్రికంగా మారిపోయారు. పిల్లలు– చదువు పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ కాలక్షేపం (టైంపాస్) చేస్తున్నారు. వృత్తి బాధ్యతను విస్మరిస్తున్నారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ఒక సవాలుగా తీసుకుని దానితో జతకట్టి, అంతకంటే మెరుగ్గా పిల్లలకు పాఠాలు ఎలా నేర్పుగా బోధించవచ్చో అతి కొద్దిమంది మాత్రమే గ్రహించి పాటిస్తున్నారు.

ఎ.ఐ. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)ను మనిషి నడుపుతున్నాడా...? లేక మనిషే అందులో–ఎ.ఐ.లో ఇరుక్కుపోతున్నాడా...?అనేది నేటి మిలియన్ డాలర్ల ప్రశ్న. కృత్రిమ మేధస్సును రూపొందించేది, నడిపించేది మనిషే (మానవ మేధస్సు) అన్న సత్యం ప్రతి ఉపాధ్యాయునికి విస్పష్టంగా ఉండాలి.

చిన్నప్పటి నుండి మన విద్యావ్యవస్థలో శాస్త్రీయ ఆలోచన, హేతువాద దృష్టి లోపించడంతో ఉపాధ్యాయులు సైతం గందరగోళంలో చిక్కుకుని మతమౌఢ్యాన్ని నూరిపోస్తున్నారు.

ఒక ప్రక్క మౌఢ్యం (అశాస్త్రీయ అజ్ఞానం), మరోప్రక్క ఆన్‌లైన్ డిజిటల్ యాంత్రికత, ఇంకోప్రక్క అర్థం పర్థంలేని బట్టీ ర్యాంకుల రొడ్డు కొట్టుడు – ఇలా ముప్పేటి దాడిలో నేటి మన విద్యార్థి అచేతనంగా, నిస్సహాయంగా మిగులుతున్నాడు. ఆత్మస్థైర్యం కరువై ఆత్మహత్యలకు చేరువవుతున్నాడు. చదువులా.. చావులా అన్న దుస్థితి దాపురించింది.



దీనికి విరుగుడు ఒక్కటే. అయ్యవారు వచ్చేదాకా అమావాస్య ఆగదు అన్నట్టు, ఎక్కడికక్కడ సృజనశీల శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలి. జీవితం పట్ల ఆశను, అనురక్తిని రేకెత్తించేలా, భవిత పట్ల విశ్వాసం కల్గించేలా పునాది విద్యను గరపాలి. మన పిల్లల్ని మనమే కాపాడుకోవాలి.

-కె.శాంతారావు

రంగస్థల ప్రయోక్త, సామాజికవేత్త – పెడన

సహృదయముతో, సేవా భావముతో, లాభాపేక్ష లేకుండా, సొంత లాభము కొంతమానుకుని పొరుగువారికి తోడ్పడవోయ్, అనే సూక్తిని ఆదర్శముగా చేసుకుని, కొందరు కలసి వుడతా భక్తిగా సేవా భావంతో స్థాపించినదే యీ 'సహృదయ మిత్రమండలి'. 2001లో ప్రారంభించిన యీ సేవా సంస్థకు నన్ను వ్యవస్థాపక గౌరవాధ్యక్షులుగా తోటి సభ్యులు నియమించుకొనుట నాకు సంతోషము మరియు గౌరవ ప్రదముగా భావిస్తున్నాను. అప్పటి కార్యవర్గములో నాకు సహచరులుగా శ్రీ ఎన్. సూర్యనారాయణ గారు అధ్యక్షులుగా, శ్రీ కేవశరావు మాష్టారు జనరల్ శెక్రటరీగా, మిగిలిన సభ్యులందరితో కలిసి శక్త్యానుసారం కార్యక్రమాలను నిర్వహించుట జరిగినది. తదుపరి వయోభారము వలన సొంత బాధ్యతలు వలన, కార్యక్రమములలో ఫిజికల్‌గా పాల్గొనకపోయినా, మానసికముగా పాల్గొనుట జరుగుచున్నది.

ఆరంభ సూరత్వముతో ప్రారంభించి, కొంతకాలము నూతనోత్సాహము చూపించి, తదుపరి చతికిలపడకుండా, నేటివరకు సుమారు 25 సం॥ములు సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవలు చేస్తూ ప్రస్తుతము 'రజతోత్సవము' చేసుకొనుచూ, సావనీరు విడుదల చేయు శుభ సందర్భములో నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుకొనుచున్నాను.

ఇట్లు : **పెండ్యాల చినసూర్యారావు,**(సూరిబాబు)

మనిషి శీల ప్రవర్తనలను తీర్చిదిద్దలేని విద్య విలువ లేనిది.

మహాత్మా పూలే ద్విశత జయంతి విశిష్ట వ్యాసం

ఆధునిక భారతావని తొలి సాంస్కృతికోద్యమ నిర్మాతలు

మహాత్మా జోతిబా, సావిత్రిబాయి పూలె

(సంక్షిప్త జీవిత చరిత్ర)

జోతిబా పూలె మహారాష్ట్రలోని పూనాలో తోటల పెంపకం వృత్తిగాగల కుటుంబంలో 1827లో పుట్టాడు. బ్రాహ్మణులు తప్ప ఇతర కులాల వారికి చదువే అందని సామాజిక వాతావరణంలో ఆయనను తండ్రి ఒక మిషనరీ స్కూలులో చదివించాడు(1834 నుంచి 38వరకు). కొందరు బ్రాహ్మణులు మీవాడికి చదువెందుకు మళ్ళీ మీ పూలతోటల పెంపకం, వ్యాపారమే కదా చేయాలి అని ఆయనను తప్పుదారి పట్టిస్తే మూడు సంవత్సరాల పాటు చదువు మానిపించాడు. కొడుకుతో పనిచేయించాడు. తోటల పెంపకపు పనిని కూడా చాలా శ్రద్ధగా చేసేవాడు జోతిబాపూలె. పదమూడేళ్ల వయసులోనే ఆనాటి ఆచారం ప్రకారం సావిత్రి అనే తొమ్మిదేళ్ళ బాలికతో పెళ్ళి అయింది. తండ్రి తన తప్పు తెలుసుకుని మళ్ళీ పూలెని చదువుకోవడానికి పంపాడు(ఆంగ్ల భాషా విద్యాభ్యాసం 1841 నుంచి 47వరకు). పుట్టుక నుంచి చావు వరకు అడుగడుగునా బ్రాహ్మణాధిపత్యం, వారి ప్రభావం శూద్ర, అతిశూద్ర కులాలకు చెందిన వారి జీవితాలను దుర్భర పరిస్థితులలో కూరుకుపోయేలా చేసిన కాలమది. పంచమకులాలపై అణచివేత, వివక్ష ఇంకా తీవ్రస్థాయిలో ఉండేవి. వారు నీడ పడే సమయాలలో వీధులలో నడవకూడదు. మిగిలిన కాలంలో కూడా ఉమ్మి ఊయడానికి మెడకు ముంత, వారి పాదముద్రలను చెరిపివేయడానికి నడుముకు చీపురుకట్టలాంటి పొడుగాటి ఆకులు కట్టుకుని పోవాలి. పూలె చదువుకున్నా ఆ తర్వాత తండ్రి వృత్తిలోనే కొనసాగాల్సి వచ్చింది. బ్రిటిష్ పాలన వచ్చినా వారి ప్రాపకం పొందిన బ్రాహ్మణుల గుప్పిటలోనే ఉద్యోగాలన్నీ ఉన్న స్థితి.. మరాఠీ, ఇంగ్లీషులలో ఉన్న పుస్తకాలు చదువుతున్న పూలె పాశ్చాత్య దేశాలలో ఉన్న మానవహక్కులు, సగటు జీవుల మెరుగైన జీవన పరిస్థితులను అవగాహన చేసుకుని తమ ప్రాంత పరిస్థితులతో పోల్చుకునేవాడు. బ్రాహ్మణుడైన ఒక స్నేహితుడి వివాహం జోతిబా పూలె జీవితాన్ని మలుపు తిప్పి సామాజిక సంస్కరణ దిశగా ఒక నిర్దిష్టమైన కార్యాచారణకు పురికొల్పింది. శూద్ర, అతిశూద్ర కులాలను దాస్యం నుంచి విముక్తికి జీవితాన్ని అంకితం చేసిన సామాజిక విప్లవకారుడిగా తనను తాను మలుచుకోవడానికి బీజం పడింది ఆ సంఘటనతోనే.

పెళ్ళి ఊరేగింపులో బ్రాహ్మణులు పూలెని తమతో పాటు నడుస్తున్నందుకు దుర్భాషలాడి వెళ్ళగొట్టారు. తీవ్రమైన అవమానభారంతో దు:ఖానికి లోనైన తనని తండ్రి ఓదార్చుతూ, అది ధర్మమే కదా, ఇంకా శిక్షించకుండా వదిలేయడం వాళ్ళ ఔదార్యంగానే భావించమన్నాడు. పీష్వాల కాలంలో అయితే ఎంత పెద్ద శిక్షపడేదో అన్నాడు.

మూఢనమ్మకాలు, కర్మసిద్ధాంతం ఎంతటి మానసిక దాస్యానికి సిద్ధం చేశాయో, జనాభాలో కేవలం ఐదు శాతంగా కల బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, ఆర్థిక దోపిడీని శూద్ర, అతిశూద్ర కులాల ప్రజానీకం చేత ఎలా అంగీకరింపచేశాయో అర్థం చేసుకున్నాడు. అంతకు ముందు చదువుకున్న తన బ్రాహ్మణ మిత్రులలానే తను కూడా రాజకీయ దాస్యానికి వ్యతిరేకంగా పోరాడాలనుకున్నాడు. ఇప్పుడు సాంఘిక దాస్యం నుంచి విముక్తం అయ్యేలా శూద్ర , అతిశూద్ర జాతులను జాగృతం చేయడం తన ప్రథమకర్తవ్యం అనుకున్నాడు. కులం మానవజాతి వికాసానికి హానికరంగా ఉందని, అది పోవాలంటే దాని నుండి లబ్ది పొందుతున్న బ్రాహ్మణ్యం పోవాలని, కులాల వారీ వృత్తులుండడం, వాటిని బట్టి గౌరవాలు పొందడం పోవాలని అందుకు అందరికీ విద్య ఉండాలని భావించాడు. ఆచరణలో పెట్టడానికి సిద్ధమయ్యాడు జోతిబా పూలె. 1848లో జోతిబా పూలె తన స్నేహితుల (ఆ స్నేహితులలో సంస్కరణ వాదులైన బ్రాహ్మణులు కూడా ఉన్నారు. పూనె నగరం రాజకీయ సామాజిక కార్యాచరణకు, సంస్కరణ భావజాలానికి కేంద్రంగా ఉండేది) సహకారంతో బుధవార్ వాడలో నిమ్నజాతి బాలికల కోసం పాఠశాల తెరిచాడు. దేశంలోనే ఒక శూద్రుడు శూద్రుల పిల్లల కోసం తెరిచిన పాఠశాల ఇది. బ్రాహ్మణులు దీనిని విద్రోహచర్యగా భావించారు. ఇలాంటి మార్పును కొనసాగనిస్తే భవిష్యత్‌లో సమాజంలో తామనుభవిస్తూ వస్తున్న ఆధిపత్యాన్ని వదులుకోవాల్సి వస్తుందని, తాము పొందుతున్న అవకాశాలలో పోటీకి వస్తారని, తమ స్థానానికి ముప్పు వస్తుందని భయపడ్డారు. అందుకే మొగ్గలోనే తుంచాలనుకున్నారు. భక్తిపరుడైన అతని తండ్రిని బెదరించారు. ఆడపిల్లలను చదువుకోనివ్వడం మతానికే కళంకమని, మహా పాతకమని అందుకు ఒడిగడుతున్న కొడుకుని, అతనికి సహకరిస్తున్న కోడలిని నిలవరించాలని, వినకపోతే వాళ్ళిద్దరినీ ఇంటినుంచి గెంటేయమని హెచ్చరించారు. వాళ్ళని ఎదిరించలేని తండ్రి పాఠశాలను మూసివేయమని కొడుకుని బతిమాలాడు. జోతిబా అందుకు అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి వెళ్ళగొట్టాడు. బయటికి వచ్చాక బతుకుతెరువు వెతుకులాటలో పాఠశాలను మూసి వేయాల్సి వచ్చింది. పాఠశాల మూతపడిన రోజులలో జోతిబా, అతని స్నేహితులు తమ భార్యలకు చదువుచెప్పడం పై శ్రద్ధ పెట్టారు. సావిత్రి, జోతిబాకు పాఠశాల తెరవడం, నిర్వహణలలో సహకరించిన మిత్రుడు గోవాండె భార్య ఇద్దరూ కొంతకాలం అహ్మద్ నగర్ అమెరికన్ మిషన్ స్కూల్ లో చదువుకున్నారు. ఆర్థికంగా కాస్త కుదుటపడ్డాక గోవాండే సహకారంతో పాఠశాల తెరిచాడు. దళిత ఆడపిల్లలను చెరువులలో నీళ్ళు తాగనిచ్చేవారు కాదు. వాళ్ళ కోసం తాను నీళ్ళు పట్టితెచ్చి పెట్టేవాడు. బడికి వేసుకురావడానికి బట్టలు సమకూర్చాడు. బడి కోసం ఒక మహ్మదీయుడు తన స్థలాన్ని అద్దెకు ఇచ్చాడు. సావిత్రి, జోతిబా స్నేహితులు పాఠాలు చెప్పేవారు. తన మిత్రులను కలుపుకుని ఈ పనులుచేస్తుండేవాడు. వారంతా తర్వాత పేరొందిన సంఘసంస్కర్తలయ్యారు.

రెండేళ్ళు అనుభవం గడించాక మళ్లీ బుధవార్ పేట్ లో ఎనిమిదిమంది బాలికలతో ఇంకో పాఠశాల తెరిచారు. సావిత్రిబాయి పాత పాఠశాలను వదిలి ఈ పాఠశాల నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. వచ్చి వెళ్ళే దారులలో ఆమెకు రక్షణ ఏర్పాటు చేయాల్సి వచ్చేది. పేడ, రాళ్ళు విసిరేవారు. కుళ్ళిన కూరగాయలు విసిరే వారు. ఆమె సంచిలో ఇంకో జత బట్టలు పెట్టుకుని బడికి వచ్చాక మార్చుకునేది. త్వరలోనే బాలికల సంఖ్య 48కి

పెరిగింది. ఇంకొక పాఠశాలను కూడా నడిపారు. విద్యాశాఖ వారి నుంచి పాఠశాలలు నడుపుతున్నందుకు ప్రశంసలు అందుకున్నారు. తమ పూర్వీకులు ఇతర జాతుల వారికి చేసిన అన్యాయాన్ని గుర్తించిన కొందరు బ్రాహ్మణులు జోతిబాకు తమ వేతనాల నుంచి కొంత డబ్బు ఇస్తూ సహకరించారు. ఈ పాఠశాలలకు పిల్లలను పంపిన తండ్రులు, అన్నలు కూడా సమాజం నుంచి వ్యతిరేకత, హేళనలను ఎదుర్కొనవలసి వచ్చింది. బోధనలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలుర పాఠశాలల కంటే ఇవే మెరుగ్గా ఉన్నాయని తనిఖీలు చేసినప్పుడు గమనించారు విద్యాశాఖ అధికారులు. ప్రభుత్వం జోతిబాకు సన్మానం చేసింది.

బ్రిటిష్ అధికారులు కూడా మొదట బ్రాహ్మణులకే చదువుకునే అవకాశం కల్పించేవారు. తమ పరిపాలన కోసం ఉపయోగపడగలరని భావించి. బ్రాహ్మణ వ్యతిరేకతకు జడిసి కూడా వాళ్ళు ఇతరులను చేర్చుకునే ప్రయత్నాలు స్వచ్ఛందంగా చేయలేదు. కానీ క్రమంగా మిగిలిన వారికి కళాశాలలో ప్రవేశం కల్పించినప్పటికీ వారికి చదువు చెప్పడానికి నిరాకరించేవాళ్ళు బ్రాహ్మణ అధ్యాపకులు. ముందుకొచ్చిన వారికి వెలివేతలు, ప్రాయశ్చిత్తాలు ఉండేవి. (అదే విదేశీయులకు సంస్కృతం నేర్పిన వారిని మాత్రం చూసీ చూడనట్లు వదిలేసేవారు. తమకు అనుకూలమైన వారు విదేశీయులైన క్రైస్తవుల విందులకు వెళ్ళినా, వారికి వెలిలేదు. అదే సంస్కరణలకు ప్రయత్నిస్తున్నవారిని మాత్రం ప్రాయశ్చిత్తం పేరుతో ముప్పుతిప్పలు పెట్టేవారు) పూనె హిందూ కళాశాల అందుకు ఉదాహరణ. పెద్దపెద్ద నగరాలన్నిటిలోను సంస్కర్తలు పట్టుబట్టడం వల్ల, న్యాయదృష్టితో కొంతమంది బ్రిటిష్ అధికారులు కూడా ముందుకు వచ్చి బ్రాహ్మణుల నుంచి వస్తున్న వ్యతిరేకతను ఎదుర్కొంటూ క్రమంగా ఇతర జాతుల యువకులకు కళాశాలల్లో చోటు కల్పించడం మొదలుపెట్టారు. కాని రోజూ ముళ్ళమీద నడిచినట్లే, అక్కడి అధ్యాపకుల వివక్షను భరించడం. అందుకే పాఠశాలల్లో ఒక మహర్ కుర్రాడిని జోతిబా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే అతను మానేసేవరకు ఆ పాఠశాలలోకి అడుగు పెట్టమని కూర్చున్నారట. చివరకు అతనే వెళ్ళడం మానుకున్నాడు. 19 శతాబ్దపు దేశ విద్యారంగ చరిత్రలో శూద్రుల, అతిశూద్రుల చదువు కోసం కృషి చేసిన సంస్కర్తగా జోతిబా పేరు నిలిచిపోయింది. ఆయన స్థాపించిన పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య క్రమంగా వందలలోకి చేరింది. ఆడపిల్లలు చదివితే కళ్ళు పోతాయని, పిల్లలు పుట్టరని ఇంకా ఎన్నో మూఢనమ్మకాలను వ్యాప్తి చేశారు. అయినా బాలికలను పాఠశాలలకు రప్పించడం, సౌకర్యాలు కల్పించడం సామాన్యమైన విషయం కాదు. అందుకేనేమో బాలికల పాఠశాల వారు పరీక్షలు రాయడానికి కూర్చుంటే చూడడానికి 3000 మంది వరకు వచ్చారట. దళితుల కోసం పెట్టిన పాఠశాలలో పిల్లలు పరీక్షలకు కూర్చున్నప్పుడు చూడడానికి ఇంకా పెద్ద సంఖ్యలో వచ్చారు. దళిత విద్యార్థుల కోసం పెట్టిన పాఠశాలకు స్థలం, నిధులు మంజూరు చేయమని ప్రభుత్వానికి అర్జీ పెట్టాడు జోతిబా. నిరంతర ప్రయత్నాలతో ఆరు ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. ఈ పాఠశాలల నిర్వహణకు విదేశీయులు పెద్దమొత్తాలలోనే విరాళాలు ఇచ్చారు. వారి పట్ల జోతిబా అతిగా కృతజతతో ఉన్నాడని జాతీయోద్యమ భావనలు కలిగిన వారికి అనిపించడం సహజం. గ్రామాలలో బాలికల కోసం పాఠశాలలు తెరిచారు. మరాఠీలో, గుజరాతీ, పార్శీ పాఠశాలలు కూడా నడిపారు. పాఠశాలల కమిటీల నుంచి తాను తప్పుకుని ఆ

బాధ్యతలను తన సహచరులకు అప్పగించాడు పూలే. పదేళ్ళపాటు నడిపారు. కాలక్రమేణా వాటి బాధ్యతలను ప్రభుత్వం తీసుకుంది. వేలాదిమంది విద్యావంతులయ్యారు.

అప్పటికే జోతిబా వల్ల ఆచారాలు మంటగలిసిపోతున్నాయన్న అసహనాన్ని రేగగొట్టారు. చంపితే వెయ్యి రూపాయలు ఇస్తామని ఆశ చూపించారు కూడా. దానితో ఇద్దరు యువకులు కత్తులు తీసుకుని రాత్రిపూట ఇంట్లోకి చొరబడి జోతిబాపై హత్యాయత్నం చేశారు. ఆ అలికిడికి నిద్ర లేచారు సావిత్రి, జోతిబాలు. "నేను పనిచేస్తున్నదే మీలాంటి వాళ్ళ కోసం .నన్ను చంపితే మీకు లాభం కలుగుతుందనుకుంటే చంపండని" జోతిబా కదలకుండా నిలబడ్డాడు. ఆ తర్వాత ఆ ఇద్దరు యువకులు ఆయనకు ముఖ్యమైన అనుచరులయ్యారు. జోతిబా తన జీవిక కోసం, ఒక మిషనరీ పాఠశాల, విద్యార్థుల కోసం నడుపుతున్న హాస్టల్ వ్యవహారాలు చూసేవాడు. ఒక దర్జీ దుకాణాన్ని నడిపేవాడు. సావిత్రి బాయి వీలున్నప్పుడల్లా బొంతలు కుట్టి అమ్మేది.

ఆరుగాలం పగలూరాత్రి కష్టపడినా కడుపునింపుకోవడమే కష్టమవుతున్న గ్రామీణ ప్రజానీకం కోసం పనిచేయాలనుకున్నాడు జోతిబా. క్రైస్తవమత వ్యాప్తి జరుగుతుంటే దానికి ప్రతిస్పందనగా హిందూ మతంలో కొత్త దేవుళ్ళు పుట్టుకొచ్చారు (సత్యనారాయణ స్వామి) తంతులు మొదలయ్యాయి. పేద రైతులకు కనువిప్పు కలిగించడం కోసం మూఢనమ్మకాలను బ్రాహ్మణులు తమ ఆదాయం కోసం ఎలా వాడుకుంటున్నారో తెలియచేసే నాటకం ఒకటి రాశాడు జోతిబా. బ్రిటిష్ వారు పూర్తిగా దేశాన్ని ఆక్రమించడానికి మతంలో ఉన్న అనైక్యత కారణమని నమ్మినా, వారు అధికారంలో ఉన్నప్పుడే కింది తరగతుల వారు బాగా చదువుకుని దాస్యం నుంచి, బ్రాహ్మణుల ఆధిపత్యం నుంచి బయటపడాలని జోతిబా కోరుకున్నాడు. వారికి బోధించాడు.

ఈ కాలంలోనే సతీసహగమనానికి వ్యతిరేకంగాను, దేవతలకు చిన్నపిల్లలను బలి ఇవ్వడానికి, బాల్యవివాహానికి వ్యతిరేకంగా ఇతర ప్రాంతాలలోని సంస్కర్తలు కృషి చేశారు. జోతిబా కూడా అదే పనిలో ఉన్నాడు. పాశ్చాత్య ప్రపంచంతో సంపర్కంతో చదువుకున్న వాళ్ళు భార్యలుగా రావాలని యువకులు కోరుకోవడంతో కొంత వివాహ వయసు పెరిగింది అమ్మాయిలకు. సహగమనం నిషేధంతో చావు తప్పినా వితంతువుల పరిస్థితి దినదినగండంగానే ఉండేది. కడుపునిండా తిండి, సరైన బట్ట ఇవ్వకపోవడం, గుండు గీయించి మూలకూర్చోబెట్టడం ...ఈ హింస శాస్త్రాల పేరుతో చలామణీ అయ్యేది. బాల వితంతువుల పరిస్థితి మరీ ఘోరం. సనాతన వాదులు, సంస్కర్తల మధ్య తీవ్రమైన వాగ్వివాదాలు జరిగేవి. చివరకు 1856లో వితంతు పునర్వివాహ చట్టం తీసుకొచ్చారు. అయినా సామాజికంగా వారిపై ఉన్న అణచివేత తగ్గలేదు. పైగా వితంతు యువతులు తమ ఇళ్లల్లోని, ఇరుగుపొరుగున ఉన్న కామాంధులకు బలవుతుండేవారు. గర్భవతులవుతుండేవారు. అలా గర్భవతి అయిన ఒక మహిళను చెట్టు తొర్రలో ఉంచి, దానికి మంట అంటించటమే ప్రాయశ్చిత్తమని శంకరాచార్యులు చెప్పాడు. 60 ఏళ్ళ వయసులో కూడా పెళ్ళికి సిద్ధపడే ముసలి బ్రాహ్మణులు తమ ఇంటి ఆడపిల్లలకు వేస్తున్న శిక్షలివి. ఇది అగ్రవర్ణాల సమస్యే అయినా ఈ పరిస్థితి చూసి చలించిపోయాడు జోతిబా. వితంతువులకు, వారికి పుట్టే బిడ్డల కోసం ఆశ్రమం ప్రారంభించాడు జోతిబా. ఈసారి ఎవరి నుంచి నిధులూ తీసుకోలేదు. ప్రసవం కోసం ఇక్కడికి రావచ్చుని, బిడ్డని

వదిలివెళ్ళొచ్చని కరపత్రాలు వేసి పంచారు. ఈ ప్రచారం బ్రాహ్మణులను క్రోధానికి గురిచేసినా ఎన్నో శిశు హత్యలు, భ్రూణహత్యలు జరగకుండా కాపాడింది. వితంతువులు అక్కడ ఆశ్రయం తీసుకుని బిడ్డలను కనివెళ్ళేవారు

అదే సమయంలో జోతిబా తండ్రి జబ్బు పడ్డాడు. ఆయన చివరి రోజులలో జోతిబాను సంతానం కోసం ఇంకో పెళ్ళి చేసుకోమని అడిగాడు. ఆయన అందుకు ఒప్పుకోలేదు. అది నీచమైన పని అన్నాడు. భార్యను అవమానించడమేనన్నాడు. తండ్రి మరణించాక బ్రాహ్మణులతో కర్మ చేయించలేదు. పేదలకు, వికలాంగులకు భోజనం పెట్టాడు. పిండి ముద్దలు చేసి కాకులకు పెట్టాడు. అంతే. తమ ఆశ్రమంలో ఒక వితంతువు కని వదిలిన బిడ్డకు యశ్వంత్ రావు అని పేరు పెట్టి, పూలె దంపతులు పెంచుకున్నారు. వితంతువులకు గుండుగీయడం అనాగరికమని ఒప్పించి క్షురకుల చేత సమ్మె చేయించారు.

చదువుకున్నా, పైకెదిగిపోయి ఆడంబరంగా జీవించాలనుకోకుండా సాదాసీదాగా ఉంటూ సామాన్యులతో, తన వాళ్ళతో కలగలిసి ఉండేవాడు. కావాలనుకుంటే ప్రభుత్వోద్యోగం సంపాదించగలిగి ఉండి కూడా ఆ పనిచేయలేదు జోతిబా. అయితే అప్పటివరకు వస్తున్న డబ్బు ఆశ్రమనిర్వహణకు సరిపోని పరిస్తితి వచ్చినప్పుడు ఇతర ఆదాయమార్గాల కోసం వెతుక్కున్నాడు. అప్పుడే చెరువు తవ్వించే పనిలో ఉంది ప్రభుత్వం. తన స్నేహితుడు యశ్వంత్ పరాంజపే భాగస్వామ్యంలో ఆ చెరువుకు రాళ్ళు సరఫరా చేసే కాంట్రాక్ట్ పని తీసుకున్నాడు. ఈ పని అతని కార్యరంగాన్ని విస్తరింపచేసింది. ప్రభుత్వోద్యోగులైన బ్రాహ్మణ గుమస్తాలు, సూపర్ వైజర్లు రోజంతా పనిచేసినా కడుపునిండని కార్మికుల డబ్బును అవినీతితో మింగడం గమనించాడు. అగ్రవర్ణాల వారు కూలీలతో తమ ఇళ్ళల్లో పనులు చేయించుకునే వాళ్ళు. యూరోపియన్ అధికారులు బ్రాహ్మణ గుమస్తాల మీద వదిలి విందులు వినోదాలతో కాలం గడిపేవారు. పీష్వాల కాలంలో యాచక బ్రాహ్మణులకు డబ్బంతా పంచినట్లే ఇక్కడా డబ్బు దుర్వినియోగమై కార్మికులు దోపిడికి గురవుతున్నారని రాసుకున్నాడు జోతిబా. ఈ స్థితిపై పాటలు కూడా కట్టాడు. మరో కాంట్రాక్ట్ పని కూడా వచ్చిందతనికి. పగలంతా పని, రాత్రుళ్ళు అధ్యయనంతో గడిపాడు. తుకారాం తాత్యా పాడ్యాల్ కులతత్వానికి వ్యతిరేకంగా రాసిన ఒక పుస్తకాన్ని జోతిబా ప్రచురించాడు. అనాధాశ్రమం బాగానే నడుస్తోంది. పూనెలో కూడా వితంతు పునర్వివాహాల కోసం ఒక ఉద్యమం తీసుకురావాలని జోతిబా కోరుకున్నాడు. తన స్నేహితుడు, పాఠశాల కమిటీలో సభ్యుడు విష్ణుశాస్త్రి దానికోసం 1866లో ఒక సంస్థను నెలకొల్పాడు. వీరు చేసిన ఒక వితంతువివాహం మహారాష్ట్రలో పెను సంచలనం కలిగించింది.

బ్రాహ్మణులు కింది కులాల వారిని ఎలా అణచివేస్తున్నారో, మాయ మాటలు చెప్పి వారిని అజ్ఞానంలో ఉంచుతున్నారో తన పాటలలో వారి మనసులకు హత్తుకునేలా చెప్పేవాడు. అందుకు గేయాలను ఒక శక్తివంతమైన సాధనంగా వాడుకున్నాడు జోతిబా. ఆ గేయాలు విశేషమైన ప్రచారం పొందాయి. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులోకి వచ్చాకకూడా బ్రాహ్మణ ఉపాధ్యాయులు కిందికులాల పిల్లలను ఎలా నిరుత్సాహపరిచి, అవమానపరిచి వెళ్ళగొడతారో, తనిఖీ అధికారులు (బ్రాహ్మణులే) కూడా ఆ పిల్లలకు చదువుపట్ల ఆసక్తి లేదంటూ తప్పుడు నివేదికలెలా రాస్తారో వివరించేవాడు తన రచనలలో. ఇప్పటికీ ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల

వరకు అదే వివక్ష, నిరాదరణ కొనసాగడం చూస్తుంటే జోతిబా మాటలకు ఇప్పటికీ ప్రాసంగికత ఉందనిపిస్తోంది. కాకపోతే బ్రాహ్మణుల చోటులో బ్రాహ్మణీయ భావజాలం గల అగ్రవర్ణాలంటే సరిపోతుంది.

ఆయన రాసిన పుస్తకాలలో బ్రాహ్మణ వ్యవస్థ అత్యధికులను దాస్యంలో ఎలా ఉంచగలిగిందో, దాని మూలాలు పురాణాలు, కర్మకాండలలో ఎలా ఉన్నాయో చెబుతూ రాసిన 'గులాంగిరీ' పుస్తకం ముఖ్యమైనది. కులం గురించిన శాస్త్రీయమైన విశ్లేషణ ఇచ్చిన పుస్తకంగా గుర్తిస్తారు దీనిని. ఇంకా షేర్ కార్యాంచ అసూడ్ (సేద్యగాని చర్నాకోల) మధ్యతరగతి చిన్న రైతులు వలసపాలన కాలంలో ఎదుర్కొన్న కడగండ్లను ఆనాటి గవర్నర్ జనరల్‌కు వివరించే పత్రం. రైతుల సామాజికార్థిక చిత్రపటం అది. గ్రామాలలో కరణాలు, షావుకార్లదే పెత్తనం. పంటలో దొంగలెక్కలు వేసి దోచుకునేవారు. పంటలు పండకపోయినా అధిక పన్నులు కట్టించే వాళ్ళు. తమ ఆదాయాలకు మాత్రం లోటులేకుండా చూసుకునేవారు. కింది వర్గాల స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడేవారు కూడా. అక్కడ అంటు లేదు మరి. ఆకలితో మాడుతున్న రైతుల గురించి పట్టించుకోమని విక్టోరియా రాణిని కీర్తిస్తూ పాటలు రాశాడు జోతిబా. ఐదు శాతం ఉన్న బ్రాహ్మణుల చేతిలోనే అన్ని అధికార యంత్రాంగంలో, విద్యావ్యవస్థ, న్యాయవ్యవస్థలలోని అన్ని ఉద్యోగాలు ఉన్నాయని, వాటిలో అన్ని, కులాల వారికి తగినంత అవకాశాలు ఇవ్వాలని కోరాడు. ప్రతి పాఠశాలలో బ్రాహ్మణేతర ఉపాధ్యాయులు ఉండి తీరాలన్నాడు. దీనితో జోతిబా పై కులతత్వవాది అన్న ముద్ర పడింది. మతమౌఢ్యాన్ని, సంఘనీతిని ప్రశ్నించి సాంఘిక న్యాయం, సమానత్వం పదాలు వాడకపోయినా ఆ భావనలను పరిచయం చేసిన తొలి సంస్కర్తగా మనం జోతిబాను చెప్పుకోవచ్చు. దేశమంతటా జాతీయోద్యమ భావాలు ఊపుతున్న కాలంలో జోతిబా సామాజిక విప్లవం దిశగా ప్రతిపాదిస్తున్న అంశాలు ఐక్యతను దెబ్బతీసి క్రైస్తవంవైపో, బ్రిటిష్ ప్రభుత్వ అనుకూల భావనలు పెంచడానికో దారితీస్తాయన్న భయం అతని స్నేహితులైన సంస్కర్తలలో కూడా ఉంది. అందుకే పాఠశాలలో కమిటీలలో పిల్లలకు ఏమి బోధించాలన్న అంశంపై విభేదాలొచ్చాయి వారి మధ్య. అయినా వీలైనంతవరకు కలిసే పనిచేశారన్నది గమనించాలి. నిజానికి క్రైస్తవులు, మహ్మదీయులు, శూద్రులు, బ్రాహ్మణులు, మహర్లు, మాంగ్‌లు అందరూ అన్నదమ్ముల వలె కలిసి ఉండాలని రాశాడు జోతిబా తన పాటలలో. కానీ బ్రాహ్మణులను విమర్శించడమంటే సంఘవిద్రోహమే ఆ చాందసుల, అవకాశ వాదుల దృష్టిలో.

జోతిబా రాసిన మరో గేయ సంపుటి బ్రాహ్మణాంచ కసబ్ (ప్రీస్ట్ క్రాఫ్ట్) . ఇందులో పుట్టిన దగ్గర నుండి చావువరకు తమపై సాంస్కృతికంగా ఆధారపడేలా చేసి, బ్రాహ్మణులు ఆర్థికంగా ఎలా దోచుకుంటారో, భయపెట్టి ఎలా దాస్యంలో ఉంచారో వివరించాడు. పుట్టిన నక్షత్రం చూడడం, కీడు ఉందని పూజలు, శాంతులు చేయించడం, పేరు పెట్టడం, చెవులు కుట్టించడం, అన్ని సందర్భాలలోనూ వసూళ్ళు చేయడం గురించి రాశాడు. పెళ్ళిళ్ళలో వారిచ్చే జాబితాకు అంతే ఉండదు. జాతకాల పేరుతో పెళ్ళిళ్లు కుదర్చడం, చెడగొట్టడం వాళ్ళ చేతిలో పని. డబ్బు ఇస్తే ముహుర్తాలు ముందుకు వెనక్కి జరపడం చిటికెలో పని. గర్భాదానం, ఆడపిల్లను అత్తగారింటికి పంపేటప్పుడు, రోగం బారిన పడినప్పుడు, చనిపోయినప్పుడు శాంతులు, పూజల పేరుతో బ్రాహ్మణులు చెప్పిన

తంతులన్నీ చేసి, వారడిగిన దానాలన్నీ చేసి రైతులు కుంగి, కృశించిపోతున్నారని వివరించాడు జోతిబా. అదే సమయంలో ఆ బ్రాహ్మణులు మాత్రం మద్యం, స్త్రీ లోలతలో మునిగితేలుతున్నారంటాడు. తమ కాలిబొటనవేలు ముంచిన నీటిని రైతులను తాగమంటారని, ఆ స్థాయి మానసిక దాస్యంలోకి నెడుతున్నారని విమర్శించాడు. ఆ ఉచ్చులో పడకుండా మూఢనమ్మకాలు వదిలించుకుని, జీవనస్థాయి పెంచుకోవడానికి ప్రయత్నించాలని చెప్పాడు. గులాంగిరీ పుస్తకం రాసినప్పుడు తన పేరును జోతిబా నుంచి జోతి రావు పూలె గా మార్చుకున్నాడు. బ్రాహ్మణులు బయటినుంచి వచ్చిన వారని, ఇక్కడి క్షత్రియులను అంటే ఇప్పటి శూద్ర, అతిశూద్ర కులాల వారిని కుట్రలతో ఓడించి ఈ భూభాగాన్ని ఆక్రమించారని విశ్లేషించాడు. ఆ తర్వాత వీరందరినీ జాతుల వారీ విడగొట్టి, వృత్తులు కేటాయించారని రాశాడు. తమని భూమి మీద దేవతలుగా అభివర్ణించుకుని పురాణాలు రాశారని, శూద్రుల చేత సేవలు చేయించుకుంటూ అది వాళ్ళ కర్తవ్యమని నమ్మేలా చేశారంటాడు. మతంలోకి కర్మకాండను అపారంగా ప్రవేశపెట్టారంటాడు ఈ పుస్తకంలో. కులవ్యవస్థ, పురోహిత పద్ధతి అన్యాయమైనవని అర్థమయ్యేలా చెప్పగలిగాడు. వీటిని ఆచరింప చేసేందుకు ఒక సంస్థ ద్వారా ఉద్యమించాలనుకున్నాడు. దాని ఫలితమే 'సత్యశోధక్ సమాజ్'. పూనెలో తన అనుయాయులు అరవైమందితో సమావేశమయ్యాడు. దాని మహిళా విభాగానికి సావిత్రి బాయి పూలె నేతృత్వం వహించింది. మానవులంతా దేవుని బిడ్డలు, దేవునికి మానవులకు మధ్య వేరే ఎవరి జోక్యం అక్కర్లేదు అన్న నియమాన్ని అంగీకరించే ఎవరైనా ఇందులో ఉండవచ్చన్న నిబంధన పెట్టారు. కులాలు, మతాలతో సంబంధం లేకుండా.

తమ కార్యాచరణకు కొన్ని అంశాలు రూపొందించుకున్నారు. అవి నిర్బంధ విద్య, స్వదేశీ వస్తువుల వాడకం. అతి తక్కువ ఖర్చుతో వివాహంలాంటి శుభకార్యాలు నిర్వహించడం, మతపరమైన, పురోహిత ప్రాధాన్యాన్ని తగ్గించడం, జ్యోతిషం, జాతకాలు, దయ్యాలు లాంటి మూఢనమ్మకాల నుంచి బయటపడెయ్యడం ప్రధానాంశాలు. విగ్రహారాధన, పురోహిత పద్ధతులపైననే వాళ్ళ ప్రధానమైన దాడి. బ్రహ్మ సమాజం, ప్రార్థన సమాజం కూడా విగ్రహారాధనను వ్యతిరేకించినా అవి ప్రధానంగా పైపై సంస్కరణలనే కోరుకున్నాయి. సమూలమైన మార్పును, సాంఘిక విప్లవాన్ని లక్ష్యంగా చేసుకున్నది మాత్రం సత్యశోధక్ సమాజ్ మాత్రమే.

చదువుకోవడానికి ఉపకారవేతనాలు కోరేవారి దగ్గర దరఖాస్తులు తీసుకుని ఓ పదిమందికి ఇచ్చాడు. ఆ తర్వాత పురోహితుడు లేని పెళ్ళిళ్ళు చేసేపనిలో పడ్డాడు. వరుడు తన దగ్గర పనిచేసే యువకుడు, వధువు సావిత్రి స్నేహితురాలి కూతురు కావడంతో వధువు వైపు వారిని బ్రాహ్మణులు బెదిరించినా ప్రయోజనం లేకపోయింది. కేవలం ఆకు వక్కల ఖర్చుతో మాత్రమే సత్యశోధక్ సమాజ నియమాల ప్రకారం ఆ పెళ్ళి జరిగింది. వధూవరులు ప్రమాణాలు చేశారు. ఆ ప్రమాణాలు జోతిబా రాసినవే. ఇంకొక పెళ్ళి చేయడానికి ప్రయత్నించినప్పుడు వధూవరుల బంధువులను తీవ్రంగా బెదిరించారు బ్రాహ్మణులు. వధువును ఎత్తుకుపోతారేమోనన్న భయంతో ఆమెని జోతిబా సంరక్షణలో ఉంచారు. పోలీసు రక్షణ తీసుకోవాల్సి వచ్చింది. జోతిబా ఇంట్లో మిత్రుల సమక్షంలో ఆ పెళ్ళి హుందాగా నిరాడంబరంగా జరిగింది. మహర్లు, మాంగ్‌లు జోతిబాకు అండగా నిలిచారు.

సత్యశోధక్ సమాజ్ త్వరలోనే రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు విస్తరించింది. ప్రతి ఆదివారం సభ్యులు కూర్చుని మాట్లాడుకునేవారు. పదిహేను రోజులకొకసారి ఉపన్యాసాలలో తర్ఫీదు ఇచ్చేవారు. పాటలు, పద్యాలు సాధన చేసేవారు. మహిళలతో సావిత్రిబాయి సమావేశాలు నిర్వహించేది.

జోతిబాలో సామాజిక కార్యకర్తలందరూ నేర్చుకోవాల్సిన నిర్మాణ సూత్రమొకటి ఉంది. ఏ పదవినీ ఎక్కువకాలం అంటిపెట్టుకుని ఉండేవాడు కాదు. సత్యశోధక్ సమాజ్ ప్రథమ వార్షికోత్సవం నాడు దాని అధ్యక్ష, కోశాధికారి బాధ్యతలను సమర్థులైన తన సహచరులకు అప్పగించాడు. వ్యాసరచన పోటీలు పెట్టేవారు. అవి కూడా సమాజాన్ని అర్థం చేసుకోవాల్సిన అంశాల మీదే ఉండేవి. ఉదాహరణకు ఈ ప్రాంతంలో కరువులెందుకు వస్తున్నాయనే అంశం మీద ఒకసారి పెట్టారు. 1876 లో దక్కను ప్రాంతంలో తీవ్రమైన కరువు ఏర్పడింది. లక్షలాదిమంది చనిపోయారు. ధనిక రైతులు కూడా పట్టణాలకు పనికోసం వలసపోయారు. పిల్లలు పస్తులుండడం చూడలేక జోతిబా విక్టోరియా బాలాశ్రమ్ పేరుతో ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి తన స్నేహితులు, సావిత్రి సహకారంతో రోజూ రెండువేల మంది పిల్లలకు రెండు పూటలా రొట్టెలను పంచాడు. ఈ కార్యక్రమం 1879 వరకు సాగింది.

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు (చెరువు నుంచి తవ్విన కాలవ నీరు వాడకపోవడం) అవలంబించడానికి సిద్ధపడకపోవడంతో తానే కొంత భూమి కొని సాగు మొదలుపెట్టాడు. బంగాళదుంపలు, నారింజ, కాలీఫ్లవర్, చెరకు పండించాడు. మేలురకం విత్తనాలు, పరికరాలు సరఫరా చేయమని ప్రభుత్వాన్ని కోరాడు. తన మిత్రుడు లోఖాండే సంపాదకత్వంలో వస్తున్న 'దీనబంధు' పత్రికలో రైతులనుద్దేశించి అనేక వ్యాసాలు రాసేవాడు. ఊర్లు తిరుగుతూ ఉపన్యాసాలిచ్చేవాడు. అలా వ్యవసాయం మెరుగుపడడానికి తోడ్పడ్డాడు. జోతిబా నేరుగా క్రైస్తవమతాన్ని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని విమర్శించినట్లు కనిపించకపోయినా చివరికి వచ్చేసరికి ఆయన అభిప్రాయాలు మారినట్లనిపించాయి. తన ముఖ్య సహచరులు లోఖాండే, బాలేకర్‌లు బ్రిటిష్ ప్రభుత్వం భారత సంపదను కొలగొట్టడం మీద తీవ్రమైన విమర్శలే చేసేవారు. పాటలు కూడా రాశాడు బాలేకర్. గ్రామీణ జీవనం మెరుగుపడడానికి, మూఢాచారాలు, అంధవిశ్వాసాలు రూపమాపడానికి సత్యశోధక్ ఉద్యమం తోడ్పడింది. అందుకోసం కాలికి బలపం కట్టుకుని రాష్ట్రమంతా తిరిగాడు జోతిబా.

1882లో భారతదేశంలో విద్యారంగ పరిస్థితులను పరిశీలించేందుకు హంటర్ కమిషన్ ను నియమించింది బ్రిటిష్ ప్రభుత్వం. ఫూలె నిర్మొహమాటంగా పేద రైతుల పన్నులతో బ్రాహ్మణులకు విద్యనందిస్తోంది ప్రభుత్వమని చెప్పాడు తను హంటర్‌కు సమర్పించిన నివేదికలో. విస్తృతంగా పాఠశాలలు తెరిచి , అన్ని వర్గాల ఉపాధ్యాయులను తయారుచేసుకుని నియమించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, పేదలకు, మహర్లకు, మాంగ్ లకు విద్య అందని దోషం ప్రభుత్వానిదేనని స్పష్టంగానే చెప్పాడు. సత్యశోధక్ సమాజ్ కార్యకర్తలు లోఖాండె నాయకత్వంలో ముంబయి బట్టల మిల్లులలో కార్మికుల పనిపరిస్థితులలో మెరుగుదల కోసం కూడా కృషి చేశారు.

దళితుల (అప్పటికి ఈ పదం లేదు)లో నాయకులు తయారుకావాలని కోరుకున్నాడు జోతిబా. అందుకే తరచూ వాళ్ళ గ్రామాలకు వెళ్ళి మాట్లాడేవాడు. చురుకైన యువకులకు రాయడం, చదవడం, ఉపన్యసించడం నేర్పించేవాడు. గోపాల్ బాబా వాలంగ్కర్ అలా ఎదిగిన వాడే. తను పత్రికలలో రాసేవాడు. అంటరానితనానికి వ్యతిరేకంగా మహారాష్ట్రలో చాలా ప్రదేశాలు తిరిగి మహర్లను, మాంగ్ లను కూడగట్టేవాడు. గణపతి ఉత్సవాల పేరుతో నిధులు వసూలు ఆడంబరంగా తంతులు నిర్వహించడాన్ని, దానిలో పాల్గొనడానికి అంటరానివారికి అనుమతి లేకపోవడాన్ని ఫూలె వ్యతిరేకించాడు. సత్యశోధక్ సమాజ్‌లో తమ పద్ధతులలో పెళ్ళిళ్ళతో పాటు, ఇతర మతపరమైన విధులు కూడా చేసేవారు. అభిమానంగా తమకు ఇచ్చే డబ్బు బీద విద్యార్థులకు సహాయం చెయ్యడానికి వాడేవారు. బ్రాహ్మణుల నుంచి తీవ్రమైన దాడిని ఎదుర్కొంటూనే చేయాల్సివచ్చేది.

జోతిరావుకు అరవై సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా తన సహచరులు, అభిమానులు పెద్ద ఎత్తున సన్మానం చేసి మహాత్మా అన్న బిరుదును ఇచ్చారు. హాలు పట్టనంతమంది హాజరై తోసుకుంటూ తన కోసం వస్తున్న వారి అభిమానం అతనిని భావోద్వేగానికి గురిచేసింది. సమాజంలో కింది వర్గాల వారంతా కలిసి తమ నాయకుడికి ఇలాంటి బిరుదును ఇచ్చుకోవడం భారతదేశ చరిత్రలో బహుశా అదే ప్రథమం.

యశ్వంత్ ఆయనకు పెంపుడు కొడుకు మాత్రమే కావడంతో పిల్లనివ్వడానికి ఎవ్వరూ ముందుకురాలేదు. తన అనుచరుడు జ్ఞానోబా ససాన్‌ను అడిగాడు జోతిబా. అతను తన కూతురు రాధ వివాహం యశ్వంత్‌తో చేయడానికి ఒప్పుకున్నాడు. సత్యశోధక్ సమాజ్ పనులన్నీ బాలేకర్ చూసుకుంటున్నాడు. జోతిబా ఆరోగ్యం క్రమంగా క్షీణించి 1890లో మరణించాడు. ఆ తర్వాత కూడా సావిత్రి బాయి ఫూలె సత్య శోధక్ సమాజ్ లో చురుకుగానే పనిచేసింది. చివరకు 1896లో తన కొడుకుతో కలిసి ప్లేగు బారిన పడిన దళితులకు సేవ చేస్తూ మరణించింది. చివరి క్షణం వరకు శూద్ర, అతిశూద్ర కులాల పేద ప్రజల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం పోరాడిన, నిర్మాణాత్మకంగా కృషి చేసిన దంపతులు వాళ్ళు. బ్రాహ్మణీయ భావజాలం జీవితాలలోని ప్రతి పార్శ్వాన్ని కమ్ముకున్న కాలంలో, మళ్ళీ సైన్స్ (సూడో) ముసుగులో మూఢనమ్మకాలను, అశాస్త్రీయ విధానాలను మెదళ్ళలోకి, జీవితాలలోకి చొప్పిస్తున్న ఈ కాలంలో ఒక్కసారి ఈ ఇద్దరి కార్యాచరణ మనకు మార్గదర్శి అవుతుంది. సంస్థలను నిర్మించడం, వాటిని తగిన మనుషులకు అప్పగించి, మరింత ఉన్నతమైన మరో పనుల్లోకి వెళ్ళడం, అన్ని విషయాలలో ఏకీభవించకపోయినా ఒక్క అడుగు ముందుకు వేసిన వారిని కూడా వదులుకోకుండా వారికి అవసరమైనప్పుడు పక్కన ఉండడం, ఇవన్నీ నిర్మాణ సూత్రాలే కదా, నేర్చుకోవాలనుకునే వారికి. దాదాపు రెండు శతాబ్దాల క్రితమే భుజం భుజం కలిపి నిత్యం ఎదురీదుతూ ముందుకు నడిచిన ఈ దంపతులు మనకిప్పుడు, ఎప్పుడూ ఆదర్శమే కదా.

–జ్యోతి

జర్నలిస్టు, అనువాదకురాలు, హైద్రాబాద్

వ్యక్తిత్వాన్ని కోల్పోయిన వ్యక్తి తన సర్వస్వాన్ని కోల్పోయినట్లే.

శతవార్షిక సందర్భం



ఇరువురు మహాత్ముల సంభాషణ



మహాత్మా గాంధీ – మహాప్రవక్త నారాయణగురు

గాంధీజీ వైక్కమ్ పర్యటనకి వచ్చినపుడే (1925, మార్చిలో) శ్రీనారాయణ గురుని కలిసేందుకు శివగిరి మఠానికి వచ్చాడు. శివగిరిలో ఎకె గోవిందదాస్, శ్రీ నారాయణ గురు ఉద్యమానికి విరాళంగా ఇచ్చిన ఇంటి ఆవరణలో ఇరువురు నేతల సమావేశం ఏర్పాటు చేయబడింది. ఆ ఇంటిని 'గాంధీజీ ఆశ్రమం' అన్నారు.

శ్రీ నారాయణ గురు నిర్దేశిత సమయానికి ముందే అక్కడికి వచ్చి గాంధీజీ కోసం ఎదురు చూశాడు. ఇద్దరు మహాత్ముల కలయికని చూసేందుకు.. ఆ ప్రదేశంలో పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. సరిగ్గా నిర్దేశిత సమయానికి ఆశ్రమానికి కారు వచ్చింది. మొదట సి. రాజగోపాలాచారి కారు దిగాడు. ఆ తర్వాత గాంధీజీ దిగాడు.

జనం పెద్ద పెట్టున జయజయ ధ్వానాలు చేశారు. గాంధీజీ ముకుళిత హస్తాలతో ప్రజలకి ప్రత్యాభివాదం చేశాడు. ఇంటి ముందే శ్రీ నారాయణ గురు చేతులు చాచి మహాత్ముడిని ఆహ్వానించాడు.

'..స్వామికి ఇంగ్లీషు వస్తుందా, రాదు కదా?..' అని గాంధీజీ సందేహంగా అడిగాడు. స్వామితో ఏ భాషలో ఎలా మాట్లాడాలో స్పష్టత తెచ్చుకునే ఆత్రుత గాంధీజీది.

'మరి గాంధీజీకి మా భాష తెలుసా?..' నారాయణ గురు నవ్వుతూనే భావగర్భితంగా అన్నాడు. (స్వామి ఏమంటున్నాడు? గాంధీజీకి మలయాళం రాదుకదా, అంటున్నాడా? భారతదేశపు ఆధ్యాత్మిక విజ్ఞాన భాండారాన్ని దాచుకున్న సంస్కృతం రాదు కదా, అంటున్నాడా? లేకపోతే ఋషులు అందుకోగలిగిన అద్వైత వేదాంతభాష తెలియదు కదా, అంటున్నాడా? స్వామి ప్రశ్నని ఎలాగైనా వ్యాఖ్యానించవచ్చు!)

ఇంగ్లీషు, హిందీ, గుజరాతీ భాషలు తెలిసిన, మరికొన్ని ఉత్తరాది భాషలతో పరిచయం ఉన్న గాంధీ మహాత్ముడికీ, సంస్కృత, మలయాళ, తమిళ భాషల్లో పండితుడైన శ్రీ నారాయణ గురుదేవుడికీ ఎన్. కుమారన్ దుబాసీగా వ్యవహరించాడు.

నేతలు ఇరువురూ చాపల మీద కూర్చుని సంభాషణ ప్రారంభించారు..

శ్రీ నారాయణ గురు మత శాస్త్రాల్ని లోతుగా అధ్యయనం చేసిన పండితుడని గాంధీజీకి తెలుసు. అందుకే.. అంటరానితనానికి శాస్త్రాల సమ్మతి వుందో స్వామి వంటి – మహనీయుని ముఖతః వెల్లడైతే మంచిదని గాంధీ తలపోశాడు. ..హిందూ శాస్త్రాల్లో అంటరానితనాన్ని పాటించమని చెప్పే ఏదైనా ఆదేశాన్ని స్వామి ఎప్పుడైనా చూశారా?..' అని గాంధీజీ అడిగాడు.

అందరిపట్ల విధేయత కనపరచండి, కానీ, మీ నమ్మకాలకు భిన్నంగా ప్రవర్తించకండి.- గౌతమ బుద్ధుడు

... లేదు..' అని నారాయణ గురు దృఢంగా చెప్పాడు.

గాంధీజీ ఆశించిన సమాధానం అదే. అంటరానితనానికి హిందూ శాస్త్రాల్లో ఎటువంటి సమ్మతి లేదని అందరికీ తెలియాలనేది గాంధీజీ కోర్కె.

ఆ తర్వాత వైక్కమ్‌లో సత్యాగ్రహులు అనుసరిస్తున్న ఎత్తుగడల పట్ల స్వామికి విభేదాలు వున్నాయని ప్రచారమైన విషయాన్ని గురించి గాంధీజీ లేవనెత్తాడు.

'.. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు వైక్కమ్ జరుగుతున్న సత్యాగ్రహానికి సంబంధించి స్వామికి ఏవైనా అభిప్రాయ భేదాలు ఉన్నాయా?..' అని సూటిగా అడిగాడు గాంధీజీ.

'.. లేదు..' మళ్లీ దృఢంగా వచ్చింది సమాధానం.

గాంధీజీకి సంతృప్తి కలిగింది. అయినా.. స్వామికి ఇంకేమైనా అసమ్మతి ఉందేమోనని మహాత్ముడు తెలుసుకోదలచాడు. '.. ఈ ఉద్యమానికి మరేదైనా చేర్చవలసి వుందని కానీ, లేదా ఏదైనా మార్చవలసి వుందని కానీ స్వామి అనుకుంటున్నారా?..' అని అడిగాడు.

'.. అది మంచిగా వెళ్తోందని నాకు సమాచారం ఉంది. ఆ కార్యక్రమంలో ఏదైనా మార్పు అవసరం వుందని నేను అనుకోవట్లేదు..' అని నారాయణ గురు స్థిరంగా చెప్పాడు.

అణగారిన కులాల స్థితిగతుల్లో మార్పు తేవడంలో, అంటరానితనాన్ని నిర్మూలించడం అనేది మొదటి మెట్టు అని గాంధీజీకి అవగాహన వుంది. తర్వాత చెయ్యాల్సింది. చాలా వుంది. ఈ అంశం పైన నారాయణ గురు అభిప్రాయాన్ని గాంధీజీ తెలుసుకోదలచాడు..

..అంటరానితనాన్ని నిర్మూలించడమే కాకుండా అణగారిన ప్రజల స్థితిని మెరుగుపరచేందుకు ఏం చెయ్యాల్సి వుంటుంది?..' అని అడిగాడు గాంధీజీ.

నారాయణ గురు ఈ దిశగా ఇప్పటికే చాలా దూరం ప్రయాణించి వున్నాడు.

గురుదేవుడు నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు... వాళ్లకి విద్య వుండాలి. సంపద వుండాలి. కులాంతర సహపంక్తి భోజనాలూ, కులాంతర వివాహాలూ తక్షణమే అమలు చేయాల్సివుందని నేను అనుకోవట్లేదు. అందరికీ ఉన్నట్టే వాళ్లకీ అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉండాలి..' విప్లవ ప్రవక్త శ్రీ నారాయణ గురు.

గాంధీజీ అంగీకార సూచకంగా తలాడించాడు.

బలప్రయోగాన్నే అయినా.. స్వామి కావాలంటున్నాడేమోననే సందేహం గాంధీజీకి ఇంకా పూర్తిగా తీరలేదు. గతంలో తాను అపార్థపడిన విషయాల మీదే ఆయన మనసులగ్నమై వుంది.

'.. అహింసాయుతమైన సత్యాగ్రహం అనేది ప్రభావశీలమైనది కాదనీ, హక్కుల్ని సాధించుకునేందుకు బలప్రయోగం అవసరమనీ కొందరు అనుకుంటారు కదా. ఈ విషయంలో స్వామి అభిప్రాయమేమిటి?..'

నారాయణ గురు తల అడ్డంగా తిప్పి, '.. బలప్రయోగం మంచిదని నేను భావించను..' అని చెప్పాడు.

గాంధీజీ మనసు తేటపడింది. మనసులో ఎక్కడో ఉన్న పిసరంత అనుమానమూ దూదిపింజెలా తేలిపోయింది.

గాంధీజీ చర్చని కొంచెం ముందుకి తీసుకెళ్లాడు. ..హిందూ స్మృతులు బలప్రయోగాన్ని సమర్థిస్తాయా?..' అని అడిగాడు. '...రాజులకి బలప్రయోగం చేయడం అవసరమని పురాణాల్లో కనిపిస్తుంది. వాళ్లు అలా బలప్రయోగం

చేశారు కూడా. కానీ సామాన్య మానవుడికి బలప్రయోగం ఉచితం కాదు..' అని నారాయణ గురు చెప్పాడు.

గాంధీ- నారాయణ గురు చర్చలో అణగారిన కులాల మతమార్పిడి ప్రతిపాదనల చర్చ కూడా వచ్చింది. మోక్షసాధనకి మతం మారి తీరాల్సిన అవసరమేదీ లేదనీ, అయితే మారే వాళ్లని తప్పు పట్టాల్సిందేమీ లేదనీ నారాయణ గురు వ్యాఖ్యానించాడు.

ఐహిక సమస్యల గురించి స్వేచ్ఛగురించి గాంధీజీ మరొకసారి ప్రస్తావించాడు. అంటరాని తనం, అణగారిన కులాల అభ్యున్నతి గురించి తాము చేస్తున్న పోరాటానికి ఫలితం ఉంటుందని స్వామి భావిస్తున్నాడా లేదా గాంధీజీ తెలుసుకోదలచాడు.

'..మనం ఐహికమైన విముక్తి గురించి పోరాడుతున్నాం. ఈ ప్రయత్నం నిష్ఫలంగా మిగిలిపోతుందా?..' అని గాంధీజీ ప్రశ్నించాడు.

..లేదు. అది ఎన్నటికీ నిష్ఫలంగా మిగలదు. కానీ..' అని నారాయణ గురు నవ్వేశాడు. '..కానీ, ఈ పోరాటం సంపూర్ణంగా విజయం సాధించడానికి మహాత్ముడు మరో జన్మ ఎత్తాలి.. సమస్య అనేది చాలా లోతుగా వేళ్లూనుకుని వుంది మరి..' అన్నాడు నారాయణ గురు.

గురుదేవుడి మాటలకి గాంధీజీ కూడా గట్టిగా నవ్వాడు. '..కానీ, నేను ఇది నా జీవితకాలంలోనే జరుగుతుందని విశ్వసిస్తున్నాను..' అన్నాడు. గాంధీజీ ఆశావాది. అంటరానితనం సమస్య విస్తృతిని గురించి ఆలోచిస్తున్నపుడు, గాంధీజీ వదనం గంభీరంగా మారింది. '..అంటరానితనాన్ని అణగారిన కులాలవారూ పాటిస్తున్నారు..' అన్నాడు.

ఈ మాటలంటున్నపుడు మహాత్ముడి స్వరం బరువైంది.. అంతలోనే తేరుకుని, ...స్వామి నిర్మించిన ఆలయాల్లో అందరికీ ప్రవేశించేందుకు అనుమతి ఉందా?..' అని అడిగాడు గాంధీజీ.

స్వామి కళ్లు మెరిశాయి. '.. అందరికీ ప్రవేశం వుంది..' అన్నాడు. '.. ఇక్కడ శివగిరిలో పులయ, పరయ పిల్లలు మిగతా అందరు పిల్లలతో కలిసే వుంటారు. కలిసే చదువుకుంటారు. అందరితో ప్రార్థనల్లో పాల్గొంటారు..' అని శివగిరి మఠాన్ని గురించి గాంధీజీకి పరిచయం చేశాడు. ఈ మాటలు వినగానే.. గాంధీజీ ఒక్క క్షణం తన్మయంగా కళ్ళు మూసుకున్నాడు. '.. నాకు ఎంతో సంతోషంగా వుంది..' అని గురుదేవుడిని మహాత్ముడు మనసారా అభినందించాడు. వర్ణవ్యవస్థ పైన తొలినాళ్లలో గాంధీజీకి సానుకూలమైన అభిప్రాయం ఉండింది. వర్ణం, కులం వేర్వేరని ఆయన అభిప్రాయం. కులం పోవలసిందేననీ, అయితే వర్ణవ్యవస్థ ఉండొచ్చని ఆయన భావించాడు. అయితే.. ఏ వర్ణమూ, మరో వర్ణం కంటే తక్కువ కాదని గాంధీజీ అభిప్రాయం. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ రెండూ మానవ పురోగతికి ఆటంకాలనీ, అవి కూలిపోవల్సిందేననేది నారాయణగురు నిశ్చితాభిప్రాయం. ("కాల క్రమంలో గాంధీజీ కూడా వర్ణ వ్యవస్థపైన తన కథ వాస్తవ దూరంగా వుందని గమనించుకుని సవరించుకున్నాడనేది వేరే సంగతి..!!)

గాంధీజీ-నారాయణ గురుల మధ్య జరుగుతున్న చర్చ ఉన్నట్టుండి నాటకీయమైన మలుపు తిరిగింది.

గాంధీజీ అక్కడే సమీపంలోని ఒక మామిడి చెట్టుని చూపించి...ఈ చెట్టు ఆకులు వేటికవి భిన్నమైన

ఆకృతుల్లోనూ, రంగుల్లోనూ ఉండటం సహజమైనట్టే, మనుషుల మధ్య కూడా రంగులోనూ, ఆకృతుల్లోనూ తేడా ఉండటం ప్రకృతి సహజమే కదా..' అన్నాడు.

నారాయణ గురు చిరునవ్వు నవ్వాడు. 'నిజమే. కానీ, ఈ ఆకుల మధ్య. ఆకృతుల్లో ఎన్ని తేడాలు ఉన్నా. కోసి రుచి చూస్తే ఒకటే ఉంటుంది. వాటిలోని సారం ఒకటిగానే ఉంటుంది. అలాగే.. మనుషుల మధ్య కూడా దేశాల మధ్య, వాతావరణాల మధ్య ఉన్న తేడాల కారణంగా భౌతికంగా కొన్ని స్థూలమైన భేదాలు ఉండొచ్చు కానీ, మనుషుల్లో ఒకే సారాంశం, ఒకే లక్షణం ఉండటం చూడవచ్చు. అదే మానవత్వం. ఇది అన్ని కులాల మనుషులకీ వర్తిస్తుంది..' అన్నాడు.

నారాయణ గురు, గురుదేవుడి సమాధానం విని, గాంధీజీ ప్రఫుల్ల వదనుడు అయ్యాడు.

స్వామి చెప్పిందాంట్లో, గాంధీజీకి అభ్యంతరమైనదేదీ లేదు. కులం రద్దు కావాలనీ, వర్ణం వుండొచ్చనీ, అయితే ఏ వర్ణమూ మరొక వర్ణం కంటే తక్కువ కాదనీ అప్పటికి గాంధీజీ వైఖరి. కులమూ, వర్ణమూ ఏదీ అవసరం లేదనేది నారాయణ గురు వైఖరి.

ఉన్న మతాల్ని రద్దు చేయమని కాదు, ఆ మతాల్లో ఐక్యతని చూడమనే ఏకత్వమే పైకి భిన్నంగా కనిపిస్తోందని గాంధీజీ చూపిస్తున్నాడు. పైకి కనిపించే భిన్నత్వం వెనక ఏకత్వమే ఉందని నారాయణ గురు చెప్తున్నాడు. సారాంశంలో ఇద్దరూ చెప్పేది ఒకటే.

గాంధీజీ శివగిరి ఆశ్రమంలోనే 2 రోజులు ఉండిపోయాడు.

ఆ సాయంత్రం శారదా మందిరంలో జరిగిన ప్రార్థనా సమావేశంలో గాంధీజీ పాల్గొన్నాడు.

ఆశ్రమంలో 'అంటరాని కులాల పిల్లలు అందరితో కలిసిమెలిసి స్వేచ్ఛగా తిరుగుతూండటం, అన్ని కులాల పిల్లలూ కలిసి వేద సూక్తాల్నీ, ఉపనిషత్ శ్లోకాలనీ, గీతా శ్లోకాలనీ, గాయత్రి తదితర మంత్రాల్నీ శ్రావ్యంగా ఆలపిస్తుంటే.. గాంధీజీ కళ్లనుంచి ఆనందబాష్పాలు రాలాయి. (వేదం పఠించడం మాట అటుంచి.. శూద్రులూ, స్త్రీలూ కనీసం వినడానికి కూడా వీల్లేదనే హేయమైన ఆంక్షలు అత్యంత కఠినంగా అమల్లో వున్న రోజులవి!)

నంబూద్రీలు, నాయర్లు, నాయాదీలు, ఈళవలు, పులయలు కలిసి భక్తిగీతాలు ఆలపిస్తుంటే గాంధీజీ పరవశుడైనాడు. (గాంధీజీ స్వంతంగా నిర్మించిన ఆశ్రమాల్లోనూ ఇలా అన్ని కులాలూ కలిసి.. జీవించే, ప్రార్థనా సమావేశాల్లో పాల్గొనే.. వాతావరణం అప్పటికే.. ఎప్పటినుంచో ఉండింది..!!)

ఆ మర్నాడు ఆశ్రమ ఆవరణలో నిర్వహించిన ఒక భారీ బహిరంగ సభలో గాంధీజీ, శ్రీనారాయణ గురు ఒకే వేదిక పైన ఆశీనులయ్యారు.

గాంధీజీ ఆ వేదిక మీద నుంచే.. శ్రీ నారాయణ గురు అనుయాయులందరికీ ఖాదీకీ, నూలు వడకడానికీ, చేనేతకీ, గ్రామీణ కుటీర పరిశ్రమలకీ ప్రాచుర్యం తీసుకు రావల్సిందిగా అర్థించాడు.

ఆ తర్వాత మాట్లాడిన శ్రీ నారాయణ గురు కూడా, గాంధీజీ బోధించిన ప్రకారం నడుచుకోవాలని ప్రజలందర్నీ కోరాడు. 'శ్రీ నారాయణ ధర్మ పరిపాలనా యోగం' తరఫున గాంధీజీకి సన్మాన పత్రాన్ని సమర్పించారు.

ఈ ప్రపంచం మనిషి అవసరాలను తీర్చగలదు గానీ, కోర్కెలను కాదు. - మహాత్మా గాంధీ

గాంధీజీకీ, నారాయణ గురుదేవుడికీ అభినందనలు తెల్పుతూ సభని ముగించారు.

గాంధీజీ వెళ్లాల్సిన సమయం వచ్చింది.

గురుదేవుడు గాంధీజీ వెంట ఆప్యాయంగా కారువరకూ నడచి వచ్చాడు. గాంధీజీ కారు ఎక్కే ముందు శ్రీ నారాయణ గురు తన స్వహస్తాలతో ఆయన మెడలో గులాబీ పూలదండ వేశాడు. ఒకే లక్ష్యం కోసం భిన్నమైన మార్గాల్లో పోరాడుతున్న ఇరువురు మహాత్ములు, సహ అన్వేషులు, సహయోధులు ఒకరికొకరు ఆత్మీయంగా వీడ్కోలు చెప్పుకున్నారు.

ఆ తర్వాత త్రివేండ్రం (ఇప్పటి తిరువనంతపురం) లో జరిగిన గొప్ప బహిరంగ సభలో గాంధీజీ ఇలా అన్నాడు : ... సుందరమైన తిరువాన్కూరు రాష్ట్రంలో పర్యటించడం, పరమ పూజనీయ ఋషి సత్తములైన శ్రీ నారాయణ గురు గారిని కలునుకోవడం నా జీవితానికి లభించిన మహద్భాగ్యాలని నేను భావిస్తున్నాను. ఆ మహనీయుడి పవిత్ర ఆశ్రమంలో ఒకరోజు ఉండే భాగ్యం నాకు కలిగింది. ఘనత వహించిన మహారాణి వారు కూడా గురుస్వామి వారి గొప్పతనాన్ని గురించి నాతో మాట్లాడారు. ఆ మహానుభావుడు విప్లవ ప్రవక్త శ్రీ నారాయణ గురు మహోన్నత ఆదర్శాలని మీరు అమలు చేస్తారని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను..

శ్రీ నారాయణ గురు అస్తమించినపుడు, ఆయన శిష్యులు గాంధీజీకి అనేక వస్తువులనీ, స్వామి ప్రవచనాల సంకలనాన్ని పంపారు. తాను '.. ఆ మహనీయుడి ప్రవచన సంకలనాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో చదివాన'ని గాంధీజీ ఆ తర్వాత మఠం బాధ్యులకి తెలిపాడు.

శ్రీ నారాయణ గురు అస్తమించాక గాంధీజీ 2 సార్లు శివగిరికి వచ్చాడు.

చివరిగా 1937లో గాంధీజీ కేరళ పర్యటనకి వచ్చినపుడు, ప్రత్యేకంగా మరోసారి శివగిరి మఠాన్ని సందర్శించాడు. ఆశ్రమం బాధ్యులు మహాత్ముడికి సగౌరవంగా స్వాగతం చెప్పారు.

స్వాగత సభలో ఒక వక్త ప్రసంగిస్తూ, శ్రీ నారాయణ గురుని తమ ఈళవ కులంలో పుట్టిన అశోక చక్రవర్తిగా అభివర్ణించాడు. కాస్త సమయం తీసుకుని, శ్రీ నారాయణ గురు బోధనల్ని చదవాలని ఆ వక్త గాంధీజీని కోరాడు. అలా చదివితే, భారత పునర్నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన మరో మహాత్ముడు కూడా ఉన్నాడని గాంధీజీ అర్థం చేసుకోగలుగుతాడని, ఆ వక్త అభిప్రాయం వ్యక్తం చేశాడు. గాంధీజీ తనని తాను మహాత్ముడిగా ఎన్నడూ పరిగణించుకోలేదు. అంగీకరించలేదు. '

మఠం నిర్వాహకుల ఆతిధ్యానికి కృతజ్ఞతలు చెపుతూనే, గాంధీజీ తన మనసులో మాటని బయట పెట్టాడు 'మహాత్ముడనే పిలుపుకి నాకు అర్హత లేదని అంగీకరిస్తున్నాను. ఆ పిలుపు చాలా సార్లు నన్ను ఇబ్బంది పెట్టింది. కొన్నిసార్లు అది నా ముక్కు పుటలకి దుర్గంధంగా సోకింది..

ఇవ్వడానికి నా దగ్గర కొత్త మతం ఏదీ లేదు. వివరించడానికి కొత్త సత్యం ఏదీ లేదు.

నేను వినయపూర్వకంగా చెప్పుకునే నా వృత్తి – పాకీపనే. అక్షరాలా పాకీపనే. ఆధ్యాత్మికంగానూ పాకీపనే. నాకు వీధుల్నీ, కక్కసుల్నీ, మరుగుదొడ్లనీ శుభ్రం చేసే బయటి కళ తెలుసు. నేను నా శక్తంతా ఉపయోగించి, నా

లోపలని కూడా శుభ్రం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. అలా జరిగినప్పుడు నేను సత్యానికి విశ్వాసపాత్రమైన వ్యాఖ్యాతని కాగలుగుతానని, నేను అర్థం చేసుకున్నాను..”

ఆ తర్వాత.. గాంధీజీ మతం విషయంలో తనకీ, నారాయణ గురుకీ ఉన్న అభిప్రాయ సారూప్యత గురించి ఇలా వివరించాడు :

‘..స్వామి బోధనలతో నేను ఏకీభవించే అంశాలు ఎన్నో ఉన్నాయి.

ప్రపంచంలో ఉన్నది ఒకే మతం అని నేను నమ్ముతాను. అది ఒకేఒక బలమైన వృక్షమైనప్పటికీ, ఆ వృక్షానికి ఎన్నో కొమ్మలు ఉన్నాయని కూడా నేను నమ్ముతున్నాను.

ఈ విషయాన్నే స్వామికి నేను చెప్పాలని ప్రయత్నించాను. ఆ విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది.

కొమ్మలన్నీ తమ రసాన్ని ఒకేఒక ఆధారం నుంచి తీసుకున్నట్టే, అన్ని మతాలూ తమ సారాన్ని ఒకే ఒక ఊటనుంచి పొందుతున్నాయి.

సరే, ఒకేఒక మతం ఉంటే, దేవుడు కూడా ఒకేఒక్కడు ఉంటాడు.

పరిపూర్ణుడైన ఏకైక దేవుడికి వేర్వేరు శాఖలు ఉండవు. కానీ ఆయన అదృశ్యుడు. అనిర్వచనీయుడు. అందువల్ల ఎవరైనా ఈ భూమ్మీద ఎంతమంది మనుషులున్నారో ఆ దేవుడికి అన్ని పేర్లు ఉన్నాయని అనవచ్చు. ఏ పేరుతో మనం వర్ణించినా ఆయన ఒక్కడే. అద్వితీయుడు ఆయన.

మనం ఒకేఒక సృష్టికర్త పిల్లలమైనప్పుడు, సహజంగానే ఇక మనలో ఎటువంటి కులాలూ ఉండటానికి వీల్లేదు. మనమంతా ఒకే సహోదరత్వానికి లేదా ఒకే సహోదరిత్వానికి చెందుతాం. అందువల్ల మనలో ఎక్కువతక్కువలనే ఎటువంటి తేడాలూ ఉండటానికి వీల్లేదు. సవర్ణులు ఉండాలి. లేదా అవర్ణులు ఉండాలి. లేదా అంతా సవర్ణులే అయివుండాలి. లేదా అంతా అవర్ణులే అయివుండాలి..

.. కులం అనేది మానవ నిర్మితమైన వ్యవస్థ. అది ధ్వంసానికే అర్హమైనది..’

గాంధీజీ ప్రసంగాన్ని బట్టి ఆ మహనీయులు ఇరువురి మధ్య ఎంతటి ప్రగాఢమైన భావైక్యత ఉండిందో అర్థం చేసుకోవచ్చు.



– ‘విజయ విహారం’ రమణమూర్తి

(‘అద్వైత ఋషి, కులనిర్మూలనా విప్లవ ప్రవక్త శ్రీ నారాయణ గురు’ గ్రంథం నుండి సేకరణ)

మానవ జీవితాన్ని సుసంపన్నం చేసే ఉద్దేశంతో జరిగే ప్రతి ప్రయత్నాన్ని హర్షించవలసిందే. అందుకోసం నడుం కట్టిన ప్రతి ఒక్కరిని ఆహ్వానించవలసిందే. అలా పిఠాపురం కేంద్రంగా పాతికేళ్ల క్రితం మొలకెత్తిన సహృదయ మిత్ర మండలి ఒక మంచి సమాజం కోసం నిలిచింది. శక్తిమేరకు అనేక సృజనాత్మక కార్యక్రమాలు చేపడుతోంది. అలాంటి సంఘాన్ని మనసారా అభినందిస్తున్నాను. రాబోయే కాలంలో మరెన్నో ప్రజాహిత పనులు చేస్తుందని ఆశిస్తున్నాను. **– డా. చెలికాని స్టాలిన్,** రామచంద్రపురం



గాంధీ ఎందుకు మహాత్ముడు

చిన్నపుడు గాంధీ అంటే ఇష్టంలేదనీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ అంటే ఇష్టమని అనేవాడిని. ఒక చెంపమీద కొడితే రెండో చెంప చూపాలని ఫ్రెండ్స్ వెటకారాలాడుకునేవాళ్ళం.

నెమ్మది నెమ్మదిగా తెలుస్తోంది గాంధీ అంటే. అహింస అనే ఆయుధం ఏదో జీవహింస మహా పాపం లాంటి సెంటిమెంటు నుంచి వచ్చింది కాదని, మనకన్నా ఎన్నో రెట్లు బలమైన శత్రువుతో పోరాడే స్ట్రాటజీ అని. చౌరీచౌరా సంఘటనతో ఉద్యమాన్ని ఆపకపోతే ఎంత హింసాకాండ జరిగి ఉండేదో, మరో 22 మంది పోలీసులను చంపేలోపు 22 వేలమంది అమాయకులు చనిపోయేవారు.

స్వాతంత్ర్యం వచ్చాక మనకు మొదటి మిత్రదేశం ఇంగ్లాండేనని ఆయన అనడం మోడెస్టీ మాత్రం కాదు. బ్రిటిష్ వారు మన దేశానికి చేస్తున్న అన్యాయాలపై పోరాటంగాని, వ్యక్తులపై కాదన్నాడు. ఒక రోగి చికిత్సకోసం వస్తే వైద్యుడు రోగానికి వ్యతిరేకంగా చికిత్స చేస్తాడు గాని రోగికి వ్యతిరేకంగా కాదన్నాడు.

ఈ ప్రపంచం పర్యావరణాన్ని ఒక అంతర్జాతీయ అంశంగా 70వ దశకంలో గుర్తిస్తే కొన్ని దశాబ్దాల ముందే 'The Earth has enough resources for our need but not for our greed' అన్నాడు. ప్రతి ఉద్యమంలో స్త్రీలను కలుపుకొన్న తీరు చెబుతోంది ఆయన ఎంత స్త్రీవాదో. అంటరానితన వ్యతిరేకత అందరికీ తెలిసిందే. 2014లో మనకు గుర్తొచ్చిన స్వచ్ఛ భారత్ గురించి 1915 బెనారస్ హిందూ యూనివర్సిటీ సమావేశంలో చెప్పాడు. బెనారస్ వీధులను శుభ్రంగా ఉంచుకోలేని మనం, మనల్ని మనం పరిపాలించుకోగలమా అని అడిగాడు. స్వతంత్ర పోరాటపు ఘట్టాలు ఏవో ఉంటాయి కదా అని My experiments with truth చదివితే అందులో చాలా భాగం పారిశుధ్యం గురించే.

గ్రామ స్వరాజ్య కలలుగన్న గాంధీ మాకు ఆదర్శం అనే రాజకీయ పార్టీలు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళవుతున్నా స్థానిక ప్రభుత్వాలకు ఏమాత్రం అధికారాలు, నిధులు ఇవ్వడం లేదు. ఇపుడు చెబుతున్న minimum government maximum governance అన్న నినాదం బహుసా గాంధీ కోరుకున్న stateless society నుంచి పుట్టినదేనేమో.

సుమారు ఇరవయ్యేళ్ళు కాంగ్రెస్ తోనూ, గాంధీతోనూ విభేదించిన అంబేద్కర్ ను క్యాబినెట్ మంత్రిగా రికమెండ్ చేసాడు. రాజ్యాంగ రచనకు ఐవర్ జెన్నింగ్స్‌ను నెహ్రూ ప్రతిపాదిస్తే గాంధీ అంబేద్కర్ ను ప్రతిపాదించేడు. గాంధీయే లేకపోతే భారతదేశం ఎన్ని విడివిడి దేశాలుగా ఉండేదో. కొట్టుకు చస్తూ ఉండేవాళ్ళం.

సివిల్ సర్వీసు పరీక్షలో 250 మార్కులకు ఉండే ఎథిక్స్ పేపరులో ప్రతి చోట గాంధీనే, రెండేళ్ళకోసారి గాంధీపై ఎస్సే, పేపర్లో వ్యాసం గ్యారంటీ. కారణం గాంధీ ప్రతి అంశంలో మనం పక్కన పెట్టలేని విధంగా

కీలకాంశాలు చెప్పాడు. వినియోగదారుడు అంటే ఎవరు అనే వాక్యాలు చాలా ఆఫీసుల్లో కనిపిస్తూ ఉంటాయి. విద్య మీద ఏ పుస్తకం చదివినా టాగూర్, జిడ్డులకంటే ముందుంటాడు. నయీ తాలీమ్ లో చదువు, పని కలిసే ఉండాలన్నాడు. ఒక పని సరైనదోకాదో అనుమానం వస్తే అత్యంత పేదవాడిని గుర్తుకు తెచ్చుకోమన్నాడు. క్షమించడం బలవంతుల లక్షణం అన్నాడు. కన్నుకు కన్ను సిద్ధాంతం ప్రపంచాన్ని గుడ్డి గా మారుస్తుందన్నాడు.

నెల్సన్ మండేలా, మార్టన్ లూథర్ కింగ్‌ల గురించి చదువుతుంటే తెలుస్తుంది, గాంధీ ఒక అద్భుత పోరాట విధానాన్ని కనిపెట్టాడని. అన్యాయాన్ని సహించకు, పోరాడు అన్నాడు, కాని హింస వద్దన్నాడు. ఈ బేలన్స్ సరిగా చేయగలిగితే, బెర్లిన్ గోడ కూలిపోయినట్టు, యూరోపియన్ యూనియన్ ఏర్పడినట్టు దేశాల సరిహద్దులన్నీ ఏదో ఒకరోజు చెరిగిపోకుండా ఉంటాయా. ఈ దేశాలన్నీ రక్షణ రంగానికి పెడుతున్న ఖర్చు విద్య, ఆరోగ్యాలకు పెడితే పేదరికం అనేది పోకుండా ఉంటుందా.



ఆలోచనలు, మాటలు, చేతలు ఒకటే అయితే అదే గాంధీ.

-జగన్నాథరావు, క్రియ సంస్థ
కాకినాడ

ఆకాశంలో సగం నీవు

ఆకాశంలో సగం నీవు
అనంతకోటి నక్షత్రాల్లో
సగం నీవు సగం నేను
తూర్పు పవన సంగీతంలో
సగం నీవు సగం నేను

మనిద్దరం కలిసి
ఉద్యమిస్తే ఉప్పెన
మనిద్దరం కలిసి
విప్లవిస్తే విజయం
ఆకాశంలో సగం నీవు

విప్లవ పథంలో మనిద్దరం
ఒకరికొకరం బాస చేసుకునేవేళ
విప్లవ పథానికి మనిద్దరం
కలిసి కట్టుగా బాస చేసిన వేళ
త్యాగం మన పేరు
పోరాటం మన ఊరు
ఆకాశంలో సగం నీవు
అనంత కోటి నక్షత్రాల్లో
సగం నీవు సగం నేను
విప్లవాకాశంలో.

(Women are half of the sky : chairman Mao)

- శివసాగర్
డిసెంబర్ 1974



ఒక ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన సాధించదలచుకొన్న ప్రయోజనం నుంచి వెనుకంజ వేయవద్దు - చాణక్యుడు

150వ జయంతి ప్రత్యేక వ్యాసం

అసాధారణ భారతీయ బహుముఖ తాత్వికుడు

ధర్మానంద దామోదర్ కోసంబీ



బరోడా మహారాజు సయాజీరావు. ఆయన అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. ఆ సభలో ఒక వ్యక్తి మాట్లాడుతున్నాడు.

"అశోకుడు తన రాజ్యంలో మద్యాన్ని నిషేధించాడు. కల్లు వలన వచ్చే ఆదాయం ఇంకో దారిలో వస్తే నిషేదిస్తానని అనలేదు. అంత గొప్ప పరిపాలన చేశాడు. అతడే గొప్ప పరిపాలకుడు" అన్నారు.

ఆ అన్నవ్యక్తే ధర్మానంద కోసంబీ. ఆయనతో మాటలు పడ్డ వ్యక్తే మహారాజు సయాజీరావు.

ఆ ఉపన్యాసం జరగడానికి కొద్దికాలం ముందు కొందరు రాయబారానికి రాజుగారి దగ్గరికి వెళ్ళారు. వారందరి వాదం ఒక్కటే 'కల్లు కొట్లు తెరిపించాలి" అనే. దాన్ని సయాజీరావు విన్నాడు. "సరే, కానీండి. కల్లు వల్ల మన ప్రభుత్వానికి ఆదాయం బాగానే వస్తుంది. కల్లు వల్ల వచ్చే ఆదాయంతో మన ప్రభుత్వాన్ని చక్కగా నడపగలం. కానీ... కల్లు మీద వచ్చే ఆదాయాన్ని మించిన ఆదాయం ఏదైనా ఒక సంస్థ ద్వారా వస్తే... అప్పుడు ఈ కల్లుని ఆపేయవచ్చు" అన్నాడు. అలా వారందరికీ చెప్పి పంపాడు. ఈ విషయం కోసంబీ గారికి తెలిసింది. అందుకే ... ఈ విషయాన్ని అశోకుడి మీద మలచి చెప్పాడు.

ఈ విషయం సభికుల్ని ఆలోచనపరచింది. మహారాజు గార్కి కోపం వస్తుందని అందరూ అనుకున్నారు.

సభలో ఏ విషయం మాట్లాడలేదు. ఆ మరునాడు -

"ఈ రోజు నుండి కల్లు దుకాణాలు మూసేయండి" అన్నాడు సయాజీరావు గారు.

నిజం చెప్పడంలో భయం తెలియని వ్యక్తి ధర్మానంద కోసంబీ.

ధర్మానంద కోసంబీ గారి జననం 1876లో అక్టోబర్ తొమ్మిది, గోవాలోని సంఖ్వల్ అనే గ్రామం, పదహారో ఏట వివాహం జరిగింది. తొలి సంతానం కుమార్తె. పేరు మణిక. ఆ తర్వాత ఇంటి నుండి వెళ్ళిపోయారు. 1902లో బౌద్ధ దీక్ష తీసుకున్నారు.

నేపాల్, శ్రీలంక, బర్మాలో గడిపారు. 1906లో కలకత్తా వచ్చి, తిరిగి కాపురం పెట్టారు. 1907 లో కొడుకు పుట్టాడు. ఆ తర్వాత గాంధీ గారి జీవితం గొప్పగా అన్పించింది, సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. 6 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు.

డా॥ అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడానికి ప్రేరణగా నిలిచారు.

వీరు మధ్యలో జైనం వైపుకు ఆకర్షితులయ్యారు. స్వచ్ఛంద మరణం కోరి 'సల్లేఖనం' వ్రతం పూనారు. గాంధీ గారు సూచించడంతో ఆ వ్రతం మానుకున్నారు. బుద్ధ పున్నమి రోజున చనిపోవాలని అనుకున్నారు. కానీ 27 జూన్ 1947 లో నిరాహార దీక్ష చేసి స్వచ్ఛంద మరణం కోరుకున్నారు.

ఓర్పుకు మించిన గొప్ప ప్రార్థన మరొకటి లేదు - గౌతమ బుద్ధుడు

వీరు బౌద్ధం, జైనం మీద 11 రచనలు చేశారు. వాటిలో బౌద్ధం మీద చేసిన కృషి ఎంతో లోతైనది. ప్రామాణికమైనది. కోసంబీ గారి కృషి పాలీ భాషలో అంతా ఇంతా కాదు. త్రిపిటకాలకి మూలమైన పాలీ భాషలో ఎంతో కృషి చేశారు. అధ్యయనం చేశారు. నిష్పక్షపాతంగా ఆలోచించారు. అందుకు తగిన కృషి చేశారు. ఇందులో కోసంబీగారిది మొట్టమొదటి స్థానం అనడం ఆశ్చర్యం కాదు. అనుమానమే లేదు. బౌద్ధ సారాన్ని మూలగ్రంధాల నుండే తీసుకున్నారు.

జైన, బౌద్ధ సంప్రదాయంలో ఆనాటి సామాజిక, ధార్మిక, రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని రచనలు చేశాడు. ముఖ్యంగా బౌద్ధ గ్రంథాలను. ఎన్నెన్ని మర్యాదలు పాటించినా సత్యం మీదే గౌరవం ఎక్కువ. ఏది 'నిజమో' దాన్నే ఆవిష్కరించారు.

కోసంబీ గారికి ప్రజల భాష మీద ఎక్కువ మక్కువ. తాను రాసింది ప్రతీవారికీ అర్థం అయ్యేట్లు చూశాడు. ప్రజల భాషే తన భాషని రాశారు. కోసంబీ గారు తన మాతృభాషలో ఎన్ని రచనలు చేశారో పాలీ భాషలో కూడా అనే రచనలు చేశారు. ముఖ్యంగా, పాలీ భాషలో ఎన్నెన్నో బౌద్ధ మహాగ్రంథాలకు 'టీకా' లు రాశారు. టీకాలు గానీ, ఇతర విషయాలు గానీ అర్థమయ్యేట్లు రాస్తే.. అది అరటిపండు వొలచి నోట్లో పెట్టినట్లుగా ఉంటుంది. అంత అద్భుతం ఆయన రచన.

ధర్మానంద కోసంబీ గారి చదువు ఒక్క పట్టాన సాగలేదు. గోవాలో పుట్టిన వీరికి గోవా ప్రభుత్వం చిన్న పిల్లలకు బడులు ఏర్పాటు చేయలేదు. చిన్నతనంలో కొద్దిగా మరాటీ, కొద్దిగా సంస్కృతం వచ్చాయి. వీరి పసితనం అంతా కొబ్బరి చెట్లకు నీళ్ళు పెట్టడమే.

ఆ రోజుల్లో..."బాలబోధ" అనే మరాఠీ పత్రిక వచ్చేది. అందులో మొట్టమొదటి సాకి భగవాన్ బుద్ధుని జీవిత చరిత్రవేశారు. అది తనని ఎంతగా ప్రభావితం చేసిందో తన జీవిత చరిత్రలో తానే ఇలా చెప్పారు.

"ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎంత కష్టమైనా సరే బుద్ధుని ధర్మోపదేశంతో ఈ జీవితం అర్థవంతమైనదానిగా చేసుకోవాలి. ఆనాడే నా జన్మకు సాఫల్యం అని భావించాను" అన్నారు.

ధర్మానంద కోసంబీకు వయస్సు పెరిగింది. ఒక రోజున కూతురు పుట్టాక... ఇల్లు వదిలి పెట్టాడు. బొంబాయి చేరాడు. అక్కడి 'ప్రార్థనా సమాజం' వారి సాయంతో చదువు సాగించాడు. అక్కడ నుండి పూనాకు బయలుదేరారు. అక్కడ డా॥ భండార్కర్ గారి సహాయం దొరికింది. అక్కడ కొంతకాలం ఉండి గ్వాలియర్‌కు, కాశీలకు వెళ్ళారు. అక్కడ సంస్కృతాన్ని బాగా చదివారు.

సంస్కృతం రావడంతో బౌద్ధ గ్రంథాలను బాగా చదివారు. నేపాల్ వెళ్ళారు. అక్కడి నుండి బుద్ధగయకు వచ్చారు. అక్కడ 'పాలీ లిపి' చదవాలనే పట్టుదల వచ్చింది. అప్పుడు వెంటనే శ్రీలంక బయలుదేరారు.

ఈ యాత్రలో ఆయన పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. అక్కడే బౌద్ధ దీక్ష తీసుకున్నారు. అక్కడ ఆయన గురువు సుమంగళాచార్యులు. అక్కడ నుండి బర్మా వెళ్ళారు. ధ్యాన మార్గం చక్కగా అవపోశన పట్టారు.

ధర్మానంద కోసంబీ తిరిగి భారతదేశం వచ్చారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా, ఆ

తర్వాత మహారాష్ట్రకు వచ్చారు. అప్పుడే బరోడా మహారాజు సయాజీరావు గార్ని కలిశాడు. అక్కడే బౌద్ధ ధర్మం గురించి బోధించారు. అక్కడ జరిగిన సంఘటనే ఈ వ్యాసంలో మొట్టమొదటి సంఘటన.

ఆ తర్వాత బొంబాయి విశ్వవిద్యాలయంలో పాలీభాషా అధ్యాపకునిగా చేరారు.

డా. జేమ్స్ ఉడ్స్ గొప్పపండితుడు. ఆయన మన దేశం వచ్చారు. పాలీ భాషను బాగా తెలిసిన ధర్మానందకు స్నేహం కుదిరింది. ఆయన కోసంబీని అమెరికా తీసుకుపోయారు. ఆరేళ్ళ తర్వాత 'విశుద్ధి మగ్గ' ను పూర్తి చేశారు. ధర్మానంద కోసంబీ కలకత్తా, బరోడా, అహ్మదాబాద్, పూనా, కాశీ, ఇంకా అనేక చోట్ల పనిచేశారు. ఆయన ఎక్కడ చేసినా ఒక్కరా... ఇద్దరా... వందలాది మంది శిష్యులే. అలాగే.... ధర్మానందకు 1929లో రష్యా నుండి షేర్‌బాట్‌స్కీ ఆహ్వానం అందింది. ఒక్క సంవత్సరం ఉండి భారతదేశానికి తిరిగి వచ్చాడు.

1930లో ఆయన దృష్టి స్వాతంత్ర్యం మీదకు మళ్ళింది. 6 సంవత్సరాలు శిక్ష పడింది. ఆ తరువాత కాశీలో మకాం పెట్టాడు. అప్పుడు వచ్చిందే "హిందూ సంస్కృతి ఆది అహింసా" అనే గ్రంథం.

కోసంబీ మాట తడబడదు. నిర్ణయానికి భయం లేదు. బొంబాయిలో పేదసాదలున్న చోటులో ఒక ఆశ్రమం కట్టారు. దాని పేరు 'బహుజన విహారం" అది ఇప్పటికీ అక్కడే ఉంది.

ఒకసారి ధర్మానంద సారనాథ్ వెళ్ళారు. అక్కడ పాలీ విద్వాంశుడు జగదీశ కాశ్యప్‌ను చూశాడు. అతని సాంగత్యం కల్పతరువులా దొరికింది. ఆ తర్వాత కోసంబీ గారు "చతుర్యామ ధర్మం"పై ఒక గ్రంథాన్ని రాశారు. ఇది జైనులది. బౌద్ధం నుండి జైనానికి మళ్ళింది. అప్పుడే మహాత్మా గాంధీ గారి 'సేవాగ్రామం' చేరారు. అక్కడే జైన సాంప్రదాయంతో 1947 జూన్ 24న లోకాన్ని వదిలారు!

గాంధీ గారి మాటల్లో--

"కోసంబీ గారిలా ఉత్తమాటలు చెప్పుకోకుండా ఎంతో నిష్ఠగా పనులు చేసే 'కర్మయోగుల్ని' కనీసం మనం పలకరించం. మన ధర్మానంద కోసంబీ అలాంటి మౌన కర్మయోగి అంటాను.

కోసంబీ గారి రచనలో గొప్పది "బుద్ధ లీలాసార సంగ్రహం" బౌద్ధ సంఘాల పరిచయం 'బోధిసత్వ చర్యావతారం", "దీపిక", "సమాధి మార్గం", "బోధిసత్త్వుడు", "నవనీతం", "హిందూ సంస్కృతి-ఆణి అహింసా", "పార్శ్వనాధుని చతుర్యామ ధర్మం" "భగవాన్ బుద్ధ" ఇవి వీరి గ్రంథాలు.

ఇంకా 'నివేదనం", "ఖులాసా' అనేవి వీరి ఆత్మ చరిత్రలు.

వేదోపనిషత్తుల గురించి ధర్మానంద కోసంబీ వ్యాఖ్య ఇది -

"ఆత్మవాదం, తపశ్చర్య - ఈ రెండింటినీ శ్రమణ సంప్రదాయం నుండి ఉపనిషత్తులు తీసుకున్నాయి. ఇందులో అనుమానమే లేదు. ఆనాడు ఆత్మవాదాన్ని, తపశ్చర్యను వేదాలపై రుద్దడానికి ఉపనిషత్తులు ప్రయత్నించాయి. కానీ, ఈ ఉపనిషత్తులు శ్రమణుల అహింసను మాత్రం ఒప్పుకోలేదు. తమ వైదిక ధర్మానికి భంగం రాకుండా చూసుకున్నాయి."

ఇదీ... వేదాలు, ఉపనిషత్తుల మీద వారి వ్యాఖ్య. ప్రఖ్యాత మార్క్సిస్టు మేధావి, చరిత్రకారుడు డి.డి.కౌశాంబి వీరి కుమారుడే.

- బొర్రా గోవర్ధన్

ప్రఖ్యాత బౌద్ధ రచయిత, బుద్ధభూమి పత్రిక సంపాదకులు

కోపం రావడం మానవ సహజం, అయితే దానిని ఎప్పుడు, ఎక్కడ, ఎవరిమీద ప్రదర్శించాలో తెలుసుకోవడమే విజ్ఞత - అరిస్టాటిల్



100 సంవత్సరాల ఆత్మగౌరవ ఉద్యమం (1925-2025)

ఆత్మగౌరవ ప్రవక్త పెరియార్

2025 సెప్టెంబర్ మొదటి వారంలో బ్రిటన్ లోని ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో The Self-Respect Movement and its Legacies పేరుతో రెండు రోజుల సమావేశం జరిగింది. ఆసియా, ఆఫ్రికా, అమెరికా ఖండాల నుండి 25 దేశాలకు చెందిన చరిత్రకారులు, పరిశోధకులు మేధావులు దీనిలో పాల్గొన్నారు. ఆత్మగౌరవ ఉద్యమానికి నూరేళ్లు నిండిన సందర్భంగా ఈ సమావేశం జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారత, హేతువాదం కోసం పెరియార్ చేసిన పోరాటానికి ఇది ఘనమైన నివాళి. పెరియార్ చేసిన ఆత్మగౌరవ పోరాటానికి, ఆయన సిద్ధాంతాలకు ఇది అంతర్జాతీయ గుర్తింపు.

1)ఎవరు ఈ పెరియార్?

పెరియార్ అసలు పేరు ఇరోడ్ వెంకటప్ప రామస్వామి నాయకర్. 1879 సెప్టెంబర్ 17న మద్రాసులో ఈరోడ్ లో జన్మించారు. నాయకర్ అనే తమిళ నాయకర్, బలిజ కుటుంబానికి చెందిన వ్యాపార కుటుంబం. వారు ఆహార ధాన్యాలు, ఆధ్యాత్మిక వస్తువుల వ్యాపారం చేసేవారు. ఆయన చదువు 5వ తరగతి వరకు మాత్రమే కొనసాగింది. పాఠశాలలో మతపరమైన విద్యను బోధించేటప్పుడు, తార్కికమైన ప్రశ్నలతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేవారు. సంస్కృత పాఠాలు, మతపరమైన పాఠాలు నచ్చక 5వ తరగతిలోనే చదువు ఆపేశారు. తరువాత సొంతంగా పెరియార్ ఇంగ్లీషు, తమిళంలో స్వయంగా చదువుకున్నాడు. 1898లో, 19 సంవత్సరాల వయస్సులో నాగమ్మెను పెరియార్ వివాహం చేసుకున్నాడు.

2)పెరియార్ జీవితాన్ని, ఆలోచనలను ప్రభావితం చేసిన సంఘటన

1904లో ఒక సంఘటన ఆయన ఆలోచనలను మార్చివేసిందని చెప్పవచ్చు. వాస్తవానికి పెరియార్ ఆధ్యాత్మిక చింతన కలవాడు. 1904వ సంవత్సరంలో, ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా కాశీ సందర్శించాడు. ఆ సందర్భంలో తీవ్రమైన ఆకలితో ఆహారం కోసం వెతుకుతున్నాడు. ఆ సమయంలో ఒక సత్రం (చౌల్ట్రీ) వద్ద భోజన సమయం కావడంతో రకరకాల ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయి. చాలా మంది భోజనం చేస్తున్నారు. పెరియార్ కూడా భోజనం కోసం లోపలికి వెళ్లబోయాడు. కానీ అక్కడి నిర్వాహకులు “ఇక్కడ బ్రాహ్మణేతరులకు భోజనం చేసే అనుమతి లేదు” అంటూ ఆయనను బయటికి తోసివేశారు. ఆ సంఘటన పెరియార్ జీవితంలో ఆయన ఆలోచనలలో మార్పుకు కారణమైంది. ఈ కాశీ చౌల్ట్రీ ఘటనతోనే ఆయనలో సామాజిక అసమానతలు, మత అంధ విశ్వాసాలు, కులవివక్షకు వ్యతిరేకంగా తిరుగుబాటు బీజం పడింది.

3) ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభానికి (1925) నేపథ్యం

1919లో గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరంలో అడుగుపెట్టాడు. ఈ సమయంలో ఈరోడ్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. సత్యాగ్రహాలు, సహాయనిరాకరణ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నాడు. కానీ 1922-25 మధ్య జరిగిన కొన్ని సంఘటనలు పెరియార్‌ను జాతీయ కాంగ్రెస్ నుండి బయటకు రావడానికి ప్రేరేపించాయి. అంతేకాక, ఆయనను గాంధీజీకి వ్యతిరేకిగా కూడా మార్చేశాయి. ఈ పరిణామాలే చివరికి 1925లో ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభానికి దారితీశాయి.

1922లో తిరుప్పూరులో మద్రాస్ ప్రావిన్షియల్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. విద్య, ఉద్యోగాలలో కులాల వారీగా రిజర్వేషన్ కల్పించాలని పెరియార్ ఒక తీర్మానం ప్రవేశపెట్టాడు. ప్రతినిధులు వర్గాల వారీగా చీలిపోవడంతో ఈ తీర్మానం విఫలమైంది. దీనిని బట్టి కాంగ్రెస్‌కు సామాజిక సమానత్వంపై స్పష్టమైన దృష్టి లేదని పెరియార్ భావించాడు.

1923లో జరిగిన పాఠశాల సంఘటన కూడా ఆత్మగౌరవ ఉద్యమానికి పునాది వేసింది. ఆయన మున్సిపాలిటీలోని ఒక పాఠశాలలో బ్రాహ్మణేతర విద్యార్థులను తరగతి గదిలో కూర్చోనివ్వకుండా, వారిని వరండాలో మాత్రమే కూర్చోబెట్టేవారు. ఇది చూసిన పెరియార్ తీవ్రంగా వ్యతిరేకించాడు .అసమానతలకు వ్యతిరేకంగా బోధించాల్సిన విద్యాలయాలలోనే విద్యార్థుల మధ్య అసమానతలను పెంపొందించడం సరైనది కాదని పెరియార్ భావించాడు. ఇది కూడా ఆయనను ఆత్మగౌరవ ఉద్యమం వైపు నడిపిన ఒక కారణం.

జాతీయ కాంగ్రెస్ నుండి , గాంధీజీ నుండి పెరియార్ దూరం కావడానికి, 1925లో ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభం కావడానికి ప్రధాన కారణం - వైకోం సత్యాగ్రహం.

వైకోం, ప్రస్తుత కేరళలోని ట్రావన్కోర్ రాష్ట్రంలో ఒక చిన్న పట్టణం. ఇక్కడ ప్రసిద్ధ మహాదేవ దేవాలయం ఉంది. ఈ ఆలయానికి వచ్చే నాలుగు రోడ్లపై ఎఝువా , పులయ వంటి అణగారిన జాతులు నడవకుండా నిషేధం విధించబడింది.దీనికి వ్యతిరేకంగా కేరళలో సామాజిక ఉద్యమకారులు పోరాటం ప్రారంభించారు. ఈ సత్యాగ్రహానికి శ్రీనారాయణ గురు ధర్మపరిపాలన యోగం సభ్యులు టి.కే. మాధవన్, కె. కలప్పన్ నాయకత్వం వహించారు. వీరు కేరళ రాష్ట్రంలో సామాజిక సంస్కరణలకు, విద్యాఉద్యమానికి ఆద్యుడు నారాయణగురు శిష్యులు.

వైకోం సత్యాగ్రహంలో వీరిని జైలులో పెట్టిన తరువాత, జాతీయ కాంగ్రెస్ జోక్యంతో పెరియార్‌ను ఆందోళనకు నాయకత్వం వహింపజేశారు. పెరియార్ అక్కడ ఉద్యమాన్ని బలంగా నడిపించాడు. జైలుకు కూడా వెళ్లాడు. చివరికి 1925లో గాంధీజీ జోక్యంతో రాజీ మార్గం దొరికింది. ఆలయ మార్గాల్లో కొంతమేరకు ప్రవేశం కల్పించబడింది. అయితే, పెరియార్ దీనిని పూర్తి విజయంగా భావించలేదు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే, కానీ అసలు సామాజిక అసమానత సమస్యను పరిష్కరించలేదు. ఆలయానికి

వచ్చే నాలుగు రోడ్లలో మూడింటిని అందరూ నడవడానికి అనుమతించారు. కానీ ప్రధాన వీధిలోకి అణగారిన వర్గాలకు ప్రవేశం లేదు. దీనిని వ్యతిరేకించిన పెరియార్, "సంపూర్ణ ప్రవేశమే డిమాండ్" అని పట్టుబట్టాడు. రాజీ ఫార్ములాను ఆయన తిరస్కరించాడు. ఈ పరిణామాల తరువాత, పెరియార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి 1925లో ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

4)ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభం(1925)

సామాజిక అణచివేత, అసమానతలు, లింగ వివక్ష, మత మూఢాచారాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభించబడింది. ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యాలు:

అస్పృశ్యత నిర్మూలన,దేవాలయాలలో అణగారిన వర్గాల ప్రవేశం, విద్యాఉద్యోగాలలో శూద్రులు, అతి శూద్రులకు ప్రాతినిధ్యం (రిజర్వేషన్), కులాంతర వివాహాలకు ప్రోత్సాహం,బాల్యవివాహాల నిర్మూలన, విధవ పునర్వివాహాలకు ప్రోత్సాహం, మహిళలకు సమాన విద్య, ఆస్తి హక్కుల కోసం ప్రచారం చేసినాడు.

పెరియార్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గళమెత్తాడు. ఆయన మహిళలు ఇష్టపడ్డవారిని వివాహం చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలని బలంగా వాదించాడు. ఆత్మగౌరవ వివాహాలను ప్రోత్సహించినాడు. తన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 'కుది ఆరసు' (Kudi Arasu) అనే పత్రికను ప్రారంభించాడు. తనతో పాటు భార్య నాగమ్మ్మె కూడా ఈ పత్రికలో వ్యాసాలు రాసేవారు. పెరియార్‌తో ఉద్యమంలో భాగస్వామిగా తోడుగా ఉన్నారు.

5) పెరియార్ ఉద్యమస్ఫూర్తి:

పెరియార్ స్ఫూర్తితోనే 1927లో మద్రాసు ప్రెసిడెన్సీలో జస్టిస్ పార్టీ ప్రభుత్వం కులాధారిత రిజర్వేషన్లు తీసుకువచ్చింది. 1927 నవంబర్ 16న జి.ఓ. నంబర్ 613 ద్వారా దేశంలోనే మొదటి కులాధారిత రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి.

ఈ జి.ఓ. ప్రకారం:

బ్రాహ్మణేతర హిందువులకు - 44%   బ్రాహ్మణులకు - 16%
ముస్లింలకు - 16%   ఆంగ్లో-ఇండియన్లు & క్రైస్తవులకు - 16%
షెడ్యూల్డ్ కులాలకు - 8%
రిజర్వేషన్లు కల్పించారు.

1929లో తన పేరులో కులాన్నిసూచించే 'నాయికర్' అన్న పదాన్ని తొలగించి, తాను కేవలం "ఇ.వి. రామస్వామి" అని పిలవబడాలని నిర్ణయించాడు.

1932లో బ్రిటిష్ ప్రభుత్వం దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా రాజకీయ రిజర్వేషన్లు కల్పించింది. గాంధీజీ దీనికి వ్యతిరేకంగా ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంలో పెరియార్, గాంధీజీని తీవ్రంగా విమర్శించి, అంబేద్కర్‌కు బాసటగా నిలిచాడు.

1938లో అంబేద్కర్ మద్రాస్ పర్యటన సమయంలో పెరియార్ ఆయన్ని కలుసుకొని ప్రత్యేక నియోజకవర్గాల డిమాండ్‌కు తన మద్దతు తెలిపాడు.

1940లో జస్టిస్ పార్టీకి పెరియార్ నాయకత్వం వహించాడు.

1944లో జస్టిస్ పార్టీని ద్రావిడర్ కజగమ్ (DK) గా మార్చాడు.

6) పెరియార్ తన కన్నకూతురిని పెళ్లిచేసుకున్నాడా?

పెరియార్ మొదటి భార్య నాగమ్మై. వీరి వివాహం 1898లో జరిగింది. ఈ దంపతులకు ఒక కూతురు పుట్టింది, కానీ చిన్న వయస్సులోనే ఆమె మరణించింది. 1933లో నాగమ్మై మరణించింది. పెరియార్ దంపతులకు ఎటువంటి సంతానం లేరు. ఆయన ఎవరినీ దత్తత కూడా తీసుకోలేదు. 1948లో, పెరియార్ తన అనుచరురాలు మణియమ్మైని వివాహం చేసుకున్నారు.

ఆ సమయంలో పెరియార్ వయసు 69 సంవత్సరాలు, మణియమ్మై వయసు 31 సంవత్సరాలు. ఇది ఒక కులాంతర వివాహం మరియు విధవా పునర్వివాహం. ఈ వివాహం వ్యక్తిగత సుఖం కోసం కాదని, తన మరణానంతరం ఆత్మగౌరవ ఉద్యమం నిరాటంకంగా కొనసాగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నానని పెరియార్ స్వయంగా చెప్పాడు. ఈ వివాహం వ్యక్తిగత స్వార్థం కోసం కాదు, ఇది ఒక సామాజిక బాధ్యతతో కూడుకున్న చర్య అని పెరియార్ పేర్కొన్నారు. 1948లో పెరియార్ మణియమ్మైను వివాహం చేసుకున్నప్పుడు ఆడపిల్లలను దత్తత తీసుకోవడానికి హక్కు లేదు. ఈ హక్కు తరువాత అంబేద్కర్ రూపొంచిన హిందూ కోడ్ బిల్లు ఆధారంగా, 1956లో వచ్చిన Hindu Adoption and Maintenance Act ద్వారా మాత్రమే అందుబాటులోకి వచ్చింది. అందువల్ల, పెరియార్ తన కూతురిని పెళ్లి చేసుకున్నాడనే ప్రచారం నిరాధారమైనది, చారిత్రక సత్యం కాదు. అతను రెండవ వివాహం చేసుకున్నది తన ఉద్యమ భవిష్యత్తు కోసం, వ్యక్తిగత కారణాల కోసం కాదు.

7) వారసత్వం:

1938లో ఒక ప్రత్యేక సమావేశంలో, సంఘ సంస్కర్తలు మరియు ఆయన అనుచరులు కలిసి, ఇ.వి. రామస్వామి గారికి "పెరియార్" అనే బిరుదు ప్రదానం చేశారు. పెరియార్ అనే పదానికి అర్థం –"గౌరవనీయుడు", "మహనీయుడు".

1970లో, ఆయన బ్రతికుండగానే UNESCO (యునెస్కో) పెరియార్‌ను "దక్షిణాసియా సోక్రటీస్" అనే బిరుదుతో గౌరవించింది. 1973, డిసెంబర్ 24న పెరియార్ మరణించారు. సామాజిక అసమానతలు, మహిళల పట్ల అణచివేత వివక్షత, మత మూఢాచారాలు చర్చనీయాంశాలుగా ఉన్నంతకాలం పెరియార్ జీవించేవుంటాడు. ఖండాంతరాలకు వ్యాపిస్తూనే ఉంటాడు.

- మోకా సత్తిబాబు, ఐ. పి. ఎస్. ,

(ఆంధ్రజ్యోతి పత్రిక సౌజన్యంతో...)

దేశంకోసం చనిపోయిన వారు ఎల్లకాలం బ్రతికే ఉంటారు. - భగత్‌సింగ్

స్త్రీలు - మానవహక్కులు

'స్త్రీల హక్కులూ మానవహక్కులే' అని ఈ రోజు అంటున్నామంటేనే 'మానవులు' అన్న మాటలో ఇన్నాళ్లూ స్త్రీలను భాగం చేయలేదని అర్థం. ఇంగ్లీష్ 'man' అన్న మాటకు మనిషి అనీ మగవాడు అనీ రెండు అర్థాలూ ఉన్నాయి. మన భాషలలో ఆ రెండిటికీ వేరువేరు పదాలు ఉన్నంత మాత్రాన మనిషి అనే భావనలో స్త్రీకి తగిన స్థానం ఇచ్చామని కాదుగానీ, ఇంగ్లీష్లో ఒకే మాట ఉండడం మనిషి గురించి పాశ్చాత్య సమాజాల హక్కుల భావనలో అంతర్లీనంగా ఉన్న అవగాహనను ప్రతిబింబించింది.

ఇంగ్లండ్లో 13వ శతాబ్దంలో రూపొందించిన మాగ్నకార్టా నుండి దాదాపు 20వ శతాబ్దందాకా కూడ హక్కుల అవగాహన 'రాజ్యం-పౌరులు' అనే చట్రంలోనే ఉండింది. పౌరులు అనేది స్త్రీ పురుషులకు సమానంగా వర్తించే భావనగానే కనిపిస్తుంది గానీ పౌరుల హక్కులను రాజ్యాన్ని ప్రమాణంగా పెట్టుకుని నిర్వచిస్తున్నామంటేనే తమ నెత్తిమీద రాజ్యం తప్ప వేరే ఏ శక్తీ లేని పౌరులగురించి మాత్రమే ఆలోచిస్తున్నామని అర్థం. ఇతర పౌరులు పెత్తనాన్ని భరించి బతికే పౌరులకు ఈ హక్కుల నిర్వచనం సరిపోదు.

మగ పెత్తనం కింద బతికే స్త్రీలకు, భూస్వాముల పెత్తనం కింద బతికే రైతులకు, తెల్లజాతి పెత్తనంకింద బతికే నల్లజాతి ప్రజలకు, బ్రాహ్మణ పెత్తనంకింద బతికే శూద్ర పంచమ కులాలకూ రాజ్యాన్ని కేంద్రం చేసుకొని ఏర్పరచుకున్న హక్కుల నిర్వచనం సరిపోదు. వారికి ఆ హక్కులు అక్కరలేదని కాదు. తమ మీద పెత్తనం చేసే ఇతర పౌరుల పెత్తనాన్ని నియంత్రించే హక్కులు కూడ వారికి కావాలని మాత్రమే.

ఇంగ్లీష్లో మనిషి హక్కులను 'రైట్స్ ఆఫ్ మాన్' (rights of man) అనే వారు. ఆ పేరు అట్లాగే ఉంచి అందులో స్త్రీల హక్కులను చేర్చడం కష్టమన్న విమర్శ బలంగా ముందుకు రావడం వల్ల అది 'హ్యూమన్ రైట్స్' (human rights) గా మారింది. 1948 డిసెంబర్ 10 నాడు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనను ఆమోదించిన సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రకటనకు 'మానవహక్కుల' ప్రకటన అన్నపేరు అది ముసాయిదా రూపంలో ఉన్నప్పుడు లేదు. అలవాటు ప్రకారం 'రైట్స్ ఆఫ్ మాన్' అనే అన్నారు. పేరులోనే స్త్రీలను వెలివేసే ఈ మాటను ఎన్నాళ్లింకా కొనసాగిద్దామని అప్పటి అమెరికా అధ్యక్షుడి భార్య ఎలీనర్ రూజ్వెల్ట్ అభ్యంతరం చెప్పి దానిని 'హ్యూమన్ రైట్స్'గా మార్పించారని అంటారు.

(మానవ హక్కులు అనే భావన మనుషుల మధ్య తేడాలను గుర్తించదనీ అందరికీ హక్కులను ఒకే రకంగా వర్తింపజేస్తుందనీ విమర్శించేవారు ఉన్నారు. కాని స్త్రీ పురుషుల మధ్యనున్న తేడాలను గుర్తించడం వల్లనే రైట్స్ ఆఫ్ మాన్ అన్న పేరు మానవహక్కులుగా రూపాంతరం చెందిందని గుర్తించాలి).

రాజకీయ హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, సమాన వేతనాలు, పాలనా వ్యవస్థలో సమాన భాగస్వామ్యం, ఆస్తిహక్కు, లైంగిక విషయాలలో స్వయం నిర్ణయ స్వేచ్ఛ మొదలయిన అనేక విషయాల గురించి ఒక శతాబ్దంపైగా మహిళా ఉద్యమాలు ఆందోళన చేస్తున్నాయి.

ఏ సమస్య వెనకనయినా ఒకే ఒక మౌలిక సూత్రం పని చేస్తుందని భావించడం సరయినది కాదుగానీ, కుటుంబం బయటి ప్రపంచం అనే వర్గీకరణ స్త్రీల హక్కుల దుస్థితికి ఒక ముఖ్య ప్రాతిపదిక అని చెప్పుకోవచ్చు. స్త్రీ జీవితానికి కుటుంబం పరిధిని నిర్ణయిస్తే, స్త్రీ హక్కులకూ స్వేచ్ఛకూ కుటుంబ విలువలు, కుటుంబ ప్రయోజనాలు, కుటుంబ అవసరాలుగా భావించబడేవి పరిధిని నిర్ణయిస్తాయి. పోనీ ఆ కుటుంబం సమాన వ్యవస్థా అంటే అందులో ఆస్తి, పని విభజన, లైంగిక నియమాల విషయంలో మగవాళ్లే ప్రథమ పౌరులు.

ప్రపంచాన్ని రెండుగా విభజించిన ఈ వర్గీకరణ స్త్రీల నైపుణ్యానికీ యోగ్యతకూ సృజన శక్తికీ అడ్డుగోడలు కట్టింది. సంపూర్ణంగా ఎదిగే అవకాశాన్ని మానవ హక్కుల నిర్వచనానికి ప్రాతిపదికగా తీసుకున్నట్టయితే, ఈ వర్గీకరణే స్త్రీల మానవ హక్కులకు పెద్ద ప్రతిబంధకం.

పేదవాళ్లు ఆర్థిక లేమివల్ల, వనరుల లేమివల్ల తమ యోగ్యతనూ సృజన శక్తినీ సంపూర్ణంగా పెంచుకునే అవకాశాన్ని కోల్పోతారు. దళితులు కులంకట్టిన అడ్డుగోడల వల్ల, పేదరికంవల్ల కూడ కోల్పోతారు. స్త్రీలు కుటుంబం – బయటి ప్రపంచం అనే వర్గీకరణ, అందులోనుండి పుట్టిన పని విభజనల వల్ల, వనరులపైన హక్కు లేకపోవడంవల్ల కోల్పోతారు.

రాజ్యం నుండి పౌరుల స్వేచ్ఛను కాపాడే లక్ష్యంతో రూపొందిన పాశ్చాత్య హక్కుల భావన ఈ విషయాన్ని ఆకళింపు చేసుకోలేదు. కాబట్టే పాశ్చాత్య దేశాలలో మహిళా ఉద్యమం ఆ దేశాల రాజ్యాంగాలు ప్రకటించిన హక్కుల జాబితా అపరిపూర్ణమన్న విమర్శతోనే మొదలయింది. ప్రజాస్వామ్యాన్ని గురించి మనబోటి వలసలకు లెక్చర్లిచ్చిన పాశ్చాత్య దేశాలలో 20వ శతాబ్దం దాకా స్త్రీలకు వోటు హక్కు లేదంటే బహుశా ఆశ్చర్యం కలగవచ్చు. అక్కడ తొలినాటి మహిళా ఉద్యమంలో వోటు హక్కు ప్రధాన విషయం.

మన దేశంలో స్త్రీల హక్కుల గురించి కృషి వలస కాలంలో మొదలయింది. అప్పట్లో ఎవ్వరికీ వోటుహక్కు లేదు కాబట్టి వోటుహక్కుతో మహిళా ఉద్యమం మొదలు కాలేదు. తొలినాడు అన్నిటిలోకీ బహుశా విద్య ప్రధాన విషయంగా ఉండింది. హైందవ సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు వర్ణాశ్రమ ధర్మంలో అంతర్భాగంగా నిర్వచించబడ్డాయి. కాబట్టి పురుషాధిక్యతలో సార్వత్రికంగా ఉండే లక్షణాలతో బాటు బ్రాహ్మణీయ వర్ణ ధర్మం నుండి సంక్రమించిన లక్షణాలు కూడ హైందవ కుటుంబవ్యవస్థలో కనిపిస్తాయి. వర్ణ సాంకర్య భయం స్త్రీపైన పెట్టిన లైంగిక నియమాలను మరింత కఠినం చేయడం ఒక అంశం కాగా, స్త్రీలు శూద్రులేనన్న మనునీతి ఫలితంగా చదువుకునే హక్కు బ్రాహ్మణ స్త్రీలకు సహితం లేకపోవటం ఇంకొకటి. చదువుకుంటే బయటి ప్రపంచానికి ద్వారాలు తెరుచుకుంటాయన్న విశ్వాసం వల్ల స్త్రీ విద్య ఒక ముఖ్యమైన సంస్కరణాత్మక కృషి అయింది.

అయినప్పటికీ, బయటి ప్రపంచం ద్వారాలు మూసి ఉండడానికి కారణం స్త్రీల అవిద్యే కాదు కాబట్టి ఇంకా జరగవలసిన పని చాలా మిగిలిపోయింది. అన్ని రంగాలలోనూ ఆ కృషి ఇంకా కొనసాగుతున్నది. వనరులపైన సమాన హక్కు, పని విభజనలో సమూలమైన మార్పు, వ్యక్తిగత స్వేచ్ఛకు సమానగౌరవం దక్కేవరకు స్త్రీ పురుష సమానత్వం రాదు.

- కె. బాలగోపాల్

('హక్కుల ఉద్యమం – తాత్విక దృక్పథం' రచన నుండి)

My heartiest congratulations to all the active members of "Sahrudaya Mithra Mandali" for successful completion of 25 years. Since 25 years, multifarious social activities are being conducted to promote the awareness among rural background students and other people especially who are under Below poverty line in and arround Pithapuram."

I am previleged to express my heartfelt appreciation to all the active members of the Sahrudaya Mithra Mandali for their dedicated, devoted and selflessness service."

I hope that Sahrudaya Mithra Mandali may become more potential in all aspects for extending great service to all the deserving needy people in the society at large.

With best wishes

J Chandramurthy, Deputy Director, (Retd), Social Welfare,Kakinada

సహృదయ మిత్రులు అందరికి అభినందనలు

సహృదయం గల మిత్రులు కొంతమందితో ప్రారంభించబడిన ఈ సహృదయ మిత్రమండలిలో నేను కూడా కొంతకాలం సభ్యునిగా ఉన్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. మిత్రమండలి భావాలు, అక్కడ సేవా కార్యక్రమాలు అనగా మహాశివరాత్రి, వేసవి తరగతులు, గురజాడ జయంతి, అల్లూరి జయంతి

ఉత్సవాలు, వనసమారాధన మొదలైనవి, అనేక ప్రజాప్రయోజనకరమైన కార్యక్రమాలు నిస్వార్థంగా చేస్తూ, నిర్విఘ్నంగా 25 సం॥లు పూర్తి చేసుకున్న సహృదయ మిత్రమండలి సభ్యులను అభినందిస్తూ రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని అభిలషిస్తూ....

మీ సహృదయ మిత్రుడు

మురపాక రామలింగేశ్వరరావు, కాకినాడ.

సహృదయం, కరుణ ఉన్న వ్యక్తి సమాజాన్ని జయించగలడు.

ఎలా జీవించాలి? (జీవనశైలి)

(LIFE STYLE MODIFICATION)

'ఎలా జీవించాలో తెలుసా?" అని అడిగితే

"ఎలా జీవించాలో చెప్పించుకోవాల్సిన స్థితిలో మేమున్నామా? మాకు ఆమాత్రం తెలియదా?" అని ఎదురు ప్రశ్న రావచ్చు. ఎలా జీవించటం సరయినదో (ఎలా జీవించటం శాస్త్రీయమో) అందరికీ దానంతట అదే తెలియాలని రూలేమీ లేదు. నిత్యం తెలుసు కోవాల్సిందే. తెలియని వారికి తెలిసినవారు తెలియ చెప్పాల్సిందే.

జీవనశైలిలో ప్రధానాంశాలు:

1) ఎవడెలా పోతే నాకేంటి?:

"ఎవడెలా పోతే నాకేంటి?" అనే భావజాలం మారిన జీవన శైలిలో అతి ముఖ్యమైన అంశం.

ఎ) 'ఎవడెలాపోతే నీ కేంటి? నీవు బాగుపడు. ప్రక్కవాడు నష్టపోయినా పట్టించుకోవద్దు'. ఇదీ ఈ రోజు మామూలు మనిషిని నడిపిస్తున్న తాత్విక దృష్టి కోణం. (ఫిలాసఫీ)

"నేను", "నాదీ" అనేది మానవస్వభావంలోనే ఉన్నది. దీన్ని పూర్తిగా వదులుకోవటం అసాధ్యం. 'వదులుకోవటం' అసాధ్యమే కాదు, సరయింది కూడా కాదు.

'నా' దగ్గర నుంచి 'మా' దాకా పోయాడు మనిషి.

'మా' కుటుంబం, 'మా' వీధి, 'మా' ఊరు, 'మా' కులం ఇలా ఎన్నో విషయాలలో 'మా' అన్న దృష్టికి వచ్చాడు. అయితే సమిష్టి జీవితానికి మరింత ఉపయోగకరమైన "మన" అనే దగ్గరకే రాలేకపోతున్నాడు. "ఎదిగిన" కొద్ది మందిలో మాత్రమే 'మన' అనే భావం ఉన్నది.

"మన"లో 'నా' ఉంది, 'మా' ఉంది. "నా"అవసరాలు, "మా" అవసరాలు తీరాలంటే 'మన అవసరాల' పరిధిలోనైతేనే సజావుగా తీరతాయనే స్పృహ మనిషిలో రావటం లేదు. ఈ స్పృహ లేకపోవటం సమాజ మనుగడకు ప్రమాదకరం. కాబట్టి అది ఏ సమాజమైనా సమిష్టి, ప్రయోజనాలు పొందాలంటే, ఆ సమాజంలోని వ్యక్తులందరిలో "మన" అనే భావన రావటం తప్పనిసరి. "మన" అనే ఉమ్మడి భావన వలన ఏ వ్యక్తికయినా జరగబోయే నష్టం ఏంటి? ఆలోచించండి.

బి) 'ఎవడెలాపోతే నా కేంటి? అనే దృష్టి చదువులేని వారిలో కంటే, బాగా చదువుకున్న వారిలోనే ఎక్కువగా ఉంటుంది.

"చదువు"ను సమాజం ఇచ్చింది. ఆ చదువును అందించటానికి ప్రజలందరి డబ్బును చాలా ఖర్చు చేసింది సమాజం. అయినా ఎంతోమంది సమాజం సంగతి పట్టించుకోకుండా, 'నేను బాగుపడితే చాలు' దగ్గర కొచ్చారు చివరకు. ఇది చాలా తప్పుడు ధోరణే కాదు. ప్రమాదకరమైనది కూడా.

ప్రస్తుతం సమాజం అనారోగ్యంగా ఉంది. కొన్ని రంగాల్లో అనారోగ్యం దగ్గర ఆగకుండా అంటురోగాలుగా, దీర్ఘకాల రోగాలుగా, వైద్యం కష్టసాధ్యంగా (అసాధ్యంగా కూడా) కూడా మారింది. దీన్ని మార్చుకొనకపోతే ఆ

అనారోగ్యము బారిన, రోగాల బారిన మనం కూడా పడవచ్చు.

ఉపాధి లేకపోవటం	అధిక ధరలు
ఆకలి	అనారోగ్యము
చదువు లేకపోవటం	అవినీతి,
పాలనలో భాగస్వామ్యం లేకపోవటం.	వనరుల అసమాన పంపకము.

పర్యావరణాన్ని దెబ్బతీయటం. ఇలాంటవన్నీ 'నాకెందుకులే' అనుకుంటే పోయేవికావు. ఎవరోవచ్చి పరిష్కరించాల్సినవీ కావు. మనమే పూసుకోవాలి, చూస్తూ వదిలేస్తే అవి నిన్నూ, నన్నూ, మన వాళ్ళందరినీ కబళించవచ్చు. ఇవన్నీ సామాజిక సమస్యల క్రిందకు వస్తాయి. వీటిని ఒంటరిగా ఎదుర్కోలేము.

ఉదా : అంటు వ్యాధులు మనకు రాలేదు కదా! అని అలా వదిలేస్తే రేపు మనకే రావచ్చు. కాబట్టి వీటిని సమిష్టిగానే ఎదుర్కోవాలి.

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేచింది లగాయితు రేపు ఉదయంతిరిగి నిద్ర లేచేదాకా ఎన్నెన్ని వస్తువులు వాడుతున్నామో చూడండి. అవన్నీ మనం తయారు చేయటం లేదు. ఎవరో చేసిన వాటిని మనం వాడు కుంటున్నా మంటేనే, మనం ఇతరుల మీద ఆధారపడ్డట్లే కదా! అమ్మ పది నెలల మోసి ఈ భూమ్మీదకు తీసుకురాకపోతే మనమే లేము. అలాగే ఇప్పటికే మీరు "తల్లితండ్రుల" స్థానంలో ఉంటే మీ పిల్లలపట్ల మీరెంత శ్రద్ధ తీసుకుంటున్నారో గమనించండి. అలాంటి తల్లితండ్రుల ఎడల పిల్లలు రుణ పడ్డట్లే కదా! అమ్మకూ, నాన్నకూ రుణపడి ఉన్నాము. ఇంత సులభంగా అర్థమవుతూంటే, "పది మంది కోసం మనవంతు చేయటానికి సిద్ధపడక పోతున్నామంటే ఏమనాలి? నడవటం, కాలకృత్యాలు తీర్చుకోటం, తలదువ్వుకోవటం, స్నానం చేయటం, బట్టలు వేసుకోవటం, అన్నం తినటం – అన్నీ తామై "తల్లీ, తండ్రీ, ఇల్లు" నేర్పించాయి. ఇన్ని చేసినందుకు తిరిగి మనమేమిచ్చాము? ఈ విషయంలో వారికీ, వాటికీ మనం 'రుణపడి ఉన్నాము. స్కూల్లో, కాలేజీలో మన చదువు పూర్తయ్యే దాకా అనేక మంది గురువులు వందల కొద్దీ విషయాలు నేర్పారు. ఆ గురువులందరికీ రుణపడి ఉన్నాము.

ఈ ప్రకృతి తన వనరులను మన కోసం అందించింది. అలా ప్రకృతికి కూడా రుణపడి ఉన్నాము. పుట్టినప్పుడు మన వెంట ఏమీ తీసుకురాలేదు. వెళ్ళేటప్పుడు కూడా ఏమీ తీసుకుపోము. ప్రకృతి నుంచే తయారయిన మనం ప్రకృతిలోనే కలిసిపోతాము, మధ్యలో ఉన్న జీవితం మీదనే మనకేమయినా అదుపు ఉండగల్గేది. పుట్టుక నీది, చావు నీది, మధ్యలోని జీవితంలో నీదంటూ కొంత ఉన్నా ఆ జీవితం సమాజానిది మొత్తం మీద. కాబట్టి ఆ సమాజం కోసం ఎంతో కొంత చేసి తీరాలి. చనిపోయే దాకా 'సమాజం' మనకు ఇస్తూనే ఉంది. కాబట్టి చనిపోయే దాకా 'సమాజాని'కి ఇచ్చే వాడివిగానే (రుణపడి) ఉన్నావు.

ముసలివారి, పిల్లల బాధ్యత తీసుకోవటం, ఇతరులకు 'చేయూత' నివ్వటం. 'సాయం' చేయటం ద్వారా "తల్లి తండ్రుల రుణం" తీర్చుకోవాలి. నీవు నేర్చుకున్నది యితరులకు నేర్పించటం ద్వారా, "గురువు రుణం" తీర్చుకోవాలి.

ప్రకృతి వనరులను మితంగా ఉపయోగించుకోవటం ద్వారా, పర్యావరణ సమతూకం కోసం తోడ్పడటం ద్వారా "ప్రకృతి రుణం" తీర్చుకోవాలి. రుణాన్ని వెంటబెట్టుకునే ఉనికిలోకి వచ్చాము. ఆ రుణాన్ని తీర్చుకునే, జీవితాన్ని చాలించాలి.

పలాయనం చిత్తగించట, ఆత్మహత్యలు చేసుకోవటం, అమిత స్వార్థాన్ని ప్రదర్శించటం లాంటి పనులు హక్కులు కానేకావు. అవి కచ్చితంగా ఒక సంఘజీవి చేయకూడని పనులు. ఇవ్వవలసినంత ఇస్తూ, తీసుకోవాల్సినంత మాత్రమే తీసుకుంటూ జీవించటమే సార్ధకత. "పుట్టినప్పుడు ఏడుస్తూ వచ్చావు. చుట్టూ ఉన్నవాళ్ళు ఆనందంతో నవ్వారు. చనిపోయేప్పుడు చిరునవ్వుతో పోవాలి. చుట్టూ ఉన్న వాళ్ళు నిన్ను పోగొట్టుకున్నందుకు ఏడ్వాలి".

నీవు నీ కోసం మాత్రమే జీవించటం కంటే, ఇతరుల కోసం కూడా జీవించటంలో తృప్తి ఉంది. సహజీవనంలో సౌందర్యముంది. సామాజిక బాధ్యత ఉంది. ఇందులోనే సమాజం మనుగడకు పునాది ఉన్నది. నీవు సమాజం కోసం జీవిస్తే, భౌతికంగా మరణించినా, ఈ సమాజం ఉన్నంత వరకూ జీవించే ఉంటావు. అందుకనే సమాజహితం కోసం మనం పని చేయాలి. చేస్తూనే ఉండాలి. ఇతరులు కూడా యిలా ప్రవర్తించేలా ప్రేరేపణ చేస్తూ ఉండాలి. సుఖశాంతులతో సమాజం ఉండాలంటే ఇదే సరయిన విధానం.

సి) మనం పని చేయకపోతే ఏమి?:

సమాజంలో మార్పు సహజం. నిరంతరాయం. మనం పని చేసినా, చేయకపోయినా మార్పు వస్తూనే ఉంటుంది. 'మంచి మార్పు' అని మనం దేనిని అనుకుంటున్నామో అందుకు తగిన పనిని చేస్తేనే "అది" వేగంగా వస్తుంది. ఆ మార్పు సాధించటంలో భాగస్వాములు కావటం మనకు సంతోషాన్నిస్తుంది. భద్రతనూ ఇస్తుంది.

డి) మార్పు ఎవరికి కావాలి?:

ఎవరు సమస్యల్లో ఉన్నారో, వారి(కి) సమస్యలు పరిష్కారం కావటానికి తగిన, తగినంత మార్పు కావాలి.వాళ్ళు పూనుకోకుండా మార్పు వారు కోరిన రీతిలో రాదు. కోరినంత రాదు. వాళ్ళ బదులు మరెవరయినా చేస్తూ ఉంటేనో? "చేస్తే జనం పనులు చేయించుకుంటూనే ఉంటారు. "జనం బదులు పని చేస్తున్న వాళ్ళు" అక్కణ్ణుంచి వెళ్ళిపోయేటప్పుడు "మరలా ఎప్పుడొస్తా" రని కూడా జనం అడుగుతారు. అందువలన "జనం" బదులు మనం చేస్తూ ఉండటం సరయింది కాదు. కాబట్టి సామాజిక సమస్యల విషయంలో అందరం పూనుకోవాలి. ఎవరి వంతు కృషి వాళ్ళు చేయాలి. అదే సరయిన పద్ధతి. 'తమ పనులు వేరెవరో చేస్తే బావుండు" ననుకోవటం, అసలు తామెందుకు పని చేయాలి 'అనటం', 'అనుకోవటం' అడ్డగోలు విషయాలు. తల ఉన్నవాళ్ళెవరూ తామెందుకు 'పని చేయాలి' అనరసలు, పనిలో ప్రజలను భాగస్వాములను చేయనంత కాలం, ఆ పని తమదని ప్రజలు అనుకోనంత కాలం రావలసిన మార్పు రావలసినంత రాదు. కాబట్టి ప్రజలు తమంత తామే పూనుకుని మార్పుకోసం పని చేయాలి. వాళ్ళకా పద్ధతి అలవాటయ్యే దాకా మనం చెప్పేవాళ్ళు గానే కాక, చేసేవాళ్ళుగా కూడా ఉండాలి. అంటే మనము చేస్తూ వాళ్ళూ కదిలేలా చూసుకోవాలి.

నిన్ను నువ్వు పొగుడుకోనవసరం లేదు, నువ్వేంటనేది నీ పనులు చెబుతాయి.

2. వస్తు వాడకం (వినిమయ సంస్కృతి) (CONSUMERISM) :

'బ్రతకాలనీ', 'బాగా బ్రతకాలనీ' మనిషికి ఉంటుంది. ఇవి సహజ ఆకాంక్షలలో ముఖ్యమైనవి. ఇవి మనిషిని నడిపిస్తాయి. వీటిని ఆధారం చేసుకునే, బ్రిటన్లో పారిశ్రామిక విప్లవం జరిగిన నాటి నుంచీ వస్తూత్పత్తి పెరిగింది. ఎక్కువ మంది జనానికి అందుబాటులోకి వస్తువులు వచ్చాయి. అలా వస్తువులు తయారు చేయటంలోనే పెట్టుబడిదారులు పుట్టారు. పెరిగారు. "పరిశ్రమలు – వస్తూత్పత్తి– అమ్మకం" ఇవే పెట్టుబడికి ప్రాణం. అమ్మకమైనాక అవి వినియోగం జరిగితే మరలా వస్తువును మనిషి కావాలనుకుంటాడు. అమ్మకమైనది ఖర్చుకావాలి. తిరిగి ఉత్పత్తి కావాలి. అమ్మకం కావాలి.

ఇదొక చక్రం ఉత్పత్తి / అమ్మకం / పంపకం

ఉత్పత్తి	అమ్మకం (పంపకం)	వినియోగం
ఉదా : తిండి గింజలు	అమ్మకం	తినటం
ఆయుధాలు	అమ్మకం	యుద్ధాలు
మద్యం	అమ్మకం	త్రాగాలి

వినియోగం లేనిదే తిరిగి ఉత్పత్తి, పంపకం, వినియోగం జరగవు.

3. ప్రచారం (ADVERTISEMENT)

మనిషి మనుగడకు అవసరమైన వస్తువులయితే, ఎవరూ చెప్పనక్కర లేకుండానే కొనుక్కుంటారు. వాడుకుంటారు. అంతగా అవసరం లేనివి, ఇప్పుడే అవసరం లేనివి, ఎప్పుడన్నా అవసరమవుతాయేమో అనిపించేవి, ఎప్పటికీ అవసరం కానివి కూడా విరివిగా అమ్మగలితేనే పెట్టుబడిదారులకు బాగా లాభాలు వచ్చేది.

అవన్నీ కొనమని ప్రచారం జరగాలి. ఇవి కొంటే నీకీ ఉపయోగముందని ఆశ పెట్టాలి. ఇవి కొనకపోతే నీకే నష్టం వస్తుందని భయపెట్టాలి. ఆశ, భయం ఈ రెండే ప్రచారానికి ప్రాణాలు. అలా ప్రచారం చేసి, విపరీతంగా వస్తువులు కొనమని జనానికి నచ్చచెప్పాలి. ఇదే ఈ రోజు "వస్తూత్పత్తి" విశ్వరూపం.

4. వినిమయ సంస్కృతి (CONSUMERIST CULTURE) :

వస్తువును అమ్మాలంటే ముందు తయారు చేయాలి. అమ్మాలి. అమ్మిన తర్వాతే లాభం వస్తుంది. లాభం రావాలంటే అమ్మకం జరిగే దాకా ఆగాలి. అలా కాకుండా వస్తువు తయారు కాగానే చేతుల మీదే అమ్మకం జరగాలంటే, వస్తువు తయారు కావటానికి ముందే దాన్ని గురించి ప్రచారం జరగాలి. కొనాలనే కోర్కెను బలంగా పుట్టించాలి. కొనటానికి కాచుక్కూర్చునే మనస్తత్వాన్ని తయారు చేయాలి జనంలో, ఈ రోజు ఎటు చూసినా వినిమయ సంస్కృతే కన్పడ్తుంది.

ఉదా : "వినిమయం" యొక్క విజయం "వినిమయ సంస్కృతిని" సృష్టించటంలోనే ఉన్నది.

ఎ) "ఆరోగ్య" సంస్కృతి:

v టానిక్ త్రాగితే బలం వస్తుంది.

v గ్లూకోజ్ త్రాగితే త్వరగా అరుగుతుంది.

మన ఎదుట భయపడేవారు మన వెనుక మనల్ని అసహ్యించుకుంటారు.

- v హార్లిక్సు త్రాగితే ఎత్తు పెరుగుతారు.
- v ఎవరినీ త్వరగా చూడకుండా అద్దాల గదిలో కూర్చునే డాక్టరే పెద్ద డాక్టరు.
- v ఎక్కువ మందులు రాస్తే పెద్ద డాక్టరు.
- v ఎక్కువ ఛార్జీ వేసేటాయన పెద్ద డాక్టరు.
- v చనిపోబోయే ముందు ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్చితే, ముసలి వారిని బాగా చూసుకున్నట్లు లెక్క
- v చేతిలో పెద్ద ఫైలుంటే బాగా వైద్యం జరిగినట్లు లెక్క
- v CT స్కాన్, ఎం.ఆర్.ఐ.లు చేయించుకుంటేనే బాగా పరీక్ష చేయించుకున్నట్లు.

బి.''ఆహార'' సంస్కృతి:

- v మెక్డొనాల్డ్, కె.ఎఫ్.సి.,లలో బర్గర్లు, పిజ్జాలు తింటే నిజమైన తిండి, పప్పు, కూర, సాంబారు వేస్టు,
- v ఐదు నక్షత్రాల హొటల్లో తిన్నదే నిజమైన ఆహారం.
- v "కురుకురే" అయితేనే పిల్లలకు ఇష్టం, వడియాలు, అప్పడాలు ఓల్డు ఫ్యాషన్.
- v "మా పిల్లలు అన్నం తినరండి. బూస్టునే త్రాగుతారు".

'సి' అందం'' సంస్కృతి:

- v బ్యూటీ పార్లర్లకు రెగ్యులర్గా పోవాలి.
- v తిండి అయినా మాని సౌందర్య సాధనాలు కొనాలి.
- v ఇంట్లో వారికి శుభ్రంగా, అందంగా కనపడకపోయినా, బజార్లో జనానికంతా అందంగా కన్పించాలి.
- v పౌడర్లు, స్నోలు, సెంటులు, మొ. సాధనాలు విపరీతంగా వాడాలి.

డి. "చదువు" సంస్కృతి :

- v ర్యాంకులు రావాలి. విద్య రాకపోయినా సరే.
- v పరీక్షలు బాగా రాస్తే చాలు. ఆ తర్వాత మొత్తం మర్చిపోయినా ఫర్వాలేదు.
- v పిల్లల్ని తల్లితండ్రులు చూడటానికి అనుమతి ఇవ్వని స్కూలే గొప్ప స్కూలు.
- v ఎక్కువ ఫీజులు వసూలు చేసేదే గొప్ప స్కూలు. లక్షమంది మంది పిల్లల్ని చేర్చుకుని, వెయ్యిమందికి ర్యాంకులు తెప్పించిన స్కూలు/కాలేజీనే గొప్ప కాలేజి, (99,000 మందిని గోతిలో పారేసినా సరే).
- v పిల్లవాడు నాలుగు ఇంగ్లీషు లైన్లు మాట్లాడగానే వానికి ఇంగ్లీషు వచ్చినట్లే లెక్క
- v కేరళ టీచర్లయితేనే బాగా చెప్తారు!?

6. "ఇంట్లో" సంస్కృతి:

- v మూడు బెడ్ రూముల ఇల్లుండాలి.
- v సోఫా సెట్టుండాలి.
- v డైనింగ్ సెట్టుండాలి.
- v డబుల్ కాట్ బెడ్డుండాలి. హోం థియేటరుండాలి.

- v ఎల్.ఇ.డి. టీవీ ఉండాలి.
- v రెండు చక్రాలు, వీలయితే నాలుగు చక్రాల బండుండాలి.
- v ఫ్రిజ్ ఉండాలి.
- v బట్టలు ఉతికే మెషిన్ ఉండాలి.
- v వంటింట్లో "విప్లవం" ఉండాలి.
- v టీవీ చూసుకుంటూండాలి. కదలకుండా ఛానెళ్లు మారటానికి రిమోట్ ఉండాలి.
- v లక్షలు ఖరీదు చేసే మన ఇంట్లోనే వ్యాయామ పరికరాలుండాలి. (మనము వ్యాయామం చేసినా, చేయకపోయినా)

సారాంశం:

వస్తువులు విరివిగా అమ్మాలంటే కొనటానికి అనువైన మానసిక స్థితిని (సంస్కృతిని) జనానికి కల్పించాలి. ఈ విషయంలో ప్రపంచంలోని పెట్టుబడిదారులంతా ఒకటయ్యారు. ప్రపంచాన్ని చిన్న గ్రామం క్రింద మార్చేశారు.

5. వినిమయమూ - ఫలితాలూ :

- v అవసరానికి మించి వినిమయం అంటే అర్ధము ఏంటి? రాబోయేతరాలు వాడుకోవాల్సిన వనరులను ఇప్పటి తరము వాడేసుకోవటమే.
- v ప్రకృతిని విచ్చలవిడిగా వాడుకోవటం వలన వనరులు తరిగిపోతాయి. దుర్వినియోగం అవుతాయి.
- v వస్తూత్పత్తి పెరిగితే ఆ మేరకు శక్తి వినియోగం కూడా పెరిగినట్లే. ప్రస్తుత శక్తి వనరులు బొగ్గు, పెట్రోలియంలు అనుకుంటే పరిమితంగా ఉండే ఆ వనరులను ముందుగా వాడేసినట్లే.
- v ఆ శక్తి వనరు అణువిద్యుత్ అయితే, అది ప్రమాదకరమైన వనరు.
- v తిరిగి, తిరిగి వాడుకోగల్గిన వనరులు (గాలి, అలలు, సూర్యరశ్మి మొ..) ప్రస్తుతం తక్కువ ఖర్చుతో అందుబాటులో లేవు.
- v శక్తిని ఎక్కువ వినియోగిస్తే, కార్బన్-డై-ఆక్సైడ్ గాలిలోకి వదలాల్సి ఉంటుంది. దాని వలన భూమి వేడెక్కుతుంది. ఓజోన్ పొరకు రంధ్రం పడ్తుంది. ఉన్న రంధ్రం పెద్దదవుతుంది. కాలుష్యం పెరుగుతుంది.
- v వస్తు వాడకం పెరిగినప్పుడంతా అసమాన పంపకం దాని వెన్నంటే ఉంటుంది. అసమాన పంపకం స్పర్థలకు దారి తీస్తుంది. సామాజిక అలజడి వస్తుంది.
- v పెరిగిన పస్తువులు ఒక దశ వరకే మనిషికి సుఖాన్ని ఇస్తాయి. ఆ తర్వాత బాధలు కల్గిస్తాయి.
- v వస్తువులను పెంచుకుంటూపోతే ఖర్చులూ పెరుగుతాయి.
- v సుఖాలనిచ్చే వస్తువులు శరీరానికి వ్యాయామాన్ని దూరం చేస్తాయి. అనారోగ్యానికీ, రోగానికీ దారులు వేస్తాయి.
- v రోగాలు వస్తే తిరిగి డబ్బు ఖర్చు పెరుగుతుంది. ఆయుర్దాయం క్షీణిస్తుంది.
- v వస్తు వాడకం నష్టం కల్గించే అలవాట్లను కూడా వెంట తెస్తుంది.

6. నష్టం కల్గించే అలవాట్లనూ, అనవసరమైన వస్తువులను వదులుకోవాలి:

దాని వలన

- v వనరులు పరిమితంగా ఖర్చు అవుతాయి.
- v శక్తి వినియోగం తగ్గుతుంది.
- v పర్యావరణం పరిరక్షణ జరుగుతుంది.
- v కాలుష్యం తగ్గుతుంది.
- v ఓజోన్ పొరకు పడిన రంధ్రాన్ని పెంచకుండా ఉంటాము.
- v భూమిని వేడెక్కనీకుండా ఆపగలము.
- v సామాన్యమైన జీవితానికి అలవాటవుతాము.
- v ఖర్చు తగ్గుతుంది. పొదుపును పాటిస్తాము.
- v ఆరోగ్యానికి ఉపయోగము.
- v అనవసరమైన వస్తువులతో మనశ్శాంతి పోగొట్టుకోకుండా ఉండవచ్చు.
- v దేశ సంపద మిగులుతుంది.
- v దుబారా మనస్తత్వము తగ్గుతుంది.
- v "ఒక వస్తువును నేను వాడను" అంటే బలవంతంగా ఆ వస్తువును వాడించగల్గే వారు లేరు.
- v నష్టం కల్గించే అలవాట్లను మానుకుంటాము.
- v ఒక అలవాటును మానుకుంటానంటే, నిన్ను ఆపగల్గినవారూ లేరు.

ఏ నాటికయినా సరే వస్తు వాడకం తగ్గించటం, నష్టం కల్గించే అలవాట్లను వదిలించుకోవటమే మానవాళి చేయదగిన పని.

- డా॥ వెన్నపూస బ్రహ్మారెడ్డి

(పీపుల్స్ హెల్త్ సొసైటీ ప్రచురణ, 'మీరే వైద్యం చేసుకోవచ్చు' గ్రంథం నుండి సేకరణ.)

"మనిషి ప్రకృతిని తన అవసరాలకోసం నిరంతరాయంగా మార్చుకుంటూ, తనకు అనుకూలంగా మలచుకుంటూ రావడం నాగరికత ఎదుగుదలలో కీలకమైన అంశం. నాగరికత పెరిగిన కొద్దీ మనిషి అవసరాలు పెరిగాయి కాబట్టి ప్రకృతిలో మనిషి జోక్యమూ పెరిగింది. అయినప్పటికీ మనుషుల అవసరాల స్థానంలో పెట్టుబడి అవసరాలు వచ్చేదాకా మనిషికీ ప్రకృతికీ మధ్య సమతుల్యం ఉండింది. ఒడిదుడుకుల మధ్య కోటానుకోట్ల మూలధనం కార్పోరేట్ పెట్టుబడిగా మారడం ఈ సమతుల్యాన్ని నాశనం చేసింది. ఒక కాలువ, ఒక నది కలుషితం కావడం కాదు, మానవ మనుగడకు ప్రాకృతిక పునాది అయిన జీవావరణమే ధ్వంసమయ్యే స్థితి దాపురించింది. అందుకే ఈ అభివృద్ధిని విధ్వంసం అంటున్నాము". - బాలగోపాల్

మంచి ఆలోచనలు, నిస్వార్థ కోరికలు కలిగి ఉన్నవారు సంతోషంగా జీవిస్తారు.

తెలుగుజాతి సారస్వత మహాయాత్ర !
కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర!!

(ఓ క్రియాశీల స్వాప్నికుడి అసామాన్య కథ)

" ముహూర్తాల మీదా జాతకాల మీదా నాకు చిన్న తనంలోనే నమ్మకం పోయింది. నేను స్వతంత్రుడిని అయ్యాక నా జాతకచక్రాన్ని చూడటానికి ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. నాకు మొదట జ్యోతిశ్శాస్త్రం మీద చాలా విశ్వాసం ఉండేది. కానీ, జాతకచక్రాలను బట్టీ దీర్ఘాయుష్మంతులు అవుతారని చెప్పినవారు అల్పాయుష్కులవటం, గొప్ప ధనవంతులవుతారని చెప్పినవారు దరిద్రులుగా మిగిలిపోవడం, సంతానవంతులు అవుతారని చెప్పిన వారు గొడ్రాళ్లుగా మిగలడం, నిత్యసుమంగళిగా జీవిస్తారని చెప్పినవారు బాల వితంతువులు అవడం , ముహూర్తాలు పెట్టుకుని చేసే కార్యాలు విఫలమవడం చూసేకొద్దీ నాకు జ్యోతిష్యం మీద నమ్మకం తగ్గింది. లోకానుభవం పెరిగే కొద్దీ పూర్తిగా నశించింది.

"ఆ కాలంలో అందరికీ దయ్యాల మీద నమ్మకం జాస్తి. దెయ్యం పట్టని ఆడవాళ్ళు ఎక్కడో కానీ ఉండేవాళ్ళు కాదు. ఎవరికి ఏ వ్యాధి వచ్చినా వైద్యుడి దగ్గరకు వెళ్ళే బదులు ముందుగా భూత వైద్యుడి దగ్గరకో, సోది చెప్పే వారి దగ్గరకో పరిగెత్తేవారు. చనిపోయినవారు దయ్యాలయి తిరుగుతారని అందరూ నమ్మేవారు. అందులోనూ మా అమ్మకు దయ్యాలపై నమ్మకం చాలా ఎక్కువ. తరచుగా ఆమె తనను ఏదో దెయ్యం ఆవహించి పీడిస్తోందని నిద్రాహారాలు లేకుండా బాధపడేదట. మా తాతగారు ఎందరినో భూత వైద్యులను, మంత్రగాళ్లనూ రప్పించి ఎన్ని చికిత్సలు, మారణహోమాలు చేయించినా పాత దెయ్యం విడిచి పెట్టగానే కొత్త దెయ్యం ఆమెని ఆవహించేది. ఆమె నానాటికి చిక్కిపోతుండేది. కానీ భూతం మాత్రం ఆమెను విడిచిపోలేదట."

" ఈ కాలంలో నాకు పురాణాలు చదివే పిచ్చి అంతకంతకూ ఎక్కువైంది. విశ్వామిత్రుడు బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేసినట్టు, అగస్త్య మహర్షి సముద్రాన్ని ఔపోసన పట్టినట్టు, కపిలుడు చూపుతోనే సగర పుత్రులైన పదివేల మందిని బూడిద చేసినట్టు చదువుతుంటే, నేనెప్పుడు వాటికి మించిన మహిమలను పొందుతానా అని తహతహ లాడేవాడిని. నా వెర్రి ఊహలను కొన్నింటిని ఇతర బాలుర బుర్రల్లోకి కూడా ఎక్కించ గలిగాను. ఈ తపో మహిమలన్నీ పగటి కలలని అనుకోకుండా, నేను నమ్మడమే కాకుండా, ఇతరులను కూడా ఆ భ్రమల్లో తేలేలా చేసేవాణ్ణి.

"ఏంటి ! స్వయంవరం భాగ్యమా? ఆ అదృష్టం హిందూ దేశంలోని బ్రాహ్మణులకు కలలో కూడా లభించదు. భవిష్యత్తులో ఎప్పుడైనా కలగవచ్చునేమోకాని ఇప్పటికి మాత్రం లేదు. మాలోని విద్యావంతులైన మహానుభావులు విజ్ఞానకాంతులు చూడకుండా కళ్ళుమూసుకుని పూర్వాచార మహాభూతానికి సేవ చేసినంత

కాలం మనదేశంలో అటువంటి పుణ్యం ఇకపై కూడా కలుగదు. పండితులు పామరులు అనే భేదం లేకుండా మావాళ్ళంతా ఆచారానికి దాసులు. ఆచార పిశాచి ఆవహిస్తే వారికి దయ, ధర్మం,సత్యం, సత్కార్యం వంటివేవీ కనిపించవు."

" దయ్యాలు పట్టాయన్న వారి ఇళ్లకు వెళ్ళి భూతవైద్యులు చేసే మంత్రతంత్రాలను చూసే వాడిని. ఒక్క భూతాన్నైనా చూపించమని వాళ్ళని ఎన్నో విధాల బ్రతిమాలాను. ఒక్కరు కూడా నాకు చూపించలేదు. ఒక భూత వైద్యుడు మాత్రం నాకు దయ్యాన్ని చూపిస్తానని ఒక రాత్రి ఊరవతలున్న మర్రిచెట్టు దగ్గరికి తీసుకెళ్ళి ' దెయ్యాన్ని చూపిస్తే నువ్వు జడుసుకుంటావు ' అని తప్పించు కోవాలను కున్నాడు. ' నేను జడుసుకోను. దయచేసి చూపించు.' అని ధైర్యంతో నిలబడ్డాను. అతను, ' నువ్వు భయపడకపోయినా ప్రభుత్వం వల్ల నాకు చిక్కులు వస్తాయి, నేను చూపించను.' అనినాకు ఆశాభంగం కలిగించి వెళ్ళిపోయాడు. దయ్యాలు స్మశానాలలో అర్ధరాత్రి సమయాల్లో సంచరిస్తాయని అందరూ చెప్పడం వల్ల వాటిని చూడాలని ఉత్సాహంతో చాలాసార్లు అర్ధరాత్రి ఎవరితోనూ చెప్పకుండా స్మశానానికి వెళ్ళాను. పాము కరుస్తుందని, తేలు కుడుతుందని, దొంగలు కొడతారనే భయం తప్ప పిశాచి భయం లేకుండా ఇంటికి తిరిగి వచ్చేవాడిని..."

" పగబట్టిన ప్రతిపక్షం వాళ్లు నన్ను క్షుద్ర విద్యలతో అంతం చేయాలని కూడా ప్రయత్నించారు. పిండి బొమ్మలకు కీళ్లలో ముళ్ళుగుచ్చి మా గుమ్మం ముందు పసుపుతోను, పిండితోను ముగ్గులు పెట్టేవారు. దానివల్ల ఫలితం లేక పోయిందని రాత్రిళ్ళు మా దొడ్లో పిండి బొమ్మలనూ కొబ్బరికాయ ముక్కలను కట్టేవారు. తెల్లవారాక మా ప్రింటింగ్ ప్రెస్ పనివాళ్ళు ఆ ముక్కలను తినేసేవాళ్ళు.."

" ప్రజల ఉపయోగం కోసం నేను టౌన్ హాల్ కట్టించినందుకు పట్టణ ప్రజలంతా నాకు సాయంచేసి ఉంటారని మీరు అనుకోవచ్చు. మా పట్టణ ప్రజలు అలాంటి ' పాపపు ' పనులకు పూనుకోరు. నేను మందిరం కట్టించడానికి ముందే ఆ స్థలం గురించి నలుగురు కోర్టుకెళ్ళారు. ఆ పిర్యాదులు వీగిపోయాయి. అలాగే ఒక పెద్దమనిషి మద్దతుతో ఒక పేద తురకవాడు టౌన్ హాల్ నిర్మాణం కోసం తన తాత సమాధిని తవ్వేశారని నా పై కోర్టులో కేసు వేశాడు. సమాధి తవ్విన స్థలం నుంచి అస్థికలను బుట్టలో వేసి తెచ్చాడు. అవి తన తాత ఎముకలని వాదించాడు. పోలీసులు మెడికల్ ఆఫీసర్‌తో పరీక్ష చేయించారు. పరీక్షలో అవన్నీ మేక ఎముకలని రుజువైంది..."

" నేను రచనా వ్యాసంగాన్ని ప్రారంభించేటప్పటికీ వచన రూపంలో ఎలాంటి పుస్తకాలు లేవు. అన్నీ కొత్తగా రాయవలసి వొచ్చింది. తెలుగులో మొదటి వచన ప్రబంధాన్ని (నవలను) నేనే రాశాను. మొదటి నాటకాన్ని నేనే అనువదించాను. ప్రకృతి శాస్త్రాన్ని, ప్రహసనాన్ని, చరిత్రను నేనే ముందుగా రాశాను. స్త్రీల కోసం మొదటి వచన రచన చేసింది కూడా నేనే. ఇలా పుస్తకాలు రాస్తూనే అందుబాటులో లేని ఎన్నో పాత పుస్తకాలను కూడా సంపాదించి ప్రచురించాను.".

"మత, నీతి, కులాచారాలను సంస్కరించకుండా కేవలం రాజ్యాంగ సంస్కరణ జరిగినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందుతుందని నేనెప్పుడూ భావించలేదు. అన్ని రంగాలలోనూ దేశం సమానంగా అభివృద్ధి చెందాలని నా ప్రగాఢ విశ్వాసం. మన శరీరంలో ఉన్న అవయవాలన్నీ వాటి పరిమాణానికి తగ్గట్టుగా పెరగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అలా కాకుండా కేవలం తల కానీ కడుపు కానీ కాలు కానీ పెరిగితే ఎలా ఉంటుందో చెప్పడం ఎందుకు? క్రూరమైన కులాచారాలకు బానిసలమై ఉన్నాము. మన ఇంట్లో ఉండే స్త్రీల కష్టాలను నివారించలేకపోతున్నాం. మత కలహాలతో ఐకమత్యం లేకుండా ఒకరినొకరు ద్వేషిస్తూ జీవనం సాగిస్తున్నాం. అలాంటప్పుడు స్వాతంత్ర్యం సంపాదించి దేశం ఎదుర్కుంటున్న కష్టాలను ఎలా అరికట్టగలం?"

తెలుగు సాహిత్యంలో సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక జీవనంలో పునరుజ్జీవనానికి అంకితం అయిన మహాపురుషుడు కందుకూరి. కేవల ఆదర్శాల వల్లెవేత వల్ల కాదు. క్రియాశీల ఆచరణ వల్ల మాత్రమే తిరుగు లేని సంస్కర్తగా రూపొందిన యోధుడు. మూఢ నమ్మకాల నిర్మూలన మొదలుకుని, బాల్య వివాహాల నివారణ వరకూ, స్త్రీవిద్య నుండి పునర్వివాహాల దాకా, స్త్రీ పురుష సమానత, సాహితీ సృజన, రచనా వ్యాసంగం,కళలు, నాటకాలు, పత్రికలు, ఉద్యమాలు, పలు సంస్థలు, నిరవధిక దీక్షలు, అవిశ్రాంత పయనాలు...ఇలా ఎన్నో రంగాల్లో మహోన్నతంగా భాసించిన ధీరుడు కందుకూరి వీరేశలింగం. అందుకే ఆయన యుగకర్త.

భిన్నాభిప్రాయాలు ఎన్నైనా ఉండనివ్వండి కానీ,అలాంటి మహానుభావుడి స్వీయచరిత్ర, నిజానికి అది తెలుగుజాతి సారస్వత యాత్ర. సుమారు వందేళ్ల నాటి వ్యవస్థ పరిణామాన్ని ఆసక్తికరంగా చిత్రించిన అపూర్వ వీచిక. ఒక అర్భకుడు, బలహీనుడైన సామాన్య వ్యక్తి, మహా శక్తిమంతుడిగా రూపొందిన క్రమం. నాటి సమాజంలో ఉన్న అనేక సాంఘిక సమస్యల పై సగటు మనిషి ప్రకటించిన యుద్ధం. రాజకీయ వ్యవస్థ మొదలు, సదాచార సంప్రదాయాల పైనా, కుహన మేధావులు పైనా, చివరికి న్యాయ వ్యవస్థ పైనా కూడా సామాజిక స్పృహతో,హేతు జిజ్ఞాసతో, కార్యదీక్షతో చివరి క్షణం వరకూ ఒక వ్యక్తి , ఏకవ్యక్తి సైన్యంగా చేసిన విశిష్టమైన విప్లవ పోరాటం కందుకూరి స్వీయచరిత్ర.

మొత్తం వందకి పైగా అన్ని ప్రక్రియల్లో రచనలు చేసి, సంఘాన్ని సంస్కరించడానికి నాడున్న మార్గాలన్నింటినీ తోడి, సాంప్రదాయ ఛాందస సమూహాలతో ఒకవైపు, స్వార్థపర కుటిల శక్తులతో మరోవైపు అలుపెరుగని పోరాటం చేస్తూనే అనన్య సామాన్యమైన సామాజిక ప్రగతికి సారధ్యం వహించిన అసాధారణ ఉద్యమకారుడు కందుకూరి. తెలుగు ప్రాంతం సరే సరి. అటు చెన్నై మొదలు ఇటు బరంపురం వరకూ, బెంగుళూరు నుండి బొంబాయి దాకా, కాకినాడ నుండి కలకత్తా వరకూ దేశంలో ఎక్కడెక్కడి దాకా తన సంస్కరణా విస్తృతిని పెంచుకుంటూ పోయారో ఎన్నటికీ అదొక ఆశ్చర్యకరమైన విషయంగానే మిగిలిపోతుంది.

ఆయన చేసిన రచనలు స్థాపించిన సంస్థలతో రాశిలోను, వాశిలోనూ పోటీపడతాయి. ఆయన ప్రసంగించిన మహాసభలు ప్రయాణించిన మహాదూరాలతో పోల్చుకుంటాయి. స్వాతంత్రం సరే కానీ, దానికిముందు దేశంలో

పరిష్కరించాల్సిన సమస్యల సంగతి ఏంటని అడిగిన ఆ స్థాయి మేధావి, బుద్ధిజీవి తెలుగు సాహిత్యంలో, సాంస్కృతిక రంగంలో కూడా అరుదే. అనేక పరిమితుల్లోనే అయినప్పటికీ ఆనాడు కందుకూరి వీరేశలింగం సాధించిన విజయాలు తెలుగుజాతిని భవిష్యత్తులో సైతం దిగ్భ్రాంతి కలిగిస్తూనే ఉంటాయి. చరిత్ర మరిచిన జాతికి పురోగతి శూన్యం. కందుకూరి తెలుగు జాతి సాంస్కృతిక వికాస చరిత్రకొక ప్రతీక. ఆయన స్వీయచరిత్ర తెలుగుజాతి వెలుగు దీపిక. ప్రతి తెలుగు బిడ్డ దిక్సూచిక.

అటువంటి మహా గ్రంథం 800 పుటల్లో కాస్త క్లిష్టమైన భాషలో ఉండటం వల్ల చాలా కాలంగా నేటి తరాలకి అందుబాటులో లేకపోయింది. గతంలో కూడా ఆ మహాగ్రంథం చదివిన వారు బహుకొద్దిమంది మాత్రమే. అలాంటి విలువైన పుస్తకాన్ని నేటితరాలకు, ముఖ్యంగా యువతకు అందుబాటులోకి తీసుకొచ్చే కార్యక్రమం ఇది. డా. పి.ఎస్. ప్రకాశరావుగారు ఎంతో హృద్యంగా 180 పుటల్లో అందరికి అర్థమయ్యే తేలికపాటి భాషలో సరళమూ, సంక్షిప్తమూ చేసిన కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్రను, పెద్దలు వకుళాభరణం రామకృష్ణ గారి అభినందన వాక్కులతో, అందమైన ఫొటోలతో, సేకరించిన కందుకూరి ఉల్లేఖనలతో కలిపి ' డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ' ప్రచురించి, ఉచితంగా అందిస్తోంది. అంతేకాదు, ఎక్కడికక్కడ పద సూచికలతో పాటుగా క్లిష్టమైన పదాలకి అర్థాల్ని కూడా చివర్లో ఇవ్వడం జరిగింది. హితకారిని సమాజ రక్షణ కోసం ఆరోజుల్లో రాజమహేంద్రవరం పురప్రజలకు కందుకూరి వీరేశలింగం గారు చేసిన హృద్యమైన విజ్ఞప్తి ఈనాటికి వర్తిస్తుంది.

ఇంతటి విలువైన గ్రంథాన్ని ఇంత కాలానికి ఇలా, నేటి తరాలకి అర్థమయ్యేలా మలిచిన రచయిత మిత్రులు ప్రకాశరావు గారు, మంచి మానవీయ విలువలు కలిగిన సాహిత్యం తెలుగువారికి అందించాలనే ఉద్దేశంతో తన 21 వ ప్రచురణగా ప్రచురించిన మిత్రులు, పెద్దలు డా. చెలికాని స్టాలిన్ గారి మానస పుత్రిక, "డా.చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ" కి ప్రత్యేక అభినందనలు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా చదవాల్సిన అద్భుతమైన జీవితకథ ఇది. .

(ఫేస్‌బుక్ సౌజన్యంతో...)

గత 2 దశాబ్దాలుగా విద్యార్థిని విద్యార్థులను ఎంతో ఉన్నతంగా చక్కని క్రమశిక్షణతో తీర్చిదిద్దుతున్న, శ్రీ హనుమంతరాయ జూనియర్ కళాశాల వారు, సహృదయ మిత్రమండలి వారికి రజతోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా వారికి మా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాము.

శ్రీ A. **ఆనంద్,** ప్రిన్సిపాల్
హనుమంతరాయ జూనియర్ కళాశాల, పిఠాపురం.

ఆత్మ విశ్వాసం అలవర్చుకోవాలి, మహాద్భుతము సాధించడానికి దృఢ నమ్మకము మూలం.

పొలమారిన జ్ఞాపకాలు... పిఠాపురం నూర్జహాన్ సెంట్.

ద్రాక్షారామం దూళ్ళసంతలో కొన్న సూడిగేదితో పాటు బరువుగా అడుగులేస్తూ దాన్ని తోలుకుంటా మా వూరి వేపొస్తున్నాడా దెయ్యాల ధర్మారెడ్డి.రాజుగారి హాల్లోకి కొత్తగా వచ్చిన పెత్తందార్లు సినేమా గురించి తెగ చెప్పుకుంటా పోతున్నాడా ఎనౌన్స్ మెంటు బండి కొండగాడు. స్టూడెంట్సు వీఎస్సెమ్ కాలేజీలోకి నడిచీ,సైకిళ్ళమీదా తెగెళ్ళిపోతుంటే ప్రిన్సిపాలు గణేశ్వర్రావు గారు మట్టుకు సూటేసుకుని వెళ్తన్నారా రిక్షాలో.

పిచ్చి తాతారెడ్డి సైకిల్ షాపులో అద్దికి తీసుకున్న ఆ పొట్టిసైకిలెక్కి చాలా జోరుగా తొక్కుకుంటా వస్తున్న నేను, దారికి ఎడం పక్కనే కొత్తగా పెట్టిన మాచారం శ్రీహరిగారి పెట్రోలుబంకు దాటుతుండగా ముక్కుకేదో సువాసన తగలడంతో సడన్ బ్రేకేసి దిగిపోయాను.

ఎక్కడ్నించొస్తుందా ఆ సువాసన అని చూస్తే .... నా పక్కనించే వెళ్తన్న ఆ ఇద్దరు ఆడాళ్ళ బట్టల్లోంచని తేలింది. పొట్టి సైకిలు నడిపించు కుంటా వాళ్ళెనకాలే వెళ్తున్న నా ముక్కుకి ఆ వాసన తగుల్తానే వుంది.ఇంతకు ముందెప్పుడూ ఎరగని వాసన.... .అసలు పుట్టేకా నేనెరగని సువాసన. అప్పట్నించి, ఆరాత్రి నిద్రపోయేదాకా ఆలోచిస్తానే వున్నానా సువాసన గురించి.కలత నిద్దట్లో కలలు. ఆటి నిండా ఆ సువాసనలే.

తెల్లారేకా గబగబా తయారై పోయి సైకిలు మీద ఆ శ్రీహరిగారి పెట్రోలుబంకు దగ్గర కాపుగాసేను.

పావుగంటైంది,అరగంటైంది,గంటైంది.నిన్నటి టైమైంది.

చూస్తే......గులాబీ రంగు ఆర్గండీ చీరలు కట్టుకునొస్తున్నా ఇద్దరు ఆడోళ్ళూ నా పక్కనించే వెళ్తుంటే అదే సువాసన. గాలి ఎగబీల్చి వదుల్తున్నాను ..ఎంత బావుందీ వాసన.

సన్నగా, పొడుగ్గా ఉన్న వాళ్ళచేతుల్లో వున్న పుస్తకాల్ని బట్టి ఇదే కాలేజీలో చదూకుంటున్నారని అర్ధమైంది. దాంతో రోజూ ఇదే చోటు కొచ్చి కాపలా కాస్తున్న నన్ను చూసిన వాళ్ళిద్దర్లో పెద్దామె విసురుగా నాదగ్గర కొచ్చి, “చూస్తే చిన్న కుర్రోళ్లాగున్నావు....రోజూ ఇక్కడ నిలబడి ఏంటిదీ?” అంటా కేకలేయటం మొదలెట్టింది.

మొత్తం భరించేకా చిట్టచివర్లో నోరు విప్పిన నేను ” రోజూ ఇక్కడ నిలబడ్తుంది మీ బట్టల్లోంచొచ్చే ఆ సువాసన కోసం అక్కయ్యా...” అనేటప్పటికి నోరెళ్ళబెట్టినాళ్లిద్దరూ చాలా మంచి ఫ్రెండ్సయి పోయేరావేళ్టినించీ.

ఆ పెద్దామె విజయలక్ష్మి, పక్కనే వున్న ఆ చెల్లెలు శారద.....రోజూ వాళ్ళు బట్టలకి రాసుకునేది పిఠాపురంలో తయారయ్యే నూర్జహాన్ సెంటు.

డబ్బులు పోగేసుకుని తొందర్లోనే పిఠాపురమెళ్ళి ఆ నూర్జహాన్ సెంటుసీసాకాయి కొని తెచ్చేసు కుందారనుకుంటున్నాను గానీ ఎప్పటికప్పుడు ఏదో ఒక అడ్డు, ఏదో ఒక ఇబ్బంది.

ఆ వేళ పొద్దుట మా ఇంటి ముందున్న ఎఱ్ఱ కంకర దారమ్మట నడుచుకుంటా వెళ్తున్న సత్తోరి సత్యనారాయణరెడ్డి రాసుకున్న అత్తరు వాసన ఆ దారంతా ఆవరించుకుపోడంతో నూతి దగ్గర నీళ్ళు తోడుకుంటున్న ఆడోళ్ళంతా మాగొప్పగా మాటాడేసుకుంటున్నారా సువాసన గురించి.

వింటున్న నాకు ఆ నూర్జహాన్ సెంటు ముందు ఈవాసనేమూలకీ పనికి రాదని పించడమే గాకుండా ఆ ఆడోళ్ళ మీద కోపం కూడా వచ్చేసింది.

ఆవేళ సాయంత్రమప్పుడు మా వూరి లాకుల మధ్యున్న మొండి మీద కలతిరుగుతున్న నా ముక్కుకి సెంటు వాసన తగలడంతో తలెత్తి చూసేను.

దిగువలో వున్న కాకివారి సావరం శివార్లో ఉండే యండమూరి క్రిష్ణవేణి గారు ఉప్పాడ కలనేత చీర కట్టుకెళ్ళిపోతుంటే ఆవిడగారి దగ్గర్నించొస్తుందా వాసన. బావుంది. కానీ, నేనంతగా ఇష్టపడ్తున్న నూర్జహాన్ సెంటు ముందెందుకూ పనికి రాదా క్రిష్ణవేణి రాసుకున్న అత్తరు వాసన.

ఆ మార్చినెల తర్వాత మెడ్రాసెళ్ళి పోయిన నేను, నలుగురు కుర్రోళ్ళతో కల్సి ఆ మద్రాస్ ,ట్రస్ట్ పురం థర్డ్ క్రాస్ స్ట్రీట్ లోవున్న సిరిసిరిమువ్వ సినిమా ఆఫీస్ వెనకాల ఔట్‌హౌస్‌లో ఉంటున్నాను.

మా రూమ్మేట్స్ లో ఒకడైన రాజశేఖర్ సినిమాల్లో వేషాల కోసం ట్రై చేస్తున్నాడు. రాత్రుళ్ళు నిద్రపోకండా సిగరెట్లు కాలుస్తా ఇంగ్లీష్ నవలలు చదూతున్నాడు.

ఆ వేళ రాత్రి ఒంటి గంట దాటినా నిద్రపట్టక చాప మీద దొర్లుతున్న నాతో “ ఆర్కాట్ రోడ్లో ఇరానీ చాయ్ దొరికే హాలీవుడ్ హొటల్ కెళ్దామా?”అన్నాడు.

“ సరే” అంటా లేచి బయల్దేరేను అతని వెనకాల.

ఆ వీధి చివర్లో వున్న కొడవటిగంటి కుటుంబరావు గారింటి కుడిపక్కకి తిరిగి కొంతదూరం నడిస్తే వచ్చే ఆ ఆర్కాట్ రోడ్ వేపెళ్తున్నాం.

అలాగ కొంత దూరం వెళ్లేకా స్టోన్ వాష్ పేంటూ,టీ షర్టూ వేసుకున్న ఒక ఆడమనిషి మమ్మల్ని క్రాస్ చేసుకుంటా వెళ్తుంటే ఏదో సెంట్ వాసన ఆ మనిషి దగ్గర్నించి.

ఆ మనిషిని చూస్తా నావేపు తిరిగిన శేఖర్ “మౌంట్ రోడ్లో ఉన్న ఒక క్లబ్ లో కేబరే డేన్సర్ తను. ఆ మనిషి రాసుకున్న ఆ సెంట్ పేరు ఇంటెన్స్ జాస్మిన్.....బాగుంది కదా?”అన్నాడు.

"పిఠాపురం నూర్జహాన్ సెంటంత బాగోలేదు."అన్నాను.

" అంత బాగుంటుందా ఆ నూర్జహాన్ సెంటు?"

" చాలా....నాకు" అన్నాను.

ఇంకొంచెం ముందు కెళ్ళేకా వచ్చిన ఆ హాలీవుడ్ హొటల్లోపలి కెళ్ళి టీ ఆర్డర్ చేసిన అర నిమిషం తర్వాత ఎవరో లోపలికి రావడంతో జనాల్లో సందడే సందడి. చూస్తే ......రజనీకాంత్. అందరి కేసీ నవ్వుతా చూస్తా మా పక్క నించెళ్తుంటే అతను స్ప్రే చేసుకున్న పెర్ ఫ్యూమ్ వాసన నా ముక్కుకి తగిలింది.

టీ తాగి బయటి కొస్తుంటే "ఆ రజనీ రాసుకున్న పెర్ ఫ్యూమ్ పేరు తెల్సా?" అన్నాడు శేఖర్.

"తెలీదు." అన్నాను.

"క్రోమ్ లెజెండ్......ఎలాగుందీ?.... నూర్జహాన్ సెంటే బాగుందా?. " అంటా సిగరెట్ వెలిగించు కున్న ఆ రాజశేఖర్" రైటర్ పేట్రిక్ సుష్కింద్ రాసిన పెర్ ఫ్యూమ్ అనే నవల చదివేను.అందులో హీరో లక్షణాలు కొన్ని నీకున్నాయి."

" ఏంటయ్యా?"

"పరిమళం అనేది ఎక్కడున్నా ఇట్టే పసిగట్టేసి అదెలాగుందో లెక్కలు గట్టేస్తావు."

" మీరు చెప్పిన నవలలో హీరో కూడా నాలాగేనా?"

"వాసన రెండు కిలోమీటర్ల దూరంలో వున్నా పసిగట్టేసి పరిగెడ్తాడాడు"

" ఔనా!!....మరదీ కేరెక్టరంటే..... నేనతన్లా కాదు గదా?."

అలా ఆ పెర్ఫ్యూమ్ హీరో గురించి మాటాడుకుంటూ ఆ ట్రస్ట్ పురం వీధుల్లో కలతిరుగుతా వుంటే తెల్లారి పోయింది.

సినిమాల్లో పని చేస్తానే కథలు రాసే ప్రయత్నాలు చేస్తున్న నేను, పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు ఎడిటర్గా చేస్తున్న ఆంధ్రజ్యోతికి "శీలం పోయింది వెతకండి"అన్న పేరు పెట్టి, చెడి పోయిన ఒక అతి మంచోడి కథ రాసి పంపేకా, పని మీద విజయవాడ వెళ్ళి నప్పుడు ఆ పత్రిక ఆఫీసు కెళ్తే, నవ్వుతూ నన్ను పలకరించిన శర్మగారు "కథేగాదు రాసిన కాయితాల్నిండా కూడా ఆ సెంటు వాసనే సుమా!" అంటా ఆశీర్వదించేటప్పటికి ఒకటే ఆనందం నాకు.

ఆళ్వార్పేట జంక్షన్లో బస్ దిగి, ఆనంద్ హొటల్ అవతల పేవ్మెంట్ మీంచి నడుచుకుంటా వెళ్తుంటే తెల్లటి చెవర్లెట్ కారులో కూర్చుని తెల్లటి పట్టుచీరలో అందంగా తయారై వెళ్తున్న వైజయంతిమాల కనిపించే టప్పటికి ఆవిడే రకం సెంటు రాసుకుందో?.. అనిపించింది.అసలేం రాసుకో పోయినా మాగొప్పగా గుభాళించే అందం ఆ మధుమతిది. ఆవిడ గారు ఆ కారడివిలో..."ఆజారే పరదేశీ" అంటా పాడుతుంటే ఎన్ని రకాల పరిమళాలు పూచాయనీ ఆమె లోంచీ !!! చాలు చాలు ఇంకా ఎందుకా శరీరం మీద మళ్ళీ పరిమళం పూత?

ఆలోచిస్తూ నడుస్తున్న నేను సర్ సి.వి. రామన్ రోడ్ ఎడం పక్కకి తిరిగితే విక్టరీ మధుసూదనరావు గారిల్లు. ఇప్పుడు నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నది ఆయన దగ్గరే.

వేషాలకనీ, ఇంకా ప్రొడక్షనూ, డైరెక్షన్ డిపార్ట్ మెంట్లలో పనులకనీ వచ్చిన జనాలు పల్చగా నిలబడున్నారా ఇంటిముందు. ఇంకా మేడమీంచి దిగలేదు డైరెక్టర్ గారు.

కర్ర్ ర్ర్ మంటా చప్పుడొస్తన్న ఆ ఇనప గేటు తోసుకుని లోపలి కెళ్ళబోతుంటే జాయ్ మంటూ వచ్చాగింది లేత నీలం ఫియట్ కారు.అందులోంచి దిగిన కాంచనగారు టకటక మనే చెప్పుల చప్పుడుతో నన్ను క్రాస్ చేసుకుంటా లోపలి కెళ్తుంటే ఆమె స్ప్రే చేసుకున్న ఫారిన్ పెర్ ఫ్యూమ్ వాసన ఆ ఏరియా అంతా పాకి పోతుంది.

ఆ వాసన పీలుస్తా ఆలోచిస్తుంటే మళ్ళీ టకటకా చప్పుళ్ళు. నా దగ్గర కొచ్చిన కాంచనగారు" డైరెక్షన్ డిపార్ట్‌మెంట్లో అప్రెంటీస్‌గా చేరింది నువ్వేనా?" అన్నారు.

" ఔను మేడమ్"

" పాండీ బజార్లో ఉన్న రాణీ బుక్ సెంటర్ లో కెళ్ళి ఆస్కార్ వైల్డ్ డోరియన్ గ్రే, మా బీడిక్ నవలలూ పట్రా బాబూ" అంటా డబ్బులిచ్చేరు.

"సరే మేడమ్‌గారూ" అంటూ కదుల్తుంటే "ఇదిగో అబ్బాయ్ బయటున్న నా కార్లో వెళ్ళి తొరగా రా"

"అలాగే నండీ" అంటూ ఆ నీలం ఫియెట్ కారెక్కేనో లేదో ఇప్పుడే ఆమెగారు దిగిన ఆ కారు నిండా ఆ ఫారిన్ పెర్ ఫ్యూమ్ వాసన. దీన్నీ నూర్జహాన్నీ పోల్చుకుంటూ నా ఆలోచన్లు.

మన్యం నారాయణరావు హొటేల్నిండా జనాలే జనాలు,అద్దంకోరి కిళ్లీ కొట్టు దగ్గరా,మీరాసాహెబ్ దర్గా దగ్గరా,దూలిపూడి సీతారావయ్య కిళ్లీకొట్టు దగ్గరా జన్మలో ఎప్పుడూ ఎరగనంత మంది జనం.వందలా...వేలా...పదివేలా..లక్షా.. అసలేంటా జనం?.....తను పుట్టేకా అంత మంది జనాన్ని ఎప్పుడు చూసిందా యానాం రేవు???.

కొత్త సినిమా ఎదురీత షూటింగ్ ఈ రేవులో మొదలవ్వ బోతుంది. ఇప్పడో ఇంకాస్సేపట్లోనో ఎన్టీవోడు దిగబోతున్నాడు.అందుకే ఈ జనాలు. అందుకే ఈ అరుపులు. అందుకే ఈ సందడి.

తెల్లకారొకటి రేవులో ఆగుతుంటే మొదలై పోయిన అరుపులూ కేకలూ అలాగిలా లేవు.

నెమ్మదిగా ఆగిన కారు దగ్గరకి గబగబా పరుగెట్టు కుంటా వెళ్ళినా కుర్రోడు డోరు తెరిచేటప్పటికి చాలా వయ్యారంగా దిగిన ఆ మనిషి ఎన్టీవోడు కాదు.

"వాణిశ్రీ రా...వాణిశ్రీ.......వాణిశ్రీ రోయ్ వాణిశ్రీ."

ఎంతకాలం జీవించామన్నది కాదు, ఎంత గొప్పగా బ్రతికామన్నదే ముఖ్యం.

చాలా నాజూగ్గా దిగుతున్న నాణ్యమైన ఆ వాణిశ్రీ శరీరం లోంచొస్తున్న మాగొప్ప పరిమళాలని చాలా దగ్గర్లోనే ఉన్న నేను పీలుస్తున్నాను......అలా పీలుస్తూ తల్చుకుంటున్నాను..ఆలోచించు కుంటూ పోల్చుకుంటున్నాను.

అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా మొదటి సినిమా ఎదురీత ఐతే ఆఖరి సినిమా సీతాకోకచిలుక. తర్వాత మంచుపల్లకీ సినిమాతో డైరెక్టరయిన నేను ఆ నూర్జహాన్ సెంట్ తెప్పిద్దామనీ అలా కాదులే ఆ పిఠాపురం మనమే వెళదామనీ చాలాసార్లనుకున్నాను.వెళ్ళలేక పోయేను. ఆ ఊరి మధ్యలోంచెళ్తా కూడా ఆ నూర్జహాన్ కంపెనీ ముందాగలేక పోయేను. ఇలా నాకే గాదు చాలా మందికి చాలా విషయాల్లో జరుగుతుంటుంది.

కానీ, నేను రాస్తున్న కథల్లోనూ తీస్తున్న సినిమాల్లోనూ నూర్జహాన్ సెంట్ టాపిక్ తీసుకొస్తానే ఉన్నాను.

చాలా ఏళ్ళు గడిచి పోయినియ్యి. కుర్రతనం పోయిన నాకు చాలా ఏళ్ళు వచ్చేసినియ్యి.

మొన్న మార్చిలో.... అన్నవరం వెళ్తన్నప్పుడల్లా వింటావస్తున్న ఆ శాంతి ఆశ్రమానికెళ్ళేను.

అక్కడున్నాడు. ఆనాటి మిత్రుడు వీరెడ్డి.

అతనూ నేనూ, తెల్లవారు ఝాములప్పుడు, ఇంకా పూర్తిగా పాడవ్వని ఆ శాంతిఆశ్రమం చుట్టు పక్కల పల్లెటూళ్ళ వీథుల్లో మోర్నింగ్ వాక్ కెళ్ళొస్తా చాలా విషయాల గురించి చర్చించు కుంటున్నాం.

ఆవేళ మా మాటల్లో...... "ఈ మూల కొండల దిగువలో ఉంటున్న మాకు చిన్నచిన్న పన్లు బడితే పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కత్తిపూడి వెళ్తాం. కొంచెం పెద్దపన్లైతే దూరంగా వున్న పిఠాపురం వెళతాం" అన్నాడు వీరెడ్డిగారు.

చాలా చరిత్రున్న ఆ పిఠాపురం గురించి చాలా మాటాడు కున్నాకా నూర్జహాన్ సెంట్ గురించి ఎత్తితే" పరిమళ ద్రవ్యాలు నేను వాడన్లెండి....మీ మాటలు జూస్తుంటే వాటి మీద మీకు చాలా మోజుందను కుంటున్నాను" అన్నాడు.

ఆ సెంటు మీద నా చిన్నప్పట్నించీ జరిగిన కథలు చెపితే "ఔనా....వాళ్ళ తాలూకు మనిషొకాయన ఇక్కడ ఉండాలండీ! ...ఐనా ఆ పిఠాపురంలో నాకు తెల్సినోళ్లు బానే వున్నార్లే" అన్నాడో లేదో మర్నాడు సాయంత్రం కొంత మంది జనాలు దిగేరు నేనుంటున్న ఆ కాటేజ్ లోకి. నన్ను వాళ్ళకి పరిచయం చెయ్యబోయిన వీరెడ్డితో "మాకీయన గురించి తెల్సు" అన్నాడొకాయన.

తలెత్తి అతన్ని జూస్తే...,ఆ నూర్జహాన్ కంపెనీకి ఈ తరం యజమానంట.

ఆ సెంటు గురించి చిన్నప్పట్నించీ నా కథలు చెపితే "కొన్ని నాకు తెల్సు ....."అన్నాకా మాటలు మొదలైనియ్యి.

అలా కాసేపయ్యేకా "మరైతే ఎప్పడొస్తారూ మన ఇండస్ట్రీకి?"అన్నారు.

ఈ శాంతి ఆశ్రమంలో నా ప్రోగ్రాం చెప్పేను.

"చూస్తుంటే సడెన్‌గా మీ షెడ్యూలు మారి జంపై పోతారేమో అనిపిస్తుంది రేపొచ్చెయ్య గూడదూ" అన్నారు.

ఎవరో వచ్చి నడిపిస్తారని ఎదురు చూడకు, నీకు నువ్వుగా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగు.

నేనూ వీరెడ్డిగారూ కల్సిమాటాడు కున్నాకా వాళ్ళవేపు తిరిగి" రేపు సాయంత్రం ఐదు గంటల కల్లా మీ దగ్గరుంటాం" అన్నాను.

"ఆ టైముకి కాచుక్కూచుంటాం మీ కోసం" అనేసి ఆళ్లెళ్ళి పోయేరు.

ఏనాటి నూర్జహాను సెంటూ అది తయారయ్యే చోటికి ఇన్నేళ్ళ తర్వాతెళ్తున్నానా! అనుకుంటుండగా గొల్లప్రోలు ఎప్పుడో దాటేసిన మా కారు పిఠాపురం ఊళ్ళో కొచ్చేసి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగుండా వున్న ఆ పింక్ కలర్ బిల్డింగ్ ముందాగింది.

"మీరు చెప్పిన నూర్జహాన్ సెంట్ల కంపెనీ ఇదే సారూ" అన్నాడా డ్రైవర్ సత్తిబాబు.

ఆ బిల్డింగ్ నే చూస్తా ఇనపగేటు దాటి లోపలికెళ్తుంటే ఎదురొచ్చిన దాని ఓనర్ గారు "రండ్రండి.... మీరు రారనుకున్నాను" అన్నారు.

లోపలి కొచ్చిన నేను నిలబడి నాలుగుపక్కలా చూస్తుంటే "వర్క్‌షాపు, లేబ్ లోపలున్నాయి.... అంటా అంతా చూపించేకా....."ఎలాగుంది మా కంపెనీ?" అన్నారు.

"నేను ఊహించుకున్నట్టు లేదు" అన్నాను.

వాడపల్లి పెంకుల్తో నేసిన మండువా లోగిలిలాంటి ఒక మేడ ఫొటో చూపించి "మా కంపెనీ మొదటి బిల్డింగ్ ఇది" అన్నారు.

దాన్నే ఆత్రంగా చూసిన నేను" ఇదీ నా ఊహల్లో వున్న మీ కంపెనీ" అన్నాను.

నవ్వేసినాయన " ఆరోజుల్లో కోట గుమ్మం సెంటర్లో వుండేది" అన్నారు.

నూర్జహాన్‌సెంట్ వాసన నా జీవితంలో ఒకేసారి చూసి, అలా ఇన్ఫ్లుయెన్స్ అయిన సంగతి ఆయన్తో చెప్పి, అలా ఎందుకయ్యేనో చర్చిద్దాం అనుకునే లోపల మా మధ్యలో కొచ్చేసిన వీరెడ్డిగారు "నూర్జహాన్ అంటే ముస్లిమ్స్‌ది అనుకున్నాను" అన్నాడు.

"అంతా అదే అనుకుంటారు కానీ మేం కాదు. మా నాన్న గారి పేరు దేవరపల్లి సత్యనారాయణరావు. నా పేరు శ్రీనివాసరావు. 1944 లో ఈ కంపెనీ పెట్టేరాయన.

రకరకాల బ్రాండ్ నేమ్స్‌తో ఎక్కడికక్కడ పేర్చి వున్న ఆ సెంట్‌సీసాల్ని, వాటిని పేర్చే అట్ట పెట్టెల్నీ చూస్తున్న వీరెడ్డికి తాళమేసున్న ఒక గది కనిపించడంతో "అదేంటీ?" అన్నాడు.

"ల్యాబ్....సెంట్ ఫార్ములా తయారు చేసే ఆ ప్లేస్‌కి మా ఇంట్లో వాళ్ళు తప్ప బయటి వాళ్ళని ఎలవ్ చెయ్యం."

"రామచంద్రపురంలో ఆర్టోస్ కూల్‌డ్రింక్ ఫార్ములా కూడా ఇంతే... బయటి వాళ్ళని లేబ్‌లోకి రానియ్యరు...సరే ,ఈ సెంట్ తయారు చెయ్యాలన్న ఆలోచన మీ నాన్నగారికెలా వచ్చింది?" అడిగేడు వీరెడ్డిగారు.

''మంచి పెర్ఫ్యూం తయారవ్వాలంటే అది చేసే వాడికి మంచి ముక్కు ఉండాలి'' అని శ్రీనివాసరావుగారంటుంటే పెర్‌ఫ్యూమ్ సినిమాలో హీరో గుర్తొచ్చేడు మళ్ళీ.

"ఈ పిఠాపురంలో వుండే మనిషైన మీ నాన్నగారికి ఈ పెర్ఫ్యూం తయారు చెయ్యాలన్న ఆలోచన ఎలా గొచ్చిందో చెప్పండి ముందు" మళ్ళీ అడిగేడు వీరెడ్డిగారు.

"చిన్నప్పట్నించీ పరిమళ ద్రవ్యాల్ని బాగా ఇష్టపడేవారు మా ఫాదర్. మా ఇంట్లో ఉన్న ఒక సెంట్ బాటిల్ని బేంబూ బాటిల్ అని పిల్చేవాళ్ళంట. దాని బిరడా మీద గుండు సూదితో గుచ్చి తీసి ఆ సూదికి అంటుకున్న సెంటుని చొక్కాకి రాసుకుని బయటికెళ్ళే మా ఫాదర్‌కి సపరేట్ రికగ్నైజేషన్ ఊళ్ళో.

ఇదే సెంటు మన పిఠాపురంలో మనం ఎందుకు తయారు చెయ్యకూడదు అన్న ఆలోచనొచ్చిందాయనకి.

ఎంక్వైరీ చేస్తే బొంబే వెళ్ళి కొన్నాళ్ళు స్టడీ చేసి రావాలి దానికి చాలా పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది అని తేలింది.

చాలా పంతం పట్టుదల గలాయన, తన వాటా కొచ్చిన మూడెకరాలూ అమ్మేసి బొంబే వెళ్ళి అనుకున్నది సాధించు కొస్తున్నప్పుడు దారిలో, ఫరీక్ అనే రాజస్థాన్‌కి సంబంధించిన పెర్ఫ్యూం సప్లయర్ పరిచయమైతే ఆయన్ని కూడా వెంటబెట్టుకొచ్చేరు.

వారం రోజుల పాటు ఈ పిఠాపురంలో వున్న ఫరీక్ ,సెంట్స్ తయారు చెయ్యడంలో కొన్ని మెళకువలు మా నాన్నగారికి నేర్పి వెళ్ళిపోయేడు.

మా ఇంట్లోనే కంపెనీ పెట్టి తయారు చెయ్యడం మొదలెట్టిన మా నాన్నగారు చాలా సక్సెస్‌ఫుల్‌గా మొదటి సెంట్‌బాటిల్ బయటికి తెచ్చి దానికి పేరేం పెట్టాలా అని ఆలోచిస్తుంటే తనెక్కడో చదివింది గుర్తొచ్చింది.

"ఏంటీ?" అన్నాడు వీరెడ్డి.

"నూర్జహాన్ బేగం రకరకాల పెర్‌ఫ్యూమ్స్ వాడేదని..... దాంతో ఆవిడ పేరే కంపెనీకి పెట్టేసేరు.

"ఔనా!!! చాలా బాగుందండీ" అన్నాడు వీరెడ్డి.

"మన ఆంధ్రాలోనే గాకుండా అటు తమిళనాడూ ఇటు ఒరిస్సా ఇంకా చాలా రాష్ట్రాల్లో పాపులరైంది నూర్జహాన్ సెంట్."

"మీ సెంట్‌ని పిఠాపురం రాజావారు వాడేరా?"

"మా రాజా సూర్యారావు బహద్దూర్, వినోబాబావే, మైసూర్ మహారాజా ఫేమిలీ మొత్తం, రతన్ టాటా ఇలా చాలా మంది పెద్దవాళ్ళు వాడేరు."

"సినిమా వాళ్ళు...?"

"జమున , హరనాథ్, రాజసులోచనా, డైరెక్టర్ సి.ఎస్.రావూ వీరంతా మా ఇంటి కొచ్చేవారు... అలాంటి వాళ్ళెవరొచ్చినా నూర్జహాన్ సెంట్స్ కిట్ వాళ్ళకి బహుమతిగా ఇచ్చేవారు నాన్న."

"ఆయనెలా కాలం చేసేరు?"

"ఆపరేషన్ చేయడంలో డాక్టర్ నిర్లక్ష్యం వల్ల చనిపోయేరు. దానికి చాలా ఆగ్రహించిన మా పిఠాపురం జనం, ఆ డాక్టర్ని ఊళ్ళోంచి తరిమేసేరు" అంటా ఆయన చెప్పుకుంటా పోతుంటే టైము రాత్రి ఎనిమిది దాటేసింది.

"మీరు చెప్పేది వినడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రేపు బయల్దేరి మళ్ళీ వచ్చేస్తాం" అన్నాడు వీరెడ్డిగారు.

ఆ శ్రీనివాసరావు గారి దగ్గర కొచ్చిన నేను" మీ నూర్జహాన్ సెంటుని వాసన గురించి చాలా అడగాల్సిందుంది రేపు" అంటూ బయల్దేరేను.

ఆ శ్రీనివాసరావుగారి దగ్గర కొచ్చిన నేను, నా జీవితంలో నూర్జహాన్ సెంటు వాసన చూసింది ఒకే ఒక్కసారి అని ఇందాక చెప్పేను గదా?"అన్నాను.

"ఔను చెప్పేరు" అన్నాడాయన.

"ఆ పరిమళానికి ఆ వయసులో నేనెందుకంత ఇన్ఫ్లుయెన్స్ అయ్యేను? అన్న అంశం మీద రేపు డిస్కస్ చేద్దాం సార్"అనేసి బయల్దేరి, కీచ్‌మంటూ చప్పుడొస్తున్న ఆ ఇనపగేటు లాగి బయటి కొచ్చి ఆగున్న కారులో ఎక్కుతుంటే పరిగెట్టుకుంటా మా వెనకే వచ్చినా శ్రీనివాసరావు గారు " వంటింట్లో ఫుడ్ రెడీ అవుతుంది మీ కోసం. ముందు చెప్పడం మర్చి పోయినందుకు సారీ అండీ" అన్నారు.

"అయ్యో పర్లేదండీ రేపొస్తాంగా?"

" మిమ్మల్నిలా పంపితే చాలా గొడవలయి పోతాయి మా ఇంట్లో వాళ్ళతో....ప్లీజ్ కారు దిగి పైకి రండి" అంటా డ్రైవరు సత్తిబాబు వేపు చూస్తా "నువ్వు కూడారా తిందూగాని " అన్నారు.

మరి తప్పక దిగి అతనెనకాలే వెళ్ళేం.

పైకెక్కుతుంటే చీకట్లో మెట్ల మూల పడుకునున్న సూడికుక్క తోక మీద కాలెయ్యడంతో కయ్ మంటా లేచి మూలుక్కుంటా కిందకెళ్ళి పోయింది.ఆ పైకెళ్ళేకా వంటగదిలోకి పరుగెట్టు కెళ్ళొచ్చిన ఆయన "ఐపోవచ్చింది ఐదు నిమిషాలు రండి లోపల హాల్లో కూచుందాం" అన్నారు.

"బయట బాల్కనీలో బాగుంది గాలి బాగా వీస్తుంది" అన్నాడు వీరెడ్డి గారు.

అక్కడ లైటేసి, నాలుగు కుర్చీలు పంపించమని అరుస్తా "రండి" అన్నారు శ్రీనివాసరావు.

"ఈ ఏరియా కెప్పుడొచ్చినా ఆ సీజన్ని బట్టి మీ పిఠాపురం రైల్వేగేటు దగ్గర దొరికే మల్లిపూలూ ,మొక్కజొన్న పొత్తుల్లాంటివి కొంటుంటాను".

"ఫ్లైఓవర్ కట్టేసేకా ఇప్పుడయ్యేం అమ్మటం లేదక్కడ"

" ఔను.ఆ గేటే తీసేసేరు."

మేం మాటాడు కుంటుంటే "ఏవండీ......వంటయి పోయింది భోజనాలకి రావచ్చు" అన్న మాటలు వినిపించాయా చీకట్లోంచి.

వందమందికి అన్నం పెట్టే స్తోమత నీకు లేకపోయినా, ప్రేమతో ఒక్కరికి పెట్టుచాలు.

"ఓసారిలా రా ....నిన్ను పరిచయం చెయ్యాలి వీరికి.."అనా శ్రీనివాసరావు పిలవగానే, ఆ చీకట్లో మా వేపొస్తున్న కాళ్ళగొలుసు చప్పుళ్ళు బాగా దగ్గరగా వచ్చి మా ముందాగినియ్యి. ఆనాటి నూర్జహాన్ పరిమళం నా నాసపుటాల్ని తాకింది.

"నా శ్రీమతి" అంటూ ఆవిడ్ని మాకు పరిచయం చేసేరు శ్రీనివాసరావు.

తలెత్తి ఆవిడ్ని చూసిన నాకు మాట పడి పోయింది.....,మూర్ఛరాబోతుంది.

ఆవిడ..........

ఆనాడు నాకీ నూర్జహాన్ సెంటుని పరిచయం చేసిన

అక్కాచెల్లెళ్ళు విజయలక్ష్మీ, శారదల్లో...

ఒకరైన శారద.

– డైరెక్టర్ వంశీ,

(సౌజన్యం : Facebook)

ఆగస్టు 15

శతజయంతి నివాళి

– ఆరుద్ర

మూలపడి విరిగిన చరఖా
గాంధీజీ పేరు అనే బురఖా
ధరించి వచ్చిన ఈ తారీఖు
మా చెడ్డ నిషా చేసే అరఖు

నట్టనడి సముద్రం హంగరు
ఎత్తరేం జీవితం లంగరు
ఎలా వుందో పీపులు పల్సు
ఏ నాయకుడికయ్యా తెల్సు?

గూనినడ్డితో ఎగిరే జెండా
నింపింది నిరాశ దేశంనిండా
ఏదయ్యా స్వరాజ్యం అంటే
అదే పదివేలు కదా వింటే!

ఆగదే ఆకలితో పోరాటం,
ఆరదే దహించే ఆరాటం!
అశాంతి కోటిన్నర వోల్టులు!
ఎక్కడ చూసినా రివోల్టులు!

స్వేచ్ఛగా వీస్తుందా గాలి
నేడు, మనకర్మం కాలి?
మచ్చుకేనా లేవు పచ్చికబైళ్ళు
రెచ్చిపోయాయిగానీ జైళ్ళు.

గరుత్మంతుళ్ళు తెచ్చిన అమృతం
దక్కింది అనుకోడం అనృతం
దర్భలు నాకేరు మన ఏలికలు
అందుకే ఈ నాలుకల చీలికలు

కరిమింగింది వెలగపండు
కాదు కాదంటే పోనిండు
మన స్వతంత్రం మేడిపండు
మన దరిద్రం రాచపుండు



నలుగురిలో ఉన్నప్పుడు నీ నాలుకను కాసుకో, ఒంటరిగా ఉన్నప్పుడు నీ హృదయాన్నే కాసుకో.

ప్రజాపాట
ఆధునిక మహాతత్వ గీతం

One good thing about music, when it hits you, you feel no pain. It heals the soul and brings people together .

- *Bob Marley, Jamaica Singer,*

ప్రపంచ ప్రసిద్ధ గాయకుడు బాబ్ మార్లే చెప్పినట్టు పాటకు ప్రాణముండాలి. అది మన పంచేంద్రియాలకు పచ్చిగా తాకాలి. పాటకు హృదయాలను కదిలించే బలం ఉండాలి. అది నిరాశ ఆవరించి ఎడారిలా మారిన మనిషి లోపల సెలయేళ్ళను పారించాలి. పాట మనిషి అంతరంగాన్ని పదునెక్కించాలి. చీకటితో మూసుకున్న మనో నేత్రాలను విప్పారించి వేలకాంతులు ప్రసరింపజేయాలి.

పాట నిన్నూ నన్నూ ప్రతి ఒక్కరిని కదిలించి, ఒక్కటిగా నడిపించాలి. అట్లా నడిపించే పాటే మహాతత్వ గీతం అవుతుంది. ఇప్పుడు అట్లా మహాతత్వ గీతమై తెలుగు నేలంతటా వినబడుతున్న పాట “శిలా నీవే శిల్పి నీవే, శిల్పం నీవే సృష్టిలో నిన్ను నీవు మలుచుకుంటూ నిలిచిపో చరితలో” ఈ పాట రాసినది ప్రజాకవి జయరాజు. అద్భుతంగా పాడినది విజయ్ జేసుదాసు మ్యూజిక్ అందించినది, బల్లేపల్లి మోహన్, నిర్మాత బొమ్మక్ మురళి. ఈ పాట యూట్యూబ్‌లో ప్రధానంగా అయిదు ఛానల్స్‌లో అప్లోడ్ చేయబడి ప్రజలకు చేరువైంది. జయరాజు ఛానల్లో పదకొండు లక్షల ముప్పై నాలుగు వేలమంది చూడగా, బల్లేపల్లి మోహన్ ఛానల్లో పదిహేను లక్షల నలభై వేలమంది చూశారు. బివినాయక్ అఫిషియల్ ఛానల్లో ఆరు లక్షల యాభై వేల మంది, సాయి డ్రీమ్స్ ఇన్ రియాలిటి అనే ఛానల్లో మూడు లక్షల నలబై ఎనిమిది వేలమంది చూడగా, బొమ్మకు మీడియాలో అరవై వేలమంది చూశారు. ఇంకా కొన్నిటిలో కలిపి ఇలా మొత్తంగా నాలుగు. మిలియన్ల మంది ఈ పాటకు యూట్యూబ్‌లో అభిమానులు ఉన్నట్టు రికార్డ్ అయింది. ఇది అంత సామాన్య విషయమేమి కాదు. ఎందుకంటే సోషల్ మీడియాలో ఎక్కువ వ్యూస్ రావాలంటే నాలుగు నిమిషాలకు మించిన నిడివి ఉండకూడదని సామాజిక మాధ్యమాల నిపుణులు చెప్పేమాట కానీ ఇరవై మూడు నిముషాలు సుదీర్ఘంగా కొనసాగే ఈ తత్వగీతంకు ఆన్‌లైన్‌లో ఇన్ని వ్యూస్ రావడం, ఇంతమంది అభిమానులవడం ఒక బిగ్ రికార్డ్ అనే చెప్పాలి. అంతే కాదు. వాగ్గేయకారుడిగా జయరాజు ఈ పాటను ప్రత్యేకంగా ఇరవైకి పైగా సభల్లో ఆలపించారు.

పాట కవులందరు రాసినట్టు నాలుగైదు చరణాలతోనో, ప్రజా వాగ్గేయకారులంతా కైగట్టినట్టు పది, పన్నెండు చరణాలకో పరిమితమైన పాట కాదు. ఒక పల్లవి, ఇరవై అయిదు చరణాలతో మానవ తత్వాన్ని సమాజ గమనాన్ని పలువురు, మూడు సార్లు దున్నిన పాట ఇది. విన్న ప్రతి వారిలో తాత్విక గింజలు నాటే పాట ఇది. వింటున్న కొద్దీ ఒక చోట వ్యక్తిత్వ వికాసగీతంలా వినిపిస్తే, మరో చోట ప్రకృతి గీతంలా వినిపిస్తుంది. ఒక

చరణంలో సామాన్య శాస్త్రంలా. ఇంకో చరణంలో సమాజ పరిణామక్రమంలా తోస్తుంది. అట్లా అన్నీ కలిపి చూసినప్పుడు ఒక తత్త్వగీతమై మేల్కొల్పుతుంది. ఒకవైపు చెట్టు చేను, పుట్ట మట్టి, కొండ కోన, కొమ్మ రెమ్మ, ఇలా ఈ అవనిపై గల సకల జీవుల అంతర్యాన్ని విప్పి చెప్పాడు. మరోవైపు ఈ పుడమి అమ్మతనాన్ని, పాలుగారే చెట్టు తల్లి గుణం, ఆ తల్లుల ఆవేదనను, ప్రతీ మనిషి సంవేదనను, బతుకు అర్థాన్ని, బాధ్యతలను గుర్తు చేస్తూ తాత్విక గానం చేశాడు. ఈ ఒక్క పాటలో మానవ జీవితంలోని అన్ని పాశ్వాలను తడిమాడు. పంచేంద్రియాల పదునై, పచ్చని ప్రకృతి అదునై, కృష్ణ గోదావరి మధ్యనున్న పాటల పరివాహక ప్రాంతాల చదునై ఈ తత్త్వగీతాన్ని నిలబెట్టాడు. కోయిల రాగంలా, తుమ్మెదల నాదంలా, నెమలి నాట్యంలా, తేనె మధురిమలా ఈ పాటను ప్రజల మెదళ్ళలోకి ఎక్కించాడు ప్రజాకవి జయరాజు.

వివిధ మత గ్రంథాలు పుట్టుక గురించి ఏవో కట్టుకథలు బోధిస్తాయి. అతీత శక్తుల గురించి, దైవం, దెయ్యం గురించి పుక్కిటి పురాణాలు చెప్తూ నిరంతరం భయంలో, అజ్ఞానంలో ఉంచాయి. వాటి ప్రచారకులు ఈ భూమి మీద మానవుని పాత్ర నిమిత్త మాత్రమని మనుషుల కళ్ళకు మాయపొరలు తొడుగుతూ వచ్చారు. పూర్వజన్మ పునర్జన్మల మూఢత్వానికి మానవ మేధను బంధీని చేశారు. ఈ బోధనలకు భిన్నంగా “పుడమిలో అణువణువు నీదే! పరవశించుట నేర్చుకో/ జీవితం ఇక మళ్ళీ రాదు సార్ధకం చేసుకో” అంటూ పునర్జన్మని నమ్మేవారి పిచ్చి నమ్మకాలపై తన పల్లవిని జ్ఞానాయుధం చేసి ఎక్కుపెట్టాడు. సృష్టిలో శిలా, శిల్పం, శిల్పి అన్నీ మనిషే. మనిషికి ముందు వెనుక ఏ అతీత శక్తి లేదు. కాబట్టి మానవుడు తన జీవితాన్ని అపురూప శిల్పంగా, స్మారక చిహ్నం (Monument)గా చేసుకుని, మహోన్నత వ్యక్తిగా చరితలో నిలిచిపోమంటున్నాడు జయరాజు, నుదిటి నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారని ఋగ్వేదంలో రాసిన పురుషసూక్తంను ధ్వంసం చేసి, నిజాన్ని నిలబెట్టేందుకు అక్షర క్షిపణులను విసిరాడు ఈ ప్రజాకవి. “ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు, జీవితంలోని కష్టాలను తీర్చలేనిది ఆవిష్కరణా కాదు. జీవితంలోని ప్రతి కోణాన్ని చూపించలేనిది సాహిత్యమే కాదు” అంటాడు ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. సరిగ్గా ఆయన మాటల సారాన్ని తత్వగీతంలో ఆవిష్కరించాడు జయరాజు. “పాడిపంటలు పసిడిరాసులు ఆలమందలు పాలధారలు/ గరికపువ్వులు గడ్డిపాన్పులు తుమ్మెదలు తూనీగనవ్వులు/ ఎన్నో ఉండి ఏమి లేదని బాధపడతావెందుకో/జీవించటంలో ఉన్న మధురిమ తెలుసుకోలేవెందుకో” అంటూ మన చుట్టూ ఉన్న అద్భుత సంపదలు, సకల జీవరాసులు, వింతలు, విశేషాలు, ఎంత చూసినా తనివి తీరని అందమైన ప్రకృతి కళ్ల ముందున్నాయంటున్నాడు. ఆ విషయం మర్చిపోయి కొంతమంది స్వార్థపరులు సృష్టించిన కృత్రిమ సంపద కోసం పరుగులు పెడుతూ జీవితాన్ని ఆస్వాదించలేని యాంత్రికతను జయరాజు ప్రశ్నిస్తూ మనల్ని కూడా ప్రశ్నించుకోమంటూ ప్రకృతి గానాన్ని ఆలపిస్తున్నాడు. భూమి మీద కురిసే పండు వెన్నెలను, ఆకాశంలో నడిచే నిండు పున్నమిని, విశ్వంలో విరబూసిన సింగిడి వెలుగుల్ని దర్శించడం, ప్రకృతిలో లీనమవడమే మనిషి పుట్టుకకు దక్కిన భాగ్యమంటూ అమూల్యమైన తాత్వికత మూటవిప్పి మనముందు కుప్పబోసాడు. లేని స్వర్గ నరకాల కోసం

బతుకులో మతం మత్తు కాకుండా, జ్ఞానపు వత్తి వెలిగించుకోమంటున్నాడు. ప్రాకృతికంగా జీవించడంలో ఉండే మధురిమను ఆస్వాదించమని హితబోధ చేస్తున్నాడు తత్వగీతాకారుడు జయరాజు.

"నీటిలో మన జన్మ ఉన్నది/ నిప్పులో చైతన్యమున్నది/ గాలిలో మకరందమున్నది, భూమిపైనే జీవమున్నది" అంటూ విశ్వంలోని ఎన్నో గెలాక్సీల్లో ఉన్న ఒక కోట్లాది అగ్నిగోళాల్లో ఒకటైన సూర్యుడి చుట్టూ తిరిగే గ్రహాల్లో భూమి అనే ఈ గ్రహంపైనే నీరు, గాలి ఉన్నదనే సైన్స్‌ను అత్యంత సరళంగా, అందరికి అర్థమయ్యే రీతిలో తన పాట ద్వారా విడమర్చి చెబుతున్నాడిక్కడ. నీటిలోని కణాలు, గాలిలోని తేమ వల్లనే జీవం ఏర్పడింది. నిప్పు వల్లే జీవులకు మెదడు వికసించి మానవజాతికి చైతన్యం కలిగిందనే డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని ఒక్క చరణంలో వ్యక్తం చేశాడు. కొండంత సృష్టి మర్మాన్ని ఇలా నాలుగు లైన్లలో విప్పి చెప్పే నేర్పుగల పాటగాడు, విజ్ఞానవేత్త జయరాజు.

"ప్రకృతే మన పంచప్రాణం/ ప్రకృతే మన కన్నతల్లి ప్రకృతి విధ్వంసమైతే/ ప్రాణ మాగేనో" అనే చరణం, అలాగే 'కొట్టినా నీ మేలు మరవని/ గట్టి గుణమీ చెట్టులో/ ఆకు తెంచితే పాలుకారే! అమ్మతనమీ కొమ్మలో" అనే ఈ రెండు చరణాలలో ప్రకృతే మన జీవనాధారమని, ప్రకృతి సకల జీవకోటి పుట్టుకకు కేంద్రం కనుకనే ప్రకృతిని కన్నతల్లి అంటున్నాడు కవి. ఈ ప్రకృతిలో ఒక్క మనిషే కాకుండా ఎన్నో జీవరాశులున్నాయని, వాటన్నింటికి ప్రకృతిపై సమానహక్కు ఉందంటున్నాడు. ప్రకృతిలో చెట్టును కొట్టినా, ఆకు తెంపినా పాలు కారుతుంది తప్పు పగపట్టదని, పైగా క్షమించే సుగుణముందనే ప్రకృతి తత్వాన్ని ఓ ప్రకృతి తాత్వికుడిగా మానవ మస్తిష్కాల్లోకి ఒంపుతున్నాడు. జయరాజు అదే సమయంలో కన్నతల్లి లాంటి కారడవుల (Deep forest ను మైనింగ్ కోసం కార్పోరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయొద్దంటున్నాడు. అడవికి ఆదరువు అయిన ఆదివాసీలు సంతాల్, గోండు, కోయ, కొలామ్, చెంచులాంటి ఆదిమజాతులు అంతరిస్తాయని, కొండ కోన, కొమ్మ రెమ్మ చెట్టు పుట్ట, మన్ను దన్నుతో పాటు అనేక జీవరాసులు అంతమవుతాయని గుండెపగులుతున్నాడు కవి. ప్రకృతిని కాపాడి, పర్యావరణాన్ని రక్షించాలనే మానవ కర్తవ్యాన్ని ప్రకృతి కవిగా గొంతెత్తి పాడుతున్న తెలంగాణ ఖలీల్ జిబ్రాన్ జయరాజు.

"తల్లిదండ్రులు భార్యపిల్లలు/ అన్నదమ్ములు అక్కచెల్లెలు/కొడుకులు కోడళ్ళు వాళ్ళ మనవలు మునిమనమరాళ్ళు/ పాతతరమే, కొత్తతరముగా ప్రతిఫలిస్తుందో" అనే ఈ చరణంలో మానవ సమాజపు తరతరాల గమనాన్ని, పునరుత్పత్తి పరంపరల చరిత్రను వివరించాడు. ఇందులో అంతర్లీనంగా గొప్ప ప్రకృతి సూత్రం ఇమిడి ఉంది. ఈ చరణం వింటున్నప్పుడు తత్వశాస్త్రంలో కారల్ మార్క్స్ చెప్పిన 'నెగేషన్ ఆఫ్ ది నెగేషన్' అనే గతితార్కిక సూత్ర సమాజ పరిణామగతి స్ఫురణలోకి వస్తుంది. "గాయపడకుండా. హృదయం గేయమవుతుందా! కలత పడకుండా మెదడు కావ్యమౌతుందా! ఆటుపోటులు ఎదురుదెబ్బలు లేనిజీవితమున్నదా! ఓర్పును చవి చూడకుండా మార్పుకు తావున్నదా" అనే చరణంలో కవి హృదయం గాయపడిన సంవేదనలోంచే గేయం పుట్టుకొస్తుందంటున్నాడు. ఎన్నో ఉలి దెబ్బలు తింటేనే శిల అద్భుతమైన శిల్పంగా రూపొందుతుంది. ఎన్ని కష్ట నష్టాలు ఎదురైనా కూడా మనిషి ధైర్యం సడలకుండా ముందుకు సాగాలని ఆత్మ విశ్వాసం నింపుతున్నాడు. యువతకు వ్యక్తిత్వ వికాస స్ఫూర్తిని పెంపొందిస్తున్నాడు కవి. పుట్టుకకు లక్ష్యం ఉండాలని, దానికోసం నిరంతర సాధన చేయాలని, బతుకు అర్థం తెలుసుకోవాలని యువజనానికి కర్తవ్యాన్ని బోధిస్తున్నాడు కవి జయరాజ్.

"దేవుడిని చేసింది నీవు/ దైవముగ కొలిచింది నీవు/ మతములను సృష్టించి/జనుల మతులను మార్చింది నీవు/మానవత్వమే మనిషికి మతము కావాలో/మనుషులంతా ఒక్కటేనని హితము పలకాలో" అనే చరణంలో మనిషి పుట్టిన తర్వాతే దేవుడు పుట్టాడని తేటతెల్లం చేశాడు. ఇంకా చెప్పాలంటే దేవుడిని మనిషి పుట్టించాడే తప్ప, మనిషిని దేవుడు సృష్టించలేదని కుండబద్దలు కొట్టినట్టు కైగట్టాడు. అజ్ఞానంలో నుండి పుట్టిన దేవుడు, మతం అనే భావనలను క్రమంగా దోపిడికి, వ్యాపారానికి, రాజకీయాలకు ఆలవాలంగా చేసుకుని జనాలను మందబుద్ధులను చేస్తూ, మనుషులను అంతం చేస్తున్నారని జయరాజు ఈ పాటలో ఆవేదన చెందుతున్నాడు.

మానవులంతా ఒక్కటేనని, మానవత్వమే మనిషికి హితమని చాటి చెబుతున్నాడు. "ధనము ఒక్కటే చాలదు/నీ గుణమును సరి చేసుకో" మని హితవు పలుకుతున్నాడు. మనిషి ఆస్తిపాస్తుల అగాథంలో పడి, స్వార్థపు అనారోగ్యంలో కొట్టుమిట్టాడుతూ, గొప్పలు చూపించుకుంటూ గప్పాలు కొడుతూ, స్నేహాన్ని సహాయం చేసే గుణాన్ని, స్పందించేతనాన్ని కోల్పోతున్నాడని జయరాజు ఆందోళన పడుతున్నాడు. "పాడిపంటలు కల దేశం/ పస్తులతో అల్లాడు తరుణం/ పేదలే నిరుపేదలై/ ధనవంతులే ధనవంతులై/ఆకలితో జనమొక్కటైతే ఆగమేనోయ్/ అంతరాలు లేని లోకమే శాంతివనమోయీ" సంపద వికేంద్రీకరణకి బదులుగా వేళ్ళ మీద లెక్కబెట్టగలిగే వారి వద్ద మాత్రమే కేంద్రీకృతం కావడం వలన ఆకలి మంటలు పెరిగి, ఆగ్రహంతో తిరగబడే జనాగ్రహాగ్నిలో అంతరాల లోకం దగ్ధమై, ఓ బుద్ధుడు, మార్క్సులు కలగన్న సమసమాజమనే శాంతిలోకం ఏర్పడటం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఈ తత్వగీతాన్ని ముగించాడు జయరాజు. ఇది నిజంగా ఈ కాలపు మహాతత్వగీతం. అందరూ వినాల్సిన, ప్రతీ ఒక్కరి ఇంట్లో వినబడాల్సిన పాట. అందరం' తప్పక విందాం. జయహెూ ప్రజాకవి, జయహో తత్వకవి జయరాజు.

- ఏ. విజయ్ కుమార్

(నవ తెలంగాణ పత్రిక సౌజన్యంతో)

పిఠాపురం సహృదయ మిత్రమండలి కమిటిసభ్యులకు, మరియు సంఘ సభ్యులకు నమస్కారములు. సుమారుగా 25 సం॥ల నుండి స్థాపించిన నాటి నుండి శ్రీ ఎన్. కేశవ రావు గారు ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గారు మరియు డా॥ ఎన్. సూర్యనారాయణ గారు ఇప్పటి వరకు అనేక సంఘ సభ్యులైన సహృదయులను చేర్పించుతూ ఇందు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, కమిటీ సభ్యులను ఇతర సభ్యులను ప్రత్యేకముగా ఆహ్వానించుచూ, "మద్యపాన నిషేదము, ఆవంత్స సోమసుందర్, స్వామి వివేకానంద, గురజాడ అప్పారావు గార్ల, అనేక కవి పుంగవుల జయంతులు నిర్వహించుచూ మరియు సహృదయ సంఘ సావనీర్ విడుదలకు, సహకరించుచున్న భాగస్వాములు అయిన శ్రీ తోట శ్రీనివాస్ గారు (ప్రెసిడెంటు) శ్రీ చిన్నారి సతీష్ గారు (సెక్రటరీ) శ్రీ కె. అప్పారావు గారు (వైస్ ప్రెసిడెంట్) దువ్వాడ సాల్మన్ రాజు గారు, వరదా వీరభద్రరావు గారు, కె.వి.ఎస్.ఎస్. ప్రసాద్ గారు, టి. శ్రీనివాస్ గారు, పి. కామరాజ్ గారు, వేణు గారు మొదలగు అనేక విద్యావంతులు, పిల్లల విద్యా వికాసము కొరకు, వేసవి తరగతులు నిర్వహించి, అందు పోటీ పరీక్షలు పెట్టి వారికి బహుమతులు, ప్రదానం చేయుచు అనేక కార్యక్రమాలు చేయుచున్నారు. పిఠాపురం పట్టణమునకు వన్నె తెచ్చుటకు సహకరించుచున్న గండేపల్లి వెంకట సత్యన్నారాయణ గారికి, సహృదయ మిత్రమండలితో సహకరించుచున్న పెద్దలు వెన్నపు చక్రధరరావు గారికి మరియు కొండేపూడి శంకరరావు గారికి అనేక నమస్కారములతో...

- తోట నాగేశ్వరప్రసాద్, రిటైర్డ్ కోర్టు ఉద్యోగి.

ఆకలితో ఉన్న వ్యక్తికి ఒక పూట కడుపు నింపడం కాదు, ఆ అన్నం ఎలా సంపాదించాలో నేర్పాలి.

ది గ్రేట్ డిక్టేటర్ చిత్రం ద్వారా చార్లీ చాప్లిన్ ఇచ్చిన సందేశం

రెండో ప్రపంచ యుద్ధం మీదా, హిట్లర్ మీదా ప్రపంచ వ్యాప్తంగా చాలా సినిమాలు వచ్చాయి. వాటిలో చార్లీ చాప్లిన్ తీసిన "ది గ్రేట్ డిక్టేటర్" విలక్షణమైనది. టాకీ చిత్రాలు మొదలైనా మూకీ చిత్రాలనే నిర్మిస్తూ వచ్చిన చాప్లిన్ మొట్టమొదటి సారిగా తన గొంతు విప్పింది ఈ చిత్రంలోనే.

రెండో ప్రపంచ యుద్ధం ఇంకా మొదలు కాకముందే 1938లోనే చార్లీ చాప్లిన్ ఈ స్క్రిప్టును రెడీ చేసుకున్నాడు. జర్మనీ సైన్యం పోలండ్ మీద దాడి చేసి రెండో ప్రపంచ యుద్ధానికి నగారా మోగించిన కొద్ది రోజులకే అంటే 1939 సెప్టెంబర్‌లోనే ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్లింది. రెండో ప్రపంచ యుద్ధం బీభత్సంగా జరుగుతున్న సమయంలో 1940లోనే "ది గ్రేట్ డిక్టేటర్" విడుదలయింది.

తన అన్ని సినిమాలకంటే భిన్నంగా భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా అంతే భారీగా ప్రపంచవ్యాప్తంగా విజయఢంకా మోగించింది. హిట్లర్ కూడా ఈ చిత్రం ప్రింట్ తెప్పించుకుని మరీ ప్రత్యేకంగా చూశాడంటారు. అది ఎంత వరకు నిజమో తెలియదు. చూసివుంటే ఆ బండ హృదయం కొంతైనా కరిగి వుండేది కదా అనిపిస్తుంది.

విచిత్రం ఏమిటంటే చార్లీ చాప్లిన్ అడాల్ఫ్ హిట్లర్ ఇద్దరూ ఒకే సంవత్సరం ఒకే నెలలో కేవలం నాలుగు రోజుల వ్యవధిలో జన్మించారు. చాప్లిన్ 16 ఏప్రిల్ 1889 లో జన్మిస్తే హిట్లర్ 20 ఏప్రిల్ 1889 న జన్మించాడు. చాప్లిన్ 88 ఏళ్ళ వయసులో 25 డిసెంబర్ 1977 న వృద్ధాప్యంతో చనిపోతే హిట్లర్ 56 ఏళ్ళ వయసులో 30-4-1945 న ఆత్మహత్య చేసుకుని చచ్చాడు.

చార్లీ చాప్లిన్ ఇందులో ఒక అమాయక బార్బర్‌గా, అడెనాయిడ్ హింకెల్ అనే డిక్టేటర్‌గా అద్భుతంగా ద్విపాత్రాభినయం చేశాడు. చిట్టచివరిలో డిక్టేటర్ రూపంలో వున్న బార్బర్ ప్రసంగం చాలా గొప్పగా వుంటుంది. నేను మొదటిసారి చూసినప్పుడు ఆ ప్రసంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను.

ఈ మధ్య ఒక మిత్రుడు వాట్స్అప్ ద్వారా సబ్ టైటిల్స్ వున్న ఆ ప్రసంగం వీడియో క్లిప్‌ను పంపించాడు. థ్రిల్లింగ్‌గా అనిపించింది. వెంటనే తెలుగులోకి ఇలా స్వేచ్ఛానువాదం చేసాను..

ది గ్రేట్ డిక్టేటర్ చిత్రం ద్వారా చార్లీ చాప్లిన్ ఇచ్చిన సందేశం :

"క్షమించండి! నాకు చక్రవర్తిని కావాలన్న ఆశలేదు! అది నా వ్యాపకం కాదు! ఎవరినైనా పరిపాలించాలనో లేదా జయించాలనో నేను కోరుకోను! వీలైతే ప్రతి ఒక్కరికీ ... యూదులు, క్రైస్తవేతరులు, తెల్లవాళ్లు, నల్లవాళ్లు అందరికీ మేలు చేయాలని చూస్తాను! మనమంతా పరస్పరం సహాయం చేసుకోవాలని భావిస్తాం! అది మానవ నైజం! తోటివాళ్లంతా సంతోషంగా వుండాలని కోరుకుంటామే తప్ప వాళ్లు కష్టాలపాలు కావాలని కోరుకోం! పరస్పరం ద్వేషించుకోవద్దనీ, ఈసడించుకోవద్దనీ మనం భావిస్తాం!

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ స్థానం వుంది! మన భూగోళం ప్రతి ఒక్కరి మనుగడకు కావలసినవన్నీ సమకూర్చగలిగేంత సుసంపన్నమైనది! మన జీవనమార్గం స్వేచ్ఛాయుతంగా వుండాలి! అందంగా వుండాలి!! కానీ మనం దారితప్పాం! **దురాశ మన మనసులను విషపూరితం చేసింది! మన మధ్య విద్వేషపు అడ్డుగోడలను నిర్మించింది! మనలను లోభంవైపు, రక్తపాతంవైపు దారిమళ్లించింది!** మనం వేగాన్ని అభివృద్ధిపరచుకున్నాం! కానీ మూలనపడి మూలుగుతున్నాం!! యంత్రాలు సమృద్ధికి బాటలు వేస్తూనే మనల్ని నిస్సహాయుల్ని చేస్తున్నాయి! మన జ్ఞానం మనల్ని మూర్ఖులుగా మారుస్తోంది! మన తెలివితేటలు మనల్ని కఠినాత్ములనుగా, దయాదాక్షిణ్యాలు లేనివారిగా మారుస్తున్నాయి! మనం కొండంత ఆలోచిస్తాం. కానీ గోరంతే అనుభూతి చెందుతాం!

ఇవాళ మనకు యంత్రాలకంటే ఎక్కువగా మానవత్వం అవసరం!! ఈ లక్షణాలు లేకపోతే జీవితం హింసాత్మకంగా తయారవుతుంది! మనం సర్వస్వాన్ని కోల్పోతాం!! విమానం, రేడియో మనల్ని సన్నిహితం చేశాయి! కానీ, ఆ ఆవిష్కరణలు ఇవాళ రోదిస్తున్నాయి!! మనమంతా కలసిమెలసి వుండాలనీ, మనలో మంచితనం పెంపొందాలనీ అవి ఆక్రోశిస్తున్నాయి!!

నా మాటలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి చేరుతున్నాయి! నిరాశోపహతులైన పురుషులు, స్త్రీలు, పసిపిల్లలు... అమాయక ప్రజలను బంధించి చిత్రహింసల పాలుచేసే వ్యవస్థ కాటుకు గురైనవాళ్లు ... లక్షలాదిమంది ఇప్పుడు నా మాటలను వింటున్నారు!!

నా మాటలను వింటున్నవాళ్లందరికీ నేను చెప్పేది ఒక్కటే ... నిరాశపడకండి! మనలను కష్టాల పాలుచేస్తున్న ఈ దుర్మార్గం అవసానదశలో వుంది! మానవ ప్రగతిని చూసి ఓర్వలేని దుర్మార్గులు తమ చివరి ఘడియలను లెక్కపెట్టుకుంటున్నారు! మనుషుల్లోని ఈ విద్వేషం తప్పక అంతరించిపోతుంది !

నియంతలు చచ్చిపోతారు! ప్రజల నుంచి వాళ్లు లాక్కున్న అధికారం తిరిగి ప్రజలకు లభిస్తుంది ! **మనుషులను చంపినంత మాత్రాన స్వేచ్ఛ అంతరించిపోదు!**

సైనికులారా!

మిమ్మల్ని నీచంగా చూసే వాళ్లకు, మిమ్మల్ని బానిసలుగా మార్చినవాళ్లకు, మీ జీవితాలను యాంత్రికంగా చేసినవాళ్లకు... మీరు ఏం చేయాలో, ఏం ఆలోచించాలో, ఏం అనుభూతి చెందాలో నిర్దేశించేవాళ్లకు, దుర్మార్గులకు... మీ జీవితాలను అర్పించవద్దు! వాళ్లు మిమ్మల్ని జంతువుల్లా చూస్తారు! బలిపశువులుగా వాడుకుంటారు!! అలాంటి అసహజమైన మనుషులకు... యంత్రాల్లాంటి మనుషులకు... యాంత్రిక మనస్కులకు... యాంత్రిక హృదయాలకు మిమ్మల్ని మీరు అర్పించుకోవద్దు! మీరు యంత్రాలు కాదు! మీరు పెంపుడు జంతువులు కారు! మీరు మనుషులు! మీ హృదయాల్లో మానవీయమైన ప్రేమ వుంది! మీరు ద్వేషించరు. ప్రేమలేనివాళ్లే ద్వేషిస్తారు. అసహజమైన వాళ్లే ద్వేషిస్తారు.

సైనికులారా!

బానిసత్వం కోసం పోరాడకండి! స్వేచ్ఛ కోసం పోరాడండి!

సెయింట్ లూకా సువార్త 17వ అధ్యాయంలో ఇలా రాయబడి వున్నది.

"దేవుడి రాజ్యము మనుషుల లోపలనే వున్నది" ఒక మనిషిలోపలనో, కొంతమంది మనుషుల గుంపులోపలనో కాదు. దేవుడి రాజ్యం మనుషులందరిలో వుంది ! మీలోనూ వుంది!!

యంత్రాలను సృష్టించే శక్తి, సంతోషాన్ని సృష్టించే శక్తి మీలో వుంది! మానవ జీవితాన్ని స్వేచ్ఛాయుతంగా, అందంగా తీర్చిదిద్దగల శక్తి... జీవితాన్ని అద్భుతమైన సాహసంగా మార్చగల శక్తి ... మీలో వుంది! అందువల్ల ప్రజాస్వామ్యం సాక్షిగా ఆ శక్తిని ఉపయోగించి మనమంతా ఏకమవుదాం! ఒక కొత్త ప్రపంచం కోసం పోరాడుదాం!

అద్భుతమైన ఆ కొత్త ప్రపంచం అందరికీ ఉపాధినిస్తుంది! యువతకు మంచి భవిష్యత్తునిస్తుంది!! వయోవృద్ధులకు భద్రతనిస్తుంది!! ఇలాంటి వాగ్దానాలు చేసే దుర్మార్గులు అధికారాన్ని కైవసం చేసుకున్నారు! కానీ వాళ్లు అబద్ధాలకోర్లు! తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు! మునుముందు కూడా నిలబెట్టుకోరు! నియంతలు స్వీయస్వేచ్ఛను పొందుతారు! ప్రజలని మాత్రం బానిసలుగా మారుస్తారు!! ఇప్పుడు మనం ఆ వాగ్దానాలను నెరవేర్చుకునేందుకు పోరాడుదాం! ఈ ప్రపంచాన్ని విముక్తి చేసేందుకు... జాతీయ అడ్డుగోడలను కూలదోసేందుకు... దురాశ, ద్వేషం, అసహనంలను పారదోలేందుకు పోరాడుదాం! సహేతుక ప్రపంచం కోసం పోరాడుదాం!!

విజ్ఞానశాస్త్రం, అభివృద్ధి మనుషులందరి ఆనందం కోసం వినియోగపడే ప్రపంచం కోసం పోరాడుదాం!! ప్రజాస్వామ్యం సాక్షిగా మనమంతా ఏకమవుదాం!!"

– ప్రభాకర్ మందార

(సామాజిక మాధ్యమాల నుండి తీసుకోవడమైనది.)

"చట్టాలలోని హక్కులనేకం ఆచరణలో భాగం కావు, కాకుండ చేసిన వారికి ఏ శిక్షాలేనంత కాలం-ఏ కష్టమూ రానంత కాలం-ఈ పరిస్థితి మారదు... సంక్షేమ చట్టాలు' 'సామాజిక న్యాయ విధానాలు అని పిలవబడే హక్కులను తెలిసి అమలుచేయని అధికారులకు ఏ నష్టమూ జరగదు. దానిని కనీసం మిస్ కాండక్ట్‌గా గుర్తిస్తేనయినా కొంత ఒళ్ళు దగ్గర పెట్టుకొని వ్యవహరించే వారేమో గానీ, వందరూపాయల లంచం తీసుకున్న అధికారికి వచ్చే ఇబ్బంది సహితం జీవితాంతం రిజర్వేషన్లు అమలు చేయని అధికారికి రాదు. తన డిపార్ట్మెంట్ క్లాస్ ఫోర్.. ఉద్యోగులను ఏళ్లతరబడి ఎన్.ఎం.ఆర్.లుగా ఉంచేసిన అధికారికి రాదు. వంద రూపాయలు లంచం తీసుకోవడం వల్ల సమాజానికి జరిగే నష్టమెంతో గానీ, వీరి వైఖరి వల్ల వేలాది మంది హక్కులుండీ లేని వారవుతారు. అయినా వీరు మాత్రం.. తమ పదవుల నిచ్చెన మెట్లెక్కి పైకి పోతూనే ఉంటారు. దీనికి విరుగుడు కనిపెట్టందే సామాజిక న్యాయం చట్టాలలోకి ఎక్కినా సామాజిక ఆచరణలో భాగం కాదు."

- బాలగోపాల్

సంతోషంతో తృప్తిగా జీవించే మనిషికి సహజమైన సిరిసంపదలు లభించినట్లే.

సంస్మరణ వ్యాసం

జాతి మరిచిపోయిన మహా త్యాగశీలి మెల్లీ!

మెల్లీ సోయంగల్! ఈ పేరు ఇప్పటితరం వారు కనీసం విని కూడా ఉండరు. పోనీ 'బతుకు పుస్తకం' రచయిత వుప్పల లక్ష్మణ రావు గారి పేరయినా తెలుసో లేదో! వీరిద్దరూ త్యాగధనులు. విద్యాధికులు. ఆదర్శ దంపతులు. అన్నిటికీ మించి అపురూప దేశభక్తులు. పరాయి దేశ వనితే అయినా మెల్లీ మన భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో జైలుశిక్షను సైతం లెక్కచేయని ధీశాలి. తెలుగువారు ప్రతీ ఇంట్లో ఫోటో పెట్టుకుని ప్రతీరోజు స్ఫూర్తి పొందాల్సిన ఆదర్శమహిళ! ఆమెను జ్ఞాపకం చేయడమే ఈ వ్యాస ఉద్దేశం. ఆమె జ్ఞాపకాల పుస్తకంలో ఓ వ్యాసం చూడండి !

మెల్లీ మనదేశానికి రాకమునుపే, ఆమె పరిచయం నాకు (మిగతా Cousins తో బాటు) లక్ష్మణ అన్నయ్య కబుర్లద్వారా కలిగింది 1925 లో అనుకుంటాను. ఆమె పుట్టిన రోజుకి కానుకగా, మనకుటుంబ వ్రాత పత్రిక 'ఉష కాలం' యొక్క ఒక సంచికను ఆమెకు పంపాము, దానిలో నేను ఒక ఆంగ్లపద్యముకూడా వ్రాసినట్టు జ్ఞాపకం, ఆమెను చూడాలనే కోరిక, కూతూహలం మా అందరికీ వుండేది. అది తీర్చడానికి మన కుటుంబము, సంఘము, దేశము గురించి తెలుసుకొని, పరిచయం ఏర్పరచుకోడానికి మెల్లీ రానేవచ్చింది. 1929 లో కాబోలు బొంబాయి రేవులో దిగి బరంపురానికి వెళ్తూ దారిలో మా యింటికి విశాఖపట్నం వచ్చింది. ఆమెకు ఎలాగ సౌకర్యాలు చెయ్యాలా అని కిందామీదా పడ్డాము. కమోడు వగైరాలు అద్దెకు తెచ్చి, వేరే మరుగు ఏర్పరిచాము. రైలు స్టేషనుకి ఆహ్వానించడానికి వెళ్లేసరికి ఆమె మామూలుగా లక్ష్మణ అన్నయ్యతోపాటు దిగింది. (అప్పటికే ఖద్దరు దుస్తులు వేసుకున్నాదేమో గుర్తురాలేదు.) యూరోపియనులకుండే ఏ ఆర్భాటమూలేదు. ఇంటికొచ్చాక భోజనాల యేర్పాటు. ఇంకా అప్పటికి విదేశీయులతో స్వయంగా కలసి సహపంక్తి భోజనం చేయడం అలవాటులేదు. అది బహిష్కరించబడిన విషయం. కాని మా అమ్మ (మల్లిమడుగుల లలితాంబగారు) సంస్కరణలలో చాలా ముందుగా వుండేది కనుక, వంటయింట్లో కాకపోయినా, యింటిలో, ముందుగావుండే పెద్ద వసారాలో, మేమంతా ఆమెతో కలిసి భోజనం చేయడానికి ఏర్పాటు చేసింది. మెల్లీ కూడా క్రిందనే కూర్చొని, స్పూన్లు, ఫోర్కులు వుపయోగించకుండా మనలాగే భోజనం చేసినట్టు గుర్తు. దొరసానితోపాటు స్వంత యింట్లో అందరం కలిసి భోజనం చేస్తున్నామే అని చాలామంది ఆశ్చర్యపోయారు. ఆచారాలకు పట్టుకొమ్మగా వుండే మా మామయ్యగారు గుసగుసలాడుకోడం నాకు జ్ఞాపకం. అప్పటికే మా అన్నయ్య రజస్వలానంతర వివాహంవల్ల మేము వెలివేయ బడడంచేత, మా యింట్లోకివచ్చి తనిఖీ చేయడానికి ఆమెకి వీలుకాలేదు, కాని ఎదురింటిలో వుండే మా పెద్దనాన్నగారి పిల్లలు మా యింటికి రావడం అదీ, ఆమెకి అనుమానంగా వుండేది. అదే మెల్లీతో మొదటి పరిచయం.

నేను కాశీలో చదువుకుంటూ సెలవలకు యింటికి వెళ్లేటప్పుడు దారిలో కలకత్తాలో మంగయ్య మామగారింటిలో దిగి రెండుమూడు రోజులుండి బరంపురం మీదుగా విశాఖపట్నం రావడం మామూలు. కలకత్తా లేక్ ప్రాంతంలో మెల్లీ లక్ష్మణ అన్నయ్య వేరే చిన్న యిల్లు అద్దెకు తీసుకొని వుంటున్నప్పుడు, నేను యింటికి

– వచ్చేటప్పుడు వాళ్లతో ఒకటిరెండురోజులు గడిపేవాడిని. అప్పుడు వాళ్ళు అపక్వాహారం తింటూ వుండేవారు. లక్ష్మణ అన్నయ్య బోటనీ (వృక్ష శాస్త్రం) పుస్తకం ఒకటి వ్రాస్తూ వుండేవాడు. దానితోటే తనకి సరిపోయేది. ఇంటిపనులన్నీ మెల్లీనే చూసుకొనేది, బజారుకువెళ్ళి కూరలు వగైరాలు కొనడం దగ్గరనుంచి కూడా. ఆమె ఆతిథ్యం పొందడం అదే మొదలనుకొంటాను. అప్పటి నుండీ ఆమె మీద గౌరవం, స్నేహం, ప్రేమ, Admiration (మెచ్చుకోలు) పెరగడం మొదలైంది.

లక్ష్మణ అన్నయ్య ఆలీఘర్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నపుడు, ఒకసారి దసరా సెలవలకి అక్కడికి వెళ్లి వాళ్లతో కొద్దిరోజులు గడిపాను. మెల్లీకి అప్పుడే జ్వరం తగ్గిందనుకుంటాను. చాలా నీరసంగా వుంది. వంటవాడు వుండేవాడు. అయినా మెల్లీ అన్నీ కనుక్కునేది. దేశంలో స్వాతంత్ర పోరాటం తిరిగి ప్రారంభింపబడే సూచనలు కనబడుతున్నాయి. కలకత్తా కాంగ్రెసు అయిపోయింది. లాహోరు కాంగ్రెసు రాబోతోంది. అందరం కలిపి లాహోరు కాంగ్రెసుకి వెళ్దామని మాట్లాడుకున్నాము. మెల్లీ అప్పటి దాకా ఏ కాంగ్రెసు మహాసభ చూడలేదనుకుంటాను.

మెల్లీ వుత్సాహం చూపించింది. నేను కాశీ తిరిగి వెళ్లిపోయాను. లాహోరు కాంగ్రెసు అందరం వెళ్లే ప్రయత్నం చేశాను. చేతిలో సొమ్ము చాలా తక్కువగా వుండెను. అయినా ఫర్వాలేదనుకున్నాము. మాది పెద్దజట్టు (Batch) 10 మంది దాకా వున్నాము, చిన్నా పెద్దా, ఆడామగ, కొద్దిగా ఆచారపరురాలైన రాజుకక్కిగారితో సహా, దాన (దిగుమర్తి రామారావు) కూడా వున్నాడు. దారిలో లక్నో, డెహరాడూన్, మంచు కురవడం చూడ్డానికి (snowfall) మసూరీ, హరీద్వార్, ఋషీకేశ్, ఢిల్లీ, ఆగ్రా వగైరాలు చూశాము. చేతిలో సొమ్ము తక్కువ. కార్యక్రమం చూస్తే పెద్దది. అందుచేత అన్నిచోట్లా, సత్రవులలోనూ, ధర్మశాలలోనూ, బసచేసే వాళ్లం. నేల మీదే పడక. అంతా పూర్వకాలపు యాత్రీకుల పంథా. ఆహారానికి పూరీ కూర, పాలు వగైరాలు, రైల్లో నాస్తా వేరుసెనగపప్పు, అటుకులు, పేలాలు, దొరికిన చోట మజ్జిగ... అన్నం మధ్య ఎక్కడో దొరికిన చోట మాత్రమే, ఇలాగ యాత్ర నడిచింది. మెల్లీ అన్నింటికి ఎలాగ సరిపెట్టుకోగలదో (adjust అవగలదో) అప్పుడు నాకు బాగా తెలిసింది. అసలు ఇండియాలో కాలుపెడుతూనే, మన అలవాట్లకి, ఆచారాలకి పద్ధతులకి అన్నింటికి అలవాటు పడగల మనోనిబ్బరంకల వ్యక్తి అని, మొదట్లో విశాఖపట్నంలో తెలుసుకున్నప్పటికీ. ఒక ధర్మశాలలో దిగాము. అది ఒక్క హిందువులకు మాత్రమేనని చెప్పారు. మరి మెల్లీని మాతో చూస్తే వాళ్లు అనుమానిస్తారు కదా, ఎలాగ. అంతగా అడిగితే చూసుకుందాము. ఆర్య సమాజం వారు ఇతరులను కూడ మనమతంలో చేర్చుకుంటున్నారు కదా, అని అనుకున్నాము. అయితే అటు ప్రశ్నే ఎదురు లేదు. రోజంతా తిరిగి ఏ రాత్రికో పడుకోవడమే కదా మరి.

ఇక లాహోరు కాంగ్రెసులో వెంకరమణ మామగారు తన సహజ ధోరణిలో మెల్లీ విదేశీ యాత్రికురాలని (foreign visitor to the Congress), వాళ్ళకు కేటాయించిన ఆవరణలోనే మాకు ఒక కుటీరం (Cottage) సంపాదించారు. మాలో చాలామంది డెలిగేట్లమే కూడా ననుకోండి. దానితో మాకు భలే సరదాగా వుండేది.

నాయకులు వస్తూపోతూ వుండడం, మేము వాళ్ళ ఆవరణలో వుండడం అదీను. మెల్లీ, నెహ్రూ వగైరా పెద్దలతో ఇంటర్వ్యూ చేసిందనుకుంటాను, Distinguished Visitor కదా! ఆమెకి మన దేశం యెడలగల ప్రేమ, మన స్వాతంత్రోద్యమం యెడలగల అభిమానము, చిన్నవాళ్ళతోటి, పెద్దవాళ్ళతోటి కూడా సమానంగా కలిసిపోయి సరదాగా వుండగల స్వభావము, ఎలాంటి కష్టపరిస్థితులకైన (Adjust) ఇమడగల శక్తి అన్ని కనబడ్డాయి. 1929 డిసెంబరు అర్ధరాత్రి 12గం.లకు జరిగిన ఝండా వందనంలో, అప్పుడు చేసుకున్న తీర్మానంలో – ప్రేమ వెల్లడయింది. ఆమె మన కుటుంబంలో కలిసిపోయి, సభ్యురాలయిపోయింది. ఆ యాత్రాస్మృతులు ఎప్పుడూ – ఆనందాన్ని కలిగిస్తూ వుంటాయి.

ఆ తర్వాత మెల్లీని కలుసుకోవడం ఏర్పర్ధం, రెండేళ్ళ తరువాతే ననుకుంటాను. నేను ఉప్పు సత్యాగ్రహంలో జైలుకి పోయాను. విడుదలయ్యాక విశాఖజిల్లా కాంగ్రెసు కార్యదర్శిగా వున్నాను. మెల్లీ, లక్ష్మణ ఆలీఘర్ వదిలి, – గాంధీగారి సబర్మతీ సత్యాగ్రహాశ్రమంలో కొన్ని మాసాలుండి తర్వాత కొత్తరకం రాట్నం (పెద్దచక్రం, బాల్బేరింగులతో) రూపొందించడానికి ప్రయోగాలు చేస్తూ కొన్నాళ్ళకి శ్రీకాకుళం వచ్చారు. అప్పుడు మా అన్నయ్య, అమ్మ కుటుంబంతో విశాఖపట్నం కాపురం వదిలి శ్రీకాకుళం వెళ్ళిపోయారు. మా అన్నయ్య అఖిలభారత చరఖ సంఘం వారిచే, పొట్నూలు, పట్టుశాలీనూలుతో ఖద్దరు తయారీ పరిశ్రమను తీర్చిదిద్దడానికి శ్రీకాకుళం పంపబడ్డాడు. అందువల్ల ఖద్దరు పరిశ్రమలో ప్రయోగాలు చేయడానికి, రాట్నం నమూనాలు తయారు చేయడానికి చేసే కృషికి అక్కడ వీలుగా వుండేదనుకుంటాను. మెల్లీ, లక్ష్మణ అక్కడకు వచ్చారు. అక్కడ వాళ్ళు కొన్ని యిబ్బందులకు గురి అయ్యారు. మేము అద్దెకుంటూన్నది ఒక యింట్లోభాగం. అది ఆచారపరులుండే గుడివీధి. అక్కడ మెల్లీకి వీలుగా లేదు. ఖాదీ ఆఫీసులో వుంటూ, ఇబ్బందులు పడుతూ, అందరం కలిసి భోజనం చేయడానికి ఆస్కారంలేక, ఎన్ని అవస్థలు పడిందో! తరువాత మేము యిల్లు మార్చేశాము. అయినా విశాఖపట్నంలోవున్నట్టు సదుపాయాలు, స్వాతంత్ర్యం వుండవు కదా. అదీ కాకుండా మా అమ్మ సంఘ సంస్కరణలో ముందంజ వేస్తున్నా కొన్ని అలవాట్లను ఆచారాలను అధిగమించలేదు. బహుశా చిన్న విషయాలలో సంఘాన్ని వ్యతిరేకించకుండా, ముఖ్యమైన పెద్ద సంఘ సమస్యల విషయంలో సంఘాన్ని ఎదిరించి నిలబడడం ఒక స్ట్రాటజీ కూడా కావచ్చు. మెల్లీ మాతో పాటు వంటింట్లోను, పూజాగృహంలోను, భోజనం చెయ్యడానికి ఆమెకి మనస్కరించేది కాదు. పాపం మెల్లీ మేడమీది గదిలో వెండి గిన్నెలో కలిపి యిచ్చిన అన్నాన్ని చెమ్చాతో అప్పుడప్పుడు తినవలసి వచ్చేదని జ్ఞాపకం. కానీ, ఆశ్చర్యం ఏమిటంటే మెల్లీ ఏనాడూ వీటిని పట్టించుకున్నట్టు కనబడలేదు. ఆమె కుటుంబంలో కలిసిపోయినా, ఇంకా దూరందూరంగా వుంచేస్తున్నామే అని కించపడలేదు.

అన్నిటికంటే గొప్ప విశేషం ఆమెలో, పూర్వపు పద్ధతులకి ఆచారాలకి అలవాటు పడిపోయిన పెద్దవారు ఒక్కసారి ఎలాగమారగలరని సహృదయంతో బోధపరచుకొని సరిపెట్టుకొనే దనుకుంటాను. ఇలాంటి పరిస్థితులలోవున్నా అందరియెడల ప్రేమాభిమానాలు, పెద్దల యెడ గౌరవము ఏనాడూ తగ్గినట్టు నాకనిపించ లేదు. అన్నిటికంటె పెద్ద విశేషం ఇది. అందరం అలవరచు కొనదగు ఉత్కృష్టగుణం, స్వభావం, ఆరోజుల్లో ఎన్ని

ఇబ్బందులకు, ఎన్ని దైహిక అసౌకర్యాలకి (Physical inconveniences) తట్టుకున్నారో వాళ్ళకే తెలియాలి. నేను ఊహించలేను. అయినా ఏవిధమైన మానసిక ఆందోళనా లేకుండా మామూలుగా వుండే ప్రేమ చూపిస్తూ సరదాగా అందరితోనూ కబుర్లు చెబుతూ నవ్వుతూ పిల్లల భుజాలమీద చేతులు వేసుకొని షికార్లకు వస్తూ, ఎంతో ఆనందపు రోజుల్ని చవిచూపించారు వాళ్ళు, ఎండాకాలం సెలవల్లో బరంపురం, విశాఖపట్నం నుండి వచ్చిన ఎంతమందిమో పిల్లలం, ఏటిఒడ్డుకి, సముద్రపొద్దుకి షికారువెళ్ళి సాయంకాలాలు సరదాగా కాలక్షేపం చేసే వాళ్ళం, ఆవూళ్ళవాళ్ళకి దొరో, దొరసానో తెలీని ఒక వ్యక్తి ఇలాగ అందరి బుజాలమీద చేతులు వేసుకొని కబుర్లుచెప్పుకుంటూ వెళ్ళడం విచిత్రంగా వుండేది. కారణం మెల్లీ అప్పటికే నిక్కరు షర్టు వేసుకొని వుండేది. మా బంధువర్గంలో పెద్దలకి యీదుస్తులు కొంచెం విడ్డూరంగా కనబడినా, మెల్లీ తత్వం తెలిసినవారు కనుక వాళ్లేమీ అనలేదు.

వాళ్ళ ఖాదీ పరిశోధనా ప్రయోగాల కోసం విశాఖపట్నం వచ్చి శ్రీ డి.ఎల్.ఎన్.(D.L.N) రాజుగారింట్లో వుంటున్నప్పుడు తరుచు కలుసుకుంటూ వుండేవాళ్ళం. ఆ రోజుల్లో విశాఖపట్నంలో మా బావగారు (దిగుమర్తి రామస్వామి గారు) మిత్రులు, వాలంటీర్లు కలిసి ప్రతి సంవత్సరం,వొక పారిశ్రామిక ప్రదర్శన ఏర్పాటు చేస్తూవుండేవారు. మెల్లీ లక్ష్మణ దానిలో చురుకుగా పాల్గొనేవారు. చిత్రకళా ప్రదర్శన విభాగంలో బహుమతుల నిర్ణయం కమిటీలో మెల్లీ కూడా వుండేదని జ్ఞాపకం. ఆ రోజుల్లో విదేశీ వస్తు బహిష్కరణ కోసం, పికెటింగు కూడా చాలా జయప్రదంగా జరిగింది. మెల్లీ వాళ్ళు వాలంటీర్లకి హుషారు యిస్తూ వుండేవారు. తర్వాత మెల్లీ కలకత్తా దగ్గర సతీశ్ చంద్రగుప్తా గారీ ఖాదీ ప్రతిష్ఠాను ఆశ్రమంకి వెళ్ళింది. అక్కడ ఆమెకి మలేరియా వచ్చి బాగా నీర్సపడిపోయింది.

అక్కడ నుండి వచ్చాక అనుకుంటాను, మెల్లీ, లక్ష్మణ అన్నయ్య, నేనూ, వెంకట్రాం, ప్రభాజీ, వీరాధి కూడా, మా బావగారుండే 'మాణిక్య విహార్‌కి ఎదురుగుండా వుండే ఒక యిల్లు అద్దెకు తీసుకుని కాపురంవుండే వాళ్ళం. దానితో మా సన్నిహితం బాగా ఎక్కువయింది. మెల్లీనే బజారుకి వెళ్లి కూరలు అవీ తెచ్చేది. అందరం కలిసి వంట చేసుకునే వాళ్ళం. గోరు చిక్కుడు, అరటిపువ్వు వంటి చికాకు కూరలు కూడా తెచ్చి, ఓపికగా అవి వలిచి, వంటలోకి దిగేది. సెలవు రోజుల్లో మా డాబా మీద మేము చిన్న చిన్న పార్టీలు చేసుకుంటూ వుండేవాళ్ళం. మా వెనుక గుమ్మానికి ఎదురుగుండా వుండే మాణిక్య విహార్ నుండి పిల్లలంతా వచ్చేవారు... పెద్దలు కూడాను. లచ్చన్నపంతులు బావగారు కూడా వచ్చి సరదాగా మా పార్టీలో చేరేవారు. బంగారం మామయ్య గారు "ఆ దొరసాని చేతివంట రుచి చూస్తే కాని, మీకు తృప్తిలేదని" వ్యంగ్యంగా హాస్యం చేస్తున్నా, ఆయన ఏమి అనుకోకుండా వస్తూనే వుండేవారు – చెప్పేదేమిటంటే, మెల్లీ అలాగ మా అందరిలోనూ ఒకటయిపోయింది. ఇది చాలా అసాధారణ విషయమనే చెప్పాలి. ఆ యింట్లో మేమొక హరిజన స్త్రీని పనిమనిషిగా పెట్టుకున్నాము. కొన్ని రోజులయాక ఆ వీధి వారికి ఆమె హరిజన స్త్రీ అని తెలిసి, కుళాయి దగ్గర అక్కడ ఆటంకం చేయబోయారు. మాతో ఫిర్యాదు చేస్తే హరిజనులు వేరుకాదు అని, వాళ్ళని అందరితోను కలుపుకోవాలని, ఆ అమ్మాయిని మేము మానిపించమని చెప్పాము. కొన్నాళ్ళయ్యాక ఆమె పనిమానేసింది. ఎంచేతో తెలీదు. ఆ వీధివాళ్ళ సూటిపోటు

మాటలు పడలేకో, లేక మేము మరొక వీధిలోకి "హనుమాన్ విల్లా" అనే యింటికి మారుతున్నామనో చెప్పలేను. ఆవీధికి దగ్గరిగావున్న హనుమాన్ విల్లాకి మారాము. ఈ యిల్లు చిన్నదవడంచేతను, మంగయ్యమామగారు మాణిక్యం అక్కయ్యగారు కూడా మాతో వుండడానికి రావడంచేతను, "హనుమాన్ విల్లా" లోని జీవితం అదోఘట్టం. మంగయ్య మామ గారు మాణిక్యం అక్కయ్య ఒక భాగంలో వుండే వారు. మేమంతా మరొక భాగంలో వుండేవాళ్ళం. మాకు ఒక వంట వాడుకూడా వుండేవాడు. ఇక్కడ విశేషం ఏమిటంటే ఇంటి బాడుగలో మూడోవంతు అనుకుంటాను. మంగయ్యమామగారు ఇచ్చేవారు. వాళ్ళ వంట అది వేరు.... మిగతా యింటి అద్దె మావంట వగైరాలు మేము ఉమ్మడిగా భరించేవాళ్ళం. అయితే మెల్లీ లక్ష్మణ ఏమన్నారంటే, వాళ్ళకి జీతం అదీ వుంది కనుక అయిన ఖర్చులో సగం వాళ్ళిద్దరికిందా భరిస్తామని, మిగతా సగంలోను, నేనూ, మా తమ్ముడు ఒక వాటా, వీరాధి, వెంకట్రాం రెండో వాటా భరించడం, వెంకట్రాం మెడికల్ చదువుతున్నాడు. కనుక వాడికి ప్రత్యేకంగా ఒక గది యిచ్చాము. నేనూ, వీరాధి, ప్రభాజీ ఒక హాలులో ఉండేవాళ్ళం. మెల్లీ లక్ష్మణ మరొక చిన్న గదిలో వుండేవాళ్ళు. వాళ్ళు తక్కువమందే అయినా, వసతి తక్కువే తీసుకున్నా ఖర్చులు మాత్రం సగం భరించడం, సామ్యవాద జీవనానికి ఇది ఒకచిహ్నం, ఒక మెట్టు అని నేను అనుకున్నాను. పద్దులు అదీ నేను చూచేవాడిని, లక్ష్మణ అన్నయ్య సొమ్ము యిచ్చేవాడు. ఆరోజుల్లోనే కాంగ్రెసు ప్రధమంగా అసెంబ్లీలకి నిలబడడం, ప్రభుత్వం చేపట్టడమూను. అది 1937లో ప్రభుత్వంలోకి వచ్చిన సందర్భంలో జాతీయ ఝండాను ఇళ్ళమీద ఎగుర వేశాము. మెల్లీ అన్నిటికంటె పెద్దజండాను మేడమీదనుండి క్రిందిదాకా వుండేటట్లు తయారుచేసి వేలాడకట్టింది. కాంగ్రెసు స్వాతంత్రోద్యమంతో అంత సన్నిహితం అయిపోయింది. దాని పరిణామమె 1942లో, ఆమె సత్యాగ్రహంచేసి, జైలుకి వెళ్లడం, బహుశా 1937లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డి.ఎల్.ఎన్ రాజుగారి నియోజకవర్గంలో ప్రచారానికి బస్సుల మీద, కార్లమీద వెళ్లేటప్పుడు, ఆమె కూడా వచ్చేదేమో జ్ఞాపకంలేదు. లక్ష్మణ అన్నయ్య బొబ్బిలి యుద్ధం ఆధ్వర్యంలో వుండేవాడు.

లక్షణ అన్నయ్య మెల్లీ ఛత్రపురంలో ఒకనెలో ఎంతో ఒక తోటలో ఒక చిన్న కుటీరంలో వున్నపుడు వారితో ఒక రోజు గడిపాను. ఆ వున్న తక్కువ వసతిలో, ఊరిబయట నిర్మానుష్యంగా వుండే తోటలో, వాళ్ళు ఎలాగ ఉత్సాహంగా గడిపారో? దేనికైనా మనస్సు ప్రధానం గాని భౌతిక సౌకర్యాలు కావని, అనిపించింది.

మెల్లీకి సేవాగుణం వుంది. ఎవరికి కష్టంవచ్చినా ఎవడు జబ్బుతో వున్నా వాళ్లని ఆదుకుని సేవ చెయ్యడం చాలాయిష్టం. Nursing ఆమె ప్రత్యేకత. అందుకు నేను విన్న ఒక సంఘటన నిదర్శనం. గంగమ్మత్తయ్య గారి చెల్లెలి కుమార్తె గిరిజాంబకి (కొత్తవలస) ఒకసారి గుండెపోటు వస్తే ఎవరు దగ్గరలేరు. మెల్లీవుండెను. ఆమెకు అన్ని సపర్యలుచేసి, డాక్టరు వచ్చేదాకా, కాపాడుకొని వుందిట. ఇప్పుడా గిరిజాంబ ఇద్దరి పిల్లలతో హాయిగా వుంది. ఇలాంటి సంఘటనలు ఆమె జీవితంలో ఎన్నో.

మంగయ్యమామ, లక్ష్మణ అన్నయ్య ఆంధ్ర సిమెంటు ఫ్యాక్టరీకి, బెజవాడ వెళ్ళిపోయాక, నేనూ , ప్రాక్టీసు మానేశా. మా హనుమాను విల్లా ఎస్టాబ్లిష్మెంటు ఎత్తేసాము. ఎకౌంట్లు నేను పూర్తిచేయలేదు. ఆ తరువాత ఒకటి రెండేండ్లకి బెజవాడ వెళ్ళినపుడు మెల్లీకి యింటిఖర్చుల క్రింద (హనుమాన్ విల్లా సంసారం)

నేను ఇయ్యవలసిన సొమ్ము యిచ్చారు; దాని గురించి తను అడగేలేదు. మేమంతా కలిసివుండే జీవితం ఆ కొద్ది సంవత్సరాలతోనూ ముగిసింది. ఆ తర్వాత నేను బెజవాడ వెళ్లేటప్పుడు వాళ్ళ యింట్లోనే దిగేవాడిని. ఒకటి రెండుసార్లుమాత్రం, పోలీసువాళ్ళు వెంటపడుతున్నారని వేరేచోట దిగాను. మెల్లీ జైలుకి వెళ్ళింది. ఆ తర్వాత పుచ్చలపల్లి సుందరయ్యగారిని, ఆయన అజ్ఞాతవాసంలో వుండేరోజుల్లో, వీళ్ళయింట్లోనే డాబామీద ప్రత్యేకం వసతిఏర్పరచి, కొన్ని రోజులు దాచివుంచింది. ఆ సమయంలో నేను అక్కడికి వక్కసారి వెళ్ళాననుకుంటాను. కాని, నాకు కూడా ఆయన అక్కడ వున్నట్టు తెలీనేలేదు. తర్వాత మెల్లీ లక్ష్మణ చెబితే తప్ప. మా కెమికల్సు నడుస్తున్న రోజుల్లో మా డైరక్టర్ల మీటింగులు – ఒకటి రెండుసార్లు బెజవాడలో లక్ష్మణ అన్నయ్య వాళ్ళ యింట్లో జరిగాయి.

ఆమె సత్కారానికీ, ఆతిధ్యానికీ, చనువుగా అందరినీ పలకరించి, వారి అవసరాలు కనిపెట్టి అడక్కుండానే వాటిని తీర్చి, ఎంతబాగా చేశారో, అందరూ ఆశ్చర్యపోతూ మెచ్చుకొనేవారు. తల్లాప్రగడ నరసింహాశర్మగారు మరీనీ, ఆవిడవి ఇనపకాళ్లా అని, అలాగ కూర్చోకుండా చకచకా పనులు చేయడమే కాక అందరినీ పలకరిస్తూ, నవ్వుతూ మాట్లాడుతూ చర్చలలో పాల్గొంటూవుండడం ఎక్కడా చూడలేదని అందరూ అనుకునేవారు. అది అతిశయోక్తి కాదు. నిజం కూడాను. మన బంధువులంతా కూడా అమ్మా, బంగారంమామయ్య దగ్గిర నుంచి కూడా అలాగే అనుకునేవారు.

ఒకమాటు మెల్లీ, లక్ష్మణ, నేను బెజవాడ నుంచి చెన్నపట్నం వాళ్ల కారులో వెళ్లాము. అంతదూరమూ మెల్లీయే డ్రయివ్ చేసింది. వాళ్లయింట్లో స్వామినాధు మాతో ఉన్నాడో లేదో జ్ఞాపకంలేదు. ఆమెకున్న ఓపికకి ఆశ్చర్యం వేసేది. అన్ని పనులు తనే చేసేది. అలసటేతెలీదు. ఇంట్లో పనులు, బైటపనులు, వ్రాతపనులు, టైపుపనులు. ప్రయాణాలకి ఏర్పాట్లు, కొనడం కూడా తనేను. లక్ష్మణ అన్నయ్య అదృష్టం.

నా పెళ్లికి,మెల్లీని, లక్ష్మణ అన్నయ్యని, మంగయ్య మామగారిని పిలిచాను. రిజిష్టరీ వివాహం. దానికి (Best men) గా సాక్షులు వుండాలి. మెల్లీ ఆదర్శభాగస్వామి అని, మన హైందవ సంస్కృతిలో ఆదర్శభాగ స్వామికులకు ఎందులోను తీసిపోదని, ఒకమెట్టు ఎక్కువేనని, తన వ్యక్తిత్వానికి ఎటువంటి అడ్డు ఆటంకము రానీయకుండానే నిలబెట్టుకుంటూనే లక్ష్మణ అన్నయ్యకి అన్నివిధాలా, తోడు నీడగా, స్నేహితురాలిగా, ప్రేయసిగా, బంధువుగా వుండగలిగిందని నా అభిప్రాయం. అటువంటివారు మన కుటుంబంలో, నా ఎరికని, ఎవరూలేరేమోనని కూడా నాకు తోచేది. అంచేత, ఆమె నా వివాహానికి ఒక సాక్షిగా వుంటే బాగుంటుందని నాకు అనిపించింది. ఆమెను అందుకు కోరాను. ఆమె నా అభ్యర్ధనని తిరస్కరించలేదు. కాని విచారకమైన విషయం ఏమిటంటే తీరా సాక్షులని పిలిచేటప్పుడు మా బావగారూ బుచ్చి క్రిష్ణగారూ వచ్చి సంతకాలు చేశారు. మెల్లీని కూడా పిలవమని నేను కోరితే, మరొకరు అవుసరంలేదని, మొగవాళ్ల ప్రతినిధి, స్త్రీ ప్రతినిధి వున్నారు కదా అని, నా అభ్యర్ధనను వినలేదు. ఆ సమయంలో పట్టుబట్టడం బాగుండదని, రసాభాసకాకూడదని వూరుకున్నాను. కాని అది నాకు

ఎంతో లోటుగానే ఉండిపోయింది. మెల్లీ ఏమనుకుంటుందోనని కూడా బాధ పడ్డాను. తనకి అప్పుడు తలనొప్పిగా వుండెను. కాని ఆమె ఏమీ అనుకోలేదు. ఆ విషయం పట్టించుకోనట్టే కనబడింది.

ఆ తరువాత, విజయలక్ష్మి, నేను, లలిత, బంగారు పెళ్ళికి గుంటూరు వెళ్తూ దారిలో బెజవాడలో వాళ్ళింట్లోనే దిగాము. సరదాగా కబుర్లు చెప్పుకున్నాము. కాని చీకటి పడ్డాక వాళ్ళింట్లోవుండే కుక్కలలో ఒకటి మా లలితని కరిచింది. లలిత చిన్నపిల్ల. దానికితెలీక ఆ కుక్కదగ్గరికి వెళ్ళింది. వెంటనే మెల్లీ గాభరపడి, కుక్కల్ని ఒకగదిలోకి పంపేసి, లలితకి ప్రథమచికిత్స చేయడంలో విజయలక్ష్మికి సహాయంచేసి, వెంటనే డా॥ జానకీభాయి దగ్గిరకి తీసుకు వెళ్ళాము. ఇతర ఇన్ఫెక్షన్స్ రాకుండా ఆమె ఇంజక్షన్ యిచ్చింది. కరచినచోట cauterization చేసిందో లేదో జ్ఞాపకంలేదు. ఆ తరువాత వెంకటరమణయ్య సలహామీద కుక్కని జాగ్రత్తగా 15 రోజులు కనిపెడుతూ, దానిలో ఏపిచ్చిసూచనలూ కనబడకపోవడంతో Anti-rebies ఇంజక్షనులు ఇప్పించలేదు. కాని మెల్లీమాత్రం చాలా బాధపడింది. కుక్క గురించి వ్రాస్తూ, లలిత ఆరోగ్యం గురించి వ్రాయమని ఒక నెలరోజుల దాకా నన్ను అడుగుతూనే వుండెను. అదే మేము ఆఖరున కలిసివుండడం. ఆ తర్వాత, మెల్లీ లక్ష్మణ సోవియట్ వెళ్ళిపోవడంవల్ల, వాళ్ళు బరంపురం రాసే వుత్తరాలవల్ల వాళ్ళ క్షేమసమాచారాలు తెలుసుకోవడంతప్ప మళ్ళీ కలుసుకోలేదను కుంటాను.

అనుకోని విధంగా (Accident) ప్రమాదానికి గురై ఆమె చనిపోయిందన్న విషాదవార్త మమ్మల్ని ఎంతో విచారంలో ముంచింది. చివరికి లక్ష్మణన్నయ్యకి మజ్జిగ లేకపోతే వేడిచేస్తుందన్న అనుమానంతో, పెరుగు తీసుకురావడానికని బయలుదేరి దారిలో మోటారుకారు గుద్దేయడంవల్ల చనిపోవడం, చివరివఱకు తన జీవిత భాగస్వామి సౌకర్యం కొరకు, ఆమె ఆదుర్దాపడుతూ అసువులుబాయడం లక్ష్మణ అన్నయ్యకు ఎంత బాధ కలిగించిందోను. ఆదర్శ భాగస్వామి అన్న నా అభిప్రాయాన్ని అది అంత ధృవీకరించింది. అలాంటి వ్యక్తిని మరి చూడబోము. మెల్లీని యిప్పటి దాకా నేను తలుచుకోని రోజులేదు.

గోదారి ఈదిన మెల్లీ : ఒకసారి మెల్లీ లక్ష్మణరావు గారితో కలిసి రాజోలు నుండి నరసాపురం వెళు తోంది. గోదావరి పంటి ఎంత సమయం అయినా కదలడం లేదు. విసుగొచ్చిన మెల్లీ లక్షణరావు గారితో ఇతన్ని (పంటి వాడిని) బతిమాలేదేంటి.. నువు దీంట్లో రా నేను ఈదుకుంటూ వెళ్లిపోతా అంటూ బ్యాగులో ఉన్న స్విమ్మింగ్ డ్రెస్ అప్పటికప్పుడు వేసుకుని నాలుగు కిలోమీటర్ల గోదారిని ఇవతల నుండి అవతలకి అయిదు గంటల పాటు ఈది నరసాపురం చేరుకుంది. ద టీజ్ మెల్లీ! పట్టుదలకు ప్రతిబింబం మెల్లీ !!

- ఆత్మ, విశాఖపట్నం (మల్లిమడుగుల జగన్నాధరావు)

ప్రజా పత్రిక సౌజన్యంతో...

('మా మెల్లీ' ప్రత్యేక సంస్మరణ సంచికలో ప్రచురితం.)

మిత్రమండలితో నా అనుబంధం:

అది 2000 వ సంవత్సరం. మే నెలలో ఒకరోజు నేను సూర్యరాయ గ్రంథాలయానికి వెళ్లాను. ఆ సమయంలో అక్కడ మిత్రమండలి వారిచే నిర్వహింపబోయే ఉచిత వేసవి శిక్షణా తరగతుల కరపత్రం కనిపించగా దానిని చదివాను. అందులో చాలా శిక్షణాంశముల గురించి వ్రాయబడింది. వాటిలో నన్ను ఆకర్షించినది సంగీత శిక్షణ. సంగీతం మీద ఉండే మక్కువ కొద్దీ సంగీతం నేర్చుకోవడానికి నేను కూడా శిక్షణా తరగతులకు వెళ్లాలని నిర్ణయించుకుని మే ఒకటవ తేదీ నుండి కొద్ది రోజులు శిక్షణా తరగతులకు చిన్న పిల్లలతో పాటు హాజరయ్యాను. మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన చంటి అనే ఒక సోదరుడు సంగీతం నేర్పేవారు. ఉపాధ్యాయులు నామా ఏసుదాసు గారు, అధ్యాపకులు కేశవరావు గారు విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇచ్చేవారు. అయితే నేను ఆంగ్ల ఉపాధ్యాయుడినని తెలుసుకున్న శిక్షణా తరగతుల నిర్వాహకులైన వైద్యులు సూర్యనారాయణ గారు నన్ను కూడా విద్యార్థులకు ఇంగ్లీష్ లో శిక్షణ ఇవ్వమని అడగగా, నేను కూడా కొన్ని రోజులు విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇవ్వడం జరిగింది. 2002 సంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలలన్నీ తెలుగు మాధ్యమం లోనే ఉండేవి. విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు తక్కువగా ఉండేవి. వేసవి తరగతులలో చాలా అంశాలలో శిక్షణ ఇస్తున్నప్పటికీ ఎక్కువ మంది విద్యార్థులు ఆంగ్లం నేర్చుకోవడానికి మాత్రమే వచ్చేవారు. ముఖ్యంగా పిఠాపురం పరిసర ప్రాంత గ్రామాలైన కుమారపురం, చిత్రాడ, గొల్లప్రోలు, కొండెవరం, విరవాడ . . . తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చేవారు. వేసవి తరగతుల నిర్వాహకులు కూడా విస్తృతంగా ప్రచారం చేసి ఎక్కువ మంది విద్యార్థులు శిక్షణా తరగతులకు హాజరయ్యేలా కృషి చేసేవారు. " సొంత లాభం కొంత మానుక పొరుగువానికి తోడుపడవోయ్" అనే గురజాడ వారి పద్యాన్ని సహృదయ మిత్రమండలి నినాదంగా తీసుకోవడం నన్నెంతో ఆకర్షించింది. పేద విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే సహృదయ మిత్రమండలి సభ్యుల యొక్క తపన, అభ్యాసనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే విద్యార్థుల ఆసక్తి – ఈ రెండూ నన్నెంతగానో ఆకర్షించాయి. అందుకే అప్పటి నుండి ప్రతి వేసవిలోనూ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇస్తూ వేసవి తరగతుల నిర్వహణలో నా వంతు సహకారాన్ని అందించుచున్నాను. కొన్ని సంవత్సరాలు ఉచిత వేసవి శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా కూడా వ్యవహరించాను. సహృదయ మిత్రమండలి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహించే అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, భగత్‌సింగ్, ఆవంత్స సోమసుందర్... తదితర మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలలో ఒక సభ్యునిగా నేను కూడా పాలుపంచుకోవడం ప్రస్తుతం సహృదయ మిత్రమండలిలో నేను ఉపాధ్యక్షునిగా వ్యవహరించడం ... వీటన్నింటినీ గర్వకారణంగానూ, నాకు లభించిన గొప్ప గౌరవంగాను భావిస్తాను. ఒక సభ్యునిగా నాకు ఒక స్థానం కల్పించిన సహృదయ మిత్రమండలికి, నన్నెంతగానో ప్రోత్సహిస్తున్న మిత్రమండలి సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

ధన్యవాదాలు.

ఇట్లు

పోతుల శ్రీనివాసు

ఉపాధ్యక్షుడు, సహృదయ మిత్ర మండలి

తప్పు చేసిన మనసుకి అనుమానం ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది.

హితైక సూచనలు - ఆకాంక్ష

సహృదయ మిత్రమండలి వారు ఇప్పటివరకు ఎన్నో సంవత్సరాలుగా ప్రజా చైతన్యం కొరకు ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు ఎంతో ఉపయోగకరముగా ఉన్నారు. అదే విధంగా మరింత ప్రయోజనకరమైన కార్యక్రమాలను చేయగలరని అందుకోసం మీరు ప్రచురించబోయే సావనీర్ మరింత ఉపయోగకరమవుతుందని భావిస్తున్నాను.

ముఖ్యంగా సమాజంనకు మనం చేయవలసినది, ప్రజలలో చైతన్యం తీసుకునిరావడం, సాంఘిక పరిస్థితులను అర్థం చేసుకుని మార్పులకు దోహదం చేయడం, ఐక్యత మరియు సహకారం అందించడం.

ఐక్యత మరియు సహకారం సమాజాన్ని బలోపేతం చేస్తాయి. సమిష్టితత్వం మరియు భాగస్వామ్య పురోగతికి వీలు కల్పిస్తాయి. ప్రకృతిని రక్షించడం మరియు సమతుల్యతతో ప్రవర్తించడం మానవాళి దీర్ఘకాలిక మనుగడ మరియు శ్రేయస్సుకు దోహదం చేస్తాయి.

ప్రస్తుత సమాజంలో తీవ్ర సంక్షోభం అనుభవిస్తున్న సమూహంను గుర్తించి వారి సమస్యలను ప్రభుత్వ ప్రతినిధులకు తెలియజేయచేసి వాటిని పరిష్కరించడంలో భాగస్వాములు కావాలని ఆశిస్తున్నాను.

1. ముఖ్యంగా 'రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిట్టుబాటు ధరలు లేక, ఎరువులు, పురుగుమందుల లభ్యతలో అవకతవకలు వీటన్నింటితో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.
2. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలాగున చర్యలు తీసుకునేలా ప్రయత్నించాలి.
3. మద్యం, మరియు మత్తు పదార్థాల వినియోగం యువతలో బాగా పెరిగిపోయింది. వాటి నిర్మూలన గురించి యువతలో అవగాహన పెంపొందించే విధంగా మనం ప్రయత్నించాలి. వాటి వినియోగం మనుషులలో ఎంత దుష్ఫలితాలను కలిగించుతాయో తెలియజెప్పే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలి.
4. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడం వలన యువతలో నిరుద్యోగ రేటు బాగా పెరిగిపోతుంది. ఉపాధి అవకాశాలు లేక వారిలో తీవ్ర నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయి. దాంతో వారు తప్పుడు దారులు పడుతున్నారు.

అలాగే ప్రతి వీధిలో మద్యం దుకాణాలు నెలకొల్పారు. వందలకొలదీ బెల్ట్ షాపులు కూడా ఉంటున్నాయి. దాంతో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయి. కొన్నిచోట్ల మహిళలపై ఆకృత్యాలు ఎక్కువగా ఉన్నాయి.

యువతలో తీవ్ర నైరాశ్యం చోటు చేసుకుంటోంది. విపరీత ప్రవర్తనలతో కొనసాగుతున్నారు. ఇంటర్నెట్‌లో హద్దు లేకుండా వచ్చే వీడియోలు అందుబాటులో ఉన్నప్పుడు విచ్చలవిడితనం పెరిగిపోతుంది. వావి వరసలు మరచిపోతున్నారు. అదుపులోలేని ప్రవర్తనతో భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మరోసారి నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకల్లో జరిగినట్లు సంఘటనలు చోటుచేసుకున్నా ఆశ్చర్యం లేదు. ఒకవైపు ప్రభుత్వ పెద్దలు ఇవేమీ పట్టించుకోకుండా ప్రజలలో కుల, మత, వైరుధ్యాలను ప్రాంతాల వారీగా ప్రేరేపిస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారు. అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రజల ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారు.

ప్రస్తుతం జరుగుచున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో వాటి గురించి అవగాహన పెంపొందింపజేసే విధంగా సంస్థ ప్రయత్నించాలని ఆశిస్తున్నాను.

పర్యావరణ పరిరక్షణ అనేది మానవాళి మనుగడకు, శ్రేయస్సుకు అత్యవరమైనది. ఇది మన చుట్టూ ఉన్న గాలి, నీరు, నేల, చెట్లు, జీవరాశులను "కాలుష్యం, అటవీ నిర్మూలన' వంటి వాటి నుండి కాపాడుతుంది. అడవులు, నదులు మన ఆర్థిక వ్యవస్థకు మద్ధతునిస్తాయి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెట్లు నాటడం, నీటిని ఆదా చేయడం, విద్యుత్‌ను ఆదా చేయడం ఇవన్నీ కూడా పర్యావరణ పరిరక్షణలో భాగమే, కాబట్టి దానికోసం మనమందరము సమిష్టిగా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అలాగే ధ్వని కాలుష్యం, ఇది ఈ మధ్యకాలంలో ప్రధాన సమస్యగా పరిణమించింది. యంత్రాలు, రవాణా, పెద్ద శబ్దాలతో చేసే సంగీతం, అలాగే బాణాసంచా శబ్దాలు ముఖ్యంగా ఎవరైనా ప్రముఖులు కొన్ని ప్రాంతాలను సందర్శించినపుడు అక్కడి అభిమానులు చేసే హడావుడి ఇవన్నీ ప్రజల కార్యకలాపాలకు, ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తాయి. ఇలాంటివన్నీ కూడా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వాటిని నియంత్రించేలా చూసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం జన ఔషధి పథకం ద్వారా దేశంలో మెడికల్ షాపులను ఏర్పాటు చేశారు. ఎంతోమంది పేద ప్రజలకు మందుల ఖర్చు మిగులుతుంది. జనరిక్ మెడిసిన్ వినియోగంపై ప్రజలలో అవగాహన కలిగించే విధంగా మనం ప్రయత్నించాలి. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి మందులకు అయ్యే ఖర్చు నెలకి వేయి రూపాయిలపై మాటే. అవి కూడా సాధారణ మందుల ఖర్చు. అయితే జనరిక్ మందులపై దృష్టి పెడితే మందుల కోసం చేసే ఖర్చు చాలా వరకు అంటే 70 నుండి 80 శాతం తగ్గుతుంది. ఇవే జనరిక్ మందులు మనదేశం నుండి ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. విదేశీ వైద్యం అంతా ఈ జనరిక్ మెడిసిన్ మీదే ఆధారపడుతుంది.

-వడిశెట్టి సత్యనారాయణరెడ్డి (వి.యస్), పిఠాపురం.

దృశ్యం

పారదర్శకంగా కురుస్తున్న
రక్తవర్షం
చెమటనదిగా
రూపాంతరం చెంది
ప్రవహించటం
మీరెపుడైనా చూశారా
హరితహరితంగా
నల్లరేగడి నేలమీద
సృజియించిన
నాగళ్ళ లిపిని
మీరెపుడన్నా చదివారా
కర్మాగారాల కొలిమిలో
కణకణా మండుతున్న కండరాల ఎరుపుని
మీరెపుడైనా కనుగొన్నారా
యింతకూ,
పాలరాతి బొమ్మైనా
పార్లమెంటు భవనమైనా
వాడు చెుడితేనే శ్రీకారం
వాడు కడితేనే ఆకారం.

– అలిశెట్టి ప్రభాకర్

ఒక్క కాలం తప్ప మరేదైనా మన చేతిలోనే ఉంటుంది.

చిన్నారుల హృదయాల్లో మిత్రమండలి సహృదయులతో నా అనుబంధం

చిన్నప్పుడు వేసవి సెలవులు వచ్చాయంటే చాలు.. అంతా ఆట విడుపే.. చెరుకుల కాలువ ఇసుకలో జోరుబాలు., స్కూల్ గ్రౌండ్‌లో ఏడు పెంకులాట.. రాజాగారి కోటలో క్రికెట్, అదీ కాదంటే చర్చి సెంటర్ బడ్డీ కొట్టులో పావలా అద్దెకు కథల పుస్తకంతో కాలక్షేపం.. అప్పుడు ఇదిగో ఇలా సహృదయ మిత్రమండళ్లు.. వాళ్లు ఇచ్చే విజ్ఞానంతో కూడిన ఆటలు, పాటలు, కథలు ఏవీ లేవు.. ఇప్పుడు మిత్రమండలి కార్యక్రమాల్ని చూస్తుంటే అనిపిస్తుంటుంది మళ్లీ చిన్నతనంలోకి వెళ్లిపోతే బావున్ను, ఎంత సరదా, ఎంత విజ్ఞానం పోగేసుకుందునా అని. ఒకప్పుడు విద్యను బట్టి విద్యార్థి.. అంతే– పాఠశాలలో ఏది చెబితే ఎలా చెబితే అదే నేర్చుకోవడం. ఇప్పుడు విద్యార్థిని బట్టి విద్యాబోధన. విద్యార్థికి ఎలా అర్థం అవుతుందో అలా నేర్పాల్సిందే. ఈ సహృదయులు మాత్రం దానికి ఇంకో అడుగు ముందుకు వేశారు. విద్యార్థి ఏమి నేర్చుకోవాలనుకుంటున్నాడో అదే నేర్పుతున్నారు.

నాకు సహృదయ మిత్రమండలితో పరిచయం కచ్చితంగా చెప్పలేను గానీ ఓ పదిహేనేళ్ల కంటే ఎక్కువే. వేసవి సెలవుల్లో విద్యార్థులను తీర్చి దిద్దే కాన్సప్ట్ నాకు భలే నచ్చింది. మొదట్లో అనుకునే వాడిని ఏడాది పొడవునా తరగతి గదిలో పాఠాలు పేరిట చితక్కొట్టి ఏదో ఓ నెల రోజులు సెలవులు వస్తే.. మళ్లీ క్లాసులేంటి మాస్టారూ అని. నిజం చెప్పొద్దూ ఒకింత కోపం కూడా వచ్చేది. పిల్లలు ఆడుకునే వయసులో ఆడుకోవాలి అనే కాన్సప్ట్‌కు నేను పూర్తిగా మద్దతు ఇస్తాను మరి. సరే అని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న క్లాసులకు ఒకసారి వెళ్లాను. చాలా ఆశ్చర్య పోయాను. అక్కడో మినీ శాంతినికేతన్ ఆవిష్కృతమై వుంది. అక్కడ పిల్లలకి పాటలు పాడటం నేర్పుతున్నారు. కథలు చెబుతున్నారు. మట్టితో బొమ్మలు చేయడం నేర్పుతున్నారు. డ్రాయింగ్ గీయడం, ఇంగ్లీషు, తెలుగు రాయడం, చదవడం, చక్కని చేతి వ్రాత అలవాటు చేస్తున్నారు. ఆ సమయంలోనే ఆటలు ఆడిస్తున్నారు. ఇదంతా శిక్షణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, విశ్రాంత మాస్టార్లు, ఉద్యోగుల పర్యవేక్షణలో చేస్తున్నారు. మధ్యలో ఒక్కొక్కరుగా వచ్చి సామాజిక విషయాలు, మంచి నడవడి మీద ఇచ్చే ప్రసంగాలు చిన్నారులు ఆసక్తిగా వింటున్నారు. దేశభక్తిని పెంపొదిస్తున్నారు. వీరంతా స్కూళ్లు తెరిచాక ఖచ్చితంగా మెరుగైన ఫలితాలు సాధిస్తారు. అప్పుడు అనిపించింది. నా చిన్నప్పుడు ఇలాంటి ఒక వేసవి విడిది వుంటే నాలో సృజనాత్మకత అంటూ ఏదైనా వుంటే అది మెరుగు పెట్టబడి వుండేది కదా అని. అవును ఇక్కడే విద్యార్థి ఆసక్తి బయట పడుతోంది. చదువుల చట్రం నుంచి బయటికొచ్చి తనకు ఏమి కావాలో మొదటిసారిగా తెలుసుకునే అవకాశాం ఈ వేసవి శిబిరంలో బయట పడుతోంది. ఇక్కడ ఒక విషయం, ఈ శిబిరానికి తమ పిల్లల్ని పంపుతున్న తల్లిదండ్రులని అభినందించే తీరాలి. బాల బాలికల భేదం లేకుండా ఉదయం వారిని శిబిరం దగ్గర దింపి తిరిగి తీసుకు వెళ్లడంతో పిల్లలకి కూడా తమ ఆసక్తుల మీద శ్రద్ధ పెరుగుతోంది. ఇంతటి మంచి కేంద్రాన్ని నిర్వహిస్తున్న సహృదయ మిత్రమండలిని అభినందించాను.

మద్యపాన ధూమపాన వ్యతిరేక ప్రచారం :

మీరు ఎప్పుడైనా మా పిఠాపురం శివరాత్రి తీర్థంలోకి వచ్చారా.. రాకపోతే ఈ శివరాత్రికి రండి. తీర్థంలో బొమ్మల దుకాణాలు లేకపోవచ్చు.. ఖర్జూరం, జీళ్లు దుకాణాలూ వుండక పోవచ్చు. సహృదయ మిత్రమండలి స్టాల్ మాత్రం కచ్చితంగా వుంటుంది. మైకులో గంభీరమైన స్వరంతో మిమ్మల్ని ఆకర్షిస్తుంది. తీర్థం ప్రారంభంలోనే మిమ్మల్ని హెచ్చరిస్తుంది. ధూమపానం, మద్యపానం, ఇప్పుడు కొత్తగా గంజాయి వలన వచ్చే అనర్థాలు, అనారోగ్యాలు చెప్పి మిమ్మల్ని భయపెడుతుంది, హెచ్చరిస్తుంది. ఇది సహృదయ మిత్రమండలి చేసే ప్రత్యేక సామాజిక సేవ. ఏటా శివరాత్రికి వచ్చే భక్తులను హెచ్చరించి వారి జీవితాలను నిలబెట్టడానికి మిత్రమండలి చేస్తున్న స్వచ్ఛంద సేవ ఇది. ఒక్క తీర్థానికి ఈ ప్రచారానికి కనీసం పది మంది మారినా చాలు అనే దృక్పధం నిజంగా అభినందనీయమే కదా. ఈ మండలిలో ఉపాధ్యాయులు, డాక్టర్లు, నటులు, గాయకులు, మానసిక వైద్య నిపుణులు, కవులు, విశ్రాంత ఉద్యోగులు, ఇలా అన్ని విభాగాల్లో నిపుణులు వున్నారు,. వారంతా స్వచ్ఛందంగా తమ సేవలు అందిస్తున్నారు. సహృదయ మిత్రమండలి బ్యానర్ కింద సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇటువంటి ఒక సంస్థ పిఠాపురం కేంద్రంగా పని చేయడం చాలా సంతోషం. వారందరికీ నా హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

-సరిదే నాగేశ్వరరావు (సరిదే నాగ్)

జర్నలిస్టు, న్యాయవాది, పిఠాపురం

"కాలుష్యంతో కూడిన పారిశ్రామిక ప్రగతి అందరికీ ప్రగతి కాదు. కొందరికి ప్రగతి, కొందరికి వినాశనం, విధ్వంసం. కొందరికి విపరీతమైన లాభాలు, కొందరికి మంచి మంచి ఉద్యోగాలు, కొందరికి మెరుగైన వినియోగ వస్తువుల లభ్యత, కొందరికి అనారోగ్యమైన కూలిపని, కొందరికి ఏ ప్రయోజనం లేని వట్టి వినాశనం.

ప్రగతి అనేది ఈ విధంగా ఉండకూడదు. కొందరికి ప్రయోజనం, కొందరికి వినాశనం, కొందరికి నాగరికత, కొందరికి అంధకారం మిగిలించే ప్రగతి ప్రగతి కాదు. పారిశ్రామిక కాలుష్యాన్ని వ్యతిరేకించడం అంటే ఈ రకమైన వికృతమైన ప్రగతిని వ్యతిరేకించడమే. అంతే తప్ప పరిశ్రమలనూ, అభివృద్ధినీ వ్యతిరేకించడం కాదు.

మరి దీనికి ఆచరణ యోగ్యమైన పరిష్కారమేమైనా ఉందా లేక కాలుష్యం లేని పారిశ్రామిక ప్రగతి కేవలం ఒక ఊహాజనితమైన ఆదర్శమా అంటే అది ఊహాజనితమేం కాదు. కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం పెరిగే కొద్దీ కాలుష్యాన్ని నివారించే సాంకేతిక ప్రక్రియలను అన్వేషించడం జరిగింది. వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పే చట్టాలూ వచ్చాయి."

- బాలగోపాల్

సమయం మన చేతుల్లో ఉండదు. కాని, సమయం మించిపోకుండా జాగ్రత్త పడడం మన చేతుల్లో పనే !

సహృదయ మిత్రమండలి వ్యవస్థాపకులకు... అప్పటి నుండి ఇప్పటి వరకూ మిత్రమండలిని కొనసాగిస్తూ వస్తున్న ప్రతీ ఒక్కరికీ నా సహృదయ నమస్కారాలు.

నలుగురు కలిసి కూర్చుంటే... ఏదో విషయంపై కాలక్షేపం చేస్తూ సమయం వృధా చేసుకుంటూ ఉంటారు. అదే విధంగా పిల్లలు వేసవి సెలవులు వస్తే తమ సమయాన్ని ఆటలతో వృధా చేసుకుంటారని... ఆ సెలవు సమయంలో కూడా పిల్లలు చదువుపై దృష్టి సారించాలని వినూత్న ప్రయత్నంగా ప్రారంభించారు "సహృదయ మిత్రమండలి". ఒక మంచి పని చేయాలంటే గొప్ప వ్యక్తి అయ్యి ఉండనవసరం లేదు.. గొప్ప ఆలోచన ఉంటే చాలు అని నిరూపించారు "సహృదయ మిత్రమండలి సభ్యులు". అటువంటి మిత్రమండలిలో ఒక విద్యార్థిగా ప్రారంభమయిన నా ప్రయాణం వారి మిత్రమండలి సభ్యుడిగా ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉంది. నా ఈ ప్రయాణంలో అనేక విషయాలు, అంశాలు "సహృదయ మిత్రమండలి" ద్వారా నేర్చుకున్నాను. మొదటిగా సమయపాలన, పెద్దలపట్ల గౌరవం, సమాజంలో ఎక్కడైనా అన్యాయం జరిగితే ప్రశ్నించే తత్వం ఇలా పలు విషయాలు ఈ "సహృదయ మిత్రమండలి" ఉచిత వేసవి శిక్షణా తరగతుల ద్వారా నేర్చుకోవడం జరిగింది. సహృదయంతో ఏర్పాటు చేసిన ఈ మిత్రమండలి ప్రతీ సంవత్సరం మే నెలలో ఉచిత వేసవి శిక్షణా తరగతులు ఏర్పాటుచేసి సుమారు 30 రోజులు విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు, సంగీతం, చేతిరాతపై మెళకువలు, చిత్రలేఖనం, పుస్తకాలపై అవగాహన, యోగ ఇలా పలు విషయాలు ఉచితంగా నేర్పించి, శిక్షణా తరగతులు ముగిసిన అనంతరం విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రకు తీసుకువెళ్లి పలు పోటీలు నిర్వహించి, పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అందజేసి విద్యార్థులను అభినందిస్తారు. ఇటువంటి "సహృదయ మిత్రమండలి"లో నన్ను కూడా భాగస్వామ్యం చేసిన నాతోటి సహృదయులకు నా నమస్కారాలు. ఈ " సహృదయ మిత్రమండలి" ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు అయినందుకు.. ఇప్పటివరకూ నిర్విఘ్నంగా ప్రతీ సంవత్సరం శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి, నిర్వహిస్తున్న "సహృదయ మిత్రమండలి" సభ్యులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.

మీ... **డా. యాండ్ర శ్రీ వీర వెంకట సునీల్ కుమార్**

సహృదయ మిత్రమండలి వారు చేస్తున్న కార్యక్రమములు అనగా మద్యపానం నిషేధము, మత్తు పదార్థముల నిర్మూలన, యువత చెడు మార్గంలో జారకుండా ఉండేటట్లు అవేర్నెస్ క్యాంపులు పర్యావరణం పరిరక్షణ

స్వచ్ఛభారత్ ప్లాస్టిక్స్ నిషేధము వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా ఆనందదాయకంగా ఉంది. ముఖ్యంగా వేసవి శిబిరముల ద్వారా విద్యార్థులకు నైపుణ్య విలువలు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా బోధించడం. సహృదయ మిత్రమండలి వారు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటూ.

– కె.వి.వి. సత్యనారాయణ A.S W.O (Rtd)

కష్టాలను తప్పించుకునే వారికంటే వాటిని అధిగమించే వారే విజయం సాధించగలరు.

శతజయంతి సందర్భంగా....

ధ్వజమెత్తిన ప్రజ

గత కలహాల మీద
గతం సలహాల మీద
కాంతిని కనపడనివ్వని గాఢాంధకారాల మీద
శాంతిని వినపడనివ్వని రణ ఘీంకారాల మీద
॥ధ్వజమెత్తిన ప్రజ, ఆ ప్రజ నిజమైన ప్రజ॥

భారతికి హారతి పట్టనివ్వని వారి మీద
స్వాతంత్ర్యాన్ని పారతంత్ర్యంగా మార్చగోరే వారి మీద
దారిద్ర్యరేఖను తుడిచివేయనివ్వని ధనస్వామ్యం మీద
ధరల ఉదజని బుడగను 'ధర'కు రానివ్వని ఆర్థిక వ్యవస్థ మీద
॥ధ్వజమెత్తిన ప్రజ, ఆ ప్రజ నిజమైన ప్రజ॥

మూఢవిశ్వాసాల మేడల్లో వసించి
గాఢంగా భక్తావళిని కరుణించినట్లు నటించి
అజ్ఞానం అనే అమూల్యవరాల్ని విక్రయించి
ఆర్జన చేసుకునే అధమ శ్రేణి మునివర్యుల మీద
॥ధ్వజమెత్తిన ప్రజ, ఆ ప్రజ నిజమైన ప్రజ॥

కులం బలాన్ని కలం బలంగా భావించి
కిలం పట్టిన భావాలను కళగా చిత్రించి
కృతజ్ఞతాభావాన్ని వెన్నుపోటుగా పరివర్తించి
హింసా రిరంసతో జీవించే హీనుల మీద
॥ధ్వజమెత్తిన ప్రజ, ఆ ప్రజ నిజమైన ప్రజ॥

ధన, పదవీ, కీర్తి దాహాల మీద
పరదేశ, భాషా, వేష వ్యామోహాల మీద
నగ్నతా ప్రదర్శనాభిలాషి దేహాల మీద
సమాధానాలు లేని చచ్చు సందేహాల మీద
॥ధ్వజమెత్తిన ప్రజ, ఆ ప్రజ నిజమైన ప్రజ॥

– దాశరథి కృష్ణమాచార్య

శ
త
జ
య
ం
తి



మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య
(1926–1984)



మాస్టర్ తిచ్ నాథ్ హన్
(1926–2022)

ని
వా
ళు
లు

ఓర్పును మించిన నేర్పు, శ్రమను మించిన సాధనలేదు.

ముందుగా 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు సహృదయ మిత్ర మండలి బృందాన్ని అభినందిస్తున్నాను.

మనిషి జీవితంలో సేవాభావన అత్యున్నతమైనది. ఈ సేవాభావనను కార్యరూపంలోకి తీసుకువచ్చినది సహృదయ మిత్రమండలి. గత 25 సంవత్సరాలుగా ఈ సంస్థ అనేక సామాజిక, సాంస్కృతిక, విద్యా, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మన సమాజానికి ఒక స్ఫూర్తిదాయక దారిని చూపిస్తోంది.

నాకు వ్యక్తిగతంగా సహృదయ మిత్రమండలితో తక్కువ అనుబంధం ఉన్నప్పటికి వారి కార్యక్రమాల వెనుక ఉన్న నిజమైన సేవాభావం నాపై ఎంతో ప్రభావం చూపింది. విద్యార్థులకు వేసవి శిబిరాలు,మద్యపాన నిషేదం,పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఇలా విభిన్న కార్యక్రమాలు వారు నిస్వార్థంగా చేస్తూ వచ్చారు.

ఈ 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో కష్టాలు ఎదురైనా, మిత్రమండలి సభ్యులు ఆపకుండా తమ కర్తవ్యాన్ని కొనసాగించారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో వారు ఏకమై పనిచేయడం నిజంగా మనందరికీ ఆదర్శం.

గత సంవత్సరాల కృషిని స్మరించుకోవడం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పం వారిది.

సహృదయ మిత్రమండలి కేవలం ఒక సంఘం కాదు, అది మనసున్న వారి కుటుంబం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలను సమాజంలో విస్తరించే శక్తి.

ఈ 25 ఏళ్ల ప్రస్థానం మనందరికీ స్ఫూర్తి. భవిష్యత్తులో కూడా ఈ సంస్థ మరిన్ని శుభకార్యాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా...

-సి.హెచ్. అరుణ, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్, లిటిల్ ఛాంప్, పిఠాపురం.



సహృదయ మిత్రమండలి వారు చేస్తున్న కృషికి అభినందనలు. ఎందరో విద్యార్థులను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న కార్యక్రమాలు నాకు నచ్చినవి వారందరికీ వేసవి శిక్షణ శిబిరములు నిర్వహణ చాలా బాగున్నవి .

- దాడి పద్మనాభం, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు, కాకినాడ జిల్లా

ప్రారంభం నుండి సహృదయ మిత్రమండలి వ్యవస్థలో తన శక్తిమేరకు సేవాదృక్పథంతో పాటుపడుతోంది. ముఖ్యంగా వేసవి శిక్షణ తరగతులు, వ్యసనాలపై చైతన్య కార్యక్రమాలతో బాటు ప్రతీ మహాత్ముడి జయంతి/వర్థంతికి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తోంది. మిత్రమండలి వంటి సంస్థలు సమాజ ప్రగతికి మరింత అవసరం.

-P. **సత్తిబాబు**

వెలుగును చూసి చీకటి పారిపోతుంది. నిర్విరామంగా శ్రమించే వ్యక్తిని చూసి ఓటమి భయపడుతుంది.

శతజయంతి నివాళి

నాకొ్కంచెం నమ్మకమివ్వు

- ఆలూరి బైరాగి

నాకొ్కంచెం నమ్మక మివ్వు
కొండలు పిండి కొట్టేస్తాను
చితికిన టొమేటో లాంటి సూర్యుణ్ణి
ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణి
ఆకాశపు ఎంగిలి పళ్ళెంలోంచి నెట్టేస్తాను
నాదగు బాహుబంధనంలో
ఈ సువిశాల బ్రహ్మాండాన్ని చాపలాగ చుట్టేస్తాను
నిస్సహాయ మానవేయుని నొసటి వ్రాలు
ఒక్క కలం పోటుతోటి కొట్టేస్తాను
జీవిత సభా భవన ద్వారం నుంచి
అన్యాయాన్ని అక్రమాన్ని మెడబట్టుక గెంటేస్తా
ఇంకెన్నో ఎన్నెన్నో చేస్తాను, కాని ఒక్కటి-
నాకొ్కంచెం నమ్మక మివ్వు
కాలుని మీద కలబడతాను
పరమశివుని శూలాగ్రాన తలక్రిందులుగ నిలబడతాను.
ఇంటింటా గగన కుసుమాలు మూడు పూవులుగ
నందన నికుంజాల్లోని అమృతఫలాలు ఆరు కాయలుగ
పూయిస్తాను. కాయిస్తాను-
కొయ్యతుపాకి దొరనై పోయి
బావులు పూడ్చిస్తాను, చెరువులు త్రవ్విస్తాను
ఆకాశపు పందిరి క్రింద
నయాగరా నిర్ఝరాల చలివేంద్రాలు స్థాపిస్తాను
ప్రపంచమనే మహాసత్రం నిండిపోతే
మరో సత్రం కట్టిస్తాను
ఆకాశపు ఊదారంగు తాను చించి
చొక్కాల్లేని వారందరికి కుట్టిస్తాను.
ఒకటేమిటి ఏదైనా చేసేస్తాను
నాకొ్కంచెం నమ్మక మివ్వు
నమ్మకం లేని బొందె ఖాళీ సిగరెట్టు టిన్ను
నమ్మకం లేని హృదయం పుల్లలు లేని అగ్గిపెట్టె
నమ్మకం లేని బ్రతుకు కాలిన సిగిరెట్టు బూది
అన్నీ ఉన్నప్పటికీ నమ్మక మొకటి లేనియెడల బ్రతుకు వమ్ము
నాకొ్కంచెం నమ్మక మివ్వు
నమ్మక మివ్వు, నమ్మక మివ్వు

('మహాసంకల్పం' కవితాసంకలనం నుంచి)

సహృదయ మిత్రమండలి ప్రతి సంవత్సరం నిర్వహించే వేసవి శిక్షణ తరగతులకు మా పిల్లలు 2022 లో హాజరైనారు..... ఆ సందర్భంగా నేను ముగింపు కార్యక్రమానికి హాజరైనప్పుడు ఈ సంస్థ యొక్క గొప్పతనం సహృదయం మొదలగు వాటి గురించి తెలిసింది..... డాక్టర్ సూర్యనారాయణ గారు అలాగే సతీష్ గారు సహృదయ మిత్రమండలి సంస్థలోకి నన్ను ఆహ్వానించారు. వారికి కృతజ్ఞతలు... అప్పటినుంచి సహృదయ మిత్రమండలి కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నాము, ఈ సంస్థలో ఉన్న సభ్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క గ్రంథాలయం తో సమానం. వారి నుంచి చాలా విషయాలు నేను తెలుసుకున్నాను అలాగే ఇంకా నేర్చుకుంటున్నాను... ఈ సంస్థ ద్వారా పిల్లలకు, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలలో నేను భాగస్వామ్యం అయినందుకు చాలా గర్వంగా ఉంది. అలాగే సహృదయ మిత్రమండలి కి ఒక డ్రెస్ కోడ్ ఉంటే బాగుంటుందని ప్రతి నెల జరుపుకునే మీటింగ్ లో నా అభిప్రాయాన్ని అంగీకరించి దాన్ని అమలు చేసినందుకు సహృదయ మిత్రమండలి సభ్యులందరికీ కృతజ్ఞతలు..... 25 సంవత్సరాలు నుంచి ఈ సంస్థను నడుపుతున్న పెద్దలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ. భవిష్యత్తులో ఈ సంస్థ ద్వారా జరిపే కార్యక్రమాల్లో నా యొక్క సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేసుకుంటున్నాను.... ఈ సందర్భంగా నాకు ఈ అవకాశం కల్పించిన అందరికీ కృతజ్ఞతలు.

-వై. కరుణ్ కుమార్, కానిస్టేబుల్

సంతోషానికి మించిన సంపద లేదు. ఆనందానికి మించిన స్వర్గం లేదు.

శ
త
వ
ర్ధం
తి

సర్దార్ తేజాసింగ్ సముంద్రి
(1882–1926)



స్వామి శ్రద్ధానంద
(1856–1926)

ని
వా
ళు
లు

మనసులో మాట

మంచి మనసున్న మనుషులందరినీ ఒక వేదిక మీదకు చేర్చి విలువలతో కూడిన నవ సమాజ నిర్మాణం కోసం విశేష కృషి చేస్తున్న సహృదయ మిత్రమండలికి అభినందనలు. సంవత్సరం మొత్తంలో కార్యక్రమాల క్యాలెండర్ను రూపొందించుకుని విద్యార్థినీ విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుండడం అభినందనీయం. 2001 నుండి ప్రతి సంవత్సరం సహృదయ మిత్రమండలి వారు వేసవిలో ప్రత్యేకంగా విద్యార్థుల కోసం నిర్వహించే కార్యక్రమం సమ్మర్ క్యాంప్. గత మూడు సంవత్సరాల నుండి నేను ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, ఇంద్రజాలం నేర్పించడం నాకు మిక్కిలి ఆనందాన్ని ఇచ్చింది. 100 నుండి 150 మంది విద్యార్థులు ఈ వేసవి కార్యక్రమంలో పాల్గొని రోజుకు ఒక నూతన అంశం మీద శిక్షణ పొందడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖావృద్ధికి అహర్నిశలు సహృదయ మిత్రమండలి శ్రమిస్తుందని చెప్పడానికి నిదర్శనం. ఎవరైనా రిసోర్స్ గా చెప్పడానికి వెళ్ళినప్పుడు వీళ్లు ఆహ్వానించే తీరు సహృదయ మిత్రమండలి పేరుకు నిదర్శనం అని చెప్పవచ్చు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో విద్యార్థుల కోసం నిర్వహిస్తూ దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు అనే గురజాడ అప్పారావు గారి మాటను నిలబెట్టాలని మనసారా ఆకాంక్షిస్తూ

శుభాకాంక్షలతో...

– బుద్ధా శ్రీనివాస్
జె.వి.వి. సైన్స్ & టెక్నాలజీ కన్వీనర్
జాతీయ సైంటిఫిక్ మెజిషియన్

పరాజయం నుండి పాఠాలు నేర్చుకోవాలి, విజయాలతో వినయం అలవర్చుకోవాలి.

సంఘటిత శక్తిపీఠం 'సహృదయ మిత్రమండలి'

-అవధానుల మణిబాబు, సాహితీవేత్త, కాకినాడ.

ఒక వ్యక్తికో, కుటుంబానికో ఒక అవసరమో, ఒకింత ఆపదో ఎదురైనపుడు మిత్రబృందమో, బంధువర్గమో చేయూతనిచ్చేందుకు ముందుకొస్తారు. అదే ఆ అవసరమో, ఆపదో ఒక సమూహానికో మొత్తం సమాజానికో ఐతే అండగా ఉండేందుకు ఒకరిద్దరు సరిపోరు. ఒకరితో ఒకరు చేయి కలిపి, లక్ష్యాలను నిర్దేశించుకుని, అందుకు అనుగుణంగా తమని మలచుకుని తమ శక్తియుక్తులను, సామర్థ్యాలను సమిష్టిగా వినియోగించే వ్యక్తుల సమూహం కావాలి. వారందరి ఆలోచన, ఆచరణ వ్యష్టిగా కాక సమిష్టిగామారి శక్తి సంఘటితం కావాలి. ఈ ప్రయత్నం పరిమిత కాలానికో, ఒక ప్రత్యేక సందర్భానికో మాత్రమే అయితే అది పెద్ద విషయమేమీ కాదు. కానీ, పాతికేళ్ళ పాటు నిరంతరాయంగా ఉమ్మడిగా పనిచేయడం, వివిధ కార్యక్షేత్రాలలో తమ సేవలు విస్తరించడం ... ఇవన్నీ, విశేషంగా నమోదు చేయాల్సిన విషయాలవుతాయ్. అలాంటి ఫలవంతమైన విజయాలను విజయవంతమైన ఫలితాలను అందుకున్న రజతోత్సవ సంస్థ "సహృదయ మిత్రమండలి" సంక్షేమ సంఘం.

"సొంతలాభం కొంత మానుకు పొరుగువానికి తోడుపడవోయ్" అనే గురజాడ మాటల అర్థం తెలిసిన వైద్యులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు... ఇలా విభిన్న వృత్తులలో ఉన్నవారు ఈ సంస్థకు కార్యవర్గ సభ్యులుగా ఉండడం ప్రధానమైన బలం. వివిధ రంగాలలో సమస్యల పట్ల ప్రత్యక్ష అనుభవం కలిగి ఉండడం వలన "మూలం ఏమిటి? సరి చెయ్యాల్సినది ఎక్కడ, అందుకు అనుసరించవలసిన విధానం ఏమిటి" ఇవన్నీ చర్చించి అందుబాటు వనరులతో నిర్దుష్ట ప్రణాళిక, అమలుతో నిర్వహిస్తున్న సంస్థ ఇది.

స్ఫూర్తినిచ్చే మహనీయుల జయంతులు, వర్థంతులు జరుపడం, పర్వదినాలలో భక్త బృందాలకు సౌకర్యాల ఏర్పాటుతో పాటు ఆరోగ్యసూత్రాలను వ్యాధులపట్ల అవగాహన కల్పించడం, ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు వేసవి శిక్షణలు, వనభోజనాలు, ప్రజలకు ఉపయోగకరమైన సమాచారంతో కరపత్రాలు, వాల్ పోస్టర్ల ముద్రణ, జెండా పండుగలు ... ఇలా పాతికేళ్ళుగా ఎన్నో కార్యక్రమాలు.

కేవలం పిఠాపురం పట్టణానికి మాత్రమే పరిమితం కాకుండా, విపత్తులు సంభవించినపుడు తమ సేవా కార్యక్రమాలను విస్తృతంచేయడం ద్వారా సంస్థ సహృదయతే కాదు, హృదయ వైశాల్యమూ స్పష్టం అవుతోంది.

పిఠాపురం పేరు చెప్పగానే పురాతన ఆలయాలు, ఒకనాటి జమీందారీ పాలన, వీణల తయారీ.. ఈ ప్రత్యేకతలతో పాటు సహృదయ మిత్రమండలి సేవలూ గుర్తురావాలని, మీ సంస్థ ఓ సంఘటిత 'శక్తి పీఠం'గా నిరంతరాయంగా వెలగాలనీ అవసరంతో ఉన్నవారు తట్టే మొదటి తలుపు మీది కావాలని – రజతోత్సవ వేళ శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ మరిన్ని రంగాలలో మీ సేవలు మరింత విస్తృతం కావాలని అందుకు అవసరమైన అన్ని వనరులూ సంస్థకు సమకూరాలని అభిలషిస్తూ మాకు చేదోడువాదోడుగా ఉన్నందుకు మీ మిత్రమండలికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

సాధకుడికి శారీరక బలం కన్నా సంకల్ప బలమే మిన్న !

శతజయంతి ప్రత్యేక వ్యాసం

రచయితల సమస్యలు

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి

రచయిత ప్రధానంగా రెండు సమస్యలతో సతమతమవుతున్నాడు. మొదటిది రచనకు కావలసిన విషయసేకరణకు సంబంధించినది. రెండవది రచించిన గ్రంథాలను ప్రచురించుకోవటంలో పడే యాతన. గ్రంథమనే పేరుతో ఏది వ్రాసినా చెల్లుబాటయ్యే కాలం అంతరించింది. ఏదైనా ఒక విషయాన్ని గురించి వ్రాసే ముందు రచయిత ఆ విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవలసి వుంటుంది. అంతేకాక ఆ విషయమును గూర్చి ఇదివరలో ప్రకటితమైన రచనలతో పరిచయం కల్గివుండటం అవసరము. ఇదివరకు వ్రాసినవారికంటే మరికొన్ని క్రొత్త విషయాలను వెల్లడి చేయగల్గినపుడే కొత్తరచనకు పూనుకోవడం సబబు. లేకున్న ఆ రచన పాడిందే పాటగా వుండిపోతుంది. క్రొత్త విషయాలను తెలియజేయవలెనన్నపుడు రచయిత ఒక పెద్ద సమస్యను పరిష్కరించుకోవలసి వుంది. రచయిత వ్యుత్పన్నుడు కావలెను. అందుకు అతనికొక గ్రంథాలయ మవసరము. అసలు రచయితకు తాను బాగా అధ్యయనం చేసి అవగాహన మొనర్చుకొన్న విషయాలనే విశిష్టంగా చెప్పవలెనన్న తహతహ వుండవలసిందే. అట్టి మనస్తత్వం పరిశ్రమలేనట్టి రచయిత చేసే రచనలు నిష్ప్రయోజకములు. వాటివల్ల రచయితకుగాని పాఠకులకుగాని లాభించే ప్రయోజనమేమీ వుండదు.

రచయిత తీవ్రమైన పరిశ్రమకు సంసిద్ధుడు కావలెను. ఈ పరిశ్రమ వ్యయప్రయాసలతో కూడుకొన్నది. నా అనుభవంలోని ఒక విషయాన్ని మనవి చేస్తాను. కడప మండలములో జన్మించిన సుప్రసిద్ధ కవి ఆయన. ఆయన, గతించి నలుబదేళ్ళు అయ్యింటుంది. సుమారు నలుబది గ్రంథాలను రచించిన వాడాయన, ఆ కవిని అతని కావ్యాలను గురించి ఒక పరిచయ వ్యాసం వ్రాయదలచితిని. స్థానికంగా వుండే గ్రంథాలయాలను, కళాశాల గ్రంథాలయంలోను ఆ కవిగారి రచనలకై తిరిగితిని. స్థానిక పండితులను విచారించితిని. ఏ రెండుమూడు గ్రంథములో తప్ప. తక్కినవేవి లభింపలేదు. ఆ మహాకవి తన జీవితకాలంలో సేకరించిన గ్రంథములనే కాక స్వీయరచనలను చేర్చి నాలుగు వందల గ్రంథములను ఒక బీరువాతో సహా స్థానిక గ్రంథాలయమొకదానికి 1926లో దానముగా ఇచ్చినట్లు తెలిసింది. కాని అక్కడ వారి గ్రంథములేవి లభింపలేదు. చివరకు ఒంటిమిట్ట కోదండ రామాలయ ధర్మకర్తల నుండి కొన్ని గ్రంథములు లభించినవి. ఆయన మరెవరో కాదు. “ఆంధ్ర వాల్మీకి” వావిలికొలను సుబ్బరావుగారే.

రాయలసీమ కవుల గూర్చి పరిచయ వ్యాసాలు వ్రాస్తున్నపుడు మరికొన్ని అనుభవాలు కలిగినవి. కొందరు కవులు నా అభ్యర్థనకు ఉదాసీనంగా వుండిపోయారు. మరికొందరు, తమపేరును ఆ రచనలలో ఉటంకించలేదేమన్నారు. మరికొందరు మేమిన్నాళ్ళ తరువాత జ్ఞప్తికి వచ్చామా అన్నారు. ఒక సంఘము వారు రచయిత మరో సంఘానికి చెందినవాడని విమర్శించారు. ఈ రీతి సమస్యలు పరిశోధనాత్మక కృషి సల్పే రచయితలందరూ ఎదుర్కోవలసి వుంటుందనుకొంటాను.

నిరాడంబరం కన్నా గొప్పది ఏది లేదు.

ఇక కథలు, కవితలు, నవలలు, నాటికలు రచించేవారి విషయం చూద్దాం. వారికి పై పేర్కొన్న సమస్యలుండవు కాని వారు ఎదుర్కొనే సమస్యలు కొంత భిన్నంగా వుంటాయి. అతడు కేవలం ప్రతిభావంతుడైన మాత్రాన రచన చేయలేడు. తాను రచింపదలచిన రచనా ప్రక్రియ యొక్క పూర్వాపరాలను అతడు బాగా గ్రహించి వుండవలెను. అంతేకాదు ఇరుగు పొరుగు భాషలలోని ఉత్తమ రచనల పరిచయమూ వుండవలెను. అంతకంటే ముఖ్యముగా ఆయా ప్రక్రియలో కాలాను గుణ్యంగా వచ్చిన రచనాశిల్పము, వస్తు చిత్రణము, పాత్రల మనోవిశ్లేషణా నిరూపణము, జీవిత దృక్పథము, శైలీవిన్యాసము మున్నగు వాటిలో పరిచయముండవలెను. రచన విశిష్టంగ వుండవలెను కదా? అట్టి రచనకు పూనుకొనే రచయితకు కావలసిన అనుభవము పరిశ్రమ, విషయపరిజ్ఞానము వుండి తీరవలెను. అందువల్ల కథా, కవిత, నవల నాటిక మున్నగు వాటిని రచించే వారి కృషి ఎంతమాత్రమూ సులువైనది కాదు. ఇట్టి బృహత్తరమైన బాధ్యతను పూనుకొని రచనలు సాగించేందుకు కావలసిన అనుకూలాలు, వసతులు ఎంతవరకు లభిస్తున్నవి? అని మనం ఆలోచించవలసి వుంది. మేధావులైన అట్టి రచయితలు ఏ చీకూ చింతా లేకుండా ఏకాగ్రతతో రచనలు సాగించే అవకాశం వుందా అని నా ప్రశ్న తెలుగుదేశంలో రచన ఒక వృత్తిగా పరిణమించే కాలం ఇంకా రాలేదు. ఆత్మ తృప్తికి తమ సంతోషానికే వ్రాసేవారు ఎక్కువ. జీవికకై ఏదో ఒక వృత్తిని సాగిస్తూ విరామ కాలంలో రచనలు సాగించేవారు అత్యధిక సంఖ్యాకులుగా వున్నారు. ఈ పరిస్థితులలో విశిష్టము, విశ్వజనీనము అయిన రచన చేయడం ఎలా సాధ్యమవుతుంది. మీరు పరిశోధనలు సాగించండి. ఉత్తమ గ్రంథాలు వ్రాయండి, తగినంత ఆర్థిక సహాయం మేమందజేస్తాం అనే సంస్థ కాని, విశ్వవిద్యాలయం కాని ప్రభుత్వం కాని కానరాదు.. ఆర్థికంగా సతమతమవుతున్న ఈ సమయంలో రచయిత మాత్రం నిబ్బరంగా నిశ్చితంగా రచనలు ఎలా చేయగలడు? అనే విషయం మనం ఆలోచించవలసి యున్నది.

ఎన్నో కష్టాలను అధిగమించి రచన పూర్తి చేసిన తరువాత దాన్ని ప్రచురించి విక్రయించుటలో అతడు వందలాది సమస్యల నెదుర్కోవలసి వుంది. రచనకు తగిన ప్రతిఫలం ఆశించడం ఆకాశ పుష్పంలా అసంభవమైంది. కొద్ది పెట్టుబడితో అల్పవ్యవధిలో శ్రమ లేకుండా అధిక లాభాలను గడించడం ప్రచురణకర్తల లక్ష్యము. సాధారణంగా వ్యాపారమంటేనే లాభార్జనాసక్తి ప్రధానంగా వుంటుంది. రచనలలో కూడ పరిశోధనాత్మక రచనలు సులువుగా అమ్ముడుపోవు. వాటిని ప్రచురించుటకు సామాన్యంగా ఎవరూ ముందుకురారు. ఈనాడు కథలూ, నవలలూ ప్రచురించే సంస్థలు ఎన్నో పుట్టుకొచ్చినవి. వారు బాగా డబ్బు చేసుకొంటున్నారు.

రచయిత తన రచన అందంగా ఆకర్షణీయంగా అచ్చుతప్పులు లేకుండా, ఆలస్యం కాకుండ ముద్రింపబడి పాఠకుల ప్రశంసలు అందుకోవలెనని ఆశించడం సహజం. కాని రచయితల మనస్తత్వాలను బాగా గ్రహించిన ప్రచురణకర్తలు ఏదో కొంత ముట్టజెప్పి రచనను తీసుకొని ముద్రించి బాగా డబ్బు చేసుకోవడం సామాన్యంగా జరుగుతున్నదే. కాకపోతే మరుముద్రణ కొచ్చినప్పుడు పదో పదిహేనో శాతం రాయల్టి ఇస్తారు. రచయిత స్వయంగా ముద్రించి విక్రయదారుల వద్దకు వెళ్తే నలభై, యాభై శాతం వరకు కమీషన్ ఇమ్మంటారు. ఇవన్నీ చూస్తే రచయిత కావడం కంటే వ్యాపారి కావడం అన్నివిధాలా లాభదాయకం అనిపిస్తుంది. తెలుగు దేశంలో

రచయిత లెదుర్కొనే సమస్యలలో ఇదొక పెద్ద సమస్య. స్వయంగా ప్రకటించే రచయితకు పుస్తకాలను అమ్ముకోవడం గడ్డు సమస్యగా వుండిపోతుంది. మిత్రులకిచ్చిన కాంప్లిమెంటరీ ప్రతులు తప్ప తక్కినవన్నీ యింటిలో మూలుగుతూ వుంటాయి. కొన్నినెలలు దాటినా పరిస్థితిలో మార్పురాక పోయేసరికి పుస్తక వ్యాపారులను ఆశ్రయించి వారు కోరిన ధరకు అమ్మివేసి తన బరువు తీరిపోయిందనుకుంటారు. చివరకు తన మిత్రులకివ్వటానికి ప్రతులు కావాలని విక్రయదారును అడిగితే పూర్తి వెలయిస్తే గాని పుస్తకం లేదంటాడు. ఇది రచయితకూ, ప్రచురణకర్తకూ మధ్యగల బాంధవ్యం. రచయిత రెంటికీ చెడిన రేవడి అయిపోతున్నాడు.

రచన ఒక వృత్తిగా పరిణమించలేదనే విషయం అందరికీ తెలిసిందే. తొలిదశలో రచయిత ప్రతిఫలము ఆశించదు. కొంతకాలం సాగిన తర్వాత అతడు తన శ్రమకు తగిన ప్రతిఫలాన్ని కోరడం సహజం. ధనార్జనయే ప్రధానంగా భావించి రోజుకు కొన్ని పుటలవంతున వ్రాసే రచయితలు కూడ ప్రచురణకర్తల వలలో పడిపోయే ప్రమాదం వుంది.

వందో, యాభయ్యో చెల్లించి రచనలను చేజిక్కించుకొని, కొన్నేళ్ళయినా వాటిని ప్రచురించుటకు పూనుకోనట్టి ప్రకటనకర్తలు వున్నారు. కొన్నేళ్ళయినా పుస్తకాలు బయటికి రాలేదేమని రచయిత అడిగినప్పుడు ముద్రణకు కావలసిన పెట్టుబడి చాలదంటాడు ప్రచురణకర్త. చివరకు రచయితనుండి కొంత పైకాన్ని తీసుకొంటాడు. ఈ రీతిగా రచయిత నానా యాతనలు పడుట సంభవిస్తున్నది.

ఇన్ని అవస్థలను అధిగమించి పుస్తకాలను అచ్చు వేసుకొన్న తర్వాత, ప్రముఖుల అభిప్రాయాలకు, పత్రికలో సమీక్షలకు పుస్తకాలను పంపుకొంటాడు. కొందరు పెద్దలు పుస్తకాలు అందినట్లు కూడా వ్రాయరు. కొన్ని నెలలు దాటినా సమీక్షలు రావు.

రచయితల సహకార సంఘాలు నిర్మింపబడినపుడు, యీ సమస్యలు చాలావరకు పరిష్కారం కాగలవు. ప్రభుత్వము గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, యీ సహకార సంఘాల ప్రచురణలను తప్పక కొనవలసి వుంటుంది. అట్టి మంచిరోజులు త్వరలో రాగలవని ఆశిద్దాం.

(తెలుగు వెబ్ పత్రిక 'సంచిక' సౌజన్యముతో....)

"బడుగువర్గాల జీవితాలు బాగుపడడాన్ని మనం ఇంకా 'అభివృద్ధి'గా అర్థం చేసుకోవడం లేదు. సంక్షేమంగా మాత్రమే అర్థం చేసుకుంటున్నాం. 'అభివృద్ధి' ఆదాయాన్ని తెచ్చిపెడితే 'సంక్షేమం' ఖర్చును పెంచుతుందని చెప్పి దానిని ఒక కంట కనిపెట్టి ఉంచాలనుకుంటాం. చవక బియ్యం, ఉచిత కరెంటు, ఎస్.సి. బి.సి స్కాలర్షిప్లు, వికలాంగులకు బస్పాసులు, ఇవన్నీ ప్రభుత్వానికి ఖర్చు పెంచే సంక్షేమ చర్యలు అనుకుంటాము కాబట్టి వీటికొక సీలింగ్ పెట్టి అంతకంటే ఎక్కువ అడగొద్దనీ ఇవ్వొద్దనీ అంటాం. అదే వెడల్పయిన రోడ్లు, టెలికాం లైన్లు, పర్యాటక కేంద్రాలు - ఇటువంటివయితే 'అభివృద్ధి'కి సంబంధించిన విషయాలనీ, వాటిపైన ఎంత ఖర్చు పెట్టగలిగితే అంత మంచిదనీ అనుకుంటాం. కానీ నిజానికి 'సంక్షేమం' అనేది ఎంత 'అభివృద్ధో' గ్రహించినట్టయితే ఈ విషయాలు గురించి మనం చర్చించే పద్ధతే మారిపోతుంది. ప్రభుత్వ ఖజానాకూ ప్రైవేట్ బ్యాంక్ అకౌంట్లకూ పెట్టుబడులను వేగంగా జమచేసేది మాత్రమే అభివృద్ధి కాదనీ, ప్రజల జీవితాలను బాగుపరిచేదీ అభివృద్ధే అనీ గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో."

- బాలగోపాల్

హక్కులు కోరేవారు బాధ్యతలు స్వీకరించాలి.

అందరి మేలు కోరేదే అసలైన మానవత - అభ్యుదయ ఫౌండేషన్



(సంగీత, సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ) ఫౌండర్ చైర్మన్

శ్రీ బాదం మాధవరావు కాకినాడ - పిఠాపురం

The objective of the foundation is to preserve, nurture and promote culture and other value systems that would change the youths Outlook

అభ్యుదయ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ శ్రీ బాదం మాధవరావు గారి గురించి కొన్ని విషయాలు.

పిఠాపురం వాస్తవ్యులు హరికథా విద్వాంసులు శ్రీమద్రామాయణ హరికథా రత్నాకర బిరుదాంకితులు శ్రీ బాదం అప్పారావు గుప్తా భాగవతార్ శ్రీమతి అప్పలరాజు దంపతుల జేష్ఠ కుమారుడు బాదం మాధవరావు గారు. మాధవరావు గారు పిఠాపురం ఆర్.ఆర్.బి.హెచ్ పాఠశాలలో 13 ఏళ్ల విద్యార్థిగా ఉన్న సమయంలో పత్రికలో విద్య గురించి విశ్లేషణాత్మక వ్యాసం రాసిన బాదం మాధవరావు జీవితంలో, తాను ఉన్నత స్థితికి చేరితే విద్యకి మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఆనాడే తన మనసాక్షిగా నిర్ణయించుకున్నారు. శ్రీ బాదం మాధవరావు గారు ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అనే ఆశయంతో ఆయన పిఠాపురంలో బాదం మాధవరావు బాలికోన్నత పాఠశాలను నిర్మించారు.

విద్యార్థిగా తన చదువు ముగిసిన తర్వాత అనేక కష్టనష్టాలను ఒడిదుడుకులు ఎదుర్కొని నిలబడి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు శ్రీనారాయణమూర్తి గారికి సలహాదారుగా ఉన్నత స్థితికి చేరుకున్నారు.

జననీ జన్మభూమిశ్చ అని తలంపుతో తాను పుట్టిన ఊరికి మంచి చేయాలన్న ఉద్దేశంతో పిఠాపురం పట్టణంలో శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, **C.M.C.** హాస్పటల్లో ఇంటెన్సివ్ కెరియర్ యూనిట్ (ICU) మరియు శ్రీ సూర్యరాయ విజ్ఞాన గ్రంథాలయం పునః నిర్మాణం చేశారు.

సంస్కృతి రక్షిత రక్షితః. సంస్కృతిని మనం రక్షిస్తే సంస్కృతి మనలను రక్షిస్తుంది అని విశ్వసించి ఆ సంస్కృతిని రక్షించే ఆలోచనతో సంగీత, నృత్య, సాహిత్య కళలను ప్రోత్సహించి సంప్రదాయ సంస్కృతి వైభవం పేరుతో ప్రముఖ విద్వాంసులు శ్రీ పండిట్ అజయ్ చక్రవర్తి, మాండలిన్ శ్రీనివాస్, ఫ్లూట్ శశాంక్, శ్రీ నేదునూరి కృష్ణమూర్తి, నూకల చిన్న సత్యనారాయణ, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అవసరాల కన్యాకుమారి, శ్రీ గరికిపాటి నరసింహారావు, శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ లాంటి ప్రముఖులకు అభ్యుదయ పురస్కారాలతో సత్కరించడం జరిగింది.

అభ్యుదయ ఫౌండేషన్ వారసుడిగా శ్రీ బాదం మాదవరావుగారు తన సోదరుడు బాదం ఉదయ సూర్యప్రకాష్‌ను నియమించడం జరిగింది. అభ్యుదయ ఫౌండేషన్‌ను, శ్రీ బాదం మాదవరావుగారి ఆశయాలను, ఆయన వారసుడైన బాదం ఉదయ సూర్యప్రకాష్ గారు అంకిత భావంతో కొనసాగిస్తున్నారు. సహృదయ మిత్రమండలి రజతోత్సవం సందర్భంగా మా ఫౌండేషన్ తరుపు నుండి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

25 ఏళ్ల సేవా సుగంధం -సహృదయ మిత్రమండలి

మనిషి జీవనయానంలో ఎన్నో మలుపులు వస్తాయి. కానీ కొన్ని ప్రయాణాలు మాత్రం వ్యక్తులకే కాకుండా సమాజానికి కూడా వెలుగులు నింపుతాయి. అలాంటి ఓ వెలుగుల ప్రస్తానమే సహృదయ మిత్రమండలి 25యేళ్ళు పూర్తి చేసుకున్న ఈ సందర్భం. ఇది కేవలం ఓ సంస్థ రజతోత్సవ వార్షికోత్సవం మాత్రమే కాదు. సేవా భావం, నిబద్ధత, మానవత్వం, సమాజం పట్ల బాధ్యత యొక్క విజయోత్సవం. పిఠాపురం పరిసర ప్రాంతాలలో నిర్వహించే స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకి పునరంకిత మహోత్సవం.

ప్రత్యేకించి ఆరోగ్య శిబిరాలు, స్వచ్ఛభారత్, పిల్లలకు వేసవి శిక్షణతరగతులు, పర్యావరణ పరిరక్షణ, యువతకు ఆరోగ్యకరమైన అలవాట్ల పరిచయం, వంటి కార్యక్రమాలు నిర్వహించుట లో సహృదయ మిత్రమండలి పాత్ర ఎంతైనా అభినందనీయం. వ్యక్తిగత జీవితం కంటే, సమాజం కోసం 'సొంత లాభం కొంత మానుకొని, పొరుగు వారికి తోడుపడవోయ్', అన్న గురజాడ బాటలో నిస్వార్థంగా నిరంతరాయంగా పనిచేస్తున్న మిత్రమండలి సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.

మనుషులు ఉన్నంతవరకు సమాజంలో మంచితనం ఎప్పటికీ చెరిగిపోదు. 25 యేళ్ళు పూర్తి కావడం ఒక మైలురాయి మాత్రమే . ఇది కొత్త ప్రయాణానికి ఆరంభం. భవిష్యత్తులో మరింత శక్తితో మరింత విశ్వాసంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షిస్తూ,

- శ్రీ మొండ్రేటి వెంకటేశ్వరరావు దంపతులు
అసిస్టెంట్ ఇంజనీర్ (RTD) పిఠాపురం

సమానతపై లోతైన పరిశీలన

–మాన్విత మొండి, 7th STANDARD (E. M.),

"సమానత" అనే పదం ఈ కాలంలో కేవలం సామాజిక నినాదం మాత్రమే కాదు. ఇది భారత రాజ్యాంగంలోనూ, సస్టెయినబుల్ డెవలప్మెంట్ గోల్స్ (SDGs) లోనూ ముఖ్యంగా ప్రస్తావించబడింది. అయినప్పటికీ, దశాబ్దాలుగా ఈ విషయంలో చర్చలు, ప్రచారాలు, విద్యా కార్యక్రమాలు జరుగుతున్నా, నిజమైన సమానత సాధించబడినట్టు కనిపించడం లేదు. లింగం, కులం, ప్రాంతం, ఆర్థిక స్థితి వంటి ఆధారాలపై వివక్షలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

సమానత అనే భావనను స్కూళ్లలో, ప్రోగ్రాముల్లో, పాఠ్యపుస్తకాల్లో బాగా ప్రోత్సహిస్తున్నప్పటికీ, సాధారణ దైనందిన పరిస్థితుల్లో ఇంకా అసమానత కనిపిస్తూనే ఉంది. మనుషులపై వారు ఎలా కనిపిస్తారో, ఏ బ్యాగ్రౌండ్ నుండి వచ్చారో అనే విషయాల ఆధారంగా తీర్పు వేయడం జరుగుతోంది. కొన్ని పనులను కేవలం లింగం లేదా సామాజిక పాత్రల ఆధారంగా అప్పగించడం కూడా జరుగుతోంది. ఈ రకమైన చిన్న, సాధారణ పరిస్థితుల్లోనే అసమానత మొదలవుతుంది.

ఇలాంటి విషయాలను చాలా మంది రాజకీయాలు లేదా కంపెనీలు తమ ప్రయోజనం కోసం ఉపయోగించే అంశంగా మాత్రమే చూస్తున్నారు. కానీ సమానత అనేది ప్రతి మనిషికి అవసరమైన మౌలిక హక్కు.

అసమానత దైనందిన జీవితంలో ఎలా కనిపిస్తుంది?

సమానతకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని వివక్ష అంటారు. ఇది లింగం, రూపం, ఆర్థిక స్థితి, సామాజిక స్థితి మరియు ఇతర విషయాల ఆధారంగా వస్తుంది. మనం సమాజాన్ని మార్చాలంటే, ముందు మన చుట్టూ ఉండే చిన్న చిన్న వివక్షలను గుర్తించి, వాటిని మార్చే ప్రయత్నం చేయాలి. ఇటువంటి చిన్న మార్పులు కూడా పెద్ద మార్పులకు దారితీస్తాయి. ఒకరిని గౌరవంగా చూడడం, లింగ ఆధారంగా కాకుండా సమాన అవకాశాలు ఇవ్వడం వంటివి సమానత వైపుకు తీసుకెళ్తాయి.

మన పురోభివృద్ధికి దారి తీసేది సుగుణం... మన పతనానికి దారి తీసేది దుర్గుణం...

మానవ హక్కుల ప్రాధాన్యం

ప్రతి మనిషి జన్మ నుంచి పొందిన మౌలిక హక్కులు మానవ హక్కులు. జీవించడానికి, స్వేచ్ఛగా ఆలోచించడానికి, గౌరవంగా జీవించడానికి, సమానత్వం అనుభవించడానికి వీలుకల్పించే హక్కులే ఇవి. ఇవి ఏ ప్రభుత్వం, ఏ శక్తి దూరం చేయలేని సహజ హక్కులు.

<u>మానవ హక్కుల మూల సూత్రాలు</u>

1. సమానత్వం– ప్రతి ఒక్కరికి చట్టం ముందు సమాన హక్కులు,
2. స్వేచ్ఛ– భావ వ్యక్తీకరణ, మతాచరణ, అభివ్యక్తి స్వేచ్ఛ.
3. గౌరవం– అవమానం, వివక్ష లేకుండా జీవించగల హక్కు.
4. అభివృద్ధి హక్కు– విద్య, ఆరోగ్యం, ఉపాధి, శ్రేయస్సు పొందే హక్కు.
5. భద్రత– ప్రాణ రక్షణ, హింస నుండి రక్షణ హక్కు.

<u>భారతదేశంలో మానవ హక్కులు</u>

మన రాజ్యాంగం మౌలిక హక్కుల రూపంలో మానవ హక్కులను రక్షిస్తుంది. అలాగే 1993లో ఏర్పడిన National Human Rights Commission (NHRC), రాష్ట్ర స్థాయి కమిషన్లు ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నాయి.

<u>ప్రస్తుత సమాజంలో అవసరం</u>

నేటి పరిస్థితుల్లో అవినీతి, లింగ వివక్ష, బాల కార్మికత్వం, పేదరికం, పర్యావరణ నాశనం వంటి సమస్యల కారణంగా మానవ హక్కులు సవాలు ఎదుర్కొంటున్నాయి. ఈ సందర్భంలో ప్రజలలో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరం.

<u>మనం చేయవలసినది</u>

మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.
అన్యాయం జరిగితే ధైర్యంగా గొంతెత్తాలి.
చట్టపరమైన మార్గంలో ఫిర్యాదులు చేయాలి.
హక్కులతో పాటు మన కర్తవ్యాలను కూడా పాటించాలి.

<u>ముగింపు</u>

మానవ హక్కులు కేవలం చట్టపరమైన పదాలు మాత్రమే కావు, అవి మానవత్వానికి ఆత్మ. ప్రతి ఒక్కరు హక్కులను గౌరవించి, కర్తవ్యాలను నిర్వర్తిస్తేనే సమాజం న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వైపు ముందడుగు వేస్తుంది.

ఈగల త్రిమూర్తులు,
మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధి

అలగా తల్లి..!

ఏ ప్రభుత్వాసుపత్రి శవాలకొట్టు ముందయినా
ఒక కన్నీటి మడుగుని చూశారా ...
అది మా అమ్మే!
ఏ సమాధుల దొడ్లోనయినా
కనీసం చావుబండకి నోచుకోని
బొందమీద మొలిచిన ఏకాకి
శిలువని చూశారా ...
అదీ మా అమ్మేనండీ!

మా అమ్మ యశోద కాదు
అలాగని కౌసల్యాకాదు

ఆకలై గుక్కపట్టి ఏడుస్తున్న నన్నెత్తుకొని
చందమామని చూపిస్తూ
వెండి గిన్నెల గోరుముద్దలు
తినిపించలేదు మాయమ్మ
నూజీడీల కోసం మారాం చేస్తే
నాలుగు తన్ని కసురుకుందేగానీ
కొసరికొసరి బేబీ బిస్కెట్లు తినిపించలేదు మాయమ్మ
ఆమె కళ్ళల్లో ఎన్నడైనా ఒక్క దీపమైనా
వెలిగిన జాడలేదే!
అలాంటి మా అమ్మ మీదేం రాయమంటారండీ

అందరూ వాళ్ల అమ్మల మీద
కావ్యాలల్లుతున్నారంటే
వాళ్ల తల్లులు రాజమాతలు
కడుపులో చల్లకదలని క్షీరమాతలు
మా అమ్మదేవుందండీ
అసే వొసే అనే తప్ప
ఒక పేరన్నదే లేనిది
లంజా ముండా అని తప్ప
గౌరవ వాచకాలకి నోచుకోనిది
బతుకంతా గుక్కెడు గంజినీళ్ళ కోసమే
దిగులుపడి డీలాపడ్డ పిచ్చిది
అలాంటి మా అమ్మ మీద కవిత్వమంటే
అక్షరాలు అంగీకరిస్తాయంటారా?
లక్షణాలు వొదుగుతాయంటారా?

అందరి తల్లులు ఆదమరిచి సుఖనిద్రలు పోతున్నప్పుడు
నా కూలితల్లి పంటకుప్పల మధ్య పరాభవమైపోయింది
ఉన్న తల్లులంతా ఉత్తమ మాతల
పురస్కారాలందుకుంటున్నప్పుడు
నా వాడతల్లి గుక్కెడు నీళ్లు తాగినందుకు
జరిమానాలు కడుతూ వుంది
అందరి తల్లులు అపరనాయకురాళ్లయి
ఏలికలు చేస్తున్నప్పుడు
నా అలగాతల్లి ప్రభుత్వాఫీసులముందు ధర్నాలు చేస్తూవుంది

ఎవరికైనా అమ్మంటే పాలుపడుతూనో జోలపాడుతూనో గుర్తొస్తే
నాకు మా అమ్మ కలుపుతీస్తూనో
తట్టలుమోస్తూనో గుర్తొస్తుందండీ
కోడికూసింది మొదలు
రాత్రికి నాన్న తట్టిందాకా
తనకసలు ఒక ఆడదాన్నన్న
సంగతే గుర్తుకు రాని నా మొరటు తల్లిమీద
ఏం రాయమంటారండీ

నాకు మా అమ్మెప్పుడూ జోల పాడలేదండీ
దాని గొంతెప్పుడో ఆకల్తో పూడుకుపోయింది
నన్ను మా అమ్మెప్పుడూ జోకొట్టనైనా లేదండీ
దాని చేతులెప్పుడో వ్యవసాయపనిముట్లుగా మారిపోయాయి

పిల్లలందరూ తమ తమ తల్లుల చిటికెనేళ్లు పుచ్చుకొని
వనభోజనాలకెళ్తుంటే
నేను మా అమ్మదొక్కలోయలోకి
ముడుచుకుని పడుకున్నాను సార్!
బిడ్డలంతా తమ తల్లుల్ని
ప్రత్యక్షదైవాలుగా కీర్తిస్తుంటే
నేను ఫీజు కట్టలేని నా పేద తల్లిని కసిదీరా తిట్టిపోస్తున్నాను సార్
కొడుకులందరూ
తమ కలిగిన తల్లుల తలనొప్పులకే తల్లడిల్లుతున్నప్పుడు
నేను నా రోగిష్టితల్లి ఇంకా ఎందుకు చావలేదా అని
గొణుక్కున్నాను సార్

ఏం చెప్పమంటారండీ!
వానలో తడిసొచ్చి తుడుచుకుందామని అమ్మకొంగందుకుంటే
కోటి మాసికలు నన్ను వెక్కిరించాయండీ
చిన్నప్పుడు ఆకలై మా అమ్మ రొమ్ముని
ఆబగా నోటికదుముకుంటే
నాకు దాని పక్కెటెముకలు గుచ్చుకున్నాయండీ

ఏదేమైనా సార్!
సాటిమనుషుల్ని పశువులుగా చూసే పశువుల్ని కని
పశుమాతలుగా దూషించబడుతున్న
లక్షలాది తల్లుల మధ్య
మనిషికాక మరేమికాని నా తల్లి గురించి చెప్పాలంటే
ఈ భాషా ఈ కవిత్వమూ
ఎప్పటికీ సరిపోవుసార్!

- మద్దూరి నగేష్ బాబు.

తగిలిన దెబ్బలైనా మర్చిపోవచ్చు కానీ పొందిన మేలును ఎప్పుడూ మర్చిపోకూడదు.

సహృదయ మిత్రమండలి చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలు

సెలవులు.. సద్వినియోగం

వౌరులా వివిధ వృత్తుల్లో స్థిరపడినవారు. తీరిక సమయం లభించేది కష్టమే.. కానీ సమాజ సేవంటే ముందుంటారు. వేసవిలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఏటా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు.

25 ఏళ్లుగా సేవలు..

25 ఏళ్లుగా పేద విద్యార్థులకు వారి నచ్చిన అంశాలు నేర్పుతూ ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. పిఠాపురంలో 2000లో సహృదయ మిత్రమండలి సంస్థను టీవీ నరసింహారావు ప్రారంభిస్తే, తరువాత దానిని సూర్యప్రకాశరావు, కేశవరావు, ప్రస్తుతం సూర్యనారాయణ కొనసాగిస్తున్నారు. వీరి ఆశయాలు నచ్చి వివిధ వర్గాల ప్రజలు సహకారం అందిస్తున్నారు. స్వచ్ఛందంగా ఎందరో నాయకులు, ఉద్యోగులు తోడవుతున్నారు. మరోపక్క, వ్యసనాలకు లోనైనవారిని సక్రమ



సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో తరగతులు

మార్గంలో పెట్టేందుకు పాటుపడుతున్నారు. పాతికేళ్లుగా వేసవిలో ఉచిత శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు నిత్యం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సంగీతం, పాటలు పాడడం, వృత్తివిద్య, హ్యాండ్ రైటింగ్, క్రియేటివ్ ఆర్ట్స్, వ్యక్తిత్వ వికాసం, ఆటలు నేర్పిస్తుంటారు. ప్రతిరోజూ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 120 మందికి శిక్షణ ఇస్తున్నారు.

కొన్నేళ్లుగా వేసవిలో విజ్ఞాన, ఆధ్యాత్మిక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏటా విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు. చదువులో వెనుకబడిన వారిని మెరుగుపరిచేందుకు, సమాజ సేవ, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నారు. ఉచితంగా జరిగే తరగతులకు చిన్నారులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నవారి భవిష్యత్తుకోసం ఉచితంగా శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం

వేసవి వేదిక

50 మందికిపైగా సభ్యులం..

సహృదయ మిత్ర మండలిలో దాదాపు 50 మందికిపైగా సభ్యులు నిత్యం సేవలందిస్తున్నారు. 25 ఏళ్లుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నారు. పేదలకు తోడ్పాటు, వ్యసన విముక్తి కార్యక్రమాలు, పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించడం చేస్తున్నాం. దేశభక్తి, సమాజాభివృద్ధిలో చిన్నారులను భాగస్వాములను చేస్తున్నాం.

- చిన్నారి సతీష్, మిత్రమండలి ప్రధాన కార్యదర్శి, పిఠాపురం

పిఠాపురంలోని శ్రీవిశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠంలో బాలబాలికలకు తాత్విక బాలవికాస్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలకు ఆధ్యాత్మిక విలువలు నేర్పుతున్నారు. దేశభక్తి, సమాజ సేవకు వారిని సిద్ధం చేస్తున్నారు.

తొమ్మిదేళ్లుగా బాలవికాస్..

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా 250 మందికి ఇక్కడ శిక్షణ ఇస్తుంటారు. వారికి ఆహారం, వసతి, పడక అన్ని సదుపాయాలు ఆశ్రమంలో కల్పిస్తారు. ఆశ్రమంలో సేవ చేసే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఎన్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో 30 మంది వివిధ రంగాల నిపుణులు శిక్షణ ఇస్తారు. పెన్నులు, పుస్తకాలు, ఇతర సదుపాయాలన్నీ ఆశ్రమం వారే అందిస్తారు.

చిన్నారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పీఠాధిపతి

ఆధ్యాత్మిక భావన ఉండాలి

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి. దాంతో మానవులంతా మనశ్శాంతితో ఉంటారు. కలహాలు, కోపాలు, అసూయతో మానసిక రుగ్మతలు కలుగుతాయి. జీవితాలను నాశనం చేసుకునే వారిని సన్మార్గంలో నడిపించడమే లక్ష్యం. తల్లిదండ్రులు చొరవతో వారి పిల్లల్ని శిక్షణకు పంపిస్తున్నారు.

- డాక్టర్ ఉమర్‌అలీషా, పీఠాధిపతి, పిఠాపురం

పెద్దాపురం, పిఠాపురం | సాక్షి | శనివారం : 10 మే : 2025 కాకినాడ | 13

సేవకు చాలదా సహృదయం!

- సమాజ సేవలో ఘన కీర్తి
- పైసా ఆశించకుండా నిర్వహణ
- వేసవి శిబిరాలతో ప్రజలు, విద్యార్థులతో మమేకం



పిఠాపురంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సహృదయ మిత్రమండలి

సహృదయ మిత్ర మండలి సభ్యులు

మండలి సేవలివి..

- 25 ఏళ్లుగా నిర్విరామ సామాజిక సేవలు.
- మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు ఎయిడ్స్, డ్రగ్స్, మత్తు పానీయాలు, కూల్ డ్రింక్స్ దుష్ప్రభావాలపై అవగాహన శిబిరాలు.
- దేశ నాయకుల జయంతి, వర్ధంతులు, వైద్య శిబిరాలు, ఉచిత వస్త్ర చికిత్సల నిర్వహణ.

ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు

సాహితీ సేవలో..

మద్య, ధూమపాన వ్యతిరేక ప్రచారం

ప్రకృతి వైపరీత్యాలలో ఆపన్న హస్తం

జాతీయ దినోత్సవాల నిర్వహణ

వేసవి సెలవులు సద్వినియోగం

- వి.సాయి దుర్గ

సమాజ సేవ సంతృప్తినిస్తోంది

విద్యార్థుల సమోదుపై శ్రద్ధ చూపాలి

ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

20 నుంచి విధుల బహిష్కరణ

పిఠాపురం | 5

08/05/2018

సహృదయంతో సమాజ సేవ

- విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు
- పిఠాపురంలో సహృదయ మిత్ర మండలి సేవలు

పిఠాపురం:

వౌరంతా వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారే.. ఎవరి వ్యాపకాల్లో వారు బిజీగా ఉంటారు. సమాజం మనకేం చేసిందని అనుకోకుండా సమాజానికి మనమేం చేశామని వారు ప్రశ్నించుకున్నారు. అంతే సామాజిక సేవ చేయాలన్న ఆలోచనను ఆచరణలో పెట్టారు. పది మంది కలిస్తే వందల మందికి సాయం చేయవచ్చన్న ఉద్దేశంతో వారందరూ ముందడుగు వేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులు, విద్యావంతులు, కళాకారులు, పెద్దలు.. ఇలా కొందరు పిఠాపురంలో 17 ఏళ్ల క్రితం సమాజ సేవల కోసం సహృదయ మిత్ర మండలి ప్రారంభించారు. వేసవి సెలవుల్లో వీరంతా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఉత్సవాలు, జన జాగృతి కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తుంటారు. అవయవ దానం విశిష్టత, ధూమపానం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ వివిధ పండుగలు, ఉత్సవాల్లో ప్రచారాలు చేస్తున్నారు.

పిఠాపురంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

15 ఏళ్లుగా శిక్షణ తరగతులు

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న దృక్పథాన్ని యువతీ యువకుల్లో పెంపొందించడానికి వేసవి శిక్షణ తరగతులు 15 ఏళ్లుగా మిత్రమండలి సభ్యులు నిర్వహిస్తున్నారు. సుమారు నెల రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఈ తరగతుల్లో స్పోకెన్ ఇంగ్లిష్, సృజనాత్మకత, కళలు వ్యక్తిత్వ వికాసం, దేశభక్తి, ప్రబోధాత్మక కళలు, యోగా, సైకాలజీ, డ్రాయింగ్, డ్యాన్స్ తదితర అంశాలలో నిష్ణాతులైన వారితో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. సాహితీ సేవలో ముందడుగు వేస్తున్న మిత్రులు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు ఆపన్నహస్తం అందిస్తున్నారు.

సామాజిక చైతన్యం కోసమే

సహృదయ మిత్రమండలి ద్వారా చేస్తున్న సమాజ కార్యక్రమాలు సంతృప్తి ఇస్తున్నాయి. ఎవరికి వారు కోదిన సహాయాన్ని అందించడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తాం.

సమాజ వికాసం కోసం కృషి

పది మందికి సహాయం చేయడం ద్వారా వచ్చే సంతృప్తి ఎనలేనిది. సమాజం కోసం మన వంతు కృషి చేయడం ప్రతి పౌరుడి లక్ష్యంగా మారాలి. అదే ఆశయంతో పనిచేస్తున్నాం.. పని చేస్తాం.

- పోతుల శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

నేర్చుకుని.. నేర్పుతున్నా..

గతంలో ఇక్కడ అనేక విషయాలలో శిక్షణ తీసుకున్నా. ఇప్పుడు అదే అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నా. ప్రబోధాత్మక, దేశభక్తి గీతాలు, పాటలు నేర్పుతున్నా. మిత్రమండలిలో సభ్యురాలిగా చేరి నా వంతు సహకారం అందిస్తున్నా.

శిక్షణ ఉపయోగంగా ఉంది

రూ.వేలకు వేలు ఫీజులు చెల్లిస్తే గాని ఇవ్వని శిక్షణ ఇక్కడ ఉచితంగా ఇస్తున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నాం. ఇష్టమైన కళను సంగీతాన్ని నేర్చుకుంటున్నా. పైసా ఖర్చు లేకుండా ఏటా శిక్షణ తీసుకుంటున్నా.

Grand Alluri Sitaramaraj's centenary event

Pithapuram, May 7 : Summer training classes under the auspices of Sahrdaya Mithramandali were held on the seventh day of the Alluri centenary program at the local Surya Raya Vidyananda Library among children, adults and village dignitaries. Kommanapally Apparao presided over the program and Dr. Gajarao Seetharamaswamy, Meka Manmadha Rao and V. Satyanarayana Reddy were the chief guests. First, the program was inaugurated by P. Ganga Pavani, Secretary and Treasurer of Sahrdaya Mitra Mandal, with a patriotic song. Addressing the students, Dr. Gajarao Seetharamaswamy explained to the students that they should have patriotism from an early age, have respect for the elders and the country, and serve the country by doing our part. The special attraction of this program was CH Pratyush dressed as Sitaramaraj. As part of this program, a book titled Suriyakiranalu written by Dr. N. Suryanarayana was unveiled by the dignitaries. General Secretary of Sahrdaya Mitramandali CH Satish, Honorary Presidents N. Suryanarayana, Presidents T. Srinivas, P. Kamaraju, N. Ganga Babu, J. Tatarao, Bhashyam School Principal P. Venu, Veerabhadra Rao, Trimurthuli, Kumar, Vidyarthi Students participated.

విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి

మిత్రమండలి వేసవి శిక్షణా విద్యార్థులతో ఏపీఎస్పీ కమాండెంట్

పిఠాపురం, ఆంధ్రప్రభ : విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని కాకినాడ ఏపీ ఎస్పీ మూడవ బెటాలియన్ కమాండెంట్ ఏం నాగేంద్రరావు అన్నారు. పిఠాపురం సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయ సందర్శనలో భాగంగా బుధవారం ఏపీఎస్పీ బెటాలియన్ కార్యాలయం సందర్శించారు. బెటాలియన్ శిక్షణ, విధులు, ఆయుధాలు పరిశీలించారు.

ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య సాధనలో సమయాన్ని సద్వినియోగపరచుకుంటూ ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. లక్ష్యసాధనలో ఎన్నిసార్లు విఫలమైనా నిరుత్సాహ పడకూడదని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అడిషనల్ కమాండెంట్ ఎస్. దేవానందరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలల ను సాకారం చేయాలని, తల్లిదండ్రులు గర్వించే విధంగా విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ రవిశంకర్, మిత్రమండలి ఉపాధ్యక్షులు పోతుల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సతీష్, పోలుపర్తి వేణు, మహిళా కార్యదర్శి గంగా పావని, సత్యనారాయణ, వై.కరుణ కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

15/05/2025 | East Godavari | Page : 11
Source : https://epaper.prabhanews.com

HIGHLIGHTS

Several speakers here on Friday lauded the social welfare programmes taken up during last decade by a voluntary organisation Sahrudaya Mitra Mandali.

Pithapuram: Several speakers here on Friday lauded the social welfare programmes taken up during last decade by a voluntary organisation Sahrudaya Mitra Mandali.

They were speaking at the 15th anniversary of the mandali. Former director of social welfare K Appa Rao presided over the programme. The guests include municipal chairman Karanam Chinna Rao and women's rights activist Devi. A souvenir brought out to mark the occasion was released on the occasion.

The Hans India is now on Telegram. Click here to join our channel (@thehansindia) and stay updated with the latest headlines

https://www.thehansindia.com/posts/index/Andhra-Pradesh/2018-01-12/Sahrudaya-Mitra-Mandali-celebrates-anniversary/351739 1/2

ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

పిఠాపురం(అమరావతి న్యూస్) భగత్ సింగ్ 115వ జయంతి వేడుకలు పిఠాపురం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా స్థానిక పాదగయా క్షేత్రం దగ్గరలో ఉన్న యానాది కాలనీ వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి సహృదయ మిత్ర మండలి సభ్యులు పూలమాలలు వేసినారు. మిత్రమండలి గౌరవ అధ్యక్షులు ఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ భగతసింగ్ ధైర్యానికి దేశభక్తికి ప్రతిరూపం ధీర త్యాగానికి మారుపేరు విప్లవ వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సిహెచ్.సతీష్ తన ప్రాణం దేశం స్వాతంత్ర్య కన్నా గొప్పది కాదని తన ప్రాణాన్ని తృణప్రాయంగా విడిచి దేశప్రజలకు పోరాట స్ఫూర్తిని నేటి యువకులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు . ఈ కార్యక్రమానికి భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి.వేణు, నవ చైతన్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ ,రామకృష్ణ , సి.హెచ్. ప్రత్యూష్ స్థానికులు పాల్గొన్నారు.

చిన్న ఖర్చులే అని దుబారా చేయకండి, రంధ్రం చిన్నదైనా పెద్ద ఓడ కూడా మునిగిపోతుంది.

సహృదయ మిత్రమండలి చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలు

ABN ఆంధ్రజ్యోతి

1 నుంచి వేసవి ఉచిత శిక్షణ తరగతులు

పిఠాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుంచి వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, మిత్ర మండలి ప్రతినిధులు సోమవారం ఆవిష్కరించారు. మిత్ర మండలి అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ మే 15 వరకు స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్, రైటింగ్ స్కిల్స్, సృజనాత్మక కళలు అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989928289, 7794828167 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. మిత్రమండలి ప్రధాన కార్యదర్శి చిన్నారి సతీష్, పోతుల శ్రీనివాస్, నేమిశెట్టి గంగబాబు, వరదా వీరభద్రరావు, కరుణకుమార్, తోట నాగేంద్రప్రసాద్, వెంకట సత్యనారాయణ, ఈగల త్రిమూర్తులు, పోలారావు పాల్గొన్నారు.

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న పాడా పీడా చైత్రవర్షిణి, సహృదయ మిత్రమండలి ప్రతినిధులు

ప్రైమ్స్ | గుంటూరు, పల్నాడు జిల్లా | 11

సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా యువజన దినోత్సవం

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా యువజన దినోత్సవం

సామాజిక హిత..సహృదయ

- 17 ఏళ్ళుగా సామాజిక కార్యక్రమాల్లో ముందంజ
- మధ్యపాన వ్యతిరేక ప్రచారం
- పేద విద్యార్థులకు ఏటా వేసవి ఉచిత శిక్షణ
- జన జాగృతి కార్యక్రమాల్లో భాగస్వామ్యం

ఆంధ్ర సింహం

ఘనంగా డాక్టర్ ఆవంత్స సోమసుందర్ 6వ వర్ధంతి

పిఠాపురం, ఆంధ్ర సింహం ప్రతినిధి : పట్టణంలో శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో వజ్రాయుధ కవి" "కళా రత్న"డాక్టర్ ఆవంత్స సోమసుందర్ 6వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా డాక్టర్ చెలికాని స్టాలిన్ ,డాక్టర్ గజరావు సీతారామశాస్త్రి ,ఎంకే గౌరవ మాట్లాడుతూ కళాకేళి పత్రికను స్థాపించి సాహిత్యానికి బాసటగా నిలిచి కళాకేళి నికేతన్ ద్వారా ఎన్నో అమూల్యమైన గ్రంథాలను సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ పెట్టి ఎంతో మంది వర్ధమాన కవులను ప్రోత్సహించారు అన్నారు.సోమసుందర్ జీవితం సాహిత్య కృషి అనే అంశం మీద వ్యాసరచన పోటీలలో విజేతలకు సర్టిఫికెట్స్ ,బుక్స్, మరియు మెమొంటో సుమారు విద్యార్థులకు బహూకరించారు.ఈ కార్యక్రమంలో సహృదయ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సిహెచ్ సతీష్ అధ్యక్షులుటి.శ్రీనివాస్, డాక్టర్ కె వెంకట్రావు ,సహృదయ మిత్రమండలి గౌరవ అధ్యక్షులు ఎస్ సూర్యనారాయణ , మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పిఠాపురం, ఆంధ్రప్రభ :

పిఠాపురం సహృదయ మిత్రమండలి వ్యవస్థాపకులు స్వర్గీయ టీవీఎల్ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మిత్రమండలి కార్యదర్శి సీహెచ్ సతీష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వైద్య శిబిరం పోస్టర్ ను డాక్టర్ పివిఎన్ రాజు ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ట్రినిటీ లూదరన్ చర్చి ఆవరణలో కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభం అవు తుందని చెప్పారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారు ఆ రిపోర్ట్ లు కూడా తీసుకుని రావాలన్నారు. వివరాలకు 7989928289, 9347582057 నెంబర్లలో తెలుసుకోవాలన్నారు.

నీ కోసం జీవిస్తే నీవుగానే ఉండిపోతావు.. జనం కోసం జీవిస్తే జనం గుండెల్లో నిలిచిపోతావు.

సహృదయ మిత్రమండలి చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలు

9/2022, 12:09 PM IMG-2022...jpg

నవ చైతన్య జూనియర్ కళాశాలలో గురజాడ జయంతి

పిఠాపురం, సెప్టెంబర్ 21, (జనస్పందన విలేకరి) :ప్రముఖ తెలుగు రచయిత,కవి గురజాడ అప్పారావు 160 జయంతి వేడుక పట్టణంలోని స్థానిక నవ చైతన్య జూనియర్ కళాశాల నందు సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది.ముందుగా గురజాడ చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన రచించిన, దేశమును ప్రేమించుమన్నా. .అనే దేశ భక్తి గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖుల గురజాడ అప్పారావు జీవిత చరిత్ర, ఆయన కన్యాశుల్కం నాటకం యొక్క విశిష్టతను విద్యార్థిని,విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షుడు టి.శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి సిహెచ్.సతీష్,పి.వేణు, సూర్యనారాయణ,డాక్టర్ సూర్యప్రకాష్ రావు,కే. అప్పారావు, టి.సుబ్బారావు,కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

https://mail.google.com/mail/u/0/?tab=rm#inbox/KtbxLvhKQBDKCvBvXmrgKdjCpLwfgNGqdq?projector=1&me

ప్రజాశక్తి

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి – పిఠాపురం

సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులను స్థానిక సూర్యరాయ గ్రంథాలయంలోని చెలికాని భావనరావు సభా సదన్‌లో ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ పి.ఎస్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి క్షణం చాలా విలువైనదన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని పాఠశాలలో కేవలం పాఠ్యాంశాలు మాత్రమే బోధిస్తారని, కానీ ఈ శిక్షణ తరగతుల్లో పాఠ్యాంశాలతో పాటు ప్రతి విద్యార్థినీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమయ్యే వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, ఏకాగ్రత, సృజనాత్మక కళలు, దేశభక్తిని పెంపొందించుకోవడం మొదలగు అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఈ శిక్షణ తరగతులకు హాజరై తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు సంస్థ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ 24 ఏళ్లుగా నిరాటంకంగా ఈ వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. విద్యార్థులందరూ క్రమం తప్పక శిక్షణా తరగతులకు హాజరవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.సతీష్, కోశాధికారి పి.పావని, సీనియర్ సభ్యులు కె.అప్పారావు, ఎస్.గంగబాబు, శ్రీకృష్ణదేవరాయలు, ప్రభు మాస్టారు, గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి కొండేపూడి శంకరరావు, భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ పి.వేణు, టిఎస్.ప్రసాద్, రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న పిఎస్.రాజు

ఆంధ్రప్రభ

...మత్తు, మద్యపాన వ్యతిరేక ప్రచారం

శిబిరం ప్రారంభించిన సీఐ శ్రీనివాస్

పిఠాపురం, ఆంధ్రప్రభ : పిఠాపురం శివరాత్రి తీర్థంలో సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో మద్యపాన, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం నిర్వహించారు. బుధవారం స్థానిక కచేరీ సెంటర్లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ...ఐ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల ...లన కలిగే అనర్థాలను యువతకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ...ప్పటికప్పుడు వారిని హెచ్చరిస్తూ వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. జన ...మ్మర్దమైన తీర్థాలు, జాతరలు తదితర ఉత్సవాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడం ...లన ఎక్కువమంది ప్రజలకు అది చేరుతుందని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ...వగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సహృదయ మిత్రమండలిని ఆయన ...భినందించారు. కార్యక్రమంలో సహృదయ మిత్రమండలి అధ్యక్షులు తోట శ్రీనివాస్, ప్రధాన ...ార్యదర్శి సిహెచ్ సతీష్, ఉప కార్యదర్శి పి వేణు గౌరవ అధ్యక్షులు కే అప్పారావు, ఎస్ ...ూర్యనారాయణ, సాల్మన్ రాజు, గోవింద్, తాతారావు, సుబ్రహ్మణ్యం, కుమార్, శ్రీను, ...కణం విశ్వనాథం, తోట నాగేంద్ర ప్రసాద్, ప్రత్యూష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ

నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన కంటి వైద్య శిబిరం

- 210 మందికి పరీక్షలు 55 మందికి అవసరమైన ఆపరేషన్లు

పిఠాపురం, ఆంధ్రప్రభ : పిఠాపురం సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. బుధవారం స్థానిక ట్రినిటీ లూథరన్ చర్చి అవరణలో కాకినాడ కిరణ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మిత్రమండలి వ్యవస్థాపకులు టీవీఎల్ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి శిబిరం ప్రారంభం అయ్యింది. శిబిరాన్ని డాక్టర్ పిఎస్ రాజు ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి నుంచి డాక్టర్ ఆవని రాజేష్ 13 మంది వైద్య సహాయకులు బృందంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 210 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు వారిలో 55 మందికి ఉచిత ఆపరేషన్ కు సిఫార్సు చేశారు. మిత్రమండలి అధ్యక్షులు తోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సతీష్ కంటి వైద్య శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ట్రినిటీ లూథరన్ చర్చ్ పాస్టర్ కే శ్యామ్ కుమార్ సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ డిడి అప్పారావు, పిఠాపురం ఫెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సాల్మన్ రాజు. సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కేశవరావు, కామరాజు, సత్యనారాయణ, మహిళా కార్యదర్శి పావని, కుమార్, వీరభద్ర రావు, పి వేణు హాజరయ్యారు.

శుభోదయ

వేసవి శిక్షణ తరగతుల వీడ్కోలు సభ



సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా వజ్రాయుధ కవి శ్రీ ఆవంత్స సోమసుందర్ శత జయంతి వేడుకలు

పిఠాపురం, నవంబర్ 18 (అమరావతి న్యూస్) : పిఠాపురానికి చెందిన ప్రముఖ కవి, వజ్రాయుధ కవిగా పేరుగాంచిన శ్రీ అవంత్స సోమ సుందర్ గారి శత జయంతి వేడుకలు స్థానిక సూర్యారాయ గ్రంథాలయం నందు పిఠాపురం సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు... మిత్రమండలి అధ్యక్షులు శ్రీ తోట శ్రీనివాస్, శ్రీకృష్ణదేవరాయ, ప్రముఖ కవి శ్రీ వేంక మన్మధ రావు. సహృదయం మిత్రమండలి ప్రధాన కార్యదర్శి శ్రీ సతీష్, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ వేణు, విద్యార్థులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యమంలో పాల్గొన్న వారికి మిఠాయిలు పంచారు.. ప్రముఖులు మాట్లాడుతూ వజ్రాయుధకవి స్పృశించని అంశం లేదని, సమాజ హితవు కోరి యువకులలో ఉద్యమ స్ఫూర్తి నింపే రచనలు అనేకం చేసారని భాషాభిమానాన్ని తెలుగు వారు పెంచుకోవాలని. వారి రచనలు చదవాలని కోరారు. ప్రముఖంగా తెలంగాణ ప్రాంత ప్రజల కోసం నైజామ్ నవాబును ఎదిరించి రచనలు చేశారని కొనియాడారు. అంత గొప్ప వ్యక్తి పిఠాపురానికి చెందిన వారు కావడం మన అదృష్టమని వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరము ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని సహృదయ మిత్రమండలి ప్రతినిధులు తెలియజేశారు.

26-11-2017 ఈనాడు

సేవే లక్ష్యంగా పనిచేస్తున్నారు. నేటి బాలలకు విద్యపై అవగాహన కల్పిస్తూ వారి ఎదుగుదలకు బాసటగా నిలుస్తున్నారు. ప్రకృతి విపత్తులు జరిగిన సందర్భాల్లో పేదలకు అండగా నిలుస్తున్నారు. వ్యసనాలకు బానిసలైన వారి జీవితాల్లో మార్పు కోసం యత్నాలు..ఇలా దశాబ్దానికిపైగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు పిఠాపురం సహృదయ మిత్రమండలి సభ్యులు.

సమాజ సేవలో సహృదయమే..

న్యూస్‌టుడే, పిఠాపురం పట్టణం

-: గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు :-

యోగా శిబిరంలో విద్యార్థులు

సేవకు ఆహ్వానం

-సిహెచ్.సతీష్, సహృదయ మిత్రమండలి కన్వీనర్

ఇవీ కార్యక్రమాలు

ఆంధ్రజ్యోతి 29/09/2022 ఈనాడు

పిఠాపురం: భగత్‌సింగ్ విగ్రహం వద్ద నినదిస్తున్న సహృదయ మిత్ర మండలి సభ్యులు

పిఠాపురం: భగత్‌సింగ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సహృదయ మిత్ర మండలి సభ్యులు పేర్కొన్నారు. పిఠాపురం లోని యానాదుల కాలనీలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అమితమైన దేశభక్తి, ధైర్యంతో దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, పి.వేణు, టి.శ్రీనివాసు సీహెచ్ సతీష్ పాల్గొన్నారు.

సహృదయ మిత్ర మండలి సేవలు అభినందనీయం

సాక్షి 17-05-23

మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు

పిఠాపురం: పిఠాపురంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవలో ముందుంటున్న సహృదయ మిత్ర మండలి సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావు అన్నారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు సెల్ ఫోన్లను అవసరమైనంత మేర మాత్రమే వినియోగించాలి తప్ప వాటికి బానిసలు కాకూడదన్నారు. తమ అమూల్యమైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏరంగంలోనైనా విజయం సాధించవచ్చన్నారు. 15 రోజులుగా సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పదవ తరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించిన పి.కీర్తిప్రియ, 580 మార్కులు సాధించిన ఎస్ఎస్‌వీ కుసుమ, 577 మార్కులు సాధించిన వి.మహాలక్ష్మిలను సత్కరించిన ఆయన వారిని అభినందించారు. విశ్రాంత సోషల్ వెల్ఫేర్ డీడీ వి.చక్రధరరావు, తోట శ్రీనివాసరావు, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, కొత్తపల్లి ఎంఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు **అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు**

ఆవంత్సను ఆదర్శంగా తీసుకోవాలి

- జీవీఆర్ కళాశాల అధ్యాపకుడు కట్టా
- సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా శత జయంత్యుత్సవాలు

పిఠాపురం: కవిత్వంతో నిజాం ప్రభువులపై దండయాత్ర చేసి ప్రజలను చైతన్య వంతులను చేసిన ఆవంత్స సోమసుందర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉత్తమ పౌరులుగా మారాలని అనపర్తి జీవీఆర్ కళాశాల అధ్యాపకులు కట్టా కృష్ణారావు అన్నారు. పిఠాపురంలో శనివారం స్థానిక సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో అవంత్స శత జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సాహితీవేత్తలు మాట్లాడుతూ సమరంలో పాల్గొని ఎన్నో సార్లు సోమసుందర్ జైలు జీవితాన్ని గడిపారన్నారు. నిజాం ప్రభువుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు వజ్రాయుధం వంటి రచనలతో ప్రజలను జాగృతం చేశారన్నారు. 120 రచనలు చేసిన సోమసుందర్ ట్రస్టు ధారాదత్తం చేశారన్నారు. చివరకు తన పార్థివ దేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి దానం చేసిన మహా మనిషి అని వారు కొనియాడారు. ఆయన జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు పతకాలు బహుమతులు ప్రదానం చేశారు. సహృదయ మిత్ర మండలి సభ్యులు చిన్నారి సతీష్, పోతుల శ్రీనివాస్, గంగా పావని, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, గట్టి కృష్ణదేవరాయలు తదిత...

సోమసుందర్ మెమెంటోను ఆవిష్కరిస్తున్న సహృదయ మిత్ర మండలి సభ్యులు

16/5/23 ఆంధ్రజ్యోతి

ర్యాంకర్లను సత్కరిస్తున్న సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చంద్రశేఖర్

టెన్త్ ర్యాంకర్లకు సత్కారం

పిఠాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో 15రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు గురువారం సాయంత్రం ముగిశాయి. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన భాష్యం స్కూలు విద్యార్థులు యాళ్ల నేహాంజని, కొట్టేటి ప్రేమ సత్య లిఖిత ...ను, ప్రభుత్వ పాఠశాలల్లో పిఠాపురం పట్ట...లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన బాదం ...రావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ... బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మరుకుర్తి శ్రీకీర్తన, నిమ్మకాయల వెంకట వైశాలి, గాది మహాలక్ష్మిలను సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్ చంద్రశేఖర్ సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. చక్రధర్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు వెన్నపు చక్రధరరావు, సూర్యరాయ గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, ఎంఈవో శ్యాంబాబు, శిక్షకులు పి.కామరాజు, పోతుల శ్రీనివాస్, గంగాపావని, గాయత్రి, మిత్రమండలి ప్రధాన కార్యదర్శి సీహెచ్ సతీష్ పాల్గొన్నారు.

SAHRIDAYA MITHRA MANDALI
REGD. NO. 703/2011
D.NO. 14-1-11, VANGALAVARI STREET,
PITHAPURAM - 533 450, E.G.DIST., A.P. PH : 250218 (08869)
FREE SUMMER TRAINING CLASSES

CERTIFICATE OF PARTICIPATION

This is to certify that Master / Kumari .... Class .... School/College, ... Village / Town .... participated in "Free Summer Coaching classes in Spoken English, Writing Skills, Creative Arts & Personality Development" held at Sri Suryaraya Vidyananda Grandhalayam (Sri Chelikani Bhavana Rao Sabha Sadan) Pithapuram from 01.05.2023 to 15.05.2023.

Pithapuram
15-05-2023

General Secretary

President

సహృదయ మిత్రమండలి సంక్షేమ సంఘం
పిఠాపురం, కాకినాడ జిల్లా, ఆం.ప్ర.
రి.జినెం. 703/2011
'వజ్రాయుధ కవి' "కళారత్న"
డా॥ ఆవంత్స సోమ సుందర్
శతజయంతి సందర్భంగా
ప్రశంసా పత్రం

విద్యార్థి / విద్యార్థిని .... తరగతి ....

పాఠశాల / కళాశాల .... స్థలం .... వజ్రాయుధ కవి / రచయిత కీ॥శే॥ ఆవంత్స సోమసుందర్ వారి శతజయంతి సందర్భంగా నిర్వహించబడిన వ్యాసరచన / వక్తృత్వ పోటీ నందు పాల్గొన్నందుకు మరియు ప్రథమ / ద్వితీయ / తృతీయ / ప్రత్యేక స్థానం పొందినందుకు ప్రదానం చేయబడిన ప్రశంసా పత్రం.

పిఠాపురం
తేదీ : 18-11-2023

ప్రధాన కార్యదర్శి
సహృదయ మిత్రమండలి

అధ్యక్షులు
సహృదయ మిత్రమండలి



SRIKIRAN INSTITUTE OF OPHTHALMOLOGY
A DIVISION OF SANKURATHRI FOUNDATION

సహృదయ మిత్రమండలి వారి ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో 9 ఏప్రిల్, 2025 న ట్రినిటి లూథరన్ చర్చి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినారు. ఈ శిబిరానికి సుమారు 200 మంది పేషెంట్స్ కంటి పరీక్ష చేయించుకున్నారు. వారిలో 55 మందికి కంటి శుక్ల ఆపరేషన్‌లు శ్రీకిరణ్ కంటి ఆసుపత్రిలో చేయడం జరిగింది.

ఈ క్యాంపు ఆర్గనైజ్ చేసి... ఇంత మంది పేదవారికి కంటి ఆపరేషన్‌లు జరగడానికి కారకులైన సహృదయ మిత్రమండలి వారికి శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి యాజమాన్యం తరపున ధన్యవాదాలు.

ఇట్లు
శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి,

SRIKIRAN INSTITUTE OF OPHTHALMOLOGY, D.No. 6-227, Penumarthy Road, Kakinada Rural-533 005, A.P.
0884-2306301/302 info@srikiran.org www.srikiran.org www.facebook.com/SrikiranEyeHospital



Phone No. : 71409

INDIAN RED CROSS SOCIETY
EAST GODAVARI DITSRICT BRANCH : KAKINADA (A. P.)
(Constituted under Act XV of 1020)

PRESIDENT : SRI Satish Chandra, I.A.S.,
Collector, East Godavari District.

HON. SECRETARY : Dr. P.Durga Raju,
Kakinada.

D. No. 8-14-39,
Red Cross Street,
Gandhinagar,
KAKINADA – 533 004.

Ref. No. IRCS.108/KDA/98 Date 10-02-2001 199

From
Hony.Secretary,
IRCS.District Branch,
Kakinada.

To
1) M/S Sahrudaya Mitra Mandali, Pithapuram
2) S.C.Boys Hostel, Pithapuram
3) Nava Chaitanya Girls Junior College, Pithapuram

Sir,

We are in receipt of cash donations of Rs.18,100/- (eighteen thousand one hundred only) sent by you to our Red Cross through Demand Draft bearing No.407020 towards Gujarat Earth Quake Relief fund besides old clothes and about Qls.2-00 rice.

We are very much thankful to you for the efforts made by you in collecting cash and material for the victims in Gujarat Earth Quake calamity and appreciate the humantarian help.

Yours sincerely,
Sd/P.Durga Raju
Hony.Secretary

By order/
Adm. Officer

ఎప్పుడూ ప్రయత్నించని వ్యక్తికంటే, ప్రయత్నించి విఫలమైన వ్యక్తి మేలు.





సహృదయ మిత్రమండలి ఆవిర్భావం – పాతికేళ్ళనాటి బైలాస్



"సొంత లాభం కొంత మానుకు – పొరుగువానికి తోడుపడవోయ్!"

సహృదయ మిత్రమండలి సంక్షేమ సంఘం

Regd.No. 703/11

పిఠాపురం – కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్

సభ్యత్వం కొరకు దరఖాస్తు

1. సభ్యుని పూర్తి పేరు :
2. చిరునామా :
3. ఫోన్ నెంబరు :
4. వయస్సు లేదా పుట్టిన తేదీ :
5. వృత్తి / ఉద్యోగం / వ్యాపారం :
   మొ॥ వివరములు
6. అభిరుచులు/ అలవాట్లు :

ఫొటో

ప్రకటన

సహృదయ మిత్రమండలి అను ఈ స్వచ్ఛంద సంస్థ వివిధ రంగములందు మన సమాజానికి చేస్తున్న కృషికి నా వంతు సహాయ సహకారం అందింతునని తెలియజేసుకొనుచున్నాను.

తేది :
స్థలము : సంతకం

FOR OFFICE USE ONLY

Membership Accepted / Rejected

General Secretary President

సభ్యత్వ దరఖాస్తు



"సొంత లాభం కొంత మానుకు – పొరుగువానికి తోడుపడవోయ్!"

సహృదయ మిత్రమండలి సంక్షేమ సంఘం

రిజిష్టర్డు నెం.703/11

డో.నెం.14-1-11, వంగల వారి వీధి, పిఠాపురం -533 450

కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్

ARISE ★ AWAKE ★ SERVE THE MANKIND

తేది : ....

గౌరవ అధ్యక్షులు :
1. శ్రీ ఎస్. సూర్యనారాయణ
RMP Doctor, Cell:7801020258
2. శ్రీ వి. కేశవరావు, Principal RR.Bh.R. Jr. College, Pithapuram, Cell : 9951959509
3. శ్రీ కె. అప్పారావు, Retd Dy. Director, Social Welfare, Cell : 9493152556
4. అధ్యక్షులు : శ్రీ టి. శ్రీనివాసు
Principal Nava Chaitanya JrCollege, Pithapuram. 9849186676
5. ఉపాధ్యక్షులు : శ్రీ వి. శ్రీనివాసు
School Asst. (English), 7794828167
6. ప్రధాన కార్యదర్శి : శ్రీ సి.హెచ్.సతీష్
Cell : 7989928289
7. ఉపకార్యదర్శి : శ్రీ పి. వేణు
Principal Bhashyam School, PTP. 92914 02977
8. మహిళా సెక్రటరీ & ట్రెజరర్ :
శ్రీమతి పి.గంగాపావని, Cell : 9652552556

కార్యవర్గ సభ్యులు :
9. శ్రీ ఎన్. ఏసుదాసు
Gaz, Head Master
10. శ్రీ ఎన్. గంగబాబు,
విద్యా వికాస్ కోచింగ్ సెంటర్
11. శ్రీ కె. శంకర్రావు
సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ కార్యదర్శి
12. శ్రీ కె.వి.ఎస్.ఎస్.ప్రసాద్
C.C.R.T.Resource Person
13. శ్రీ వి. వీరభద్రరావు, Retd. M.E.O.
14. శ్రీ జి. శ్రీకృష్ణదేవరాయలు
Correspondent, Bharath Public School
15. శ్రీ యం. సుబ్రహ్మణ్యం
Retd. Gaz. Head Master
16. శ్రీ జె. తాతారావు
Retd Gaz Head Master
17. శ్రీ వి.పి.ఎస్.ఆర్.యం.ప్రభు
Retd Gaz Head Master
18. శ్రీ దల్లి శ్రీనివాస్, Advocate
19. శ్రీ డి. సాల్మన్‌రాజు
Gen Secretary, Pensioners Assn.PTP
20. శ్రీ పి. జగదీష్, Teacher
21. శ్రీ పి. కామరాజు, Teacher
22. శ్రీ పి. కిరణ్‌కుమార్ రాజు
ఆదర్శ స్కూల్ ప్రిన్సిపాల్, Co-ordinator, (PTLU-AP)
23. శ్రీమతి సి.హెచ్. అరుణ
Principal, Bhashyam Primary School
24. శ్రీ వై. కరుణకుమార్, పోలీస్ కానిస్టేబుల్
25. శ్రీ బి. పరమేశ్
Business (Hatcheries)
26. శ్రీ ఎ. హరిబాబు, Electrical Engineering
27. శ్రీ టి.వి. గోపాలకృష్ణారావు, Accountant
28. కుమారి ఎస్.ఝాన్సీప్రసన్న, Hindi Teacher
29. కుమారి ఆర్.హేమమణికంఠ గాయత్రి
English Teacher- Bhasyam

లెటర్ హెడ్

నిజమైన అదృష్టం ఏమిటంటే జీవితానికి ఒక మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడమే.

సహృదయ మిత్రమండలి కార్యక్రమాల కరపత్రాలు















సత్యాన్ని ఎవ్వరూ నాశనం చేయలేరు. అది స్వయంగా వెలుగుతుంది.

అనుభవం నేర్పిన పాఠాలకు విలువ ఎక్కువ
ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ
ఇష్టంతో చేసే పనులకు విజయాలు ఎక్కువ
ఎదుటి వారిలో మంచినే చూసే
మనస్సుకు ప్రశాంతత ఎక్కువ

సహృదయ మిత్రమండలి, పిఠాపురం వారిచే

ఉచిత వేసవి శిక్షణా తరగతులు

ఈ దిగువ పేర్కొన్న అంశములపై "ఉచిత వేసవి శిక్షణా తరగతులు" నిర్వహించబడును. కావున పిఠాపురం పట్టణం మరియు పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన 12 నుండి 35 సంవత్సరములలోపు విద్యార్థినీ విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరుచున్నాము.

శిక్షణాంశాలు

1. SPOKEN ENGLISH
2. సృజనాత్మక కళలు (CREATIVE ARTS)
3. దేశభక్తి, ప్రభోదాత్మక గీతాలాపన
4. చక్కని దస్తూరి (చేతి రాత)
5. వ్యక్తిత్వ వికాసం (PERSONALITY DEVELOPMENT)

ప్రారంభ తేది : 1-6-2022 నుండి 30-6-2022 వరకు
సమయం : ఉదయం 8 నుండి 11 గంటల వరకు
శిక్షణా స్థలం : శ్రీసూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పాతబస్టాండ్, పిఠాపురం

:: బోధనా బృందం ::

(1) పి. కామరాజు గారు, (2) పోతుల శ్రీనివాస్ గారు, (3) ఎ. గణేష్ గారు, (4) నామా ఏసుదాసు గారు, (5) కె.వి.ఎస్.ఎస్. ప్రసాద్‌గారు, (6) డాక్టర్ పి.ఎస్. ప్రకాష్‌రావుగారు, (7) ఎం. సుబ్రహ్మణ్యం గారు, (8) దల్లి శ్రీనివాస్‌గారు, (9) గట్టి శ్రీకృష్ణదేవరాయలు, (10) డాక్టర్ చక్రవర్తిగారు, (11) పి.వేణుగారు, (12) పి. జగదీష్‌గారు

గమనిక: రిజిస్ట్రేషన్ కొరకు ది.25-5-2022 నుండి ది.31-5-2022 వరకు శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం వద్ద ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు పేర్లు నమోదు చేయించుకోవలెను. రిజిస్ట్రేషన్ ఫీజు రూ॥20/-.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 7989928289
7801020258, 7032784315, 7794828167

"సొంత లాభం కొంత మానుకో - పొరుగు వానికి తోడుపడవోయ్!"

FREE SUMMER CLASSES
SPOKEN ENGLISH & MUSICAL CLASSES

సహృదయ మిత్రమండలి పిఠాపురం వారిచే ఉచిత వేసవి శిక్షణా తరగతులు
(రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పోతుల శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో, సెల్: 9849317010)
పిఠాపురం పట్టణం మరియు పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన 12-30 సం॥ల విద్యార్థుల ఆంగ్ల భాషాభివృద్ధి కొరకు గత 13 సం॥లుగా సహృదయ మిత్రమండలి సంస్థ ద్వారా ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహించుచున్నాము. ఈ సం॥రం కూడా విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

శిక్షణాంశాలు :

- ✓ ఇంగ్లీషులో మాట్లాడడం, వ్రాయడం. (CommunicationSkills)
- ✓ టైమ్ మేనేజ్‌మెంట్, పర్సనాలిటీ డవలప్‌మెంట్.
- ✓ జనరల్ నాలెడ్జ్
- ✓ జ్ఞాపకశక్తి, (Memory Power) ఏకాగ్రత కొరకు యోగా, సైకాలజీ క్లాసులు
- ✓ గాత్ర, వాయిద్య సంగీతంపై ప్రాథమిక పరిజ్ఞానం కలుగుజేయుట
- ✓ దేశభక్తి, ప్రభోదాత్మక గీతాలు నేర్పుట.

కార్యక్రమ వివరాలు

శిక్షణాకాలం : 27-4-2016 నుండి 1-6-2016 వరకు
శిక్షణా సమయం : ఉదయం 8 గం॥లనుండి 11 గం॥ల వరకు
శిక్షణా స్థలం : రాజీవ్ గాంధీ హైస్కూల్, పాతబస్టాండ్ వద్ద, పిఠాపురం

రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించండి.

కె. అప్పారావు, M.A.,M.Ed.,PGDTE (CIEFL) Deputy Director (SW) Retired-9440428697)
సి.హెచ్. సతీష్, B.Sc.,Dip (ANA) MD (ACU)-7036921412
సి.హెచ్. గంగాపావని, B.Sc.,D.Ed.,M.A. (Eng) - 9652552556
B.S.R.K.S.కృష్ణార్జునరావు, MA.,MA.,B.Ed.,(Eng) (Organising Secretary-9247444447)
దల్లి శ్రీనివాస్, అడ్వకేట్ (Vice President-9247396782)
యం.సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు (Joint Secretary-9866188016)
జి. కృష్ణదేవరాయ వెంకటరావు, (Secretary)
ఎన్. వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు - 9966967208

సహృదయ మిత్రమండలి
వంగలవారివీధి, పిఠాపురం, ఫోన్ : 08869-250218

మురారి గ్రాఫిక్స్, చర్చిసెంటర్, పిఠాపురం. సెల్ : 9866592131

ఆగష్టు 15 స్వాతంత్ర్యదినోత్సవ గేయాలు ఉచిత శిక్షణా కార్యక్రమం

70వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భముగా పాఠశాల మరియు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు పై కార్యక్రమమునకు సంబంధించిన దేశభక్తి గేయాలు నేర్పుటకు ఉచిత శిక్షణ ఇవ్వబడును.

సమయం : ది. 7-8-2016 ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
స్థలం : మున్సిపల్ హైస్కూలు (OBS), పిఠాపురం

ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరుచున్నాము.

పి. శ్రీనివాస్, శిక్షణా తరగతుల ప్రిన్సిపాల్, సెల్: 77948 28167
శ్రీమతి సి. హెచ్. పావని, ఆర్గనైజర్, సెల్: 70369 21412

ఇట్లు: సహృదయ మిత్రమండలి, పిఠాపురం
సెల్: 90147 76412, ఫోన్: 08869 - 250218

ఆత్మీయ ఆహ్వానం

"వజ్రాయుధ కవి", "కళారత్న" డా॥ ఆవంత్స సోమసుందర్ గారి

6వ వర్ధంతి సభ

తేది. 12 - 08 - 2022, శుక్రవారం సాయంత్రం 4 గం.లకు,
వేదిక : శ్రీ చెలికాని భావనరావు సభాసదన్, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో, పాతబస్టాండ్, పిఠాపురం.

అసమాన వ్యవస్థ లోని అవకతవకల పై వజ్రాయుధాన్ని ఎక్కుపెట్టిన అభ్యుదయ కవి, ప్రజా రచయిత, శతాధిక గ్రంథకర్త, అసాధారణ ప్రతిభామూర్తి కీ. శే. ఆవంత్స సోమసుందర్ గారు గతించి ఆరేళ్ళయింది.

తెలుగు సాహిత్యంలో అనితరసాధ్యమైన శిఖరాయమాన వ్యక్తిత్వంతో 'కాలాతీత కవితా కాంతిరేఖ' వెలిగించిన ఆయన, తన తొంభై ఏళ్ళ జీవితంలో డెబ్భై ఏళ్ళకు పైబడి నిరంతర సాహితీ సేద్యం చేసారు.

సంస్కృత ఆంధ్రాంగ్ల సాహిత్యాలలో ఆయనొక నిధి, తెలుగులో దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ రచనలే కాక ఎన్నో ప్రయోగాత్మక నమూనాల్ని నవీనంగా పరిచయం చేసిన సృజనశీలి. జీవిత చరమాంకం వరకూ కలాన్నొదలని ధీరుడు.

కళాకేళి పత్రికని స్థాపించి సాహిత్యానికి బాసటగా నిలిచారు. **కళాకేళి నికేతన్** ద్వారా ఎన్నో అమూల్యమైన గ్రంథాలను విరివిగా ప్రచురించారు. **లిటరరీ ట్రస్ట్** పెట్టి ఎంతోమంది వర్ధమాన కవి రచయితలను ప్రోత్సహించారు.

ఆధునిక సాహిత్య విమర్శకు లకి ఆయనో దిక్సూచి. ఆయనతో పోల్చడం మాట అలా వుంచితే, సాహిత్య విమర్శ ని అధ్యయనం చేయడంలో సోమసుందర్ గారి దరిదాపుల్లో నిలిచేవారు కూడా ఈనాటికీ లేరు.

అంతటి మహత్తరమైన కృషిని ఒంటి చేత్తో చేసి పిఠాపురానికి సాహిత్య రంగంలో తనదైన శైలిలో వన్నె తెచ్చిన ఆ మహనీయుడ్ని కనీసంగా అయినా తల్చుకోవడం మనందరి కనీస విధి, అందుకే ఈ కార్యక్రమం.

తప్పకుండా రండి. యాంత్రిక జీవితంలోని వొడిదుడుకుల నుండి ఊరట పొందడానికైనా ఈ నేలనీ, ఇక్కడి ప్రజల్నీ చివరిదాకా ప్రేమించిన ఒక మహా రచయిత గురించిన సమాలోచనలో మమేకం అవుదాం కదలండి.

తోట శ్రీనివాస్
అధ్యక్షులు,
సహృదయ మిత్ర మండలి

సి.హెచ్. సతీష్
ప్రధాన కార్యదర్శి
సహృదయ మిత్ర మండలి

P.T.O

సహృదయ మిత్రమండలి

ఆహ్వానం

ప్రియమైన 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఒక సదావకాశము

2016 మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుచున్న మీకు పరీక్షల సంబంధిత భయాలను పోగొట్టుట, సమయపాలన పాటిస్తూ వ్రాయబోవు ప్రశ్నలకు తగిన రీతిలో జవాబులు వ్రాయుట మొదలగు విషయాలపై విద్యార్థులతో చర్చించుటకు స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహము నెం. 1, పిఠాపురం (ఫైర్ ఆఫీసు ప్రక్కన) నందు ది. 15.02.2016 సోమవారం సాయంత్రం 6 గంటలకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేయబడుచున్నది. సదరు కార్యక్రమమునకు 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులందరూ ఆహ్వానితులే.

సభాధ్యక్షులు

దల్లి శ్రీనివాసరావు గారు, అడ్వకేట్

ముఖ్య అతిథులు

కె. అప్పారావు గారు, డిప్యూటీ డైరక్టర్, సోషల్ వెల్‌ఫేర్, రిటైర్డ్
కె.వి.ఎస్.ఎస్. ప్రసాద్ గారు, టీచర్, సి.సి.ఆర్.టి.,
పోతుల శ్రీనివాస్ గారు, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
నామా యేసుదాసు గారు, రాపర్తి హైస్కూల్ హెడ్‌మాస్టర్
ఎన్. గంగబాబు గారు, సహృదయ మిత్రమండలి నాయకులు
పి. కొండలరావు గారు, సహృదయ మిత్రమండలి ఫౌండర్ నాయకులు
బి. కృష్ణార్జునరావుగారు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, సహృదయ మిత్రమండలి
కె. శ్రీ కృష్ణ దేవరాయ వెంకటరావుగారు, సెక్రటరీ, సహృదయ మిత్రమండలి
వి.సి.హెచ్. ప్రకాశరావుగారు, సహృదయ మిత్రమండలి నాయకులు
సి.హెచ్. పావని గారు, సహృదయ మిత్రమండలి యూత్ మెంబర్
సి.హెచ్. సతీష్ గారు, సహృదయ మిత్రమండలి యూత్ మెంబర్
జి. తారకరామ్ గారు, సహృదయ మిత్రమండలి యూత్ మెంబర్

వందన సమర్పణ
గింజాల రామకృష్ణ గారు

ప్రపంచంలో ఎవ్వరూ శాశ్వతం కాదు - మార్పే నిత్యం.

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక

'అన్ని బాధలకు మూలం అత్యాశే

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక



'నీ ఆలోచనలే నిన్ను నిర్మిస్తాయి. నువ్వు ఏం ఆలోచిస్తావో అదే అవుతావు'.

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక



'ఇతరులను గెలవడం కంటే - మనసుని గెలవడం గొప్పది'.

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక

జీవితం ఒక ప్రతిబింబం -నువ్వు ఎలా ఆలోచిస్తే నీ చుట్టూ అలానే కనిపిస్తుంది.

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక

దుఃఖం పుట్టేది లోపలి నుండి, బయటి ప్రపంచం దానికి కారణం కాదు.

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక



చెడు ఆలోచనలను విడిచిపెట్టు, అవి నీ శత్రువులకన్నా ప్రమాదమైనవి.

కొన్ని కార్యక్రమాల చిత్రమాలిక



ప్రేమ కంటే గొప్ప శక్తి లోకంలో లేదు.

సహృదయ మిత్రమండలి ప్రస్తుత కార్యవర్గ సభ్యుల జాబితా

శ్రీ నక్కా సూర్యనారాయణ	గౌరవ అధ్యక్షులు
శ్రీ కొమ్మనాపల్లి అప్పారావు	గౌరవ అధ్యక్షులు
శ్రీ వూటుకూరు కేశవరావు	గౌరవ అధ్యక్షులు
శ్రీ తోట శ్రీనివాసు	ప్రెసిడెంట్
శ్రీ పోతుల శ్రీనివాసు	వైస్ ప్రెసిడెంట్
శ్రీ చిన్నారి సతీష్	సెక్రటరీ
శ్రీ పాలుపర్తి వేణు	జాయింట్ సెక్రటరీ
శ్రీమతి పులి గంగ పావని	ట్రెజరర్
రంగనాధం హేమ మణికంఠ గాయత్రి	మెంబర్
తటవర్తి సుబ్బారావు	మెంబర్
దువ్వాడ సాల్మన్ రాజు	మెంబర్

మిత్ర మండలి పాతికేళ్ళ ప్రేమైక ప్రస్థానం

అక్షరాల్ని గౌరవించడం, సేవను అందించడం అనేవి మనుషుల్ని ప్రేమించడం తెలిసినవాళ్ళకి స్వతహాగా ఉండే లక్షణాలు. ఎంతటి ఆదర్శమైనా సరే, ఆచరణకు ఆర్థిక తోడ్పాటు అవసరం. ఎలాంటి ఆలోచన అయినా కానీ, అమలుకు చేయూత ముఖ్యం. అలా, ఈ సావనీర్ రూపొందించడానికి ' మేము సైతం ' అంటూ మా వంతు ముందుకు రావడం జరిగింది.

"ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేలు తల పెట్టవోయ్ " అంటాడు గురజాడ.కార్యాచరణలో పాల్గొంటూ, పాతికేళ్ళ పాటు సామాజిక స్పృహతో, సేవా భావనతో పయనించడం ఏ సంస్థకి అయినా కత్తి మీద సామే. అలాంటి ప్రస్థానాన్ని మరోసారి పునఃపరిశీలన చేసుకోవడం అంటే, చేసుకున్న ఆదర్శ ఒప్పందాలకి పునరంకితం కావడమే.

అలా, నిత్యం పిల్లలు, పెద్దలు, విద్యార్థులు, యువతరం, మహిళలు, మేధావులు, కళాకారులు, వివేచనా పరులందరితో మమేకమైసాగే, సహృదయ మిత్ర మండలి తన ప్రయాణాన్ని మరింత సారవంతంగా కొన సాగించాలని, మరెన్నో ప్రజాహిత మహత్కార్యాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

1)	శ్రీ ఊటుకూరు కేశవరావు, M.A, MED, MPhil, (PHD) ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్.	25,000/-
2)	డా॥ పి. వీర్రాజు, M.D., చెస్ట్ ఫిజిషియన్, వీర్రాజు నర్సింగ్ హెూం, పిఠాపురం.	15,000/-
3)	డా॥ పి.ఎన్. రాజు, M.B.B.S ,D.CH,మదర్ & చైల్డ్ హాస్పటల్, పిఠాపురం.	10,000/-
4)	శ్రీ బోనం పరమేష్, భాస్కర హేచరీస్	10,000/-
5)	శ్రీమతి పి.ఎన్. వసంత ప్రసాద్, M.A,MED, DPM, ఫౌండర్, ఆదర్శ స్కూల్, పిఠాపురం.	10,000/-
6)	డా॥ చంద్రశేఖర్, చోప్డే నర్సింగ్ హెూం, పిఠాపురం	7,500/-
7)	శ్రీ చక్కా సుబ్రహ్మణ్య శ్రేష్ఠి, గణేష్ మెడికల్, పిఠాపురం.	5,000/-
8)	శ్రీ బాదం మోహన్ బాబు, శ్రీ వాసవి మెడికల్స్, పిఠాపురం	5,000/-
9)	శ్రీ మొల్లి నాగ మరిడి రాజు, అడ్వకేట్	5,000/-
10)	డా॥ కె. వెంకటరెడ్డి, M.B.B.S.	5,000/-
11)	శ్రీ కొమ్మనాపల్లి అప్పారావు. M.A, MED,PGDTE(CIEFL). సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ (Rtd)	5,000/-
12)	డా॥ గజరావు సీతారామస్వామి (లేటు)	5,000/-
13)	శ్రీ K .కొండలరావు B. A, B. Ed, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ (Rtd)	5,000/-
14)	శ్రీ పోతుల శ్రీనివాస్ M.A,Bed, ఆంగ్ల ఉపాధ్యాయులు	5,000/-
15)	శ్రీ నామా ఏసుదాస్ M.A, Med. మండల విద్యాశాఖ అధికారి (M.EO) Rtd.	5,000/-
16)	డా॥ సురేష్ బాబు, M.S ortho,యం.యస్. మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, పిఠాపురం.	2,000/-
17)	డా॥ సిద్ధార్థ, M.D physician, షైన్ హాస్పటల్, పిఠాపురం.	2,000/-
18)	శ్రీ వి.పి.ఎస్.ఆర్.ఎం. ప్రభు M.A, M.Ed. ప్రధానోపాధ్యాయులు గెజిటెడ్ (Rtd)	2,000/-
19)	శ్రీ ఎ.ఆనంద్ M.A,M.Ed. శ్రీ హనుమంతరాయ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్.	2,000/-
20)	శ్రీ కడిమిచెట్టి సత్యనారాయణ రెడ్డి 10th class –వ్యాపారవేత్త	2,000/-

నువ్వు నిన్ను మార్చుకున్న ప్రతీసారి ప్రపంచం కొంత మారుతుంది.

21) శ్రీమతి యమ్. శారదాదేవి	2,000/-
22) శ్రీ పెండ్యాల సూరిబాబు, వ్యాపారవేత్త	2,000/-
23) శ్రీ కె. నాగేశ్వరరావు M.A,B.Ed. మమతా హైస్కూల్ ప్రిన్సిపాల్.	1,500/-
24) శ్రీ జక్కా తాతారావు B. SC,M.A,MEd, ప్రధానోపాధ్యాయులు Rtd.	1,000/-
25) శ్రీమతి పి. గంగా పావని .B, SC,DED,M.A, T.T. C drawing, M.D (Acu) టీచర్ శ్రీ ఆదర్శ హై స్కూల్.	1,000/-
26) శ్రీ ఎన్. గంగబాబు M.A, విద్యా వికాస్ కోచింగ్ సెంటర్.	1,000/-
27) శ్రీ కె.వి.వి.సత్యనారాయణ M.A,Med,అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ Rtd.	1,000/-
28) శ్రీ వై.కరుణ్ కుమార్, B.A. పోలీస్ కానిస్టేబుల్ .	1,000/-
29) శ్రీ యమ్.సుబ్రహ్మణ్యేశ్వర రావు B.A,B.Ed. ప్రధానోపాధ్యాయులు Rtd.	1,000/-
30) శ్రీ కె.వి.యస్.యస్.ప్రసాద్. B. SC,M.A,M. Ed,Dip. Psychology ఉపాధ్యాయులు Rtd.	1,000/-
31) శ్రీ పి.కామరాజు, B.Sc,B.Ed,. ఉపాధ్యాయులు.	1,000/-
32) శ్రీ జక్క చంద్రమూర్తి M.A,B.L,M.Ed సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ Rtd.	1,000/-
33) డాక్టర్ ఎన్ సూర్యనారాయణ B.A. మెడికల్ ప్రాక్టీషనర్	1,000/-
34) శ్రీ యమ్. రామలింగేశ్వర రావు B. Sc, B.Ed H.W. O Rtd.	1,000/-
35) శ్రీ వరద వీరభద్రరావు B.Sc,B.Ed,M.E.O. Rtd.	1,000/-
36) శ్రీ దువ్వాడ సాల్మన్ రాజ్ B.A. సబ్ రిజిస్టర్ Rtd	1,000/-
37) శ్రీ గట్టి శ్రీకృష్ణదేవరాయలు M.A. భారత్ పబ్లిక్ స్కూల్ కస్పాండెంట్.	1,000/-
38) శ్రీమతి ఉమా రాజ మంగతాయారు M.A,M.Sc,B.Ed., ఉపాధ్యాయురాలు స్కూల్ అసిస్టెంట్	1,000/-
39) శ్రీ బి.మాధవ్ వ్యాపారవేత్త	1,000/-
40) శ్రీ గండేపల్లి వెంకట సత్యనారాయణ, ఖాదీ బంగారు ఉద్యోగి	1,000/-
41) శ్రీ కుర్రా రామారావు, జె.వి.వి. ప్రధానోపాధ్యాయులు	1,000/-
42) శ్రీ గరగ ఈశ్వరరావు, జె.వి.వి. ఉపాధ్యాయులు	1,000/-
43) శ్రీ పి. జగదీష్, ఉపాధ్యాయులు	1,000/-
44) శ్రీ ఎన్.కన్నబాబు, ఉపాధ్యాయులు	516/-
45) శ్రీ లింగంపల్లి రవీంద్రబాబు B. Sc,M.A, M.Ed, MSc (psy)	500/-
46) శ్రీ ఈగల త్రిమూర్తులు, ఫైనాన్స్	500/-
47) శ్రీ టి.ఎన్.ప్రసాద్, కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్	500/-
48) శ్రీ మేకా మన్మధరావు గారు B.A HR డిపార్ట్‌మెంట్	500/-
49) శ్రీ యం. బాబూరావు, ప్రధానోపాధ్యాయులు	500/-
50) శ్రీమతి ఎన్. పద్మావతి, జె.వి.వి. ప్రధానోపాధ్యాయులు	500/-
51) శ్రీ సి.హెచ్. బాబూరావు, ప్రధానోపాధ్యాయులు	500/-
52) శ్రీ వి. భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు	500/-
53) శ్రీ పి. సత్తిబాబు	200/-

సహృదయ మిత్రమండలి సభ్యులు

1)శ్రీ ఊటుకూరి కేశవరావు	9951959509.
2) డాక్టర్ పి. సూర్య ప్రకాష్	9963743021.
3) శ్రీ కొమ్మనా పల్లి అప్పారావు	9493152556.
4) శ్రీ ఎన్ సూర్య నారాయణ	7801020258.
5) శ్రీ తోట శ్రీనివాస్	9849186676.
6) శ్రీ పోతుల శ్రీనివాస్	9849317010
7) శ్రీ సి.హెచ్ సతీష్	7989928289.
8) శ్రీమతి పి గంగా పావని	9652552556.
9) శ్రీ పి. వేణు	9291402977.
10) శ్రీ టి, సుబ్బారావు	9247224321.
11) శ్రీ కె.వి.వి.ఎస్.ప్రసాద్	9848180816.
12) శ్రీ దల్లి శ్రీనివాస్	9247396782.
13) శ్రీ ఎన్. గంగ బాబు	9948019068.
14) శ్రీ గట్టి శ్రీకృష్ణదేవరాయులు	9246049046.
15) శ్రీ నామ ఏసుదాసు	9515435710.
16) శ్రీ ఎం. సుబ్రహ్మణ్యం	9866188018.
17) శ్రీ పెంద్యాల సూరిబాబు	9246639578.
18) శ్రీ కొండేపూడి శంకర్రావు	9133023086.
19) శ్రీ పి. కామరాజు	8978493725.
20) శ్రీ వి. పి. ఎస్. ఆర్ . ఎం. ప్రభు	9394172601.
21) శ్రీ దువ్వాడ సాల్మన్ రాజ్	9347582057.
22) శ్రీ వరద వీరభద్రరావు	9494176805.
23) శ్రీ పి. జగదీష్	9491691240.
24) శ్రీ టీ. జగన్నాధరావు	9440061399
25) శ్రీ కె.వి.వి సత్యనారాయణ	9866133458.
26) శ్రీ కే. కొండలరావు	9440651250.

ధర్మం అనేది మనం చదవడంలో లేదు, పాటించడంలో ఉంది.

27) శ్రీ వై కరుణ్ కుమార్	**9951555447.**
28) శ్రీ ఈగల త్రిమూర్తులు	**9490479522.**
29) శ్రీ ఏ ఆనంద్	**9951571144.**
30) శ్రీ మేకా మన్మధరావు	**9347961489.**
31) శ్రీ జక్క చంద్రమూర్తి	**9866226617.**
32) శ్రీ జక్క తాతారావు	**7731921959.**
33) కుమారి రంగనాథం హేమ మణికంఠ గాయత్రి	**6304813910.**
34) శ్రీ తోట నాగేంద్ర ప్రసాద్	**9390836558.**
35) శ్రీ బోనం పరమేష్	**9133573777.**
36) శ్రీ వి. దేవిశ్రీప్రసాద్	**9848919179.**
37) శ్రీమతి చల్లగాలి అరుణ	**7095052584.**
38) శ్రీ సంజయ్	**9989848840.**
39) శ్రీ మురుపాక రామలింగేశ్వర రావు	**9848265551.**
40) శ్రీ లింగంపల్లి రవీంద్రబాబు	**9441238970.**
41) శ్రీ వెన్నపు చక్రధర్ రావు	**9491766399.**
42) శ్రీ గండేపల్లి సత్యనారాయణ	**9866218214.**
43) శ్రీమతి పి.ఎస్. వసంత ప్రసాద్	**9989101920.**
44) శ్రీమతి సరిదే పద్మావతి	**9948365347.**
45) శ్రీ ఎన్ గోవిందు	**8019142847.**
46) శ్రీ ఎ.గణేష్	**9948489899.**
47) శ్రీ పి. సత్తిబాబు	**9705078261.**
48) శ్రీ బి.మాధవ్	**9494377787.**
49) శ్రీమతి ఉమా రాజా మంగతాయారు	**9491983900.**
50) శ్రీ నాగేశ్వరావు గారు (మమతా స్కూల్)	**9441141288.**
51) శ్రీ వి ప్రకాష్ రావు	**9848536064.**
52) శ్రీ కె. వీరబాబు	**9494545337.**
53) శ్రీ ఎన్ వెంకటేశ్వరరావు	**9492951018.**

ఇరు మహోద్యమాల మహోజ్వల స్మృతికి,ఇది వంద సంవత్సరాల చారిత్రక సందర్భం.



ఉవ్వెత్తున ఎగిసిన యువజన పెను సంద్రం
ఉరకలెత్తిన ఉప్పెనల నవసైన్య రణ తంత్రం

నౌజవాన్ భారత్ సభ

(1926 - 2026)

హిందూ, ముస్లిం, సిక్ తదితర మతాల మధ్య సమైక్యత కోసం భగత్‌సింగ్ ప్రభృతులు కలసి స్థాపించిన సామ్రాజ్యవాద వ్యతిరేక లౌకిక ప్రజాతంత్ర యువజన సంఘం. సంపూర్ణ స్వరాజ్యం కోసం మొదటిసారి నినదించిందంటారు. పంజాబ్ కేంద్రంగా ఏర్పడిన ఈ సంస్థ, తొలిగా ఆధునిక సామ్యవాద దృక్పథంతో కొనసాగించిన కార్యకలాపాలు ఇప్పటికీ ఆశ్చర్యపరుస్తాయి. తర్వాత కాలంలో , హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ని బలోపేతం చేసిన ఈ సంఘాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. అయినప్పటికీ, స్వాతంత్ర్యానికి పూర్వం, తొలి సామ్యవాద సంఘంగా భావించే నౌజవాన్ భారత్ సభ భారతీయ యువతకు దిశానిర్దేశం చేసేందుకు చేసిన కృషిని స్మరించుకోవడం, వందేళ్ళు పూర్తి చేసుకున్న ఆ మహనీయుల ఆదర్శాలకు మళ్ళీ పునరంకితం కావడమే. **ఇంక్విలాబ్ జిందాబాద్ !**



మానవీయ స్వాభిమానానికి మరొక రూపం
మహత్తర హక్కుల పోరాట ప్రవాహ సారం.

మహద్ సత్యాగ్రహం

(1927 - 2027)

'ప్రతీ మనిషికి ఒకే విలువ' అనే సూత్రం సమానతకి గీటురాయి. మహద్ సత్యాగ్రహం కేవలం నీటి కోసం జరిగిన సంఘటన కాదు. శతాబ్దాల నాటి వివక్షత, దోపిడి, ఆధిపత్యం, మూఢత్వం, నిరంకుశత్వాల పై పెల్లుబికిన తిరుగుబాటు. బాబాసాహెబ్ అంబేద్కర్ కులతత్వం మీద నిర్మాణాత్మకంగా చేసిన యుద్ధం. మహారాష్ట్రలో జరిగిన ఈ ఉద్యమం హక్కుల సాధన చరిత్రలో ఒక విశిష్ట అధ్యాయం. తర్వాత కాలంలో, మనుస్మృతి దహనం చేసి వందల ఏళ్ల కులాహంకారానికి బహిరంగ సవాలు విసిరిన ఈ ఉద్యమం, దళిత బహుజన ప్రత్యామ్నాయ సాంస్కృతిక రాజకీయ స్రవంతికి గొప్ప మైలురాయి. ఆధునిక భారతీయ చరిత్రలో విస్మరించడానికి వీలులేని తొలి ఆత్మగౌరవ పోరాటాల్లో ఒకటి. అణగారిన ప్రజల భావజాల క్రియాశీలతకు మచ్చుతునక. ఆ వందేళ్ళ క్రితాన్ని స్మరించుకోవడం, పీడిత జన యోధుల కలల్ని , కర్తవ్యాల్ని మళ్ళీ పునర్నిర్మించుకోవడమే. **జైభీమ్ !**

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
ఓం శాంతి: శాంతి: శాంతి:

'పుట్టిన ప్రతీది నశిస్తుంది – అది ప్రకృతి ధర్మం'.

బుద్ధం శరణం గచ్ఛామి !

ధమ్మం శరణం గచ్ఛామి !!

సంఘం శరణం గచ్ఛామి !!!

సహృదయ మిత్రమండలి ఈ పాతికేళ్ళలో...

- మహనీయుల జయంతి వర్ధంతుల్ని నిర్వహిస్తూ విద్యార్థులకు గొప్పవారి జీవితాల్ని పరిచయం చేస్తోంది.
- ముఖ్యంగా స్వామి వివేకానంద, గురజాడ అప్పారావు, భగత్‌సింగ్ వంటి వారి ఆదర్శాల్ని పిల్లల్లో చర్చకు పెడుతోంది.
- విద్యావంతులతోనూ, ఆలోచనాపరులతోను విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల ప్రసంగాలు ఏర్పాటు చేస్తోంది.
- రాజ్యాంగ బద్ధమైన హక్కులు, విధులు, విలువల వెలుగులో పని చేస్తోంది.
- పర్యావరణ పరిరక్షణ అవగాహన పెంచడానికి తన వంతు పాటు పడుతోంది.
- స్వచ్ఛ భారత్ దిశగా పరిమితుల్లోనే అయినా సభ్యులతో చెత్తను శుభ్రం చేస్తోంది.
- ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించడానికి చేతిగుడ్డ సంచుల్ని అందిస్తోంది.
- ఆర్మీ సెలెక్షన్స్ సమయంలో వొచ్చిన దూరప్రాంత అభ్యర్థులకు ఆహారం అందిస్తోంది.
- వేసవి సెలవులలో విద్యార్థులకు పలు సబ్జెక్ట్‌ల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తోంది.
- సాహిత్యం, సామాజిక బాధ్యత, సాంస్కృతిక వికాసం పిల్లలకు బోధిస్తోంది.
- సామాజిక హితం కోసం అనేక అంశాలతో కరపత్రాలు, పుస్తకాలు ప్రచురిస్తోంది.
- పుస్తక పఠనం పిల్లల్లో, సభ్యుల్లో పెంపొందించడానికి ప్రయత్నం చేస్తోంది.
- విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కొరకు ప్రత్యేకంగా క్లాసులు చెప్పిస్తోంది.
- శారీరక మానసిక ఆరోగ్యం కోసం పండుగలు పర్వదినాల్లో పిల్లలకు ఆటల పోటీలు ఏర్పాటుచేస్తోంది.
- ప్రతీ నెలా ఒక్కొక్కసభ్యుల ఇంట్లో సమావేశం నిర్వహణ ద్వారా కుటుంబ సభ్యులని కూడా భాగం చేసుకుంటోంది.
- ప్రతీ ఏడాది సామాజిక వన భోజనాలు ఆహ్లాదకరంగా నిర్వహిస్తోంది.
- వ్యసన వ్యతిరేక ఉద్యమంలో భాగమై ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది.
- మద్యం మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం అనేక సృజనాత్మక ప్రదర్శనలు నిర్వహిస్తోంది.
- మహిళా సాధికారత కోసం తనవంతుగా పలు కార్యక్రమాలు చేపడుతోంది.
- ఐ క్యాంప్స్, హెల్త్ క్యాంప్స్ నిర్వహిస్తూ ఎందరో బీదవారికి చేయూతనిస్తోంది.
- కోవిడ్ సమయంలో పేదలకు నిత్యావసర వస్తువులు సరుకులు పంపిణీ చేసింది.
- సైన్సు, సామాజికోద్యమానికి తనవంతు సహకారం అందిస్తోంది.
- సీనియర్ సిటిజన్స్ విలువైన అనుభవాల్ని,ఆలోచనల్ని భవిష్యత్ తరాల ఉన్నతికోసం ఉపయోగిస్తోంది.
- ఆయా ప్రముఖ దినోత్సవాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందిస్తోంది.
- ఇతరేతర సోదర సంఘాలతో మమేకమై అన్నిరకాల సేవా కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తోంది.

దేశభక్తి

దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

దేశాభిమానము నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పకోకోయ్
పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయ్

చెట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్

పాడి పంటలు పొంగి పొరలే
దారిలో నువు పాటుపడవోయ్
తిండి కలిగితె కండ గలదోయ్
కండ కలవాడేను మనిషోయ్

ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నింపవోయ్

సొంత లాభం కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్

– గురజాడ అప్పారావు

"సొంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడు పడవోయ్"